భారత స్వాతంత్ర్యోద్యమం

# ఆంధ్రప్రదేశ్ ముస్లింలు


సయ్యద్ నశీర్ అహమ్మద్

M.Com; M.A (History); LL.B; D.J; D.LL; D.P.M

Sahithya Rathna (Hindi)



ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్

వినుకొండ - 522647

9440241727, 9396429722

# భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు

Indian National Movement : Andhrapradesh Muslims


**సయ్యద్ నశీర్ అహమ్మద్**

Syed Naseer Ahamed



All Rights Reserved with Writer



ప్రచురణ సంఖ్య : 10

ముద్రణ : 2011

ముఖపత్రాలంకరణ : షేక్ అబ్దుల్లా (విజయవాడ), నల్లబోతుల జయరాజ్ (వినుకొండ)

ముద్రణ : స్నేహ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

**పుస్తకాలకు :**

**ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్**

శివప్రసాద్ వీధి, కొత్తపేట,

**వినుకొండ - 522 647,**

గుంటూరు జిల్లా.

దూరవాణి: 9440241727, 9396429722

Email: aazadhuseofpublications@gmail.com

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ :**

**తెలుగు బుక్ హౌస్,**

3-3-862, కాచిగూడా ఎక్స్ రోడ్స్

**హైదరాబాద్-500 027.**

దూరవాణి: 040-65347374, సంచారవాణి: 9247446497

మరియు

అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు.

**వెల : రు. 250-00**

చరిత్రను మనం మర్చిపోతే
మనల్ని చరిత్ర మర్చిపోతుందన్న
విజ్ఞుల హెచ్చరికల్లోని ఆంతర్యాన్ని గ్రహించి
ఈ గ్రంథం ప్రచురణకు సహకరించిన సహృదయులు

**జనాబ్ సర్వర్ అలీ ఖాన్**

S/o జనాబ్ ముహమ్మద్ ఖాదర్ ఖాన్

**(అధినేత : రేమాండ్స్ షోరూమ్, నల్గొండ ఎక్స్ రోడ్స్, హైదరాబాద్),**

**జనాబ్ షేక్ బాషా మొహిద్దీన్**

S/o జనాబ్ షేక్ ఫరీద్ సాహెబ్

**(వెంకటరంగాపురం, కొండాపురం మండలం, నెల్లూరు జిల్లా),**

**డాక్టర్ యండి. రఫి** MBBS; MD (Bio-Chemistry)

S/o జనాబ్ ముహమ్మద్ అబ్బాస్ అలీ

**(హన్మకొండ, వరంగల్ జిల్లా),**

**డాక్టర్ కె.యల్. కుట్టి** MBBS; MD (Radiology)

D/o జనాబ్ షేక్ లతీఫ్ కుట్టి

**(సంచాలకులు : కుట్టి విద్యా సంస్థలు, నెల్లూరు) లకు**

నా హృదయపూర్వక

# ధన్యవాదాలు

**- సయ్యద్ నశీర్ అహమ్మద్.**




## ఆచార్య అడపా సత్యనారాయణ

M.A.(Osm), M.Phil.(JNU), Ph.D.(Heidelberg)

చరిత్ర విభాగం, ఆర్ట్స్ కళాశాల

ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.


# పరిచయ వాక్యం

ఈ మధ్య కాలంలో భారతదేశ చరిత్ర రచనలో నూతన దృక్పథాలు, పరిశోధనా విధానాలు, పద్ధతులు క్రమంగా చోటుచేసుకుంటున్నాయి. అదే విధంగా యింతవరకు చరిత్రరచన, పరిశోధనల్లో మరుగునపడిన అంశాల్ని వెలికితీసే ప్రయత్నం కూడా జరుగుతుంది. దానికి ముఖ్యకారణం: సమకాలీన సమాజంలో విశాల ప్రాతిపదిక పై బహుజన, బడుగు మైనార్టీ వర్గాల చైతన్య స్థాయి పెరగడం; అస్తిత్వ వుద్యమాలు విస్తరించడం; భారత సమాజ నిర్మాణంలో, వలసపాలన, భూస్వామ్య వ్యతిరేక, జాతీయ వుద్యమాల్లో వివిధ వర్గాలు నిర్వహించిన పాత్రను నిశితంగా పరిశీలించే చారిత్రక ప్రక్రియ మొదలైంది.

అదే క్రమంలో బహుజనులు, మైనార్టీలు తమ చైతన్యస్థాయిని, సంఘటిత శక్తిని పెంపోందించుకునే తరుణంలో తమ గతాన్ని, ప్రత్యేకతను, సంస్కృతిని చాటి చెప్పుకునే బలమైన ప్రయత్నం కూడా జరుగుతుంది. అందుకు ప్రత్యామ్నాయ చరిత్ర, సామాజిక, రాజకీయ పరిశోధన ఒక ముఖ్యమైన సాధనంగా వుపయోగపడుతుంది. పాలక పక్షాలు జరుపుకునే సంబరాలు, స్వర్ణోత్సవాలు వగైరాలలో అణిచివేత, పీడనకు గురైన పై వర్గాల చారిత్రక పాత్రను, విశిష్టతను విస్మరించడం జరిగింది. భారతదేశ విముక్తి పోరాటాల్లో జాతి నిర్మాణంలో, సామాజిక మార్పులో వారి పాత్రను, సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో ఈ వర్గాల పోరాటయోధుల్ని, త్యాగాల్ని గురించిన వివరాల్ని సాంప్రదాయ, అగ్రవర్గాల చరిత్రకారులు తమ రచనల్లో ప్రముఖంగా పొందుపర్చలేదు.

అదేవిధంగా సంకుచిత జాతీయవాద, కమ్యూనల్, హిందూత్వ శక్తులు భారతదేశ చరిత్రను, సంస్కృతిని తమ సిద్ధాంతాల్ని, భావజాలాన్నీ వ్యాప్తిచేయడానికి అనుగుణంగా మార్చుకుంటున్నాయి. చరిత్ర రచనా విధానంలో గత కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న చర్చ, ముఖ్యంగా మతవాద పార్టీలు, సంస్థలు చరిత్రను ఏ విధంగా కాషాయికరిస్తు

వక్రీకరిస్తున్నాయో వివరిస్తూ దాని పర్యవసానాల్ని స్పష్టం చేశాయి. మండల్–మందిర్ వుద్యమాల పర్యవసానంగా అగ్రకుల, వర్గాల మేధావులు మతవాద శక్తులతో మిలాఖత్ అయి బహుజన, మైనార్టీల చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అనేక అంశాల్ని పాక్షికంగా, అవాస్తవంగా చిత్రీకరిస్తున్నారు. దానికి జవాబుగా గత రెండు శతాబ్దాలుగా అట్టడుగు, మైనార్టీవర్గాల్లో చెలరేగిన సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ వుద్యమాలు, వాటిలో ఆయా వర్గాల పాత్రను బయటకు తీసి తమ అస్తిత్వాన్ని, గుర్తింపును చాటి చెప్పడానికి బహుజన, మైనార్టీ మేధావులు ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలోనే తమ పూర్వీకుల వారసత్వాన్ని, సాంఘిక, రాజకీయ రంగాల్లో తమ పాత్రను వివరించడానికి చరిత్రను తిరిగి రాయాల్సిన అవసరాన్ని గుర్తించారు. దాని పర్యవసానంగా ప్రస్తుతం సబ్‌ఆల్ట్రన్ చరిత్ర రచనా విధానం ఒక ప్రత్యేకతను, విశిష్టతను సంతరించుకుంది.

ఈ క్రమంలో సయ్యద్ నశీర్ అహమ్మద్ గారి 'భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు' 19, 20 శతాబ్దాల వలసవాద, సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో ముస్లింల పాత్రను కూలంకషంగా పరిశీలించి, వివరణాత్మకంగా విశ్లేషించింది. ఈ పుస్తకం మొట్ట మొదటిసారిగా మైనార్టీవర్గాల చరిత్రకు సంబంధించిన అనేక నూతన అంశాల్ని వెలుగులోకి తెచ్చింది. అందుకే ఈ గ్రంథం ఆధునిక ఆంధ్రదేశ చరిత్ర రచనా విధానంలో విశిష్టమైందని నిస్సంకోచంగా చెప్పవచ్చు. ఎందుకంటే ఆంధ్రదేశ చరిత్రలో యిప్పటివరకు మరుగునపడిన ఆనేక అంశాల్ని, నూతన ఆధారాలతో గ్రంథకర్త వెల్లడించారు. నిజం చెప్పాలంటే, భారతదేశ చరిత్ర రచనలో సంచలనం/భూకంపం సృష్టించిన Subaltern Histography లేవనెత్తిన అనేక అంశాలు ఈ గ్రంథంలో చోటు చేసుకున్నాయి. సంప్రదాయ చరిత్రకారులు వున్నత వర్గాలు, మహాపురుషుల జీవిత చరిత్రను, ఘనకార్యాల్ని, వివిధ వుద్యమాల్లో వారి పాత్రను పొగిడి, సామాన్య ప్రజానీకం పాత్రను విస్మరించారు. అందువల్లే History is not just the Biography of Greatmen అని, ప్రజల చరిత్ర History from below/ peoples History రాయాల్సిన ఆవశ్యకతను సబాల్ట్రన్ చరిత్రకారులు చెప్పారు. సయ్యద్ నశీర్ అహమ్మద్ గారి రచనా విధానం, రచనా పద్ధతి, ఆలోచన దానికి అనుగుణంగా వుందని చెప్పవచ్చును.

ఈ గ్రంథంలో 18–20 శతాబ్దాల్లో బ్రిటీష్ బానిస బంధనాల నుండి విముక్తి సాగిన పోరాటాల్లో పాల్గొన్న ముస్లిం యోధులు, వారి త్యాగనిరతి గురించి విపులంగా చర్చించడం జరిగింది. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర ముఖ్య ఘట్టాలను వివరిస్తూ 1780 దశకంలో తెలుగు గడ్డలో జరిగిన తొలినాటి సైనిక తిరుగుబాటుకు నాయకత్వం వహించిన

సుబేదార్ షేక్ అహమ్మద్ పాత్రను, జాతీయోద్యమంలో ఉద్యమించిన ప్రజానీకం, ఆజాద్ హింద్ ఫౌజ్‌లో పాల్గొన్న షేక్ ఖాదర్ మొహిద్దీన్ లాంటి వారి వివరాలు, నిజాం వ్యతిరేక సాయుధ పోరాటానికి నాంది పలికిన షేక్ బందగీ త్యాగాన్ని ఈ పుస్తకంలో వివరించారు. అసలు చరిత్ర గురించి ఈతరం యువకుల్లో సరైన అవగాహన లేని తరుణంలో నశీర్ అహమ్మద్‌గారి పుస్తకంలో పేర్కొన్న విశేషాంశాలు వారికి కనువిప్పు కల్గిస్తాయని నా నమ్మకం.

భారతదేశ విముక్తి పోరాటంలో, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఏ విధంగా జాతి, మత, ప్రాంత, కుల, వర్గ బేధాలను విస్మరించి సమష్టిగా పోరాడినారో, స్వరాజ్య సాధన అంతిమ లక్ష్యంగా ప్రజలు ఐక్యతను ఏ విధంగా పాటించారో సోదాహరణంగా వివరించడం జరిగింది. ఈ విషయాన్ని గ్రంథకర్త మాటల్లో చెప్పాలంటే 'భిన్నత్వంలో ఏకత్వం-ఏకత్వంలో భిన్నత్వం' అంతర్గత మార్గదర్శక సూత్రంగా సాగుతున్న భారతీయ సాంఘిక జన సముదాయాలలో ఒకటైన ముస్లిం జనసముదాయం సోదర జనసముదాయాలతో కలసి మెలసి ఈ పోరులో క్రియాశీలకంగా పాల్గొంది. అది శాంతి పథమైనా, విప్లవ మార్గమైనా ఆత్మార్పణలకు ఏనాడు వెనుకడుగు వేయలేదు'.

స్థూలంగా చెప్పాలంటే, బ్రిటీష్ సామ్రాజ్యవాదుల విభజించి-పాలించు కుటిల నీతిని ధిక్కరించి సామాన్య ముస్లిం ప్రజానీకం మెజారిటీ సముదాయాల వారితో ఐక్యమై స్వాతంత్ర్య సమరంలో మహోజ్వల పాత్రను నిర్వహించిన తీరును ఈ పుస్తకంలో క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ఇంతవరకు ప్రముఖ ఆంధ్రదేశ చరిత్రకారులు ఆచార్యులు మామిడిపూడి వెంకట రంగయ్య, సరోజిని రేగాని, బయినపల్లి కేశవ నారాయణ లాంటి వారు తమ రచనల్లో తెల్పనటువంటి అనేక విషయాల్ని, సంఘటల్ని, పోరాయోధుల్ని సమాచారాన్నీ సేకరించి నశీర్ గారు ఈ గ్రంథం ద్వారా పాఠకులకు అందించారు.

ఆధునిక ఆంధ్రదేశ చరిత్రలో యిప్పటి వరకు తెలియని కొన్ని చారిత్రక ఘట్టాల్ని ఈ గ్రంథకర్త సోధించి సాధించి అక్షరరూపం కల్పించారు. ఉదాహరణకు భారత దేశంలో 1857 సిపాయీల తిరుగుబాటు అంటే మంగళ పాండే గురించి మాత్రమే చెప్పడం జరిగింది. కానీ దానికంటే 70 ఏళ్ళకు పూర్వమే 1780లో తెలుగు బిడ్డలు సుబేదార్ షేక్ అహ్మద్ నాయకత్వంలో స్వదేశీ సిపాయిలు తిరుగుబాటు చేసిన వైనం గురించి చరిత్ర పాఠ్యపుస్తకాలలో లేదు. అదేవిధంగా స్వాతంత్ర్య సమరంలో ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ పాత్రను కొనియాడుతూ ఆయనను 'సరిహద్దు గాంధీ' గా వర్ణించడం జరిగింది. కాని ఆంధ్రప్రదేశ్‌లో 'విశాఖ గాంధీ' గా పేర్గాంచిన విశాఖపట్నం యోధుడు ఫరీద్దుల్ జమాను పరిచయం చేసిన ఘనత నశీర్ గారిదే.

1920 దశకంలో గాంధీజీ పిలుపు మేరకు ప్రభుత్వ పదవిని త్యజించిన తొలి ఆంధ్రుడు మహమ్మద్ గులాం మొహిద్దీన్, చీరాల పేరాల ప్రజలకు బాసటగా నిలచిన మహమ్మద్ గౌస్ బేగ్, మన్యం పోరులో అల్లూరికి అండదండలందిచిన ఫజులుల్లా ఖాన్, ఖద్దర్ ఇస్మాయిల్‌గా పేర్గాంచిన మహమ్మద్ ఇస్మాయిల్, పరిటాల రిపబ్లిక్ పతాక వీరుడు షేక్ మౌలా సాహెబ్, మాతృదేశ సేవకు సర్వం సమర్పించిన గౌస్ దంపతులు, 'జైహింద్-నేతాజీ' నినాదాల సృష్టికర్త అబిద్ హసన్ సఫ్రాని, జనహిత కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించిన సయ్యద్ అబ్దుల్ అజీం లాంటి యోధుల్ని ఆంధ్ర ప్రజానీకానికి పరిచయం చేసినందుకు నశీర్ అహమ్మద్ గారి కృషిని కొనియాడక తప్పదు. ఈయన రచించిన ఈ గ్రంథలో మరోక ప్రత్యేకత ఏమిటంటే అంధ్రదేశ స్వాతంత్ర్యోద్యమంలో పురుషులకు సాటిగా అనేక మంది ముస్లిం మహిళలు కూడా క్రియాశీలక పాత్ర వహించారని సోదాహరణంగా వివరిచడం. సంప్రదాయ చరిత్రకారులు కేవలం దుర్గాబాయి దేశ్‌ముఖ్ లాంటి కొంతమంది అగ్రవర్ణ స్త్రీలను గురించి మాత్రమే ప్రస్తావించారు. అందుకు భిన్నంగా ఈ పుస్తకంలో బేగం ఖుర్షీద్ ఖ్వాజా, బేగం మజీదా బానో, మాసుమా బేగం, ఫక్రుల్ హాజియా హసన్, నఫీస్ అయేషా బేగం, మహమ్మద్ గౌస్ ఖాతూన్, హజరా ఇస్మాయిల్, జమాలున్నీసా బాజి, రబియాబీ, రజియా బేగం, జైనాబ్ బీ లాంటి ఎందరో మహిళల వివరాలూ ఉన్నాయి.

సయ్యద్ నశీర్ అహమ్మద్ గారు వృత్తిరీత్యా చరిత్రకారుడు కాకపోయినా, ప్రవృత్తిరీత్యా గొప్ప చరిత్ర ప్రేమికుడు, మంచి చరిత్ర పరిశోధకుడు. ఆయన రచించిన అనేక వ్యాసాల్ని, పలు గ్రంథాల్ని చదివే అవకాశం నాకు కల్గింది. వాస్తవానికి సమాజంలో చారిత్రక అవగాహనకు, చైతన్యాన్నీ, స్ఫూర్తిని వ్యాప్తిచేయడంలో నశీర్ అహమ్మద్ లాంటి పరిశోధకుని పాత్ర ఎంతైనా శ్లాఘనీయం. చరిత్ర పరిశోధన, రచనలో ఆయన అనుసరించిన పద్దతి హేతుబద్దంగా, శాస్త్రీంగా ఉంటుదని చెప్పడానికి 'భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు' గొప్ప నిదర్శనం.

మొదటిసారిగా ఆంధ్రదేశ చరిత్ర, సంస్కృతి, స్వాతంత్ర్యోద్యమంలో, సామాజిక నిర్మాణంలో ముస్లిం సామాజిక వర్గాల భాగస్వామ్యాన్ని సమగ్రంగా, ఆధారాల సహితంగా వివరించిన గ్రంథకర్త ప్రయత్నాన్ని ప్రతి ఒక్కరూ ఆహ్వానించక తప్పదు. బ్రిటీష్ వ్యతిరేక, స్వాతంత్ర్య పోరాటాల్లో పాల్గొన్న అనేక మంది ముస్లిం స్వాతంత్ర్య సమర యోధుల్ని, నాయకుల్ని, మేధావుల్ని పరిచయం చేసి ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర రచన, పరిశోధనలో చక్కని మార్గదర్శకత్వాన్ని వహించిన సయ్యద్ నశీర్ అహమ్మద్ గారు నిజంగా అభినందనీయులు. ◆




సయ్యద్ నశీర్ అహమ్మద్

శివప్రసాద్ వీధి, కొత్తపేట

వినుకొండ - 522647

గుంటూరు జిల్లా.


# రచయిత మాట

ఈ గ్రంథాన్ని తొలిసారిగా 2001 ఆగస్టులో రాశాను. నాలుగు మాసాల వ్యవధిలో అనగా 2001 డిసెంబరులో యథావిధిగా పునర్ముద్రణయ్యింది. ఆ తరువాత ప్రస్తుతం మూడవసారి ముద్రణయ్యింది.

మూడవసారి మాత్రం ఈ గ్రంథాన్ని పూర్తి స్థాయిలో తిరగ రాశాను. ఆ కారణంగా గతంలో రెండు సార్లు ప్రచురితం అయినప్పుడు 80 పేజిలతో వచ్చిన గ్రంథం కాస్తా ప్రస్తుతం 394 పేజీలకు చేరుకుంది. ఈ గ్రంథాన్ని మరింతగా విస్తరింపచేయాలన్న సంకల్పంతో దశాబ్ద కాలంగా రాష్ట్రమంతా తిరిగి నేను సేకరించిన అదనపు సమాచారాన్ని, ఆ క్రమంలో లభించిన చిత్రాలు, ఫోటోలు ప్రస్తుత గ్రంథానికి జత చేశాను. నాకు ఎరుకలోకి వచ్చిన ఏ ఒక్క స్వాతంత్ర్య సమరయోధుడి వివరాలను వదిలిపెట్టకుండా, శత విధాల సమాచారం రాబట్టడానికి ప్రయత్నించి, ఆ విధంగా రాబట్టిన సమాచారాన్ని ఈ గ్రంథం ద్వారా తెలుగు పాఠకులకు పరిచయం చేయడానికి ప్రయత్నించాను.

ఈ పుస్తక రచన కార్యభారాన్ని స్వీకరించాక అదనపు సమాచారం కోసం పలు మార్లు రాష్ట్రంలోని పర్యటించాను. రాష్ట్రంలో చరిత్ర ప్రాధాన్యతగల పలు ప్రాంతాలకు వ్యయ ప్రయాసలకోర్చి వెళ్ళివచ్చాను. ఈ సందర్భంగా చాలా స్వాతంత్ర్య సమరయోధుల్ని, వారి కుటుంబ సభ్యుల్ని కలిశాను. ఆయా సమరయోధుల మిత్రులను, సన్నిహితులను సంప్రదించాను. ప్రాంతీయ, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి స్వాతంత్ర్య సమరయోధుల సంక్షేమ సంఘాలను, సంస్థలను, ఆ సంస్థలు నిర్వహిస్తున్న గ్రంథాలయాలలో పుస్తకాలను చూశాను.

ఈసారి నా సమాచార సేకరణలో చాలా కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. గతంలోని నా పుస్తకాలల్లోని ఒకటీ రెండు అంశాలు విషయపరంగా సరిగ్గానే ఉన్నా సంవత్సరాల అంకెల పరంగా, సంఘటన ప్రాధాన్యతల పరంగా కొన్ని మార్పులు-చేర్పులు చేయాల్సి వచ్చింది. ఈ విషయాల మీద మరోసారి నిర్ధారణ కోసం ప్రముఖ చరిత్రకారులను, వివిధ విశ్వవిద్యాలయాలలో చరిత్రను బోధిస్తున్న అధ్యాపకులను, ఆచార్యులను,

పరిశోధకులను కలిశాను. ఆయా విషయాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాను. ఆ విధంగా సమకూర్చుకున్న సరికొత్త సమాచారాన్ని ఈ గ్రంథంలో పొందుపర్చాను.

1780లో ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన విశాఖపట్నం సైనిక స్థావరంలో సుబేదార్ షేక్ అహమ్మద్ చేసిన తిరుగుబాటు ప్రస్తుత పుస్తకంలో మార్పులు-చేర్పులకు లోనయ్యింది. గతంలో లభించిన సమాచారం, కొందరు చరిత్రోపన్యాసకుల, పరిశోధకుల ధృవీకరణల ఆధారంగా సుబేదార్ అహమ్మద్ నేతృత్వంలో 1857లో విశాఖపట్నంలో తిరుగుబాటు జరిగినట్టు రాశాను. కానీ ఆ తిరుగుబాటు 1780 సెప్టెంబర్‌లో జరిగిందని తెలిసింది. ఆ విధంగా నూతనంగా లభించిన సమాచారాన్ని పలు విశ్వవిద్యాలయాల చరిత్రోపన్యాసకులతో, చరిత్రకారులతో సంప్రదించి ధృవీకరణకు అవసరమగు గ్రంథాలను, పత్రాలను పరిశీలించి విశాఖపట్నంలో సుబేదార్ షేక్ అహమ్మద్ చేసిన తిరుగుబాటు 1780లో జరిగిందన్న విషయాన్ని ప్రస్తుత పుస్తకంలో పేర్కొన్నాను.

ప్రస్తుత గ్రంథాన్ని నాలుగు భాగాలుగా అందిస్తున్నాను. ఈ పుస్తకంలోని మొదటి భాగంలో ఈస్ట్ ఇండియా కంపెనీ మీద తిరుగుబాటు ఆరంభమైన తొలి దశనుండి చివరకు బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన జాతీయోద్యమం విజయవంతమయ్యి, స్వాతంత్ర్యం సాధించిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడేంత వరకు సమాచారాన్ని సంక్షిప్తంగా పొందుపర్చాను. ఈ కథనానికి భారత స్వాతంత్ర్యోద్యమం కాలం నాటి ప్రధాన సంఘటనలను పాఠకుల స్మృతిలోకి తెచ్చేందుకు స్వాతంత్ర్యోద్యమం సాగిన తీరు తెన్నులను వివరిస్తూ, ఆయా ప్రధాన సంఘటనల రూపాలను పాఠకుల ఎదుట సాక్షాత్కరింపచేసేందుకు జాతీయ, ప్రాంతీయ స్థాయిలో స్ఫూర్తిదాయకంగా నిలచిన అలనాటి సంఘటనల పలు చిత్రాలను, ఫోటోలను జోడించాను.

బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్న స్వాతంత్ర్యసమర యోధుల జీవిత రేఖా చిత్రాలను **అనుబంధం-1** గా ప్రత్యేకించి రెండవ భాగంలో ఇచ్చాను. ఈ భాగంలో మొత్తం 50 మంది యోధుల జీవిత చరిత్రలను పొందుపర్చాను. ఈ జీవన రేఖాచిత్రాలలో, ఆంధ్రప్రదేశ్‌లో జన్మించి ఇక్కడే గడిపిన వారి గురించి మాత్రమే కాకుండా, తెలుగుగడ్డ మీద కళ్ళుతెరచి, బాల్యం ఇక్కడే గడిపి, ఆ తరువాత ఇతర ప్రాంతాలకు వెళ్ళి స్థిరపడిన స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలను కూడా కలిపాను.

ఈ విభాగంలో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడం మాత్రమే కాకుండా ఆ తరువాత సాగిన ప్రజాపోరాటాలలో ప్రముఖ పాత్ర నిర్వహించిన వారున్నారు. అందులో రజియా బేగం, జమాలున్నీసా బాజీ లాంటి వారు ఆనాటి వారి కార్యక్రమాల వివరాలను స్వయంగా వెల్లడించినందున అ వివరాలు గ్రంథస్థమయ్యాయి. ఆ పోరాటాలలో ఇతరులెవ్వరికీ

ఏమాత్రం తీసిపోకుండా ముస్లిం కుటుంబాలు, ముస్లిం మహిళలు కూడా నిర్వహించిన పోరాట కార్యక్రమాలు, ఆ పోరుబాట సాగిన రాజకీయ పక్షాలకు ఆ మహిళామ తల్లులు ఎంతగా సహకరించారన్నది ఈ కథనాల ద్వారా బహిర్గతమౌతుంది. ఆ విశేషాంశాలన్నీ పాఠకులకు అందివ్వాలని ఆ విశేషాలను ఇందులో విస్తారంగా పొందుపర్చాను.

ఆ తరువాత స్వాతంత్ర్యసమర స్ఫూర్తితో సాగిన ప్రజాపోరాటాలలో పాల్గొని చరిత్ర సృష్టించిన ప్రజా పోరాటయోధుల జీవిత రేఖాచిత్రాలను మూడవ భాగంలో ఇచ్చాను. ఈ భాగంలో ఉన్న యోధులు అటు స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారు. ఆ తరువాత జరిగిన ప్రజా పోరాటాలలో అంతకంటె ప్రధాన పాత్ర వహించినందున వారి వివరాలను ప్రత్యేకంగా **అనుబంధం-2** శీర్షిక క్రింద వర్గీకరించి ప్రత్యేకంగా సమర్పించాను.

ఈ గ్రంథంలో స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలలో ఆయా యోధుల జీవిత విశేషాలను చాలా వరకు సమగ్రంగా సమకూర్చేందుకు ప్రయత్నం చేశాను. కొంత మందికి సంబంధించిన వివరాల కోసం ఎంతగా ప్రయత్నించినా నాకున్న పరిమితుల వలన పూర్తిగా సమకూర్చుకోలేకపోయాను. ఆ కారణంగా అవసరమైన సమాచారం లభించని ఆ యోధుల వివరాలను కూడా పుస్తకంలో పొందుపర్చాలన్న ఉద్దేశ్యంతో, పలు గ్రంథాల నుండి, స్వాతంత్ర్యోద్యమ చరిత్రతో పరిచయం ఉన్న పలువురి నుండి సేకరించిన సమాచారాన్ని నాల్గవ భాగంలో జిల్లాల వారిగా సంక్షిప్తంగా సమకూర్చాను. ఈ సమాచారాన్ని, **అనుబంధం -3** శీర్షిక క్రింద పేర్కొన్నాను. అనుబంధం 1, 2 లలో వచ్చిన స్వాతంత్ర్య సమరయోధుల ప్రస్తావన అనుబంధం -3లో చాలా క్లుప్తంగా పునరావృతం అయినప్పటికి, ఆ విశేషాలు ఇతర అనుబంధాలలో వివరంగా ఉన్నాయన్న విషయాన్ని పాఠకుల సౌలభ్యం కోసం ప్రత్యేకంగా సూచించాను.

ఈ గ్రంథంలోని అతి ముఖ్యమైన సమాచారాన్ని ఇతర గ్రంథాల నుండి గ్రహించి, ఆ సమాచారాన్ని ఉటంకిస్తునప్పుడు సామాన్య పాఠకులకు చిరాకు కలిగించకుండేందుకు నాదైన **బుక్ స్టైయిల్** ను అనుసరించాను. ఆ వాక్యాలను **'కోట్-అన్‌కోట్'** చేయడం కాకుండా వాటిని **బోల్డు** చేశాను. ఈ విధంగా బోల్డు చేసిన వాక్యాలన్నీ ఇతర గ్రంథాల నుంచి గ్రహించినవిగా గుర్తించాల్సిందిగా పాఠకులకు మనవి. ఈ వాక్యాలు, సమాచారం ఏ, ఏ గ్రంథాల నుండి సేకరించడం జరిగిందో ఆ వివరాలను ఆ వాక్యం చివర్నే ఇచ్చాను. ఈ విధంగా ఎక్కడికక్కడ రిఫరెన్స్ ఇవ్వడం వలన సామాన్య పాఠకుడితోపాటుగా ఆసక్తి గల ఇతర రచయితలకు కూడా ఆ సమాచారం ఉపయుక్తం కాగలదని భావిస్తున్నాను. ఆ కారణంగా ప్రతి స్కెచ్ చివర్న పాదసూచికలు ఇచ్చే పద్ధతులను పాటించలేదు.

నా పుస్తకాలు పరిశోధనాత్మక గ్రంథాల సరసన చేరి అవి పండితుల పరామర్శ వరకు మాత్రమే పరిమితం కాకుండా సామాన్య పాఠకుని చెంత చేరాలన్నది నా ఆశ. ఆ

కారణంగా సామాన్య పాఠకులకు ఇబ్బంది కలిగించే, పఠనశీలత స్వభావానికి అవరోధం కల్గించే **బుక్ స్టైయిల్** విధానాలను అనుసరించలేదు. 'చరిత్ర జ్ఞానం ప్రజాస్వామీకరించబడాలి' అంటే అది సామాన్య పాఠకుడ్ని కూడా ఆకట్టుకుని చదివించేలా, చదివిన విషయాన్ని పాఠకుడు సులభంగా గ్రహించగలగాలన్న ఆలోచనతో నాదైన పద్ధతిని అనుసరిస్తూ వచ్చాను. ఈ **పద్ధతి** మీద తీర్పును పాఠకులకు వదిలేశాను.

స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములైన వ్యక్తుల చరిత్రకు సంబంధించిన విషయాలను, సమాచారాన్ని నేరుగా ఆ వ్యక్తుల నుండి, ఆ వ్యక్తులు లేనప్పుడు ఆ వ్యక్తుల కుటుంబీకులు, సహచరులు, సన్నిహితుల నుండి, ఆ తరువాత సమకాలీన రచయితల గ్రంథాల నుండి, చరిత్రకారులు శోధించి, సాధించి అక్షరబద్ధం చేసిన గ్రంథాల నుండి సేకరించటం జరిగింది. ఈ గ్రంథం కోసం పై విధంగా నాకు అందుబాటులోకి వచ్చిన అన్ని ఆధారాల నుండి కావాల్సిన సమాచారాన్ని రాబట్టుకున్నాను. ఆ విధంగా లభించిన సమాచారం ఆధారంగా ఈ పుస్తకం రూపొందింది కనుక ఆ వ్యక్తులు, ఆ గ్రంథాలు, ఆ పత్రికల జాబితాలను కూడా పాఠకుల ఎరుకలో ఉంచడానికి **ఆధార గ్రంథాలు-పత్రికలు** అను శీర్షిక క్రింద నేను సంప్రదించిన గ్రంథాల, పత్రికల జాబితాను ఇచ్చాను. ఈ గ్రంథంలో ప్రచురితమైన కొన్ని ఫోటోలు, చిత్రాలు పలు గ్రంథాల నుండి, పత్రికలు, వెబ్‌సైట్ల నుండి తీసుకున్నందున, ఆ జాబితా కూడా జతచేశాను.

నా ప్రయత్నాన్ని అభినందిస్తూ, నా కృషిని ఆహ్వానిస్తూ ఎంతో మంది పెద్దలు, మిత్రులు, సన్నిహితులు సమాచార సేకరణలో నా శ్రమను తగ్గించేందుకు తాము స్వయంగా రంగంలో దిగి నాకు అవసరమగు చాలా సమాచారాన్ని, తగిన చిత్రాలను, ఫోటోలను సేకరించి నాకు పంపి సహకరించారు. అటువంటి పెద్దల, మిత్రుల, సన్నిహితుల జాబితాను కూడా ప్రకటించడం నా బాధ్యతగా భావించాను. ఆ కారణంగా ఆ జాబితాను ప్రత్యేకంగా నా ధన్యవాదాలతో సమర్పించుకున్నాను.

చివరకు ఈ గ్రంథం రూపుదిద్దుకోవడంలో తమ ఆర్థిక-హార్థిక సహకారం అందించిన సహృదయులు **జనాబ్ సర్వర్ అలీ ఖాన్ (హైదరాబాద్), జనాబ్ షేక్ బాషా మొహిద్దీన్ (వెంకటరంగాపురం), డాక్టర్ యండి. రఫి (హన్మకొండ), డాక్టర్ కె.యల్ కుట్టీ (నెల్లూరు),** పరిచయవాక్యం రాసిచ్చిన ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రోపన్యాసకులు **ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ** గారికి, చక్కని ముఖచిత్రం తయారు చేసి ఇవ్వడమే కాకుండా, పుస్తకాన్ని మరింత అందంగా తీర్చిదిద్దడంలో సహకరించిన ప్రముఖ చిత్రకారులు **షేక్ అబ్దుల్లా సాహెబ్ (విజయవాద), యన్.జయరాజ్ (వినుకొండ)**, ఈ పుస్తకంలోని కొన్ని చిత్రాలను, ఫోటోలను మరింత అందంగా రూపొందించి ఇచ్చిన ప్రముఖ చిత్రకారులు **వజ్రగిరి జెస్టిస్ (వినుకొండ)**, నా ప్రతి పుస్తకాన్ని ముందుగా చదివి తగిన సలహాలు-

సూచనలు ద్వారా సహకరిస్తున్న చరిత్రోపన్యాసకులు **షేక్ మహబూబ్ బాషా** (బి.ఆర్.అంబేద్కర్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, లక్నో, ఉత్తరప్రదేశ్), ఈ గ్రంథాన్ని పూర్తిగా చదివి పలు సూచనలు చేసిన సద్విమర్శకులు **కొత్తపల్లి రవిబాబు** (విశ్రాంత ప్రధానాచార్యులు, శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరం, ప్రజాసాహితి మాసపత్రిక ప్రధాన సంపాదకులు), ప్రముఖ రచయిత, సన్మిత్రులు **పెద్ది సాంబశివరావు** (గుంటూరు) గార్లకు నా ధన్యవాదాలు.

నా ప్రయత్నాలకు తొలినుండి ఎంతగానో సహకరిస్తున్న **'ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్'** ఛైర్మన్ **జనాబ్ షేక్ పీర్ అహమ్మద్** (హైదరాబాద్), ఉపయుక్తమగు పలు ఉర్దూ గ్రంథాలను చదివి అందులో అవసరమైన సమాచారాన్ని నాకు విడమర్చి చెబుతూ, అనుక్షణం నన్ను ఆశీర్వదిస్తూ, ప్రతిక్షణం నా వెంట నిలచి నన్ను ప్రోత్సహించిన మా అమ్మ **సయ్యద్ బీబిజాన్**, నా ప్రతి ప్రయత్నం వెనుక తానుండి సతతం నాకు చేదోడుగా నిలుస్తూ, అన్నివిధాల ప్రోత్సహిస్తూ, క్రియాశీలక చోదకశక్తిగా సహకరిస్తున్న నా జీవిత భాగస్వామి **షేక్ రమిజా భాను**, మా కుటుంబ గ్రంథాలయం పర్యవేక్షురాలిగా, ఏ సమయంలోనైనా ఏ గ్రంథం కోరినా శ్రమ అనుకోకుండా తక్షణమే అందిస్తూ వచ్చి, నా రచనా వ్యాసంగం సాఫీగా సాగడానికి పూర్తిస్థాయిలో సహకరించిన నా కుమార్తె **సయ్యద్ జాశ్మిన్ అహమ్మద్**ల సహకారం లేనట్లయితే ఈ గ్రంథాన్ని సజావుగా పూర్తిచేయడం నాకు సాధ్యమయ్యేది కాదు.

ఈ గ్రంథ రచయితను నేనైనా, సమాచార సేకరణ వద్ద నుండి, ఆ సమాచారానికి పుస్తకం రూపం కల్పించి పాఠకులకు అందించగలిగించేంత వరకు సాగిన సుదీర్ఘ ప్రక్రియలో నాకు ప్రత్యక్షంగా సహకరించిన పలువురు ప్రముఖులు, సన్నిహితులు, మిత్రులతోపాటుగా పరోక్షంగా నాకు చేయూత నిచ్చిన రచయితలు, ప్రచురణకర్తలు చాలా మంది ఉన్నారు. ఆ కారణంగా ఈ గ్రంథం సృష్టి **వ్యష్టి కృషి** కంటే **సమష్టి కృషి** ఫలితమని సవినయంగా విన్నవించుకుంటూ, నేను సంప్రదించిన పలు గ్రంథాల రచయితలకు, ఆ గ్రంథాల ప్రచురణ కర్తలకు, నేను సందర్శించిన పలు గ్రంథాలయాలకు చెందిన అధికారులకు, ఆ గ్రంథాలయాల సిబ్బందికి, ఈ గ్రంథ రచన-ప్రచురణ కార్యక్రమంలో సహకరించిన ప్రతిఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

**ఇక ... ఈ గ్రంథం గురించి తీర్పు చెప్పాల్సింది పాఠకులే !**

◆◆◆

# ఇందులో...

అంకితం ...

భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్ర ప్రదేశ్ ముస్లింలు .... 017

స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖా చిత్రాలు (అనుబంధం -1) .... 119

ప్రజా పోరాటయోధుల సంక్షిప్త వివరాలు (అనుబంధం -2) .... 331

స్వాతంత్ర్యసమరయోధుల సంక్షిప్త వివరాలు (అనుబంధం -3) .... 349

చివర్లో మీతో ఓ మాట ! .... 375

ధన్యవాదాలు .... 380

ఆధార గ్రంథాలు-పత్రికలు .... 382

రచయిత ఇతర గ్రంథాల వివరాలు .... 392

భవ్య భారత భవితకు






















**శుభాశీస్సులతో**

**అంకితం.**

సయ్యద్ జాస్మిన్ అహమ్మద్
షేక్ అన్సర్ బాషా
షేక్ సూరజ్ బాషా
షేక్ నేహా సుల్తానా
షేక్ నవీద్ అహమ్మద్
షేక్ ముహమ్మద్ మొయిజుద్దీన్
షేక్ ముహమ్మద్ మిరాజుద్దీన్

## భారత స్వాతంత్ర్యోద్యమం

# ఆంధ్రప్రదేశ్ ముస్లింలు

బ్రిటీష్ బానిస బంధనాల నుండి విముక్తిని కోరుకుంటూ, వజ్రసంకల్పంతో, అద్వితీయ పోరాటపటిమతో భారతీయులు సాగించిన స్వాతంత్ర్యోద్యమం ప్రపంచ పోరాటాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన మహత్తర ఘట్టం. ఈ మహోద్యమంలో దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు జాతి, కుల, మత, వర్గ భేదాలను మరచి స్వరాజ్య సాధన మాత్రమే అంతిమ లక్ష్యంగా పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం-ఏకత్వంలో భిన్నత్వం, అంతర్గత మార్గదర్శక సూత్రంగా సాగుతున్న భారతీయ సాంఘిక జనసముదాయాలలో ఒకటైన ముస్లిం జనసముదాయం సోదర జనసమూహాలతో కలిసి మెలసి ఈ పోరులో క్రియాశీలకంగా పాల్గొంది. అది శాంతిపథమైనా, విప్లవమార్గమైనా ఆత్మార్పణలకు ఏనాడు వెనుకడుగు వేయలేదు. మాతృభూమి పట్లగల అవ్యాజ ప్రేమాభిమానాల ఫలితంగా ధన మాన ప్రాణాలను పణంగా పెట్టి సోదర సమానులతో కలసి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఉద్యమించారు. అసమాన త్యాగాలతో అమరులయ్యారు. అద్భుతమైన విజయాలను సాధించారు. అపూర్వ త్యాగాలు, అద్వితీయ సాహసాలతో బ్రిటీష్ వలస పాలకులను స్వదేశం నుండి పారద్రోలి **స్వదేశీయుల పాలన** సాధించుకోవడంలో మహత్తర పాత్ర నిర్వహించారు.


ఈ పోరులో అశేష హిమాచలం ఎలాగైతే నడుంకట్టి కదనరంగానికి కదలి వచ్చిందో అదే విధంగా ఆంధ్రావని కూడా పొటెత్తిన సముద్రంలా త్యాగాల బాటలో ముందుకు సాగింది. పరదేశీయుల పీడనను వదిలించుకునేందుకు భారతీయులంతా ఏకోన్ముఖంగా పోరుబాటలో సాగుతున్న సమయంలో ఆంధ్రులు ఆ మార్గాన్నే ఎన్నుకున్నారు. ఈ క్రమంలో తెలుగుగడ్డ మీద పుట్టి పెరిగిన ముస్లింలు తరతరాలుగా కలసి మెలసి సహజీవనం సాగిస్తున్న సోదర సమానుల దారినే ఎంచుకున్నారు. ముస్లిమేతర జనసముదాయాలలోని స్వాతంత్ర్య సమరయోధులతో కలిసి ముందుకు నడిచారు. చివరికంటా ఆంగ్లేయ వలస పాలకులతో పోరాడి భారత స్వాతంత్ర్యసంగ్రామంలో తమవంతు భాగస్వామ్యాన్ని అందించారు.

ఈ మేరకు స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం జనసముదాయాలు నిర్వహించిన మహత్తర పాత్రకు అంతర్గత, బహిర్గత కారణాలు, జాతీయ స్థాయి పరిణామాల మూలంగా చరిత్రలో లభించాల్సినంత ప్రాధాన్యత, ప్రాముఖ్యత, ప్రచారం లభించలేదు. ప్రామాణిక చరిత్ర గ్రంథాలలో తగిన స్థానం లభించక పోవడం వలన సాహిత్య, సాంస్కృతిక, కళారంగాలలో ముస్లింల త్యాగాలకు సంబంధించిన ప్రస్తావనలు అంతగా అగుపించవు. ఈ దౌర్భాగ్యం వలన ఈ జనసముదాయాల చారిత్రక భాగస్వామ్యం జనబాహుళ్యానికి పూర్తిగా చేరలేదు. ఆ కారణంగా ఆనాటి అపూర్వ ఆత్మార్పణలు, త్యాగాలు చరిత్ర గర్భాన మరుగున పడిపోయాయి.

## తొలి సమరశంఖారావం

ఈస్ట్ ఇండియా కంపెనీ పేరుతో వ్యాపారం నిమిత్త భరత గడ్డ మీద అడుగు పెట్టిన ఆంగ్లేయులు తిన్నగా స్వదేశీ ప్రభువుల ప్రాపకం సంపాదించారు. అనుమతులు పొందేందుకు అంగీకరించిన షరతులను ఉల్లంఘించారు. దుశ్చచర్యలను సహించ లేని బెంగాలు నవాబు సిరాజుద్దౌలా తొలిసారిగా ఆంగ్లేయుల మీద 1757లో పోరాటం ప్రారంభించారు. స్వజనుల నమ్మకద్రోహం కారణంగా బెంగాల్‌లోని ప్లాసీ అను గ్రామం వద్ద కంపెనీ సైన్యాలతో జరిగిన యుద్ధంలో సిరాజుద్దౌలా పరాజయం పాలయ్యారు.

ఆ విధంగా లభించిన విజయంతో తమ పునాదులను గట్టిపర్చుకోచూసిన ఆంగ్లేయులకు ఆ తరువాత మరో పోరాట యోధుడు మీర్ ఖాశిం అడ్డుతగిలారు. 1764లో బక్సర్ వద్ద ఆంగ్లేయులతో ఆయన తలపడ్డారు. అంగబలం, అర్థబలంతోపాటుగా, విభీషణ మనస్తత్వం గల కొందరు స్వదేశీ పాలకులు ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యాలకు అండగా నిలవడంతో ఆ యుద్ధంలో ఆంగ్లేయులు విజయం సాధించాయి. ఈ విజయంతో ఆంగ్లేయులు పూర్తిగా ఉత్తర హిందూస్థానంలో బలపడ్డారు. ఈ విధంగా లభించిన



1765లో మొగల్ ప్రభువు షా ఆలం నుండి దివానిని చేజిక్కించుకుంటున్న రాబర్ట్ క్లయివ్

విజయావకాశాల మూలంగా మొగల్ పాదుషాల మీద ఒత్తిడి పెంచి 1765లో మొగల్ ప్రభువు షా ఆలం నుండి బెంగాల్ దివానిని ఈస్ట్ ఇండియా కంపెనీ కైవసం చేసుకుంది. ఆనాటి నుండి భారతీయుల మీద బ్రిటీష్ వలసపాలకుల పెత్తనం పూర్తిగా స్థిరపడ సాగింది. ఈవిధంగా లభించిన పెత్తనం ఆసరాగా అన్నివర్గాల ప్రజలను, స్వదేశీ ప్రభువులను ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, ఆంగ్లేయ అధికారులు దోచుకోవటం ఆరంభించారు.

## తొలినాటి ప్రజాపోరాటాలు

ఈ దోపిడి వాతావరణం ప్రజల జీవితాలను అతలాకుతలం చేయడంతో 1763 ప్రాంతంలో బెంగాల్ లోని ఫకీర్లు-సన్యాసులు కలసి ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకుల మీద ధ్వజమెత్తారు. ప్రజల అండదండలతో పొగలు సెగలు కక్కిన **ఫకీర్లు-సన్యాసుల తిరుగుబాటు** మజ్నూషా ఫకీర్ నేతృత్వంలో ఆరంభమై 1800 వరకు సాగింది. అనంతరం 1820 ప్రాంతంలో పీర్ షరియతుల్లా నేతృత్వంలో బ్రిటీష్ వ్యతిరేక ఉద్యమం తిరిగి ప్రారంభమైంది. ఈ ఉద్యమం **ఫరాజీ ఉద్యమం**గా ఖ్యాతి గాంచింది. ఈ పోరాటాలన్నీ బెంగాల్, బీహార్ తదితర ప్రాంతాలకు పరిమితమైనాయి.

ఆనాడు ఫకీర్లు-సన్యాసులు, ఫరాజీ ఉద్యమకారుల బాటలో ప్రారంభమైన మరొక మహోద్యమం **వహాబీ ఉద్యమం**. ఈ ఉద్యమం ఫరాజీలు తిరుగుబాటు చేసిన కాలంలోనే

ఆరంభమైంది. బ్రిటీష్ వ్యతిరేక ఉద్యమాలకు పుట్టినిల్లు అయినటువంటి బెంగాల్ నుండి తొలుత వహాబీలు విజృంభించారు. మత సంబంధిత పవిత్రత, స్వచ్ఛతను కాపాడే ఉద్దేశ్యంతో వహాబీలు తొలుత ఉద్యమించినా, చివరకు ప్రజా బాహుళ్యం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈస్ట్ ఇండియా కంపెనీ మీద, కంపెనీ తాబేదార్లపై తిరగబడక తప్పలేదు. ఆ క్రమంలో బ్రిటీష్ వ్యతిరేకతను పూర్తిగా వంట బట్టించుకుని సాగిన వహాబీ ఉద్యమం ఆ తరువాత పలు చారిత్రాత్మక సంఘటనలకు, ప్రఖ్యాతి చెందిన విచారణలకు కారణమైంది.

ఈ విధంగా సాగుతున్న ప్రజాపోరాటాలు తెలుగుగడ్డ మీదగల సామాన్య ప్రజలను, ప్రభువులను ప్రభావితం చేయకపోలేదు. ఆత్మగౌరవం గల ప్రజలు, ప్రభువుల సంబంధితులు వలసపాలకుల వ్యతిరేకంగా ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం ఆరంభించారు. ఈ ఆగ్రహం అతి త్వరిత కాలంలో తిరుగుబాటుగా పూర్తి స్థాయిలో ప్రదర్శితమయ్యింది.

## విశాఖపట్నం గడ్డ మీద సిపాయిల తొలి తిరుగుబాటు

ఉత్తర హిందూస్థానంలో నిలదొక్కుకున్న ఆంగ్లేయులు దక్షిణ భారతదేశాన్ని కూడా పూర్తిగా తమ అధీనంలో తెచ్చుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ ప్రయత్నాలను దక్షణాదిలో మైసూరు రాజ్యాధినేత హైదర్ అలీ చాలా దృఢంగా ఎదుర్కొన్నారు. ఆయనను ప్రతిఘటించడానికి ఈస్ట్ ఇండియా కంపెనీ ఎన్నో నాటకాలు ఆడాల్సివచ్చింది. ఇటు మరాఠాలను, అటు నిజాంను తోడుతెచ్చుకోవాల్సి వచ్చింది, కుట్రలు చేయాల్సి వచ్చింది.

అనాటి మైసూరు అధినేత హైదర్ అలీ బ్రిటీష్ వ్యతిరేక ప్రయత్నాలకు దక్షణాదిలోని స్వదేశీ పాలకులు అనుకూలంగా స్పందించకపోయినా, ఆయన సాహసకృత్యాలు, సాధించిన విజయాలు మాత్రం స్వదేశీపాలకుల సైన్యంలోని భారతీయులను బాగా ఆకట్టుకున్నాయి. ఆ ప్రభావం నుండి తెలుగు గడ్డమీది స్వదేశీసైనికులు కూడా మినహాయింపు కాలేదు. దక్షణాదిన ఎక్కడ ఉన్నా శత్రువును దునుమాడుతూ అప్రతిహతంగా సాగుతున్న మహాయోధుడు హైదర్ అలీ పోరాట గమనాన్ని గమనించసాగారు.

ఈ నేపథ్యంలో 1780 ప్రాంతంలో మద్రాసు దాకా బ్రిటీషర్లను తరుముకొచ్చిన హైదర్ అలీని ఎదుర్కొనేందుకు ఆంగ్లేయులకు మరింత సైన్యం అవసరమైంది. విశాఖపట్నం, మచిలీపట్నంలలో ఉన్న తమ ప్రధాన సైనిక స్థావరాల నుండి సైన్యాలను మద్రాసుకు తరలించేందుకు స్థానిక సైనికాధికారులకు ఆజ్ఞలు అందాయి. ఆ ఆజ్ఞలను మచిలీపట్నంలోని సైన్యాధికారులు, సైనికులు తు.చ తప్పక పాటించారు. విశాఖపట్నంలోని భారతీయ సైనికులు మాత్రం ధిక్కరించారు. మద్రాసు వెళ్ళి హైదర్అలీ మీద పోరాడాలని జారీ అయిన ఆదేశాలను స్వదేశీ సైనికులు ఖాతరు చేయకపోగా ఆంగ్లేయాధికారుల మీద తిరగబడ్డారు.

## తొలి తిరుగుబాటు నాయకుడు సుబేదార్ షేక్ అహమ్మద్

ఈ ధిక్కరణకు విశాఖపట్నంలోని ఈస్ట్ ఇండియా కంపెనీ సైనిక స్థావరంలో సుబేదార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న షేక్ అహమ్మద్ నాయకత్వం వహించారు. సుబేదార్ అహమ్మద్ తన సైనిక సహచరులతో కలసి మైసూరుకు ఒక్క అడుగు కూడా తాము కదిలేది లేదని ఆంగ్లేయాధికారులకు స్పష్టం చేశారు. అయినా అధికారులు తీవ్ర వత్తిడి తీసుకరాగా అధికారుల మీద తిరగబడి కాల్పులు జరిపారు. ఈ సందర్భంగా పలువురు ఆంగ్లేయ అధికారులు ప్రాణాలు వదిలారు. స్వదేశీసైనికుల కట్టలు తెంచుకున్న ఆగ్రహానికి తట్టుకోలేక కంపెనీ సైన్యాధికారులు కాళ్ళకు బుద్ధి చెప్పారు. స్వదేశీ సైనికుల తుపాకి గుండ్ల నుండి ప్రాణాలను రక్షించుకునేందుకు కలుల్లోకి దూరిన ఎలుకల్లా దాక్కొన్నారు.

ఆ చర్యతో విశాఖపట్నంలోని బ్రిటీష్ సైనికస్థావరమంతా సుబేదార్ షేక్ అహమ్మద్ నాయకత్వంలో గల స్వదేశీ సైనికుల అధీనంలోకి వచ్చింది. ఆంగ్లేయాధికారులు పారిపోగా, చేతికి చిక్కిన అధికారుల నుండి కావాల్సిన సమాచారం రాబట్టి కోశాగారంలోని ధన సంపదను, ఆయుధాగారంలోని ఆయుధాలను సుబేదార్ అహమ్మద్ స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా చూస్తే భారతదేశంలో ఆంగ్లేయుల మీద మొట్టమొదటిసారిగా తిరుగుబాటు శంఖారావం పూరించి, ఆంగ్లేయులను తరిమికొట్టి సైనిక స్థావరాలను స్వాధీనం చేసుకున్న స్వదేశీ సైన్యాధికారిగా సుబేదార్ షేక్ అహమ్మద్‌ను చెప్పుకోవచ్చు.

ఈ విషయాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం చరిత్ర శాఖాధిపతి డాక్టర్ కొల్లూరు సూర్యనారాయణ నవంబరు 28, 2006న విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రచయితతో మాట్లాడుతూ, **తొలి తిరుగుబాటు 1780 అక్టోబరు 3న విశాఖపట్నంలో జరిగింది...దురదృష్టవశాత్తు ప్రజలకు మంగళపాండే మాత్రమే తెలుసు,** అన్నారు. ఈ విషయాన్ని ఆయన 'దక్కన్ క్రానికల్' దినపత్రికలో ప్రచురితమైన ఆర్టికల్‌లో మరింతగా వివరంగా రూఢి చేశారు. ('The First revolt occured in Vizagapatnam on October 3,1780...Unfortuntely people know only about Mangal Pande' - 'Deccen Chronicle', Daily, Vijayawada, 01-10-2006, Page 1-2).

షేక్ అహమ్మద్ గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన వ్యక్తిగా ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆర్కియాలజీ విభాగం విశ్రాంత అధిపతి డాక్టర్ ఇ.వి. గంగాధరం సమాచారం ద్వారా తెలుస్తుంది. విశాఖలో సుబేదార్ అహమ్మద్ స్మృతిచిహ్నంగా రూపొందించిన స్థూపానికి సంబంధించిన వివరాలను తెలుపడం మాత్రమే కాకుండా తాను రూపొందించిన ఆ చిహ్నం రఫ్‌స్కెచ్ కూడా 1999 లో డాక్టర్ ఇ.వి. గంగాధరం రచయితకు అందించారు. ఈ కథనం ప్రకారం చూస్తే 1780లోనే తెలుగు బిడ్డడు సుబేదార్ షేక్ అహమ్మద్ నాయకత్వంలో

సిపాయీలు తొలిసారిగా తిరుగుబాటు చేసిన వైనం తేటతెల్లమౌతోంది.

ఆనాడు విశాఖపట్నంలో ఆరంభమైన సైనికుల తిరుగుబాటు తరువాత 1806లో తమిళనాడులోని వెల్లూరు సైనికస్థావరంలో మరో తిరుగుబాటు జరిగింది. ఈ రెండు తిరుగుబాట్లు కూడా దక్షిణాదిలో జరగటం విశేషం. ఈ తిరుగుబాట్ల తరువాత మాత్రమే 1824లో ఉత్తర భారతదేశంలోని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌లో స్వదేశీ సిపాయీలు ఆంగ్లేయ అధికారుల ఆజ్ఞలను వ్యతిరేకిస్తూ తిరగబడిన ఘట్టాలు జరిగాయి.

ఈ విధంగా చూస్తే దేశంలో ఉత్తరాదికాని దక్షిణాదికాని ఎక్కడ ఏ ప్రాంతంలో ఏం జరిగినా ఆ పోరాటాల ప్రభావం, ఆ పోరాటాలలో ప్రధాన పాత్రధారుల వ్యక్తిత్వాల ప్రభావం దక్షిణాది ప్రాంతాలకు తద్వారా ఆంధ్రప్రదేశ్‌కు కూడా విస్తరించిన వైనాన్ని గమనించ వచ్చు. ఆ కారణంగా తొలుత ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా ఉద్యమాలన్నీ ఎక్కడో బెంగాల్ ప్రాంతంలో ఆరంభమైనప్పటికి ఆ ఉద్యమాల ప్రకంపనాలు తిన్నగా ఆంధ్రావనిని కూడా తాకిన సంఘటనలు చరిత్రలో దర్శనమౌతున్నాయి.

## ఆంగ్లేయుల పెత్తనాన్ని అంగీకరించని నూరుల్ ఉమ్రా

స్వజనుల మీద బ్రిటీషర్ల పెత్తనాన్ని సహించలేక, ఆంగ్లేయాధికారుల చర్యలను వ్యతిరేకించిన తొలినాటి ప్రముఖులలో నూరుల్ ఉమ్రా బహుదూర్ ఒకరు. ఆయన నైజాం దర్బార్‌లో అతి ముఖ్యుడు. సికింద్రాబాద్‌లోని ఈస్ట్ ఇండియా కంపెనీలోని స్వదేశీ సైనికులను బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా వ్యవహరించమంటూ 1806 ప్రాంతంలో నూరుల్ ఉమ్రా ప్రోత్సహించారు. ఈ ప్రేరణతో ఆంగ్లేయాధికారుల చర్యలు నచ్చని పలువురు సైనికులు, కంపెనీ సైన్యం నుండి వైదొలగి నూరుల్ ఉమ్రా పక్షాన చేరారు. ఆ కారణంగా ఆయన నైజాం నవాబు ఆగ్రహానికి గురయ్యారు. ఆంగ్లేయాధికారుల సలహాల మీద నిజాం నవాబు ఆయనను తన దర్బారు నుండి బహిష్కరించి, ఉస్మానాబాద్ జిల్లాలోని ఔసా కోటలో జీవితాంతం నిర్బంధించారు. చివరకు నూరుల్ ఉమ్రా 1818లో కన్నుమూశారు.

## తెలుగుగడ్డ మీద వహాబీల ఉధృత ఉద్యమం

1820లో ఆరంభమై వహాబీల ఉద్యమం 1870 వరకు ఉధృతంగా సాగింది. ఈ ఉద్యమానికి కూడా ఆంధ్రావని ప్రతిస్పందించింది. ప్రజాస్వామ్యం లేకున్నా, నవాబుగిరి సాగుతున్నా, ప్రజలు మాత్రం బ్రిటీషర్ల పెత్తనాన్ని వ్యతిరేకించారు. నవాబులు ఇంగ్లీషు వారికి గులాంగిరి చేయడానికి అంగీకరించినా, ప్రజలు మాత్రం ససేమిరా అన్నారు. చివరకు నైజాం నవాబుల వంశంలోని వారు కూడా ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని, పెత్తనాన్ని చాలా

వరకు అంగీకరించలేదు. తమ మాట సాగదని, తమ పోరు విజయం సాధించదని తెలిసినా కూడా, ఆత్మాభిమానంతో పోరుబాటన సాగి నిర్బంధాలకు గురై, జైళ్లలో మగ్గిపోయినవారు, ప్రాణాలను ఉరికంబాల మీద బలిపెట్టిన మానధనులైన యోధులు ఎందరో ఉన్నారు.

నూరుల్ ఉమ్రా తరువాత మరో ప్రముఖుడు బ్రిటీష్ వ్యతిరేక వేదిక మీదకు వచ్చారు. ఆయన నిజాం నవాబు సికిందర్ ఝా బహుదూర్ కుమారుడు, అప్పటి నైజాం నవాబు నాసిరుద్దౌలా సోదరుడు అయినటువంటి ముబారిజుద్దౌలా. ఆయన అసలు పేరు మీర్ గోహర్ అలీ ఖాన్. బ్రిటీషర్ల అడుగులకు మడుగులొత్తే నవాబుల నైజానికి ఆయన బద్ధ వ్యతిరేకి. చిన్నతనం నుండి ఆంగ్లేయ వ్యతిరేక స్వభావం గల ముబారిజుద్దౌలా వహాబీల ద్వారా బాగా ప్రభావితులయ్యారు. నైజాం సంస్థానంలో పెత్తనం సాగిస్తున్న ఆంగ్లేయుల వైఖరిని ఆయన నిరసించారు. ఆంగ్లేయుల అడుగులకు మడుగు లొత్తుతున్న ప్రభువుల వైనాన్ని సహించలేని స్థితిలో ఆయన ఆంగ్లేయుల చర్యలను తీవ్రంగా వ్యతిరేకించారు.

1815లో స్వేచ్ఛా-స్వతంత్ర భావాల ముబారిజ్‌ద్దౌలా కంపెనీ పాలకుల మీద తిరుగుబాటును ఆరంభించారు. 1830లో అరబ్బు, ఆఫ్గన్ జాతీయులతో కలిసి తిరగబడ్డారు. అయితే నిజాం, బ్రిటీషర్ల సంయుక్త బలగాల ముందు ఆయన పోరాటం ఊపిరి పీల్చుకోలేక పోయింది. ఆయన నిర్బంధానికి గురయ్యారు. ఆ తరువాత మరోమారు ఆయన పోరుకు సిద్ధపడగా, 1839లో బ్రిటీష్ రాణికి, నిజాం రాజ్యానికి వ్యతిరేకంగా కుట్ర పన్నారన్న నేరం మోపి ఆయనకు జీవిత ఖైదు విధించారు. ఆయన అనుచరులకు 10 సంవత్సరాలకు పైబడిన జైలు శిక్షలు పడ్డాయి. చిట్టచివరకు ముబారిజుద్దౌలా ఆ శిక్షను అనుభవిస్తూ గోల్కొండ కోటలో 1854 జూన్ 25న కన్నుమూశారు.

ఈ మేరకు బ్రిటీష్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న కర్నూలు నవాబు గులాం రసూల్ ఖాన్ ముబారిజుద్దౌలాతో చేతులు కలిపారు. ఈ విషయాన్ని పసికట్టిన బ్రిటీష్ అధికారులు టి.యల్.బ్లేన్ అను అధికారిని విచారణ కోసం కర్నూలు పంపారు. ఆ విచారణ తరువాత 1839 అక్టోబర్ 18న ఎ.బి.డైస్ అను సైన్యాధికారి నాయకత్వంలో ఆంగ్లసైన్యం కర్నూలు నవాబు సంస్థానం మీద దాడి చేసింది. ఆ పోరాటంలో నవాబు గులాం రసూల్ ఆంగ్ల సైన్యాలను వీరోచితంగా ఎదుర్కొనప్పటికి పరాజితులయ్యారు. ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యం ఆయనను అరెస్టు చేసి తిరుచునాపల్లి ఖైదుకు తరలించింది. ఆ జైలులోనే ఆంగ్లేయుల కుట్ర ఫలితంగా గులాం రసూల్ తన సేవకుని చేతిలో హత్యకు గురయ్యారు. ఈ విధంగా గులాం రసూల్ పోరాట జీవితం 1840 జూలై 12న ముగిసింది. ( Article titled The Political Relations Between The Nawabs of Kurnool and The English East India Company, by Syed Moosa Miah, Publihsed in Andhra Pradesh History Congress, Proceedings of the Ninth Session, Kurnool, 1985 Page. 156-157)

ఆ విధంగా 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి పూర్వమే భరతగడ్డ మీద వీచిన బ్రిటీష్ వ్యతిరేక పవనాలకు తెలుగుబిడ్డలు కూడా తగు విధంగా స్పందించారు. ఆ ప్రతిస్పందనల మేరకు తమ తమ ప్రాంతాలలో తగిన చర్యలకు పూనుకున్నారు.

## తెలుగుగడ్డ మీద ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో తెలుగు ప్రజల పాత్రను గమనించే ముందుగా ఈనాడు ఆంధ్రప్రదేశ్‌గా ప్రస్తుతం పిలువబడుతున్న సర్కారు, రాయలసీమ, కోస్తా ఆంధ్ర, తెలంగాణాలు ఎవరి ఏలుబడిలో ఉన్నాయో తెలుసుకోవటం చాలా అవసరం. పాలకులు, ఆ పాలకుల స్వభావం, పరిపాలనా వ్యవస్థను బట్టి కూడా ఆయా ప్రాంతాల ప్రజల స్పందన –ప్రతిస్పందనలు ఉంటాయి.

ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగమైన తెలంగాణా, రాయలసీమ, కోస్తా ప్రాంతాలు ఆనాడు పూర్తిగా అటు బ్రిటీషర్ల పాలన క్రింద గాని లేక ఇటు నిజాం నవాబు ఏలుబడి క్రింద గాని లేవు. ఈ ప్రాంతాలు ప్రథమంలో నిజాం నవాబు ఆధీనంలో ఉన్నప్పటికీ, ఫ్రెంచివారి ప్రాపకం కోసం 1753లో కొంత ప్రాంతాన్ని, బ్రిటీషర్ల అండదండల కోసం మరికొంత భూభాగాన్ని 1800లో నైజాం నవాబులు ధారాదత్తం చేశారు. ఈ భూభాగాలను ఉత్తర సర్కారు, సీడెడ్ ప్రాంతాలుగా ఆనాడు పిలిచేవారు. 1800 నాటికి ఈ ధారాదత్తం ప్రక్రియ పరిసమాప్తమైంది. ఆనాటి ఉత్తర సర్కారు, సీడెడ్ జిల్లాలు కలిసి మద్రాసు ప్రెసిడెన్సీలో భాగమైన ఆంధ్రప్రాంతం ఏర్పడింది. మిగిలిన ప్రాంతాలు నిజాం పాలకుల ఏలుబడి క్రింద ఉండిపోయాయి. ఈ ప్రాంతం తెలంగాణగా పిలువబడింది. 1857 నాటికి ఆంధ్రప్రాంతం మద్రాసు ప్రెసిడెన్సీలో భాగంగా ఈస్ట్ ఇండియా కంపెనీ ఏలుబడిలో ఉండగా, తెలంగాణ ప్రాంతం నిజాం సంస్థానాధీశుని పాలన క్రింద ఉంది.

## స్థాయీ భేదాలతో పోరుబాట

ఆయా ప్రాంతాలలో ఉన్నటువంటి రాజ్యవ్యవస్థ లేదా పాలనా వ్యవస్థను బట్టి ఆ ప్రదేశాలలోని ప్రజానీకం స్థాయి భేదాలతో 1857 నాటి పోరాటంలో పాల్గొన్నారు. ప్రథమ స్వాతంత్ర్య సమరం సృష్టించిన ప్రకంపనలు నిజాం ప్రాంతాలలో కన్పించినంతగా, మద్రాసు ప్రెసిడెన్సీ ప్రాంతమైన ఆంధ్ర ఏరియాలో తొలిదశలో కన్పించలేదు. భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో లాగా మద్రాసు ప్రెసిడెన్సీ ప్రాంతమైన ఆంధ్రలో పదవీచ్యుతులు గావించబడిన స్వదేశీ పాలకులు, ప్రభువులు లేకపోవడం ప్రధాన కారణం కావొచ్చు. నిజాం ప్రాంతంలో స్వదేశీ పాలకుడున్నా కూడా, అక్కడ ఆంగ్లేయుల ఆధిపత్యం సాగుతున్నందున, ప్రజలు తమపై సాగుతున్న విదేశీయుల పెత్తనానికి, ఆధిపత్యానికి వ్యతిరేకంగా విజృంభించారు.

ప్రథమ స్వాతంత్ర్య సమరయోధులు పూరించిన సమర శంఖారావాన్ని అంది పుచ్చుకున్న తెలుగు ప్రజలు బ్రిటీషర్ల పెత్తనాన్ని ఇక ఏమాత్రం సహించేది లేదని సాయుధులై కదిలారు. ఉత్తర భారతావనిలో ఈ పోరు ప్రారంభం కాకముందే ఆంధ్ర-తెలంగాణ ప్రాంతాలలో ఆత్మాభిమానం గల యోధులు, బ్రిటీష్ అధికారుల ఆజ్ఞలను ఖాతరు చేయకుండా తిరుగుబాటు పతాకాలను ఎగుర వేసిన చరిత్ర కలిగి ఉన్నారు.

1857కు పూర్వం వహాబీ ఉద్యమం ప్రభావంతో తెలుగునాట పడిన తిరుగుబాటు బీజాలు 1857 నాటికి మొలకలెత్తటం ఆరంభించాయి. 1857కు ముందు ఆంధ్ర ప్రాంతంలో చిగురించిన తిరుగుబాటులను బ్రిటీషర్లు కర్కశంగా చిదిమివేశారు. బ్రిటీషర్ల పెత్తనం సహించలేక, 1846 ప్రాంతంలోనే కర్నూలు జిల్లాకు చెందిన ప్రజానాయకుడు నరసింహారెడ్డి బ్రిటీషర్ల మీద తిరగబడితే ఆయనకు ఆ ప్రాంతానికి చెందిన మరో యోధుడు మహమ్మద్ ఖాన్ అండగా నిలిచారు. అలాగే నరసింహారెడ్డికి హైదరాబాదుకు చెందిన సలాం ఖాన్ అను నాయకుడు సహకరించినట్టు దాఖలాలు ఉన్నాయి. (Article titled 1846 Revolt of Rayalaseema : Some Reflections, by N.Raghavendra, Publihsed in Andhra Pradesh History Congress, Proceedings of the Tenth Session, Guntur, 1986, Page.197) ఈ నరసింహారెడ్డి సాహస చరిత్ర టెలీ సీరియల్‌గా కూడా ప్రసారం అయ్యింది. ఆ తిరుగుబాట్లు పటిష్టమైన పోరాట రూపాలుగా పరిణితి చెందక ముందే ఆధునిక ఆయుధాలు, శిక్షణ పొందిన సైనిక బలగాలు గల ఈస్ట్ ఇండియా కంపెనీ ఆ తిరుగుబాట్లను నలిపి వేయడంతో అవి చరిత్రలో తగినంత స్థానం పొందలేకపోయాయి.

ఉత్తర భారతదేశంలో రగులుతున్న బ్రిటీష్ వ్యతిరేకత తిన్నగా దక్షిణ భారత దేశాన్ని కూడా చుట్టేశాక, నిజాం సంస్థానంలో కూడ ఆ ప్రభావం స్పష్టంగా బలపడసాగింది. ఈ పోకడలు ఎంతవరకు విస్తరించాయంటే **పోరుబాట నడవండి మేం మీ వెంట ఉంటా** అంటూ సంస్థానాధీశుడికి ప్రజానీకం నేరుగా సలహా ఇచ్చేంత స్థాయిలో బ్రిటీష్ వ్యతిరేకత నైజాం సంస్థానంలో ఉనికిని సంతరించుకుని ఊపందుకుంది.

## అఫ్జలుద్దౌలా ... పోరుబాట నడవండి !

ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులకు వ్యతిరేకంగా, ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని నిరసిస్తు ప్రజలు ముందుకు రాసాగారు. ఈ మేరకు సాగిన ఆంగ్లేయ వ్యతిరేక ప్రచార కార్యక్రమాలలో ప్రధానంగా మౌల్వీలు, మషాయక్‌లు, పేష్ ఇమాంలు పూర్తిగా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా బద్ధ విరోధులుగా మారి రాత్రింబవళ్ళు వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్నారు. ఆనాడు ప్రజలలో పొడచూపిన ఈ వ్యతిరేకత ఆంగ్లేయుల వరకు మాత్రమే పరిమితమైంది. స్వదేశీ పాలకుడు నైజాం సంస్థానాధీశుడి పట్ల ఎంతో గౌరవం కలిగిన ప్రజలు ఆయనను

ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడాల్సిందిగా, ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారుల పెత్తనం నుండి, ఆధిపత్యం నుండి పూర్తిగా విముక్తం కావాల్సిందిగా విజ్ఞప్తులు పంపుకున్నారు.

ఈ కదలికకు ఉత్తర భారతదేశంలో ప్రారంభమైన తిరుగుబాట్లు ప్రేరణగా నిలిచాయి.పరాయి పాలకుల మీద సమరం సాగించేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తున్న పోరాటశక్తులు తక్షణమే ఆయుధాలను చేపట్టి బ్రిటీష్ పాలకులను సవాల్ చేశాయి. శత్రువును ఎదుర్కొనేందుకు హిందూ-ముస్లింల ఐక్యత కాంక్షిస్తూ ప్రజలను పోరాటం దిశగా సాగమని ప్రతి ఒక్కరిని కోరాయి. ఆ ప్రయత్నాలలో భాగంగా సాగిన విజ్ఞప్తులకు స్పందించని నిజాం నవాబును హేళన చేస్తూ తిరగబడమంటూ, కాదు కూడదంటే గాజులు తొడుక్కొని కూర్చోమని ప్రకటనలు, ప్లేకార్డులు ఈ క్రింది విధంగా హైదరాబాదు నగరంలో వెలిశాయి.

**బహుదూర్ అఫ్జలుద్దౌలా మీద భగవంతుని, మహమ్మద్ ప్రవక్త దయ ఉంది. ఆయన భయపడకుండా ఉండాలి. ఒకవేళ భయపడినట్టయితే గాజులు తొడుక్కొని ఇంటి దగ్గర కూర్చోవడం మంచిది ... ఈ పోస్టర్లలో రాసిన ప్రకారంగా బహుదూర్ ప్రవర్తించ నట్టయితే ఢిల్లీ నుండి ఇంకొక సుభా వస్తుంది,** (నిజాం-బ్రిటీష్ సంబంధాలు (1727 -1857), సరోజినీ రెగానీ, మీడియా హౌస్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2002, పేజి. 319-320)

ఈ పరిస్థితి ఎంత దూరం పోయిందంటే, ఈ వినతిని చదివిన వ్యక్తులుగాని, ఈ విషయం తెలుసుకున్న ఎవరైనా గాని ప్రకటించిన మేరకు నిజాంకు, ఆయన దివాన్‌కు ఆ విషయం తెలుపకున్నా, ఈ ప్రకటనలను ఇక్కడి నుండి తొలగించినా అటువంటి వారు దేవుడు, ప్రవక్త శాపానికి గురవుతారని కూడా హెచ్చరించేంత వరకు వెళ్ళింది. ఈ రకమైన ప్రకటనలలో వెలుబుచ్చిన అభిప్రాయాలను గమనిస్తే ప్రజల పట్టుదల, ఆగ్రహం ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

" The aid of the Almighty and his prophet is present with Afzal-ud-Doula Bahadur who should not fear and be apprehensive. If fearful he should wear bangles and sit at home..... If AfzulooDowla does not act on this paper, another Soobah will be ready form Delhi...If after reading these papers on hearing it a representation is not made to the king (Nizam) or his Diwan, ....the oath of the swine is on him and if in case of a Hindu the oath of cow...if this paper removed from this place the cures of God and his prophet will rest on the person removing it..." (Highlights of the Freedom Movement in Andhrapradesh - The Freedom Struggle In Hyderabad, Volume II (1857-1885), Govt. of AP, 1956, Page. 8-9)

ఈ ఆహ్వానాలు, ప్రజల విజ్ఞప్తులు నవాబుకు ఏమాత్రం పట్టలేదు. బ్రిటీషర్లు మాత్రం ముంచుకొస్తున్న ప్రమాదాన్ని గ్రహించారు. సంపన్నవంతమే కాకుండా ఓ బలమైన

మద్దతుదారుడు తమకు దూరమైతే అధికారం అంతా తమకు దూరం కాగలదని భయపడ్డారు. దక్షిణాది నుండి నిజాం కనుక తిరుగుబాటులో పాల్గొన్నట్టయితే తమ ఆధిపత్యం అంతం కాక తప్పదని భయపడిన ఆంగ్లేయులు **నిజాం జారిపోయినట్టయితే అంతా జారి పోయినట్లే** అనే స్తిరమైన అభిప్రాయానికి వచ్చారు. అందువలన తిరుగుబాటు ప్రభావానికి, ప్రమాదానికి నిజాం సంస్థానం ఏమాత్రం గురికాకుండా ఉండేందుకు తమ శాయశక్తుల విజయవంతంగా కృషిచేశారు. చివరకు నిజాంను మంచి చేసుకుంటూ, నిరంతరం ఆయనకు పలు ఆశలు కల్పిస్తూ, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి దూరంగా ఉంచగలిగారు.

## తెల్లవారిని తరిమి...తరిమి కొట్టండి !

పరాయి పాలకుల పెత్తనం ఏమాత్రం నచ్చని నైజాం సంస్థానంలోని ప్రజలలో ఓర్పు, సహనం పూర్తిగా నశించాయి. నవాబు మీద గౌరవంతో తిరుగుబాటుకు ముందుకు రావాల్సిందిగానూ, ఆంగ్లేయుల పెత్తనం నుండి విముక్తం కావాల్సిందిగానూ నవాబుకు ఆహ్వానం పలికిన స్వాతంత్ర్యకాంక్షాపరులు అది సానుకూలం కాకపోవడంతో తమ ఆగ్రహాన్ని తెల్లవారి మీదకు మళ్ళించారు. ఆ ఆగ్రహజ్వాలల నుండి **తెల్లవార్ని తరిమి కొట్టమని, మట్టుబెట్టమని** నినాదాలు ఉద్భవించాయి. ఆ నినాదాలు కాస్తా నగరం గోడల మీద ప్రకటనల రూపంలో కన్పించాయి. ("...Faithful to murder the feringhee..." (History of the Deccan Vol-II, JDE Gribble, Mitttal Publications, NewDelhi,1990, Page.257).

ఈ క్రమంలో ఆంగ్లేయాధికారులను భయపెట్టేందుకు ప్రజలు ఉద్దేశ్యపూర్వకంగా పలు విధాలుగా ప్రచారాలు సాగించారు. ఈ విషయాన్ని ఆంగ్లేయాధికారి బ్రిగ్స్ వివరిస్తూ, **నైజాం సంస్థానంలోని మంత్రులు, ఉన్నతాధికారులు తేనెపూసిన కత్తుల్లా వ్యవహరించే వారు. పైకి స్నేహపూరితంగా ఉంటూనే మీరు ఇక్కడి నుండి వెళ్ళిపోండి అని సలహా ఇచ్చేవారు. ఇక్కడి పరిస్థితులు బాగాలేవు. మీ ప్రాణాలకు ముప్పు ఏర్పడవచ్చు అని చెబుతూనే పారిపోయేలా చేసేవారు. పారిపోతే అధికారి పరువుపోతుంది. బ్రిటీష్ ప్రభుత్వపు నైతిక బలం దెబ్బతింటుంది అని వారి ఉద్దేశ్యం**, అని ఆనాటి పరిస్థితులను ఆంగ్లేయుడు అక్షరబద్ధం చేశాడు. (1857 తెలుగునాట తిరుగుబాటు,డాక్టర్ కె.మహాంకాళి,పేజి.17-18). ఆ సమయంలో షంషుల్ ఉమ్రా చిన్న కుమారుడు ఇఫ్తెకారుల్ ముల్క్ హైదరాబాదులో బ్రిటీష్ వ్యతిరేక ఉద్యమాన్ని లేవదీశాడని అప్పటి కల్నల్ డేవిడ్‌సన్ ఉన్నతాధికారులకు రిపోర్టు చేశాడు. నిజాంకు, బ్రిటీషు వారికి విరుద్ధంగా మాట్లాడిన వారినందరిని, అమీరు గాని, సాధారణ పౌరుడుగాని కేవలం బెదిరించి వదిలేయడం మాత్రమే కాకుండా వారిని నిర్బంధించాలని ఆ ఆంగ్లేయాధికారి ఆజ్ఞాపించాడు. (హైదారాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, వెల్దుర్తి మాణిక్యరావు, పేజి.31).

## పోరుబాటలో మౌల్వీల మహత్తర పాత్ర

ప్రధానంగా సైనికులలో, ప్రజలలో ఆంగ్లేయుల పట్ల విద్వేషం మరింతగా పెంపొందించడంలోనూ ఆనాటి చారిత్రక తిరుగుబాటుకు ధార్మిక పండితులైన మౌల్వీలు, ఉలేమాలు వెన్నెముకగా నిలిచారు. ప్రజలను ప్రేరేపించి వారు పోరుబాటన నడిచేందుకు తగిన విధంగా సన్నద్ధులను చేయడంలో మౌల్వీలు పాత్ర ఎంతో ఉంది. ఈ మౌల్వీలు ప్రజలను ప్రేరేపించడం, ప్రోత్సహించడంతో సరిపెట్టుకోలేదు కదనరంగంలో అందరి కంటె ముందు నిలిచారు. కత్తిపట్టి కదనరంగాన నడిచి ఇతరులకు మార్గదర్శకులయ్యారు. చివరకు బలమైన స్వేచ్ఛ-స్వాతంత్ర్య కాంక్షకు, కరడుకట్టిన బ్రిటీష్ వ్యతిరేకతకు ప్రతీకలయ్యారు.

ఈ మేరకు మౌల్వీ ఇబ్రహీం, మౌల్వీ అక్బర్, మౌల్వీ అల్లాద్దీన్ తిరుగుబాటును ప్రోత్సహించడమే కాకుండా తిరుగుబాటు యోధులకు ముందు నిలచి మున్ముందుకు నడిపించారు. నైజాం సంస్థానం రాజధాని హైదరాబాదు గడ్డ మీద తొలిసారిగా మౌల్వీ ఇబ్రహీం తిరుగుబాటు బావుటాను ఎగురవేశారు. ఆ కారణంగా నిజాం పాలకులు, మౌల్వీలకు, ధార్మిక పండితులకు, ధర్మప్రచారకులకు, ఫకీర్లకు ప్రత్యేక హెచ్చరికలు జారీ చేయాల్సి వచ్చింది. అయినా ఏమాత్రం భయపడక ఆ స్వేచ్ఛాభిలాషులు ముందుకు సాగారు.

ఆ కారణంగా మౌల్వీలు, ఫకీర్ల మీద ఆంగ్లేయాధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. బోయినపల్లిలో ఓ ఫకీరు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ప్రబోధం చేస్తుంటే అతనిని బంధించి జైల్లో వేశారు. ఆనాడు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ప్రజలను, నవాబును రెచ్చగొడుతూ అంటించిన కరపత్రాలు చూసి ఆరాధనా మందిరాలలో ఆ విషయాలను ప్రస్తావించి ప్రజలను ఉసిగొల్పకుండా ఉండేందుకు మౌల్వీలు, ఫకీర్ల పట్ల చాలా కఠినంగా ప్రవర్తించారు. బ్రిటీష్ వ్యతిరేకి అని చిన్నపాటి అనుమానం కలిగినా ప్రతి ఫకీరును, ప్రతి మౌల్వీని నిర్బంధించారు. ఈ మేరకు ఆంగ్లేయులు, నిజాం నవాబు ఎంత కఠినంగా ప్రవర్తించినా ప్రజలలో ఆంగ్లేయ వ్యతిరేక ప్రచారం నిరంతరం సాగింది. ఆ ప్రచారం తీవ్రస్థాయికి చేరుకుని చివరకు ప్రజానీకాన్ని పోరుబాట పట్టించగా, స్వదేశీ సైనికులలో నిరసన జ్వాలలను రగిలించింది.

## స్వదేశీ సైనికులలో తిరుగుబాటు జ్వాలలు

ఒక వైపున ప్రజలలో పోరాటం గురించి ఆలోచనలు సాగుతుండగా ఆ ఆలోచనల ప్రభావంతో నైజాం సంస్థానానికి చెందిన సైనికులలో కూడా తిరుగుబాటు జ్వాలలు రగిలాయి. ఆ సైనికుల మీద ఆధిపత్యం చలాయిస్తున్న ఆంగ్లేయ ఉన్నతాధికారులను ఏమాత్రం ఖాతరు చేయకుండా స్వదేశీ సైన్యాధికారులు, సైనికులు బాహాటంగా తిరగబడి కలకలం సృష్టించారు.

ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారుల ఆజ్ఞలను బాహటంగా ఉల్లంఘించి నూతన పోరాట చరిత్రకు నాంది పలికారు.

ఔరంగాబాదులో గల నైజాం సైన్యంలోని కాల్బలం నిజాం రాజ్యం సరిహద్దు దాటి వెళ్ళి స్వదేశీ పాలకుల మీద దాడులు జరిపేందుకు పూర్తిగా నిరాకరిస్తూ, **నిజాంకే సర్‌హద్ బాహర్ నహీ జాయేంగే–దీన్ కే ఊపర్ కమర్ నహీ బాందేగే** అని స్పష్టంగా ప్రకటించారు. (' We will not cross the frontiers of the Nizam's dominions and we will not fight against our own co-religionists ' - Highlights of the Freedom Movement in Andhra Pradesh - Dr. Sarojini Regani, 1972, Page.8).

ఆనాడు ఉత్తరభారత దేశంలో పలు పరాజయాలను ఎదుర్కొంటున్న ఆంగ్లేయులు ఆ ప్రాంతాలలోని స్వదేశీ పాలకుల మీద పోరాడడానికి తమను తరలిస్తారని స్వదేశీ సైనికాధికారులు, సిపాయీలు భావించారు. 1780 ప్రాంతంలో ఏవిధంగానైతే హైదర్ అలీ మీద యుద్ధం చేయడానికి సైనికుల తరలింపు కార్యక్రమాన్ని స్వదేశీ సైనికులు అడ్డగించారో అదేవిధంగా 1857 ప్రాంతంలో కూడా ఉత్తరాదికి వెళ్ళడానికి నిరాకరిస్తూ అధికారుల ఆజ్ఞలను స్వదేశీ సైనికులు నిరసించారు. ఆ నిరసన నుండి ఉద్భవించిన తిరుగుబాటుకు జమేదార్ అమీర్ ఖాన్, దఫేదార్ మీర్ ఫిదా ఆలీలు నాయకత్వం వహించారు. ఆ సందర్భంగా ఫిదా అలీ మీద సైనికవిచారణ జరిపి ఆయనను ఉరి తీశారు, అమీర్‌ఖాన్ మాత్రం ఆంగ్ల సైన్యాలకు చిక్కకుండా తప్పించుకున్నారు.

కంపెనీ అధికారుల ఆజ్ఞలను తు.చ తప్పక పాటించే భారతీయ సైనికులు, సైన్యాధికారులు తిరుగుబాటును ప్రకటించడం, ఆంగ్లేయాధికారులతో సరాసరి తలపడడాన్ని ఏమాత్రం సహించని ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు తిరుగుబాటుకు ఉద్యుక్తులైన ప్రతి ఒక్కరి మీద కఠిన చర్యలు తీసుకున్నారు.

## భయానక శిక్షలకు భయపడని యోధులు


బ్రిటీషర్ల ఆజ్ఞలను ధిక్కరించిన స్వదేశీ సైనికులను, సైన్యాధికారులను ఉద్యోగాల నుండి తొలగించారు. పలువురికి కఠిన శిక్షలు విధించారు. ఉరిశిక్షలు, ఫిరంగులకు కట్టి పేల్చివేయడం ఆనాడు అతి సాధారణ విషయమైంది. ప్రభుత్వం ఎంతటి కిరాతకత్వానికి పాల్పడినా తిరగబడ్డ యోధులు మాత్రం శిక్షలకు ఏ మాత్రం వెరవలేదు, భయకంపితులు కాలేదు. ఆ వీరయోధులు మరణశిక్షలను కూడా ప్రశాంతంగా స్వీకరించి ఆంగ్లేయాధికారులను సైతం ఆశ్చర్యచకితుల్ని చేశారు. ఆ మారణకాండకు సంబంధించిన భయానక దృశ్యాలను బ్రిటీష్ అధికారులు కూడా స్వయంగా చూడలేకపోయారు.

ఈ విషయాన్ని బ్రిటీష్ సైనికాధికారి Captain Abbot తన లేఖలలో వివరంగా పేర్కొన్నాడు. ఎంతమంది యోధులను ఎలా ఉరి తీసింది, ఎలా ఫిరంగులకు కట్టి పేల్చి వేసింది, ఎంతమందికి ఏ విధంగా శిక్షలు వేసింది ఆయన పేర్కొన్నాడు. ఆ సమయంలో తిరుగుబాటు యోధులలో కన్పించిన నిర్భయత, ప్రశాంతతలను కూడా ఆ ఆంగ్లేయుడు తన ఉత్తరాలలో వివరంగా నమోదు చేశాడు. ఆనాటి శిక్షల అమలు, ఆయా సంఘటనల విశేషాలను ఆ అంగ్లేయాధికారి ఈ విధంగా వివరించాడు.

**మేం మొదట పట్టుకున్న 94 మంది ఖైదీలలో ఒకరిని ఉరితీశాం. నల్గురిని కాల్చి చంపాం. ఒకడ్ని ఫిరంగులతో పేల్చివేశాం. ఆ దృశ్యం ఎంతో భయంకరంగా ఉంది. వాడి తల దాదాపు 20 గజాల పైకి ఎగిరింది. వాడి రెండు చేతులు రెండు వైపులకు దాదాపు ఎనిమిది గజాల దూరంలో పడ్డాయి. వాళ్ళు ఎంతో మామూలుగా తమకు విధించిన శిక్షలను గురించి వినటం చూసి ఆశ్చర్యపోయాను. ఫిరంగి ముందు నిలబడ్డ వ్యక్తి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పిన వారు భగవంతుని ఎదుట సమాధానం చెప్పవలసి వస్తుందని ప్రకటించాడు.తన్ను ఫిరంగికి కట్టవద్దని కోరాడు. తాను భయపడనని అన్నాడు. నేను నన్ను శుభ్రపర్చుకున్నాను. దాంతో నా పాపాలన్నీ కడిగేసుకున్నాను. ఎంత త్వరగా నేను స్వర్గానికి వెడితే అంత సుఖం అని ఉరితీయబడిన వ్యక్తి అన్నాడు...పట్టుబడ్డ ఖైదీలలో ఇద్దర్ని పేల్చివేశాం, మరో నలుగురిని కాల్చి చంపాం. నల్గురికి శిక్ష తగ్గించాం. మరో వందమంది నిరాయుధుల్ని చేసి వెళ్ళగొట్టాం. ఓ యాభై మందికి కొరడా దెబ్బల శిక్ష విధించాం...ఇంకా మేము చేయాల్సిన ఇటువంటి పని ఎంతోఉంది.** (నిజాం-బ్రిటీష్ సంబంధాలు,సరోజిని రెగాని,మీడియా హౌస్ పబ్లికేషన్స్,హైదరాబాద్,2002, పేజి.326)

( "...We have already disposed off a goodly number of the 94 prisoners we took in the first haul of the net; one has been hanged, 4 shot, one blown away from a gun, a frightful sight indeed ; his head ascended about 20 yard in the air and his arms were thrown eight yards in either direction! I was astonished to see how coolly they received intelligence that they were to suffer death..." - The Freedom Struggle In Hyderabad, Volume II (1857-1885) Govt. of AP, 1956, Page. 38-39).

అంతేకాదు జమేదార్ చిద్దాఖాన్ నాయకత్వంలో నిజాం సరిహద్దుల్లోని బుల్దానాలో ఉన్న హైదరాబాద్ కాల్బలం తిరగబడింది. తిరగబడిన సైనికులు స్థావరాలు వదలి వెళ్ళి పోయారు. బ్రిటీషర్లకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటానికి నిజాం సహాయం కోరేందుకు తిరుగుబాటు వీరుడు చిద్దాఖాన్ పదిమంది సహచరులతో హైదరాబాద్ వచ్చారు. ఆ యోధులకు సహాయం అందచేసి ఆంగ్లేయులతో శత్రుత్వం కొని తెచ్చుకోడానికి నిజాం నవాబు సిద్ధంగా లేడు. అందువల్ల చిద్దాఖాన్ నగర ప్రవేశం చేయగానే ఆయనను, ఆయన అనుచరులను అరెస్టు చేయించాడు. ఈ చర్యతో ప్రజలలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి.



మక్కా మసీదు

ఈ ఆగ్రహావేశాలు తిరుబాటుగా రూపు దిద్దుకోసాగాయి. ఈ విషయాన్ని పసిగట్టిన **ఇంగ్లీష్‌మన్** ఆంగ్లపత్రిక 1857 జూన్ 27నాటి సంచికలో వెల్లడించింది. **హైదరాబాదులో అల్లరులు చెలరేగె గట్టి సూచనలున్నాయి. సైనికులలో అశాంతి ప్రబలి ఉంది. ఇస్లాం మత ధర్మపరిరక్షణ కోసం మతధ్వజం ఎత్తాలని ఉన్నత స్థాయికి చెందిన ఫకీర్లు ముఖ్యంగా ఖామూష్ షాహ్, అదేపనిగా సైనికుల్లోను ప్రచారం చేస్తున్నారు. ఇక మౌల్వీ అక్బర్ అనే ప్రచారకుడు మసీదుల్లో ఎడతెరపి లేకుండా ప్రచారం చేసినాడు,** అని ఆ పత్రిక పేర్కొంది.

## బ్రిటీష్ రెసిడెన్సీపై సాహసోపేత దాడి

ఆ ప్రచారానికి తగ్గట్టుగానే 1857 జూలై 17న నగరంలోని ప్రజలు, ప్రముఖులు మక్కా మసీదు వద్ద సమావేశమై, నిజాం వద్దకు నలుగురు మౌల్వీలను పంపి, చిద్దాఖాన్ ఆయన అనుచరులను విడుదల చేయమని విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు తమ విజ్ఞప్తిని నిజాం నవాబు మన్నించకుంటే బ్రిటీష్ రెసిడెన్సీ మీద దాడి చేయాలని, ఆరోజు జరిగిన సమావేశంలో తీర్మానించారు. ఊహించిన విధంగానే మౌల్వీల విజ్ఞప్తిని నవాబు మన్నించలేదు. ఆ కారణంగా ప్రజలు దాడికి సిద్దమయ్యారు.

ఈ నేపధ్యంలో రొహిల్లా నాయకుడు పఠాన్ తుర్రేబాజ్ ఖాన్, మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్‌ల సంయుక్త నాయకత్వంలో రొహిల్లా వీరులు, ప్రజలు రెసిడెన్సీ మీద దాడి

చేశారు. మౌల్వీ ఇబ్రహీం తిరుగుబాటు పతాకంతో ముందు నడిచి పోరుకు కదలిన జనసమూహాన్ని ముందుకు నడిపించారు. ఈ సమాచారం అందుకున్న బ్రిటీషర్లు, నిజాం పాలకులు ముందుగానే సైన్యాలను మోహరించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం వలన పోరాటంలో తిరుగుబాటు సైన్యాలకు విజయం అసాధ్యమైంది.

ఈ సందర్భంగా జరిగిన అరెస్టుల నుండి మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ చాకచక్యంగా తప్పించుకున్నారు. చాలా కాలం తరువాత ఓ ద్రోహి అందించిన సమాచారం ఆధారంగా మంగలపల్లి వద్ద నిజాం–బ్రిటీషు సైన్యాలు ఆయనను నిర్బంధించాయి. ఆయన మీద పలు నేరారోపణలు మోపి విచారణ తంతు జరిపి ద్వీపాంతరవాస శిక్ష విధించారు. 1859 జూన్‌లో ఆయనను అండమాన్ తరలించారు. అండమాన్‌లో పాతికేళ్ళపాటు మగ్గిపోయిన మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ 1884లో జైల్లోనే కన్నుమూశారు.

ఈ పోరులో తిరుగుబాటు యోధుల నాయకుడు పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ గాయపడి పట్టుబడ్డారు. ఆయన మీద విచారణ జరిగింది. ఆ విచారణలో తన సహచరులను ఇబ్బందుల పాల్జేయటం ఇష్టంలేక నేరమంతా తనదేనన్నాడు. చివరకు ఆయన ప్రధాన సహచరులు మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ కూడా ఎవరో తనకు తెలియదని, తానుగా ప్రజలను ప్రేరేపించి పోరుబాట నడిపించానని తుర్రేబాజ్ ఖాన్ ఎంతో ధీరోదాత్తంగా ప్రకటించారు. ఆయన నిర్బంధించగా 1859 జనవరి18లో నిర్బంధం నుండి చాకచక్యంగా తప్పించుకున్నారు. ఆ తరువాత మెదక్ సమీపంలో నిజాం, బ్రిటీష్ సైన్యాలతో మరోమారు తలపడిన ఆయనను శత్రు సైనికులు కాల్చి చంపారు. ఆ తరువాత తుర్రేబాజ్ ఖాన్ భౌతికకాయాన్ని నగరానికి తెచ్చి తిరుగుబాటు వీరులను, ప్రజలను మరింత భయభ్రాంతులను చేసేందుకు నగరం నడిబొడ్డున ప్రస్తుత సుల్తాన్ బజార్ పోలీసు స్టేషన్ ఉన్న ప్రాంతంలో బహిరంగంగా వ్రేలాడ దీశారు. ఆ విధంగా ఆ వీరుని భౌతిక్కాయం వారం రోజులపాటు నగరం నడిబొడ్డున గుంజకు వ్రేలాడింది. ఈ విధంగా పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ ముఖ్య అనుచరుడు జాన్ అహమ్మద్ కూడా ఆయనతో పాటు ఆ పోరాటంలోనే మరణించారు.

## రాయలసీమలో రగిలిన పోరాటం

ఈ పోరాట ప్రకంపనలు హైదరాబాదు వరకు పరిమితం కాలేదు. పౌరుషాల పోతుగడ్డగా ఖ్యాతిగాంచిన రాయలసీమకు కూడా పాకాయి. ఆ సమయంలో కడపజిల్లా ఎల్లంపేట నివాసి షేక్ పీర్ సాహెబ్ తిరుగుబాటుకు సిద్ధయయ్యారు.

1857 ఆగస్టు 28న కడపలోని కంటోన్మెంటులోని భారతీయ సైనిక అధికారులను, సైనికులను తిరగబడమని ఆయన ప్రోత్సహించారు. పుట్టుకతో అంధుడైన పీర్ సాహెబ్

పోరుబాటను ఎంచుకోవడమే కాకుండా మొహర్రం పండగ సందర్భంగా తెల్లవారి పాలన తప్పక అంతరిస్తుందని ఎంతో ఆత్మవిశ్వాసంతో ప్రకటించారు. ఈ రకంగా తెలుగుగడ్డ మీద అక్కడక్కడా సాగిన తిరుగుబాట్లకు మొహర్రం పండుగ రోజును నిర్దేశిత సమయంగా నిర్ణయించడం కాకతాళీయమా? లేక మొత్తం మీద ఓ పథకం ప్రకారంగా తిరుగుబాట్లు సాగాయా? అను విషయం చాలా ఆసక్తిదాయకం. ఈ నిర్ణయానికి అనుగుణంగా స్వదేశీ సైనికులను ఆకట్టుకుని తిరుగుబాటుకు షేక్ పీర్ సాహెబ్ ముమ్మరంగా సన్నాహాలు ఆరంభించారు. ఈ పథకం పూర్తిగా అమలులోకి రాకముందే, ఆయన చర్యలను పసికట్టిన బ్రిటీష్ సైనికాధికారులు పీర్ సాహెబ్‌ను అరెస్టుచేసి, విచారణ జరిపి 10 సంవత్సరాల జైలుశిక్ష విధించగా, తిరునల్వేలి ఖైదులో షేక్ పీర్ సాహెబ్ జీవితం ముగిసింది.

ఈ ప్రయత్నాలలో భాగంగా మహమ్మదీయ న్యాయశాస్త్ర అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మౌల్వీ సయ్యద్ అజీజ్ హుస్సేన్ ఇంటింటికి తిరిగి ఆహారపదార్థాలు, డబ్బు సేకరించారు. తుపాకులకు పూసే గ్రీసులో పంది, ఆవు కొవ్వు ఉంటుందన్న విషయం ప్రచారం చేసి సైనికులను రెచ్చగొట్టారు. ఫలితంగా కంపెనీ సైన్యాధికారులు ఆయనను అరెస్టు చేసి, ఆయన కార్యకలాపాలను రాజద్రోహ చర్యలుగా ప్రకటించి, పది సంవత్సరాల జైలు శిక్ష విధించి ఆయనను కూడా తిరునల్వేలి జైలులో నిర్బంధించారు.

## ప్రజ్వరిల్లిన కృష్ణా-గుంటూరు గోదావరి సీమలు

నిజాం గడ్డ మీద తిరుబాటు ప్రకటించినవారు, సాహసోపేతంగా నిజాంకు, ఆంగ్లేయులకు హెచ్చరికలు చేసిన యోధులు, ఉత్తరాదిలో జరిగిన తిరుగుబాటులలో పాల్గొన్న వారు స్వగ్రామాలకు, స్వంత స్థలాలకు తిరిగివచ్చి అక్కడి సాహసాలను వర్ణిస్తూ కథలుగా చెప్పడంతో స్థానికులైన సాహసులు అక్కడక్కడా ఆంగ్లేయుల మీద తిరగబడ్డారు. ఈ తిరుగుబాట్లలో ముస్లిం యోధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

1857 జూలై మాసంలో మచిలీపట్నంలోని సిపాయిలు పెరేడ్ జరుపు మైదానం ఎదురుగా ఆకుపచ్చని పతాకాన్ని రహస్యంగా ఎగుర వేశారు. **ఆంగ్లేయులను నరికి వేయండి** అంటూ హిందూస్థానిలో నినాదాలు రాసిన ప్లకార్డు కూడా ఆ జెండా కర్రకు కట్టి ఉంది. ఈ దృశ్యం ఆంగ్లేయాధికారులలో తీవ్ర కలవరానికి కారణమైంది. ఆ చర్యకు పాల్పడిన వారిని పట్టుకున్నట్టయితే 500 రూపాయాల బహుమానం ఇస్తామని కూడా ప్రకటించారు. ఆంగ్ల అధికారులు ఎంత ప్రయత్నించిన ఆ దృశ్యాన్ని రూపొందించిన సాహసుల ఆచూకిని ఏ మాత్రం కనిపెట్టలేకపోయారు. (The Freedom Struggle in Andhra Pradesh (Andhra), Volumes I(1800-1905 AD), Govt. of AP, Hyderabad, 1997, Page. 147)

1857 నవంబరు 7న కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలోని ప్రభుత్వ కచేరి మీద దాడి జరిగింది. ఆయుధాలు చేపట్టిన నాలుగు వందల మంది రోహిల్లాలు కచేరి ఆవరణలోకి దూసుకొచ్చారు. ఆ సమయంలో ఈస్ట్ ఇండియా కంపెనీ సైనికుల ప్రతిఘటన అంతగా లేకపోవడంతో కోశాగారంలోని నగదును, ఆయుధాగారంలోని ఆయుధాలను తిరుగుబాటు యోధులు స్వంతం చేసుకున్నారు. ఈ సాహసకృత్యంలో హిందూ-ముస్లిం యోధులు పాల్గొన్నారు. ఈ ఆకస్మిక దాడికి ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యాధికారులు హడలిపోయారు.

1857 ఆగస్టు 21న ప్రథమస్వాతంత్ర్య సమరయోధుడు రహీం బేగ్ ను ఆంగ్లేయ అధికారులు అరెస్టు చేశారు. మొహరం పండుగ సందర్భంగా రహీం బేగ్ తిరుగుబాటుకు ప్రయత్నాలు ఆరంభించారు. ఆ రహస్యం కాస్తా బయటపడటంతో బేగ్‌ను ఆయన సహచరులు ఖాజీ మున్‌దార్‌దార్ అలీ, హుసైన్ బేగ్, షబిబ్ బేగ్, మీరా హుస్సేన్, సిలార్ ఖాన్, మీర్ లుబ్బా ఖాన్, మీర్ వజీర్ అలీ, గాలిబ్ బేగ్, ముస్తాబ్ సాహెబ్, ఖాద్ ముహమ్మద్ అలీ ఖాన్ అలియాస్ దాదా సాహెబ్ తదితరులను అరెస్టు చేశారు.

ఈ తిరుగుబాటును ప్రస్తావిస్తూ ఆగస్టు 22న రాజమండ్రిలోని ఆంగ్ల అధికారి మద్రాసులోని ప్రధానకార్యదర్శికి రాసిన లేఖలో **భారీ కుట్రను మొగ్గలోనే తుంచగలిగాం** అని చెప్పుకున్నాడు. **ఈ తిరుగుబాటు కేవలం రాజమండ్రి వరకు పరిమితం కాలేదని, మచిలీపట్నం, గుంటూరు జిల్లాలను కూడా కలుపుకుని ప్రజలను రెచ్చగొట్టి ఒకేసారి తెల్లవారి మీద తిరగబడేందుకు పెద్ద వ్యూహం పన్నారని, ముసల్మాన్లు ఇందులో ప్రధాన పాత్ర వహించారని** ఆ అధికారి వివరించాడు. (The Freedom Struggle in Andhra Pradesh (Andhra), Volumes I(1800-1905 AD), Govt. of AP, Hyderabad, 1997, Page. 60, 156-157)

ఈ వార్తతో గుండెలదిరిన ఆంగ్లేయాధికారులు ముంచుకు వచ్చిన ముప్పు కొద్దిలో తప్పిపోయిందని సంతోషిస్తూ అప్రమత్తులై ఉండాల్సిందిగా ఇతర ప్రాంతాల అధికారులకు ఆఘమేఘాల మీద వర్తమానం పంపారు. అనుమానితుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తూ అరెస్టులను ముమ్మరంచేశారు. ఈ అరెస్టులలో 14 సంవత్సరాల సయ్యద్ లాల్ అను బాలుగు ఏడు సంవత్సరాల కారాగార శిక్షకు గురయ్యారు. ఈ విధంగా గుంటూరు, కృష్ణా గోదావరి మండలాలలో ప్రథమ స్వాతంత్ర్యసంగ్రామం ప్రభావం తీవ్రంగా కన్పించింది. (1857, యం.వి.ఆర్ శాస్త్రి, ఆంధ్రభూమి దినపత్రిక, 2007, జనవరి14)

## ఉత్తర హిందూస్థానం వెళ్ళిన యువకులు

స్వస్థానంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సాగిన పోరాటాలలో పాల్గొనడమే కాకుండా, ఉత్తర హిందూస్థానంలో స్వదేశీ యోధులు సాధిస్తున్న విజయాల గురించి విన్న

1805 నాటి బ్రిటీష్ రెసిడెన్సీ చిత్రం. ప్రస్తుతం అది తన రూపురేఖలను మార్చుకుని మనకు నిజాం మహిళా కళాశాలగా హైదరాబాదు కోటి సెంటర్‌లో దర్శనమిస్తుంది.



రాయలసీమ యువకులు ఉత్తర హిందూస్థానం వెళ్ళారు. ఈ మేరకు రాయలసీమ ప్రాంతం నుండి పలువురు ముస్లింలు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడుతున్న తిరుగుబాటు దారులతో కలసి ప్రథమ స్వాతంత్ర్యసంగ్రామంలో పాల్గొనేందుకు ఉత్తర హిందుస్థాన్‌కు వలస వెళ్లారని అప్పటి కడప మెజిస్ట్రేట్ 1857 జూన్ 20న మద్రాస్ గవర్నర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. (కడపజిల్లా స్వాతంత్ర్యోద్యమంలో కొన్ని ముఖ్య ఘట్టాలు, వ్యాసకర్త : డాక్టర్ యం.నజీర్ అహమద్, ప్రచురణః స్వతంత్ర భారత స్వర్ణోత్సవ సావనీర్–రాయలసీమలో స్వాతంత్ర్యోద్యమం, స్వతంత్ర భారత స్వర్ణోత్సవ సావనీరు కమిటి, అనంతపురం, 1998, పేజి.55 **మరియు** The Freedom Struggle in Andhra Pradesh (Andhra), Volumes I (1800-1905 AD), Govt. of AP, Hyderabad, 1997, Page.147) ఈ విధంగా 1857 నాటి పోరాటంలో బ్రిటీషర్ల మీద తిరగబడిన జనులు, జవానులు చాలా మంది ఉన్నారు. ఆ సాహసుల చరిత్రలు పూర్తిగా నమోదుకు నోచుకోకపోవడంతో ఆ వివరాలు ప్రలకు అందకుండా పోయాయి. చరిత్ర పుటలలో మరుగున పడిపోయాయి.

## ప్రథమ స్వాతంత్ర్యసంగ్రామం తరువాత :

1857 చివరికల్లా ఢిల్లీ కేంద్రంగా సాగుతున్న ప్రథమ స్వాతంత్ర్యసమరం విఫలమైనప్పటికీ, ఉత్తర భారతదేశంలో బేగం హజరత్ మహల్, మౌల్వీ అహమ్మదుల్లా షా లాంటి ప్రముఖ నేతల నాయకత్వంలో, లక్నో, కాన్పూరు, ఝాన్సీ తదితర ప్రాంతాలలో ఎగురుతున్న తిరుగుబాటు బావుటాలను ప్రేరణగా తీసుకుని దేశంలోని పలు ప్రాంతాలలో తిరుగుబాటు ఛాయలు ఇంకా కొనసాగుతూనే వచ్చాయి.

ఆ ఛాయలు నైజాం గడ్డ మీద కూడా కన్పించాయి. తిరుగుబాటు విఫలమైనా, స్వదేశీ యోధుల మీద ఆంగ్లేయులది పైచేయిగా కన్పించినా స్వేచ్ఛా-స్వాతంత్ర్య కాంక్షాపరులైన ప్రజలు మాత్రం పోరుబాట వీడలేదు. ఆంగ్లేయులను ప్రధాన శత్రువుగా పరిగణించిన పోరాటయోధులు తమ ఆయుధాలను తొలుత బ్రిటీషర్ల మీద ప్రయోగించి, ఆ తరువాత ఆంగ్లేయుల అడుగులకు మడుగులొత్తుతూ ప్రజల అభిమతానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న స్వదేశీ సంస్థానాధీశుల మీద కూడా చివరకు ఆగ్రహం వ్యక్తంచేశారు.

## అభినందన పత్రం కల్గించిన ఆగ్రహం

ప్రథమ స్వాతంత్ర్యసంగ్రామంలో ఆంగ్లేయుల పక్షంగా వ్యవహరించి తిరుగుబాటు జ్వాలల నుండి ఈస్ట్ఇండియా కంపెనీ అధికారులను రక్షించి బ్రిటీషర్ల మరికొంత కాలం ఆంగ్లేయుల పాలనకు ప్రాణం పోసిన నైజాం నవాబుకు బ్రిటీషర్లు అందచేసిన బిరుదులు, బహుమానాలు కూడా ప్రజలలో ఆగ్రహానికి కారణమయ్యాయి. 1859లో బ్రిటీష్ రెసిడెంట్ కలకత్తాకు వెళ్ళి నిజాం నవాబు కోసం ప్రశంసాపత్రం (ఖతీరా) తెచ్చాడు. ఈ వార్త తెలిసిన ప్రజలు మండిపడ్డారు. బ్రిటీష్ రెసిడెంట్ తెచ్చిన ప్రశంసాపత్రం అభినందనపత్రం కాదని అది అవమానకర పత్రమని ప్రజలు, ప్రధానంగా పోరాటయోధులైన స్వదేశీ సిపాయీలు భావించారు. ఆంగ్లేయుల పట్ల పూర్తి విధేయత చూపుతూ నిజాం నవాబు ఆంగ్లేయుల అభినందనలను స్వీకరించడాన్ని స్వదేశీ యోధులు ఏమాత్రం జీర్ణం చేసుకోలేకపోయారు.

ఈ విధంగా రెసిడెంట్ తెచ్చిన ప్రశంసాపత్రాన్ని 1859 మార్చి 15న ప్రత్యేకంగా దర్బారు ఏర్పాటు చేసి, నైజాం సంస్థానాధీశునికి అందించాడు. ఈ అభినందన పత్రం విషయం తెలుసుకున్న రోహిల్లా యోధుడు జహంగీర్ ఖాన్ కోపంతో రగిలిపోయాడు. **ఏదైనా చేస్తా లేకుంటే చస్తా**ననుకున్నాడు. నిజాం దేవిడి ముందు కాపుకాశాడు. నైజాం దర్బారులో ప్రశంసాపత్రం ప్రధాన కార్యక్రమం ఆర్భాటంగా ముగిసింది. ఆ ఆనందంలో నిజాం నవాబుతో పాటుగా దర్బారు నుండి దర్పంగా బయటకు వస్తున్న ఆంగ్లేయాధికారి డేవిడ్‌సన్ మీద జహంగీర్ ఖాన్ కార్బన్‌తో దాడి చేశాడు. ఆ తుపాకి గుళ్ళ తాకిడి నుండి డేవిడ్‌సన్ తృటిలో తప్పుకున్నాడు. అయినా పట్టువదలని జంహీంగీర్ ఖాన్ ఆంగ్లేయుడ్ని ఎలాగైనా సంహరించాలన్న లక్ష్యంతో మరుక్షణం అతని మీద కత్తి దూశాడు. ఆలోగా నిజాం నబాబు అనుచరులు అప్రమత్తులై జహంగీర్ ఖాన్ మీద కాల్పులు జరపడంతో ఆ యోధుడు అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు.

ఈ అనూహ్య సంఘటనతో బిత్తరపోయి ప్రాణభయంతో వణికిపోయిన డేవిడ్‌సన్ పక్కనే ఉన్న గదిలోకి పరుగులు తీసి దాక్కున్నాడు. ప్రమాదం పూర్తిగా తప్పిందని రూఢిగా

తెలుసుకున్నాక గాని ఆ ఆంగ్లేయుడు బయటకు రాడానికి సాహసించలేదు. ఈ జహంగీర్ ఖాన్ ఒకనాటి నిజాం దర్బారులో ప్రముఖుడిగా ఖ్యాతిగాంచిన, ఆంగ్లేయుల పెత్తనాన్ని వ్యతిరేకించి నిజాం ఆగ్రహానికి గురైన నూరుల్ ఉమ్రా మనవడు కావటం విశేషం. ఆ కాల్పులలో తీవ్రంగా గాయపడిన జహంగీర్‌ను ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ సంఘటన నిజాం ప్రభుత్వాన్ని కుదిపేయడంతో, ఈ సంఘటన వెనుక కుట్ర దాగుందని భావించి, జహంగీర్ ఖాన్‌ను ఎంతగా వేధించినా, ఈ సంఘటనకు తానొక్కడే కారణమని, మరెవ్వరి ప్రమేయం లేదని ప్రకటించాడు. చివరు బ్రిటీష్ అధికారుల చేతుల్లో చిత్రహింసలకు గురైన జహంగీర్ ఖాన్ 1859 జూన్ మాసంలో చివరిశ్వాస వదిలారు.

ఈ విధంగా ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం తరువాత కూడా నిజాం సంస్థానంలోని ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ప్రజలు అక్కడక్కడా పోరాటాలు సాగించారు. అవకాశం లభించినప్పుడల్లా ప్రజానీకం తమ నిరసన వ్యక్తం చేయగా, సాయుధ సిపాయీలు మాత్రం తమ ఆయుధాలకు పని కల్పించారు. ఈ ప్రయత్నాలలో విఫలమైనప్పటికి తమ చర్యలను మాత్రం ఆపలేదు. తెలంగాణాలోని నారాయణ్ ఖేడ్‌కు చెందిన కుర్దుమియా సాహెబ్, నిర్మల్‌కు చెందిన తిరుగుబాటు నేత రాంజీ గౌడ్ పక్షాన బ్రిటీషు వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. 1860 ఏప్రిల్ 9న, రాంజీ మనుషులతో కలసి, నిర్మల్ వద్ద ఈస్ట్ ఇండియా కంపెనీ బలగాలతో పోరాడుతూ కుర్దుమియా అమరులయ్యారు.

## ఆంగ్లేయుల పట్ల అంతులేని విద్వేషం

ఈస్ట్ ఇండియా కంపెనీ నిజాంకు అందిస్తున్న అభినందనల–ప్రశంసాపత్రాల పరంపరలో భాగంగా 1861 స్టార్ ఆఫ్ ఇండియా అను మరొక బిరుదునిచ్చారు. బ్రిటీష్ రాణి పక్షాన ఈ బిరుదును ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బ్రిటీషు రెసిడెంటు డేవిడ్‌సన్ నిజాం నవాబుకు అందించాడు. ఆ సమయంలో కూడా ప్రజలు తమ అయిష్టతను వెల్లడించారు. ఈ మేరకు ప్రజల ఆగ్రహం ఎంతదూరం వెళ్లిందంటే వారి ఆగ్రహాన్ని–అయిష్టతను కలగలిపి రాసిన ప్రకటనలు హైదరాబాదు నగరంలోని బహిరంగ స్థలాలలో భారీగా వెలిశాయి. పర్షియన్ భాషలో రాసిన ఈ ప్రకటనలు సాలార్ జంగ్, ఆయన ప్రధాన మంత్రి షంషుల్ ఉమ్రా వెళ్ళేదారిలో మాత్రమే కాకుండా వారిరువురు నిత్యం వెళ్ళే మసీదులో కూడా వేలాడదీశారు.

ఆ ప్రకటనల సారాంశం ఈ విధంగా ఉంది:

**బ్రిటీషు ప్రభుత్వం ఇచ్చిన బిరుదును స్వీకరించవలసిందిగా దివాన్ సలహా ఇస్తాడు. కొన్నాళ్ళ తరువాత అరబ్బులను, పఠానులను, రొహిల్లాలను వెళ్ళగొట్టమని కూడా సలహా**

**ఇస్తాడు. అ తర్వాత ముర్షద్ జాదా (రాజకుమారుడు) ఇంటి చుట్టూ కాపలా పెట్టమంటాడు. ఖాజీలను తొలగించి జడ్జీలను నియమించమంటాడు. వినకపోతే గవర్నరు జనరల్ నిజాంను పిలిపించి చెబుతాడు. అప్పటికి వినకపోతే ఈ నిజాంను గద్దె దింపి, అతని కుటుంబంలోని మరొక వ్యక్తిని గద్దెమీద కూర్చోబెడతాడు. కాబట్టి జాగ్రత్త.**

**అమీర్ షంషుల్ ఉమ్రా కూడా ఏమీ మాట్లాడటం లేదు. తనకు ముప్పు వాటిల్లనంత వరకు అతను పట్టించుకోడు. వీరు భోగభాగ్యాలకు వశులైనారు. సర్ఫెఖాస్ పైన, జేబేఖాస్ పైన కూడా సాలార్ జంగ్ అధిపత్యం కావాలంటాడు. అన్నంలో విషం కలిపి పెట్టి నిజాంను చంపడానికి కూడా వెనుదీయడు. దేవిడిలోని దాసదాసీ జనం కూడా దివానుకు లోబడి వుంటారు. ఈ పాపపు బుద్దిని అల్లా పోగొట్టుగాక ! ఇస్లాం మతం మీద నిజాములకు విశ్వాసం కలుగుగాక...ధాన్యం ధరలు తగ్గించమని నిజాం ఆజ్ఞాపించినప్పటికి దివాన్ పట్టించుకోలేదు. ప్రజలు బాధలు పడుతుతూ ఎన్నోవిధాల నలిగిపోతున్నారు. ప్రజలు చెలరేగే పరిస్థితులు అనతి కాలంలోనే ఏర్పడుతాయి. కాబట్టి నిజాం మా వినతిని పాటించి బిరుదును త్యజించుగాక.** (హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర : పేజి. 54-55)

ఈ ప్రకటన బ్రిటీష్‌వారంటే ప్రజలలో ఎంతటి నిరసన భావముందో, వారికి సహకరించే వారు ఎంతటివారైనా విమర్శించే సాహసానికి వారు తెగించారో వెల్లడి చేస్తుంది. ఈ రకమైన ప్రచారం, ప్రకటనలు ఆనాడు ప్రజలలో ఆంగ్లేయుల పట్ల చులకన భావం, ఆంగ్లేయుల వెంట సాగుతున్న సంస్థానాధీశుల పట్ల ఆగ్రహం బాగా పెరిగినా స్వదేశీ ప్రభువులకు మాత్రం ఆంగ్లేయుల పెత్తనం నుండి విముక్తం కోరుతూ సలహాలు ఇవ్వడం వరకు మాత్రమే పరిమితమై తమ ఆకాంక్షలను ప్రజలు బలంగా వ్యక్తం చేయసాగారు.

## ఆంగ్లేయుల నెయ్యం వదలుకొమ్మని నిజాంకు సలహా

ఆంగ్లేయుల పట్ల అనుకూలత వ్యక్తం చేస్తున్న నిజాం నవాబును ఏవిధంగానైనా దారి మళ్ళించాలని, బ్రిటీషర్ల పెత్తనం నుండి మాతృభూమికి విముక్తి కలిగించాలని పట్టుదలతో ఉన్న ప్రజలు నిజాం నవాబుకు నచ్చచెప్పాలనుకున్నారు. అయితే పిల్లి మెడలో గంటకట్టే వారెవరన్నది సమస్యగా మారింది. ఆంగ్లేయులను మంచి మిత్రులుగా పరిగణిస్తూ వారి పెత్తనాన్ని కూడా చూసిచూడకుండా భరిస్తున్న నిజాంకు ఎవరు నచ్చ చెప్పగలరు? అంతటి దుస్సాహసం చేయడమంటే కోరి ప్రాణాల మీదకు కొనితెచ్చుకోవడమే కనుక ఏంచేయాలన్న ఆలోచనలు సాగాయి.

ఆ సమయంలో ఓ నలుగురు సాహసికులు ముందుకు వచ్చారు. ఆ నలుగురిలో బాజీ ఖాన్, మౌల్వీ ఇబ్రహీంలు కాక అజం సింగ్, మిర్ధా సింగ్‌లు ఉన్నారు. ఈ నలుగురు

యోధులు తమ ప్రాణాలను కూడా లెక్కచేయక నైజాం సంస్థానాధీశుని వద్దకు వెళ్ళి ఆయన మనస్సు మార్చేందుకు నిర్ణయించుకున్నారు, పులిబోనులో ప్రవేశించ సాహసించారు. నిజాం సంస్థానాధీశునికి నచ్చచెప్పేందుకు శతవిధాల ప్రయత్నం చేశారు. ఆ విఫల ప్రయత్నంలో ఆ నలుగురు ఈ క్రింది విధంగా నిజాం నవాబుకు నచ్చజెప్పారు.

**వందలాది మైళ్ళ దూరం నుండి సముద్రం మీద వచ్చిన బ్రిటీషు వారి సంఖ్య ఎంత? మీరు వారికెందుకు దాసోహమనాలి? ఎదురు తిరగండి. దేశ ప్రజలందరు మీకు అండగా వుంటారు. పరాయి పెత్తనం వద్దు. స్వతంత్రంగా వ్యవహరించండి! లక్షమంది భారతీయలు ఒక్కొక్క ఇంగ్లీషు వాడిని తన్నితే చాలు. అసువులు బాసిపోతారు. వారు చచ్చిన జాడ తెలుపడానికి కూడా ఎవ్వరూ ఉండరు. ధైర్యం చేయండి. దేశమాత పిలుపు వినండి. ఆమెను పరాధీనం చేయకండి!** (హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, వెల్దుర్తి మాణిక్యరావు, స్వాతంత్ర్యోద్యమం చరిత్ర పరిశోధనా సంస్థ, హైదారాబాద్, 1984 పేజి.49)

ఈ విధంగా నిజాం సంస్థానంలో మాత్రమే కాకుండా ఆంధ్ర ప్రాంతంలో కూడా ఆంగ్లేయాధికారుల పెత్తనం మీద ప్రజల నుండి రుసరుసలు, నిరసనలు విన్పించాయి. వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఏమాత్రం వ్యతిరేకత కన్పించినా దారుణంగా వ్యవహరిస్తూ, అధికారులు అనేక విధాల అణిచివేతకు పాల్పడుతున్నా, బ్రిటీషర్ల భయానక చర్యలకు, క్రూరహింసలకు ఏమాత్రం భయపడకుండా స్వేచ్ఛను ఆకాంక్షిస్తున్న యోధులు కొందరు వ్యక్తిగతంగా కూడా తమ వ్యతిరేకతను వివిధ మార్గాలలో వ్యక్తంచేశారు.

## భారత జాతీయ కాంగ్రెస్ పూర్వరంగం

ప్రథమ స్వాతంత్ర్య సమరం ద్వారా భారతీయులు అనుకూల ఫలితాలు సాధించు కోకున్నా, స్వాతంత్ర్య సంగ్రామ యోధుల త్యాగాలు, సాహసోపేత పోరాటాలు మాత్రం సుదీర్ఘ భవిష్యత్తు ఉద్యమాలకు ప్రజలను ఉద్యుక్తులను చేశాయి. ఆనాటి స్ఫూర్తి నుండి ప్రజలలో రగులుకున్న స్వాతంత్ర్యేచ్ఛ నివురు కప్పిన నిప్పులా సర్వత్రా విస్తరించ సాగింది. ఈ రకంగా భారతీయులలో ఆంగ్లేయుల పట్ల వ్యతిరేకత వ్యక్తం అవుతున్నా, బ్రిటీషు ప్రభుత్వం మాత్రం పూర్తిస్థాయిలో భారతదేశంలో నిలదొక్కుకుంది. ఆ స్థితిలో ఆంగ్లేయులను ఎదుర్కొనడం ఇక కరవాలం ద్వారా సాధ్యంకాదన్న భావన బలపడసాగింది. ఆంగ్లేయ పాలకుల మీద భౌతికంగా కాకుండా కలాలను కదం తొక్కిస్తూ బౌద్ధిక పోరాటాలను సాగించాలనుకున్నారు. ఆ వాతావరణం నుండి ప్రజాసంఘాలు పుట్టుకొచ్చాయి.

బౌద్ధిక పోరాటాలు లక్ష్యంగా పలు విద్యా కేంద్రాల ఉనికిలోకి వచ్చాయి. షామిలి, దేవ్‌బంద్ (యుపి) లాంటి ప్రాంతాలలో ఏర్పాటయిన ప్రముఖ విద్యాకేంద్రాలలో ధార్మిక

విద్యతోపాటుగా బ్రిటిష్ వ్యతిరేకతను కూడా విద్యార్థులకు నూరిపోశారు. స్వేచ్ఛా-స్వాతంత్ర్యం కోసం హిందూ-ముస్లింలు కలసి ఐక్య పోరాటలకు సిద్ధమయ్యే తీరులో విద్యార్థులను తయారు చేశారు. ఆ విద్యాలయాలకు తెలుగు గడ్డ నుండి పలువురు విద్యార్థులు వెళ్ళి ధార్మిక విద్యతోపాటుగా బ్రిటీష్ వ్యతిరేక భావలను పుణికి పుచ్చుకుని వచ్చారు.

## భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం

ఆ సమయంలో బ్రిటీషర్లకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు పలు సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య, విద్యా సంస్థలు, ప్రజా సంఘాలు, పత్రికలు రంగం మీదకు వచ్చాయి. ఆ సంస్థల, సంఘసంస్కర్తల, చైతన్య రథసారథుల కృషి వలన ఆధునిక విద్య మీద శ్రద్ధ, ఆంగ్లభాషను నేర్చుకోవడం పట్ల ఆసక్తి, ప్రసిద్ధులు రాసిన గ్రంథాలను అధ్యయనం చేయడం ద్వారా ప్రపంచ పోకడలను గ్రహించిన ప్రజలకు బ్రిటీషర్ల నిరంకుశ పెత్తనం ఇక ఏమాత్రం మింగుడు పడలేదు. ఆ కారణంగా తొలుత విద్యావంతులైన ప్రముఖులు ప్రధానంగా న్యాయవాదులు, అధ్యాపకులు, వివిధ వృత్తులలోని నిపుణులు తమ సమస్యల పరిష్కారానికి కృషి సల్పేందుకు స్వయంగా ముందుకు కదిలారు. ఆ తరువాత తమలోనున్న సహజ స్వేచ్ఛా-స్వాతంత్ర్య కాంక్షతో విద్యావంతుల మార్గాన సామాన్య జన సమూహాలు కూడా పెద్ద ఎత్తున కదిలాయి. ఆ కదలిక ఫలితంగా 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించింది. జాతీయ కాంగ్రెస్ తొలి సమావేశానికి మద్రాసు ప్రెసిడెన్సీ ప్రాంతం నుండి పలువురు ఆంధ్రులు హాజరయ్యారు. భారతీయుల ఆకాంక్షల సాధన కోసం ఉనికిలోని వచ్చిన భారత జాతీయ కాంగ్రెస్ పట్ల తెలుగు బిడ్డలు సానుకూలంగా స్పందించారు. భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించారు. ఆ తరువాత జరిగిన కాంగ్రెస్ సమావేశాలలో, ప్రభుత్వ నిర్బంధాలను తట్టుకుంటూ పాల్గొన్నారు.

1887 సంవత్సరంలో మద్రాసు నగరంలో జస్టిస్ బద్రుద్దీన్ తయ్యాబ్జీ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశానికి తెలుగునాట నుండి హుస్సేన్ బేగ్, మీర్జా హుస్సేన్ బేగ్, సయ్యద్ సాహెబ్, ఖాదర్ ఖాన్, ఖాశిం మియ్యా సాహెబ్, ఆ తరువాత 1889లో బొంబాయి నగరంలో జరిగిన సమావేశానికి షేక్ బురానుద్దీన్ సాహెబ్, ఖలీల్ ఖాన్, నవాబ్ అలీ ఖాన్, అహమ్మద్ సాహెబ్ తదితరులు హాజరయ్యారు.

ఈ వాతావరణం నైజాం సంస్థానానికి రాజధాని అయినటువంటి హైదరాబాదు నగరంలో కూడా కన్పించింది. నైజాం సంస్థానాధీశుడు ఆంగ్లేయులతో నెయ్యం నెరపుతున్నప్పటికి జాతీయ భావాలు గల మేధావులు సాగించిన నిరంతర కృషి ఫలితంగా ప్రజానీకంలో జాతీయ పునర్వికాసోద్యమం బీజాలు బలంగా పడ్డాయి.

## హైదరాబాద్ రాష్ట్రంలో జాతీయ భావచైతన్యం

బ్రిటీషర్ల పెత్తనాన్ని సహించక పలుమార్లు వ్యతిరేక చర్యలకు పాల్పడిన హైదరాబాద్ ప్రజలలో 1883నాటి **చాందా రైల్వే స్కీమ్** సంఘటన అటు నిజాం ఇటు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ప్రజాజాగృతిని మరింత పటిష్టం చేసింది. ఈ రైల్వే పథకం నైజాం సంస్థానానికి నష్టదాయకం కనుక ఆ పథకాన్ని అమలుపర్చరాదని హైదరాబాదు ప్రముఖులు అభ్యంతరం చెప్పారు. ఈ సందర్భంగా **చాందా రైల్వే స్కీమ్**ను వ్యతిరేకిస్తూ ఏర్పడిన 'The Committe to Consider Chanda Railway Scheme' కు ముల్లా అబ్దుల్ ఖయ్యూం, సరోజినీ నాయుడు తండ్రి డాక్టర్ అఘోరనాథ్ చటోపాధ్యాయ నాయకత్వం వహించారు.

ఈ ఇరువురి ప్రయత్నాల ఫలితంగా ప్రజలలో జాగృతి ఏర్పడింది. ప్రభుత్వ నిర్ణయాలు ఆయా ప్రాంతాలకు నష్టదాయకమైతే పాలకులను ప్రశ్నించే స్థాయికి ప్రజలు ఎదిగారు. ఆ కారణంగా నిజాం నవాబు ఆగ్రహానికి గురైన అఘోరనాథ్ రెండు సంవత్సరాల ప్రవాసశిక్షకు గురికాగా, అబ్దుల్ ఖయ్యూం హైదరాబాదు నగరం వదలి మద్రాసులో తల దాచుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వం తీసుకున్న ఈ కఠినచర్యల వలన 'The Chanda Railway Scheme' విషయంలో నాయకుల ప్రయత్నాలు విఫలమైనా, పాలకుల ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు ప్రజలు తలవంచాల్సిన అవసరం లేదన్న ప్రజాభిప్రాయాన్ని బలంగా కూడగట్టి, ప్రజలలో చైతన్యం తీసుకురావడంలో నాయకుల కృషి ఎంతో తోడ్పడింది.

### అంకురించిన కాంగ్రెస్ అనుకూలత

ఈ రకంగా ఏర్పడిన ప్రజాజాగృతి, చైతన్యం ఫలితంగా సంస్థానాధీశులను, ప్రభుత్వాన్ని నిలదీయగలగడం అసాధారణ విషయం కాదని ప్రజలు అర్థం చేసుకున్నారు. ఆ కారణంగా నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ నగరవాసుల నుండి కూడా భారత జాతీయ కాంగ్రెస్ పట్ల అనుకూలత వ్యక్తమైంది. తొలిసారిగా హైదరాబాద్ ప్రాంతం నుండి ఐదుగురు ముస్లిం ప్రముఖులు భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరారు.

ఈ విధంగా తొలుతగా నిజాం నవాబు ప్రభుత్వంలో ఉన్నతాధికారిగా పనిచేస్తున్న ముల్లా అబ్దుల్ ఖయ్యూం కాంగ్రెస్‌లో సభ్యత్వం స్వీకరించారు. ఆనాడు ముల్లా అబ్దుల్ ఖయ్యూంతోపాటుగా డాక్టర్ సబీ ఖాన్, హాజీ సజన్ లాల్, ఇస్మాయిల్ సాహెబ్‌లు భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనను హృదయపూర్వకంగా ఆహ్వానించారు. ఈ ప్రముఖులంతా జాతీయ కాంగ్రెస్‌లో సభ్యత్వం స్వీకరించడమే కాకుండా ముస్లిములంతా భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరాలని, కార్యక్రమాలలో పాల్గొనాలని బహిరంగంగా పిలుపు నిచ్చారు.

ఆ దిశగా ముల్లా అబ్దుల్ ఖయ్యూం లాంటి ప్రముఖులు మరింత ముందుకు వెళ్ళారు. ప్రముఖ ముస్లిం మేధావి సర్ సయ్యద్ అహమ్మద్ భారత జాతీయ కాంగ్రెస్‌ను విమర్శిస్తూ, ముస్లింలు భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరడం వారికి లాభదాయకం కాదని సాగిస్తున్న వాదనకు సమాధానంగా భారత జాతీయ కాంగ్రెస్ అభిప్రాయాలను బలపర్చుతూ పండిత అయోధ్యనాథ్ కుంజ్రూ A Sprited Defence of Congress శీర్షికతో ప్రచురించిన కరపత్రాన్ని అలహాబాదు నుండి రహస్యంగా తెప్పించి, ప్రచురించి హైదరాబాదు సంస్థానంలో విరివిగా పంచి పెట్టారు.

ఈ సాహసోపేత కార్యక్రమంలో ఆయనకు మరొక ఉద్యోగి షర్ఫుల్ హఖ్ తోడ్పాటునిచ్చారు. ఈ ప్రభుత్వ వ్యతిరేక చర్యకు ఆగ్రహించిన నిజాం ప్రభుత్వం ముల్లా అబ్దుల్ ఖయ్యూంకు నోటీసు జారీ చేసింది. నిజాం ప్రభువు చర్యలకు ఏమాత్రం వెరవకుండా 1906లో కన్నుమూసేంత వరకు జాతీయ కాంగ్రెస్‌కు అనుకూలంగా అబ్దుల్ ఖయ్యూం ప్రచారం సాగించారు. ముల్లా అబ్దుల్ ఖయ్యూం లాంటి నాయకుల నిరంతర కృషి ఫలితంగా ఇటు హైదరాబాదు రాష్ట్రంలో మాత్రమే కాకుండా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రజలలో కూడా జాతీయ భావాలు పొటమరించాయి. ఆ భావాల ప్రభావం వలన జాతీయోద్యమంలో భాగంగా రంగం మీదకొచ్చిన ప్రతి పోరాటరూపంలో ఇతర సామాజిక జనసముదాయాల ప్రజలతోపాటు ముస్లిం జనసముదాయాలు కూడా ఆయా కార్యక్రమాలలో తమలోని చైతన్య స్థాయిని బట్టి, స్థానిక రాజకీయ వాతావరణాన్ని బట్టి భాగస్వామం వహించాయి.

## వ్యతిరేక ప్రచారాన్ని ఎదుర్కొన్న పత్రికలు

భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడినప్పుడు హైదరాబాదులోని నైజాం సంస్థానంలో అత్యున్నత పదవులలో ఉన్న కొందరు ముస్లిం ప్రముఖులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వ్యవహరించారు. ముస్లింలను భారత జాతీయ కాంగ్రెస్‌కు దూరంగా ఉంచేందుకు శత విధాల ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో పలు వాదాలను, వివాదాలను, చర్చలను ముందుకు తెచ్చారు. అటువంటి ప్రముఖుల మీద అలీఘర్ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ ప్రభావం ఉండేది.

ఆ వ్యతిరేకతను ముల్లా అబ్దుల్ ఖయ్యూం లాంటి ప్రముఖులు సమర్ధవంతంగా ఎదుర్కొన్నారు. అక్బర్ అలీ సంపాదకత్వాన వెలువడిన **నహీఫా** పత్రిక ద్వారా అబ్దుల్ ఖయ్యూం కాంగ్రెస్ వ్యతిరేకుల విమర్శకులకు ఘాటుగా, హేతుబద్ధంగా సమాధానాలిచ్చారు. ఆయన **నఫీరే దక్కన్** అను మరో పత్రికలో కూడా భారత జాతీయ కాంగ్రెస్‌కు మద్దతు పలుకుతూ, ముస్లింలను కాంగ్రెస్‌లో చేరమని హితవు పలుకుతూ వ్యాసాలు రాశారు.



1885లో ఏర్పడిన భారత జాతీయ కాంగ్రెస్ తొలి సమావేశం

ప్రముఖ పాత్రికేయులు మొహిబ్ హుస్సేన్ తన పత్రిక **ము-అల్లం-షఫిక్** ద్వారా, సయ్యద్ ఖలీల్ తన పత్రిక **హజార్ దాస్తాన్** ద్వారా ఆ కాంగ్రెస్ వ్యతిరేకతను తిప్పికొట్టారు. ఈ మేరకు సాగిన భారత జాతీయ కాంగ్రెస్ అనుకూల ప్రచార కార్యకలాపాలలో డాక్టర్ నబీ ఖాన్, ఇస్మాయిల్ లాంటి ప్రముఖులు ప్రధానంగా భాగస్వాములయ్యారు. ఈ నాయకుల కృషి వలన ఆనాడు ముస్లిం జనసమూహాలలో భారత జాతీయ కాంగ్రెస్ పట్ల సానుకూలత వ్యక్తంకావడమే కాకుండా, జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన ప్రతి జాతీయ స్థాయి సాంవత్సరిక సమావేశానికి ముస్లింల హాజరు గణనీయంగా పెరిగింది. ఈ పరిణామాల ఫలితంగా భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో ఉధృతంగా కాకపోయినా సాధారణ రీతిలో ప్రతిస్పందన కన్పించటం ఆరంభమైంది.

## బెంగాల్ విభజనకు ప్రతిఘటన

భారత జాతీయ కాంగ్రెస్ లాంటి ప్రధాన సంస్థలు తగిన విధంగా కృషి జరుపుతున్నప్పటికీ ప్రజలలో రాజకీయ చైతన్యం అనుకున్నంతగా రాజుకోలేదు. అతికొద్ది మంది విద్యావంతులు మాత్రమే తొలుతగా జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించారు. ఆ విధంగా ప్రభావితులైన నేతల కృషి, ఆ తదుపరి పరిణామాల ఫలితంగా జాతీయోద్యమం 1900 తరువాత మాత్రమే ఉనికిని సంతరించుకుని బాగా ఊపందుకుంది.

1906లో జరిగిన బెంగాల్ విభజన దేశంలోని జనులందర్ని మేల్కొనజేసింది. విభజనకు వ్యతిరేకంగా ప్రారంభమైన నిరసనోద్యమానికి తెలుగు ప్రజల మద్దతు లభించింది.

ఆ సందర్భంగా ప్రచారంలోకి వచ్చిన **వందేమాతరం** గీతం స్ఫూర్తిగా ప్రారంభమైన వందేమాతరం ఉద్యమం 1907లో బిపిన్ చంద్ర పాల్ పర్యటనతో ఆంధ్రదేశాన్ని పూర్తిగా చుట్టేసింది. జాతి, మత, ప్రాంతాల విభేదాలు మరచి వందేమాతరం గీతాన్ని ఆలాపిస్తూ ప్రజలు ముందుకురికారు. వందేమాతరం ఉద్యమంతో రగులుకున్న సహాయనిరాకరణ ఉద్యమం రాష్ట్రంలో పలు చారిత్రక సంఘటనలకు కారణమైంది. ఈ సహాయనిరాకరణ మరింత పరిణితి చెంది కొంతకాలానికి శాసనోల్లంఘనగా రూపు దిద్దుకుంది.

ఆనాడు విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలను బహిష్కరించారు. విదేశీ వస్తువులను తిరస్కరించారు. స్వదేశీ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించారు. స్వయంగా పారిశ్రామిక ఉత్పత్తులను చేపట్టడానికి జపాన్ తదితర దేశాలకు తెలుగు గడ్డ నుండి యువకులు తరలి వెళ్ళారు. స్వదేశీ ఉద్యమాన్ని ప్రోత్సహించేందుకు అవసరమగు నిధుల సేకరణకు రాష్ట్రంలో ప్రయత్నాలు జరిగాయి. మద్రాసులో స్వదేశీ ఉద్యమ వ్యాప్తికోసం **దీపావళి జాతీయ నిధి** ఏర్పాటు చేశారు. ఆ నిధికి సయ్యద్ మహమూద్, న్యాయపతి సుబ్బారావులు ధర్మకర్తలుగా వ్యవహరించారు. (నా జీవిత కథ–నవ్యాంధ్రము, అయ్యదేవర కాళేశ్వరరావు, ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ, 1959, పేజి.30)

బెంగాల్ విభజన సంఘటన ఆంధ్రప్రదేశ్‌లో పెనుగాలులకు కారణం కాకపోయినా ఉద్యమదిశగా అనుకూల కదలికలకు కారణమైంది. ఆ కదలికల ఫలితంగా ఆ తరువాత ఆరంభమైన హోంరూల్ ఉద్యమంలో ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములయ్యారు.

## హోంరూల్ ఉద్యమం

బెంగాల్ విభజన ప్రతిఘటనోద్యమం తరువాత డాక్టర్ అనీబిసెంట్ నేతృత్వంలో ప్రారంభమైన హోంరూల్ ఉద్యమానికి ఆంధ్రావని ఘనంగా స్వాగతం పలికింది. 1916 సెప్టెంబరు ఒకటి నుండి ఆరంభమైన హోంరూల్ ఉద్యమం 1917 వరకు సాగింది. జాతీయోద్యమంలో భాగంగా సాగిన అన్ని ఉద్యమాలలో పాల్గొన్న ముస్లిం జనసముదాయాలు హోంరూల్ ఉద్యమంలో కూడా తమదైన పాత్ర నిర్వహించాయి. ఈ ఉద్యమంలో భాగంగా జరిగిన పలు సభలు, సమావేశాలలో ముస్లిం ప్రముఖులు చురుకుగా పాల్గొన్నారు.

1916 నవంబరు మాసంలో కడపజిల్లా రాజంపేటలో జరిగిన బహిరంగ సభకు బనగానపల్లి సంస్థానానికి చెందిన ప్రముఖులు మీర్ ఆసఫ్ అలీ బహుదూర్ అధ్యక్షత వహించారు. స్వయంపాలనాధికారాన్ని సాధించేవరకు ప్రజలు సంతృప్తి చెందరాదని, స్వయం పాలనాధికారాన్ని ఎట్టి పరిస్థితులలోనైనా సాధించి తీరాలని ఈ సందర్భంగా ఆయన ఉద్బోధించారు. ఈ మేరకు జరిగిన పలు సభలకు సుమారు 50వేల మంది వరకు

మహిళలు, ప్రజలు హజరయ్యారు. (రాయలసీమ స్వాతంత్ర్యసమర చరిత్ర, సి. హెచ్ ఆచార్య, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాదు, 2005, పేజి. 289)

ఆ తరువాత పరిణామల ఫలితంగా జస్టిస్ పార్టీ ఏర్పడింది. జాతీయ స్థాయిలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. బ్రిటీష్ పాలకులు 1919 మార్చిలో రౌలత్ చట్టాన్ని తెచ్చి ప్రజల స్వేచ్ఛను పూర్తిగా హరించివేసేందుకు ప్రయత్నించారు. భారతీయులలో పెరుగుతున్న స్వేచ్ఛా స్వతంత్ర భావాలను, ప్రజా ఉద్యమాలను అదుపుచేయడానికి, అణిచి వేయడానికి బ్రిటీషర్లు సామ, దాన, భేద, దండోపాయాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఉనికిలోకి వచ్చిన రౌలత్ బిల్లును భారతీయులు తీవ్రంగా వ్యతిరేకించారు. మహాత్మాగాంధీ ఆ చట్టాన్ని నిరసించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఆయన దక్షిణాఫ్రికా తరహాలో సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రకటించారు. అన్నిరకాల త్యాగాలకు సిద్ధం కావాల్సిందిగా ప్రజలను కోరారు. ఈ ఉద్యమంతోనే పూర్తి స్థాయిలో భారత జాతీయ ఉద్యమంలో మహాత్మా గాంధీ అడుగుపెట్టారు. ఆ సమయంలో పంజాబ్‌లోని జలియన్‌వాలా బాగ్‌లో ఘోరకలి జరిగింది. ఆ సంఘటనతో యావత్తు దేశం కదలిపోయింది.

ఆ సమయంలో ప్రథమ ప్రపంచ సంగ్రామం ఆరంభమైంది. ఆ యుద్ధంలో జర్మనీ పక్షాన చేరి పరాజయం పాలైన టర్కీ సామ్రాజాన్ని ముక్కలు చేసేందుకు బ్రిటన్ పథకం రూపొందించింది. ఆ యుద్ధ సమయంలో ప్రపంచ ముస్లింల పవిత్ర స్థలాలకు తగిన రక్షణ కల్పిస్తామని చెప్పిన బ్రిటీష్ ప్రభుత్వం ఆ వాగ్దానాన్ని తుంగలో తొక్కివేసింది. ఆ వాగ్దానాలను భంగపర్చుతూ ఆంగ్ల ప్రభుత్వం భిన్నంగా వ్యవహరించ సాగింది.

చివరకు ప్రపంచ ముస్లింలంతా ఎంతగానో గౌరవించే ఖిలాఫత్ వ్యవస్థను రద్దు చేసింది. ఈ విధానాలు ప్రపంచంలోని ముస్లింలందరితో పాటుగా భారతీయ ముస్లింలలో కూడా ఆగ్రహావేశాలను రగిలించింది. అటు రౌలత్ చట్టం పట్ల వ్యక్తమవుతున్న నిరసన, ఇటు ఖిలాఫత్ రద్దు పట్ల పెల్లుబుకుతున్న ఆగ్రహం, పంజాబ్ ప్రజలపై సాగుతున్న దాష్టీకాలకు వ్యతిరేకంగా హద్దులు దాటుతున్న ప్రజల ఆవేశాన్ని సమన్వయ పరచి జాతీయోద్యమంగా రూపొందించాలని గాంధీజీ భావించారు.

## రౌలత్ బిల్లు వ్యతిరేకోద్యమం

ప్రజా వ్యతిరేక రౌలత్ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ 1919 మార్చి 20న మద్రాసులో సభ జరిగింది. పెద్దసంఖ్యలో ప్రజలు హజరైన ఈ సభలో మీర్ సుల్తాన్ మొహిద్దీన్ పాల్గొని ప్రసంగించారు. ఈ ప్రయత్నాన్ని కొనసాగిస్తూ రౌలత్‌కు వ్యతిరేకంగా కృషి సాగించిన వారిలో ఖాన్ బహుదర్ ఖుద్దుస్ బాదుషా సాహెబ్, అబ్దుల్ హకీంలు

ఉన్నారు. చెన్నపురిలో జరిగిన హర్తాల్ సందర్భంగా మహమ్మదీయులంతా తమ దుకాణాను మూసి వేసి హర్తాల్‌ను సంపూర్ణంగా పాటించారు. బెజవాడలో మహ్మదీయులు ప్రార్ధనలు తరువాత పెద్ద సభ ఏర్పాటు చేసి రౌలత్ శాసనం రద్దు కావాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగిన సభలో ప్రముఖ కవి మౌల్వీ ఉమర్ అలీషా రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా గంభీరోపన్యాసాలు చేశారు. (ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ, సంపాదకులుః కొడాలి ఆంజనేయులు, తెలుగు అకాడమీ, హైదరాబాదు,1978).


ఈ విధంగా మహాత్ముని పిలుపుమేరకు మద్రాసు రాష్ట్రంలో భాగంగా గల తెలుగు గడ్డ మీద జరిగిన రౌలత్ వ్యతిరేక ఉద్యమంలో ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భౌతికంగా కార్యక్రమాలలో పాల్గొనడమే కాకుండా ఆర్థికంగా చాలా మంది సంపన్నులు ఆదుకోవడం జరిగింది. అంతేకాకుండా చిన్నచిన్న వ్యాపారస్థులు కూడా ఎంతో తోడ్పాటును ఇచ్చారు. 1919 సెప్టెంబరు 1న మద్రాసులో జరిగిన మహాత్ముని జన్మదినోత్సవం సందర్భంగా కరీం సాహెబ్ అను వ్యాపారస్థులు అక్కడికక్కడ తన బంగారు చెవిపోగును తీసి విరాళంగా అందించారు. ఆ చెవిపోగును విక్రయించగా 120 రూపాయలు వచ్చాయి.

ఈ మేరకు తమదైన రీతిలో బ్రిటీష్ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలు ప్రతిస్పందిస్తుండగా స్వాతంత్ర్యోద్యమంలో అతి ప్రధాన పోరాట రూపంగా భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో స్థానం సంపాదించుకుని, మహోద్రుతంగా సాగిన ఖిలాఫత్-సహాయ నిరాకరణోద్యమం దూసుకొని వచ్చింది.

## ఖిలాఫత్ - సహాయ నిరాకరణోద్యమం

బ్రిటీషర్ల చర్యలకు వ్యతిరేకంగా టర్కీ దేశాధినేత కమల్ పాషా ప్రారంభించిన ఖిలాఫత్ పోరాటానికి భారతీయ ముస్లింలు మద్దతు పలికారు. ఖిలాఫత్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ప్రారంభమైన ఖిలాఫత్ ఉద్యమానికి గాంధీజీ మద్దతునిచ్చారు. ఆ కారణంగా సహాయ నిరాకరణ ఉద్యమం, ఖిలాఫత్ ఉద్యమం జమిలిగా భారత రాజకీయ చిత్రపటం మీద ఆవిష్కరించబడ్డాయి.

1920 ఏప్రిల్ 17న గాంధీజీ, ఆలీ సోదరులుగా ఖ్యాతిగాంచిన మహమ్మద్ అలీ, షౌకత్ అలీలతో కలిసి సహాయనిరాకరణ ఉద్యమానికి పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి అన్నివిధాల సహాయాన్ని నిరాకరించమని ఉద్బోధించారు. ఈ సందర్భంగా గాంధీజీ, అలీ సోదరులతో కలిసి భారతదేశ పర్యటన గావించారు. ముస్లింలను బాగా ప్రభావితం చేయగల ఉన్నత స్థాయి నాయకులైన అలీ సోదరులు మహాత్మా గాంధీజీ వెంట ఉండడంతో ముస్లిం జన సముదాయాలు కూడా పెద్ద సంఖ్యలో ఉద్యమించాయి. అందుకు ఖిలాఫత్ సమస్య



Home Rule League Procession in Poona

కూడా తోడు కావడంతో సహాయ నిరాకరణోద్యమం భారతదేశాన్ని పూర్తిగా చుట్టేసింది. ఖిలాఫత్-సహాయనిరాకరణోద్యమంలో ముస్లింలు గణనీయ సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తర భారతదేశాన్ని పూర్తిగా తన గుప్పెట్లోకి తీసుకున్న ఖిలాఫత్-సహాయ నిరాకరణోద్యమ ప్రకంపనాలు అతి త్వరగా ఆంధ్రావనిని అందుకున్నాయి. 1920 మార్చిలో పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో ఖిలాఫత్ బహిరంగ సభ జరిగింది. ఈ సభకు ప్రఖ్యాత తెలుగు కవి, పిఠాపురానికి చెందిన డాక్టర్ ఉమర్ ఆలీషా అధ్యక్షత వహించారు. సభలో ముస్లిమేతర ప్రముఖులతో పాటుగా ముస్లిం ప్రముఖులు షుకూర్ సాహెబ్, నాజియా హుస్సేన్‌లు పాల్గొని బ్రిటీషర్ల విధానాలను విమర్శిస్తూ ప్రసంగించారు.

1920 ఆగస్టులో మద్రాసులో మహాత్మా గాంధీ సమక్షంలో జరిగిన సభలో ప్రముఖ ముస్లిం నాయకులు యాకూబ్ హుస్సేన్, డాక్టర్ లతీఫ్, సయ్యద్ సాహెబ్ తదితరులు పాల్గొనగా ఖాన్ బహుదూర్ ఖుద్దూస్ సాహెబ్ సభకు అధ్యక్షత వహించారు. ఆ తరువాత 1921లో తూర్పుగోదావరి జిల్లా ఏలూరులో జరిగిన మరొక సభలో అలీఘర్ విశ్వవిద్యాలయం విద్యార్థులు మహమ్మద్ అబ్దుల్ హకీం, మహమ్మద్ అబ్దుల్ ఖయూమ్‌లు ప్రసంగించారు. ఈ సభలో భారతీయ ముస్లింల కోర్కెలను తీర్మానాలుగా రూపొందించారు. ఆ తరువాత ఉద్యమంలో పాల్గొన్నందుకు కేరళ నాయకుడు యాకూబ్ హసన్ తదితర నేతలను అరెస్టు చేసిన సంఘటనకు నిరసనగా ఏలూరులో సంపూర్ణ హర్తాల్‌ను నిర్వహించారు.

ఈ సందర్భంగానే మద్రాసు నుండి ప్రచురితమౌతున్న **ఖౌమీ రిపోర్టు** పత్రిక సంపాదకులు అబ్దుల్ మజీద్‌షా పశ్చిమగోదావరి జిల్లాకు వచ్చి వివిధ గ్రామాలలో పర్యటించి

ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమాలను జయప్రదం చేయాల్సిందిగా ప్రజలను కోరుతూ సభలు సమావేశాలు నిర్వహించారు. ముస్లిం జనసముదాయాలు అధికంగా గల ప్రాంతాలలో ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమాలు ఉధృతమయ్యాయి.

రాయలసీమ కడప జిల్లా తాడిపత్రికి చెందిన సులేమాన్ సాహెబ్ సహాయ నిరాకరణోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1921 నవంబరు 25న అరెస్టు చేయబడిన ఆయన ఆరు మాసాల పాటు బళ్ళారి సెంట్రల్ జైలులో గడిపారు. తాడిపత్రి నివాసి అబ్దుల్లా సాహెబ్ ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నందుకు ఐదు మాసాల జైలుశిక్ష పడింది. ఆయనతో పాటుగా తిరుపతి నివాసి మదార్ సాహెబ్, తాడిపత్రి చెందిన మరొకరు షేక్ మాలిక్ షక్కర్ బరూన్ పలు శిక్షలకు గురయ్యారు.

## విద్యార్థుల అమితోత్సాహం

ఈ ఉద్యమంలో సాధారణ ప్రజానీకంతోపాటుగా విద్యార్థులు కూడా బహుముఖ పాత్ర పోషించారు. సహాయనిరాకరణ-ఖిలాఫత్ ఉద్యమానికి నాయకత్వం వహించడం దగ్గర నుండి ఉద్యమ ప్రచార కార్యక్రమాలను ఉధృతంగా నిర్వహించడం వరకు ఉత్సాహంగా పలు బాధ్యతలు నిర్వహించారు.

అనంతపురం జిల్లా హిందూపురంలో స్థానిక ఖిలాఫత్ కమిటీ కార్యదర్శిగా హుసేన్ ఉద్యమానికి నాయకత్వం వహించారు. కర్నూలులోని మౌంట్ రోడ్‌లో గల ఆజం కళాశాల విద్యార్థులు యాకుబ్ హుస్సేన్, అబ్దుల్ మజీద్ షరార్, అమీర్ అలీ, బాబుహై మజహర్, సయ్యద్ మొహిద్దీన్ తదితర విద్యార్థులు 1920 అక్టోబరు 21న స్థానిక మసీదు వద్ద ప్రసంగిస్తూ 22నాటి విద్యార్థుల సమావేశానికి హాజరు కావాల్సిందిగా పిలుపునిచ్చారు.

ఆ రోజున జుమ్మా ప్రార్థనల తరువాత జరిగిన సమావేశంలో సయ్యద్ మొహిద్దీన్, అమార్ అలీ అబ్దుల్, మజహర్ అను విద్యార్థినాయకులు సహాయనిరాకరణ అంశం మీద ప్రసంగించారు. ఈ విద్యార్థి నాయకులు కళాశాలల బహిష్కరణకు ఇచ్చిన పిలుపుకు మంచి స్పందన కన్పించింది. (Role of Students in the Freedom Struggle in Rayalaseema : 1905-1947, by K.Maddaiah, Publihsed in Andhra Pradesh History Congress, Proceedings of the Twenty Second Session, Hyderabad, 1998 Page. 167)

ఈ మేరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలలోని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పలువురు విద్యార్థులు కూడా కళాశాలలను బహిష్కరించారు. ఆ విధంగా గవర్నమెంటు కాలేజీ చదువులకు స్వస్తి చెప్పిన విద్యార్థులలో కరీంనగర్‌కు చెందిన మీర్ మహమ్మద్ హుస్సేన్, హైదరాబాద్‌కు చెందిన అక్బర్ ఆలీఖాన్, ఇంకా సయ్యద్ మహమ్మద్ ఆలీ,

మక్బూల్ ఆలీ, మహమ్మద్ హుస్సేన్ యూసువుద్దీన్, హమీదుద్దీన్ మహమూద్, ఫక్రుద్దీన్ మసూద్, సయ్యద్ మహమ్మద్ అన్సారీ తదితరులు ఉన్నారు. (నా జీవిత కథ -నవ్యాంధ్రము, అయ్యదేవర కాళేశ్వరరావు, పేజీ 327).

అలీఘర్ జాతీయ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఖిలాఫత్- సహాయ నిరాకరణోద్యమాన్ని ఉధృతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌కు తరలి వచ్చారు. మౌలానా ముహమ్మద్ అలీ మార్గదర్శకత్వంలో ముహమ్మద్ హుస్సేన్, షఫిఖ్ రహమాన్ కిద్వాయ్ తదితరులు ఆంధ్ర ప్రాంతంలోని పలు జిల్లాలలో పనిచేసేందుకు వచ్చి అదోని చేరుకున్నారు. అక్కడ కార్యక్రమాలల్లో పాల్గొంటుండగా ఆ విద్యార్థులను గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు స్వయంగా కడపకు పిలిపించారు.

గాడిచెర్ల పిలుపు మేరకు 1921 అక్టోబరు 11న కడప చేరుకున్న ఈ విద్యార్థులు కడప, గుంటూరు తదితర ప్రాంతాల నుండి విచ్చేసిన ఇతర విద్యార్థులతో కలసి పలు ప్రాంతాలలో ప్రజలను సమీకరించి సభలు-సమావేశాలు నిర్వహించారు. ఖిలాఫత్- సహాయనిరాకరణ ఉద్యమ కమిటీలను ఏర్పాటు చేశారు. అక్టోబరు 21న కడపలో ఆరువేల మంది హజరైన సభలో 2,500 రూపాయల విరాళాలను ఉద్యమం కోసం ప్రజల నుండి సేకరించారు. ప్రజల అభీష్టానికి అనుకూలంగా ప్రజా డిమాండ్‌ను మరింతగా పునరుద్ఘాటిస్తూ 1400 మంది చేత సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ చర్యలతో ఖంగుతిన్న ప్రభుత్వం 1921 అక్టోబరు 21న ఆ విద్యార్థి నాయకులను అరెస్టు చేసి, ఆరు మాసాల జైలు శిక్షను విధించింది. (Role of Students in the Freedom Struggle in Rayalaseema : 1905-1947, by K.Maddaiah, )

ఆనాటి అలీఘర్ విద్యార్థుల చర్యలు ఆంధ్రలోని పలు కళాశాలల అధ్యాపకులను కూడా ఆమితంగా ఆకట్టుకున్నాయి. ఆ విద్యార్థుల చర్యల స్ఫూర్తితో ఆజం కళాశాలకు చెందిన తర్కశాస్త్ర అధ్యాపకులు అబ్దుల్ ఖాదర్ అలీ తమ కళాశాలను బహిష్కరించాలని నిర్ణయిచుకోవడం మాత్రమే కాకుండా సహచర ఆధ్యాపకులకు సలహా ఇచ్చి ప్రోత్సహించారు.

ఈ ఉద్యమంలో అటు మేధావులు ఇటు సామాన్య ప్రజలు కూడా అమితోత్సాహంతో పాల్గొన్నారు. రాయలసీమకు చెందిన బీడి కార్మికుడు కరీం సాహెబ్ ఉద్యమంలో పాల్గొన్నందుకు ఆరు మాసాల జైలుశిక్ష 160 రూపాయల జరిమానాను భరించారు. అలీసోదరులు, మహాత్మాగాంధీ ఆదేశాలను తు.చ తప్పకుండా ఆచరిస్తూ ప్రజలు ఏకోన్ముఖంగా ముందుకు సాగారు. ఈ విధంగా వివిధ సామాజిక జనసముదాలు ఏకమై ఉద్యమించడంతో ఉద్యమం జాతీయస్థాయి రూపాన్ని సంతరించుకుంది.

## ప్రభుత్వ పదవిని త్యజించిన తొలి ఆంధ్రుడు

భారతదేశ పర్యటనలో భాగంగా, ఖిలాఫత్ ఉద్యమ ప్రముఖులైన ఆలీ సోదరులతో కలిసి గాంధీజీ ఆంధ్రకు వచ్చారు. చరిత్ర సృష్టించిన ఈ పర్యటన విజయవాడ నుండి ప్రారంభమైంది. ఈ సందర్భంగా మహాత్ముడు 1920 జనవరి 1న జరిగిన సభలో ప్రసంగిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం అందజేసిన బిరుదులను త్యజించాలని, పదవులను వదులుకోవాలని కోరారు. ఆ పిలుపుకు విజయవాడకు చెందిన జాగీర్దార్ మహమ్మద్ గులాం మొహిద్దీన్ సాహెబ్ తక్షణమే స్పందించారు. ఆయన నిర్వహిస్తున్న గౌరవ మేజిస్ట్రేటు పదవికి తక్షణమే రాజీనామా చేశారు. ఆ విధంగా గాంధీజీ పిలుపుకు స్పందించి ప్రభుత్వ పదవిని త్యజించిన తొలి ఆంధ్రుడిగా గులాం మొహిద్దీన్ ఖ్యాతిగాంచారు.

ఈ విషయాన్ని ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు అయ్యదేవర కాళేశ్వరరావు తన **నా జీవిత కథ (నవ్యాంధ్రము)**, 291 పేజీలో ప్రస్తావిస్తూ, **నా ముఖ్య మిత్రులైన మహమ్మద్ గులాం మొహిద్దీన్ సాహెబుగారు మొదటి తరగతి గౌరవ మేజిస్ట్రేటుగ నుండిరి. నాతోపాటుగా తాను కూడా గౌరవ ఉద్యోగము వదలు కొనెదమని ప్రకటించిరి,** అని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆనాడు జరిగిన సభలో మహాత్మా గాంధీ వేలాది కరతాళధ్వనుల మధ్య ప్రకటించారు. (ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ, సంపాదకులు : కొడాలి ఆంజనేయులు)

## ఎన్నికల బహిష్కరణ

గాంధీజీ పిలుపు మేరకు, ప్రభుత్వ పదవులు దిగతుడుపుగా భావించిన మహమ్మద్ గులాం మొహిద్దీన్ స్ఫూర్తితో, మద్రాసు అసెంబ్లీకి పోటీ చేస్తున్న ఖాజీ అహ్మదుల్లా, ఖాన్ సాహెబ్, అన్వర్ జమాఖాన్ సాహెబ్, అబ్దుల్ మజీద్ తదితర ప్రముఖులు ఎన్నికలను బహిష్కరిస్తూ తమ అభ్యర్థిత్వాలను ఉపసంహరించుకున్నారు. రాయలసీమ యోధుడు యం. షంషీర్ బేగ్ తన చదువుకు స్వస్తి పలికి విశ్వవిద్యాలయాన్ని వదిలి వచ్చేశారు.

విజయవాడ పర్యటనలో భాగంగా జరిగిన సభల తరువాత గాంధీజీ రాష్ట్రంలోని పలు ముఖ్య ప్రాంతాలలో జరిగిన సభలలో పాల్గొన్నారు. ఆ సమయంలో బ్రిటీషర్లకు ఏ విధంగానూ సహకరించవద్దని కోరుతూ ఆయన  విజ్ఞప్తి చేశారు. ఆ విజ్ఞప్తి మేరకు పలువురు ఎన్నికల రంగం నుండి పూర్తిగా తప్పుకున్నారు.

ఆనాడు జరిగిన ఎన్నికలలో కూడా సహాయ నిరాకరణ ఛాయలు చాలా దట్టంగా కన్పించాయి. పలువురు అభ్యర్థులు పోటీ నుండి తప్పుకోగా, పలు ప్రాంతాలలో ప్రజలు ఓటింగ్‌ను బహిష్కరించారు. స్వాతంత్ర్యోద్యమానికి కేంద్రబిందువుగా మారిన గుంటూరులో




సహాయనిరాకరణోద్యమం సందర్భంగా కలకత్తా వీధుల్లో ప్రదర్శన

15% ఓటర్లు మాత్రమే ఎన్నికలలో పాల్గొనగా, రాజమండ్రిలోని మరొక చోట 120 ముస్లిం ఓటర్లకు గాను కేవలం ఒక్క ఓటు మాత్రమే పోలైంది. ఆ ఒక్క ఓటూ కూడా ఒక ప్రభుత్వ ఉద్యోగిది కావడం విశేషం. (ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ, సంపాదకులు : కొడాలి ఆంజనేయులు)

ఈ మేరకు భారత జాతీయ కాంగ్రెస్ పిలుపును తు.చ తప్పక పాటించడంలో హిందూ సోదరులతోపాటుగా ముంస్లింలు కూడా క్రియాశీలక పాత్ర నిర్వహించారు. జాతీయ కాంగ్రెస్ బహిష్కరించిన ఈ ఎన్నికలలో జస్టిస్ పార్టీ పంట పండింది. ఆ పార్టీ పోటీ చేసిన 90 స్థానాలలో 68 స్థానాలను సంపాదించుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

## బెజవాడలో భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం

నాగపూర్ కాంగ్రెస్ మహాసభల తరువాత అఖిల భారత జాతీయ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశాలు 1921లో బెజవాడలో (విజయవాడలో) జరిగాయి. అన్నివర్గాల ప్రజలు పాల్గొని పండగలా జరుపుకున్న ఈ సమావేశాలలో మహాత్మాగాంధీ, ఇతర జాతీయ నాయకులతో పాటుగా అబ్బాస్ తయ్యాబ్జీ, హాకీం అజ్మల్‌ఖాన్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, మహమ్మద్ అలీ, షౌకత్ అలీ, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ లాంటి ముస్లిం ప్రముఖులు విచ్చేశారు. ఆంధ్ర నాయకులు క్రియాశీల పాత్ర వహించిన ఈ సమావేశాలలో పలు అంశాల మీద సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ చర్చలలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన షఫీ అహమ్మద్ ప్రముఖ పాత్ర వహించారు. ఈ సమావేశాల నిర్వహణకు విజయవాడకు చెందిన జాగీర్దార్ మహమ్మద్ గులాం మొహిద్దీన్ సాహెబ్ తన ధనాన్ని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చుచేశారు. ఈ సమావేశాలు నాయకుల్లో, ఉద్యమ కార్యకర్తలలో, ప్రజలలో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా ధైర్యసాహసాలకు, అనిర్వచనీయమైన త్యాగాలకు ప్రేరణ ఇచ్చాయి.

# పదవులు-బిరుదులు తృణప్రాయం

బ్రిటీష్ ప్రభుత్వం ప్రసాదించిన పదవులు, బిరుదులు వదులుకోమని, సంపూర్ణ సహాయ నిరాకరణ పాటించమని జాతీయ నాయకులు ఇచ్చిన పిలుపును అందుకుని ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి చెందిన మౌల్వీ జహిద్ హసన్ సాహెబ్, జమాల్ మొహిద్దీన్ సాహెబ్, షంషుల్ ఉలేమా, ఖాన్ సాహెబ్ ఆంగ్ల ప్రభుత్వం ప్రకటించిన పలు గౌరవ బిరుదులను, పదవులను తృణప్రాయంగా భావించి వదులుకున్నారు.

గుంటూరుకు చెందిన మౌల్వీ మహమ్మద్ రజాఖాన్ బెల్గామి ఖిలాఫత్ సహాయ నిరాకరణ ఉద్యమంలో ప్రధాన పాత్ర వహించారు. బ్రిటీషు ప్రభుత్వంలో డిప్యూటీ కలక్టరుగా పనిచేసిన ఆయన పదవీ విరమణ చేశాక ప్రజాసేవలో పాల్గొన్నారు. ప్రజానీకం హితం కోరుతూ పలు కార్యక్రమాలను స్వయంగా నిర్వహించారు. ప్రజోపకర కార్యక్రమాలను నిర్వహిస్తున్న వ్యక్తులను, వ్యవస్థలను ప్రోత్సహించారు. ఈ మేరకు ఆయన సేవానిరతిని, ప్రతిభను గుర్తించిన ప్రజానీకం ముహమ్మద్ రజాఖాన్ సాహెబ్ బెల్గామిని గుంటూరు పురపాలక సంఘానికి ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా మండల ఖిలాఫత్ సంఘానికి అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని సహాయనిరాకరణ ఉద్యమ నాయకులలో ఆయన ముఖ్యులుగా పేరొందారు. (గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం ః మాదల వీరభద్రరావు,పేజి.163 )

మీర్ హుస్సేన్ నెల్లూరు జైలులో ఆరు మాసాల పాటు కారాగారవాస శిక్షను అనుభవించారు. నైజాం ప్రాంతం నుండి విచ్చేసిన యువకుల్లోకి ఒకరైన ఆయన జాతీయ ఉద్యమంలోను, ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానం విలీనం సందర్భంగా, ఆ తరువాత స్వతంత్ర భారతదేశ రాజకీయాలలోనూ ప్రముఖ పాత్రను నిర్వహించారు. స్వతంత్ర భారతదేశంలో పలు బాధ్యతలను చేపట్టి మీర్ హుస్సేన్ సమర్థతను చాటుకున్నారు.

ఖిలాఫత్ కమిటీ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా హిందూపురం మేజిస్ట్రేట్ ముహమ్మద్ హుస్సేన్ సాహెబ్, నబీ సాహెబ్ బహదూర్, టిప్పూ ఖాన్ తమ ఉద్యోగాలకు రాజీనామాలు సమర్పించారు. ఆదోనికి చెందిన రోషన్ ముల్లా 1920 జూన్‌లో ఆదోని మున్సిపాలిటీ కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. ఆనాడు ఇటువంటి త్యాగాలు అసంఖ్యాకంగా సాగాయి. అధికార అనధికార పదవులలో ఉన్నవారంతా తమ హోదాలకు, పదవులకు, ఆంగ్ల ప్రభుత్వ మెహర్బానికి సామూహికంగా రాజీనామాలు సమర్పించారు.



ఖిలాఫత్ - సహాయనిరాకరణ ఉద్యమ కార్యకర్తలు (లాహోర్)

## సంపాదనను కాలదన్నిన న్యాయవాదులు

ఈ బహిష్కరణోద్యమంలో భాగంగా న్యాయవాదులు ప్రభుత్వ న్యాయస్థానాలలో ప్రాక్టీసు చేయ నిరాకరించారు. కర్నూలుకు చెందిన న్యాయవాది సయ్యద్ సాబ్ మొహిద్దీన్ ఖాద్రి బియబాని వేలాది రూపాయల సంపాదనను ఆర్జించి పెడుతున్న న్యాయవాద వృత్తిని వదిలేసి జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆయన మద్రాస్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను కలుసుకున్న సందర్భంగా అటు ముస్లింలకు ఇటు దేశానికి సేవ చేయమని, ప్రభుత్వంలో ఏ ఉద్యోగాన్ని చేయవద్దని ఆయనకు సలహా ఇచ్చారు. మౌలానా సలహాను పాటించగలనని ఖాద్రి మాటిచ్చారు. మౌలానాకు ఇచ్చిన మాట మేరకు చదువు పూర్తి కాగానే వచ్చిన డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగాన్ని ఆయన తిరస్కరించారు. న్యాయశాస్త్ర విద్యార్థిగా ఉన్నప్పుడే అలీఘర్‌లో డాక్టర్ జాకీర్ హుస్సేన్‌కు సన్నిహితులయ్యారు. ఆ ప్రభావంతో జీవితాంతం జాతీయవాదిగా, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం సాగిన పోరాటంలో సయ్యద్ సాబ్ మొహిద్దీన్ ఖాద్రి బియబాని భాగస్వామ్యం వహించారు.

గాంధీజీ పిలుపునందుకుని న్యాయవాద వృత్తిని వదులుకున్న వారిలో విజయవాడకు చెందిన జనాబ్ అలీ బేగ్ మరొకరు. అలీబేగ్ ఆనాటి రాజకీయాలలో ప్రముఖ పాత్ర వహించారు. అంతేకాదు స్వాతంత్ర్యం సిద్ధించాక, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నాయకత్వంలోని భారత రాజ్యాంగ రచనా కమిటీలో సభ్యునిగా బాధ్యతలు నిర్వహించడమేకాక, పార్లమెంటు సభ్యునిగా ప్రజలకు సేవలందించారు. ఆయన జ్ఞాపకార్థం విజయవాడ నగరంలో ఒక

వీధిని **అలీ బేగ్ స్ట్రీట్**గా నామకరణం చేశారు. అలీ బేగ్ గురించి అయ్యదేవర కాళేశ్వర రావు ప్రస్తావిస్తూ, **ఈయన మంచి సమర్థుడైన లాయరేకాక మద్రాసు శాసనసభలోను, భారత రాజ్యాంగ నిర్ణయ సభలోనూ, పార్లమెంటులోను కొంతకాలము సభ్యుడిగా నుండెను** అని పేర్కొన్నారు.(నా జీవిత కథ-నవ్యాంధ్రం, అయ్యదేవర కాళేశ్వరరావు, పేజి.291) ఆనాడు బ్రిటీషు సర్కారులో ఉన్నత ఉద్యోగాలు చేస్తూ కూడా జాతీయోద్యమానికి రహస్యంగా అండదండలు అందించిన ముస్లిం ఉద్యకారులు చాలా మంది ఉన్నారు. బ్రిటీష్ ప్రభుత్వంలో పోలీసు అధికారులుగా బాధ్యతలు నిర్వహిస్తూ కూడా పరోక్షంగా జాతీయోద్యమకారులకు సహకరించారు. ఈ విషయాన్ని అయ్యదేవర ప్రస్తావిస్తూ, **ముసల్మాను పోలీసు ఇనస్పెక్టర్ అక్కడికి వచ్చి, వచ్చిన పనికి సానుభూతి తెలిపెను...చందా ఇవ్వవలసిందిగా వర్తకులను ప్రోత్సహించెను,** అని రాశారు. (నా జీవిత కథ-నవ్యాంధ్రం ః పేజి.308).


## జైళ్ళు నోళ్ళు తెరచినా వెరవని వీరులు

అనూహ్యంగా ఉద్యమిస్తున్న ప్రజలను అడ్డుకోడానికి ఆంగ్ల ప్రభుత్వం అరెస్టులను ముమ్మరం చేసింది, ప్రజల మీద హింసాత్మక చర్యలకు పాల్పడటం మాత్రమే కాకుండా కఠిన కారాగార శిక్షలను కూడా విధించింది. ఈ చర్యలకు ప్రజలు ఏమాత్రం భయపడలేదు. లాఠీ దెబ్బలు తినడం, కారాగారానికి వెళ్ళడం ఓ ప్రత్యేక గౌరవంగా భావించి ప్రజలు ముమ్మందుకు వచ్చారు. ఆ రోజుల్లో జైళ్ళన్నీ ఉద్యమకారులతో నిండిపోయాయి.

పశ్చిమగోదావరికి చెందిన కోరుమామిడి నివాసి సయ్యద్ దాదాసా సహాయ నిరాకరణ ఉద్యమలో చురుగ్గా పాల్గొన్నందుకు సంవత్సరం జైలుశిక్ష అనుభవించారు. ప్రముఖ నాయకుడు దేశబంధు చిత్తరంజన్ కన్నుమూసిన సందర్భంగా ఏలూరులో జరిగిన సంతాపసభలో జాతీయోద్యమానికి అంకితమై ఉంటామంటూ ఇస్మాయిల్ సేట్ ఆవేశంగా ప్రసంగించి పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురయ్యారు.

ఆనాడు ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘన ఉద్యమాల్లో ఆంధ్ర ప్రాంతంలోని ముస్లిం జనావళి ఎంతో క్రియాశీలకంగా పాల్గొంది. గ్రామీణ ప్రజానీకం కూడా ఉత్సాహంతో ఉద్యమించడం విశేషం. ప్రభుత్వం ఎంత కఠినంగా ఉన్నా, పోలీసులు ఎంత క్రూరంగా వ్యవహరించినా ప్రజలు ఏమాత్రం భయపడకుండా అన్ని కష్టనష్టాలను చిరునవ్వుతో భరిస్తూ ఉద్యమకార్యక్రమాలలో పాల్గొన్నారు.

1921 ఏప్రిల్‌లో మద్రాసులో మహాత్మాగాంధీ పాల్గొంటున్న సభలో వలియుల్లా బాద్షా సాహెబ్, నాదర్ సాహెబ్ తదితర ప్రముఖులు పాల్గొని ప్రజలను ఉద్యమించమని ప్రోత్సహిస్తూ ఉద్వేగంగా ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా ఖిలాఫత్-సత్యాగ్రహోద్యమాల



ఖిలాఫత్ - సహాయనిరాకణ ఉద్యమం ప్రదర్శనలో మహిళా కార్యకర్తలు

ప్రాముఖ్యతను వివరిస్తూ, హిందూ-ముస్లింల ఐక్యత ఎంత అవసరమో ప్రజలు తెలిపారు.

ఈ సందర్భంగా ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమంలో ప్రముఖులుగా ఖ్యాతి గాంచిన అలీ సోదరులలో ఒకరైన మౌలానా ముహమ్మద్ అలీతో కలసి మహాత్మాగాంధీ ఆంధ్రప్రదేశ్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా 1921 సెప్టెంబరు 13న కలకత్తా నుండి రైలులో విశాఖపట్నం వచ్చారు. ఆ ప్రముఖులు విశాఖపట్నం చేరగానే పోలీసులు ముహమ్మద్ అలీని అరెస్టు చేశారు. ఈ అరెస్టు ప్రజలలో ఆగ్రహావేశాలను రగిల్చింది.

ఆ సమయంలో అలీని అరెస్టు చేసినందుకు విశాఖపట్నం యోధుడు రజాక్ ఎంతో ఆందోళన చెందారు, ఆగ్రహించారు. పోలీసులు ముందుకు సాగకుండా ఆయన అడ్డుపడ్డారు. **అలీని పోలీసుల తీసుకెళ్లకుండా అటంకపర్చి అల్లరి లేవదీశారు**. ఆ సమయంలో **మౌలాను అరెస్టు చేసినందుకు ...విచారం కలిగితే స్వదేశీ కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సిందిగా** సూచిస్తూ, ప్రజలు శాంతియుతంగా ఉండాలని, సంయమనం పాటించాలని మహాత్ముడు కోరారు. (దేశ స్వాతంత్ర్యోద్యమంలో విశాఖ జిల్లా స్థానం, విశాఖజిల్లా దర్శిని, విశాఖపట్నం, 2002 మరియు ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ : కొడాలి ఆంజనేయులు)

ఈ విధంగా భారతదేశ వ్యాప్తంగా ప్రజలలో పెల్లుబికిన ఖిలాఫత్-సహాయ నిరాకరణోద్యమం స్ఫూర్తిదాయకంగా నిలచింది. ఈ ఉద్యమ ప్రేరణతో దేశ వ్యాప్తంగా పలు స్థానిక ఉద్యమాలు ఉనికిలోకి వచ్చాయి. బ్రిటీషు ప్రభుత్వ వ్యతిరేకత ఒక్కటే ప్రధాన

చోదక శక్తిగా ఈ ఉద్యమాలు ఉధృతంగా సాగాయి. ఈవిధంగా చరిత్ర సృష్టించిన పలు ఉద్యమాలకు తెలుగుగడ్డ ఆనాడు పుట్టినిల్లయ్యింది.

## విలక్షణ పోరాట రూపాలు


భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాల తరువాత ఆంధ్రలో సహాయ నిరాకరణ ఉద్యమం కాస్తా శాసనోల్లంఘన ఉద్యమంగా మారింది. ప్రజలు అన్ని ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించారు, చట్టాలను ఉల్లంఘించారు. పన్నులు కట్ట నిరాకరించారు. అధికారిక కార్యక్రమాలకు సహకారం అందించకుండా సహాయ నిరాకరణ కొనసాగించారు.

ఈ క్రమంలో గుంటూరు జిల్లాలోని పల్నాడు ప్రాంతంలో కన్నెగంటి హనుమంతు నాయకత్వంలో **పుల్లరి ఉద్యమం** సాగింది. చీరాల ప్రాంతంలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నేతృత్వంలో **చీరాల- పేరాల ఉద్యమం** ఉధృతమైంది. పర్వతనేని వీరయ్య చౌదరి మార్గదర్శకత్వంలో **పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం** చరిత్ర ప్రసిద్ధికెక్కింది. అల్లూరి సీతారామరాజు సాగించిన **మన్యం తిరుగుబాటు** ఆంధ్రులకు జాతీయ స్థాయిలో ఎనలేని ఖ్యాతిని తెచ్చి పెట్టింది. ఈ ఉద్యమాలు భారత స్వాతంత్ర్య సమరంలో విలక్షణమైన ప్రజా ఉద్యమాలుగా ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నాయి. ప్రపంచ శాంతి-సాయుధ పోరాటాల సరసన నిలువగల అర్హతలను సంపాదించుకున్నాయి. ఈ ఉద్యమాలన్నిటిలో కూడా ముస్లిం యోధులు పాల్గొని తమదైన ప్రత్యేక చరిత్రకు కారకులయ్యారు.

## పల్నాటిసీమలో పుల్లరి ఉద్యమం

పల్నాటి యోధుడు కన్నెగంటి హనుమంతు నాయకత్వంలో గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలో సాగిన పుల్లరి ఉద్యమంలో సాటి ముస్లిమేతర సోదరులతోపాటుగా ముస్లింలు కూడా పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అవసరాలు, అవస్థలు ఒక్కటే అయినప్పుడు కుల, మతాలకు అతీతంగా ప్రజలంతా కలసికట్టుగా ఉద్యమిస్తారనడానికి పల్నాటి పుల్లరి ఉద్యమం నిదర్శనంగా నిలచింది.

పుల్లరి ఉద్యమంలో ముస్లింలు నిర్వహించిన పాత్రను వివరిచేందుకు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు మాదల వీరభద్రరావు తన **గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం 1920-30 ఉజ్వల ఘట్టాలు** గ్రంథంలో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని కేటాయించారు. ఆనాటి సంఘటనలకు స్వయంగా సాక్షి అయినటువంటి మాదల పుల్లరి ఉద్యమంలో ముస్లింలు నిర్వహించిన పాత్రను వివరిస్తూ, **అప్పటికే ముగ్గురు ముస్లిం దేశభక్తులను నిర్బంధించి చెరసాలకు పంపడం జరిగింది...మాచర్లలో మహమ్మదీయులు అనేకులు గలరు. వారిలో**



పల్నాటి పుల్లరి సత్యాగ్రహయోధులు చింతపల్లి హుస్సేన్ సాహెబ్, జాన్ హమ్మద్‌లు.
'పల్నాటి పుల్లరి సత్యాగ్రహంలో మొదట అరెస్టు అయిన మాచర్ల ముస్లిం దేశభక్తులు'
(శ్రీ మాదల వీరభద్రరావు గ్రంథం ' గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం' నుండి)

**ఏమాత్రమభిప్రాయ భేదములు లేక ఉద్యమమును సంపూర్ణంగా నభిమానించు చుండిరి,** అన్నారు.

భారత జాతీయ కాంగ్రెస్ గుంటూరు జిల్లా నాయకులు పుల్లరి ఉద్యమం సందర్భంగా కార్యక్రమాలలో పాల్గొని అరెస్టులకు గురికాక ముందుగానే మాచెర్లకు పొరుగు గ్రామమైన కొత్తపల్లికి చెందిన మహమ్మదీయులలో ముగ్గురు ఉద్యమకారులు పుల్లరి చెల్లింపును వ్యతిరేకిస్తూ, సహాయనిరాకరణ ఉద్యమానికి తోడ్పడుతూ, పుల్లరి వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ కార్యక్రమాలలో భాగంగా ఉద్యమకారులకు అనుకూలంగా గూఢచర్యం నిర్వహించి మొట్టమొదటిసారిగా అరెస్టులకు కూడా గురయ్యి చరిత్ర సృష్టించారు.

ఈ విషయాన్ని మాదల రాస్తూ, **ఆ గ్రామవాసులు ముగ్గురు మహమ్మదీయులు, (1) నబీ సాహెబ్, (2) చింతపల్లి హుస్సేన్ సాహెబ్, (3) జానహమ్మద్ అనువారులు చారులుగా పనిచేయచుండిరి. నబీ సాహెబు మిగుల ఉత్సాహపరుడు, సమర్థుడు, ముగ్గురు మంచివారు,** అని పేర్కొన్నారు. ఈ ముగ్గురు కూడా పుల్లరి వసూలుకు వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులను అటకాయించినందున అరెస్టుకు గురయ్యారు. కడు పేద కుటుంబాలకు చెందిన ఈ యోధులు తమ కుటుంబాల గురించి ఏమాత్రం ఆలోచించక, ప్రభుత్వ వ్యతిరేక చర్యల వలన ఎదురయ్యే ప్రమాదాలను లక్ష్యం చేయక పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొన్నారు.

ఈ యోధులకు కోర్టు ఆరు మాసాల జైలు శిక్షను విధించింది. అయినా సత్యాగ్రహ యోధులైన ఆ ముగ్గురు ఎంతో ధైర్యంతో, బ్రిటీషు ప్రభుత్వ పోలీసులన్నా, కారగార శిక్షలన్నా ఏమాత్రం భయం లేకుండా ప్రవర్తించారు. ఈ విషయాన్ని మాదల తన గ్రంథంలో మరింత వివరంగా ప్రస్తావిస్తూ ఆ యోధులు కోర్టుకు వచ్చిన తీరు, శిక్ష ప్రకటించిన తరువాత వారు ప్రదర్శించిన ధైర్యం గురించి కూడా వివరంగా పేర్కొన్నారు.

ఆ కథనం ప్రకారం, **ఉదయం 11గంటలకు మహమ్మదీయ ముద్దాయిలను గుర్రముల పై నెక్కించుకుని పెండ్లికొడుకులగు హసన్, హుస్సేన్‌ల వలె మేళతాళములతో కోర్టుకు వచ్చిరి...ముగ్గురు ముద్దాయిలు తాము నేరము చేయలేదనియు, కేసు విచారణలో తాము పాల్గొనమనియు స్టేట్‌మెంట్లు దాఖలు చేసి క్రాసేయగ్జామినేషన్ మొదలగునవి చేయక యూరకుండిరి...విచారణ పూర్తయి...6 నెలల శిక్ష విధించబడెను...ముద్దాయిలను ఆ సాయంత్రం ఖయిదులో చూసితిని. ధైర్యముగా నున్నారు...మూడు మాసాలలో స్వతంత్రం వచ్చును. మనమందరము విడిపింపబడుదమని చెప్పితిని...వారి కుటుంబములు బీదవి. మాచెర్ల వారిని చందాలు వేసుకుని వారి కుటుంబాలను పోషింపవలయునని తెలియచేసితిని, వారట్లు చేయుదుమని చెప్పిరి.** (గుంటూరు జిల్లాలో స్వరాజ్య ఉద్యమం, పేజి. 63-64).

పుల్లరి ఉద్యమంలో సామాన్య గ్రామస్థుల సాహసం, అటవీశాఖా అధికారుల పట్ల వారు వ్యక్తం చేసిన వ్యతిరేకత, మొట్టమొదటిగా సాగిన పుల్లరి వ్యతిరేక ఉద్యమకారుల అరెస్టుల ఉదంతాన్ని ఈ గ్రంథం వెల్లడించింది. ఈ విషయాన్ని 1921, ఆగస్టు22 నాటి The Hindu దినపత్రిక, '...three local Mohammdan workers have intensified feeling against forest administration.' (The Freedom Struggle in Andhra Pradesh,Vol.III, Prof.M. Venkatarangaiya, Govt. of AP Publications, Hyderabad, 1997, Page.185) అని పేర్కొంది.

ఈ విధంగా పలు వివరాలను పేర్కొన్న మాదల వీరభద్రరావు **పల్నాటి పుల్లరి సత్యాగ్రహంలో మొదట అరెస్టు అయిన మాచర్ల ముస్లిం దేశభక్తులు** అంటూ ఇరువురి యోధుల చిత్రాలను తన గ్రంథంలో జతచేశారు. ఈ ఇరువురు ఆ ముగ్గురిలో ఎవరన్న విషయం ఆ గ్రంథంలో స్పష్టంగా లేవు. ఈ ఇరువురి గురించి మాత్రమే Who is Who of Freedom Struggle in Andhra Pradesh, Volume I, Page : 253, 230 (Edited by Prof.Sarojini Regani,Govt. of AP Publications, Hyderabd.1978) లో ప్రస్తావన ఉంది. ఆ కారణంగా ఈ చిత్రంలోని వారు చింతపల్లి హుస్సేన్ సాహెబ్, జానహమ్మద్‌లని భావించవచ్చు.

## చీరాల-పేరాల ప్రజా పోరాటం

చీరాల-పేరాల ఉద్యమంలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య సన్నిహిత సహచరుడిగా బాపట్లకు చెందిన మహమ్మద్ గౌస్ బేగ్ ఎంతగానో కృషి చేశారు. ఆయన తన కుటుంబ

ఆస్తిపాస్తులను ఉద్యమం కోసం పూర్తిగా వ్యయం చేశారు. ముహమ్మద్ గౌస్‌తోపాటుగా ఆయన సన్నిహితులు, సహచరులు పలువురు ఆయన వెంట ఉద్యమబాటన నడిచారు. చీరాల-పేరాల ప్రజాపోరాటంలోనే కాకుండా ముహమ్మద్ గౌస్ పెదనందిపాడు పన్ను నిరాకరణ ఉద్యమంలో కూడా చురుగ్గా పాల్గొన్నారు. పన్నుల నిరాకరణ ఉద్యమవ్యాప్తి కోసం గ్రామ గ్రామాన ప్రచార కార్యక్రమం చేపట్టి అవిశ్రాంతంగా శ్రమించారు.

ప్రజలలో ప్రధానంగా యువకులలో ఉత్సాహాన్ని రెకెత్తిస్తూ ఆయన ప్రసంగాలు చేయడమే కాకుండా, బ్రిటీష్ పోలీసుల దాష్టిక చర్యలను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఉద్యమాలలో చురుకుగా పాల్గొని పలుమార్లు ప్రభుత్వ ఆగ్రహానికి గురయ్యారు. (గుంటూరు జిల్లాలో స్వరాజ్య ఉద్యమం : మాదల వీరభద్రరావు)

జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు అన్ని కార్యక్రమాలలో పాల్గొని మొత్తం మీద ఏడు సంవత్సరాలకు పైగా జైలు జీవితం గడిపిన యోధుడు ముహమ్మద్ గౌస్. ఆయన సతీమణి ముహమ్మద్ గౌస్ ఖాతూన్ ఆ సమయంలో భర్తకు అన్ని విధాల తోడుగా నిలిచారు. జాతీయ ఉద్యమకారులకు, నాయకులకు తన ఇంట రహస్యంగా ఆశ్రయం కల్పించి వారిని అన్ని విధాల ఆదుకుంటూ పరోక్ష సహాయం అందచేశారు.

## పెదనందిపాడు పన్నుల నిరాకరణ

ఆ సమయంలోనే గుంటూరు జిల్లా పెదనందిపాడు కేంద్రంగా పర్వతనేని వీరయ్య చౌదరి నాయకత్వంలో పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం ఆరంభమై గ్రామ గ్రామాలకు విస్తరించింది. మహాత్మా గాంధీని అమితంగా ఆకట్టుకున్న పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమంలో కూడా ముహమ్మగ్ గౌస్ క్రియాశీలక పాత్రను నిర్వహించారు. పన్నుల నిరాకరణ ఉద్యమం లక్ష్యాలను, విధివిధానాలను ప్రజలకు తెలపడం, గ్రామాలకు వచ్చే ప్రభుత్వాధికారులకు ప్రజల నుండి ఎటువంటి సహకారం అందకుండా చూడటం వరకు ఆయన బాధ్యతలు నిర్వర్తించారు.

ఈ ఉద్యమం సందర్భంగా పలువురు ఉద్యోగాలను వదులుకున్నారు. గ్రామాలలో పలు బాధ్యతలను నిర్వహిస్తూ అధికారులకు అండదండలుగా ఉంటూ వచ్చిన గ్రామాధికారులు తమ పదవులను తృణప్రాయంగా భావించి త్యజించారు. గ్రామాధికారులు మాత్రమేకాదు గ్రామస్థాయిలో చిన్న ఉద్యోగులైన మోతేదార్లుగా పనిచేస్తున్న గ్రామనౌకర్లు కూడా తమ పదవులకు రాజీనామా చేశారు. ఆ తరువాత గ్రామాలకు వచ్చిన ఉన్నతాధికారులకుగాని, ఉద్యోగులకుగాని ఎటువంటి సహాయ సహకారాలు అందించకుండా బహిష్కరణను విజయవంతంగా పాటించారు. ప్రకాశం జిల్లా నివాసి షేక్ చిన ఆదం సాహెబ్ ఉప్పుటూరు

గ్రామాధికారి పదవికి రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు గ్రామాధికారి షేక్ మొహిద్దిన్, మరొక గ్రామాధికారి షేక్ ఫకీర్ అహమ్మద్‌లు తమ పదవులకు రాజీనామా చేసి సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. గుంటూరు నివాసి మౌల్వీ మహమ్మద్ రజా సాహెబ్ గౌరవ మేజిస్ట్రేటు పదవిని త్యజించారు.

## ముమ్మరంగా కారాగార శిక్షలు

జాతి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు కోరుకుంటూ సాగుతున్న జాతీయోద్యమంలో భాగంగా జరుతున్న వివిధ పోరాటాలలో తమదైన పాత్ర నిర్వహిస్తున్న ప్రజలు ఆంగ్లేయ ప్రభుత్వ అధికారుల రాక్షసత్వాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. అయినా ఏమాత్రం భయపడకుండా విజృంభించి కఠిన కారాగార శిక్షలకు, లాఠీఛార్జీలకు బలైనవారూ ఉన్నారు.

అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన అబ్దుల్ సాహెబ్ ఐదు మాసాల కఠిన కారాగారవాస శిక్షను అనుభవించారు. చిత్తూరు జిల్లా చంద్రగిరికి చెందిన మదార్ సాహెబ్ నెల్లూరు, కండలూరు జైళ్లలో 15మాసాలు, 1921లో మద్యనిషేదం ఉద్యమంలో పాల్గొన్నందుకు మరో సంవత్సరం జైలుశిక్షను అనుభవించారు. విశాఖపట్టణానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ రజాక్ పలుసార్లు జైలు పాలయ్యారు.

కృష్ణాజిల్లా నూజివీడు నివాసి కొత్వాల్ అబ్బాస్ అలీ సాహెబ్ 9 మాసాలు రాజమండ్రి జైలులో గడిపారు. ఆయన ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ నాయకులుగా, నూజివీడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా 1926 నుండి 1940 వరకు పనిచేశారు. విజయవాడకు చెందిన నసీరుల్లా ఖాన్ నాలుగు మాసాలు, నూజివీడు నివాసి మొహిద్దీన్ బెగ్ నాలుగు మాసాలు, గుడివాడ నివాసి ఖాశిం బేగ్ రెండు మాసాలు రాజమండ్రి జైలులో గడిపారు. నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా వాసి మహమ్మద్ అక్బర్ సాహెబ్ నెల్లూరు, కడలూరు జైళ్ళలో ఏడాది జైలు జీవితం గడిపారు.

నెల్లూరు జిల్లా కోవూరు తాలూకాకు చెందిన మహమ్మద్ అక్బర్ సాహెబ్ నెల్లూరు, కడలూరు జైళ్ళలో ఏడాది జైలు జీవితం గడిపారు. నెల్లూరుకు చెందిన వ్యాపారి మహమ్మద్ గౌస్ సాహెబ్ ఆరు మాసాలు, జైలు శిక్షకు గురయ్యారు. గుంటూరు జిల్లాకు చెందిన అబ్దుల్ హుదా సాహెబ్ ఒక సంవత్సరం జైలుశిక్ష అనుభవించారు. రేపల్లెకు చెందిన షేక్ దావూద్, షేక్ గులాబ్ హుస్సేన్, షేక్ ఉస్మాన్ నిర్బంధాలకు గురయ్యారు. సత్తెనపల్లి చెందిన రైతు షేక్ మీర్జా ఆలీ సాహెబ్ పన్ను వ్యతిరేక ఉద్యమ ప్రచారంలో పాల్గొని ఆరు మాసాలు జైలులో గడిపారు. అదిలాబాద్‌కు చెందిన సయ్యద్ ఇబ్రహీం జిల్లాలో ఖిలాఫత్ ఉద్యమాన్ని నడిపి జైలు పాలయ్యారు. ఈ విధంగా విజయవాడకు చెందిన మొహమ్మద్

నూరుల్లా ఖాన్, కృష్ణానగర్ నివాసి మహమ్మద్ మింటో, నూజివీడుకు చెందిన మొహినుద్దీన్ ఖిలాఫత్–సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నందుకు జైలుశిక్షను అనుభవించారు.

భారత దేశాన్ని మొత్తంగా చుట్టేసిన ఖిలాఫత్–సహాయనిరాకరణ ఉద్యమం నైజాం సంస్థానాన్ని కూడా తాకింది. జాతీయోద్యమంలో భాగంగా సాగుతున్న ప్రతి కార్యక్రమంలో పరిమితుల మేరకు పాల్గొంటున్న ప్రజలు ఖిలాఫత్–సహాయనిరాకరణ ఉద్యమంలో కూడా భాగస్వాములయ్యారు. నైజాం సంస్థానంలో ఉన్న హిందూ–ముస్లిం జనసముదాయాలు ఉమ్మడిగా ఉద్యమ బాటన నడిచాయి.

## నైజాంగడ్డ మీద ఉధృతంగా ఖిలాఫత్ ఉద్యమం

ఖిలాఫత్–సహాయనిరాకరణ ఉద్యమం నైజాం సంస్థానాన్ని కూడా తాకింది. ఖిలాఫత్ సమస్య ప్రధానంగా ముస్లింల సమస్య కావడంతో హైదరాబాదు రాష్ట్రంలోని ముస్లిం జనసముదాయాలు మిన్నకుండలేకపోయాయి. నిజాం నవాబు బ్రిటీషర్లకు ఎంత అనుకూలంగా ఉన్నాకూడా ముస్లిం జనసముదాయాలు మాత్రం ఏమాత్రం జంకకుండా తమ పరిమితుల మేరకు బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఖిలాఫత్–సహాయ నిరాకరణ ఉద్యమస్వరాన్ని బలంగా విన్పించాయి.

నైజాం సంస్థానంలో హైదరాబాద్‌కు చెందిన అబ్బాస్ సుభాన్, మహమ్మద్ అబ్దుర్రెహమాన్ ఖిలాఫత్–సహాయ నిరాకరణ ఉద్యమాలకు తొలుతగా నేతృత్వం వహించారు. ఆనాడు ఖిలాఫత్ కేంద్ర కమిటీకి ముహమ్మద్ అస్ఘర్ కార్యదర్శిగా పనిచేశారు. ఆ ఉద్యమంలో మౌలానా సయ్యద్ అబ్దుల్ హై ప్రధాన పాత్ర వహించారు.

ఈ సందర్భంగా హైదరాబాదులోని వివేకవర్ధనిలో ఖిలాఫత్–సహాయనిరాకరణ ఉద్యమ సభ జరిగింది. ఈ సభకు ముల్లా అబ్దుల్ ఖయ్యూం అధ్యక్షత వహించారు. ఈ సభలో పలువురు హిందూ ప్రముఖులతోపాటుగా సిరాజుల్ హసన్ తిర్మిజ్ లాంటి నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఖిలాఫత్ కమిటీ ఆదేశాల మేరకు 1920 మార్చి 19న హైదరాబాదులో సంపూర్ణ హర్తాళ్ విజయవంతంగా జరిగింది.

ఆ తరువాత ఖిలాఫత్ ఉద్యమానికి మద్దతుగా 1920 మే 5న హైదరాబాద్‌లో హిందూ–ముస్లింలు కలిసి ఐక్యంగా హర్తాల్ జరిపారు. ఆ క్రమంలో మే 17న బహిరంగ సభ జరిగింది. ఈ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఆ సభలో పలువురు హిందూ–ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు. నైజాం ప్రభుత్వ అనుమతి లేకుండా సభలు సమావేశాలు నిర్వహించరాదని నిజాం నవాబు జారీచేసిన హుకుంనామాలను ఏమాత్రం ఖాతరు చేయకుండా, హుకుంను ఉల్లంఘించినందున నైజాం ప్రభుత్వం ప్రకటించగల

శిక్షలకు ఏమాత్రం జంకకుండా ప్రజలు, నాయకులు సభలలో పాల్గొన్నారు. జాతీయోద్యమ నేతలు మాత్రం అవిశ్రాంతంగా ఉద్యమించమని ప్రజలను కోరుతూ సభలో ఉత్తేజపూరిత ప్రసంగాలు చేసి ప్రజలను ఉద్యమాల దిశగా కార్యోన్ముఖులను చేశారు.

ఈ సందర్భంగా నైజాం సంస్థానంలో డిప్యూటి కలక్టరుగా బాధ్యతలు నిర్వహించిన, ప్రముఖ జాతీయవాది ముహమ్మద్ రాజా బిల్‌గ్రామి ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమాన్ని పూర్తిగా సమర్థించారు. ఆయన ప్రజలలో చైతన్యం కోసం, విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. ఆ చర్యల పట్ల ఆగ్రహించిన బ్రిటీష్ ప్రభుత్వం ఆయన పెన్షన్‌ను (జీవో నం. 506, తేది. ఆగస్టు 10, 1921 ద్వారా) రద్దు చేసింది. బిల్‌గ్రామి పెన్షన్ వదలు కోడానికి సిద్ధపడ్డారు తప్ప నైజాం ప్రభుత్వ ఆదేశాలకు తలవొగ్గలేదు.

## విద్యార్థులలో పెల్లుబికిన చైతన్యం

ఈ సందర్భంగా ప్రభుత్వ గ్రాంటులతో నడుస్తున్న అలీఘర్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేయడం కూడా జాతీయ-దేశభక్తి భావాలకు వ్యతిరేకమని దేశభక్తి ప్రపూరితులైన విద్యార్థులు, అధ్యాపకులు భావించారు. ఆ కారణంగా సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా జాతీయ నాయకుల పిలుపు మేరకు ఆలీఘర్‌లో చదువుతున్న హైదరాబాదు విద్యార్థులు అలీఘర్‌ను విడిచిపెట్టారు. ఆ విద్యార్థులు భారత జాతీయ కాంగ్రెస్ నాయకుల ద్వారా ఆరంభింపబడిన జామియా మిలియా ఇస్లామియా కళాశాలలో చేరారు.

ఈ చర్యకు సంతసించిన హైదరాబాదు ప్రజలు ఆ విద్యార్థులకు టెలిగ్రాముల ద్వారా అభినందనలు తెలిపారు. ఆ విద్యార్థుల బాటలో ఇతర విద్యార్థులు కూడా నడవాలని కోరుతూ అభినందన సభలు జరిగాయి. ఈ సభలలో రాజా గోవింద పర్షాద్, మాడపాటి హనుమంతరావు, కృష్ణస్వామి మొదలియార్ లాంటి ప్రముఖ జాతీయోద్యమ నాయకులు పాల్గొన్నారు. ఈ సంఘటనలకు ప్రభావితుడైన గౌస్ మొహిద్దీన్ అను తాల్కూద్దార్ **జాతీయ విశ్వవిద్యాలయం స్థాపనకు అభినందిస్తున్నాను. అది జయప్రమగు గాక. నా కుమారులు త్వరలోనే వస్తున్నారు**, అని జాతీయ కళాశాల ప్రధానోపాధ్యాయునికి తంతి వార్త పంపించి, జాతీయ కళాశాల ఏర్పాటు ఆ తదుపరి ప్రతిస్పందనలకు మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా రాయచూర్‌లో జరిగిన ఓ పాఠశాల వార్షికోత్సవ సభలో సయ్యద్ అహ్మదుల్లా హుస్సేని అను విద్యార్థి సహాయనిరాకరణ ఉద్యమం గురించి ఉత్తేజపూరితంగా ప్రసంగించి సంచలనానికి కారణమయ్యాడు. (ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ, సంపాదకులు : కొడాలి ఆంజనేయులు)

## గోమాంసం మీద స్వచ్ఛంద నిషేధం

హిందూ–ముస్లిం జనసముదాయాలు కలసికట్టుగా సాగిస్తున్న జాతీయోద్యమంలో కొన్ని ప్రత్యేకతలు స్పష్టమయ్యాయి. జాతీయ స్థాయిలో హిందూ–ముస్లింలు తమ ఆచార సాంప్రదాయాలను, మత మనోభావాలను గమనంలో పెట్టుకుని సాగుతున్నట్టుగానే హైదరాబాదులో కూడా ఉభయ మతాల ప్రజలు ఐక్యత కోసం త్యాగాలకు సిద్ధపడ్డారు.

ఖిలాఫత్–సహాయనిరాకరణోద్యమం సందర్భంగా హిందూ–ముస్లింలు కలసి కట్టుగా గోవధ నిషేధాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై ముస్లిలు–హిందువులు కలసి ప్రభుత్వం మీద వత్తిడి తీసుకరాగా ఆ వత్తిడికి తట్టుకోలేక నైజాం ప్రభుత్వం స్వయంగా గోవధ నిషేధ ఉత్తర్వులు జారీచేయాల్సి వచ్చింది. ప్రజలు కూడా స్వచ్ఛందంగా గోవధను నిషేధిస్తూ, గోమాంసం స్వీకరించరాదని నిర్ణయించారు. ఈ మేరకు ప్రజలు, నాయకులు బహుళ ప్రచారం గావించారు. ఈ చర్య ద్వారా హిందూ–ముస్లింల మధ్య ఐక్యతకు ఆనాడు ప్రజలు ఇచ్చిన ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు.

## నైజాం నవాబు నిషేధాజ్ఞలు బేఖాతర్

ఈ సందర్భంగా జాతీయోద్యమ నేత ముల్లా అబ్దుల్ ఖయ్యూం ముంజేతికి హిందూ సోదరులు ప్రేమపూర్వకంగా రాఖీలు కట్టారు. భారీ సంఖ్యలో సమావేశమైన హిందూ–ముస్లింలు పరస్పరం రాఖీలు కట్టుకొని ఐక్యతను ప్రదర్శించిన ఘట్టాల గురించి తెలుసుకున్న హైదరాబాద్ నగరంలోని బ్రిటీష్ రెసిడెంటు మండిపడ్డారు. హిందూ–ముస్లింల మధ్య ఐక్యత బలపడితే ఆంగ్లేయుల మనుగడకు ప్రమాదమని గ్రహించిన అతడు నిజాం నవాబు మీద ఒత్తిడి తెస్తూ ఉద్యమాన్ని అణిచి వేయాల్సిందిగా సూచించాడు.

ప్రజల క్రియాశీలక భాగస్వామ్యంతో ఉధృతమౌతున్న ఉద్యమాన్ని నీరుకార్చేందుకు బ్రిటిష్ రెసిడెంటు చేసిన సూచనల మేరకు నైజాం ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. నైజాం సంస్థానంలో, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో సభలు సమావేశాలను పూర్తిగా నిషేధించింది. నగరంలో ఎవ్వరైనా సభలు–సమావేశాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని నిబంధనలు విధించింది.

నైజాం ప్రభుత్వం విధించిన నిషేధాన్ని, నిబంధనలను ప్రజలు, సంస్థలు పూర్తిగా ఉల్లంఘించాయి. నిషేదాన్ని ఉల్లంఘిస్తూ 'జమాయత్–యే–నౌజవాన్–యే–తుల్బా' అను విదార్థి–యువజనల సంస్థ సభ్యులు 1920 మే 30న సభను జరిపారు. ఆ సభ జరపడంలో ప్రధాన పాత్రవహించిన ముహమ్మద్ అబ్దుల్ రహమాన్ రియాస్, అమీర్ అహమ్మద్,

సయ్యద్ ఇబ్రహీం, అబ్దుస్ సుభాన్, అతా హుస్సేన్‌లను నిజాం ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈ విధంగా అరెస్టు అయినవారిలో ముహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్, నవాబ్ అహమ్మద్, ముహమ్మద్ హాఖ్, అబ్దుల్ అజీజ్, జమీల్ అహమ్మద్‌లు హైదరాబాదు వాసులు కానందున వారిని నైజాం సంస్థానం నుండి బహిష్కరించారు.

ఈ రకంగా ఆనాడు ఉద్యమకారుల అరెస్టులు పెద్దఎత్తున సాగడం, భహిష్కరణలు ముమ్మరం కావడం, ఉద్యమకారుల కోసం నిరంతరం జైళ్ళు నోళ్ళు తెరవడం సర్వ సాధారణమైన విషయమైంది. పలువురు నిర్బంధాలకు గురయ్యారు. జైలుశిక్షలను అనుభవించారు. బహిష్కరణలకు గురయ్యారు. అయినా అటు నిజాం సంస్థానంలో, ఇటు ఆంధ్ర ప్రాంతంలో గాని ప్రజలు నైజాం నవాబు ఆజ్ఞలను గాని, బ్రిటీష్ అధికారుల ఆదేశాలను గాని ఏమాత్రం ఖాతరు చేయకుండా జాతీయోద్యమం ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యమ కార్యక్రమాలను తు.చ తప్పక పాటిస్తు ముందుకు సాగారు.

## పారని 'విభజించు-పాలించు' పాచికలు

జాతీయోద్యమ ఉధృతిని గమనించిన బ్రిటీష్ అధికారులు విభజించి-పాలించు ఎత్తులను వేశారు. హిందూ-ముస్లింలను మతం పేరిట విడదీయడానికి శతవిధాల ప్రయత్నించారు. ముస్లింలను మాలిమి చేసుకుని ఉద్యోగాలను ఆశ చూపి ఉద్యమ బాట నుండి మళ్ళించాలని ఎత్తులు వేశారు. పన్నుల నిరాకరణ ఉద్యమం సందర్భంగా తమ పదవులకు రాజీనామా వారికి ఉద్యోగాలు ఇస్తామని, రాజీనామా చేసిన ముస్లిమేతర ఉద్యోగుల స్థానాల్లో ముస్లింలకు ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ పెట్టారు. శిక్షలలో భాగంగా జప్తు చేసిన ముస్లింల ఆస్తిపాస్తులను తిరిగి అప్పగిస్తామని భారీ వాగ్దానాలు చేశారు.

ఆ వాగ్దానాలకు ఎవ్వరూ లొంగలేదు. ముస్లింలు తమ హిందూ సోదరులతో కలసి సాగుతున్న పోరుబాటను వీడలేదు సరికదా ఆంగ్లేయుల ఎత్తులను ఎండగడ్తూ మరింత ఉమ్మడిగా ఉద్యమించారు. ప్రజలలో హిందూ-ముస్లిం అంటూ ఒకరికి వ్యతిరేకంగా మరొకరిని రెచ్చగొడుతూ చీలిక సృష్టించాలన్న అధికారుల కుటిల ప్రయత్నాలను వమ్ముచేశారు. చివరకు పాలకవర్గాల కుయుక్తులన్నీ విఫలమైనాయి. ఈ మేరకు ఖిలాఫత్-సహాయ నిరాకరణ సందర్భంగా యావత్తు దేశంలో వ్యక్తమైన హిందూ-ముస్లిం ఐక్యత ఆంధ్రప్రదేశ్‌లో కూడా చాలా స్పష్టంగా కన్పించింది.

## మద్యపాన నిషేధ ఉద్యమం

భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు అన్ని ఉద్యమపోరాట రూపాలలో భాగస్వాములవుతున్న ముస్లింలు సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా సాగిన మద్యపాన

నిషేధ పోరాటంలో కూడా తమదైన పాత్రను నిర్వహించారు. గుంటూరు, నెల్లూరు, బళ్ళారి, అనంతపురం, కర్నూలు, ఉభయగోదావరి జిల్లాలోని ప్రజానీకం పెద్ద సంఖ్యలో, ఎంతో ఉత్సాహంతో మద్యపాన నిషేధోద్యమంలో పాల్గొంది.

నెల్లూరు జిల్లాలో మద్యం వేలం పాటలను ఉద్యమకారులు నిలిపి వేయించారు. ఆనాటి పోరాటంలో రాజుపాలెం వద్ద అధికారులు రహస్యంగా జరుప తలపెట్టిన వేలం పాటలను ఆపించాలన్న లక్ష్యంతో, తన ఉద్యోగాన్ని కూడా లక్ష్యపెట్టకుండా సయ్యద్ మొషిన్ సాహెబ్ అను చిరు ఉద్యోగి వేలంపాట సమాచారాన్ని రహస్యంగా ఉద్యమకారులకు చేరవేశారు. ఆ సమాచారం వలన అక్కడ వేలం పాటలు ఆగిపోయాయి. ప్రజల ద్వారా మద్యపాన నిషేధాన్ని అమలు చేయించడం తమ ధార్మిక విధిగా ముస్లింలు భావించారు.

నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన మహబూబ్ హుస్సేన్ సాహెబ్ మద్యపాన నిషేధ కార్యక్రమంలో క్రియాశీలక పాత్ర వహించారు. ఆయన తెలుగులో అనర్గళంగా మాట్లాడటమే కాకుండా బాగా పాడగలిగిన వ్యక్తి. మద్యపానం వలన కలుగు దుష్ఫలితాలను వివరించడమే కాకుండా కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాల గీతాలను కూడా మధురంగా పాడుతూ ఉద్యమ వ్యాప్తికి ఎంతగానో దోహదపడ్డారు. (An Account of Anti-Drink Campaign in Nellore Dist. in 1921, by Dr. S.Girija, Published in Andhra Pradesh History Congress, Proceedings of the Twelfth Session, Ankapalle, 1988 Page. 162-63)

ఆంధ్ర ప్రాంతానికి చెందిన ముస్లింలే కాకుండా, నిజాం పాలన క్రిందనున్న తెలంగాణ ప్రాంతపు ప్రజలు కూడా జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు అన్నివిధాల త్యాగాలకు సిద్ధపడ్డారు. హైదరాబాదు రాష్ట్రంలోని బారువంచా గ్రామంలోని జాగీరుదార్లు కుహేష్ సాహెబ్, బుర్హాన్ సాహెబ్‌లు కల్లు, సారాలను విక్రయించవద్దంటూ, నిషేధాన్ని ప్రోత్సహించారు. (ఆంధ్ర ప్రదేశ్‌లో గాంధీజీ, సంపాదకులు : కొడాలి ఆంజనేయులు). ఈ విధంగా అత్యధిక లాభాలను ఆర్జించిపెట్టే కల్లు సారాయి విక్రయాలను సామాన్య ప్రజలు మాత్రమే కాకుండా లాభాలను ఆశించే జాగీర్దారులు కూడా వ్యతిరేకించడం విశేషం.

## అల్లూరికి ఫజుల్లులా ఖాన్ అండదండలు

భారతావనిని కుదిపివేసిన సహాయ నిరాకరణ–ఖిలాఫత్, శాసనోల్లంఘన ఉద్యమాల తరువాత ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రత్యేక వాతావరణం ఏర్పడింది. ఆ సమయంలో ఆంధ్రలో సాగిన విశిష్ట ఉద్యమాలలో ఒకటైన **మన్యం తిరుగుబాటు** రంగం మీదకు వచ్చింది.

1922–24 మధ్యలో గోదావరి జిల్లా మోదుగల్లు గ్రామానికి చెందిన అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో మన్యం తిరుగుబాటు జరిగింది. ఆ సమయంలో అక్కడ

డివిజనల్ మేజిస్ట్రేటుగా (డిప్యూటీ కలెక్టరు) పనిచేస్తున్న ఫజులుల్లా ఖాన్ రామరాజుకు ప్రేరణయ్యారు. రామరాజు తండ్రి అల్లూరి వెంకట రామరాజుకు ఫజులుల్లా ఖాన్ సహాధ్యాయి, ఆప్తమిత్రుడు. ఆ స్నేహాన్ని పురస్కరించుకుని ఆయన రాజుకు తనదైన రీతిలో సహాయపడ్డారు. రామరాజుకు అడ్డతీగల గ్రామ సమీపంలో 60 ఎకరాల భూమిని ఆయన మంజూరు చేయించారు. మన్యం విప్లవానికి సారథ్యం వహించేంతగా ఫజులుల్లా ఖాన్ రాజుకు తోడ్పాటు ఇచ్చారు. చివరకు ఫజులుల్లా ఖాన్ వ్యాధిగ్రస్తులై, కన్నుమూయడంతో మన్యం విప్లవంలో ఆయన నిర్వహించవలసిన ప్రముఖ పాత్ర అసంపూర్ణంగా ముగిసింది.

బ్రిటీష్ ప్రభుత్వం చేత 1938లో నిషేధించబడిన **మన్యంలో విప్లవం** గ్రంథంలో రచయిత పొన్నలూరి రాధాకృష్ణమూర్తి ఈ విషయాన్ని పేర్కొంటూ, **యా భానుని** (రాజు) **తీవ్ర గమనమునకు రధసారధ్యమును వహించవలసిన శ్రీయుత ఫజులుల్లాఖాను గారు మృత్యశయ్యపై నున్నారు. ఫజులుల్లా గారు గొప్ప వ్యాధిగ్రస్తులె పోయిరి. పిదప అనతి కాలంలో ఖాను గారు స్వర్గస్తులైరి...ఖాన్ గారు మరికొంతకాలం జీవించియున్నచో, ఆయన కంఠానికి ఉరిబెట్టి ప్రభుత్వము తన ఆగ్రహమును లోకమునకు ప్రకటించేది**, అన్నారు. (మన్యంలో విప్లవం, పొన్నలూరి రాధాకృష్టమూర్తి, ప్రజాప్రచురణలు,ఏలూరు,1975)

చివరకు డిప్యూటీ కలెక్టరు ఫజులుల్లా ఖాన్ 1922 జూలై 27న మరణించారు. మన్యంలో విప్లవాగ్నులు రగిలించేందుకు వ్యూహాత్మకంగా సాగిన ప్రయత్నాలలో గణనీయమైన పాత్ర నిర్వహించిన ఫజులుల్లా ఖాన్‌కు మన్యం తిరుగుబాటు చరిత్రలో తగినంత స్థానం లభించలేదు. అల్లూరి సీతారామరాజు చరిత్రను ప్రచురించిన చాలా గ్రంథాలు, సినిమాలు గాని ఆయన గురించి కనీసంగా కూడా ప్రస్తావించక పోవటం దురదృష్టకరం. కానీ ఆయన పాత్ర, ఆయన త్యాగం పొన్నలూరి కృషి వలన కొంతలో కొంత వెలుగుచూసింది.

ఈ విధంగా అటు ప్రభుత్వంలో అధికారులుగా, ఉద్యోగులుగా ఉంటూ కూడా రహస్యంగా విప్లవకారులకు, ఉద్యమకారులకు తోడ్పాటు అందజేసిన సాహసులు, త్యాగధనులు ఎందరో ఉన్నప్పటికీ, ఆ యోధులను ఫజులుల్లా ఖాన్‌ను మరచినట్టే చరిత్ర, చరిత్రకారులు మరచి పోవడంతో ఆ పరాయిపాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటాలలో భాగస్వామ్యం వహించిన ఎందరో యోధుల విశేషాలు ప్రజలకు అందకుండా పోయాయి.

## జాతీయ జెండా సత్యాగ్రహం

1923లో జమునాలాల్ బజాజ్ నాయకత్వంతో జాతీయ పతాక సత్యాగ్రహం జరిగింది. ఈ విలక్షణ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి బ్రిటీషు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. జాతీయ పతాకాన్ని గౌరవించడం, పతాకావిష్కరణ గావించడాన్ని బ్రిటీష్




ప్రభుత్వం నిషేధించగా, ఆ నిషేధపు ఉత్తర్వులను ఖాతరు చేయకుండా నాగపూర్‌లో జాతీయపతాక సత్యాగ్రహం జరిగింది. జాతీయ పతాకం ధరించడాన్ని ఆనాడు ప్రభుత్వం నిషేధించగా, ఆ నిషేధాజ్ఞలను ధిక్కరిస్తూ ప్రజలు పెద్ద ఎత్తున సత్యగ్రహంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుండి దేశభక్తి ఉప్పొంగుతున్న వందలాది యువకులు జాతీయ పతాకానికి జేజేలు పలుకుతూ, స్వరాజ్య సంపాదన నినాదాలిస్తూ నాగపూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రాంతం నుండి 40 మంది ఉద్యమకారులు పాల్గొనగా వారందర్ని ప్రభుత్వం అరెస్టుచేసి జైళ్ళలో నిర్బంధించింది.

జాతీయ జెండా సత్యాగ్రహంలో ప్రకాశం జిల్లా గిద్దలూరు నివాసి సయ్యద్ షా మొహిద్దీన్ ఖాద్రి బియబానీ పాల్గొని అరెస్టయ్యారు. ఆ తరువాత స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమాలలో ఆయన ప్రముఖ పాత్ర వహించారు. ఈ ఉద్యమం సందర్భంగా వివిధ ప్రాంతాలలోని పలువురు ప్రముఖులు ప్రేరణ పొంది జాతియోద్యమబాటన సాగారు.

## స్వదేశీ ఉద్యమం-ఖద్దరు ప్రచారం

మాతృభూమి మీద నుండి పరాయి పాలకులను పాలద్రోలాలంటే విదేశీ వస్తువుల వ్యామోహం వదలాలని, స్వదేశీ కుటీర పరిశ్రమలను అభివృద్ధిపర్చుకోవాలని మహాత్ముడు

ఇచ్చిన ఆదేశాల మేరకు స్వదేశీ ఉద్యమం భారత దేశమంతటా పెల్లుబికింది. ఈ ఉద్యమంలో భాగంగా ప్రజలు విదేశీ వస్తువులను ప్రధానంగా విదేశీ వస్త్రాలను త్యజించారు. విదేశీ వస్త్రాలను సేకరించి కుప్పలు కుప్పలుగా పోసి తగులపెట్టారు. ఖద్దరు ధరించారు. ఖద్దరు ధారణను ప్రోత్సహించారు. నూలువడకడం ఒక ఉద్యమ రూపమయ్యింది. అందుకు అవసరమగు ఏర్పాట్లలో కూడా ఉద్యమకారులు పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు.

ఈ కార్యక్రమ నిర్వహణలో తెలుగు బిడ్డలు ఇతరులకు ఏమాత్రం తీసిపోకుండా ముందుకు సాగారు. స్వదేశీ మంత్రం బాగా ప్రచారం కావడంతో ఖద్దరు ధరించడాన్ని ప్రతిఒక్కరు ఎంతో గౌరవంగా భావించారు. ఖద్దరు ధరించడం అంటే బ్రిటీషు ప్రభుత్వాన్ని వ్యతిరేకించడమై పోయింది. ఉద్యమకారులు ఖద్దరు బట్టలు ధరించడం మాత్రమే కాదు ఖద్దరును తయారు చేయడం కూడా ఆరంభించారు. ఖద్దరు బట్టలను ప్రజలకు అందుబాటులో తీసుకరావడానికి ఖద్దరు షాపుల ఏర్పాటు కూడా ముమ్మరంగా జరిగాయి.

ఈ కార్యక్రమాలలో భాగంగా గుంటూరు జిల్లా తొలిసారిగా మహమ్మద్ ఇస్మాయిల్ తెనాలిలో 1926లో ఖద్దరుషాపు ప్రారంభించారు. ఖద్దరు ప్రచార కార్యక్రమాలలో నిరంతరం నిమగ్నమైన ఆయన చివరకు **ఖద్దరు ఇస్మాయిల్** గా స్థిరపడిపోయారు. గుంటూరు జిల్లా తెనాలి కేంద్రంగా కొంతవరకు ప్రభావం చూపిన అల్ ఇండియా ముస్లిం లీగ్ సిద్ధాంతాలను, రాజకీయాలను చివరివరకు నిరసించిన ఆయన కుటుంబం అనేక ఇబ్బందులను ఎదుర్కొంది. ఆయన భార్య హాజరా ఆనాటి సాంఘిక కట్టుబాట్లను కాదంటూ తమ కుమార్తెలను హిందీ విద్యాలయానికి పంపి సంచలనం సృష్టించారు. ఖద్దరు ఇస్మాయిల్ తరహాలోనే నిరంతరం ఖద్దరు ధరించడమే కాకుండా ఖద్దరు విక్రయశాల ఉద్యోగిగా ఖద్దరు ప్రచారాన్ని నిర్వహించడం ద్వారా బాపట్లకు చెందిన షేక్ ఖాశిం బేగ్ **ఖద్దరు జుబ్బా ఖాశిం బేగ్**గా గుర్తింపు పొందారు.

ఆనాడు జాతీయోద్యమంలో పాల్గొన్న ప్రతిఒక్కరూ ఖద్దరును ధరించ సంకల్పించారు. ఖద్దరు ధారణకు అడ్డొచ్చే మతపరమైన ఆంక్షలను ఖాతరు చేయలేదు. ఆరోగ్యరీత్యా, వృత్తిరీత్యా వీలుకాని పరిస్థితులలో తప్ప అందరూ ఖద్దరుధారణ గావించారు. ఈ ప్రభావం నుండి నైజాం సంస్థానం కూడా తప్పించుకోలేకపోయింది.

## నిజాంగడ్డ మీద రెపరెపలాడిన ఖద్దరు

అటు నైజాంలో నిజాం నవాబు ఎంతటి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినా జాతీయోద్యమం ప్రభావం నుండి ప్రజలను ఏమాత్రం దూరంగా ఉంచలేక పోయాడు. నగరంలోని ప్రముఖ జాతీయోద్యమకారులు బద్రుల్ హసన్, అబిద్ హసన్ సఫ్రానిల తల్లి బేగం ఫక్రుల్ హాజియా స్వయంగా ఖద్దరు వస్త్రాలను ధరించడమే కాకుండా విదేశీ వస్తువుల

బహిష్కరణలో పాల్గొన్నారు. 1920లో హైదరాబాద్‌లోని ట్రూప్ బజారులో గల వారి స్వగృహం **అబిద్ మంజిల్**లో విదేశీ వస్త్రాలను అగ్నికి ఆహుతి ఇచ్చారు.

ఆ తల్లితనయులు ఫక్రుల్ హాజియా, బద్రుల్ హసన్, జాఫర్ హసన్‌లు ఖద్దరు ఉద్యమ వ్యాప్తికి ఎంతో కృషి చేశారు. బద్రుల్ హసన్ స్వయంగా బొంబాయి నుండి రాట్నాలు తెప్పించి, హైదరాబాద్‌లో తొలిసారిగా ప్రవేశపెట్టారు. తిలక్ స్వరాజ్య నిధికి ఆయన 23 వేల రూపాయలు సేకరించి పంపారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన సహకార ఉద్యమ నిర్మాతలలో ఆయనొకరు. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రాక సందర్భంగా నిరసన తెలియజేస్తూ విదేశీ వస్తువులను తగులబెట్టిన తొలి వ్యక్తిగా బద్రుల్ హసన్ ఖ్యాతిగాంచారు.

ఆనాడు విదేశీ వస్త్రాలను దహనం చేయడం ఎంత దూరం వెళ్ళిందంటే ప్రజలు మాత్రమే కాకుండా వ్యాపారస్తులు, పారిశ్రామిక వేత్తలు కూడా వ్యాపార నష్టాలను పరిగణ లోకి తీసుకోకుండా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్‌లో ముహమ్మద్ ఉస్మాన్ అను పారిశ్రామికవేత్త తన పరిశ్రమలోగల అన్ని విదేశీ బట్టలను పోగేసి తగులబెట్టారు.

## ఉద్యమ ప్రగతికి అక్షర ప్రచారం

బహుముఖంగా విస్తరిస్తున్న ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు హిందూ-ముస్లింల ఐక్యతకు నాయకులు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆ ఐక్యతను మరింత పటిష్ట పర్చేందుకు అక్షరయోధులు అధికంగా శ్రమించారు. ఆ దిశగా కరపత్రాలు వెల్లువెత్తాయి. పలు గ్రంథాలు ఊపిరి పోసుకున్నాయి.

నగరంలోని నిజాం కళాశాలకు చెందిన గౌసుద్దీన్ అను విద్యార్థి హిందూ-ముస్లింల ఐక్యతకు సంబంధించి ఓ గ్రంథం రాసి ప్రచురించారు. ఒకరి మనోభావాలను మరొకరు గాయపడకుండేట్టుగా మతస్థులు ప్రవర్తించాలని ఆ గ్రంథంలో ఆయన కోరారు. ఒకరి మత మనోభావాలను మరొకరు గౌరవిస్తూ నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఐక్యత వల్ల సర్వం సాధ్యమేనని జనసముదాయాల మధ్యన అనైక్యత ఏర్పడితే అన్నీ అరిష్టాలేనని ఆయన ప్రజలను, ఉద్యమకారులను తన గ్రంథం ద్వారా తీవ్రంగా హెచ్చరించారు.

హైదరాబాదులోని గోషా మహల్ నివాసి ముహమ్మద్ జహూర్ అహమ్మద్ ఖాదీ ఉద్యమాన్ని తన కలం బలంతో బలోపేతం చేశారు. ఆయన రాసిన ఉత్తేజకరమైన వ్యాసాలు హైదరాబాదులోని **ముషీర్-యే-దక్కన్** ఉర్దూ పత్రికలో ప్రచురితమయ్యేవి. ఆ వ్యాసాలలో ఖద్దరు ఉద్యమం ఆవశ్యకత గురించి మహాత్ముడు వెల్లడించిన విషయాలను ప్రజలకు సరళంగా, స్ఫూర్తిదాయకంగా వివరించారు. ఆయన రచనా వ్యాసంతో మాత్రమే సరిపెట్టుకోలేదు. ఉత్తర హిందూస్థానంలో బాగా ప్రజాదరణ పొందిన **మదీనా** వారపత్రికకు

కూడా పలు వ్యాసాలు రాశారు. ఆ వ్యాసాలు అటు ఉత్తర హిందూస్థానంలోనూ ఇటు నైజాం సంస్థానంలోని ప్రజలలో ఖాదీ ఉద్యమం పట్ల అత్యంత ఆసక్తి కలుగచేయడమే కాకుండా ఉద్యమ కార్యకర్తలుగా ప్రజలను బాగా ఉత్సాహపర్చాయి. (ఆంధ్ర ప్రదేశ్ స్వాతంత్రోద్యమ చరిత్ర : కాటం రమేష్)

ఈ క్రమంలో ఉద్యమం సాగుతుండగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని చౌరీచౌరా పోలీస్ స్టేషన్ విధ్యంసం, పోలీసు ఆధికారుల మీద దాడి సంఘటనతో గాంధీజీ ఉద్యమాన్ని ఉపసంహరించుకున్నారు. జాతి యావత్తు ఏకోన్ముఖంగా ఉద్యమ బాటన నడుస్తున్న సందర్భంలో ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమాన్ని విరమించడం పలువురికి రుచించలేదు. ఆ అయిష్టత నుండి కాంగ్రెస్‌పార్టీలో విభేదాలు పుట్టుకొచ్చాయి. సాహసులైన కొందరు యువకులు బ్రిటీషర్లను తరిమి కొట్టేందుకు సాయుధ పోరాట మార్గాన్ని ఎన్నుకున్నారు.

## సైమన్ కమిషన్

ఆ సమయంలో 1919 నాటి మాంటేగ్ ఛెమ్సఫర్డ్ చట్టం ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకంటూ బ్రిటీష్ ప్రభుత్వం సర్ జాన్ సైమన్ నాయకత్వంలో ఒక కమీషన్‌ను భారత దేశానికి పంపేందుకు 1927లో నిర్ణయించింది. ఆ కమీషన్‌లో సభ్యులుగా భారతీయులకు స్థానం కల్పించలేదు. భారతీయులు లేకుండా భారతదేశంలో 1919 నాటి చట్టం ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి వస్తున్న సైమన్ కమీషన్‌ను బహిష్కరించమని భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ ముక్తార్ అహమ్మద్ అన్సారి ప్రజలకు పిలుపునిచ్చారు.

ఆ పిలుపును అందుకున్న ఆంధ్రులు పలు ప్రాంతాలలో సభలు, సమావేశాలు, హర్తాళ్‌లు నిర్వహించి సైమన్ కమీషన్ రాకకు వ్యతిరేకంగా తీవ్ర నిరసన తెలిపారు. ఆ సందర్భంగా మద్రాసులో జరిగిన సైమన్ కమీషన్ బహిష్కరణ, ఊరేగింపు నిర్వహణలో భాగస్వామ్యం వహించినందుకు ప్రముఖ నాయకులు షఫీ మహమ్మద్ పలువురు ఇతర నేతలతో పాటుగా అరెస్టు అయ్యారు.

ఆ తరువాత 1928లో కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం విదేశీ వస్తువులను బహిష్కరించాలని, కాంగ్రెస్ వాదులు ఖద్దరు ధరించాలని తీర్మానించింది. ఆ కార్యక్రమాన్ని స్వయంగా గాంధీజీ ప్రకటించి, ప్రారంభించారు.

జాతీయోద్యమాన్ని ఉదృతం చేయడానికి, కార్యక్రమాలను మరింత క్రియాశీలకంగా నిర్వహించడానికి యువకుల భాగస్వామ్యం అత్యవసరమని భారత జాతీయ కాంగ్రెస్ భావించింది. ఆ దిశగా ప్రయత్నాలు ఆరంభమైనాయి. 1928 మే మాసంలో గుంటూరులో **యువజన సమితి** ఏర్పడింది. ఆ సమితి ఏర్పాటుకు గాలిబ్ సాహెబ్, రహిమాన్‌లు అవిరళ

కృషి సల్పారు. షేక్ గాలిబ్ సాహెబ్ యువజన సంఘాలకు, విద్యార్థి సంఘాలకు సమర్ధవంతమైన నాయకత్వం మాత్రమే కాకుండా మార్గదర్శకత్వం అందించారు. పలు సంవత్సరాలు ఆయా సంఘాల ప్రధాన కార్యదర్శిగా ఆయన వ్యవహరించారు. అంతేకాదు గుంటూరు బ్రాడిపేటలో ఆయన తన సోదరుని పేరిట నిర్వహించిన లాండ్రి షాపు ఆనాడు జాతీయ ఉద్యమకారులకు రహస్య కూడలి అయ్యింది. ఆ కారణంగా ఆ లాండ్రి మీద పలుమార్లు పోలీసుల దాడి జరిగింది. చివరకు ఆయన మీద విధించిన జరిమానా రాబట్టుకునేందుకు అందులోని సామగ్రి కూడా అధికారుల జప్తుకు గురయ్యింది.

## రాష్ట్రంలో గాంధీజీ పర్యటన

1929లో గాంధీజీ ఆరు వారాలు ఆంధ్రలో పర్యటించారు. ప్రజల నుండి జాతీయ ఉద్యమం కోసం విరాళాలు సేకరించారు. ఆయన ప్రయాణిస్తున్న రైలులో తనను దర్శించ వచ్చిన వారి నుండి ఆయన విరాళాలు కోరారు. ఆ సందర్భంగా ఒంగోలుకు చెందిన విద్యార్థి సయ్యద్ అబ్దుల్ ఆజీం, తన మిత్రులతో కలసి రైలులో విరాళాలు సేకరించి, ఆ మొత్తానికి తనకు తల్లితండ్రులిచ్చిన ప్యాకెట్ మనీని జోడించి, గాంధీజీకి అందించి ఆయన అభినందనలు అందుకున్నారు. ఆనాటి ఆ విద్యార్థి ఆ తరువాత జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన ఉద్యమాలన్నిటిలో పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పోలీసుల చేతచిక్కి చావు దెబ్బలు తిని, చాకచక్యంగా తప్పించుకుని ఆరు మాసాలు అజ్ఞాతవాసం గడిపారు. ఆనాడు అబ్దుల్ అజీం లాంటి యువకులు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమించేందుకు విద్యార్థి, యువజన సంఘాలలో పాల్గొన్నారు.

## సంపూర్ణ స్వరాజ్య తీర్మానం

1929లో భారత జాతీయ కాంగ్రెస్ లాహోర్‌లో చారిత్రాత్మక సమావేశం జరుపుకుంది. ఈ సమావేశంలో తన రాజ్యాంగంలో నున్న **స్వరాజ్యం** అను మాటకు **సంపూర్ణ** అను మాటను చేర్చింది. ఈ రకమైన తీర్మానాన్ని 1927లో మౌలానా హస్రత్ మెహానీ ప్రతిపాదించగా, మహాత్ముడు అడ్డుపడటంతో అది ఆనాడు తీర్మానం కాలేకపోయింది. ఆనాడు అటంకాలు ఎదురైనా 1929లో మౌలానా మెహానీ కన్న కల నిజమైంది.

ఈ మేరకు **సంపూర్ణ స్వరాజ్యం** సాధనకు అనుసరించాల్సిన ఉద్యమ వ్యూహాన్ని నిర్ణయించమని కాంగ్రెస్ గాంధీజీని కోరింది. సంపూర్ణ స్వరాజ్యం తమ లక్ష్యంగా ప్రకటించి ముందుకు సాగుతున్న ఉద్యమాన్ని అడ్డుకోవడానికి బ్రిటీష్ వైస్రాయి ఇర్విన్ నిరంకుశంగా వ్యవహరించ సాగాడు. బ్రిటీష్ వైస్రాయి అప్రజాస్వామిక వ్యవహార సరళికి వ్యతిరేకంగా గాంధీజీ శాసనోల్లంఘన ఉద్యమాన్ని ప్రకటించారు.


ఈ సందర్భంగా ప్రముఖ రచయిత, జాతీయోద్యమంలో చిచ్చరపిడుగుగా ఖ్యాతి గడించిన హస్రత్ మెహాని పలుమార్లు హైదరాబాదు సందర్శిస్తూ స్థానికులలో సంపూర్ణ స్వరాజ్య భావనలను విస్తరింపచేశారు. ఆయన ప్రభావంతో నిజాం సంస్థానంలోని రజియా బేగం, జమాలున్నీసా బాజి లాంటి వారు జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఈ సోదరీమణుల కుటుంబీకులందరూ స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలు, అన్నిరకాల అసమానతల నుండి ప్రజల విముక్తి కోరుతూ జాతీయోద్యమంలో పాల్గొనడమే కాకుండా, అటు సామ్రాజ్య విస్తరణకాంక్ష గల బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదిరించడంతోపాటు, నిజాం వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్నారు.

జమాలున్నీసా బాజి, రజియా బేగంల తల్లితండ్రులు జాతీయోద్యమంలో పరోక్ష పాత్రను నిర్వహించారు. ఉద్యమబాట నడిచేందుకు తమ పిల్లలకు స్వేచ్ఛ కల్పించారు. అంతటితో ఆగకుండా వారు కూడా స్వయంగా సభలు సమావేశాలకు హాజరయ్యారు. తమ గృహంలో ఉద్యమకారులు రహస్యంగా సమావేశాలు జరుపుకోడానికి అవకాశాలు కల్పించారు. ఉద్యమకారులకు ఆశ్రయం కల్పించి, అన్నపానీయాలు అందించి ఆదుకున్నారు. ఆ దంపతుల కుమారులుగా పోరుబాటన నడిచిన వారిలో హైదరాబాదుకు చెందిన అన్వర్, జాఫర్‌లు ఉన్నారు.

## ఉత్సాహభరితం ఉప్పు సత్యాగ్రహం

బ్రిటీషు ప్రభుత్వ చట్టాల ఉల్లంఘన ద్వారా శాసనోల్లంఘన ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్న మహాత్మా గాంధీ గుజరాత్‌లోని **దండి** ప్రాంతాన్ని తన కార్యక్షేత్రం చేసుకున్నారు. ఆ సముద్ర తీర ప్రాంతాన ఉప్పును తయారు చేసి బ్రిటీష్ శాసనాలను బహిరంగంగా ఉల్లంఘించాలని కార్యక్రమం రూపొందించారు. ఆ నిర్ణయం మేరకు 1930 మార్చి 20న 78 మంది అనుచరులతో సబర్మతి ఆశ్రమం నుండి దండికి బయలు దేరారు. అది ఒక యాత్రలా సాగింది. ఈ చారిత్రాత్మక యాత్రను **దండియాత్ర** అని పిలవడం జరిగింది. దండి చేరుకున్న గాంధీజీ అనుచరులతో కలసి ఏప్రిల్ ఆరున ఉప్పు తయారు చేసి ప్రభుత్వ శాసనాన్ని ఉల్లంఘించారు. అప్పటినుండి శాసనోల్లంఘన ప్రారంభమైంది. గాంధీజీ పిలుపును అందుకున్న ఆంధ్రులు శాసనోల్లంఘనకు ఉపక్రమించారు.

ఆంధ్రదేశమంతటా ఉప్పు తయారు చేయడంతో ప్రారంభమైన బ్రిటీష్ ప్రభుత్వ శాసనాల ఉల్లంఘన, ఉప్పు కొటారాలను స్వాధీనం చేసుకోవడం, విదేశీ వస్తువులను తగుల బెట్టడం, మద్యపాన నిషేధం, అంటరానితనాన్ని వ్యతిరేకించడం తదితర కార్యక్రమాలతో తెలుగు నేల మీద సత్యాగ్రహోద్యమం ఉత్సాహభరింగా సాగింది. ఈ ఉద్యమంలో ముస్లిం జనావళి ఎప్పటిలాగే తనదైన భాగస్వామ్యాన్ని అందిస్తూ, బ్రిటీష్ పోలీసుల దాష్టీకాలకు



అయ్యదేవర కాళేశ్వరరావు నాయకత్వంలో సాగిన ఉప్పు సత్యాగ్రంహం దళసభ్యుల ప్రదర్శన.

గురయ్యింది. అన్ని ప్రాంతాలలోని ప్రజలు రకరకాల జైలుశిక్షలను అనుభవించారు.

మద్రాసులో జరిగిన శాసనోల్లంఘనలో ఒబైదుల్లా సాహెబ్ అరెస్టు అయ్యారు. ఆయనకు 18 మాసాల జైలు శిక్ష పడింది. చిత్తూరుజిల్లా మదనపల్లె తాలూకా పెదపాలెం నివాసి షేక్ ఇమాం మూడు మాసాల జైలు శిక్షను అనుభవించారు. ప్రకాశం జిల్లా, అమ్మనబ్రోలుకు చెందిన షేక్ చెంగీ షా కనపర్తిలోని ఉప్పు కొటారాల మీద జరిగిన దాడిలో పాల్గొన్నారు. బెహాంపూర్‌కు చెందిన రషీద్ ఖాన్, పశ్చిమ గోదావరికి చెందిన డాక్టర్ నశీర్ అహమ్మద్ విదేశీ వస్తువుల బహిష్కరణ, మద్యనిషేధం ఉద్యమంలో పాల్గొన్నారు.

డాక్టర్ నశీర్ 1910లో కలకత్తాలో వైద్య విద్యను అభ్యసించారు. రెడ్‌క్రాస్ బృందంలో చేరి టర్కీలో గాయపడిన క్షతగాత్రులకు అందించిన సహకారానికి టర్కీ సుల్తాన్ నుండి ఆయన అవార్డులు పొందారు. చివరకు స్వస్థలం చేరుకున్న ఆయన జాతీయోద్యమంలో ప్రముఖ పాత్రను నిర్వహించారు. స్వగృహం వద్దే శాసనోల్లంఘన ఉద్యమ శిబిరం ఏర్పాటు చేశారు. జాతీయ కాంగ్రెస్ సభ్యులైన ఆయన ఆరు నెలల జైలు జీవితం గడిపారు.

గుంటూరుకు చెందిన షేక్ గాలిబ్ సాహెబ్ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1930లో సంవత్సరం పాటు జైలు శిక్షను అనుభవించారు. జైలు నుండి రాగానే మళ్ళీ ఉద్యమించి 50 రూపాయల జరిమానా, జైలు శిక్షకు గురయ్యారు. రాయలసీమకు చెందిన ప్రముఖ నాయకుడు యం.షంషీర్ బేగ్ పలుమార్లు జైలుశిక్షలకు గురయ్యారు. నెల్లూరు జిల్లాలో యల్.ఫకీర్ వంటివారు ఉప్పు సత్యాగ్రహంలో ప్రముఖ పాత్ర వహించారు.

ఉప్పుసత్యాగ్రహం సందర్భంగా కార్యకర్తలు శాంతియుతంగా ఉండాలని, సత్యాగ్రహ కార్యకర్తల మీద లాఠీచార్జీ జరుగుతున్నప్పుడు పోలీసుల మీద రాళ్ళు రువ్వడం తదితర హింసాత్మక చర్యలకు ప్రజలు, ప్రధానంగా ఉద్యమ కార్యకర్తలు పాల్పరాదని ఆదేశిస్తూ భారత జాతీయ కాంగ్రెస్ ప్రచురించిన కరపత్రాలను ప్రకాశం జిల్లా బాపట్లకు చెందిన అబ్దుల్ రజాక్, షేక్ మూసా సాహెబ్‌లు గోడల మీద అంటిస్తుండగా పోలీసులు దాడిచేసి చితకబాది, వారిని నిర్బంధంలోకి తీసుకుని రాత్రంతా జైలులోఉంచారు.

ఈ సందర్భంగా స్వదేశీ వస్తు ప్రచార కరపత్రాలను ప్రజలకు పంచుతున్న షేక్ నబీసాహెబ్‌ను ఆయన సహచరులను పోలీసులు పట్టుకుని బెత్తాలతో విరగబాదారు. ఆ భయంకరమైన ఆ దెబ్బలు భరించలేక నబీసాహెబ్ ఆయన సహచరులు సృహ కోల్పోయి క్రింద పడిపోయారు.


స్వచ్ఛంద సేవకులను అడ్డుకుంటున్న పోలీసు లాఠీలను లెక్కచేయకుండా చీరాల యువకుల ఆహ్వానం మేరకు వెళ్ళి ఉప్పుగుడారాలలోకి దూకిన ముహమ్మద్ గౌస్ ధైర్య సాహసాలను ప్రదర్శించారు. ఆయన చూపిన చొరవతో మిగిలిన నాయకులు, యువకులు అయనను అనుసరించారు. (గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం, మాదల వీరభద్రరావు, పేజి. 141). ముహమ్మద్ గౌస్ దేవరంపాడు శిబిరానికి నాయకత్వం వహించారు. ఆయన ప్రభుత్వం విధించిన జైలు శిక్షలకు ఏమాత్రం భయపడకుండా యువకుల్ని ఉత్సాహపర్చుతూ శిబిర నిర్వహణ కార్యక్రమంలో క్రియాశీలక బాధ్యతలు నిర్వహించారు. ఆ శిబిరానికి నాయకత్వం వహించినందుకు ఆయన మరో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించారు.

బ్రిటీష్ ప్రభుత్వం తన పోలీసుల ద్వారా ఎంతటి దాష్టీకాన్ని ప్రదర్శించినా సత్యాగ్రహ కార్యకర్తలుకాని, భారత జాతీయ కాంగ్రెస్ స్వచ్ఛంద కార్యకర్తలుగాని, నాయకులు గాని, ఉత్సాహం ఉరకలెత్తుతున్న యువతగాని, ప్రజలుగాని గాంధీ మార్గాన్ని వీడలేదు.

## గాంధీ-ఇర్విన్ ఒప్పందం

గాంధీజీ-ఇర్విన్‌ల మధ్యన కుదిరిన ఒప్పందం వలన 1931 జనవరితో శాసనోల్లంఘన ఉద్యమం ముగిసింది. ఆ ఒప్పందం వలన జైళ్లలో నున్న ఉద్యమకారులను ఆంగ్లేయ ప్రభుత్వం విడుదల చేసింది. ఆ కారణంగా ఉద్యమకారులకు కొంత ఉపశమనం లభించింది. ఈవిధంగా దక్కిన ఉపశమనం అతి కొద్దిరోజుల్లో ముగిసింది.

స్వరాజ్యం మాత్రమే తమ ఏకైక లక్ష్యంగా, శాసనోల్లంఘన కాలంలో భారతీయులు కష్టనష్టాలకోర్చి ఉద్యమించిన తీరును చూసిన బ్రిటీషు ప్రభుత్వం జాతీయోద్యమాన్ని తీవ్రంగా అణిచివేయాలని నిర్ణయించుకుంది. అందుకు తగిన చట్టాలను రూపొందించి, పోలీలకు



బెజవాడ కాంగ్రెస్ భవనం

అధికారాలను కట్టిపెడ్తూ, పోలీసు చర్యలకు శ్రీకారం చుట్టింది. ప్రజల మీద తీవ్ర అణిచివేత చర్యలకు పాల్పడింది. ఆ కారణంగా హింసాత్మకచర్యలు మళ్ళీ ఆరంభమైనాయి. బ్రిటీష్ వైస్రాయి ఇర్విన్ స్థానంలో వచ్చిన విల్లింగ్‌టన్ జాతీయోద్యమకారుల పట్ల మరింత క్రూరంగా వ్యవహరించసాగాడు. ఆ చర్యలను ఖండిస్తూ గాంధీజీ వైస్రాయికి లేఖ రాశారు. ప్రభుత్వం అణచివేత ధోరణులను మానుకోకపోతే మళ్ళీ శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభించాల్సి వస్తుందని ఆ లేఖలో హెచ్చరించారు. ఈసారి వ్యక్తి సత్యాగ్రహం సాగించాలని గాంధీజీ నిర్ణయించారు. శాసనోల్లంఘన ఉద్యమం ద్వితీయ దశలో గాంధీజీ కోరినట్టుగానే వ్యక్తిగత సత్యాగ్రహంలో ప్రజలు అమితోత్సాహంతో పాల్గొన్నారు.

## బెజవాడ కాంగ్రెస్ కార్యాలయం పునరాక్రమణ

శాసనోల్లంఘన ఉద్యమం ఉధృతంగా సాగడంతో బ్రిటీష్ పోలీసులు మరింతగా రెచ్చిపోయారు. జాతీయ కాంగ్రెస్ కార్యాలయాన్నీ ఉద్యమకారులకు ప్రధాన కేంద్రాలుగా మారడంతో పోలీసులు ఆ కార్యాలయాల మీద కన్నువేశారు. నాయుకుల మీద నిఘా పెంచారు. ఆంధ్రదేశంలోని పలు ప్రాంతాలలోని కాంగ్రెస్ కార్యాలయాల మీద దాడులు చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ కార్యాలయాల మీద మాత్రమే కాకుండా జాతీయ కాంగ్రెస్‌కు అనుబంధంగా పనిచేస్తున్న పలు ప్రజా సంఘాల మీద కూడా దృష్టి సారించిన పోలీసులు అకస్మిక దాడులతో ప్రజలను హడలగొట్టారు. ఈ సందర్భంగా జాతీయ కాంగ్రెస్‌కు చెందిన కార్యాలయాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ కార్యాలయాల నిర్వహకులను

అదుపులోకి తీసుకుని, అరెస్టులు చేసి, కార్యాలయాలకు తాళాలు వేశారు.

ఈ చర్యలలో భాగంగా ప్రతిష్టాకరమైన విజయవాడలోని భారత జాతీయ కాంగ్రెస్ కార్యాలయం మీద కూడా పోలీసులు దాడులు నిర్వహించారు. ఆ కార్యాలయాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకుని దానికి తాళాలు వేశారు. ఆ తరువాత ఉద్యమకారులను నిరోధించేందుకు అరెస్టులు, నిర్బంధాలు ఆరంభించారు.

ఈ అరెస్టులు, నిర్బంధాల విషయం ఎలా ఉన్నా భారత జాతీయ కాంగ్రెస్ కార్యాలయాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం, కార్యాలయానికి తాళాలు వేయడాన్ని విజయవాడకు చెందిన జాతీయోద్యమకారులు జీర్ణించుకోలేకపోయారు. ఈ పోలీసు చర్యతో ప్రధానంగా యువకులు రెచ్చిపోయారు. భారత జాతీయ కాంగ్రెస్ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోవడం తమకు తీరని అవమానంగా భావించారు. అవమానభారంతో ఆగ్రహించిన ప్రజలు ముఖ్యంగా యువకులు ఆంగ్ల ప్రభుత్వ సాయుధ పోలీసుల స్వాధీనం నుండి జాతీయ కాంగ్రెస్ కార్యాలయాన్ని విముక్తం చేయాలనుకున్నారు. అందుకు ఎటువంటి మూల్యం చెల్లించాల్సి వచ్చినా మేం సిద్ధం అంటూ యువకులు ప్రకటించారు.

ఆ నిర్ణయం మేరకు ఉత్సాహవంతులైన ఉద్యమకారులు సాగించిన ప్రయత్నాలకు సాహసవంతుడు, యువనాయకుడు సయ్యద్ హబీబుల్లా నాయకత్వం వహించారు. ఈ సమాచారం ముందుగా పసికట్టిన ప్రభుత్వం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఆ బందోబస్తు ఏర్పాట్లను ఏమాత్రం ఖాతరు చేయకుండా 1932 జులై 31న కాంగ్రెస్ కార్యకర్తలు విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భవనాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సయ్యద్ హబీబుల్లా నేతృత్వంలో విఫల ప్రయత్నం చేశారు. ముందు జాగ్రత్తలు తీసుకున్న, సాయుధ పోలీసుల అదుపులో ఉన్న కాంగ్రెస్ కార్యాలయాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం ఉద్యమకారులకు కష్టతరమైంది. అయినా వెనుకడుగు వేయకుండా ముందుకు సాగిన యువ నాయకుడు సయ్యద్ హబీబుల్లాతోపాటుగా ఆ సాహసానికి ఒడిగట్టిన మరో 70మంది యువకులు అరెస్టయ్యారు. (భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర, కృష్ణాజిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం, విజయవాడ, 1984, పేజి.92)

## మారువేషాల్లో ప్రచారం

ఈ విధమైన సాహస ఘట్టాలు జరుగుతుండగా దేశవ్యాప్తంగా శాసనోల్లంఘన ఉద్యమాన్ని మరింత వేగవంతం చేసేందుకు ఢిల్లీలో జాతీయ నాయకుల నిర్ణయించారు. ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అగ్రనాయకుల ఆధ్వర్యంలో ఢిల్లీలో రహస్య రాజకీయ తరగతులు జరిగాయి. ఆ తరగతులకు ఆంధ్ర నుండి ప్రతినిధులు హాజరై తిరిగి

వచ్చి రాష్ట్రంలో కూడా అధ్యయన తరగతుల నిర్వహణకు నడుం కట్టారు. ఈ మేరకు తెనాలిలో జరగనున్న రహస్య సభలకు ప్రతినిధుల సమీకరణ కోసం అతి రహస్యంగా ప్రచారం సాగింది. ఆ రహస్య ప్రచార కార్యక్రమాన్ని తెనాలి ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ మహబూబ్ ఆదం, ఆయన గురువు మంత్రవాది వెంకటరత్నంలు సంయుక్తంగా నిర్వహించారు. ఈ గురుశిష్యులు పోలీసుల కన్నుగప్పి ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయగలిగారు. పోలీసులకు పట్టుబడితే ప్రాణాంతక శిక్షలు తప్పవని తెలిసి కూడా మహమూబ్ ఆదం ఎంతో తెగువతో గురువు మంత్రవాది వెంట నడిచారు.

కర్నూలు జిల్లా చెందిన యం.షంషీర్ బేగ్ శాసనోల్లంఘనలో ప్రముఖ పాత్ర వహించారు. ఉన్నత పాఠశాల విద్యార్థి అయినటువంటి ఆయన శాసనోల్లంఘన పిలుపును అందుకుని బ్రిటీష్ వ్యతిరేక పోరాట జీవితాన్ని ప్రారంభించి చివరి వరకు ఉద్యమబాటన సాగారు.

1932 ఆగస్టు 17న ప్రభుత్వం కమ్యూనల్ అవార్డును ప్రకటించింది. హరిజనులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఆ కమ్యూనల్ అవార్డును గాంధీజీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ అవార్డుకు వ్యతిరేకంగా నిరసన దీక్షను పూనారు. ఈ దశలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మహాత్మా గాంధీజీల మధ్య ఒప్పందం కుదిరింది. అది **పూనా ఒప్పందం**గా ప్రసిద్ధి చెందింది. ఈ సందర్భంగా గాంధీజీ హరిజన యాత్ర జరిపారు. ఈ నేపథ్యంలో ఆయన తన ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా 1933 డిసెంబరు 31న తిరుపతికి రాగా అక్కడ సి.ఎ.రహీం అను ఉత్సాహవంతుడైన యువకుడు కాగితం మీద చేతి గోటితో ప్రత్యేకంగా చిత్రించిన గాంధీజీ చిత్రాన్ని ఆయనకు బహుకరించారు.

## విప్లవ కార్యకలాపాల జోరు

ఆ తరువాత సంభవించిన వివిధ పరిణామాల వలన, సంపూర్ణ స్వరాజ్య సాధనా లక్ష్యంగా ప్రారంభమైన శాసనోల్లంఘన ఉద్యమం బలహీనపడి 1934లో పూర్తిగా ముగిసింది. ఈ ఉద్యమాలలో చదువుకున్నవారు మాత్రమే కాకుండా చిన్న చిన్న వృత్తులు చేసుకుంటూ భారంగా బ్రతుకులీడ్చుతున్న వ్యక్తులు కూడా బ్రిటీష్ బానిస బంధనాలలో నున్న తమ మాతృదేశం పరిస్థితిని చూడలేక పోలీసుల కిరాతకాలను మౌనంగా భరిస్తూ స్వంతగడ్డ విముక్తి కోరుతూ ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించడం విశేషం.

గాంధీజీ శాసనోల్లంఘన ఉద్యమాన్ని విరమించుకోవడం పట్ల యువకులు కినుక వహించారు. అహింసా మార్గం వలన ఆంగ్ల ప్రభుత్వాన్ని లొంగదీయడం ఎప్పటికి సాధ్యం కాదనుకున్నారు. విప్లవ కార్యక్రమాల ద్వారానే, సాయుధ పోరాటం ద్వారా మాత్రమే ప్రభుత్వం

ప్రజల గోడు వింటుందని భావించిన సాహసులైన యువకులు ఆ మార్గాన్ని ఎంచుకున్నారు. రహస్యంగా విప్లవ కార్యక్రమాలను ముమ్మరంగా సాగించారు. ఆ కార్యక్రమాలలో తెనాలికి చెందిన మున్షీ మహమ్మద్ మస్తాన్, ఒంగోలుకు చెందిన రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు. రహమతుల్లా మీద బాంబుల తయారి కేసు నమోదయ్యింది. ఆయన శిక్షలు అనుభవించారు. ఆ తరువాతి కాలంలో ప్రముఖ రాజకీయవేత్తగా రహమతుల్లా రాణించారు.

తెనాలికి చెందిన మున్షీ ముహమ్మద్ మస్తాన్ పలు ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధునిగా ఖ్యాతి గడించారు. మున్షీ మస్తాన్ విప్లవ కరపత్రాలను పంచడమే కాక, మంతెనవారి పాలెంలో రహస్యంగా నిర్వహించిన రాజకీయ తరగతులకు హాజరై, పోలీసుల చేత చిక్కారు. ఆయనను 21 రోజుల పాటు పోలీసులు తమ కస్టడీలో ఉంచుకుని చితకబాది వదిలారు.

## హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ ఏర్పాటు

ఆంధ్ర ప్రాంతంలో ఈ కార్యక్రమాలు ఇలా ఉండగా నైజాం సంస్థానం రాజధాని అయినటువంటి హైదరాబాద్‌లో కూడా బ్రిటీష్ ప్రభుత్వ వ్యతిరేక రాజకీయ కార్యకలాపాలు బాగా ఊపందుకున్నాయి. ఈ వాతావరణం పక్వానికొచ్చి చివరకు 1939లో **హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్** ఏర్పడింది. రాష్ట్ర కాంగ్రెస్ ఏర్పాటుకు ముందు పలు ప్రజా సంఘాలు, మేధావుల నేతృత్వంలో పలు సంఘాలు, సంస్థలు ఏర్పడ్డాయి. ఆయా సంఘాల-సంస్థల, అందులోని వ్యక్తుల కృషి, త్యాగాలు, ఆయా నాయకులు ప్రజానీకంలో కలుగచేసిన చైతన్యం, సృష్టించిన భావజాలం ఫలితంగా హైదరాబాదు రాష్ట్రంలో భారత జాతీయ కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం ఏర్పడింది.

## మతాతీత ఐక్యతకు ప్రతీక 'నిజాం సబ్జెక్ట్సు లీగ్'

హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ స్థాపనకు తగిన రాజకీయ అనుకూల వాతావరణం ఏర్పాటుకు తోడ్పడిన పలు సంస్థలలో **నిజాం సబ్జెక్ట్సు లీగ్** ఒకటి. జాతీయ భావాలు గల మేధావులు మతాతీతమైన ఒక రాజకీయ సంస్థ ఏర్పాటు అవసరాన్ని గుర్తించి, ఆ దిశగా చేసిన కృషికి ప్రతిరూపంగా **నిజాం సబ్జెక్టు లీగ్** 1935లో అవతరించింది. హైదరాబాదు రాష్ట్రంలోని ప్రజలలో స్థానికంగా ఏర్పడిన సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నాలు ఆరంభమైనాయి. స్థానిక సంస్థలలో ఉద్యోగాలు లభించని స్థానికులు ఈ విషయం మీద ఆలోచనలు సాగించారు. ఆ ఆలోచనల పర్యవసానంగా ఉమ్మడి సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగారు. ఉమ్మడి సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు సామాజికంగా సామరస్యం, రాజకీయంగా బాధ్యతాయుత ప్రభుత్వం అను అంశాల మీద దృష్టి సారించి,

ఆ లక్ష్యంగా పని ప్రారంభించారు. అత్యంత ప్రాధాన్యతగల లక్ష్యాలను సాధించే ప్రయత్నాలలో భాగంగా, **నిజాం రాష్ట్రంలోని వివిధ కుల, మత వర్గాలకు చెందిన వారిలో సఖ్యత, సామరస్యం కలుగచేయాలని, ప్రాథమిక సభ్యత్వాలు సమకూర్చాలని, రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వం స్థాపించాలన్న** ఉద్దేశ్యంతో బూర్గుల రామకృష్ణారావు మార్గదర్శకత్వంలో డాక్టర్ సరోజిని నాయుడు కుమార్తె పద్మజా నాయుడు, శ్రీనివాస శర్మ, అబుల్ హసన్ సయ్యద్ అలీ, బద్రుల్ హసన్, ఫజులుర్రెహమాన్, సిరాజుల్ హసన్ తిర్మిజ్ లాంటి ప్రముఖులంతా కలసి **నిజాం సబ్జెక్ట్సు లీగ్** (Nizam Subjects League) ఏర్పాటుకు కారకులయ్యారు.

నిజాం సబ్జెక్ట్సు లీగ్ సంస్థ వ్యక్తం చేసిన భావాలలో ఉన్న ఔనత్యాన్ని ప్రజలలో ప్రచారం చేయలన్న ఉద్దేశ్యంతో ప్రముఖ జాతీయవాది బద్రుల్ హసన్ **విదర్ హైదరాబాద్** (Whither Hyderabad) అను గ్రంథాన్ని రాశారు. ఈ గ్రంథ రచన ద్వారా ప్రజలలో జాతీయ భావాలను, ప్రజా పాతినిధ్య ఆలోచనలు ప్రోదిచేయాలని బద్రుల్ హసన్ ప్రయత్నించారు. గ్రంథం రచన పూర్తి చేసినప్పటికి దాని ప్రచురణ మాత్రం కష్టమైంది. ఈ గ్రంథం ప్రచురణకు నిజాం ప్రభుత్వం తీవ్ర ఆటంకాలు కల్పించింది. ఆ కారణంగా నిజాం సంస్థానం వెలుపలి ప్రాంతం నుండి గ్రంథాన్ని ప్రచురించాల్సి వచ్చింది. అతి కష్టం మీద ప్రచురితమైన బద్రుల్ హసన్ గ్రంథం **విదర్ హైదరాబాద్** బహుళ ప్రజాదరణ పొందింది. అది సహించలేని నిజాం ప్రభుత్వం ఆ గ్రంథాన్ని నిషేధించింది.

1940 ప్రాంతంలో **విదర్ హైదరాబాద్** గ్రంథాన్ని కొమరగిరి నారాయణరావు తెలుగులోకి అనువదించి ప్రచురించగా, అది ప్రజల వద్దకు చేరకముందే నిజాం ప్రభుత్వం ఆఘమేఘాల మీద చర్యలు తీసుకుని కాపీలన్నిటిని స్వాధీనం చేసుకుంది. ఆ కారణంగా జాతీయ భావాల ప్రచారానికి, ఉమ్మడి రాజకీయ సంస్థను ఏర్పాటు చేయడానికి కావాల్సిన వాతావరణం ఏర్పాటుకు అక్షరాలను పనిముట్లుగా చేసుకుని తగిన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని అనుకున్న బద్రుల్ హసన్ ఆశలు మొగ్గలోనే తుంచి వేయబడ్డాయి.

నిజాం సబ్జెక్ట్సు లీగ్ సంస్థకు మౌలానా సిరాజుల్ హసన్ తిర్మిజ్ అధ్యక్షులుగా, ఫజులుర్రెహమాన్ కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సంస్థ ఆశయాలలో స్వేచ్ఛ-స్వాతంత్ర్యకాంక్షల ఛాయలున్నా **బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపనకు ప్రయత్నించటం, హిందూస్థానీ ప్రచారం చేయుట** లాంటి అంశాలు ఉండడంతో వాటిని తొలగించాలని నిజాం ప్రభుత్వం నుండి ఒత్తిడి వచ్చింది. ఒత్తిడితోపాటుగా లీగ్ విచ్ఛిన్నానికి కుతంత్రాలు కూడా పెద్దఎత్తున సాగటంతో సంస్థలో విభేదాలు పొడచూపాయి. ఆ కారణంగా అన్ని మతాల, కులాల ప్రజలతో కూడిన రాజకీయ సంస్థ ఏర్పాటుకు సాగిన తొలి ప్రయత్నం విఫలమైంది. కుల, మతాలకు అతీతంగా ప్రజలలో ఏర్పడనున్న గట్టి స్నేహ సంబంధాల

వ్యవస్థ మొగ్గలోనే వాడిపోయింది.(హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర : వెల్దుర్తి మాణిక్యరావు)

## స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన 'స్వదేశీ లీగ్'

పాలకుల కుట్రల ఫలితంగా ఉమ్మడి రాజకీయ వ్యవస్థ ఏర్పాటుకై సాగిన ప్రయత్నాలు విఫలమైనప్పటికి ప్రజలు, నాయకుల ఆకాంక్షలు-ఆశలు సన్నగిల్లలేదు. నిజాం సబ్జెక్ట్సు లీగ్ తరహాలోనే పద్మజా నాయుడు, ఫజులుర్రెహనాన్ తదితరుల సారథ్యంలో మరో సంస్థ ఏర్పాటుకు సాగిన ప్రయత్నాల ఫలితంగా పద్మజా నాయుడు అధ్యక్షతన **స్వదేశీ లీగ్** ఏర్పడింది. రౌండ్ టేబుల్ సమావేశంలో దేశీయ సంస్థానాలలోని ప్రజలకు ప్రాథమిక హక్కులు ఇవ్వాలని, ప్రజా ప్రాతినిధ్యానికి సంబంధించిన మూల సూత్రాలను ఆ ప్రాంతాలలో అన్వయింప చేయాలని డిమాండ్లను ముందుకు తెచ్చి **స్వదేశీ లీగ్** కు నిజాం ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు ఫజులుల్ రెహమాన్ కార్యదర్శిగా నియుక్తులయ్యారు.

ఈ సంస్థ సైద్ధాంతిక విషయాల మీద దృష్టి సారిండం కంటే, ఆచరణాత్మక విషయాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. ఖాదీ ధారణ, విదేశీ వస్తు బహిష్కరణ తదితర కార్యక్రమాలను ప్రధానంగా చేసుకుని స్వదేశీ లీగ్ ప్రజలలో పనిచేయడం ఆరంభించింది. ఈ కార్యక్రమాల పట్ల వ్యక్తమవుతున్న ప్రజల అనుకూలతను గమనించిన ప్రభుత్వం స్వదేశీ లీగ్ నేతల కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలనుకుంది. ఆ చర్యలలో భాగంగా ఫజులుల్ రెహమాన్‌ను నిజాం కళాశాల అధ్యాపక పదవి నుండి తొలగించింది. ఈ చర్యపట్ల రెహమాన్ బాధ కంటె ఎంతో సంతోషం వ్యక్తచేశారు. కళాశాల నుండి తనను తొలగించి దాశ్యపాశం నుండి విముక్త చేసినందుకు ఫజులుల్‌రెహమాన్ సంతోషిస్తూ, ద్విగుణీకృత ఉత్సాహంతో లీగ్ ప్రచార కార్యక్రమాలలో నిమగ్నమయ్యారు. (హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర : వెల్దుర్తి మాణిక్యరావు).

ఈ దిశగా ప్రజలు, జాతీయవాదులైన మేధావులు, విద్యావంతులు సాగించిన కృషి ఫలించి నిజాంగడ్డ మీద అఖిల భారత జాతీయ కాంగ్రెస్ కార్యకలాపాలను పటిష్టంగా నిర్వహించగల సత్తా కలిగిన **హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్** రూపు దిద్దుకుని హైదరాబాదు రాజకీయ రంగస్థలి మీదకు వచ్చింది.

## చిట్టచివరకు హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ స్థాపన

జాతీయోద్యమ కార్యకలాపాలు నిజాం సంస్థానంలో వ్యక్తులపరంగా సాగుతున్నా ఆయా కార్యక్రమాలను బాధ్యతాయుతంగా చేపట్టేందుకు ప్రత్యేకంగా రాజకీయ సంస్థ

హైదరాబాద్‌లో లేకుండా పోయింది. ఆ లోటును తీర్చేందుకు నాయకులు పలు సమావేశాలను నిర్వహించి, ఆ దిశగా ప్రయత్నాలు సాగించారు. ఆ సభలు-సమావేశాలు-చర్చల ఫలితంగా 1938 జనవరి 29న జరిగిన సమావేశంలో హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ ఏర్పాటుకు నేతలు నిర్ణయించారు. ఆ తరువాత ఉనికిలోకి వచ్చిన **హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్** స్వామీ రామానంద తీర్ధ మార్గదర్శకత్వంలో ముందుకు సాగింది.

ఈ పరిణామంతో కలవరపడిన నిజాం ప్రభుత్వం కాంగ్రెస్‌ను నిషేధించింది. ఆ నిషేధాన్ని తట్టుకుంటూ స్వామీ రామానంద తీర్ధ నాయకత్వంలో జాతీయోద్యమం కార్యకలాపాల నిర్వహణలో హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ అగ్రస్థానాన నిలచింది. రాష్ట్ర కాంగ్రెస్ ఏర్పడక ముందునుంచే స్వేచ్ఛా-స్వాతంత్ర్యలను కోరుకున్న ప్రజలు, మేధావులు ఆ దిశగా పనిచేస్తున్నా రాష్ట్ర కాంగ్రెస్ ఏర్పడ్డాక ఉద్యమ కార్యక్రమాలు ఊపందుకున్నాయి.

రాష్ట్ర కాంగ్రెస్‌లో పలువురు ముస్లిం ప్రముఖులు భాగస్వాములయ్యారు. ప్రముఖ నాయకులు మౌల్వి సిరాజుల్ హసన్ తిర్మిజ్ హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ ఆరంభం నుండి బహుముఖ పాత్ర వహించారు. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఏర్పాటు గురించి సాగిన సమావేశాలలోని మూడవ సమావేశం నుండి ఆయన క్రమం తప్పక పాల్గొన్నారు. మౌలానా తిర్మిజ్ జాతీయవాది, హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ సంస్థాపకులలో ఒకరుగా ఖ్యాతిచెందారు.

ఆనాటి నుండి హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్‌లో పలు బాధ్యతాయుతమైన పదవులు నిర్వహించిన మౌల్వి సిరాజుల్ హసన్ తిర్మిజ్ ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానం విలీనం కోరుతూ హైదరాబాదులో ఉద్యమం సాగుతున్నప్పుడు **హైదరాబాదు సిటీ కాంగ్రెస్** అధ్యక్షులుగా, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కార్యదర్శిగా బాధ్యతలను నిర్వహించారు. (హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర : వెల్దుర్తి మాణిక్యరావు)

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడిన హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ జాతీయ భావాలను ప్రచారం చేస్తూ, కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకు సాగింది. ఈ కార్యకలాపాలలో భాగంగా సత్యాగ్రహ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల నిర్వహణలో చురుగ్గా పాల్గొన్న షేక్ నబీ సాహెబ్, షేక్ మొయినుద్దీన్ తదితరులను అరెస్టు చేసిన నిజాం ప్రభుత్వం వారిని చాలా కాలం నిర్బంధంలో ఉంచింది.

హైదరాబాదు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు నూతన పరిణామాలతో సుడులు తిరుగుతుండగా అంతర్జాతీయంగా, జాతీయంగా ఏర్పడిన రాజకీయ పరిస్థితులు భారత దేశంలోని రాజకీయాలను ప్రభావితం చేశాయి. ఆ కారణంగా జాతీయోద్యమంలో వచ్చిన నూతన ఉద్యమ రూపాలను ఆంధ్ర ప్రాంతంలోని ప్రజానీకం అనుసరించింది.

## ఉప్పెనలా సాగిన వ్యక్తి సత్యాగ్రహం

1939లో ద్వితీయ ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. 1935 చట్టం ననుసరించి దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఏర్పడిన ప్రజాప్రభుత్వాలతో సంప్రదించకుండా తన ప్రయోజనాలకు అనుగుణంగా ఆ యుద్ధంలో భారతదేశాన్ని బ్రిటీష్ ప్రభుత్వం భాగస్వామ్యం చేసింది. ఒక వైపున **సంపూర్ణ స్వరాజ్యం** కోరుతుండగా బ్రిటీష్ పాలకులు ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా, నాయకులతో ఏమాత్రం సంప్రదించకుండా ఎకపక్షంగా నిర్ణయాలు తీసుకుని ద్వితీయ ప్రపంచ యుద్ధంలో తమల్ని భాగస్వాములను చేయడాన్ని భారతీయులు ఏమాత్రం సహించలేకపోయారు.

ఈ నిర్ణయాన్ని ప్రతిఘటించేందుకు భారత జాతీయ కాంగ్రెస్ పూనుకుంది. అందుకు తగిన పోరాట రూపాన్ని నిర్ణయించేందుకు గాంధీజీకి అధికారం ఇచ్చింది. ఆ నేపథ్యంలో గాంధీజీ వ్యక్తి సత్యాగ్రహ ఉద్యమానికి పిలుపునిచ్చారు. 1940 అక్టోబరు 17న ఆచార్య వినోబా భావేను తొలి సత్యాగ్రహిగా అనుమతిస్తూ చారిత్రక వ్యక్తి సత్యాగ్రహ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.

ఆ పిలుపునందుకుని ఆంధ్రదేశంలోని ప్రతి వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొనేందుకు పోటీపడి పడ్డారు. ఆ కారణంగా సత్యాగ్రహులను ఎంపిక చేసేందుకు పలు ప్రాంతాలలో ప్రత్యేకంగా సత్యాగ్రహ కమిటీలు ఏర్పడ్డాయి. ఈ పోరాట రూపాన్ని నిర్మాణాత్మకంగా సాగిచేందుకు మహాత్ముడి మార్గనిర్దేశకత్వంలో జాతీయ కాంగ్రెస్ కొన్ని విధానాలను అనుసరించింది. ఆ పద్ధతులను అనుసరిస్తూ సత్యాగ్రహ కమిటీలు సత్యాగ్రహులుగా కొందర్ని మాత్రమే ఎంపిక చేసి సత్యాగ్రహ శిబిరాలకు పంపాయి. ఆ విధంగా ఆనాడు వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొనే అవకాశం దక్కినవారిని అదృష్టవంతులుగా భావించి ప్రజలు అభినందించసాగారు. భారతదేశం యావత్తూ వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొంది. లక్షలాది దేశభక్తులు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఈ ప్రతికూల పరిణామాలకు చూసి తత్తరపడిన పాలకులు ప్రజలపై విరుచుకుపడ్డారు.

## అంతులేని అరెస్టుల పర్వం

ఈ సందర్భంగా అరెస్టులు ముమ్మరంగా సాగాయి. స్వాతంత్ర్య సమర యోధులు, జాతీయోద్యమ నాయకులు అరెస్టులకు, నిర్బంధాలకు, పోలీసుల లాఠీ దెబ్బలకు, చిత్రహింసలకు గురయ్యారు. ప్రభుత్వం ఎన్ని నరకయాతనలు పెట్టినా సత్యాగ్రహ కార్యకర్తలు మాత్రం ఏమాత్రం వెనుకంజ వేయలేదు. ఆంధ్రప్రదేశ్ అంతటా నిర్బంధాలు, జైలుశిక్షలు ముమ్మరంగా సాగాయి.

అనంతపురం జిల్లా రాయదుర్గం చెందిన స్వర్ణకారుడు గుంతకల్ బాబా సాహెబ్ నెల్లూరు, అలీపూర్ జైలులో ఏడు మాసాల శిక్షను అనుభవించారు. గుంతకల్ బాబా సాహెబ్‌గా ఖ్యాతి గాంచిన బాబా సాహెబ్ అనంతపురం జిల్లా కణేకల్లు నివాసి. ఆయన ఆనాటి ప్రముఖ నాయకులతో కలసి వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. హిందూపూర్ నివాసి, టైలర్ పీర్ సాహెబ్, డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ క్రింద మూడు మాసాలు, ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలుకు చెందిన టాంగా డ్రైవర్ షేక్ చెంగీ షా మూడు మాసాల కఠిన జైలుశిక్ష అనుభవించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వ్యాపారి షేక్ అలీ సాహెబ్ తీవ్రమైన లాఠీచార్జికి గురి కావడమే కాకుండా నాలుగు మాసాల జైలు శిక్షకు గురయ్యారు. తణుకు తాలూకాకు చెందిన మహమ్మద్ హుస్సేన్ వ్యక్తి సత్యాగ్రహం కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు.

ఆకివీడు పరిసర గ్రామాలకు చెందిన ఉద్యమకారులు మహమ్మద్ గౌస్, మహమ్మద్ హుస్సేన్ తదితరులు ఆకివీడులో నివాసముంటున్న స్థానిక ప్రభుత్వ ప్రతినిధులైన కరణం, మునసబుల గృహాలకు వెళ్లి ప్రభుత్వ రికార్డులను బయటకు తెచ్చి కుప్పగా పోసి తగులబెట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అబ్దుల్ మజీద్ ఖాన్ తదితరులను అరెస్టులు చేసి స్పృహ కోల్పోయేంత వరకు పోలీసులు క్రూరంగా చితకబాదారు. ఆ తరువాత వీరందరికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రెండు వందల రూపాయల జరిమానా విధించటం జరిగింది.

నరసాపురం నాయకులు షేక్ మీరా టెలిఫోన్ తీగలను తెంపి, రిజిస్ట్రారు ఆఫీసు వద్ద ప్రభుత్వ రికార్డులు దగ్ధం చేసిన సందర్భంగా లాఠీచార్జికి గురయ్యారు. తాడేపల్లి గూడెంకు చెందిన షేక్ పెద మస్తాన్ రెండు సంవత్సరాలు జైలుశిక్షకు గురయ్యారు. షేక్ రహీం ఖాన్‌కు ఒక మాసం జైలు, 12 లాఠీ దెబ్బల శిక్ష విధించారు. కృష్ణాజిల్లా నూజివీడుకు చెందిన కొత్వాల్ అబ్బాస్ అలీ కుమారుడు మహమ్మద్ హుస్సేన్ లాఠీఛార్జీలో తీవ్రంగా గాయపడ్డారు. కొనకంచి నివాసి షేక్ సర్దార్ సాహెబ్‌కు కోర్టు ముగిసేవరకు శిక్ష పడింది. అయినా ఆయన మళ్ళీ సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఈ విధంగా అనేక సంఘటనల్లో పలువురికి కఠినశిక్షలు పడ్డాయి.

కర్నూలు జిల్లా పాణ్యంకు చెందిన షంషేర్ బేగ్‌కు ఆరు మాసాల జైలు, 500 జరిమానా లేక మూడు మాసాల జైలు శిక్ష విధించారు. జరిమానా కట్టడానికి ఆయన నిరాకరించారు. జరిమానా కడితే తాను చేసిన పనిని నేరంగా అంగీకరించటమేనని భావించిన ఆయన జరిమానా కట్టకుండా అదనంగా మూడు మాసాల జైలు జీవితం గడిపారు. నంద్యాల –పాణ్యం మధ్యన రైల్వేలైనుకు ఫిష్ ప్లేట్లు తొలగించినందుకు గాను షంషేర్ బేగ్, ముల్లా, మహబూబ్ సాహెబ్‌లు ఏడాది జైలు శిక్షను అనుభవించారు. షంషేర్ బేగ్ ఆ తరువాత

కూడా ఉద్యమంలో నిర్విఘ్నంగా పాల్గొన్నారు. స్వతంత్ర భారతంలో రెండు సార్లు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఎంపికయ్యారు. కడపజిల్లా పులివెందుల తాలూకా పైడిపాలెం గ్రామానికి చెందిన సామాన్య రైతు దూదేకుల హుస్సేన్ సాహేబ్ రెండు మాసాలు దారుణమైన జైలు జీవితాన్ని రుచి చూశారు. కదిరికి చెందిన యస్. ఖాజా మొహిద్దీన్ సాహెబ్ పలు ప్రదర్శనలు నిర్వహించి, ఆ ప్రదర్శనలలో బ్రిటీష్ ప్రభుత్వ దుర్మార్గాలను బహిరంగ పర్చుతూప్రజలను ఉద్యమ బాటన నడవాల్సిందిగా ప్రోత్సహిస్తూ ముందుకుసాగి శిక్షలను అనుభవించారు.

కడప జిల్లా కొండాపసూర్ గ్రామస్థులు షేక్ నబీ రసూల్ గాంధీజీ ఉపన్యాసాలతో ప్రభావితమై, వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఆయన మూడు మాసాల జైలు శిక్షను రుచిచూడాల్సి వచ్చింది. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొనడాన్ని స్వగ్రామం వద్దంటున్నా ఆయన ధైర్యంగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా కడప కోటిరెడ్డి సహచరుడు డి. హుస్సేన్ సాహెబ్ రెండు మాసాల శిక్షకు గురి కాగా, షేక్ మహమ్మద్ సాహెబ్ అఖిల భారత ముస్లిం లీగ్ రాజకీయాలతో ప్రభావితులైన ముస్లింలను కాదంటూ జాతీయోద్యమ పోరాట కార్యక్రమాలలో పాల్గొని ప్రముఖ పాత్రను నిర్వహించారు.

ఈ కార్యక్రమాల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శాఖలు ఎన్నిక చేసిన వ్యక్తులు మాత్రమే వ్యక్తిగత సత్యాగ్రహంలో పాల్గొనాలన్న విధానాన్ని బాపట్ల ప్రాంతానికి చెందిన ముహమ్మద్ హనీఫ్ లాంటి యువకులు వ్యతిరేకించారు. ఆనాడు మద్రాసులో నివాసం ఉంటున్న ఆయన ఎంతమంది కార్యకర్తలు, ప్రజలు వ్యక్తిగత సత్యాగ్రహంలో పాల్గొనదలిచితే అంతమందిని బేషరతుగా అనుమతించాలని డిమాండ్ చేశారు. మాతృభూమి విముక్తి పోరాటంలో పాల్గొనాలనుకున్న వారి మీద ఆంక్షలు, నిషేధాలు, ఎంపిక విధానాలు ఏంటని హనీఫ్ జాతీయ నాయకులను సూటిగా ప్రశ్నించి సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్నారు.

## యుద్ధ వ్యతిరేక ప్రచారం

జాతీయోద్యమంలో భాగంగా ప్రజలు యుద్ధ వ్యతిరేక ప్రచారంలో కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ద్వితీయ ప్రపంచ యుద్ధం జరుగుతున్నందున భారతీయులను సైన్యంలో చేర్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకించారు. భారతీయులెవ్వరూ సైన్యంలో చేరరాదని ప్రచారం చేస్తున్నందుకు జాతీయోద్యమ నేతలు బ్రిటీష్ ప్రభుత్వ ఆగ్రహానికి గురయ్యారు. ఆ నేతల పిలుపును అందిపుచ్చుకున్న ప్రజలు యుద్ధాన్ని నిరసిస్తూ ప్రదర్శనలు, సభలు, సమావేశాలు జరిపారు. ఈ చర్యల పట్ల మండిపడిన ప్రభుత్వం అరెస్టులతో, జైలు శిక్షలతో ప్రజల గొంతులను నొక్కి వేయాలని విఫలయత్నం చేసింది.

యుద్ధ వ్యతిరేక ప్రచారంలో పాల్గొంటున్న కొండా అప్పాపురం నివాసి టైలర్ షేక్ నబీ రసూల్ సాహెబ్ మూడు మాసాలు, గుంటూరుకు చెందిన సయ్యద్ జానీ సాహెబ్ నరసరావుపేట జైలులో నెల రోజులపాటు శిక్షను అనుభవించారు. షేక్ గాలిబ్ సాహెబ్, షేక్ అలీలు అరెస్టయ్యారు. యుద్ధ వ్యతిరేక నినాదాలు చేసినందుకు వెంకటగిరి నివాసి షేక్ చబీ సాహెబ్‌కు కోర్టు ముగిసేవరకు నిలబడాల్సిందిగా న్యాయస్థానం శిక్ష విధించింది.

అనంతపురం జిల్లా చియ్యడు గ్రామానికి చెందిన రబియాబి భర్త మొహిద్దీన్ సాహెబ్‌తో కలిసి వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని చరిత్ర సృష్టించారు. ఆంధ్రావనిలో ఒక ముస్లిం మహిళ వ్యక్తి సత్యాగ్రహ ఉద్యమంలో బహిరంగంగా ప్రత్యక్షంగా పాల్గొనడం ఇదే ప్రథమమని పలువురు శ్లాఘించారు. జాతీయోద్యమకారుడైన భర్త మొహిద్దీన్ సాహెబ్ ఆమెను ప్రోత్సహించడంతో, రబియాబి మరింత ఉత్సాహంతో యుద్ధ వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆనాడు సాగిన యుద్ధ వ్యతిరేక బహిరంగ ప్రదర్శనలో రబియాబి స్వయంగా పాల్గొనటమే కాక యుద్ధ వ్యతిరేక నినాదాలిచ్చి పలువుర్ని ఆశ్చర్యచకితులను చేశారు.

ఆనాడు మహిళలకు జైళ్ళలో ప్రత్యేక ఏర్పాట్లు లేవు. మహిళా కార్యకర్తలు అరెస్టు అయినట్టయితే జైళ్ళలో పలు అసౌకర్యాలను, బాధలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి. పెద్ద పెద్ద కారాగారాలలో తప్ప మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు ఉండేవి కావు. ఆ కారణంగా మహిళలు అరెస్టుల పట్ల ఆసక్తి చూపేవారు కారు. అందువలన రబియాబి కూడా అరెస్టు కాకుండా తప్పించుకున్నారు. ఈ క్రమంలో స్వజనుల చేత పలు విమర్శలకు గురైనప్పటికీ ఆమె ఖాతరు చేయలేదు. ఆనాడు సామాజిక బంధనాలలో ఉంటూ కూడా బ్రిటీష్ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న మహిళలు చరిత్ర గ్రంథాలలో స్థానాన్ని సంపాదించుకోలేకపోయారు. అందువలన ఆ తల్లుల గురించి అతితక్కువ విషయాలు మాత్రమే తెలిశాయి.

## చివరకు దిగివచ్చిన బ్రిటీష్ ప్రభుత్వం

భారతదేశం అంతా బ్రిటీష్ వ్యతిరేకతతో, యుద్ధ వ్యతిరేకతతో అట్టుడికి పోతోంది. భారతీయులు ప్రభుత్వ వ్యతిరేక చర్యలలో ఏమాత్రం జంకు లేకుండా ఇనుమడించిన ఉత్సాహంగా పాల్గొంటున్నారు. జైళ్ళునోళ్ళు తెరిచినా, లాఠీలు వళ్ళు విరిచినా, వళ్ళు హూనం చేసినా, చివరకు ప్రాణాలు తోడేసినా ప్రజలు ఏమాత్రం భయపడటం లేదు.

1941 జనవరిలో జర్మనీ, జపాన్‌ల సహకారంతో బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించాలని భావించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఆ ప్రయత్నాలలో భాగంగా

భారతదేశం నుండి అదృశ్యమయ్యారు. ఆ సంవత్సరం డిసెంబర్ 7న జపాన్ పెరల్ హార్బరుపై దాడి జరిగింది. బ్రిటీష్ ప్రభుత్వం మీద యుద్ధం ప్రకటించి అంతర్జాతీయ మద్దతు కూడగట్టేందుకు నేతాజీ విజయవంతంగా ముందుకు సాగారు. ఆ సమయంలో భారతదేశంపై జపాన్ దండయాత్ర తప్పదనుకున్న బ్రిటీష్ ప్రభుత్వం అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా భయపడింది. ఆ క్లిష్ట సమయంలో భారతీయులను మంచి చేసుకుని వారి మద్దతును పొందేందుకు శతవిధాల ప్రయత్నాలు ప్రారంభించింది. ఆ ప్రయత్నాలలో భాగంగా 1940-41లో అరెస్టు చేసిన జాతీయ ఉద్యమకారులను విడుదల చేసింది. ప్రజల మీద నిర్బంధాలను, నిషేధాలను కొంతమేరకు సడలించింది.

## క్విట్ ఇండియా ఉద్యమం

జాతీయోద్యమ నాయకులతో రాయబారం జరపడానికి 1942 మార్చిలో సర్ స్టాఫర్డ్ క్రిప్స్ భారతదేశం వచ్చాడు. క్రిప్స్ ప్రతిపాదనలు ఆమోదయోగ్యంగా లేనందున, భారతీయ నాయకత్వం అంగీకరించలేదు. క్రిప్స్ రాయబారం విఫలమైంది. 1942 జులైలో మహాత్ముడు బ్రిటీష్ ప్రభుత్వానికి చివరి హెచ్చరిక చేశాడు. **సంప్రదింపులకు ఇక అవకాశం లేదు. భారతదేశం స్వాతంత్ర్యాన్ని గుర్తిస్తారా? లేదా? మరొక అవకాశం యిచ్చే సమస్యే లేదు. ఇది బాహాటమైన తిరుగుబాటు** అని ప్రకటించారు. ఆ ప్రకటనతో భారతీయులు చివరి పోరాటానికి సిద్ధమయ్యారు.

1942 ఆగస్టులో బొంబాయిలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, క్విట్ ఇండియా పోరాటానికి సమర శంఖారావం పూరించింది. బ్రిటీష్ వారిని భారతదేశం వదలి పొమ్మంటూ 1942 జూలైలో వార్ధాలో చేసిన తీర్మానాన్ని, బొంబాయి సమావేశం ధృవీకరించింది. ఆ తీర్మానం **క్విట్ ఇండియా** తీర్మానంగా ప్రసిద్ధి పొందింది. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి గాంధీజీ మాట్లాడుతూ విజయమో-వీరస్వర్గమో ('Do or Die') తేల్చుకోవాలన్నారు.

భోగరాజు పట్టాభి సీతారామయ్య దీనిని **బహిరంగ తిరుగుబాటు**గా అభివర్ణిస్తూ, అందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అంతిమ పోరాటాన్ని ప్రారంభించమని గాంధీజీ పచ్చజెండా ఊపక ముందే ఆయనను, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులను బ్రిటీష్ ప్రభుత్వం నిర్బంధించింది. భారత జాతీయ కాంగ్రెస్ పై పలు నిషేధాలు విధించింది. ఉద్యమకారులను పెద్ద సంఖ్యలో అరెస్టు చేసింది, నిర్బంధాలకు గురిచేసింది.

చరిత్ర ప్రసిద్ధి పొందిన  క్విట్ ఇండియా ఉద్యమం నాలుగు దశలుగా సాగింది. ప్రథమ దశలో సభలు, సమావేశాలు, హర్తాళ్, సమ్మెలు, ఊరేగింపులు సాగాయి. ద్వితీయ

దశలో ప్రభుత్వ కార్యాలయాల మీద దాడులు జరిగాయి. తృతీయ దశలో ప్రజలు సాయుధ దాడులు చేశారు. ప్రభుత్వ ఖజానాలు కొల్లగొట్టబడ్డాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం పోలీసులకు, సైన్యానికి పని కల్పించాల్సి వచ్చింది. చివరి దశలో ప్రజలు తిరిగి సభలు, సమావేశాలు, ఊరేగింపులకు పరిమితం అయ్యారు.

ఈ నాలుగు దశలలో కూడా బ్రిటీష్ ప్రభుత్వం క్రూరంగా, అత్యంత దారుణంగా వ్యవహరించింది. సంపూర్ణ స్వరాజ్యం తప్ప మరొకటి తమ ఆకాంక్షలకు తగినది కాదని భావించిన నాయకులు విజయమో వీరస్వర్గమోనని పిలుపునివ్వడంతో ప్రజలు ఉత్సాహ భరితులయ్యారు. ఆంగ్ల ప్రభుత్వ వైఖరి పట్ల సహనం పూర్తిగా నశించిన ప్రజానీకం చివరి పోరుకు అన్నివిధాల సన్నద్ధమై ఉద్యమ కార్యకలాపాలను మరింత ఉధృతం చేశారు.

## అంతులేని అరెస్టులు- హద్దుల్లేని శిక్షలు

నాయకుల పిలుపు మేరకు జనసమూహాలు కూడా విజయమో–వీరస్వర్గమో అంటూ అరెస్టులకు, లాఠీలకు, జైలు శిక్షలకు ఏమాత్రం బెదరకుండా ఉద్యమపథాన ముందుకు సాగాయి. బ్రిటీషు ప్రభుత్వ చర్యల పట్ల ఆగ్రహించిన ఉద్యమకారులు పూర్తిగా శాసనోల్లంఘనకు పాల్పడ్డారు. ప్రభుత్వం ప్రజల మీద విరుచుకపడింది. జాతీయ భావాలను కలిగిన వారిని, ఆ భావాలను వ్యక్తం చేస్తున్న ఏ వ్యక్తిని కూడా వదలిపెట్టలేదు. జైళ్ళు పెద్ద ఎత్తున నోర్లు తెరిచాయి. ప్రజల అరెస్టులతో ప్రభుత్వం జైళ్ళను నింపసాగింది.

ఈ క్రమంలో, అనంతపూర్ జిల్లా కదిరి నివాసి మహబూబ్ సాహెబ్ కొత్తకోట అటవీ శాఖ కార్యాలయాన్ని తగుల బెట్టినందుకు జైలుకు వెళ్ళారు. అనంతపురం జిల్లాకు చెందిన యం.మొహిద్దీన్ సాహెబ్, యం.అఫ్సర్ ఆలీ, తదితరులు మధ్యం వ్యాపారుల బెదిరింపులకు లొంగకుండా మద్యనిషేధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆనాడు మహమ్మద్ ఆలీ జిన్నాతో వ్యక్తిగత పరిచయం ఉన్న వ్యక్తిగా ప్రసిద్ధుడైన మహమ్మద్ అలీ ముస్లింలీగ్ రాజకీయాలకు దూరమై ఈ పోరాటంలో పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన వ్యవసాయదారుడు అబ్దుల్ బజీద్ ఖాన్ ఒకటిన్నర సంవత్సరం జైలుశిక్షను అనుభవించారు. ఆ తరువాత అతి చిన్నవయస్సులోనే జిల్లా బోర్డు సభ్యునిగా ఎన్నికైన ఆయన చరిత్ర సృష్టించారు.

భీమవరం వ్యాపారి షేక్ అలీ సాహెబ్ క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆయన క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయానికి నిప్పుపెట్టారు. ఆ సందర్భంగా జరిగిన లాఠీ ఛార్జిలో తీవ్రంగా గాయపడ్డారు. ఆ తరువాత కూడా బ్రిటీష్ ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న ఆయన పలుమార్లు జైలు

శిక్షలకు గురయ్యారు. ఆలీపూర్ క్యాంపులో రెండు సంవత్సరాల పాటు పలు కడగండ్లు అనుభవించారు. స్వాతంత్ర్యం సిద్ధించాక 1946లో కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యునిగానూ, రాష్ట్ర కార్యవర్గంలోనూ బాధ్యతలను నిర్వహించారు. భీమవరం నివాసి షేక్ ఫకీర్ మొహిద్దీన్ 17-8-1942 నాటి జాతీయోద్యమ కార్యకలాపాలలో పాల్గొన్నందుకు జైలుశిక్ష, ఎనిమిది కొరడా దెబ్బల శిక్షకు గురయ్యారు. ఆయన 1943 డిసెంబరు 9 వరకు అలీపూర్ జైలులో గడిపారు. తాడేపల్లిగూడెం తాలూకా నవాబుపాలెం రైల్వే గేట్‌మన్ షేక్ పెద మస్తాన్ సంవత్సరం పాటు అలీపూర్ క్యాంపు జైలు బాధలను రుచి చూశారు. తాడేపల్లిగూడెం నివాసి షేక్ రహీంఖాన్ పెంటపాడు తపాల కార్యాలయం తగులబెట్టిన సంఘటనలో ప్రధాన పాత్ర వహించినందున 12 కొరడా దెబ్బల శిక్షను అనుభవించారు.

కృష్ణాజిల్లా తిరువూరు తాలూకా గౌరంపాలెం నివాసి సాలార్ సాహెబ్ పోలీసుల నిర్బంధంలో చిత్రహింసల పాలయ్యారు. కృష్ణాజిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు కొత్వాల్ అబ్బాస్ ఆలీ కుమారుడు కొత్వాల్ మహమ్మద్ హుస్సేన్ పోలీసుల నిర్బంధానికి గురయ్యారు. ఆయన నూజివీడు కాంగ్రెస్ పట్టణ సహాయ కార్యదర్శి బాధ్యతలను నిర్వహించారు. నూజివీడుకు చెందిన షేక్ నూరుల్లా సాహెబ్, కొనకంచి నివాసి షేక్ సర్దార్ సాహెబ్ వ్యక్తిసత్యాగ్రహం నుండి క్విట్ ఇండియా ఉద్యమం వరకు నిరంతరం కార్యక్రమాలలో పాల్గొన్నారు. నందిగామ తాలూకా కొనకంచి గ్రామాధికారి షేక్ బికారీ సాహెబ్ ఉద్యమకారుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న కిరాతక వైఖరికి నిరసనగా ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆలూరు తాలూకా నెమకల్‌కు చెందిన టైలర్ యం.అక్బర్ ఆలీ ఎనిమిది మాసాల జైలు శిక్షకు గురయ్యారు. ఆయన ఖాది ఉద్యమ ప్రచారంలో, హరిజనోద్ధరణ, మద్యపాన నిషేధం తదితర కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు.

1934 నాటి గాంధీజీ యాత్రతో ప్రభావితుడైన అనంతపురం జిల్లా కసాపురం నివాసి మహమ్మద్ రసూల్ గుంతకల్ వద్ద రైల్వేస్టేషన్ ధ్వంసం చేసిన సంఘటనలో మిత్రులతో కలసి పాల్గొన్నందున ఆరు మాసాల జైలు శిక్షను అనుభవించారు. మదనపల్లె నివాసి పి. మదార్ సాహెబ్ పోలీసు లాఠీ దెబ్బలకు గురయ్యారు. నంద్యాల తాలూకా తొగిరిచేడుకు చెందిన రైతుకూలీ ముల్లా మహబూబ్ సుభాని అలీపూర్‌జైలులో ఆరు మాసాల జైలుశిక్ష అనుభవించారు. ఆ తరువాత స్వతంత్ర భారతదేశంలో ఆయన గ్రామ పంచాయితీ సభ్యులుగా 1950-70 వరకు సేవలు అందచేశారు. అదోని తాలూకా పాండవగల్లు గ్రామ మున్సిఫ్‌గా పనిచేస్తున్న సుల్తాన్ మొహిద్దీన్ జాతీయోద్యమ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన్ను నిర్భంధంలోకి తీసుకున్న పోలీసులు చేసిన నేరారోపణల ఫలితంగా అలీపూర్, బళ్ళారి జైళ్లలో మూడు మాసాల పాటు జైలుశిక్షను అనుభవించారు.

నెల్లూరు జిల్లా కావలికి చెందిన షేక్ మొహద్దీన్ సాహెబ్ నిర్బంధానికి గురయ్యారు. ఆయన విదేశీ వస్తుబహిష్కరణ, మద్యనిషేధం కోరుతూ సాగిన పికిటింగ్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన టైలర్ షేక్ హటల్ సాహెబ్‌ను అరెస్టు చేసి డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ క్రింద 18 మాసాల శిక్షను విధించారు. నిడుబ్రోలుకు చెందిన షేక్ మస్తాన్ క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రముఖంగా పాల్గొన్నారు. ఆయనకు ప్రభుత్వం మూడు సంవత్సరాల ఆరు మాసాల జైలుశిక్ష విధించింది. బస్‌కండక్టర్ ముహమ్మద్ హనీఫ్ అలీపూర్, రాజమండ్రి జైళ్లలో సంవత్సరం గడిపారు. తెనాలికి చెందిన మున్షీ సయ్యద్ మహమ్మద్ మస్తాన్ తెనాలి రైల్వే స్టేషన్ మీద జరిగిన దాడిలో పాల్గొని, అక్కడ జరిగిన పోలీసు కాల్పుల్లో చావు తప్పి బయటపడ్డారు. ఆ తరువాత కొంతకాలం రహస్య జీవితం గడిపారు. తెనాలికి చెందిన మరోయోధుడు సయ్యద్ అబ్దుల్ అజీం ఉద్యమ కార్యకలాపాలలో పాల్గొనడమే కాక, మద్రాసులో కొంతకాలం అజ్ఞాతవాసం చేశారు.

## నిజాం సంస్థానంలో క్విట్ ఇండియా ఉద్యమం

నిజాం సంస్థానంలో క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభం కావడానికి ముందు పలువురు నాయకులు నైజాం నవాబును కలిసి, ప్రజల చేత ఎన్నికైన మంత్రులతో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ విధంగా విజ్ఞప్తి చేసిన నేతలలో మౌలానా సిరాజుల్ హసన్ తిర్మిజ్, ఫతావుల్లా ఖాన్‌లు ఉన్నారు.

ఆంధ్రావని అంతటా వ్యక్తిసత్యాగ్రహ ఉద్యమం సాగుతున్న సమయంలోనే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ మీద ఉన్న నిషేధాన్ని తొలగింప చేసేందుకు జాతీయ నాయకులు విఫల ప్రయత్నాలు చేశారు. బొంబాయిలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో గాంధీజీని కలుసుకున్న స్వామి రామానంద తీర్థ, నైజాం సంస్థానంలో క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించడానికి అనుమతి పొందారు.

క్విట్ ఇండియా ఉద్యమ జరుగుతున్న కాలంలోనే హైదరాబాద్‌కు చెందిన అబిద్ హసన్ సఫ్రాని నేతాజీ నాయకత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరారు. ఆనాడు నేతాజీ వెంట హైదరాబాదుకు చెందిన మహమ్మద్ ఆయూబ్, ఖమరుల్ ఇస్లాం, తాజుద్దీన్ గౌస్ తదితరులు భారత జాతీయ సైన్యంలో చేరి పలు బాధ్యతలు నిర్వహించారు.

1940 ప్రాంతంలో హైదరాబాద్ సంస్థానం ఏరియాలో పనిచేస్తున్న నాలుగు కమ్యూనిస్టు గ్రూపులు ఏకమై **నిజాం సంస్థానం కమ్యూనిస్టు కమిటీ**గా ఏర్పడింది. ఈ కమిటీలలో ప్రముఖ కవిగా ఖ్యాతి గడించిన మగ్దూం మొహిద్దీన్, సయ్యద్ ఇబ్రహీం, మీర్ అలంఘర్, సయ్యద్ హబీబుద్దీన్ తదితరులు తమ గ్రూపుల పక్షాన సభ్యులయ్యారు.

1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో ఈ కమిటీ నేతలు, ఆ నాయకుల అనుచరులు పాల్గొన్నారు. ఈ నేతలలో ప్రధానంగా విఖ్యాత ఉర్దూ కవి మగ్దూం మొహిద్దీన్ కార్మికుల ప్రియతమ నేతగా అనేక పోరాటాలను నిర్వహించారు. సామ్రాజ్యవాదుల రాజ్య విస్తరణకాంక్షకు, దోపిడీకి వ్యతిరేకంగా ఆయన ఉద్యమించారు. ప్రజలను ఉత్తేజపర్చుతూ కవిత్వం రాశారు. ఆ తరువాత స్వతంత్ర భారతావనిలో ప్రజాప్రతినిధిగా, కార్మిక సంఘాల నేతగా ప్రజల అభ్యున్నతి, కార్మికుల సంక్షేమం కోసం చివరి వరకు ఎనలేని కృషి సల్పారు.

నైజాం సంస్థానంలో సాగుతున్న క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా జరిగిన పలు ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలలో రైల్వే ఉద్యోగుల నేత మహమ్మద్ హుస్సేన్ ప్రముఖ పాత్ర నిర్వహించారు. ఆ కారణంగా ఆయనను గుల్బర్గా సెంట్రల్ జైలులో నిర్బంధించారు. మరో రైల్వే ఉద్యోగి ఫిట్టర్ ఒమర్ కాన్ ఆ సమయంలో జరిగిన రైల్వే సమ్మెలో చురుగ్గా పాల్గొన్నారు. తన సహచరులను సమ్మె దిశగా నడిపినందుకు ప్రభుత్వ ఆగ్రహానికి గురయ్యారు. ఆయన పలు మాసాలు, అనేక జైళ్లల్లో డిటెన్షన్‌లో ఉన్నారు. మిల్లు కార్మికుల నాయకుడు సయ్యద్ ఇబ్రహీం క్విట్ ఇండియా ఉద్యమంలో చాలా చురుగ్గా పాల్గొన్నారు.

ఈ ఉద్యమం సందర్భంగా, ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని నిషేధించినందున నాయకులు తమ కార్యక్రమాలను రహస్యంగా నిర్వహించవలసి వచ్చింది. ప్రజలు కూడా స్వేచ్ఛగా కార్యక్రమాలలో పాల్గొనలేక పోయారు. గతంలో వ్యక్తమైనంత సమైక్యతా భావం 1942 నాటి ఉద్యమంలో కనబడలేదు. వామపక్షాలలో కొన్ని శక్తులు, వ్యక్తులు ఉద్యమాన్ని బలపర్చకపోవటడంతో ఈ పరిస్థితి ఎదురైంది. భారత రక్షణ నిబంధనల క్రింద భారత జాతీయ కాంగ్రెస్, జాతీయ విద్యార్థి సంఘం, యువజన సంఘాలను ప్రభుత్వం నిషేధించింది. దేశ వ్యాప్తంగా వేలాది కార్యకర్తలను, నాయకులను అరెస్టు చేసింది. ఈ ఉద్యమం సందర్భంగా జరిగిన అన్ని చర్యలకు మహాత్మాగాంధీజీ కారణమని బ్రిటీష్ ప్రభుత్వం నిందించింది. ఆ నిందకు నిరసనగా ఆయన నిరాహారదీక్ష సాగించారు. దాంతో ప్రజలు కలవరపడ్డారు. ఉద్యమ వాతావరణం మరలా దేశమంతటా ఏర్పడింది. ఆ కారణంగా ఏర్పడిన ప్రతిష్ఠంభనను తొలగించేందుకు 1944 మేలో గాంధీజీని ప్రభుత్వం విడుదల చేసింది.

1945 జూలైలో సిమ్లాలో జరిగిన సమావేశం విఫలమైంది. ఆ తరువాత కొద్ది రోజులకే ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో జపాన్ పరాజయం పాలైంది. ఆ సమయంలో ఇంగ్లాండులో జరిగిన ఎన్నికలలో కన్సర్వేటివ్ పార్టీ పరాజయం పాలై, లేబర్ పార్టీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పర్చింది. లార్డ్ వేవల్ భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర అసెంబ్లీలకు త్వరలో ఎన్నికలు జరుపగలనని ప్రకటించాడు. ఆ తరువాత జరిగిన ఎన్నికలలో పాల్గొన్న భారత జాతీయ కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది.

## గుంటూరు కేంద్రంగా ముస్లింలీగ్ విజృంభణ

అఖిల భారత ముస్లింలీగ్ కార్యకలాపాలు ప్రధానంగా ఆంధ్ర, రాయలసీమలలో సాగిస్తున్నా అక్కడక్కడ మాత్రమే తన ఉనికిని ప్రదర్శించింది. 1906 ప్రాంతంలో ముస్లిం లీగ్ ఏర్పడినా రాజకీయంగా చైతన్యవంతమైన గుంటూరు జిల్లాలో 1944 వరకు పూర్తి స్థాయిలో జిల్లా శాఖ ఏర్పడలేదంటే ఇక్కడ ముస్లిం లీగ్ ప్రభావం ముస్లిం జనసముదాయాల మీద ఏమాత్రం ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

అఖిల భారత ముస్లిం లీగ్ ఉనికిని తెలియజేసే విధంగా కృష్ణా జిల్లాలో ప్రముఖ నాయకులు ముహమ్మద్ గులాం మొహిద్దీన్, తూర్పుగోదావరి జిల్లాలో డాక్టర్ ఉమర్ అలీషా తదితరుల పేర్లు, వారి కార్యక్రమాలు మాత్రమే స్వాతంత్రోద్యమ చరిత్ర పుటలలో అక్కడక్కడా కన్పిస్తాయి తప్ప లీగ్ కార్యకలాపాలు ఆంధ్రలో ముమ్మరంగా సాగిన దాఖలాలు మాత్రం లేవు.

సుదీర్ఘకాలం కాంగ్రెస్ కార్యకలాపాలలో భాగం పంచుకున్న డాక్టర్ ఉమర్ అలీషాకు పార్టీ టిక్కెట్టు నిరాకరించడంతో తూర్పు గోదావరిలో సెంట్రల్ అసెంబ్లీకి స్వతంత్ర్య అభ్యర్థిగా ఆయన పోటీ చేసి ఎన్నికయ్యారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల వ్యవహారసరళి పట్ల కినిసిన ఆయన మౌలానా షౌకత్ అలీ విజ్ఞప్తి మేరకు ముస్లిం లీగ్‌లో చేరారు. భారత విభజన విషయానికొచ్చేసరికి మాత్రం మౌల్వీ ఉమర్ అలీషా పూర్తిగా లీగ్‌కు వ్యతిరేకమయ్యారు.

ఈ విధంగా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో ముస్లిం జనసముదాయాలలో అక్కడక్కడా ముస్లింలీగ్ ఛాయలు కన్పించినా మతం పేరుతో వేర్పాటువాదం ముమ్మరం కాగానే, భారతదేశాన్ని విభజించాలన్న డిమాండు మరింత ఊపందుకోగానే ముస్లిం నాయకులు, ప్రజలు ముస్లిం లీగ్‌కు పూర్తిగా దూరమయ్యారు.

## తెనాలి నేతల నేతృత్వంలో ముమ్మరంగా లీగ్ కార్యక్రమాలు

ఈ తరహాలోనే అఖిల భారత ముస్లింలీగ్ గుంటూరు జిల్లా ప్రథమ మహాసభ తన కార్యకలాపాలను ప్రకటించింది. ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలోని ముస్లిం లీగ్ కార్యకలాపాలు ప్రధానంగా మద్రాసు నగరం కేంద్రంగా అక్కడి నాయకుల కనుసన్నలో సాగాయి. ఆ కారణంగా లీగ్ ముస్లిం జనసముదాయాల్లోకి వెళ్ళకుండా నాయకుల వరకు పరిమితమైంది. మద్రాసు నుండి చక్రం తిప్పుతున్న నేతలు స్థానిక నాయకుల అభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరించడంతో నగరవాసులైన నాయకుల మీద పట్టణ, గ్రామీణవాసులు తిరుగుబాటు చేశారు. ఆ క్రమంలో స్వతంత్రంగా వ్యవహరించడానికి నిర్ణయించుకున్నారు. ఈ తిరుగుబాటుకు గుంటూరు జిల్లా తెనాలి కేంద్రంగా మారింది. గుంటూరులో జరిగిన

అఖిలభారత ముస్లింలీగ్ గుంటూరు జిల్లా ప్రథమ సమావేశం ఆ తిరుగుబాటును సూచిస్తుంది. 1944 మే 5న తెనాలిలో సయ్యద్ మహబూబ్ నాయకత్వంలో ముస్లింలీగ్ ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రకాశం, కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన 80 మంది హజరయ్యారు. ఈ సమావేశానికి ప్రముఖ న్యాయవాది ముహమ్మద్ అబ్దుల్ సలాం అధ్యక్షత వహించారు. ముస్లింలీగ్‌ను శాఖలను నిర్మించాలని, అన్ని ప్రాంతాలలో లీగ్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని ఈ సమావేశం నిర్ణయించింది. ఈ బాధ్యతల నిర్వహణకు సయ్యద్ మహబూబ్, ముహమ్మద్ యాశిన్, అబ్దుల్ కరీం, అల్లాబక్ష్ లాంటి ప్రముఖులు సభ్యులుగా ముస్లింలీగ్ జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ ఎన్నికయ్యింది.

ఈ ఎన్నిక చర్చనీయాంశమైంది. ఆనాటి పరిస్థితిని 1945 డిసెంబరు 9న తెనాలిలో జరిగిన అఖిల భారత ముస్లింలీగ్ గుంటూరు జిల్లా ప్రథమ వార్షికోత్సవం నివేదిక ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ, **స్వలాభపరులకు కన్నుకుట్టింది. ప్రజలలో పనిచేయక పదవులకు మాత్రమే పాకులాడే పెద్దమనుష్యులకు పలుకుబడి పోతుందని ఆరాటం పుట్టింది. ..ముస్లిం లీగ్ అంటే జిల్లా ముఖ్య పట్టణవాసుల పట్టాలో రిజిష్టరు చేయబడిన మా సొంత సొత్తుయని. ఆర్గనైజింగ్ కమిటివారు పల్లె ప్రజలను మేలుకొలిపి మా పట్టణవాసుల పలుకుబడిని పోగొడుతున్నారని...ప్రచారం ప్రారంభించారు,** అని పేర్కొంది.

ఈ ప్రచారాన్ని తిప్పికొడుతూ జిల్లాలో 8వేల సభ్యత్వంతో ముస్లింలీగ్ గుంటూరు జిల్లా శాఖను ఏర్పాటయ్యింది. స్థానిక నాయకుల పలుకుబడి హెచ్చుతుందని రాష్ట్ర కమిటి నాయకులు ఆటంకాలు ఏర్పర్చినా, గుంటూరు జిల్లా కమిటి నాయకులు అఖిల భారత ముస్లింలీగ్ ప్రధానకార్యదర్శి లియాఖత్ అలీఖాన్‌ని కలసి క్షేత్ర స్థాయిలోని వాస్తవాలు వివరించి తమ కమిటీకి అమోదముద్ర పొంది ముస్లింలీగ్‌ను మరింతగా ప్రజలకు చేరువ చేశారు. ఈ విధంగా మద్రాసు నగరవాసుల ఆధిపత్యానికి స్థానికులు కళ్ళెం వేశారు.

1945 జనవరి 21న బాపట్లలో గుంటూరు జిల్లా ప్రైమరి లీగ్ అధ్యక్ష కార్యదర్శుల ప్రథమ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రముఖ కవి, స్వాతంత్ర్య సమరయోధులు, సెంట్రల్ అసెంబ్లీ సభ్యులు డాక్టర్ ఉమర్ అలీషా పాల్గొని ప్రసంగిస్తూ ముస్లింలీగ్‌ను ప్రజలకు చేరువ చేయడంలో గుంటూరు జిల్లా ప్రధానంగా తెనాలి నేతల కృషిని, వారు సాధించిన విజయాన్ని ప్రస్తావించారు. **ఆంధ్రలో మీరు నెరవేర్చిన నిర్మాణ కార్యక్రమము నేను కూడా నా జీవితములో చేయలేకపోయాను. నేను చేయలేని పని మీరు విజయవంతంగా చేశార**,ని ఉమర్ అలీషా లీగ్ కార్యకర్తలను, నాయకులను ప్రశంసించారు. **మద్రాసు వాసులకు ఆంధ్రులపై పెత్తనం చేయాలని ఏలా దుర్భ్రమ పుట్టిందో అలాగే పట్టణవాసులు పల్లె ప్రజలపై పెత్తనం చేయాలని ముమ్ముందు ఇలాంటి భావాలు పుట్టవచ్చు. కాబట్టి మీరందరు**

**పల్లెప్రజలను పట్టణప్రజలను మేలుకొలపాలి. స్వలాభాపరుల నుండి ప్రజా సంస్థలను రక్షించాలి**, అని గ్రామీణ ప్రాంతాల నుండి విచ్చేసిన ప్రజలకు, కార్యకర్తలకు మౌల్వీ ఉమర్ అలీషా విలువైన సలహా ఇచ్చారు.

## ఐక్యత స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెడుతుంది

అఖిల భారత ముస్లింలీగ్ రాజకీయ దృక్పథం ఏలా ఉన్నా ఆంధ్రలోని ముస్లింలలో అత్యధికుల రాజకీయ దృక్కోణం మాత్రం భిన్నంగా ఉంది. ముస్లింలు అటు అఖిల భారత జాతీయ కాంగ్రెస్‌లో ఉన్నా, ఇటు అఖిల భారత ముస్లింలీగ్‌లో ఉన్నా ఉమ్మడి ప్రయోజనాల విషయంలో ఏకాభిప్రాయం కలిగి ఉండటం విశేషం. ఆంధ్రలో ముస్లింలీగ్‌ను ప్రజాపరం చేయడానికి ఆవిర్భవించిన **గుంటూరు జిల్లా ముస్లింలీగ్ ఆర్గనైజింగ్ కమిటీ** అభిప్రాయాలు గాని, ఆ సభలను సంబోధించిన డాక్టర్ ఉమర్ అలీషా అభిప్రాయం గాని ఒకేరకంగా ఉన్నాయి. 1945 జనవరి 21న సాయంత్రం బాపట్లలో జరిగిన బహిరంగ సభలో ఉమర్ అలీషా మాట్లాడుతూ, **మన దేశంలో కాంగ్రెసు, ముస్లిం లీగు రెండు పెద్ద రాజకీయ సంస్థలు. రెండు ఏకమైతేనేగాని పరదేశ పాలకవర్గాన్ని తరుమలేము. హిందూ-ముస్లిం తగాదాలు పోరాటాలు విదేశ పాలకులను ఇక్కడే శాశ్వితముగా అట్టి పెట్టగలవు. ఈ సత్యాన్ని ఉభయులు గ్రహించాల**,ని ఉద్బోధించారు.

ముస్లింలీగ్ ప్రధాన లక్ష్యం పాకిస్థాన్ ఏర్పాటు కాకుండా అనేక అవస్థలు పడుతున్న ముస్లింల అభ్యున్నతి ఆశయంగా కృషిచేయాలని గుంటూరు జిల్లా ముస్లింలీగ్ కోరుతూ తీర్మానించడం చెప్పుకోదగ్గ అంశం. నిర్బంధ విద్యను ప్రవేశపెట్టాలని, ఉర్దూకు చేయూత ఇవ్వాలని, గుంటూరులో ముస్లిం మహిళల కొరకు ఉన్నతపాఠశాల ఏర్పాటు చేయాలని, వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు వక్ఫ్‌బిల్లు తేవాలని, ముస్లింలీగ్ కొత్త నిబంధనలలో మార్పులు తేవాలని, ప్రభుత్వ ఆహార కమిటీలలో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలని, గ్రామాలలో ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరుతూ, తమ ముందున్న ఆచరణాత్మక కార్యక్రమాన్ని కూడా కమిటి స్పష్టంగా నిర్దేశించుకుంది. ఆ మార్గ నిర్దేశకంలో భాగంగా, **ముస్లింలీగ్ పాకిస్థాన్ కొరకే కాకుండా ముస్లిం ప్రజలకు నిత్యం సహాయ సహకారిగా నిరూపించాలి**, అని స్పష్టంగా ప్రకటించింది.

ఈ మేరకు మద్రాసు రాష్ట్ర ముస్లింలీగ్ నేతల, స్థానిక లీగ్ పెద్దలు కల్పిస్తున్న అవాంతరాలను తట్టుకుని ఆంధ్రలో ముస్లింలీగ్ శాఖను ఏర్పాటుచేసి దాని వ్యవహార సరళిని ప్రజాస్వామీకరించిన గుంటూరు జిల్లా నేతలు ఆ దిశగా ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. ముస్లింలీగ్ కార్యకర్తలలో విషయ పరిపుష్టిని కలుగచేసేందుకు అధ్యయన తరగతులు నిర్వహించారు. సభలు, సమావేశాల సమయంలోనే కాకుండా సంస్థ

లక్ష్యాలను తెలుపుతూ, హిందూ-ముస్లింల ఐక్యతావసరాన్ని ఈ సందర్భంగా ఉద్ఘాటిస్తూ పలు నాటికలు, నాటకాలు ప్రత్యేకంగా రాయించి, ప్రత్యేక కళారూపాలను తయారు చేయించి జిల్లాలోని పలు ప్రాంతాలలో ప్రజల డిమాండ్ మీద వాటిని ప్రదర్శించారు.


## ముస్లింలీగ్ రాజకీయ కార్యకలాపాలు

మద్రాసు నగరం తరువాత ఆల్ ఇండియా ముస్లింలీగ్‌కు బలమైన కేంద్రస్థానంగా గుంటూరు మారింది. గుంటూరు జిల్లా పరిధిలోని 94 గ్రామాలలో 13వేల 366 మంది ముస్లిం లీగ్ సభ్యులయ్యారు. గుంటూరు, తెనాలి, రేపల్లె, బాపట్ల, ఒంగోలు, సత్తెనపల్లి, నరసరావుపేట, పల్నాడు, వినుకొండ ప్రాంతాలలో లీగ్ విస్తరించింది. ముస్లింలీగ్‌ను మద్రాసు నగర ప్రముఖుల పట్టు నుండి తప్పించి పల్లె ప్రాంతాలకు విస్తరింప చేసిన నాయకులు లీగ్ కార్యక్రమాలను రాష్ట్రంలో విస్తృతంగా నిర్వహించారు. గుంటూరు కేంద్రంగా ముస్లిం ప్రముఖులు ఒకవైపున జాతీయ కాంగ్రెస్ కార్యకలాపాలలో పాల్గొంటూనే లీగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ తరువాత లీగ్‌లో పుట్టుకొచ్చిన వేర్పాటువాద ధోరణుల మూలంగా లీగ్ కార్యక్రమాలకు క్రమంగా దూరం అవుతూ చివరకు భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాలకు మాత్రమే తమను తాము పరిమితం చేసుకున్నారు.

1945 మే 5న గుంటూరు జిల్లా చందోలులో తొలిసారిగా రాష్ట్ర స్థాయి రాజకీయ పాఠశాల నిర్వహించారు. ఆంధ్ర ప్రాంతం నుండి 40 మంది విద్యార్థులుగా పాల్గొన్న ఈ పాఠశాల 10 రోజుల పాటు నిర్విఘ్నంగా సాగింది. ఈ పాఠశాలలో అజీజుల్లా దుర్రాని (ఇంగ్లాండు), అబ్దుల్ మన్నాన్ దుర్రాని (అలీఘర్), డాక్టర్ మహమ్మద్ బేగ్, యం.ఎ. సలాం, షేక్ మగ్దూం, యస్ మహబూబ్‌లు అధ్యాపకులుగా వ్యవహరించారు.

రాష్ట్రంలోని ఒంగోలు, అమ్మనబ్రోలు, చిలకలూరిపేట, పొన్నూరు, భట్టిప్రోలు, కనగాల, కొలకలూరు, నందివెలుగు, తేలప్రోలు, వడ్లమూడి, చేబ్రోలు, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, ఫిరంగిపురం, బాపట్ల, తాడికొండ, చీరాల, పేరాల, ఈపూరు పాలెం, పర్చూరు, దగ్గుపాడు, ఇంకొల్లు తదితర ప్రాంతాలలో భారీ ప్రదర్శనలు, బహిరంగ సభలను లీగ్ నేతలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సభలు జరిగిన పలుచోట్ల ప్రజలను ఉత్తేజపర్చుతూ స్వతంత్ర భావనలను ప్రజలలో ఉద్దీపింపచేస్తూ, హిందూ-ముస్లింల మధ్య స్నేహసంబంధాలను పునరుద్ఘాటిస్తూ **పుకార్** అను ప్రత్యేక నాటక ప్రదర్శన, నాగస్వర కచేరీలు, ఇతర కళారూపాల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం విశేషం.

ఈ కార్యక్రమాలు మాత్రమే కాకుండా రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా ఉభయ గోదావరులకు, విశాఖపట్నం, చిత్తూరు ప్రాంతాలలో లీగ్ అభ్యర్థుల గెలుపు కోరుతూ



గుంటూరు జిల్లా ముస్లిం లీగ్ నిర్మాణానికి 1944 మే 5న తెనాలిలో జరిగిన సమావేశానికి హాజరైన గ్రామీణ నాయకులు

గుంటూరు నుండి కార్యకర్తలు, నాయకులు ప్రచారం నిమిత్తం తరలి వెళ్ళారు. (గుంటూరు జిల్లా ముస్లిం లీగ్ ప్రథమ వార్షిక నివేదిక 1945-46, రూపకల్పన : సయ్యద్ మహబూబ్ -తెనాలి, ముద్రణ : సిటీ ప్రెస్-గుంటూరు)

ఈ విధంగా 1946 చివరి వరకు ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలను ప్రభావితం చేస్తూ, పర్యటనలు జరిపి పలు కార్యక్రమాలలో పాల్గొని ముస్లింలీగ్ కార్యకలాపాలను విస్తృతం చేసిన నాయకులకు రోజురోజుకు తీవ్రరూపం ధరిస్తున్న అఖిల భారత ముస్లింలీగ్ వేర్పాటువాద పోకడలు నచ్చలేదు. ప్రజలకు సంబంధించిన సమస్యలు, వారి మంచి చెడులను గురించి కాకుండా పాకిస్థాన్ ఏర్పాటు మాత్రమే ప్రధాన లక్ష్యంగా సాగుతున్న ముస్లింలీగ్ వైఖరితో నాయకులు విభేదించారు. ఆ పార్టీకి ఆంధ్రలో ఆయువుపట్టుగా నిలచిన ప్రముఖ నాయకులు ముస్లింలీగ్ నుండి బయటకు వచ్చేశారు. ఆ తరువాత ఆయా నేతలు **ముస్లింలీగ్ పాకిస్థాన్ కొరకే కాకుండా ముస్లిం ప్రజలకు నిత్యం సహాయ సహకారిగా నిరూపించాలి** అని ప్రకటిస్తూ భారత జాతీయ కాంగ్రెస్, భారత కమ్యూనిస్టు పార్టీలలో ప్రవేశించి జాతీయోద్యమ కార్యకలాపాలను తమదైన రీతిలో ముమ్మరం చేశారు.

## భారత జాతీయ సైన్యంలో తెలుగుగడ్డ బిడ్డలు

మాతృదేశాన్ని బ్రిటీష్ దాస్య శృంఖలాల నుండి విముక్తం చేయడానికి జర్మనీ,

జపాన్ దేశాల సైనిక సహాయం కోరడం కోసం నేతాజీ సుభాష్ చంద్ర బోస్ దేశం విడిచి వెళ్ళారు. భారత దేశం విముక్తి ప్రధాన లక్ష్యంగా ఆయన నేతృత్వంలో భారత జాతీయ సైన్యం (ఆజాద్ హింద్ ఫౌజ్ ) ఏర్పడింది. ఆనాడు బ్రిటీష్ సైన్యంలో పనిచేస్తున్న భారతీయ సైనికులు మూకుమ్మడిగా భారత జాతీయ సైన్యంలో చేరారు. ఈ యోధులంతా మాతృభూమి విముక్తి కాంక్షిస్తూ బ్రిటీష్ సైన్యానికి వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య సంగ్రామంలో భాగంగా తుపాకులు పట్టారు.

భారత జాతీయ సైన్యంలో ఇతర సామాజిక జనసముదాయాల్లాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముస్లింలూ భారీ సంఖ్యలో చేరారు. ప్రధానంగా హైదరాబాదుకు చెందిన అబిద్ హసన్ సఫ్రాని లాంటి వారు ఉన్నత స్థానాలలో బాధ్యతలు నిర్వహించారు. ఆయనతోపాటుగా ఖమురుల్ ఇస్లాం, తాజుద్దీన్ గౌస్, హైదరాబాద్ చార్మినార్ సిగరెట్ కంపెనీ (వజీర్ సుల్తాన్ టొబాకో కంపెనీ) యజమాని కుమారుడు అలీ సుల్తాన్ కూడా నేతాజీతో కలసి పనిచేశారు. ఈ మేరకు హైదరాబాదు సంస్థానానికి చెందిన షరీఫుద్దీన్, అబ్దుల్ సయీద్ ఉస్మాని, అబ్దుల్ లతీఫ్, ఇమాముద్దీన్, ముహమ్మద్ ఖాన్ లాంటి పలువురు నేతాజీ వెంట నడిచారు.

ఈ యోధులలో ఆబిద్ హసన్ సఫ్రాని లాంటి వారు స్వాతంత్ర్య పోరాట సాహిత్య చరిత్రలో అపూర్వం అనదగిన **జైహింద్, నేతాజీ** అను పదాలను సృష్టించారు. ఆనాడు నేతాజీ జరిపిన ప్రమాదకర జలాంతర్గామి ప్రయాణంలో అబిద్ హసన్ ఆయన వ్యక్తిగత కార్యదర్శి హోదాలో నేతాజీ వెంట ఉన్నారు. (స్వాతంత్ర్యోద్యమం దేశనాయకులు, వి.యల్. సుందర రావు, 1989, తిరుపతి)

భారత జాతీయ సైన్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు భాగస్వాములయ్యారు. గుంటూరు జిల్లా చందోలు గ్రామంలో ఆనాటి వీర సైనికుల జాడలు నేటికీ కన్పిస్తాయి. ఆ గ్రామం నుండి భారత జాతీయ కాంగ్రెస్‌లో, ముస్లింలీగ్‌లో, భారత జాతీయ సైన్యంలో పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషాంశం. ప్రకాశం జిల్లా దర్శి తాలూకా రామభద్రపురం గ్రామాధికారి షేక్ బాదుషా 1937లో సైన్యంలో చేరారు. 194లో ఫౌజ్ సైనికుడిగా పోరాడారు. ఆయన మలయా, మాండలే జైళ్ళల్లో నిర్బంధానికి గురయ్యారు. విజయనగరం జిల్లా వేపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ మొహిద్దీన్ చిన్నతనంలోనే పనికోసం బర్మాకు వెళ్ళి అక్కడి తేయాకు తోటల్లో శ్రమిస్తూ దాచుకున్న 20 వేల రూపాయలను అజాద్ హింద్ ఫౌజ్‌కు విరాళంగా సమర్పించారు. ఆయన అంతటితో ఆగకుండా స్వయంగా ఆజాద్ హింద్ పౌజ్‌లో రైఫిల్‌మన్‌గా బాధ్యతలు చేపట్టడం మాత్రమే కాకుండా మాతృభూమి విముక్తి కోసం పోరుబాటన సాగాల్సిన అవసరాన్ని యువకులకు తెలుపుతూ వారిని అజాద్ హింద్ ఫౌజ్‌లోకి ఆహ్వానించే రిక్రూటింగ్ ఏజెంటు కూడా ఎంతో కృషిచేశారు.

చిత్తూరు జిల్లా చంద్రగిరికి చెందిన యస్.అబ్దుల్ అలీ నేతాజీ పిలుపుకు ప్రభావితుడై ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరారు. వృత్తిరీత్యా వడ్రంగి కావడంతో ఆయనకు క్యాంపు క్వార్టర్లలో చేతినిండా పని ఉండేది. అయినా అలుపు సొలుపు ఎరుగకుండా పనిచేస్తూ ఆయన అధికారుల ప్రశంసలను అందుకున్నారు. అనంతర కాలంలో ఆయన యుద్ధఖైదిగా సంవత్సరం పాటు జైలుశిక్షను అనుభవించారు. అబ్దుల్ అలీ లాగే చిత్తూరు జిల్లాకు చెందిన మహమ్మద్ అఫ్జల్ సాహెబ్ నేతాజీ సైన్యంలో చేరారు. ఆయన కూడా ఒక ఏడాది యుద్ధఖైదీగా నిర్బంధానికి, ఇబ్బందులకు గురయ్యారు. చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన పి.పి.మహమ్మద్ ఇబ్రహీం అదే బాటలో నడిచారు. కడపజిల్లా రాయచోటికి చెందిన డ్రైవర్ అబ్దుల్ ఖాదర్ ద్వితీయ ప్రపంచ యుద్ధ కాలంలో భారత జాతీయ సైన్యంలో చేరారు. 1945 దాకా మలయా తదితర ప్రాంతాలలో జైలులో గడిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాంతానికి చెందిన షేక్ అహమ్మద్ అజాద్ హింద్ ఫౌజ్‌లో భాగస్వాములయ్యారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాలలో పాల్గొని ఆయన పలు శిక్షలకు గురయ్యారు.

## నావికా సైన్యం తిరుగుబాటు

1946 ఫిబ్రవరి 18న బొంబాయిలో శిక్షణ పొందుతున్న భారత నావికా సైనికులు, బ్రిటీష్ అధికారులు తమను అవమానకరమైన నిబంధనలకు గురి చేస్తున్నందుకు నిరసనగా నిరాహార దీక్షలు ప్రారంభించి తిరుగుబాటును ప్రకటించారు. ఆ నిరసన జ్వాలలు అత్యంత వేగంగా అన్నిప్రాంతాలకు వ్యాప్తి చెందాయి. ఆ పరిణామాలను సహించలేని ప్రభుత్వం పలు ప్రాంతాలలో కాల్పులు జరిపి 200 మందిని బలి తీసుకుంది. 1857లో బ్రిటీష్ సైన్యంలోని భారతీయ సైనికులు తిరుగుబాటు జరిన సరిగ్గా వంద సంవత్సరాల తరువాత భారత దేశం విడిచి వెళ్ళేందుకు ఆంగ్లేయులు సిద్దం అవుతున్న చివరిదశలో మళ్ళీ అటువంటి తిరుగుబాటు సైన్యంలోని స్వదేశీ సిపాయీల ఆధ్వర్యంలో జరగడం విశేషం.

## భారత విభజనకు వ్యతిరేకత

అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా, జాతీయంగా భారతీయులు నిర్వహిస్తున్న ఉద్యమాల తీవ్రత ఫలితంగా 1947లో భారతదేశం పాలనాధికారాన్ని భారతీయులకు అప్పగించాల్సిన పరిస్థితి ఆంగ్లేయులకు ఏర్పడింది. భారతదేశాన్ని విడిచి వెళ్ళే ముందు ఈ గడ్డను ముక్కలు చేసి మరీ వెళ్లేందుకు బ్రిటీష్ పాలకులు నిర్ణయించుకున్నారు. ఆ ప్రయత్నంలో భాగంగా భారత దేశాన్ని రెండుగా చీల్చడానికి పథకాన్ని విజయవంతంగా అమలు చేశారు.

1940 నుండి పాకిస్థాన్ ఏర్పాటును కోరుతూ ఆల్ ఇండియా ముస్లింలీగ్ సాగించిన విభజన రాజకీయాలకు ఆంగ్లేయులు తోడ్పాటు అందించారు. భారత విభజన మీద

అనుకూలంగా, వ్యతిరేకంగా ప్రజలు, నాయకులు స్పందించారు. ఈ విభజన ప్రయత్నాలకు తెలుగుగడ్డ మీద కూడా ప్రతికూల స్పందనలు వ్యక్తమయ్యాయి. భారత ఉపఖండం యధాతథంగా ఉండాలని కోరుకుంటున్న నేతలు, ప్రజలు భారత విభజన ఆలోచనలను వ్యతిరేకించారు. ఈ క్రమంలో తెనాలికి చెందిన మున్షీ మస్తాన్, నసరావుపేటకు చెందిన షేక్ ముహమ్మద్ ఆలీ, షేక్ మొహిద్దీన్ సాహెబ్‌లు లీగ్ విభజన రాజకీయాలను నిరసించారు. మహమ్మద్ ఆలీ ఎంతో కాలం లీగ్ సభ్యునిగా ఉన్నా కూడా, లీగ్ విభజన రాజకీయాలను వ్యతిరేకిస్తూ లీగ్‌కు రాజీనామా చేశారు. నరసరావుపేటకు చెందిన సయ్యద్ జాన్ అహమ్మద్ విభజనను వ్యతిరేకిస్తూ పనిచేశారు. భారత విభజన వలన కలిగే నష్టాలను, కష్టాలను వివరిస్తూ సభలు సమావేశాలు నిర్వహించారు.

ఆ సమయంలో ఆంధ్ర ప్రాంతం నుండి పలువురు విభజనను వ్యతిరేకించారు. కులీన వర్గాలు, భూస్వాములు, రాజకీయ నాయకులు, సంపన్నులు, ఉన్నత విద్యావంతులు విభజన వలన తక్షణ లబ్దిని ఆశిస్తున్న శక్తులు, వ్యక్తులు, వ్యవస్థలు విభజన కోరుకున్నాయి. ఆ కారణంగా అశేష ప్రజానీకం ఆకాంక్షలకు విరుద్ధంగా విభజన దిశగా పావులు కదిపాయి. ఆ ప్రయత్నాల వలన ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా భారతదేశం రెండుగా చీలిపోవాల్సిన ఆనివార్య పరిస్థితి ఏర్పడింది.

జాతీయ స్థాయిలో మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ లాంటి నాయకులు చివరివరకు విభజనను నివారించడానికి ప్రయత్నించారు. ఆనాడు మౌలానా బాటన నడిచి భారత విభజనను పలువురు తెలుగుబిడ్డలు వ్యతిరేకించారు. ఆ దిశగా ప్రచార కార్యక్రమాలను కూడా ముమ్మరంగా చేపట్టారు. భారత విభజన వలన అన్ని వర్గాల ప్రజానీకం ఎదుర్కొవాల్సిన దుర్భర పరిస్థితులను, ఎదురయ్యే మానసిక క్షోభను వివరిస్తూ పలు ప్రాంతాలలో సభలు సమావేశాలు పెట్టి ప్రజలకు వివరించారు. ఈ మేరకు విభజనకు వ్యతిరేకంగా ప్రజలు, నాయకులు ఎంతగా ప్రయత్నించినా చివరకు విభజన తప్పలేదు. అఖిల భారత జాతీయ కాంగ్రెస్‌లోని కార్యవర్గసభ్యులలో అత్యధికులు భారత విభజనను అంగీకరిస్తూ ఓటు వేశారు. భారతదేశం ఇండియా-పాకిస్థాన్‌లుగా రెండు ముక్కలై పోడానికి మార్గం సుగమం అయ్యింది.

## భారత స్వాతంత్ర్య ప్రకటన

1947 జూలై 15న బ్రిటీష్ పార్లమెంట్ **భారత స్వాతంత్ర్య ప్రదాన బిల్లు** ను ఆమోదించింది. స్వాతంత్ర్య పోరాటంలోని ప్రతిఘట్టంలో తమదైన అద్భుత పాత్రను నిర్వహించిన తెలుగు ప్రజలు 1947 ఆగస్టు 15న అత్యంత ఉత్సాహంతో భారత స్వాతంత్ర్యోత్సవాలను జరుపుకున్నారు.



భారత విభజనకు అనుకూలంగా ఓటువేస్తున్న
జవహర్‌లాల్ నెహ్రూ, రాజేంద్ర ప్రసాద్, కె.సి.పంత్ తదితరులు

ఈ ప్రకటన బ్రిటీష్ ప్రెసిడెన్సీ ఏరియాలో ఆంధ్ర ప్రాంతానికి సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను తెచ్చిపెట్టింది కాని, నిజాం నవాబు ఆధీనంలోనున్న హైదరాబాద్ సంస్థానం లోని ప్రజలకు మాత్రం పూర్తిగా విముక్తి లభించలేదు. హైదరాబాదు రాష్ట్రం నిజాం సంస్థానంలో భాగం కావడం, ఆ సంస్థానం ప్రత్యేకతను నిలుపుకుంటూ స్వతంత్రంగా ఉంటానని నైజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ప్రకటించడంతో అక్కడి ప్రజలకు పూర్తి స్థాయిలో స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలు దక్కలేదు. నిజాం ప్రభువు అభీష్టానికి వ్యతిరేక అభిప్రాయాన్ని నైజాం సంస్థానంలోని అత్యధికులు వ్యక్తంచేశారు. ఈ దిశగా ప్రజలు, మేధావులు హైదరాబాదు రాష్ట్రాన్ని ఇండియన్ యూనియన్‌లో కలిపివేయాల్సిందేనంటూ డిమాండ్ చేశారు. ప్రజానీకం ఆంకాంక్ష ఎంత బలంగా ఉన్నా నైజాం సంస్థానాధీశుడు నిజాం నవాబు, ఆయన అనుచరవర్గం ససేమిరా అన్నారు.

## 'ఆజాద్ హైదరాబాద్' ప్రకటన

స్వతంత్ర భారతదేశం ఆవిర్భావించగానే, అందులో నైజాం సంస్థానాన్ని విలీనం చేయడానికి తిరస్కరించిన నిజాం నవాబు తన సంస్థానాన్ని స్వతంత్రంగా నిలుపుకోదలిచాడు. ఆ నిర్ణయానికి అనుకూలంగా ఆగస్టు 14న '**ఆజాద్ హైదరాబాదు**' ను ప్రకటించాడు. ఈ విషయమై, '**ఆగస్టు 15వ తేదిన బ్రిటీషు వారి పరమాధికారం అంతమౌతుంది. స్వతంత్ర భారతదేశం అవతరిస్తుంది. అట్లే పాకిస్థాన్ గూడా అస్తిత్వంలోకి వస్తుంది. కాబట్టి నేను స్వతంత్రుడ నౌతాను. హైదరాబాదు బ్రిటీషు వారు రాకపూర్వం ఉన్న స్థితిని పొందుతుంది.**' అని స్పష్టం చేశాడు. ఆ ప్రకటన ప్రకారంగా నైజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో

విలీనం చేయడానికి నవాబు విస్పష్టంగా నిరాకరించాడు.

ఈ ప్రకటనను జాతీయవాద ముస్లిం నాయకులకు మింగుడు పడకపోవడంతో. ఆయన 'ఆజాద్ హైదరాబాద్' ప్రకటనను ఖండించారు. లండన్‌లోని 'జాతీయ ముస్లిం సమితి' కార్యదర్శి అబ్దుల్ ఘని నిజాం ప్రకటన మీద స్పందిస్తూ '**ఇది వట్టి అవివేకం. అందరాని ఫలానికై ఆశించడం తప్ప మరొకటి కాదు. బ్రిటీషు పార్లమెంటు సభ్యులకు భారతదేశ వ్యవహారాలలో జోక్యం కలిగించుకునే అధికారం అణుమాత్రమయినా లేదని గ్రహించక పోవడం మిగుల శోచనీయం**' అని అన్నారు. (హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, వెల్దుర్తి మాణిక్యరావు, పేజి. 478)

ఆ తరువాత 1947 ఆగస్టు 15నాటికి భారత్, పాకిస్తాన్‌లు రెండు స్వతంత్ర దేశాలుగా పూర్తి స్థాయిలో అవతరించాయి. నైజాం నవాబు మాత్రం తన నైజాం సంస్థానం స్వతంత్ర దేశంగా ఉంటుందని ప్రకటించుకున్న నిర్ణయాన్ని ఏమాత్రం సడలించలేదు.

## విలీనం కోరుతూ ఉద్యమించిన ప్రజలు

ఈ వైఖరికి వ్యతిరేకంగా, నైజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయాలన్న డిమాండ్‌తో ప్రజలు పెద్దఎత్తున ఉద్యమించారు. స్వతంత్ర రాజ్యంగా ఉండేందుకు నిర్ణయించుకున్న నిజాం నవాబు నిర్ణయాలకు అనుకూలంగా ఇత్తేహాద్ ఉల్-ముస్లిమీన్‌కు చెందిన రజాకారులు సాయుధంగా విజృభించారు. హైదరాబాదు రాష్ట్రం భారతదేశంలో విలీనం అయ్యే ప్రసక్తి లేదంటూ, విలీనం కోరుతున్న ప్రజలపై రజాకారులు విరుచుకు పడ్డారు. నైజాం పాలకుల అండదండలతో రజాకార్లు, పాలకుల మద్దతుదార్లు సాగిస్తున చర్యలను ప్రతిఘటించేందుకు ప్రజలు, నాయకులు, ఉద్యమకారులు ఉద్యమించారు.

ఈ మేరకు ఉద్యమ స్ఫూర్తిని కలుగచేయడానికి నిజాం సంస్థానంలో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఆర్య సమాజికులు, హిందూ-ముస్లిం మేధావులు, విద్యార్థి-యువజన-మహిళా ప్రజా సంఘాలు అప్పటికే ఓ ప్రత్యేక ప్రజాస్వామిక వాతావరణం ఏర్పాటుకు కారణమైయున్నాయి. ఆ వాతావరణం మూలంగా నైజాం సంస్థానం కూడా ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలన్న ప్రజాభిప్రాయం బలంగా ప్రాణం పోసుకుని బలపడింది. ఆ భావనలకు అనుగుణంగా పత్రికలు, ప్రజలు, మేధావులు ప్రజాస్వామిక ప్రచార చర్యలు చేపట్టి ప్రజాభిప్రాయాన్ని కూడగట్టారు.

ఆ కృషి ఫలితంగా హైదరాబాదు రాజ్యాన్ని ఇండియన్ యూనియన్‌లో కలిపి వేయాలన్న ఉద్యమం బలం పుంజుకుంది. ప్రజలలో, జాతీయవాదులలో రజాకార్లు, నిజాం

నవాబు పట్ల వ్యతిరేకత మరింతగా స్పష్టం కాసాగింది. ఆ వాతావరణం ఫలితంగా నైజాంలో నిజాం నవాబు ఉస్మాన్ అలీ ఖాన్‌కు ఎదురు తిరిగి ఆయనకు సలహాలు ఇవ్వగలిగే స్థాయి సామాన్య ప్రజలలో కాకున్నా ప్రముఖులలో, మేధావులలో వచ్చింది.

ఆ రోజుల్లో మతదురహంకారానికి దూరంగా ఉన్న సిరాజుల్ హసన్ తిర్మిజ్, డాక్టర్ అక్బర్ అలీ, జలాలుద్దీన్, హసన్ ముహమ్మద్ పహిల్వాన్, మీర్ అహమ్మద్ అలీ ఖాన్, డాక్టర్ లతీఫ్ సయూద్ లాంటి వారు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడం మాత్రమే కాదు విలీనం కోరుతూ కూడా ఉద్యమించారు. సామ్యవాద సిద్ధాంతాలకు ఆకర్షితులై సమసమాజ స్థాపన లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీలో భాగస్వాములైన మగ్దూం మొహిద్దీన్, అలం ఖుంద్ మీర్, హసన్ నాసిర్, జవ్వాద్ రజ్వి, అఖ్తర్ హుస్సేన్, జహందర్ అఫ్సర్, కుతుబ్–యే–ఆలం, అహసన్ అలీ మీరజ్, మీరాజ్ హైదర్ హుస్సేన్, హుస్సేని షాహిద్ లాంటి వివిధ రంగాలలో ప్రతిభావంతులైన ప్రముఖులు నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలని డిమాండ్ చేశారు.

## పత్రికల ప్రముఖ పాత్ర

ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానం విలీనం కావాలన్న భావనను ప్రజలలో ప్రచారం చేసేందుకు పలు పత్రికలు, ఆయా పత్రికల సంపాదకులు, పాత్రికేయులు రంగం మీదకు వచ్చి అక్షరయోధులుగా బహుముఖ పాత్ర వహించారు. ప్రముఖ పాత్రికేయులు ముస్తఫా ఖాదిరి **వతన్ న్యూస్** అను వార్తా సంస్థను స్థాపించారు. ఆయన స్వయంగా **మొహిబ్బె వతన్** (దేశభక్తుడు) అను ఉర్దూ పత్రిక ఆరంభించి నడిపారు. ఈ పత్రిక ద్వారా దేశభక్తియుత జాతీయభావాలను ప్రచారం చేయటం మాత్రమే కాకుండా నిజాం నవాబుకు వత్తాసు పలికే **దక్కన్ న్యూస్** పత్రికలో వచ్చే పక్షపాతపూరిత, నిజాం అనుకూల సమాచారం లోని డొల్లతనాన్ని ఎండగడ్తూ వ్యాసాలు ప్రచురించారు. ఆ బాటలో పాత్రికేయులు జలాలుద్దీన్ **సమాజ్** అను ఉర్దూ పత్రికను నడిపారు.

ఈ మార్గాన మరింత సాహసంగా ముందుకు సాగిన వ్యక్తి **ఇమ్రోజ్** ఉర్దూ పత్రిక సంపాదకులు షోయాబుల్లా ఖాన్. ఆయన కొంత కాలం మందుముల నర్సింగరావు పత్రిక **రయ్యత్**లో పనిచేశారు. ఆ పత్రికలో పనిచేస్తున్న సమయంలో జాతీయ భావాలను వ్యక్తం చేస్తూ, ప్రజాస్వామిక ఆలోచనలకు ప్రాణం పోసే వ్యాసాలను రాశారు. ఈ పత్రికను నిజాం ప్రభుత్వం నిషేధించిన తరువాత, షోయాబుల్లా స్వయంగా **ఇమ్రోజ్** పత్రికను ప్రారంభించారు. ఈ పత్రికలో ఆయన **రాసే వాస్తవాలైన నిర్మొహమాట రచనలే అతనికి ప్రాణాంతకమైనాయి.** ప్రముఖ ఉర్దూ పండితులు ఖాజి అబ్దుల్ గఫార్ **పయాం** అను ఉర్దూ పత్రిక నడపడమే

కాకుండా స్వయంగా ఆ పత్రిక సంపాదక బాధ్యతలను కూడా నిర్వహించారు. ఖాజి అబ్దుల్ గఫార్ ప్రగతిశీల భావాల జాతీయవాది. ఆనాడు నిజాం అనుకూల పత్రికలలో ప్రచురితం అవుతున్న వాదనలోని డొల్లతనాన్ని బయటపెడ్తూ, సంభవించే ప్రమాదకర పరిస్థితులను వివరిస్తూ **పయాం** ప్రజల పక్షంగా పదునైన సమాధానాలను ఇస్తూ వచ్చింది. ఆ క్రమంలో విలీనం కోరుతూ రాయబడిన వ్యాసాలకు, వార్తలకు, సంఘటనలకు **పయాం**లో ప్రముఖంగా స్థానం కల్పిస్తూ విలీనాన్ని వ్యతిరేకిస్తున్న నిజాం అనుకూల పత్రికలకు చుక్కెదురుగా నిలిచింది.

ఈ మేరకు పత్రికలు, ప్రజాస్వామ్యవాదులు, జాతీయ భావాలు సంతరించుకున్న ప్రముఖులు ఏర్పరచిన వాతావరణం ప్రజలలో ప్రజాస్వామిక భావనలను, ప్రభువులను ఎదిరించగల ధైర్యసాహసాలను ప్రోదిచేశాయి. ఈ వాతావరణం ఎంతటి బలమైన ఆకాంక్షను ఇటు ప్రజలలో, అటు ప్రధానంగా మేధావులలో దైర్యసాహసాలను స్థిరపర్చింది. ఆ వాతావరణం ఇండియన్ యూనియన్‌లో హైదరాబాదు రాష్ట్రాన్ని విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ నిజాం నవాబును సంబోధిస్తూ నేరుగా ఆయనకు లేఖ రాయగలిగే స్థాయికి తీసుకెళ్ళింది.

## చరిత్ర సృష్టించిన 'నిజాంకు ఏడుగురు ప్రముఖుల వినతి'

ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానాన్ని విలీనం చేయాల్సిందిగా నిజాం నవాబును కోరుతూ, హైదరాబాద్ రాష్ట్రంలో ఏర్పడిన అవాంఛనీయ పరిస్థితులను పూసగుచ్చినట్టు ఏకరువు పెడుతూ, నిజాం సంస్థానంలో ముస్లిం అధికారులు, ముస్లిం మేధావులు ఏకమై ఎంతో ధైర్య సాహసాలతో నేరుగా నిజాంకు లేఖ రాశారు. ఈ లేఖ మీద నిజాం నవాబుకు సన్నిహితులు, నైజాం ప్రభుత్వంలో సుబేదార్‌గా బాధ్యతలు నిర్వహించిన నవాబు మంజూరు జంగ్, నిజాం ప్రభుత్వంలో విద్యాశాఖ సంచాలకులుగా పనిచేస్తున్న ముహమ్మద్ హుస్సేన్ జాఫరీ, తహసీల్దార్ ఉద్యోగానికి రాజీనామా చేసిన ఫరీద్ మీర్జా, బాఖర్ అలీ మీర్జా, ముల్లా అబ్దుల్ బాసిత్, అహమ్మద్ మీర్జా, హుస్సేన్ అబ్దుల్ మునీంలు సంతకాలు చేశారు. ఆ తరువాత దువ్వ డిప్యూటీ కలక్టరుగా నైజాం ప్రభుత్వం నుండి ఉపకారవేతనం పొందుతున్న ఫాయిఖ్ హుస్సేన్ కూడా అ లేఖలో వ్యక్తం చేసిన అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవిస్తూ, తదుపరి సంభవించే తీవ్ర పరిణామాలను కూడా ఆలోచించకుండా లేఖ మీద సంతకం చేశారు. ఈ లేఖను ఫరీద్ మీర్జా బారిస్టర్ అక్బర్‌అలీ ఖాన్‌కు చూపించి సంతకం కోరగా ఆయన తిరస్కరించడం మాత్రమే కాకుండా ఫరీద్ మీర్జా మీద మండిపడుతూ ఇటువంటి పనులు చేయవద్దని సలహా ఇచ్చారు.

ఈ లేఖ రాయడానికి ప్రధానంగా ఫరీద్ మీర్జా పూర్తి స్థాయిలో ప్రేరణ కాగా లేఖ పూర్తి పాఠాన్ని బారిష్టర్ బాఖర్ అలీ మీర్జా తయారు చేశారు. ఆ తరువాత ఏడుగురు

ప్రముఖులు సంతకాలు చేసి దానిని నిజాంకు పంపించారు. అది నిజాంకు చేరేముందుగా స్థానిక ఉర్దూ పత్రికలలో ప్రచురితమైంది. సంచలనం సృష్టించిన ఆ వినతి అటు ఢిల్లీలో ఇటు హైదరాబాదు సంస్థానంలో పెను తుఫానుకు కారణమైంది. ఈ లేఖ ప్రాంతీయంగా, జాతీయంగా, అంతర్జాతీయంగా చరిత్ర సృష్టించింది.

## సుప్రసిద్ధ లేఖ పూర్తిపాఠం

ఈ సాహసోపేతమైన ప్రకటనను షోయాబుల్లా ఖాన్ సంపాదకత్వంలో వెలువడుతున్న **ఇమ్రోజ్** దినపత్రికలో ప్రచురించాలని తొలుత ప్రకటనకర్తలు అనుకున్నారు. నైజాం ప్రభుత్వం ఆంక్షల ఫలితంగా ఏదీ సెన్సార్ కాకుండా ప్రచురితం అయ్యే అవకాశాలు ఆ పత్రికలో అనాడు లేకున్నాయి. ఆ కారణంగా, ప్రకటన సారాంశం ముందుగా నిజాం ప్రభుత్వానికి తెలియకూడదని భావించి ముల్లా అబ్దుల్ బాసిత్ సంపాదకత్వంలో ప్రచురితం అవుతున్న **ఖాదిం** వారపత్రికలో ప్రచురించే ఏర్పాటు చేశారు. చివరకు ఈ లేఖ పూర్తిపాఠం విఖ్యాత జాతీయవాది ఖాజీ అబ్దుల్ గఫార్ సంపాదకత్వంలోని ఉర్దూ పత్రిక **పయాం**, 1948 ఆగస్టు 13నాటి సంచికలో ప్రకటితమైంది. ఆ లేఖ ఇలా సాగింది-

**రాష్ట్రానికి ఎంతటి చెడ్డరోజులు దాపురించినవో మీకు తెలిసే ఉంటుంది. ఇటువంటి పరిస్థితులు రావటానికి మన చర్యలు కొంత వరకు కారణమైతే కొంత బయటి పరిస్థితులు కారణం. పరిస్థితులను మెరుగుపరుచుకోవటానికి ఈ మధ్య కొన్ని అవకాశాలు కలిగినవి. మనం వాటిని సద్వినియోగం చేసుకోలేక పోయాము. తత్ఫలితంగా పరిస్థితులు నానాటికి క్షీణిస్తూ పోయాయి. దోపిడీలు, హత్యలకు గురికాని గ్రామమంటూ లేదు. రాష్ట్రంలో ఆంతరంగిక పాలన క్షీణించని జిల్లా లేదు.**

**ఇండియన్ యూనియన్‌తో మన సంబంధాలు ఏ కారణాలచేతనైతేనేమి సరిగా లేవు. ఆర్థిక దిగ్బంధనం మన దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసింది. విశ్రాంతి, తృప్తి అనే రెండు ద్వారాలు మనకొరకు తెరుచుకొని లేవు. మన రాష్ట్రం ఈ విపత్తు నుండి బయట పడుతుందనే విశ్వాసముంటే ఈ అన్నిటిని మనం భరించవచ్చు. మనం అనుసరించే మార్గం మనను గమ్యస్థానానికి చేరుస్తుందని నమ్మకం ఉంటే ఎంతటి త్యాగానికైనా సిద్ధపడే వాళ్ళం. కాని అది అటులకానందుకే విచారం. తప్పుడు ప్రచారం ఏ స్థాయికి చేరుకుందంటే మనవర్గం వారి మనస్తత్వం నిజ పరిస్థితులను గుర్తించలేనంతటి స్థాయికి చేరుకున్నది. కాబట్టి మేమే మౌనంగా ఉండజాలకున్నాం. రాష్ట్ర హితచింతకులుగా, శక్తికొలది గొంతెత్తి చెప్పదలచుకున్నాం.**

**ఇండియన్ యూనియన్‌తో సత్సంబంధాలు ఏర్పరచుకోవటం వలన ప్రజ విశ్వాసాన్ని చూరగొనేటటువంటి బాధ్యత కలిగి తాను చేసిన చర్యలకు ఉత్తరవాది కాగలశక్తి**

కలిగినటువంటి ప్రభుత్వాన్ని ఏర్పరచుట వలన మాత్రమే బయటి చేష్టలు గాని, ఆంతరంగిక అక్రమాలుగాని అరికట్టటానికి వీలవుతుంది. భారతదేశంలో చేరడం బానిసత్వమని గానీ, లొంగిపోవడం అనిగానీ ప్రజలకు చెప్పడం సరికాదు. మనము రక్షణ, రాకపోకల వ్యవస్థ, విదేశీ వ్యవహారాలలో సమానప్రతిపత్తి కలిగి ఉంటాం. వీటిని యధాతథపు ఒడంబడిక ద్వారా ఒప్పుకునే ఉన్నాం. ఇప్పుడు సార్వభౌమాధికారం అంతరించింది.

**1948** ఆగస్టు నాటి ప్రధాని శ్రీజవహర్లాల్ నెహ్రూ ఢిల్లీ ఉపన్యాసం నుండి ఈ రెండు వాక్యాలు ఉదహరిస్తున్నాం. 'హైదరాబాదు భారత దేశంలో కలసిపోవటం లేక చేరిపోవటం అంటే దాసోహ మనడం కాదు. దేశంలోని ప్రతి వ్యక్తి స్వతంత్రుడవటమే. చేరిపోవటానికి లేక విలీనం కావటానికి అర్థం సమానత'.

ముస్లింలు ప్రాతినిధ్యం వహించే మజ్లిసులోనే, ఇండియన్ యూనియన్‌లో హైదరాబాదు చేరాలనే వర్గమొకటి ఉన్నది. అది లేకపోతే యధాతథపు ఒడంబడిక జరిగేది కాదు. హైదరాబాదు తప్పనిసరిగా ఇండియన్ యూనియన్‌లో చేరాలనీ, ఈ విషయంలో భారతదేశంతో సహకరించాలనీ విద్యావంతులూ, ఔచిత్యం తెలిసిన ముస్లింలు అనేకులు భావిస్తున్నారు. విభజన జరిగి పాకిస్తాను ఏర్పడిన **1947** ఆగస్టు **15** నాటి రాత్రి నుండి చారిత్రకంగాను, భౌగోళికంగాను, భారతదేశంతో హైదరాబాదు అనుబంధితమై ఉన్నది. కాని హైదరాబాదు రాజకీయాల మీద ప్రభావం నెరుపుతున్నవారు హైదరాబాదును పాకిస్తానుతో అనుబంధ పరిచి భారతదేశంతో సంబంధాలను చెడగొట్టదానికి తలపడ్డారు. ఈ వర్గం వారి ప్రభావం ఉన్నందున భారత ప్రభుత్వంతో సరయిన ఒప్పందం కుదుర్చు కోవటానికి కాని, సంబంధాలు మెరుగుపరచుకోవటానికి కాని ప్రయత్నం చేయలేదు. బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపన విషయంలో నిజాం ఇదివరకే నిర్ణయం తీసుకున్నారు. ఫర్మాన్ల ద్వారా ప్రజల విశ్వాసాన్ని చూరగొనునట్టి బాధ్యతాయుత ప్రభుత్వమును నెలకొల్ప వలసిందిగ ఆదేశించారు. కాని అటువంటి ఆజ్ఞలను పాటించక పోవటం విచారకరం.

నేటికి కొంతకాలం క్రితం వరకూ హైదరాబాదులో హిందూ ముస్లిం సంబంధాలు ఎంత స్నేహపూర్వకంగా ఉండేవో అందరికి తెలుసు. కాని ప్రస్తుత ప్రభుత్వ మత పాక్షిక ధోరణి వలన ఆ సంబంధాలు చెడిపోయి విషమించినవి. రజాకార్ల దౌర్జన్యాలను గూర్చి హిందూ ప్రజల ఆర్తనాదాలు వినిపించుకోక ప్రభుత్వం తన పక్షపాత విధానాన్ని రుజువు పరచుకొన్నది.

ఈ సంస్థ దురాగతాలు, ఆక్షేపణకర కార్యక్రమాలు స్పష్టమైనవి. బహిరంగ మైనవి. ఈ సమస్య పైననే ముగ్గురు మంత్రులు వివిధ ఘట్టాలలో రాజీనామాలు లిచ్చారు. ప్రజలు చేసే ఆరోపణలను గూర్చి విచారణ చేసి, నేరస్థులను శిక్షించడం ప్రతి నాగరిక ప్రభుత్వం

యొక్క లక్షణం. కాని నిజాం ప్రభుత్వం ఏమీ జరగనట్టుగా ఆరోపణలను త్రోసిపుచ్చింది. కొన్ని సందర్భాలలో నేరాలు జరగలేదని బుకాయించి అర్థరహితంగా కొట్టివేసింది. 'ఇది ప్రభుత్వం' అని చెప్పుకునే ఏ ప్రభుత్వానికి ఇటువంటి ధోరణి తగదు. ఇస్లాం సభ్యతను గురించి గాని, ఆసియా సభ్యతను గురించి గాని, ఆచారాలు, నడవడి గురించి గాని, ఇస్లాం బోధనలు గూర్చిగానీ, ఏ కాస్త పరిచయమున్న వ్యక్తికూడా ఇటువంటి హింసలను అత్యాచారాలను సమర్థించడు. ఎక్కడ మతవైషమ్యాలు లేకుండేవో అక్కడ ఇప్పుడవి విజృంభించినవి. హిందువులకు ముస్లింలకు మధ్య సంబంధాలు విషమించినవి. ఏ విశ్వాసం ప్రజల మనస్సులో ఉండేవో, అది నేడు అదృశ్యమయినవి. అయితే మ.ఘ.వ. నిజాం మీద వున్న గౌరవాభిమానాలు ప్రజలకు ఇప్పటికీ ఉన్నవని మేము చెప్పగలము. కానీ ప్రభుత్వపు తప్పుడు విధానాలను అరికట్టకపోతే ఈ గౌరవాభిమానాలు మరోవిధంగా మారిపోవచ్చును.

కాబట్టి ప్రస్తుత ప్రభుత్వాన్ని వెంటనే మార్చివేయాలని మేము కోరుతున్నాము. ఈ ప్రభుత్వానికి కావలసినంత వ్యవధి ఇవ్వబడ్డది. అయినా అది శాంతి భద్రతలను కాపాడజాలక పోయింది. ఆంతరంగిక శాంతి భద్రతలు విదేశాంగ నీతి మీద ఆధారపడి ఉంటవి. అయితే అట్టి వైదేశిక సంబంధాలను మనం మెరుగుపరుచుకోజాలలేదు. ప్రస్తుతం హైదరాబాదుకు క్లిష్టమయిన ఆర్థిక చిక్కులున్నవి. అనేక రంగాలలో ప్రగతి ఆగిపోయింది. ఇంకా చాలాకాలం వరకు పరిస్థితులు మారే సూచనలేదు. ఆర్థిక పారిశ్రామిక రంగాల అభివృద్ధికై వ్యయపరచవలసిన మొత్తాలు, భారత వ్యతిరేక ప్రచారం కోసం విదేశాలలో ఖర్చు చేయబడుతున్నవి.

ఇండియన్ యూనియన్‌తో మన సంబంధాలు మెరుగు పరుచుకోవాలంటే ఆంతరంగిక భద్రతలు నెలకొల్పాలంటే ప్రస్తుత ప్రభుత్వం స్థానంలో ఒక తాత్కాలిక ప్రభుత్వాన్ని నియమించటం అత్యవసరం. దీనిని బుద్ధిమంతుడెవరూ వ్యతిరేకించరు. అట్టి తాత్కాలిక ప్రభుత్వాన్ని అన్నివర్గాల వారి విశ్వాసాన్ని చూరకొనేటటువంటి బాధ్యతాయుత ప్రభుత్వాన్ని వీలైనంత తొందరగా స్థాపించడం అవసరం. ఆంతరంగిక స్వాతంత్ర్యం నిలుపుకొంటూ మూడు విషయాల మీద సమాన ప్రతిపత్తితోనూ మనం షరతులతోనూ ఒప్పందం కుదుర్చుకోవలెను. అవసరమైతే మనం జనవాక్య సేకరణకు గూడా అంగీరించవలెను.

దేశక్షేమాన్ని కోరినవారయితే మనం వెంటనే రజాకార్ వ్యవస్థను విచ్ఛిన్నం చేయవలెను. అశాంతి రెకెత్తించే వీరి చర్యలు బహిరంగమయినవే, అందరూ చూస్తున్నవే. వీరి చర్యలు మతవర్గాలలో పరస్పర సంబంధాలను విరమింప చేసినవి. ప్రభుత్వ

**యంత్రాంగాన్ని స్థంభింపచేసినవి. ప్రభుత్వం స్థిరమయిందే, శక్తివంతమయిందే-కాని రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవనే సాకుతో భారత సేన హైదరాబాదు వైపు పురోగమించ వచ్చు. ఆంతరంగిక సంక్షోభం వల్ల పరిపాలన యంత్రాంగం పతనావస్థలో ఉన్నందున మనం ఆత్మరక్షణ చేసుకునే స్థితిలో లేము. ఆత్మరక్షణ పేరిట ప్రజలను మోసగించటానికి చేస్తున్న ఉపన్యాసాలు సత్యదూరమైనవి, నిరర్థకమైనవని రుజువు అవుతున్నది. ఈ పరిస్థితులే కొనసాగితే పర్యవసానాన్ని గూర్చి అనుమానించవలసిన అవసరం లేదు. తరతరాలుగా విశ్వాసపాత్రులమై ఉన్న మేము మూగ ప్రేక్షకుల వలే ఎంతో కాలం ఉండలేము. యజమానికీ, జాతికీ, ఏది లాభదాయకమని మేము భావిస్తున్నామో అది తెలియచేయడం మా విధి. యుద్ధంకన్నా శాంతి ముఖ్యం. మన మెప్పుడూ చెడు, కీడు, దౌర్జన్యాలకు విముఖులు గానూ, మంచికీ, పవిత్రతకూ బాసటగానూ నిలువవలెను. ఏదో ఒక వర్గం వ్యతిరేకించినంత మాత్రాన మనం న్యాయ రుజువర్తనలను మరువరాదు. పార్టీ తప్పుడు విధానాల వల్ల రాష్ట్రం నాశనం కాబోతున్న ఈ తరుణంలో మౌనం వహించటం నేరమౌతుంది. ఆ పార్టీకి ఎంతటి సంఖ్యా బలమున్నా సరే దేవునికి తప్ప ఎవరికి విధేయత చూపకండి. మా వాదాన్ని మా సోదరులు బలపరుస్తారనీ, రాష్ట్రం నాశనమవుతుండగా, నిస్సహాయ ప్రేక్షకులుగా నిలచి చూస్తూ ఉండరని మేము విశ్వసిస్తున్నాము. లేని పక్షాన వారు అటు దేవుని ముందు, ఇటు ప్రజల ముందు ఉత్తరవాదులవుతారు. జవాబ్దారీ వారిదే. రాష్ట్రం అన్ని ఈతి బాధల నుండి సురక్షితంగా ఉండుగాక! శాంతి, సౌభ్రాత్రం, ప్రజల క్షేమం, మన యజమాని నీడన వర్ధిలుగాక అని భగవంతుని ప్రార్థిస్తున్నాము.** (హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, వెలుర్తి మాణిక్యరావు, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాదు,1984, పేజి.614-617).

ఈ లేఖ హైదరాబాదులో ప్రకంపనాలను పుట్టించింది. ప్రజలతో ఉత్సాహాన్ని కలిగించింది. రజాకారుల ముఠాలో ఆగ్రహాన్ని రగిలించింది. ఈ లేఖ రాసిన ఏడుగురికి ముప్పు ముంచుక రావచ్చని భయాందోళనలు వ్యక్తమయ్యాయి. ప్రజల పక్షంగా ఆలోచనలు చేసిన ఏడుగురు మేధావులు తమ మార్గం నుండి మళ్ళలేదు. హైదరాబాదు రాష్ట్రం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావల్సిందేనని, రజాకార్ల ఆగడాలకు ప్రభుత్వం అడ్డుకట్టవేసి హింస నుండి ప్రజలను కాపాడాలని, హిందూ ముస్లింల మధ్య ఏర్పడుతున్న అగాధాన్ని పూడ్చాల్సిందేనని చాలా నిర్భయంగా అభిప్రాయాన్ని వారు పునరుద్ఘాటించారు.

## చైతన్యం రగిల్చిన యువజన-విద్యార్థి సంఘాలు

సంస్థానాధీశుల పాలనలో వందల ఏండ్లుగా ఉన్న ప్రజలు చివరకు సంస్థానాధీశుల చర్యలను ప్రశ్నించగల స్థాయికి రావడం వెనుక ప్రజల స్వేచ్ఛా-స్వాతంత్ర్యాల ప్రగాఢ



కామ్రేడ్స్ అసోసియేషన్ కార్యవర్గసభ్యులు :
జవాద్ రజ్వి, రాజబహుదుర్ గౌర్, ఆలం ఖుంద్‌మీర్ (అధ్యక్షులు),
ఓంకార ప్రసాద్, మీర్ యూసుఫ్ అలీ, కుతుబ్-యే-ఆలం.

ఆకాంక్షతో పాటుగా ఆనాటి మేధావులు, యువజనులు, విద్యార్థులు, వారి నాయకత్వంలో ఉనికిలోకి వచ్చిన సంస్థలు-సంఘాలు తమ తమ కార్యక్రమాలతో ప్రజలలో కలుగచేసిన చైతన్యం కారణంగా చెప్పుకోవచ్చును.

హైదరాబాదు సంస్థానంలో సంస్థానాధీశులదే చివరి మాట. సంస్థానాధీశుల అభీష్టానికి అనుగుణంగా ఏదైనా ఉండవచ్చు, ఎవ్వరైనా ఏదైనా చెప్పవచ్చు. ఏదైనా చేయవచ్చు. తద్విరుద్ధంగా ఏ సంస్థలూ ఊపిరి పోసుకోలేవు, ఊపిరి పోసుకున్నా బ్రతికి బట్టకట్టలేవు. ఏ ఒక్కరూ ఏమీ చెప్పలేరు. ఏమీ చేయలేరు. అటువంటి ప్రతికూల వాతావరణంలో రాజకీయ చైతన్యానికి అభ్యుదయ భావాలు గల యువకులు నడుం కట్టారు.


ఈ ప్రయత్నం ప్రధానంగా 1938 ప్రాంతంలో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఏర్పాటుతో ఆరంభమైంది. ఆనాటి వందేమాతరం ఉద్యమ స్ఫూర్తితో జాతీయోద్యమం, ప్రజాతంత్ర, సామ్యవాద సాంప్రదాయలకు తావు కల్పించి సామ్రాజ్యవాదానికి, ఫాసిజానికి, నైజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను ప్రధానంగా విద్యార్థులను సంఘటితపర్చడం లక్ష్యంగా 1939లో **కామ్రేడ్స్ అసోసియేషన్** స్థాపన జరిగింది. ఈ అసోసియేషన్ ఏర్పాటుకు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ అబ్దుల్ హకిం, ప్రొఫెసర్ హుస్సేన్ అలీ ఖాన్, సయ్యద్ అలం ఖుంద్ మీర్ తదితరులు ప్రోత్సహించారు. కామ్రేడ్స్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులలో అలం ఖుంద్ మీర్, సయ్యద్ ఇబ్రహీం, కుతుబ్-యే-ఆలం, అహసన్ అలీ మీరాజ్‌లు ఉన్నారు. ఆ తర్వాత మీరాజ్ హైదర్ హుస్సేన్,

మఖ్దూం మొహిద్దీన్, జవాద్ రజ్వీ, హుస్సేని షాహిద్ తదితరుల కామ్రేడ్ అసోసియేషన్‌లో భాగస్వాములయ్యారు. నిజాం సంస్థానంలో కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురైనందున ఆ స్థానంలో ప్రజలలో పనిచేయడానికి మరో రూపంలో ముందుకు వచ్చిన కామ్రేడ్స్ అసోసియేషన్ అతి త్వరగా బలపడి చాలా కాలం తనదైన ప్రతిపత్తిని నిలుపుకుంటూ లక్ష్యం దిశగా ముందుకు సాగింది. ఈ అసోసియేషన్ అంతర్జాతీయ-జాతీయ సమస్యల మీద ప్రతిస్పందిస్తూ తనదైన కార్యకలాపాలతో ప్రజలలో బాగా చొచ్చుకుపోయింది.

అభ్యుదయ భావాలుగల విద్యార్థులు హైదరాబాదు రాష్ట్రంలో సంఘటితమయ్యారు. ఆ నేపథ్యంలో 1930లో హైదరాబాదు రాష్ట్రంలో **ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ అసోసియేషన్** ఏర్పడింది. ఆ సమయంలో **రాడికల్ స్టూడెంట్స్ లీగ్** అను మరో విద్యార్థి సంఘం, **స్టూడెంట్ బ్రదర్ హుడ్, అంజుమన్-యే-తరక్కి-యే-తులబా** లాంటి సంఘాలు, సంస్థలు ఉనికిలోకి వచ్చాయి. ఈ విద్యార్థి సంఘాలలో అక్విల్ ఖాన్, అయూబ్ అహమ్మద్, కిర్మాణి, యూసుఫ్ నజీం తదితరులు ఇతరులతోపాటుగా ప్రధాన పాత్ర నిర్వహించారు.

ఆ కోవకు చెందిన విద్యార్థుల బృందం నుండి దూసుకువచ్చిన సయ్యద్ నాసిర్ హసన్ విద్యార్థి ఉద్యమంలో కీలక పాత్ర నిర్వహించారు. ఆయన అమ్మమ్మ ఫక్రుల్ హాజియా హసన్, ఆయన మేనమామలు అబిద్ హసన్ సఫ్రాని, బద్రుల్ హసన్‌లు జాతీయోద్యమకారులు కావడంతో ఆయన కూడా ఆ పెద్దల ఉద్యమస్ఫూర్తితో ఉద్యమించారు. 1946లో ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికులను అరెస్టు చేసిన సందర్భంగా భారత జాతీయ సైన్యంలోని సైనికులను, విడుదల చేయాలని సాగిన ఉద్యమంలో పాల్గొన్నాడు. ఆ తరువాత నిజాం వ్యతిరేక పోరాటాల వైపు మొగ్గుచూపాడు. విద్యార్థులకు వ్యతిరేకంగా నిజాం ప్రభుత్వం తీసుకున్న చర్యలకు వ్యతిరేకంగా నల్గొండ జిల్లా సూర్యాపేటలో విద్యార్థులు సాగించిన ఉద్యమానికి, ఆ సందర్భంగా నిర్వహించిన భారీ ప్రదర్శనకు నాసిర్ హసన్ నాయకత్వం వహించాడు.

ఈ విద్యార్థి-యువజన సంఘాలు శాసనోల్లంఘన, క్విట్ ఇండియా ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నాయి. ఆ తరువాత కాలంలో సాగిన నిజాం వ్యతిరేక పోరాటంలో భాగస్వామ్యం వహించాయి. ప్రజల, నాయకుల అరెస్టులకు వ్యతిరేకంగా పోరుబాటను ఎన్నుకున్న విద్యార్థి-యువజన సంఘాలు ఒకవైపు జాతీయోద్యమ కార్యక్రమాలకు, మరోవైపున నిజాం ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా ఇండియన్ యూనియన్‌లో నిజాం సంస్థానం కలసిపోవాలన్న డిమాండ్‌తో సాగిన పోరాటాలకు బలమిచ్చాయి. భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణా రైతాంగ పోరాటాలకు స్ఫూర్తిదాయకం కావడమే కాకుండా ఉద్యమసారధ్యం కూడా చేపట్టాయి. ఈ విధంగా ముస్లిం జనసమూహాలలోని అన్ని వయస్సుల -తరగతుల ప్రజానీకంతో కలసి విద్యార్థులు-యువకులు ఉద్యమబాటన నడిచారు.



రజాకార్ల కరకు కత్తులకు బలైన
షోయాబుల్లా ఖాన్ భౌతికకాయం

## విలీనం ఆకాంక్షిస్తూ పోరుకు దిగిన ప్రజలు

ఆ వాతావరణంలో ప్రజలు విలీనం కోరుతూ ఉద్యమించారు. ఆ ఉద్యమానికి అగ్రభాగాన కాంగ్రెస్ నాయకులు నిలిచారు. కమ్యూనిస్టులు ఫ్యూడల్ వ్యతిరేక పోరాటాన్ని ప్రారంభించారు. పలు ప్రజా సంఘాలు, సంస్థలు, వ్యక్తులు-వ్యవస్థలు విలీనం దిశగా వివిధ మార్గాలలో నైజాం ప్రభుత్వ వ్యతిరేక పోరాటానికి ప్రాణం పోశాయి. ఈ ప్రజా ఉద్యమాలలో ప్రముఖ కవి ముఖ్దూం మొహిద్దీన్ ప్రముఖ పాత్ర వహించారు. ఈ ఉద్యమాలకు సిరాజుల్ హసన్ తిర్మిజ్, డాక్టర్ అక్బర్ అలీ, జలాలుద్దీన్, హసన్ అహమ్మద్ పహిల్వాన్, మీర్ అహమ్మద్ అలీ ఖాన్, డాక్టర్ లతీఫ్ సయీద్, నవాబు కమాల్ యార్జంగ్, నవాబు యూసుఫ్ అలీ ఖాన్ సాలార్ జంగ్, సయ్యద్ అలం ఖుంద్ మీర్, ఖాజీ అబ్దుల్ గఫ్ఫార్, అక్తర్ హుసేన్, జవ్వాది రజ్వీ లాంటి ప్రముఖులు మతావేశాలకు దూరంగా ఉంటూ ఇండియన్ యూనియన్‌లో నిజాం సంస్థానం విలీనం కావాలన్న డిమాండ్‌ను సమర్థించారు. ఈ పోరాటంలో భాగంగా సాగిన ఆందోళనలో విద్యార్థి నాయకులు జకీర్ అలీ మీర్జా అరెస్టయ్యారు. ఆయనను చాలాకాలం గృహ నిర్బంధంలో ఉంచారు.

## పరిటాల రిపబ్లిక్ పోరాటం

'ఆజాద్ హైదరాబాద్' ను కలగంటున్న నిజాం నవాబు ఇండియన్ యూనియన్‌లో నైజాంను విలీనం చేయడానికి ససేమిరా అంటుండగా నైజాం సంస్థానం సరిహద్దుల్లో గల ప్రాంతాలు ఒక్కొక్కటిగా స్వతంత్ర రిపబ్లిక్‌గా ప్రకటించుకోవడం ఆరంభించాయి. ఆ విధంగా

కృష్ణాజిల్లాలో గల పరిటాల గ్రామం రిపబ్లిక్‌ను ప్రకటించుకుంది. **పరిటాల రిపబ్లిక్ పోరాటం**లో ఆ గ్రామానికి చెందిన యువకుడు షేక్ మౌలా సాహెబ్ చురుగ్గా పాల్గొన్నారు. **దూర్‌హటో దునియా వాలో...హిందూస్థాన్ హమారా హై**, అంటూ మౌలా సాహెబ్ పాట పాడుతూ పరిటాల పతాకాన్ని ఎగురవేసి సంచలనం సృష్టించారు. ఈ చర్య రిపబ్లిక్ ఉద్యమకారులను ఉత్తేజపర్చింది. గ్రామం నడిబొడ్డున జాతీయ జెండాను ఎంతో ధైర్యంతో ఆయన ఎగురవేశారు. ఈ చర్యకు మూడు సంవత్సరాల కఠిన శిక్ష ఉన్నప్పటికీ మౌలా సాహెబ్ ఏమాత్రం భయపడకుండా పరిటాల పోరాటంలో చివరివరకు నిలిచారు.

ఆనాటి పోరాటంలో పాల్గొన్న పలువురిలో వరంగల్‌కు చెందిన అబ్బాస్ అలీ లాంటి శ్రామికులు అనేకులున్నారు. అబ్బాస్ అలీ హైదరాబాదులో నాలుగు మాసాలు జైలు శిక్షను అనుభవించారు. గన్నవరం నివాసి నాసిర్ మహమ్మద్ ఐదు మాసాలు, ఖమ్మం తాలూకా మధిరకు చెందిన ఖాదర్‌బేగ్ రెండు మాసాలు, ఖమ్మం జిల్లా ఎడ్లపల్లి రైతు ఇనగాని ఖాశిం రెండు మాసాలు, అదసర్లపాడు నివాసి షేక్ బాబు రెండు మాసాలు, జైలు శిక్షను అనుభవించారు. 1946లో నైజాం సేనలు ఖమ్మంకు చెందిన మహ్మద్ రజబ్ ఆలీని అరెస్టు చేసి మూడు మాసాల పాటు నిర్బంధంలో ఉంచాయి. స్వతంత్ర భారతంలో ఆయన పలుమార్లు శాసనసభ్యునిగా ఎన్నికై ప్రజలకు సేవలందించారు. ఆనాడు విలీనం కోరుతూ సాగిన ప్రజాపోరులో కొంత మంది ముస్లిం మహిళలు పాల్గొన్నారు. ముస్లిం మహిళలకున్న మత, సామాజిక బంధనాల మూలంగా పెద్దసంఖ్యలో పోరుబాటన సాగలేక పోయినప్పటికీ, ఉద్యమకారులైన బిడ్డలను, భర్తలను ఎంతగానో ప్రోత్సహిస్తూ సహకరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వాతంత్ర్య సమరయోధుల గ్రంథంలో ఒకే ఒక ముస్లిం మహిళ పేరుంది. ఆమె నఫీస్ ఆయేషా బేగం. హైదారాబాదు నివాసి. ఆమె తండ్రి పేరు హమీద్ అలీ ఖాన్. నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలని సాగిన ఉద్యమంలో ఆమె పాల్గొన్నారు. ఆ కారణంగా 16-9-1948 నుండి 17-9-1948 వరకు నిర్బంధంలో ఉన్నారు. ఆమె పేరు తప్ప మరే ముస్లిం మహిళ పేరు ఈ గ్రంథంలో కన్పించకపోవడం ఆశ్చర్యం కల్గించే అంశం.

## అమరుడు షోయాబుల్లా ఖాన్

నైజాం సంస్థానాధీశుని రాజకీయాలను, రజాకార్లు జరుపుతున్న కిరాతకాలను, నిజాం నవాబు పేరిట గ్రామీణ ప్రాంతాలలో దేశ్‌ముఖ్‌లు, భూస్వాములు జరుపుతున్న రాక్షస చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రముఖ జర్నలిస్టు షోయాబుల్లాఖాన్ తాను సంపాదకత్వం వహిస్తున్న ఉర్దూ పత్రిక **ఇమ్రోజ్**లో వ్యాసాలు రాశారు. జాతీయ భావాలను బలపర్చుతూ, నైజాం ఇండియన్ యూనియన్‌లో తప్పకుండా చేరాలని, అందుకు ప్రజలు

ఉద్యమించి నైజాం ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని ఆయన తన పత్రిక ద్వారా ప్రబోధించారు. ఆయన ప్రాణాలు తీస్తామని బెదిరింపులు వచ్చాయి. ఆయన బెదరలేదు. అత్యంత సాహసంతో, జాతీయ భావనలతో, లౌకికతత్త్వం పట్ల విశ్వాసంతో, ఎటువంటి బెదిరింపులకు లొంగకపోవడంతో, 1948 ఆగస్టు 21 రాత్రి హైదరాబాద్ నగరం నడిబొడ్డున, షోయాబుల్లా ఖాన్‌ను రజాకార్లు దారుణంగా హత్య చేశారు. ఆ సమయంలో దుండగులు కత్తులతో జరిపిన ఘాతుక దాడి పర్యవసానంగా షోయాబుల్లా సహచరుడు ముహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్ చేతిని కోల్పోయారు.

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న **ఢిల్లీ అక్బార్** పత్రిక సంపాదకులు మహమ్మద్ బాఖర్ ఆంగ్ల సైన్యాధికారుల చేతుల్లో చిత్రహింసలకు గురై కాల్చివేయబడ్డారు. స్వాతంత్ర్యసమరంలో పాల్గొని పాలకులచే కాల్చివేతకు గురైన ప్రప్రథమ జర్నలిస్టుగా ఆయన ఖ్యాతి గడించారు. భారత స్వాతంత్ర్య పోరాటం చివరి దశలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం రాజీ లేని పోరాటం సాగిస్తూ, హత్యకు గురైన అక్షర యోధునిగా, **ఇమ్రోజ్** సంపాదకుడు షోయాబుల్లా ఖాన్ చిరస్మరణీయమైన ఖ్యాతి పొందారు.

## తెలంగాణ రైతాంగ పోరాటంలో సాహస పాత్ర

స్వాతంత్ర్యోద్యమం స్ఫూర్తితో సాగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో కూడా ముస్లిం ప్రజానీకం తమ హిందూ సోదరులతో కలసి సాగారు. తొలుత నిజాం, ఆయనకు మద్దతు ఇచ్చిన దేశ్‌ముఖ్, దేశ్ ప్రముఖ్, భూస్వాముల అండదండలతో అరాచకం సృష్టించిన రజాకార్లను, ఆ తరువాత ఆధిపత్యం–పెత్తనం కోల్పోనున్నామన్న దుగ్ధతో రాక్షసత్వానికి పాల్పడిన భూస్వాములను, భూస్వామ్యవర్గాల తొత్తులను ఎదుర్కోవడంలో ప్రజలు ఆయుధాలను అందుకున్నారు.

ఈ క్రమంలో జనగామ తాలూకా దేవరుప్పల శివారు గ్రామం కామారెడ్డిగూడెంకు చెందిన షేక్ బందగి సాహెబ్ తన న్యాయమైన హక్కుల కోసం నిజాం సంస్థానంలోని విస్నూరు దేశ్‌ప్రముఖ్ రామచంద్రా రెడ్డికి వ్యతిరేకంగా పోరాడి చరిత్ర సృష్టించారు. విస్నూరు రామచంద్రారెడ్డి ఆధిపత్యాన్ని, కుట్రలను ఎదుర్కొని న్యాయస్థానంలో ఆయన విజయం సాధించాడు. ఆ అవమానాన్ని భరించలేకపోయిన భూస్వామి రామచంద్రారెడ్డి 1940 జూలై 26న బందగీని హత్యచేయించాడు. దామచర్ల మండలానికి చెందిన షేక్ నన్నే బచ్చా లాంటి యోధులు తుపాకులు చేతబట్టి నిజాం రజాకార్లను, పోలీసులను సాయుధంగా ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా పలు కష్టనష్టాలను ఎదుర్కొనటమే కాకుండా చిత్రహింసలను, భయానక జైలు జీవితాలను రుచిచూశారు.

ఈ పోరాటంలో ముస్లిం స్త్రీలు కూడా ఏమాత్రం వెనుకంజవేయలేదు. నగరాలలో

నివశించే రజియా బేగం, జమాలున్నీసా బేగం లాంటి వారితోపాటుగా తెలంగాణలోని రాజారం గ్రామానికి చెందిన జైనా బీ లాంటి మహిళలు కూడా ఏమాత్రం భయపడకుండా, ప్రాణత్యాగాలకు సిద్ధపడి పోరుబాటన నడిచి మహత్తర చరిత్రకు కారణమయ్యారు. నైజాం వ్యతిరేక పోరాటంలో పలు ముస్లిం కుటుంబాలు పోరాట వీరులను తమ కడుపులో పెట్టుకుని కాపాడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఆయుధాలు చేతపూని పోరాటం చేసిన సాహసులు ఉన్నారు. ఈ మేరకు చాలా మంది ముస్లిం మహిళల, యోధుల పేర్లను, ఆ సాహసులు చూపిన తెగువను ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య తాను రాసిన Telangana Peoples Struggle and its Lessons, ( Foundations Books, New Delhi) గ్రంథంలో నిక్షిప్తం చేశారు.

ఈ విధంగా జరిగిన నమోదు తప్ప అధికారికంగా ఉన్న ఇతర రికార్డులు లేవు. ఆ కారణంగా ఆనాటి సాహస వీరుల వివరాలన్నీ అందుబాటులో లేకుండా పోయాయి. అక్షరరూపంలో నమోదు లేనందున స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న యోధులందరి వివరాలు పూర్తిగా లభ్యం కావటంలేదు. ఒకరకంగా చూస్తే పోలీసుల రికార్డులలో ఉన్నవారి వివరాలు మాత్రం కొంత మేరకు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఆనాటి యోధుల గుర్తింపుకు పోలీసు రికార్డులు మాత్రమే విశ్వసనీయమైన డాక్యుమెంట్లుగా భావించడంతో ఆ పత్రాలలో చోటు చేసుకోలేక పోయిన పలువురి పాత్రలు కనుమరుగైపోయాయి.

ఆనాడు పోలీసుల కళ్లుగప్పి ఉద్యమంలో విజృంభించిన సామాన్యుల చరిత్రలు, ఉద్యమాలకు పరోక్ష సహాయ సహకారాలు అందచేసిన వారి వివరాలు, విశేషాలు చరిత్రకు అందకుండా పోయాయి. అజ్ఞాతంగా గడుపుతూ పోలీసుల కిరాతకాలకు బలైపోయిన అనేకుల విశేషాలు చరిత్ర రికార్డులలో నమోదుకాలేదు. స్వాతంత్ర్య సిద్ధించి అర్ధశతాబ్దం పైగా గడిచినందున ఆనాటి విషయాలను, విశేషాలను వివరించగల పెద్దలు అంతర్థానమైయ్యారు. స్వాతంత్ర్య యోధుల గురించి గ్రంథాలు ప్రచురించిన ప్రచురణకర్తలలో కొందరి పాక్షిక దృష్టి, పార్టీ రాజకీయాల వివక్షత ఫలితంగా చరిత్రకెక్కాల్సిన చాలా మంది యోధుల సాహసోపేత చరిత్రలు నమోదుకు నోచుకోలేదు. ఈ గ్రంథాలలో కొద్దిమంది వివరాలు చోటుచేసుకున్నా తగినంత ప్రాధాన్యత లభించలేదు.

భారత విభజన జరిగి పాకిస్థాన్ ఏర్పడిన కారణంగా భారతదేశంలోని స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర నమోదు విషయంలో ఎటువంటి వివక్షత చోటు చేసుకుందో, నైజాం సంస్థానం విలీనం, నిజాం వ్యతిరేక పోరాటం సమయంలో పాల్గొన్న ముస్లిం యోధుల సాహసచరిత్రల నమోదు విషయంలో కూడా అటువంటి వివక్ష కొంతో గొప్పో చోటుచేసుకుంది. ఆ కారణంగా ఆనాటి యోధుల త్యాగమయ చరిత్రలు ప్రజలకు అందాల్సినంతగా అందలేదు. 2006 సంవత్సరంలో తెలంగాణా జిల్లాలలో పలు ప్రాంతాలకు

చెందిన పోరాట యోధుల సాహసాల చారిత్రక ఘట్టాలను దృశ్యీకరిస్తూ సంస్థలు, వ్యక్తులు గ్రంథాలను రచించి వెలువరిస్తున్నారు. ఈ గ్రంథాలు, గ్రంథకర్తల కృషి, ప్రచురణకర్తల శ్రమ మూలంగా ఆనాటి యోధుల వివరాలు ఈనాటికైనా కొంత వెలుగు చూడడం, సామాన్య ప్రజలకు తెలియరావడం సంతోషించదగిన అంశం.

## భారత ప్రభుత్వ పోలీసు చర్య

1948 జూన్ 21న మౌంట్‌బాటన్ పదవీ విరమణ చేసి ఇంగ్లాండు వెళ్లిపోయాడు. భారతదేశాన్ని రెండు ముక్కలుగా చీల్చిన అతనికి హైదరాబాద్‌ను మరో ముక్కగా చేసి వెళ్ళేంత అవకాశం, పూర్తి సమయం లభించలేదు. మౌంట్‌బాటన్ నిష్క్రమణతో నైజాం పాలకుడు బలహీనుడయ్యాడు. జాతీయంగా, అంతర్జాతీయంగా పరిస్థితులు నిజాంకు అనుకూలించలేదు. చివరకు ఐక్యరాజ్యసమితిని ఆశ్రయించాడు. నిజాం నవాబు జాతీయంగా, అంతర్జాతీయంగా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎటువంటి ఉపయోగం లేకపోయింది. మరో వైపున విలీనం కోరుతూ ఉద్యమిస్తున్న ప్రజలు, పోరాటం సాగిస్తున్న నాయకుల సమష్టి ప్రయత్నాలు నైజాం ప్రభువు మీద మరింత ఒత్తిడికి కారణమయ్యాయి. ఇక నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కాక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ప్రతికూల పరిస్థితులలో ఉక్రోషం పట్టలేక రజాకార్లు, దేశ్‌ముఖ్‌ల దుండగుల దండు మరింతగా విజృంభించారు. ప్రజల ప్రశాంత జీవనానికి అత్యంత ప్రమాదకరంగా మారిన అవాంఛనీయ పరిస్థితులు ఇండియన్ యూనియన్‌లోని ఇతర ప్రాంతాలకు విస్తరించే ప్రమాదాన్ని అరికట్టాల్సి బాధ్యత తనకుందని స్వయంగా ప్రకటించుకున్న భారత ప్రభుత్వం నైజాం సంస్థానంలోని పరిస్థితులను చక్కదిద్దాల్సిన అవసరం ఉందంటూ రంగప్రవేశం చేసింది.

ఈ మేరకు 1948 సెప్టెంబర్ 13న తెల్లవారు ఝామున నైజాం సంస్థానం పై భారత సైన్యం ముప్పేట దాడి ఆరంభించింది. ఈ చర్యలో పాల్గొన్నది భారత సైన్యం అయినప్పటికి అది 'పోలీసు చర్య' అని ఆనాటి గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి వర్ణించడంతో అదికాస్తా 'పోలీసు చర్య' స్థిరపడింది. భారత సైనిక పరిభాషలో మాత్రం ఇది 'ఆపరేషన్ పోలో' గా పేర్కొనడం జరిగింది. భారత సైన్యాన్ని నిజాం సైన్యం, రజాకార్లు, నైజాం పాలకుని వెంట సాగి విలీనాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన దేశ్‌ముఖ్‌ముఖ్‌ల దండు పది రోజుల కంటే ఎక్కువ రోజులు నిలువరించలేక పోయాయి.

ఈ సందర్భంగా నైజాం సంస్థానానికి అనుకూలురైన ప్రజలు కూడా భారత సైన్యానికి అవరోధాలు కల్పించారు. ఆ కారణంగా నైజాం సంస్థానంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో భారత సైన్యం తుపాకి గుళ్ళకు, సైనికుల రాక్షసచర్యలకు గురికావాల్సివచ్చింది. అధికారం చేజారిపోతున్న వాతావరణం వలన ఏర్పడిన అక్కసు నుండి రజాకార్లలో

ఉద్భవించిన రాక్షసత్వం, నిజాం పోలీసుల దాష్టీకం కలగలసి పెద్ద సంఖ్యలో అయాయక ప్రజల ధనమానప్రాణాలను బలిగొన్నాయి.

## అరాచకానికి గురైన ముస్లిం ప్రజానీకం

ఈ పోలీసు చర్యలో హిందూ-ముస్లిం తేడా లేకుండా ప్రజలంతా బాధలకు గురయ్యారు. ప్రధానంగా అమాయక ముస్లింలు చాలా ఇక్కట్లు పడ్డారని భారీ సంఖ్యలో ప్రాణాలు కొల్పోయారని అధికారికంగా నిర్ధారించబడని అలనాటి నివేదికొకటి వెల్లడిస్తోంది. నైజాం సంస్థానంలో సాగిన పోలీసు చర్య వలన ఇతర ప్రజానీకంతోపాటు ముస్లింలు ఎదుర్కొన్న విపత్కర పరిస్థితులను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి నిజనిజాలను బహిర్గతం చేయాల్సి అవసరాన్ని గుర్తించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఒక కమిటీని ఏర్పాటు చేయాల్సిందిగా ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను కోరారు. చివరకు మౌలానా అజాద్ ఒత్తిడి మేరకు పండిత నెహ్రూ ప్రమేయంతో ఒక కమిటీ ఏర్పాటయ్యింది. ఈ కమిటీకి పండిత సుందర్‌లాల్ అధ్యక్షులుగా నియమితులు కాగా హైదరాబాదు నుండి వెలువడుతున్న ఉర్దూ పత్రిక **పయాం** సంపాదకులు ఖాజి ముహమ్మద్ అబ్దుల్ గఫార్, హైదరాబాదుకు చెందిన ప్రముఖ న్యాయవాది యూనిస్ సలీంలు సభ్యులుగా నియమించబడ్డారు.

ఈ కమిటీ ఆనాడు హైదరాబాదు రాష్ట్రంలో గల గ్రామాలు, జిల్లాలు ముఖ్యంగా మరత్వాడా ప్రాంతం, మరీ ముఖ్యంగా ఔరంగాబాద్, బీడ్, నాందేడ్, పర్భని, ఉస్మానాబాద్, బీదర్‌లలో పర్యటించి ఎంతో సమాచారం సేకరించి నివేదికను తయారు చేసింది. ఈ నివేదిక ఆనాటి పోలీసు చర్యలో భారతసైన్యం, పోలీసుల వలన అంతులేని కష్టనష్టాలకు గురైన, ప్రాణాలు కోల్పోయిన వేలాది ప్రజానీకం గురించి విస్తృతంగా చర్చిస్తూ, పూర్తి వివరాలు అందించింది. ఆనాటి పరిస్థితుల మీద **సబ్ ఠీఖ్ హువా** అంటూ **పోలీసు చర్య** అఘాయిత్యాలను పూర్తిగా వెనుకేసుకొచ్చిన హోంమంత్రి సర్దార్ వల్లభాయి పటేల్‌కు పండిత సుందర్‌లాల్ సమర్పించిన నివేదికలోని వాస్తవాలు మింగుడు పడలేదు. ఆ నివేదిక సహజంగానే ఆయనకు నచ్చలేదు. ఈ నివేదిక వలన పోలీసు చర్య పేరిట అమాకులను మీద సాగిన దుష్కృత్యాలన్నీ బయటకు వస్తాయి. అది ఏమాత్రం ఇష్టంలేని సర్దార్ పటేల్ నివేదికను అధికారికంగా గుర్తించేందుకు నిరాకరించాడు. ఆ కారణంగా ఆ నివేదికలోని నిజాలు సూచనప్రాయంగా వెల్లడి అయ్యేంత వరకు చరిత్రలో మరుగునపడిపోయాయి.

స్వాతంత్ర్యం సిద్ధించిన రెండు దశాబ్దాల తరువాత ఆనాటి పోలీసు చర్య మీద తయారు చేసిన పండిత సుందరలాల్ నివేదిక గురించి **షబిస్థాన్** అను ఉర్దూపత్రికలో ఆనాటి కమిటిలోని సభ్యులు, న్యాయవాది యూనిస్ సలీం ప్రస్తావించారు. ఆ మీదట ఈ నివేదిక మీద పార్లమెంటులో చాలా చర్చ జరగడం వలన పండిత సుందర్‌లాల్ నివేదిక



**1948లో పోలీసు చర్య తరువాత జవహర్‌లాల్ నెహ్రూ, జనరల్ జె.యన్ చౌదరిలను కలసిన నైజాం సంస్థానాధీశుడు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్**

గురించి ప్రజలకు కొంతలో కొంత తెలిసింది. ఈ నివేదికలోని అంశాలు పూర్తిగా వెల్లడయితే జాతీయ ప్రయోజనాలకు భంగకరం కాగలదని భావించిన ప్రభుత్వాధినేతలు నివేదికను అధికారికంగా ప్రకటించకుండా, దాన్ని బహిర్గతం చేయకుండా పూర్తిగా దాచేశారు.

ఆ తరువాత ఆ నివేదిక కాపీని కలిగి ఉన్న కమ్యూనిస్టు నాయకుడు శ్రీనివాస్ లాహోటి దానిని నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా (న్యూఢిల్లీ) లో దాఖలు చేసినట్టు 1988లో ఆయన ఒక పత్రికకు ఇచ్చిన ఓ ఇంటర్యూలో వెల్లడించారు. ఆ విధంగా ఆయన తన ఇంటర్వ్యూలో పండిత సుందర్‌లాల్ కమిటీ నివేదిక గురించి వివరంగా ప్రస్తావించడంతో ఆనాటి నివేదిక లోని అంశాల గురించి అధ్యయనం ఆరంభమైంది. ఉర్దూలో ఉన్న ఆ నివేదికలోని కొన్ని భాగాలను పరిశీలించిన హైదరాబాదుకు చెందిన ప్రముఖ రచయిత డాక్టర్ ఒమర్ ఖలిద్ తాను రాసి, వెలువరించిన **హైదరాబాద్ ఆఫ్టర్ ఫాల్** అను గ్రంథంలో పోలీసు చర్య నాటి అకృత్యాలను, అఘాయిత్యాలను కొంత మేరకు ఉటంకించారు. (ముల్కి (కొలుపుల దస్తర్) ముస్లిం సాహిత్య ప్రత్యేక సంచిక, సంపాదకులు వేముల ఎల్లయ్య, స్కై బాబ, డిసెంబరు 2003–మే 2004, హైదరాబాద్).

ఆ సమాచారం ప్రకారం చూస్తే ఆనాడు సర్దార్ వల్లభాయి పటేల్ అన్నట్టుగా **సబ్ ఠీఖ్ హువా** అన్నది ఎంత మాత్రం నిజం కాదని, పోలీసు చర్య వలన అన్నివర్గాల ప్రజలు ప్రధానంగా ముస్లింలు అష్టకష్టాలు పడడం, పెద్ద సంఖ్యలో అటు సైన్యం ఇటు పోలీసుల బారినపడి ఆస్తిపాస్తులతోపాటు ప్రాణాలు కూడా కోల్పోవడం పచ్చి వాస్తవమని తెలుస్తుంది.

# చిట్టచివరకు నైజాం సంస్థానం విలీనం

చిట్టచివరకు 1948 సెప్టెంబరు17న నైజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేయడానికి ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అంగీకరించాడు. హైదరాబాద్ సంస్థానంలోని ఆసఫియా పతాకాన్ని అవనతం చేశారు. పదిహేడు సాయంత్రం 7 గంటలకు దక్కన్ రెడియో ద్వారా మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తూ ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానం విలీనం విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఆనాడు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ చేసిన రేడియో ప్రసంగం ఈ విధంగా సాగింది.

**నా ప్రియమైన ప్రజలారా, భారత దేశపు గవర్నర్ జనరలైన హిజ్ ఎక్సలెన్సీ రాజగోపాలచారి గారి పేర ఈ క్రింది సందేశాన్ని తెలుపుటకు సంతసిస్తున్నాను. నా ప్రభుత్వం రాజీనామా ఇచ్చింది. రాజకీయ పరిస్థితులను పూర్తిగా నా హస్తగతం చేసుకోమని కోరింది.**

**ఈ చర్య ఇంతకు పూర్వం తీసుకోనందుకు విచారపడుతున్నాను. ఇప్పుడు చాలా ఆలశ్యమైంది. ఈ సున్నితమయిన సమయంలో నేనేమి చేయలేకుండా ఉన్నాను. మొత్తానికి నా సైన్యాన్ని యుద్ధవిరమణ చేయవలసిందిగా ఆదేశించానని గవర్నరు జనరలు గారికి తెలియచేస్తున్నాను. ఇదిగాక భారత సైన్యాలను బొల్లారం మరియు సికిందరాబాదులోని సైనిక స్థావరాలలో ఉండటానికి అనుమతిస్తున్నాను. కొత్త మంత్రివర్గం ఏర్పడేవరకు కొత్త ప్రధానమంత్రి నియమించబడేవరకు దైనందిన పరిపాలన వ్యవహారాలలో నాకు సహాయ పడటానికి ఒక కమిటి ఏర్పరచినాను. అందులో ఈ క్రింద పేర్కొనబడిన సభ్యులుంటారు.**

**1) హిజ్ హైనెస్ బరారు యువరాజు, సర్వసేనాని**
**2) మేజరు జనరలు అహమ్మద్ అల్ ఇద్రుస్, కమాండర్**
**3) నవాబుద్దీన్ యార్‌జంగ్, పోలీసు కమిషనర్**
**4) శ్రీ రామాచారి, వకీలు**
**5) అబుల్ హసన్ సయ్యద్ అలీ, ఇత్తెహదుల్ ముస్లిమీన్, మాజీ అధ్యక్షుడు**
**6) పన్నాలాల్ పిత్తి**

**నేను సర్ మీర్జా ఇస్మాయిల్, నవాబు యార్‌జంగ్ దివాను బహదుద్దూర్, అరవముదు అయ్యంగార్‌లను ఆహ్వానిస్తున్నాను. రాకపోకల వ్యవస్థ స్థిరపడగానే కొత్త పరిస్థితిని ఎట్లా ఎదుర్కొవలెనో వారితో సంప్రదింపులు జరుపుతాను. స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షులయిన స్వామి రామానంద తీర్థగారిని వెంటనే విడుదల చేయవలసిందిగా ఆజ్ఞాపించటం జరిగింది. ఈ కల్లోల పరిస్థితుల్లో స్వామిజీ హైదరాబాదుకు సహాయపడగలరని నేను విశ్వసిస్తున్నాను. అదీగాక స్టేట్ కాంగ్రెస్‌ను కార్యాచరణ సంఘానికి విరుద్ధంగా జారీచేయబడిన ఆజ్ఞలుగాని, వారెంటులు గాని రద్దు చేయాలని గూడా ఆజ్ఞాపించినాను.**

**నేను నా మిత్రులయిన కె.యం. మున్షీ భారత ఏజెంటు జనరల్‌తో సంప్రదించినాను. ఈ సందర్భంలో వారు నాకు చాలా సహాయపడ్డారనే విషయాన్ని ఒప్పుకుంటున్నాను... శాంతితోను, ఓర్పుతోను మెలగాలని జాతి మత వివక్షనలేకుండా నేను నా ప్రియమైన ప్రజలను ప్రార్థిస్తున్నాను. హైదరాబాదులో శాంతి పరిస్థితులేర్పడ్డాక భారత ప్రభుత్వంతో వ్యవహారాలు కుదుర్చుకోవడం కష్టమేమి ఉండదని విశ్వసిస్తున్నాను. నా ప్రజల యోగక్షేమమే నా ఏకైక లక్ష్యం కాబట్టి వారు భారత దేశంలోని ఇతర ప్రజలతో కలసి మెలసి సుఖశాంతులతో జీవితం గడపగలరు.** (హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, వెలుర్తి మాణిక్యరావు, పేజి. 691)

## నైజాం సంస్థానాధీశుల పాలన సమాప్తం

ఆ రోజున రజాకార్ల సంస్థను రద్దు చేస్తూ నిజాం సంస్థానాధీశుడు ఉత్తర్వులు జారీ చేశాడు. అపూర్వ చరిత్ర గలిగిన నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావడానికి సంబంధించిన అన్ని లాంఛనాలు పూర్తయ్యాయి. చివరకు నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో కలిసిపోయింది. ఆసఫ్‌జాహి పాలన 1948 సెప్టెంబరు 18తో పూర్తిగా అంతమయిందని అంతా భావిస్తూంటారు. కానీ నైజాం సంస్థానాధీశునికి భారత ప్రభుత్వానికి మధ్యన కుదిరిన యధాతధ ఒప్పందం ప్రకారం నైజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఆంధ్రప్రదేశ్ అవతరణ వరకు రాష్ట్రానికి రాజ్‌ప్రముఖ్‌గా వ్యవహరించారు. భారత ప్రభుత్వం సాగించిన పోలీసు చర్య ద్వారా చివరకు నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో చేరి, ప్రజల ప్రధానంగా జాతీయోద్యమకారుల ఆకాంక్షలను నేరవేర్చినప్పటికి, పోలీసు చర్య సందర్భంగా జరిగిన హింసాత్మక చర్యలు మాత్రం ప్రజలను ఈనాటికి బాధిస్తున్నాయి.

## ఆంధ్రప్రదేశ్ అవతరణ

ఈ విలీనం వలన మద్రాసు రాష్ట్రంలో భాగమైన ఆంధ్ర, నైజాం సంస్థానంలో భాగంగా ఉన్న తెలంగాణలు కలసిపోయాయి. మద్రాసు రాష్ట్రం నుండి వేరుచేసి తమకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని ఎన్నటి నుండో కోరుతూ వచ్చిన తెలుగు ప్రజల ఆకాంక్షకు తగినట్టుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాత్రం ఏర్పడలేదు. మద్రాసు రాష్ట్రంలో భాగంగానే తెలుగు ప్రజలు కొనసాగాల్సిన దుస్థితి అలాగే ఉండిపోయింది. ఈ పరిస్థితి నుండి బయట పడడానికి ప్రజలు మరో ప్రజాపోరు సాగించాల్సి వచ్చింది.

ఈసారి ఈ పోరాటం విదేశీయుల మీద కాదు. ప్రజల అభీష్టాలను పరిగణలోనికి తీసుకోని స్వదేశీపాలకులకు, భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగింది. ఈ పోరు చాలా

విలక్షణమైనది. ఈ ప్రజాస్వామిక శాంతియుత పోరాటానికి నాయకుడు పొట్టి శ్రీరాములు. ఈ పోరాటానికి ఆయన జవం జీవం అయ్యారు. ఆంధ్రప్రదేశ్ సాధించేందుకు ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. ప్రజలంతా పొట్టి శ్రీరాములు వెంట నిలిచారు. తెలుగు నేలంతా ప్రత్యేక రాష్ట్రం నినాదంతో మారుమ్రోగింది.

ఆనాటి పండిత జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని భారత ప్రభుత్వం ప్రజా ఉద్యమం పట్ల ఏమాత్రం స్పందించక పోవడంతో ప్రజానీకం తాడోపేడో తేల్చుకోడానికి సిద్ధమయ్యింది. ఆమరణ నిరాహారదీక్ష వలన పొట్టి శ్రీరాములు పరిస్థితి పూర్తిగా ప్రమాదం అంచుకు చేరుకుంది. ఈ పరిణామాలతో తెలుగు ప్రజలలో ఆవేదనతోపాటుగా ఆవేశం హద్దులు దాటింది. ఆగ్రహం అవధులు మీరింది. శ్రీరాముల ఆరోగ్యపరిస్థితి బాగా క్షీణించింది. చివరకు ఆయన ఆమరణ దీక్షను కొనసాగిస్తూనే 53వ రోజున కన్నుమూశారు.

పొట్టి శ్రీరాములు అమరత్వం పొందడంతో ప్రజానీకం మరింత రెచ్చిపోయింది. అప్పటికి కానీ ప్రభుత్వాధినేత జవహర్ లాల్ నెహ్రూ మనసు కరగలేదు. చివరకు అమరజీవి దృఢ నిర్ణయం, తెలుగు ప్రజల ఆందోళన ముందు భారత పాలకులు తలవొగ్గి దిగిరాక తప్పలేదు. 1956 నవంబరు ఒకటిన తెలుగు ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. మద్రాసు ఉమ్మడి రాష్ట్రం నుండి విడివడి తెలుగు ప్రజల స్వంత రాష్ట్రంగా రాయలసీమ, సర్కారు, కోస్తా ఆంధ్ర, తెంగాణా ప్రాంతాల కలయికతో **ఆంధ్రప్రదేశ్** రాష్ట్రం ఏర్పడింది. భారతదేశ చిత్రపటం మీద నూతన రాష్ట్రంగా **ఆంధ్రప్రదేశ్** అవతరించింది.

## సుఖాంతం

బ్రిటీష్ బానిస బంధనాల నుండి విముక్తి కోసం, స్వంత గడ్డ మీద పరదేశీయుల పెత్తనాన్ని సహించలేని అభిమానధనులైన భారతీయులు 1857కు పూర్వం నుండి సాగించిన స్వాతంత్ర్య పోరాటం, ప్రపంచ చరిత్రలోనే అపూర్వమైనదిగా సాగింది. చివరకు ప్రజాపోరు విజయం సాధించింది. ఆ మహత్తర పోరాటంలో తెలుగు ప్రజలు తమదైన భాగస్వామ్యం అందించారు, తమ సాహసోపేత త్యాగాల పరంపరతో ఉద్యమాన్ని సుసంపన్నం చేశారు. ఈ దిశగా తెలుగు బిడ్డలు ఎవ్వరికి తీసిపోరని తమ దీక్షా దక్షతలతో నిరూపించుకున్నారు. చివరకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సాధించుకున్నారు. అనంతరం తమదైన గుర్తింపు కోసం మద్రాసు రాష్ట్రం నుండి విడివడి ప్రత్యేకంగా **ఆంధ్రప్రదేశ్** రాష్ట్ర సాధన కోసం మరోమారు విజృంభించి, పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో తమ చిరకాల వాంఛను నెరవేర్చుకున్నారు. ఈ విధంగా ప్రపంచ చరిత్రలో అద్భుతం అనదగిన రీతిలో సాగిన సుదీర్ఘ ఉద్యమం 1956 నాటికి సుఖాంతమైంది.

◆◆◆

# స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు

(అనుబంధం -I)

# ఇందులో...


| | | | |
|---|---|---|---|
| 01. | సుబేదార్ షేక్ అహమ్మద్ | (0-1780) | 123 |
| 02. | నూరుల్ ఉమ్రా బహదూర్ | (0-1818) | 133 |
| 03. | గులాం రసూల్ ఖాన్ | (0-1940) | 137 |
| 04. | మీర్ గోహర్ అలీ ఖాన్ | (1800-1854) | 141 |
| 05. | పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ | (0-1859) | 149 |
| 06. | షేక్ పీర్ షా | (0-0) | 153 |
| 07. | అమానుల్లా ఖాన్ | (0-1875) | 157 |
| 08. | మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ | (0-1884) | 159 |
| 09. | ముల్లా అబ్దుల్ ఖయ్యూం | (1853-1906) | 163 |
| 10. | ఫజులుల్లా ఖాన్ | (0-1922) | 171 |
| 11. | బద్రుల్ హసన్ | (1898-1937) | 177 |
| 12. | డాక్టర్ ఉమర్ అలీషా | (1885-1945) | 181 |
| 13. | షోయాబుల్లా ఖాన్ | (1920-1948) | 189 |
| 14. | ముహమ్మద్ ఇస్మాయిల్ | (1892-1948) | 195 |
| 15. | నఫీస్ ఆయేషా బేగం | (0-0) | 199 |
| 16. | మగ్బూల్ అహమ్మద్ జమాయ్ | (1902-1963) | 201 |
| 17. | మఖ్దూం మొహిద్దీన్ | (1908-1967) | 205 |
| 18. | డాక్టర్ జాకీర్ హుసైన్ | (1897-1969) | 211 |
| 19 | ఎస్.ఎం. ఖాద్రి బియబానీ | (1894-1969) | 219 |
| 20. | ఫక్రుల్ హాజియా హసన్ | (1870-1970) | 221 |
| 21. | షేక్ గాలిబ్ సాహెబ్ | (1904-1970) | 223 |
| 22. | బాఖర్ అలీ మీర్జా | (1900-1973) | 227 |
| 23. | మహమ్మద్ గులాం మొహిద్దీన్ | (1882-1973) | 229 |

| | | | |
|---|---|---|---|
| 24. | బేగం మజీదా బానో | (1919-1974) | 231 |
| 25. | ముహమ్మద్ గౌస్ బేగ్ | (1885-1976) | 233 |
| 26. | బేగం ఖుర్షీద్ ఖ్వాజా | (1896-1981) | 237 |
| 27. | ఫరీద్దుల్‌జమా | (1907-1983) | 241 |
| 28. | ఖాశిం బేగ్ | (1905-1984) | 245 |
| 29. | అబిద్ హసన్ సఫ్రాని | (1911-1984) | 247 |
| 30 | మీర్జా మహబూబ్ బేగ్ | (1894-1985) | 253 |
| 31. | మున్షీ సయ్యద్ మెహబూబ్ | (-1985) | 255 |
| 32. | ముహమ్మద్ హనీఫ్ | (1914-1990) | 259 |
| 33. | ముహమ్మద్ గౌస్ ఖాతూన్ | (-1990) | 265 |
| 34. | మాసుమా బేగం | (1902-1990) | 267 |
| 35. | హాజరా బీబి ఇస్మాయిల్ | (-1994) | 271 |
| 36. | షేక్ ముహమ్మద్ మొహిద్దీన్ | (1922-1994) | 273 |
| 37. | ముహమ్మద్ రజబ్ అలీ | (1920-1996) | 279 |
| 38. | షేక్ మహబూబ్ ఆదం | (1914-1997) | 281 |
| 39. | మీర్ అక్బర్ అలీ ఖాన్ | (1899-1998) | 285 |
| 40. | మున్షీ మహమ్మద్ మస్తాన్ | (1913-1999) | 287 |
| 41. | షేక్ మహమ్మద్ యాశిన్ | (1913-2000) | 291 |
| 42. | సయ్యద్ అబ్దుల్ అజీం | (1919-2001) | 301 |
| 43. | జమాలున్నీసా బాజి | (1915-) | 289 |
| 44. | రబియాబీ | (0-0) | 299 |
| 45. | ముల్లా అబ్దుల్ బాసిత్ | (1889-) | 303 |
| 46. | రజియా బేగం | (1916-) | 305 |
| 47. | ఫరీద్ మీర్జా | (1918-) | 311 |
| 48. | ఖముర్రుల్ ఇస్లాం | (1919-) | 315 |
| 49. | షేక్ మౌలా సాహెబ్ | (1922-) | 317 |
| 50. | షేక్ ఖాదర్ మొహిద్దీన్ | (1926-) | 327 |


◆◆◆

## ప్రప్రథమ సైనిక తిరుగుబాటు నాయకుడు

# 1. సుబేదార్ షేక్ అహమ్మద్

(-1780)

బ్రిటీష్ పాలకుల దాష్టీకానికి వ్యతిరేకంగా, బానిస బంధాల నుండి విముక్తిని కోరుకుంటూ సాగిన మహత్తర పోరాటంలో ప్రాణాలను తృణప్రాయంగా భావించిన స్వదేశీ సైనికులు ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యంలో పనిచేస్తున్నా, కంపెనీకి తొత్తులుగా వ్యవహరిస్తున్న స్వదేశీపాలకుల వద్ద సైనికులుగా జీవన భృతి నిమిత్తం తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్నా, వారిని 'దాస్యభావన' పట్టి పీడిస్తునే ఉంది.

హృదయాల్లో బడబాగ్నులను దాచుకుని యజమాని ఆదేశాలను తు.చ తప్పక పాటిస్తున్న స్వదేశీ సైనికులు అవకాశాలు దొరికినప్పుడల్లా ఆంగ్లేయాధికారుల మీద తిరగబడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. సాధారణంగా 1857 ప్రాంతంలో ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారుల మీద తిరుగుబాటు ధ్వజం ఎత్తిన సిపాయీల గురించి చరిత్ర చర్చిస్తుంది. అంతకు ముందు జరిగిన తిరుగుబాట్లకు చరిత్ర తగినంత స్థానం కల్పించలేదు. ఆ సాహసోపేత పోరాటాలకు తగినంత ప్రాధాన్యత, ప్రాచుర్యం లభించలేదు.


**భారతదేశ చరిత్రలో తొలి సిపాయీల తిరుగుబాటు 1857లో జరిగినట్టు చెబుతు న్నప్పటికీ అప్పటికి సుమారు 77 ఏళ్ళ క్రితమే విశాఖపట్నంలో తెల్లదొరల పాలనకు వ్యతిరేకంగా జరిగిన సిపాయీల తిరుగుబాటు ఏ కారణం చేతనో చరిత్రకారుల దృష్టిలో**

**పడలేదు.** 1857 నాటి తిరుగుబాటుకు ముందు జరిగిన ఈ తిరుగుబాటు ఉదంతాన్ని చరిత్ర తగినంత స్థాయిలో గమనంలోకి తీసుకోలేదు. ఆ తిరుగుబాటు మన తెలుగు గడ్డ మీద జరిగిన విషయంగాని, ఆ తిరుగుబాటు మన తెలుగు బిడ్డడి నేతృత్వంలో జరిగిందన్న విషయాన్ని గాని చరిత్ర గుర్తు చేయదు. అలనాటి తిరుగుబాటుకు నాయకత్వం వహించిన యోధులను, ఆ తిరుగుబాటులో సాహసోపేతంగా ఆంగ్లేయాధికారుల మీద తుపాకులను గురిపెట్టిన యోధులను స్మరించుకోవడం కూడా జరగదు. ఆ ఉదంతాలు, ఆ చారిత్రక సంఘటన నిర్మాతల పట్ల ప్రభుత్వాలకు శ్రద్దలేదు, ప్రభుత్వాధినేతలు పట్టించుకోరు. ప్రజలకు ఆ ఘన చరిత్ర తెలియదు. ఆ కారణంగా ఆ యోధుల సాహసోపేతమైన పోరాటం, ఆ పోరాటయోధుల త్యాగచరిత్ర మరుగున పడిపోయింది.

ఈ మేరకు విస్మరణకు గురైన తొలినాటి సిపాయీల తిరుగుబాటు 1780 అక్టోబరు 3న విశాఖపట్నంలో జరిగింది. **ఉత్తరాంధ్రలో ఎదురు లేకుండా పెత్తనం చేస్తున్న ఆంగ్లేయులు ఈ పోతుగడ్డలో తొలిసారిగా చావు దెబ్బను చవిచూశారు. స్వాభిమానానికి మారు పేరైన ఉత్తరాంధ్ర కొదమ సింహాలు జబ్బచరిచి బొబ్బరించాయి.** 1857నాటి తిరుగుబాటుకు 77 సంవత్సరాల పూర్వమే జరిగిన ఈ తిరుగుబాటుకు ఈస్ట్ ఇండియా కంపెనీ విశాఖపట్నంలోని సైనిక స్థావరంలో సుబేదారుగా పనిచేస్తున్న షేక్ అహమ్మద్ (షేక్ మహమ్మద్) నాయకత్వం వహించారు.

ఈస్ట్ ఇండియా కంపెనీ పటాలంలో ఆనాడు స్వదేశీ సిపాయీల స్థితిగతులు చాలా అధ్వాన్నంగా ఉండేవి. రక్షణ వ్యవహారాలలో మాత్రమే కాకుండా ఇతర పనులు కూడా స్వదేశీ సైనికుల చేత కంపెనీ అధికారులు చేయించేవారు. ఈ విధంగా చేయించుకున్న అదనపు చాకిరికి గాను వారికి ఎటువంటి ప్రతిఫలం ఉండేదికాదు. కంపెనీ నిర్దేశించిన ఉద్యోగ నియమ నిబంధనలను త్రోసిరాజంటూ చాకిరి విషయంలో, జీతభత్యాల విషయంలో స్వదేశీ సిపాయీల పట్ల ఆంగ్లేయాధికారులు చూపుతున్న వివక్ష, కంపెనీ అధికారులు ప్రదర్శిస్తున్న జాత్యంహంకారం స్వదేశీ సైనికులలో అసంతృప్తిని రగిలిస్తూ వచ్చింది.

ఈ నేపథ్యంలో స్వదేశీ వీరుడు, మైసూరు సుల్తాన్ హైదరాలీ మీద దాడులకు ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యాధికారులకు అదనపు సైన్యం అవసరమైంది. ఈ మేరకు మద్రాసు గవర్నర్ జాన్ వైట్ హిల్ (John White Hill) మచిలీపట్నం, ఏలూరు, విశాఖపట్నంలలో గల కంపెనీ సైనిక స్థావరాల అధికారులకు 1780 సెప్టెంబరు 14న ఉత్తర్వులు జారీచేస్తూ, తమ తమ స్థావరాల నుండి కర్ణాటకకు సైన్యాల తరలింపుకు సిద్ధం చేయమని ఆదేశించాడు. ఆ ఉత్తర్వులకు అనుగుణంగా ఏలూరు, మచిలీపట్నం స్థావరాలలోని అధికారులు, సైనికులను పంపారు. విశాఖపట్నం సైనిక స్థావరం అధికారి జేమ్స్ హెన్రీ కాసామేజర్ (James Henry



తిరుగుబాటు యోధులను
ఫిరంగులకు కట్టి పేల్చివేస్తున్న దృశ్యం.

Casamajor) అందుకు తగిన ఏర్పాట్లు చేయసాగాడు. అదనపు సైన్యాల తరలింపుకు శార్టైన్ ఫ్రిగేట్ (Sartine Frigate) అను నౌకను కూడా లైసాట్ (Lysaught) నాయకత్వంలో విశాఖపట్నం చేరుకుంది. ఆ నౌకలో స్వదేశీ సైనికులను 1780 అక్టోబరు 3న మద్రాసుకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆ ఏర్పాట్ల పట్ల స్వదేశీ సైనికులు తొలుత అభ్యంతరం పెట్టలేదు. ఆ కారణంగా ఆంగ్లేయాధికారులు కాసామేజర్ తరలింపు ఏర్పాట్లు పూర్తిచేసి, ఈ సందర్భంగా అధికారులకు ఇచ్చిన విందులో పాల్గొన్నాడు. ఆ తరువాత అక్టోబరు 3న మధ్యాహ్నం మూడు గంటలకు విశాఖపట్నం నుండి స్వదేశీ సైనికులను కర్నాటకకు పంపడానికి ఓడరేవు చేరుకున్నారు.

ఆ సమయంలో స్వదేశీ సైనికులకు తాము ఎక్కడికి ఎందుకు తరలించ బడుతున్నామో తెలియవచ్చింది. దక్షిణ భారత దేశ నెపోలియన్‌గా ఖ్యాతి గాంచిన మైసూరు సుల్తాన్ హైదర్ అలీ చేతిలో చావుదెబ్బతిన్న ఆంగ్లేయులు ఆయన మీద పోరాడటానికి అదనపు బలగాలను సమకూర్చుకుంటూ తమను కర్నాటకలోని మైసూరు సుల్తాన్ మీద యుద్ధానికి పంపుతున్నారని తెలుసుకున్నారు. ఆ విషయం తెలియగానే స్వదేశీ యోధుడు హైదరాలి మీద దాడులకు ఇష్టపడని విశాఖపట్నం సైనికులు ఆ తరలింపుకు ఇష్టపడలేదు. స్వదేశీ సైనికుల అభీష్టాలతో ప్రమేయం లేకుండా ఆంగ్లేయాధికారులు ఒత్తిడి తెచ్చారు. అధికారుల అహంకారపూరిత పెత్తందారితనంతో, వివక్షతో రగలిపోతున్న స్వదేశీ సైనికులు ఆంగ్లేయాధికారుల తరలింపు ఆజ్ఞలను పాటించడానికి ససేమిరా అన్నారు.

ఆ సమయంలో విశాఖపట్నంలో సైనిక స్థావరంలోని ఒక సైనిక పటాలానికి నాయకత్వం వహిస్తున్న సుబేదార్ షేక్ అహమ్మద్ రంగం మీదకు వచ్చారు. ఆంగ్లేయాధికారుల

చర్యలకు బాగా కినిసి ఉన్న సహచరులతో కలసి ఆయన తిరుగుబాటుకు పథకాన్ని రూపొందించారు. పటాలంలోని సహచరులను తిరుగుబాటుకు మరింతగా ప్రేరేపించి, ఆత్మగౌరవం కోసం తిరగబడమని కోరారు. ఆ నాయకుని మాటకు విలువనిచ్చిన స్వదేశీ సైనికులు తిరుగుబాటుకు సిద్ధమై తిరుగుబాటు బావుటాను విశాఖపట్నం సైనిక స్థావరంలో ఎగుర వేశారు.

స్వదేశీ సైనికుల మానసిక స్థితిని పట్టించుకోకుండా అధికారులు వారి మీద ఒత్తిడిని మరింత తీవ్రతరం చేయడంతో ఆగ్రహించిన స్వదేశీ సైనికులు అధికారుల మీద కాల్పులు ఆరంభించారు. కన్పించిన ప్రతి ఆంగ్లేయ అధికారిని కాల్చివేయడం ప్రారంభించారు. ఈ అనూహ్య పరిణామాలతో ఖంగుతిన్న అధికారులు పూర్తిగా కకావికలయ్యారు. ఆ కాల్పులలో లెఫ్టినెంట్ క్రిప్స్ (Lieutenant Crips) కింగ్స్‌ఫోర్డ్ (Kingsford Venner) రాబర్ట్ రూథర్‌ఫర్డ్ (Robert Rutherford) అక్కడిక్కడే మృతిచెందారు. ఛార్లెస్ మాక్స్‌టోన్ (Charles Maxtone) కెప్టన్ లేన్ (Captain Lane) తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా చావుతప్పి కన్నులొట్టపోయి కలుగుల్లో ఎలుకల్లా దాక్కొన్నారు.

ఈ సందర్భంగా లెఫ్టినెంట్ బ్రౌన్ (Lieutenant Brown) అంతుతేల్చాలని అతనిని వెంటాడిన సిపాయీలు అతని మీద పలుమార్లు కాల్పులు జరిపారు.ఆ తుపాకి గుళ్ళ వర్షం నుండి తప్పించుకుంటూ శార్టెన్ ఫ్రిగేట్‌ను ఓడను చేరుకున్న బ్రౌన్ బ్రతికిపోయాడు. ఈ విధంగా సైనికుల ధాటి నుండి తప్పించుకున్న సార్జెంట్ కొల్లిన్స్ (Sarjeant Collins), సార్జెంట్ క్రౌజ్ (Sarjeant Crouse), సార్జెంటు ఇల్లిస్ (Sarjeant Illis) లెఫ్టినెంట్ బ్రౌన్‌ను అనుసరిస్తు సముద్రంలో దూకి ఈదుకుంటూ నౌకను చేరుకుని తిరుగుబాటు యోధుల తుపాకి గుళ్ళ నుండి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ సందర్భంగా తిరుగుబాటు యోధులు పట్టుకున్న ఆంగ్లేయులను చిన్నగదిలో కొన్ని గంటలపాటు బంధించి ఉంచారు.

సుబేదార్ అహమ్మద్ నేతృత్వంలో తిరుగుబాటు యోధులు విజయపథాన కదం తొక్కుతూ సైనిక స్థావరం అధికారి కాసామేజర్ (Casamajor) ను అరెస్టు చేశారు. అతని మీద కూడా కాల్పులు జరిగాయి. ఆ సమయంలో ఒక సిపాయి అడ్డుపడి వారించడంతో అతను బ్రతికిపోయాడు. అనంతరం అతడి నుండి స్థావరానికి సంబంధించిన పూర్తి రహస్యాలు, ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన ఆస్తిపాస్తుల వివరాలు తెలుసుకున్న సుబేదార్ అహమ్మద్ ఆయన సహచరులు విశాఖపట్నం సైనిక స్థావరాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. సైనిక ఆయుధాగారాన్ని హస్తగతం చేసుకున్నారు. స్థావరంలోని ఖజానాలో ఉన్న 21,999 రూపాయలను సొంతం చేసుకున్నారు. కాసామేజర్ (Casamajor) స్వంత సొమ్ము సుమారు 15 వేల రూపాయలు కైవసం చేసుకున్నారు. ఆ సందర్భంగా ఆంగ్లేయుల

స్థావరంలో బందీగా ఉన్న ఫ్రెంచ్ గూఢచారిని బంధ విముక్తుడ్ని చేశారు. ఈ చర్యలలో స్థానిక ప్రజలు కూడా భాగస్వాములయ్యారు.

సుబేదార్ ఆహమ్మద్ మార్గదర్శకత్వంలో 24 గంటలపాటు స్వదేశీ యోధులు స్వైరవిహారం చేశారు. విశాఖపట్నంలో నివాసం ఉంటున్న ఆంగ్లేయులు కూడా భయపడి వేర్వేరుచోట్ల తలదాచుకున్నారు. ఆ మర్నాడు సుబేదార్ అహమ్మద్ కాసామేజర్‌ను బంధించి, ఆతని మీద వత్తిడి తెచ్చి పర్లాకిమిడి జమీందారు గణపతి నారాయణ దేవ్ ఎస్టేటును తిరిగి జమిందారుకు ఇప్పించారు. ఆ క్రమంలో అక్టోబరు 3 ఉదయం విశాఖపట్నం రేవు నుండి కర్నాటకు వెళ్ళిన తొలివిడత సిపాయీలను తిరిగి వెనక్కు రప్పించేందుకు కాసామేజర్ చేత అంగీకరింప చేశారు.

ఆ తరువాత  విశాఖపట్నం జిల్లాను ఆంగ్లేయుల నుండి పూర్తిగా విముక్తం చేయాలనుకున్న సుబేదార్ షేక్ అహమ్మద్ ఆయన అనుచరులు కాసామేజర్, ఇతర ఆంగ్లేయ సైనికులను తీసుకుని హైదర్ అలీ సైన్యాన్ని కలిసేందుకు అక్టోబరు 4న బయలుదేరారు. (Article titled ' AP Sepoys fought British' by SNV Sudhir, Deccan Chronicle, 01-10-2006 **and** Personal Dissussion  with Prof. Kolluri Suryanarayana, Head of the Department of History and Archeology, Andhra University, Wailair on 28-11-2006 by Author)

ఆ ఏర్పాట్లలో స్వదేశీ యోధులు ఉండగా జమీందారు నారాయణ గణపతి దేవ్ సుబేదార్ అహమ్మద్‌ను చేరుకుని కాసామేజర్‌ను విడుదల చేయాల్సిందిగా సలహా ఇచ్చాడు. స్వదేశీ జమీందారు గణపతి సలహా వెనుకనున్న ఆంతర్యాన్ని గ్రహించని షేక్ అహమ్మద్ ఆ సలహా మేరకు కాసామేజర్, ఇతర ఆంగ్ల సైనికులు విడుదల చేశారు. ఆ విధంగా ఆంగ్లేయ సైనికులను వదలిపెట్టిన స్వదేశీ సైనికులు రానున్న పరిణామాలను పట్టించుకోకుండా విశాఖపట్నం పూర్తిగా తమ స్వాధీనంలోకి వచ్చిందని భావించి కర్నాటకకు కాకుండా హైదరాబాదు వైపుకు ప్రయాణం ఆరంభించారు.

జమీందారు నారాయణ దేవ్ గణపతి సహకారంతో మృత్యువు ముఖం నుండి తప్పించుకున్న కాసా మేజర్ అక్టోబరు 5న శార్టైన్ ఫ్రిగేట్ (Sartine Frigate) నౌకలోకి చేరుకున్నాడు.  విశాఖపట్నంలో వెల్లువెత్తిన తిరుగుబాటు గురించి ఉన్నతాధికారులకు పూర్తి  సమాచారం అందజేశాడు. ఓడలో ఉన్న సైన్యాధికారులతో మంతనాలు చేశాడు. ఈ ఉపద్రవాన్ని ఎలా అధిగమించాలన్న విషయమై అధికారులు సమాలోచన చేశారు. ఆ సమయంలో విజయోత్సాహంతో స్వదేశీ యోధులు విశాఖపట్నం వదలి పయనం సాగించటం, విశాఖపట్నం సైనిక స్థావరంలోని సైనిక పటాలంలోని స్వదేశీ సైనికులు కొందరు కంపెనీకి విధేయులుగా ఉండడం ఆంగ్లేయాధికారులకు కలసివచ్చింది.

ఆ సమయంలో నౌకలోని ఆంగ్లేయాధికారి కేప్టన్ యంసి కేస్ (Captain MC Kays) మార్గదర్శకత్వంలో తిరుగుబాటును అణిచివేసేందుకు నడుం కట్టారు. అనూహ్య పరిణామాల నుండి తేరుకున్న ఎన్‌సైన్ బట్లర్ (Ensign Butler) కంపెనీకి విధేయులైన కొంతమంది సిపాయిలను సమీకరించాడు. ఆ వెంటనే కేప్టన్ కాట్స్‌ఫోర్డ్ (Captain Cotsford) కేప్టన్ బ్రిడ్జ్‌స్ ( Captain Bridges) లను సుబేదార్ ఆహమ్మద్‌ను వెంబడించమని కాసామేజర్ పంపాడు. ఆ విధంగా బయలుదేరిన కంపెనీ అధికారులు తమ బలగాలతో స్వదేశీ సైనికుల జాడను వెతుక్కుంటూ వెంబడించారు. విశాఖపట్నంలోని స్వదేశీ సైనికులకు శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలలోని సైనికులతో సంబంధ బాంధవ్యాలు ఉన్న విషయం తెలిసిన కాసామేజర్ అటు నుండి తిరుగుబాటు యోధులకు ఎటువంటి సహాయం గాని, సహకారం గాని అందకుండా చర్యలు తీసుకున్నాడు. ఆ ప్రయత్నాలలో భాగంగా విశాఖపట్నం తిరుగుబాటు యోధులకు సహకారంగాని, ఆశ్రయంగాని కల్పించవద్దని సుబేదార్ అహమ్మద్ అనుచరులు సాగుతున్న ప్రాంతాలలోని జమీందారులకు లేఖలు రాశారు. విజయనగరం సంస్థానాధీశులకు నచ్చచెప్పి సుబేదార్ అహమ్మద్ సహచరులకు ఎక్కడా కూడా ఎటువంటి నీడ లభించకుండా జాగ్రత్తపడ్డాడు. ఆ కారణంగా గోలుగొండ (Golgonda) జమీందారు భైరవ భూపతి లాంటివారు విజయనగరం సంస్థానాధీశుల ఆదేశాన్ని పాటిస్తూ, స్వదేశీ యోధులను తమ పరగణా గుండా ప్రయాణించకుండా అడ్డుకున్నారు.

ఈ ఆటంకాల వలన, జమీందారుల సహాయనిరాకరణ మూలంగా సుబేదార్ అహమ్మద్ తన సహచరులతో కలసి గుడ్డెరాల్లివంకకు (Gudderallywanka) అతికష్టం మీద చేరుకున్నారు. ఆ ప్రాంతంలో సేదతీరాలని భావించిన తిరుగుబాటు సిపాయీలు అక్కడ విడిది చేయగా, వారిని అనుసరిస్తు వస్తున్న అంగ్లేయాధికారి ఎన్‌సైన్ బట్లర్ (Ensign Butler) ఆ అవకాశాన్ని వినియోగించుకున్నాడు. పగటిపూట సుబేదార్ అహమ్మద్ సహచరుల జాడను కనిపెట్టి అక్టోబరు 8 రాత్రిపూట స్వదేశీ యోధులు నిద్రపోతున్న సమయంలో అకస్మాత్తుగా దాడిచేశాడు.

ఆ దాడిని ఊహించని యోధులు తమ ఆయుధాలను, బట్టలను ఇతర సామగ్రిని వదిలేసి ఆ ప్రాంతం నుండి తప్పుకున్నారు. ఆ గందరగోళంలో పలువుర్ని ఆంగ్లేయాధికారులు బంధించగా, సుబేదార్ అహమ్మద్‌తో సహా మరికొందరు కంపెనీ అధికారుల కన్ను గప్పి తప్పించుకున్నారు. ఆ సందర్భంగా అధికారులకు లొంగిపోయిన వారిలో కొందరికి క్షమాభిక్ష ప్రసాదించారు. ఈ తిరుగుబాటు నాయకుడైన సుబేదార్ అహమ్మద్‌ను ఆంగ్లేయాధికారులు మరింత మంది సైనికులను తీసుకుని వెంబడించారు. ఆంగ్లేయాధికారుల ఎంతగా ప్రయత్నించినా పట్టుబడకుండా సుబేదార్ అహమ్మద్ కొన్ని మాసాలపాటు తప్పించుకు

తిరిగారు. అన్నివైపుల నుండి చుట్టుముట్టిన ఆంగ్లేయాధికారులు, సైనికులు ఒకవైపు, స్వదేశీ సంస్థానాధీశుల నుండి, జమిందారుల నుండి ఎటువంటి సహకారం అందని పరిస్థితులు మరొకవైపు ఎదురుకావడంతో సుబేదార్ అహమ్మద్ కంపెనీ సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టి చివరకు పట్టుబడ్డారు. ఆంగ్లేయుల వెన్నులో వణుకు పుట్టించిన తొలి సిపాయిల తిరుగుబాటుకు నాయకత్వం వహించిన సుబేదార్ షేక్ అహమ్మద్‌ను నిర్బంధించి ఆంగ్లేయులు విచారణ జరిపారు. ఆ విచారణ తరువాత ఆయనకు ఉరిశిక్ష విధించారు. విశాఖపట్నంలోని ప్రస్తుత అబుసరంగ్ స్ట్రీట్‌లో సుబేదార్ అహమ్మద్‌కు విధించిన ఉరిశిక్షను అమలు చేశారు.

ఈ విధంగా భారతదేశంలో స్వదేశీ సిపాయిలు సాగించిన తొలి తిరుగుబాటు విఫలం అయ్యింది. ఈ తిరుగుబాటు విఫలమైనా, ఆనాడు ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులకు అది చెమటలు పట్టించింది. ఆ కారణంగా విశాఖపట్నం సిపాయిల తిరుగుబాటుకు ఆంగ్లేయాధికారులు అత్యధిక ప్రాధాన్యత నిచ్చారు. ఈ సంఘటన గురించి మద్రాసు గవర్నర్‌కు విశాఖపట్నం సైనికస్థావరం అధికారి కాసామేజర్ లేఖ రాస్తూ, **వైజాగ్‌పట్నం సిపాయిల తిరుగుబాటును తీవ్రమైన, ప్రమాదకరమైన సంఘటనగా అభివర్ణించాడు. సంస్థానాధీశుడు నారాయణదేవ్ సహాయ సహకారం లభించి ఉండకపోతే ఈ సంఘటనలో ఆంగ్లేయులు ఎవ్వరూ బ్రతికి ఉండేవారు కారని, ఈ సంఘటన ఈ ప్రాంతంలో ఆంగ్లేయుల ప్రాబల్యాన్ని తేరుకోలేని స్థాయిలో దెబ్బతీసిందని ఆ లేఖలో వివరించాడు.** (Article titled 'The Sepoy Revolt of Vizagapatnam, 1780' by B. Kesava-narayana, published in Andhra Pradesh History Congress proceedings in Warngal Session, 1990, Page. 183)

ఈ రకంగా ముగిసిన విశాఖపట్నం తిరుగుబాటుకు నాయకత్వం వహించిన సుబేదార్ అహమ్మద్ అమరత్వం గురించి మరో కథనం కూడా ఉంది. షేక్ సుబేదార్ అహమ్మద్ గురించి కొంత మేరకు పరిశోధన చేసిన సెంటర్ ఫర్ మెరైన్ అర్కియాలజీ (ఆంధ్ర విశ్వవిద్యాలయం) సంచాలకులు ప్రొఫెసర్ ఇ.వి గంగాధరం, విశాఖపట్నానికి చెందిన జర్నలిస్టు ముహమ్మద్ గాలిబ్ ఫిదాయిల కథనం ప్రకారం విశాఖ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన అహమ్మద్‌ను కంపెనీ అధికారులు అరెస్టు చేసి, విచారణ జరిపి, ప్రజలందరి సమక్షంలో ఫిరంగికి కట్టి పేల్చివేశారు.

ఆ పేల్చివేత మూలంగా సుబేదార్ షేక్ అహమ్మద్ భౌతికకాయం ముక్కలు ముక్కలై ఆ ప్రాంతమంతా విసిరి వేయబడింది. కఠిన హృదయాలను కూడా కరిగించగల ఆ దృశ్యంతో బ్రిటీష్ కర్కశ మూకలు రాక్షసానందాన్ని పొందాయి. మృతుడి పట్ల కనీస గౌరవం కూడా చూపకుండా శరీర భాగాలను అక్కడే వదిలేశాయి. ఈ దృశ్యాన్ని విశాఖ ప్రజలు చూడలేక పోయారు.ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. మనస్సులోనే ఆ అమర

వీరునికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, సుబేదార్ అహమ్మద్ శరీర భాగాలను ఒక్కచోట చేర్చారు. ఆయన భౌతికకాయాన్ని విశాఖపట్నంలో ఔరంగజేబు అనుమతితో నిర్మితమైన అలంగీర్ మసీదు వెనుక భాగాన గల **'హజ్రత్ ఇస్‌హాఖ్-మదనీ సమాధి'** కి సుమారు 25 మీటర్ల దూరంలో సమాధి చేశారు, ఆ వీరుని స్మృతి చిహ్నంగా ఓ మినార్ కూడా నిర్మాణమైంది. ఆ శిధిల నిర్మాణ స్వరూపాన్ని గుర్తించి పరిశీలించిన ప్రొఫెసర్ గంగాధరం, స్వర్గీయ మొహమ్మద్ గాలిబ్ ఫిదాయి తన రఫ్‌బుక్‌లో ఆ నిర్మాణం స్వరూపాన్ని కొలతలతో సహా చిత్రించుకున్నారు. ఆ చిత్రంతోపాటు కొంత నోట్సును 1996 మే13న తీసుకున్నారు. ఈ విషయాన్ని గాలిబ్ ఫిదాయి 1996లో రాసుకున్న డైరీ ద్వారా వెల్లడవుతుంది.

ఆ చిత్రం ఇలా ఉంది.




భారత దేశంలోనే తొలిసారిగా జరిగిన సిపాయీల తిరుగుబాటుకు నాయకత్వం వహించిన సుబేదార్ అహమ్మద్ గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జన్మించారని, ఇస్లామిక్ సెంటర్ వ్యవస్థాపకులు (విశాఖపట్నం), ప్రముఖ పాత్రికేయులు స్వర్గీయ మొహమ్మద్ గాలిబ్ ఫిదాయి, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ ఇ.వి. గంగాధరంల పరిశోధనల వలన తెలుస్తుంది. ఈ విషయం మీద ఇంకా లోతైన పరిశోధన జరగాల్సి ఉంది.

షేక్ సుబేదార్ అహమ్మద్ సాగించిన తిరుగుబాటు 1780లో జరిగినట్టు కంపెనీ అధికారుల గ్రంథాలు, కంపెనీ రికార్డులు తెలుపుతుండగా, స్వర్గీయ ముహమ్మద్ గాలిబ్ ఫిదాయి, ప్రొఫెసర్ గంగాధరంల సమాచారం మాత్రం ఆయన 1857 నాటి తిరుగుబాటులో భాగస్వామిగా పేర్కొంటున్నారు. ఈ ఇరువురు సుబేదార్ షేక్ అహమ్మద్ 1857 ఆగస్టు 28న అమరుడయ్యాడని పేర్కొంటూ ఆ వీరుని స్మృతిలో 1996 వరకు ప్రతి ఏటా ఆగస్టు 28న ఆ వీరుని వీరగాధ మీద వ్యాసాలు రాశారు, కరపత్రాలు ముద్రించారు. ఆ యోధుని స్మరించుకుంటూ ప్రతి ఏడాది సంస్మరణ సభలు, సమావేశాలు కూడా జరుపుతూ వచ్చారు.

ఈ మేరకు సుబేదార్ షేక్ అహమ్మద్ గురించి ప్రజానీకంలో తనదైన రీతిలో ప్రచారం గావించిన గాలిబ్ ఫిదాయ్ ఆ యోధుని గురించి తాను రాసిన అముద్రిత వ్యాసంలో,

**సుబేదార్ అహమ్మద్ యొక్క షహాదత్ (హత సాక్ష్యం) కుల, మత, వర్గ, వైషమ్యాలకు అతీతముగా విశాఖపట్టణం వాసులకు గర్వకారణమే కాక గౌరవ చిహ్నమై యున్నది. యీ మహోన్నతమగు షహదత్ యొక్క సాదృశ్యము ఆంధ్ర రాష్ట్రముందెచ్చుటను లేదు. మనం ఆ షహదత్ గూర్చి యెంతగా గర్వించినను, శ్లాఘించినను కొదువయే** అని పేర్కొన్నారు. ఆంగ్లేయుల మీద సాగిన సైనిక తిరుగుబాటుకు నాయకత్వం వహించిన షేక్ అహమ్మద్ ధైర్య సాహసాలు, గుండెనిబ్బరత, స్వదేశీ పాలకుల పట్ల ఆయన చూపిన ఉదారతల దృష్ట్యా గాలిబ్ ఫిదాయి రాసుకున్న వాక్యాలు ఎంత మాత్రం అత్యుక్తి కానేరవన్పిస్తుంది.

ఈ విధంగా విశాఖపట్నంలో తిరుగుబాటు గురించి విభిన్న కథనాలున్నా, 1780 నాటి తిరుగుబాటు మాత్రమే వాస్తవానికి దగ్గరగా ఉందని పేర్కొనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఈ సంఘటన 1780లో జరిగిందని చెప్పడానికి ప్రబల సాక్ష్యాలు కూడా ఉండడంతో 1857లో ఈ సంఘటన జరిగిందని చెప్పడం ఇక సాహసం అవుతుంది. ఈ సంఘటనకు అధికారికంగా తగినంత ప్రాచుర్యం లభించక పోవడం, ప్రామాణిక స్థాయిలో పరిశోధనలు జరగకపోవడం వలన వివిధ కథనాలు గత మూడు దశాబ్దాలుగా విశాఖపట్నం ప్రజలలో బలంగా వినవస్తూ వచ్చాయి.

ఈ తిరుగుబాటు విషయమై మరింత సమాచారం కోసం, ఆంధ్ర విశ్వ విద్యాలయం (విశాఖపట్నం) చరిత్ర శాఖాధిపతి డాక్టర్ కొల్లూరు సూర్యనారాయణను 2006 నవంబరు 28న విశ్వవిద్యాలయంలోని ఆయన కార్యాలయంలో రచయిత కలవడం జరిగింది. ఆ సమయంలో సుబేదార్ షేక్ అహమ్మద్ నాయకత్వంలో విశాఖపట్నంలో జరిగిన తిరుగుబాటు గురించి ఆయన వివరంగా చర్చించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కొల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ, **భారత దేశంలోనే తొట్టతొలుత సిపాయిల తిరుగుబాటు 1780 అక్టోబరు 3న విశాఖపట్నంలో జరిగింది. ఆ తిరుగుబాటు శంఖారావాన్ని పూరించిన వ్యక్తి, నాయకత్వం వహించిన వ్యక్తి షేక్ అహమ్మద్ ... దురదృష్ట వశాత్తు ప్రజలకు మంగళపాండే మాత్రమే తెలుసు. సుబేదార్ షేక్ అహమ్మద్ సాహస కృత్యానికి, తెలుగుగడ్డ మీద జరిగిన తొలి సిపాయిల తిరుగుబాటుకు తగినంత ప్రాచుర్యం లభించక పోవట దురదృష్టకరం,** అని ఆవేదన వ్యక్తంచేశారు.

ఈ విషయాన్ని దక్కన్ క్రానికల్ దినపత్రికలో ప్రచురితమైన వ్యాసంలో రూఢి మరింతగా చేస్తూ, The First revolt occured in Vizagapatnam on October 3,1780... Unfortuntely people know only about Mangal Pande అని డాక్టర్ కొల్లూరు సూర్యనారాయణ సాధికారికంగా వ్యాఖ్యానించారు. ( Deccen Chronicle, Daily, Vijayawada, 01-10-2006, Page 1-2)

1780లో విశాఖపట్నంలోని సైనికస్థావరంలో సైనికుల తిరుగుబాటు జరిగాక, 1806లో తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరు, 1824లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోరఖ్‌పూర్ లలో కూడా సిపాయీలు తిరుగుబాటు చేసిన చారిత్రక సంఘటనలున్నాయి. ఆ తరువాత హైదరాబాదు, ఔరంగాబాదు లాంటి ప్రాంతాలలో 1857 కంటే పూర్వమే సిపాయీలు తిరగబడిన సంఘటనలూ ఉన్నాయి. ఆ సంఘటనల మీద ఆయా ప్రాంతాలలోని రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించి, ఆనాటి చారిత్రక విషయాల లోతుపాతులను వెలికి తీయుస్తూ, ఆ సంఘటనలు జరిగిన తేదిలకు తగినంత ప్రాధాన్యత కల్పిస్తూ అలనాటి తిరుగుబాటు యోధులను స్మరించుకుంటూ పలు కార్యక్రమాలు జరుపుతున్నాయి.

ఈ విషయంలో తమిళనాడు ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు మరింత ఆదర్శంగా ఉంటూ 1806 నాటి సంఘటనకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, ఆ సంఘటనకు, ఆ సంఘటనలో పాల్గొన్న స్వదేశీ యోధులకు ప్రజలలో తగినంత ప్రాచుర్యం కల్పిస్తూ, అలనాటి యోధులను స్మరిస్తూ ప్రతిఏటా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఆయా సంఘటనలు, ఆ సంఘటనలలో పాల్గొన్న వ్యక్తుల ప్రాధాన్యతలను బట్టి వారి గౌరవార్థం పోస్టల్ స్టాంపులను కూడా విడుదల చేయించుకుంటోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా విశాఖపట్నం సిపాయీల తిరుగుబాటు సంఘటన మీద దృష్టిసారించి చరిత్రకారుల ద్వారా మరింతగా లోతుగా పరిశోధనలు చేయించి ఈ సంఘటనలోని సుబేదార్ షేక్ అహమ్మద్ లాంటి యోధుల గురించి, ఆయన వెంట నడిచిన స్వదేశీ సైనిక యోధులగురించి మరిన్ని వివరాలను వెలికి తీయించి ప్రజలకు తెలియచేయాలి. అలనాటి యోధులను స్మరించుకుంటూ కార్యక్రమాలను నిర్వహించాలి. ఆ ప్రయత్నాలు జరిగినట్టయితే చరిత్ర సృష్టించిన విశాఖపట్నం సైనికుల తిరుగుబాటు చరిత్ర మొత్తం బహిర్గతం కాగలదు. తెలుగుగడ్డకు కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేయగల సరికొత్త విషయాలు చారిత్రక ఆధారాలతో మరింత రూఢిగా వెల్లడి కాగలవు.

◆◆◆

'....the cry for Islam in danger is baseless and it could not be protected by Pakistan...Islam cannot be protected by any community but by our own strength and sacrifice...'

\- Moulana Hafeezurehaman Ludhiyani

## నిజాంచే బహిష్కారానికి గురైన బ్రిటీష్ వ్యతిరేకి

# 2. నూరుల్ ఉమ్రా బహదూర్

(-1818)

నైజాం సంస్థానాధీశుడు బ్రిటీషర్ల ఆధిపత్యానికి క్రమంగా లొంగిపోతూ, చివరకు హైదరాబాదును బ్రిటీషర్ల అనుబంధ ఉపరాజ్యంగా మార్చివేయగల సైనిక నియంత్రణ అధికారాన్ని ఈస్ట్ ఇండియా కంపెనీకి 1800లో ధారాదత్తం చేశాడు. ఆ ఒప్పందం నిజాం దర్బారులోని ప్రముఖులను కుదిపివేసింది. స్వదేశీ సంస్థానం క్రమంగా పరానుగతమౌతున్న ప్రతికూల వాతావరణాన్ని సహించలేకపోయారు. అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ మేరకు బ్రిటీషు వ్యతిరేకతను బహిరంగంగా ప్రదర్శించిన నిజాం దర్బారు ప్రముఖులలో ఒకరు నూరుల్ ఉమ్రా బహదూర్.

నూరుల్ ఉమ్రా ఉత్తర భారతదేశం నుండి వచ్చి నిజాం దర్బారులో ప్రాముఖ్యత సంపాదించుకున్నారు. ఆయన సికిందర్ జాహ్ ఆదరాభిమానాలకు పాత్రుడయ్యారు. ఆయనకు తొలుత నుండి ఆంగ్లేయాధికారుల పద్ధతులు నచ్చలేదు. వారిపట్ల తన అయిష్టతను వ్యక్తం చేస్తూ వచ్చారు. ఎప్పుటికైనా సైనిక సమీకరణ జరిపి బ్రిటీష్ వారిని వెళ్ళగొట్టాలన్నది ఆయన ఆశయం. ఆ విషయాన్ని నిజాం సంస్థానంలోని ఆంగ్లేయ రెసిడెంట్ థామస్ సిడ్నిహామ్ (Captain Thomus Sydenham) 1806 ఆగస్టు 31న గవర్నరు జనరల్ సర్ జార్జీ హిలరో బార్లోకు (Sir George Hilaro Barlow) లేఖ రాస్తూ, '..Noor-ool-Omrah was in the habit of speaking of the English with great insolence and contempt, and had often said that if he

were properly supported he would drive us form the Deccan.' అని పేర్కొన్నాడు (The Freedom Struggle in Hyderabad, Vol. I (1800-1857), Govt. Of Andhra Pradesh, Hyderabad, 1992, Page.21). ఆనాడు నిజాం నవాబు ఆంగ్లేయులతో స్నేహం కొనసాగిస్తున్నా, ఆయన దర్బారులోని ప్రముఖులు నూరుల్ ఉమ్రా బహదూర్ మాత్రం ఆంగ్లేయుల తరిమివేత ఆలోచనలతో ఉండడం ఉమ్రాలోని బలమైన బ్రిటీష్ వ్యతిరేకత భావనలకు తార్కాణం.

నైజాం సంస్థానాధీశుడు ఆంగ్లేయులకు పెద్దపీట వేయడం వలన స్వదేశీ సంస్థానం స్వతంత్రత కోల్పోయి, ఈస్ట్ ఇండియా కంపెనీ పెత్తనం కింద నైజాం సాగాల్సి ఉంటుందని నూరుల్ ఉమ్రా భావించారు. ఆ కారణంగా ఆంగ్లేయుల పెత్తనాన్ని వమ్ముచేయడానికి అవకాశం కోసం ఎదురు చూడసాగారు. ఆ దిశగా ఆయన తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ విషయాలను గమనించిన ఆంగ్లేయాధికారులు తమ నివేదికలో, 'Noor-ool-Omrah was turbulent, factious and designing' అని ఆయన వ్యవహార సరళిని వాఖ్యానించారు. (The Freedom Struggle in Hyderabad, Vol.I, Page.21)

అదను కోసం ఎదురు చూస్తున్న నూరుల్ ఉమ్రాకు 1806లో మంచి అవకాశం లభించింది. బ్రిటీషు సైన్యంలోని స్వదేశీ సైనికుల వస్త్రధారణ, తలపాగాల డిజైనును మార్చుతూ ఆంగ్లేయాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాలు నచ్చని సైనికులు, వస్త్రధారణ, తలపాగాల మార్పు ద్వారా తమను క్రైస్తవ్యం వైపుకు మళ్ళిస్తున్నారని భావించారు. అసంతృప్తి వ్యక్తం చేశారు. నిజాం సంస్థానంలోని బళ్ళారి, బెంగళూరు, నందిదుర్గలలో బ్రిటీషు సైన్యంలో గల స్వదేశీ సైనికుల్లోకి ఈ సమాచారం, దానికి తగిన వ్యతిరేక వాతావరణం వ్యాపించింది. (హైదరాబాదు సంస్థానంలో స్వాతంత్ర్యోద్యమం, ఆంగ్లమూలంః వెల్దుర్తి మాణిక్యరావు, తెలుగు సేతః జి.సురమౌళి, భారత ప్రభుత్వ ప్రచురణలు, 1992, పేజి.3)

ఈ అసంతృప్తికర వాతావరణాన్ని బ్రిటీషర్లకు వ్యతిరేకంగా నూరుల్ ఉమ్రా సద్వినియోగం చేసుకొనదలిచారు. ఆయన ప్రయత్నాల మూలంగా ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, ఆంగ్లేయాధికారుల చర్యలు ఏ మాత్రం నచ్చని పలువురు స్వదేశీ సైనికులు కంపెనీ కొలువు నుండి వైదొలగి నూరుల్ ఉమ్రా, నిజాం సంస్థానంలోని మరో ప్రముఖుడు శ్రీ రాజారావు రంభాని బాల్కర్‌ల పంచన చేరసాగారు. ఆ విధంగా వచ్చిచేరుతున్న సైనికులను, నాయకులను నూరుల్ ఉమ్రా బహద్దూర్ ప్రోత్సహించారు. బ్రిటీషు వ్యతిరేకతతో తన వద్దకు వచ్చిన వారికి మంచి జీతం, మంచి హోదాను కలుగచేశారు. ఈ మేరకు ఆయన స్వయంగా ఆదేశాలు జారీ చేశారు.

ఈ విషయాన్ని స్థానిక ఆంగ్లేయ రెసిడెంటు Thomus Sydenham గవర్నర్ జనరల్‌కు రాసిన లేఖలో, '..Noor-ool-Omarah had sent for the four deserters before him and had

himself given the order to enter their names in the Roll of his Battalion.' ( The Freedom Struggle in Hyderabad, Vol. I, Page. 23) అని ఉటంకించాడు.

ఈ ప్రయత్నాలు ఇలా జరుగుతుండగా సైనికుల వస్త్రధారణ, తలపాగా విషయంలో స్వదేశీ సైనికులలో కలిగిన దురభిప్రాయాన్ని ఆంగ్లేయాధికారులు, మీర్ అలీం, రాజా చందూలాల్ లాంటి స్వదేశీయుల సహకారంతో చాలా వరకు పోగొట్టగలిగారు. స్వదేశీ సైనికుల అసంతృప్తి చల్లారినప్పటికీ, ఆంగ్లేయుల పెత్తనానికి గండికొట్టాలని ప్రయత్నిస్తున్న నూరుల్ ఉమ్రా, రాజారావు రంభాని బాల్కర్‌లను రెసిడెంటు Thomus Sydenham, ఆంగ్లేయుల మిత్రుడు మీర్ అలీంలు వదలిపెట్టదలచుకోలేదు.

నూరుల్ ఉమ్రా బహుదూర్ స్వతంత్ర భావనల వలన తమ ఉనికికి రాగల ప్రమాదాన్ని ఆంగ్లేయ అధికారులు అంచనాకట్టారు. ఆ ప్రమాదాన్ని నివారించేందుకు నూరుల్ ఉమ్రా, రాజారావు రంభానిల విషయాన్ని, నిజాం ప్రధాన మంత్రి మీర్ అలీం (Mir Allum) ద్వారా  నిజాం నవాబు సికిందర్ ఝాకు చేరవేశారు. నిజాం నవాబు క్షేమం కంటే ఆంగ్లేయుల శ్రేయస్సును అమితంగా కాంక్షించే మీర్ అలీం ఈ విషయాలకు మరింత మసాలా దట్టించి నవాబు సికిందర్ ఝా చెవిన పడేశాడు. ఆ తరువాత బ్రిటీష్ రెసిడెంటు Thomus Sydenham నిజాం నవాబును స్వయంగా కలసి నూరుల్ ఉమ్రా సాగిస్తున్న బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాలను నిజాం వ్యతిరేక కార్యకలాపాలుగా వివరిస్తూ, ఆ కార్యకలాపాల వలన ఈస్ట్ ఇండియా కంపెనీతోపాటుగా నిజాం సంస్థానానికి మరింత ప్రమాదం పొంచి ఉందని నమ్మబలికాడు. ఈ విషయాలను తెలుసుకున్న నిజాం నవాబు ఆశ్చర్యపోయాడు, నూరుల్ ఉమ్రా, రాజారావు మీద ఆగ్రహం వ్యక్తం చేశాడు.

ఆ అవకాశాన్ని దొరకబుచ్చుకున్న మీర్ అలీం, నూరుల్ ఉమ్రాను నిజాం దర్బారు నుండి బహిష్కరించమని నవాబుకు సలహా ఇచ్చాడు. నూరుల్ ఉమ్రాను చాలా ప్రమాదరకర వ్యక్తిగా మాత్రమే కాకుండా, అల్లకల్లోలం సృష్టించగల వ్యక్తిగా అభివర్ణించాడు. ఆ మాటలను నిజాం నవాబు నమ్మాడు. ఆ మీదట నూరుల్ ఉమ్రాను తక్షణమే నిజాం సేవల నుండి తొలగించి, ఆయనను ఆయన స్వంత జాగీరుకు వెళ్ళిపోవాలని నిజాం నవాబు సికిందర్ ఝా ఆదేశించాడు. నూరుల్ ఉమ్రా అధీనంలోని జిల్లాలను ఇతరులకు స్వాధీనం చేశాడు. నవాబు ఆదేశాల మేరకు నూరుల్ ఉమ్రా ఢిల్లీ తరలి వెళ్ళేందుకు ఏర్పాట్లు చేసుకోసాగారు.

ఆ సమయంలో బ్రిటీషు రెసిడెంటు పంపిన సమాచారాన్ని అందుకున్న బ్రిటీషు గవర్నర్ జనరల్ 1806 సెప్టెంబర్‌లో ఆంగ్లేయ రెసిడెంటు Thomus Sydenham కు ఓ లేఖ రాశాడు. ఆ లేఖలో నూరుల్ ఉమ్రా ఢిల్లీకి చేరడం ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రయోజనాలక మరింత భంగకరం కాగలదని హెచ్చరించాడు. ప్రస్తుతం ఏర్పడి ఉన్న ప్రత్యేక పరిస్థితులలో

నూరుల్ ఉమ్రా స్థాయి నాయకుల వ్యతిరేకత ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనకు, నైజాం సంస్థానానికి మంచిది కాదన్నాడు. ఈ వాతావరణం ప్రధానంగా బ్రిటీషు ప్రభుత్వ ప్రయోజనాలకు ప్రమాదకరమని స్పష్టం చేశాడు. నూరుల్ ఉమ్రాను హైదరాబాదులో ఉండనీయరాదనుకుంటే, ఆయన స్వంత జాగీరుకు పంపించమని సూచించాడు. ( The Freedom Struggle in Hyderabad, Vol. I, Page. 30).

ఈ ప్రత్యేక సూచనలను బట్టి కంపెనీ పాలకులు నూరుల్ ఉమ్రా శక్తి సామర్థ్యాలను ఏ స్థాయిలో అంచనా వేశారో విదితమౌతుంది. ఆనాడు నూరుల్ ఉమ్రాలో బ్రిటీషు వ్యతిరేకత ఎంత గాఢంగా గూడుకట్టుకుని ఉందో అర్థమౌతుంది. ఆ వ్యతిరేకత నిజాం సంస్థాన ప్రయోజనాల కంటే, బ్రిటీషు ప్రభుత్వ ప్రయెజనాలకు ఎంతటి నష్టదాయకమో అవగతం అవుతుంది. స్వతంత్ర భావాల నూరుల్ ఉమ్రా నుండి ఇటువంటి పెను ప్రమాదాన్ని పసికట్టినందుననే బ్రిటీషు రెసిడెంటు, మీర్ అలీం, బ్రిటీషు గవర్నరు జనరల్ ప్రత్యేక శ్రద్ధ వహించి, సికిందర్ ఝా దర్బారు నుండి నూరుల్ ఉమ్రా బహిష్కరణకు కారకులయ్యారు. నిజాం నవాబుకు విశ్వాసపాత్రులైన ప్రముఖులను నిజాం దర్బారు నుండి ఉద్వాసన పలికించేందుకు ఆ ముఠా విజయవంతంగా కుట్రలు పన్నింది.

ఆ కుట్రలు, బ్రిటీషు వ్యతిరేకత కారణంగా తన దర్బారులోని నవాబు నూరుల్ ఉమ్రాను తన సేవల నుండి నిజాం నవాబు సికిందర్ ఝా తొలుత తొలిగించాడు. ఆ తరువాత నిజాం సంస్థానంలోని స్వదేశీ ప్రముఖుల ప్రయత్నాల వలన నిజాం నవాబు కొంతమేరకు దిగివచ్చి నూరుల్ ఉమ్రాను ఉస్మానాబాద్ జిల్లాలోని ఔసా (Ousa) కోటలో నిర్బంధించారు. ఆ కోటలో చివరివరకు గడిపిన నూరుల్ ఉమ్రా బహదూర్ 1818లో కన్నుమూశారు.

◆◆◆

'...మిమ్ముల్ని (ప్రజలను) వ్యతిరేకించినట్టయితే నేను నా స్వర్గాన్ని, నా జీవితాన్ని, నా సంతోషాన్ని కోల్పోవచ్చు. నా ప్రజల సంతోషంలోనే నా సంతోషం. వారి సంక్షేమంలోనే నా సంక్షేమం ఇమిడి ఉంది. నాకిష్టమైందల్లా మంచిదని నేను భావించను. నా ప్రజలకు ఏది ఇష్టమో దానిని నా మంచిదిగా భావిస్తాను. నా ప్రజలకు ఎవరు శత్రువులో వారు నాకూ శత్రువులు. నా ప్రజలతో ఎవరు కలహిస్తారో, వారు నాతో యుద్ధం ప్రకటించినట్టు...'

**– మైసూరు పులి టీపూ సుల్తాన్.**



## ఆంగ్ల సైన్యాలను కడతేర్చేందుకు కదలిన నవాబు

# 3. గులాం రసూల్ ఖాన్

(-1840)

స్వంత గడ్డ మీద ఆంగ్ల పాలకుల పెత్తనాన్ని సహించలేక విజయమో వీరస్వర్గమో అంటూ విజృంభించి ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు, కంపెనీ బలగాలలో భయోత్పాతం సృష్టించిన యోధులలో కర్నూలు నవాబు గులాం రసూల్ ఖాన్ అగ్రగణ్యులు.

గులాం రసూల్ ఖాన్ కర్నూలు నవాబు అలాఫ్ ఖాన్ లేదా అలూఫ్ ఖాన్ (Aluf Khan or Alaf Khan) కనిష్ట పుత్రుడు. అలాఫ్ ఖాన్‌కు ఆరుగురు మగ బిడ్డలు. ఆ ఆరుగురిలో గులాం రసూల్ ఖాన్ చిన్నవాడైనప్పటికి సమర్ధుడు, సాహసవంతుడు. తండ్రి నుండి ఆంగ్లేయ వ్యతిరేకతను పుణికి పుచ్చుకున్న గులాం రసూల్ ఖాన్‌ను తన తదనంతరం కర్నూలు నవాబుగా తండ్రి ప్రకటించాడు. ఈ చర్యను అలూఫ్ ఖాన్ జ్యేష్ట పుత్రుడు మున్వర్ ఖాన్ వ్యతిరేకించాడు. మున్వర్ ఖాన్ తరువాతి వాడైన ముజఫర్ ఖాన్ కూడా కర్నూలు సింహాసనం మీద కన్నేసి అతని మేనమామ ఇమాందార్ ఖాన్ ప్రోత్సాహంతో అధికారాన్ని కైవసం చేసుకోవాలని పన్నాగాలు పన్నుతున్నాడు. అధికారం కోసం ఈ విధంగా పెనుగులాట సాగుతుండగా 1815లో అలాఫ్ ఖాన్ కన్నుమూశాడు.

అలాఫ్ ఖాన్ మరణంతో ఆంగ్లేయ అధికారులతో సన్నిహితంగా ఉంటూ వచ్చిన మున్వర్ ఖాన్ అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. మున్వర్ ఖాన్ ఎనిమిదేండ్లు పాలన సాగించాక

అనారోగ్యంతో కన్నుమూశాడు. అతని తరువాతి వాడైన ముజఫర్ ఖాన్ భార్యను చంపిన నేరంలో దోషి కావడంతో అతనికి సింహాసనం దక్కలేదు. అలాఫ్ ఖాన్ మిగిలిన కుమారులు అంతటి సమర్థులు కాకపోవడంతో అయిష్టంగానే ఆంగ్లేయులు గులాం రసూల్ ఖాన్‌కు మద్దతు పలకాల్సిన అనివార్య పరిస్థితులొచ్చాయి. (AP Dist Gazetteers, Kurnool (RF), Mr. Rajagopal, Govt. of AP, 1974, Pages 52-53)

ఈ పరిణామాలలో అలాఫ్ ఖాన్ ఆశించినట్టుగా గులాం రసూల్ ఖాన్ ఎనిమిది సంవత్సరాల తరువాత 1823లో కర్నూలు నవాబుగా పాలనా బాధ్యతలు స్వీకరించారు. తొలుత నుండి ఆంగ్లేయుల అధికారాన్ని ఖాతరు చేయని గులాం రసూల్ ఖాన్ ఆ చర్యలను వేగవంతం చేశారు. ఆంగ్లేయల నీడ కూడా తన సంస్థానం మీద పడకుండా పరిపాలనా వ్యవహారాలను చక్కదిద్దసాగారు. ఆంగ్లేయులతో ఎప్పటికైనా పోరు తప్పదని భావించిన ఆయన అందుకు అన్నివిధాల సిద్ధం కాసాగారు. సంస్థానం రెవిన్యూను పెంచడానికి పలు చర్యలు చేపట్టిన గులాం రసూల్ ఖాన్ కర్నూలు కోటను పటిష్టం చేయడం మాత్రమే కాకుండా అదనపు సైనిక దళాలను సమకూర్చుకోవడం ఆరంభించి బలపడసాగారు.

కర్నూలు నవాబుగా గులాం రసూల్ ఖాన్ క్రమక్రమంగా బలోపేతుడు కావడం ఇమాందార్ ఖాన్ జీర్ణించుకోలేకపోయాడు. అల్లుడు ముజఫర్ ఖాన్‌ను నవాబును చేసి, తద్వారా కర్నూలు సంస్థానంలో అధికారాన్ని చలాయించ వచ్చని ఆశించిన ఇమాందార్ ఖాన్ కలలు కల్లలైపోవడంతో వెన్నుపోటు చర్యలకు శ్రీకారం చుట్టాడు. గులాం రసూల్ ఖాన్‌ను పడగొట్టాలంటే ఆంగ్లేయుల శరణుకోరడం మినహా మరో మార్గంలేదనుకున్న అతడు ఆంగ్లేయాధికారి పీటర్ ను ఆశ్రయించి, గులాం రసూల్ చేపడుతున్న బ్రిటీష్ వ్యతిరేకచర్యల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆంగ్లేయాధికారులకు చేరవేయసాగాడు.

ఆంగ్లేముల పొడ గిట్టని గులాం రసూల్ ఖాన్ నైజాం సంస్థానంలో జరుగుతున్న బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాల గురించి తెలుసుకోసాగారు. ఆ క్రమంలో నిజాం రాకుమారుడు గోహర్ అలీ ఖాన్ (ముబారిజ్దౌలా) వహాబి ఉద్యమంతో ప్రభావితుడు కావడం, ఆంగ్లేయులను బద్ధశత్రువులుగా పరిగణించే వహాబీ ఉద్యమకారులతో కలసి ఆంగ్లేయులను తరిమి వేయడానికి తీసుకుంటున్న చర్యలకు గులాం రసూల్ ఖాన్ తోడుగా నిలిచారు. గోహర్ అలీ ఖాన్‌తో, ఇతర ప్రాంతాల జాగీద్దారులతో, సంస్థానాధీశులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగాయి. మక్కా షరీఫ్ నుండి కూడా గులాం రసూల్ ఖాన్‌కు సందేశాలు అందాయి. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకుల ఆధిపత్యాన్ని అంతం చేయాలని నిర్ణయించుకున్న గులాం రసూల్ ఖాన్ నిజాం రాకుమారుడు గోహర్ అలీ ఖాన్ సూచనల మేరకు తిరుగుబాటు ఏర్పాట్లను అత్యంత రహస్యంగా మరింత ముమ్మరం చేశారు. ఆ ప్రయత్నాలలో భాగంగా

బలమైన ఆంగ్లేయ శత్రువును ఎదుర్కొనేందుకు  కర్నూలు నగరంలోని కోట గోడలను, బురుజులను పూర్తిగా పటిష్టపర్చారు. బురుజు మీదకు ఆయుధ సామగ్రిని తరలించారు. అంత:పురాన్ని, నగరంలోని తోటలను, భవనాలను ఆయుధ కర్మాగారాలుగా, గిడ్డంగులుగా మార్చి భారీ ఎత్తున ఆయుధాలను సమకూర్చుకుని రహస్యంగా భద్రపర్చారు.

ఈ విషయాన్ని గులాం రసూల్ ఖాన్, గోహర్ అలీ ఖాన్ వ్యవహారాల మీద విచారణ జరిపిన కమిటీ అధ్యక్షుడు ఎడ్వర్డ్ ఆర్మ్‌స్ట్రాంగ్ బ్రిటీష్ రెసిడెంటు జనరల్  ఫ్రేజర్‌కు లేఖ రాస్తూ, '**కర్నూలు నవాబు యొక్క ఆయుధ సంపత్తి, యుద్ధానికై అతడు చేసిన సన్నాహాలు, ప్రోగుచేసిన మందుగుండు సామగ్రి వర్ణనాతీతం. నవాబు భవనంలోని తోటలు, అంత:పురాలు ఆయుధాలు మందుగుండు సామగ్రి తయారు చేసే కర్మాగారాలుగా మార్చబడ్డవి. అక్కడి రెండు కంచు శతఘ్నులు బహుశ: ప్రపంచంలోనే పెద్దవేమో? ఒకదాని వ్యాసం 26 అంగుళాలు, మరొక దానిది 23 అంగుళాలు. వీటి మందం 9 అంగుళాలు. వీటికి కావలసిన గుండ్లు కుప్పలుగా పడివున్నవి. వివిధరకాల తుపాకులు, రెండు నాళాల పిస్తోళ్ళు అంత:పురంలోను, ఇతర స్థలాలలోను నిలువచేసి ఉంచినారు. ఇటుకలతో మూసివేయబడ్డ ఒక ద్వారాన్ని తెరువగా 45 ఇత్తడి తుపాకులు కనపడ్డవి. 70, 80 సరికొత్త శకటాలను పాతి ఉంచినారు. తుపాకుల సంఖ్య 600 పైనే ఉంటుంది. ఆరేసి పౌనుల బరువుగల గుండ్లను పేల్చగల శతఘ్నులు కూడా కొన్ని ఉన్నవి...**' అని పేర్కొన్నాడు. (**హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర**, వెల్దుర్తి మాణిక్యరావు, స్వాతంత్ర్యోద్యమం చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 1992, పేజి.23-24). ఈ వివరణను బట్టి గులాం రసూల్ ఖాన్ ఏ స్థాయిలో తిరుగుబాటుకు ఏర్పాట్లు చేశారో విశదమవుతోంది.

ఈ చర్యలలో నిమగ్నమైన గులాం రసూల్ ఖాన్ ఇంటి దొంగల మీద అంతగా శ్రద్ధ చూపలేదు. తమ్ముడు ముజఫర్ ఖాన్ మామ ఇమాందార్ ఖాన్ ఆంగ్లేయ అధికారులతో మిలాఖత్ అయిన విషయాన్ని పసికట్టలేదు. ఆయన అప్రమత్తంగా లేని సమయంలో  నిజాం రాకుమారుడు గోహర్ అలీ ఖాన్, గులాం రసూల్ ఖాన్ తిరుగుబాటు కార్యకలాపాల సంబంధించిన ఖచ్చితమైన సమాచారాన్ని ఆంగ్ల అధికారులకు అందజేయగా అదికాస్తా 1939 అగస్టు 23న బ్రిటీష్ రెసిడెంటు జనరల్ ఫ్రేజర్ దృష్టికి వచ్చింది.

ఆ సమాచారం అందిన వెంటనే బ్రిటీష్ రెసిడెంటు ఫ్రేజర్ ఆఘమేఘాల మీద గులాం రసూల్ ఖాన్ మీద చర్యలకు ఆదేశాలు జారీ చేశాడు. ఆ ఆదేశాల పర్యవసానంగా టి.యల్.బ్లేన్  (TL Blane), కల్నల్ స్టీల్ (Colonel Steel) ల ఆధ్వర్యంలో విచారణ సాగింది. ఆ విచారణలో గులాం రసూల్ ఖాన్ చేసుకున్న తిరుగుబాటు ఏర్పాట్లు పూర్తి స్థాయిలో వెల్లడి కావడంలో ఈస్ట్ ఇండియా కంపెనీ బళ్ళారి సైనిక స్థావరంలోని సైన్యాధికారి కల్నల్

ఎ.బి.డైస్ (Colonel AB Dyce) కు కర్నూలు ముట్టడికి ఆదేశాలు జారీ అయ్యాయి. 1839 అక్టోబరు12న సైన్యాధికారి ఎ.బి.డైస్ నాయకత్వంలోని ఆంగ్లసైన్యాలు కర్నూలును ముట్టడించాయి. తిరుగుబాటు ప్రయత్నాలు పూర్తికాని పరిస్థితులలో అకస్మాత్తుగా వచ్చిపడిన ఆంగ్లసైన్యాల గుంపును చూసి గులాం రసూల్ ఖాన్ బలగాలు ఖంగుతిన్నాయి. కర్నూలు చేరుకున్న ఆంగ్ల సైన్యాధికారి కల్నల్ ఎ.బి.డైస్ కర్నూలు కోటను ఖాళీ చేయమని గులాం రసూల్ ఖాన్‌కు ఆదేశించాడు. ఆ ఆదేశాలను ధిక్కరించి కోటలో ఉంటూ యుద్ధం సాగిస్తే జననష్టం ఎక్కువ జరుగుతుందని గులాం రసూల్ భావించారు. జననష్టాన్ని తగ్గించేందుకు కర్నూలు కోటను ఖాళీ చేసేందుకు నిర్ణయించుకున్న ఆయన కొద్దిపాటి పరివారంతో కర్నూలు కోటకు సమీపాన గల జోహరాపురం గ్రామ ప్రాంతానికి చేరుకున్నారు.

ఈలోగా గోహర్ అలీ ఖాన్ నుండి తన ప్రయత్నాలకు మద్దతు ఇస్తున్న ఇతర ప్రాంతాల జాగీద్దార్లకు ఆయన వర్తమానం పంపారు. ఈ విషయాన్ని పసిగట్టిన ఆంగ్లేయ గూఢాచారులు ఆయనకు ముబారిజ్దౌలా నుండి గాని జాగీద్దారుల నుండి ఎటువంటి సహాయం అందకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గులాం రసూల్‌ను పూర్తిస్థాయిలో కట్టడి చేసి ఒంటరి చేయడంతో 1839 అక్టోబర్ 18న ఆయన కొద్ది మంది సహచరులతోనే ఆంగ్లసైన్యాలతో తలపడ్డారు. ఈ పోరులో ఆయన వెంటనున్న కొద్దిపాటి సైన్యం హతం కావడంతో గులాం రసూల్ ఖాన్‌ను ఆంగ్ల సైన్యాలు చుట్టుముట్టి నిర్బంధించాయి.

గులాం రసూల్ ఖాన్ కార్యకలాపాల మీద విచారణ జరిపి ఆయనను తిరుచునాపల్లి కారాగారంలో బంధించారు. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకుల మీద తిరుగు బాటుకు పెద్దఎత్తున సిద్ధమైన కర్నూలు నవాబు బ్రతికి ఉండడం ఆంగ్లేయాధికారులకు ఇష్టంలేక ఆయనను అంతం చేయడానికి కుట్రపన్నారు. నవాబు వ్యక్తిగత సేవకుడ్ని ఆశపెట్టి లోబర్చుకుని గులాం రసూల్ ఖాన్‌కు విషాహారం ఇప్పించారు. 1840 జూలై 12న గులాం రసూల్ ఖాన్ కన్నుమూశాక, ఆయన చర్చికి వెళ్ళడం సహించని ఆతని సేవకుడు నబాబును చంపివేశాడని అబద్ధాలల్లి, ఆ హత్యానేరాన్ని నవాబు సేవకుడి మీద మోపి అతనికి మరణశిక్ష విధించి తమ కుట్ర సమాచారాన్ని సమాధి చేయ ప్రయత్నించారు.

గులాం రసూల్ ఖాన్‌ను అంతం చేయడానికి పన్నిన కుట్ర బయట పడకుండా ఆంగ్లేయాధికారులు జాగ్రత్తపడినా ఆ కుట్రను కాలగమనంలో చరిత్ర బహిర్గతం చేసింది. ఈ మేరకు భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్మరణీయమైన ఖ్యాతిని గడించిన గులాం రసూల్ ఖాన్‌ను స్తుతిస్తూ, ఈనాటికి రాయలసీమ ప్రాంతంలో కర్నూలు నవాబు చారిత్రక వీరగాధను '**కందనవోలు నవాబు కథ**' గా జానపదులు పాటలు పాడుకుంటున్నారు.

◆◆◆

## పరాయి పాలకుల పెత్తనంపై తిరగబడ్డ రాచబిడ్డడు

# 4. మీర్ గోహర్ అలీ ఖాన్

(1800-1854)

**ప**రాయి పాలకుల పెత్తనాన్ని సామాన్య ప్రజలు మాత్రమే కాదు స్వాభిమానం మెండుగా గల సంస్థానాధీశులు, రాకుమారులు కూడా వ్యతిరేకించారు. సాధారణంగా సంస్థానాధీశులు పరాయి పాలకులను నెత్తిన ఎక్కించుకుని మోయడం ఆరంభించాక అటువంటి సంస్థానాధీశుల సంతతి కూడా ఆ బానిస బాటను అనుసరించటం ఆనవాయితి. ఈ ఆనవాయితిని తప్పిస్తూ తమ పెద్దలు ఆంగ్లేయ పాలకుల ఆధిపత్యానికి జో హుకుం అంటున్నప్పటికీ, ఆ మార్గాన కాకుండా, ప్రమాద ఘంటికలు వినబడుతున్నా వలస పాలకులకు వ్యతిరేకంగా పోరాటబాటను ఎన్నుకుని మున్ముందుకు సాగిన స్వతంత్ర భావాల రాచబిడ్డడు మీర్ గోహర్ అలీ ఖాన్.

మీర్ గోహర్ అలీ ఖాన్ 1800 సంవత్సరంలో హైదరాబాదుకు చెందిన అసఫ్‌జాహి వంశంలో జన్మించారు. ఆయన తండ్రి నైజాం సంస్థానాధీశుడైన మూడవ నైజాం నవాబు సికిందర్ ఝా బహుదూర్. ఆ నవాబు కుమారుడు మీర్ గోహర్ అలీ ఖాన్ (Mir Gohar Ali Khan) **ముబారిద్దౌలా** (Mubariz-ud-doulah) గా సుప్రసిద్ధులయ్యారు. చిన్నవయస్సులోనే పర్షియన్, అరబిక్, ఉర్దూ భాషలలో మంచి పాండిత్యం, ధార్మిక సాహిత్యం మీద పట్టు సంపాదించిన మీర్ గోహర్ అలీఖాన్ చిన్ననాటి నుండి ఎటువంటి భయసందేహాలు లేకుండా స్వతంత్ర భావనలను ఆచరణాత్మకంగా వ్యక్తంచేశారు.

గోహర్ అలీ ఖాన్ బాలుడిగా ఉన్నప్పుడు ఆయన తండ్రి నవాబ్ సికిందర్ ఝా తన కుమారుడి రక్షణ కోసం ఈస్ట్ ఇండియా కంపెనీ సైనిక బలగాలను నుండి రప్పించిన పహరా భటులను కుమారుడి అంతఃపురం ప్రధాన ద్వారాల వద్ద నియమించాలనుకున్నాడు. ఆంగ్ల పాలకుల భటుల రక్షణలో ఉండడం కంటే ఎటువంటి రక్షణ లేకుండా మరణించడం ఎంతో మంచిదంటూ తన ప్రాసాదం వద్ద బ్రిటీషు సైనికులను పహరాదారులుగా నియమించే తండ్రి యోచన పట్ల గోహర్ అలీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. (The Freedom Struggle In Hyderabad, Volume - I, (1800-1857), Govt. of Andhra Pradesh, Hyderabad, 1992, Page. 67) ఈ విధంగా చిన్న వయస్సులోనే పరాయి పాలకుల పట్ల తీవ్ర అయిష్టతను, వ్యతిరేకతను వ్యక్తంచేసిన గోహర్ అలీ చివరి వరకు ఆ పంథాలో ముందుకు సాగి చరిత్ర సృష్టించారు.

స్వదేశీ సంస్థానంలో పెత్తనం సాగిస్తున్న బ్రిటీషు పాలకుల పట్ల అణువణువున వ్యతిరేకత నింపుకున్న గోహర్ అలీ ఖాన్ తన తండ్రి నవాబు సికిందర్ ఝా బ్రతికి ఉండగానే ఆ వ్యతిరేకతను బహిరంగంగా ప్రదర్శించి తొలిసారిగా తండ్రి ఆగ్రహానికి గురయ్యారు. ఆ దిశగా 1815 అగస్టు–సెప్టెంబరు మాసాలలో జరిగిన సంఘటనలు, ఆ సంఘటనలలో గోహర్ అలీ ఖాన్ పాత్ర ఆయనకు ఐదు సంవత్సరాల నిర్బంధానికి గురిచేశాయి.

1815 ఆగస్టు ప్రాంతంలో గోహర్ అలీ ఖాన్ సేవకులలో ఒకరైన షీరీన్ (Sheereen) బ్రిటీషు రెసిడెంటు నివాస ప్రాంతానికి చెందిన ఓ దర్జీవానితో తగాదా పడింది. ఆ తగాదా ప్రాణాంతకం కావడంతో ఆమె తన యజమాని గోహర్ అలీ ఖాన్ శరణుజొచ్చింది. సేవకురాలు షీరీన్ గోడు విన్న గోహర్ రెసిడెంటు బజారులో గల దర్జీవానిని అరెస్టు చేయించి తన ప్రాసాదానికి రప్పించారు. ఆ దర్జీ బ్రిటీషు రెసిడెంటు ఇలాకాలోని వ్యక్తి కావడంతో ఆంగ్లేయాధికారి రెసిడెంట్ రస్సెల్ (Russel) గోహర్ అలీ ఖాన్ చర్యకు ఆగ్రహిస్తూ, ఈ ఉదంతాన్ని నైజాం నవాబు దృష్టికి తీసుకెళ్ళాడు. ఆ విషయమై తగు చర్య తీసుకోగలమని ప్రధాన మంత్రి మునీరుల్ ముల్క్ సర్దిచెప్పారు. ఆ సర్దుబాటుతో సంతృప్తి చెందని రెసిడెంట్ స్వయంగా ఈ కేసు పరిష్కరించాలనుకున్నాడు.

ఆ మరుక్షణమే రెండు ఫిరంగులతోపాటు వెయ్యి మంది సైనికులు గల సైనికుల దళం (The Russel Brigade) కెప్టన్ హరే (Captain Hare) నాయకత్వంలో నిజాం రాకుమారుడు గోహర్ అలీ ఖాన్ ప్రాసాదం మీదకు పంపారు. ఆ చర్యతో ఆగ్రహించిన గోహర్ అలీ ఖాన్ తన బలగాల మీదకు వచ్చిన బ్రిటీషు అధికారి నేతృత్వంలోని సైనికులతో తలపడ్డారు. కాల్పులు జరిగాయి. ఫిరంగులు ప్రేలాయి. ఆ సంఘర్షణలో బ్రిటీషు సైనికాధికారి లెఫ్టినెంట్ దుర్బే (Lt. Durby) మరణించగా, కంపెనీ సైనికులను అడ్డుకున్న గోహర్ అలీ ఖాన్ మనుషులు ఇరవై మంది మృతిచెందారు.

ఆ సంఘటనతో మరింత ఆగ్రహించిన రెసిడెంటు రస్సెల్ నిజాం రాకుమారుడు గోహర్ అలీ ఖాన్ మీదకు మరింత సైన్యాన్ని పంపించబోయాడు. ఆ విషయం తీవ్రతను తెలుసుకున్న నిజాం నవాబు స్వయంగా జోక్యం చేసుకుని గోహర్ అలీ ఖాన్‌కు నచ్చజెప్పి, ఆయనను నగరంలోని ప్రాసాదం నుండి తప్పించి గోల్కొండ కోటకు పంపించాడు. ఈ విధంగా బ్రిటీషు వ్యతిరేకత వ్యక్తంచేసిన గోహర్ అలీ ఖాన్ గోల్కొండ కోటలో అయిదు సంవత్సరాల పాటు నిర్బంధానికి గురయ్యారు.

1820లో గోహర్ అలీ ఖాన్‌ను హైదరాబాదు నగరంలోకి పునఃప్రవేశం చేశారు (The Freedom Struggle In Hyderabad : Pages. 67 and 120-121) పరాయిపాలకుల తృప్తికోసం తనను ఐదు ఏండ్లపాటు నిర్బంధించడం గోహర్ అలీకి ఆగ్రహం కలిగించింది. పర్యవసానంగా స్వజనం మీద సాగుతున్న ఆంగ్లేయుల ఆధిపత్యానికి, పెత్తనానికి శాశ్వతంగా గండికొట్టాలని ఆయన నిర్ణయానికి వచ్చారు. ఆ దిశగా ప్రయత్నాలను ఆరంభించి తన రాజప్రాసాదాన్ని బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాలకు కేంద్రస్థానంగా మార్చుకున్నారు.

1828లో గోహర్ అలీ ఖాన్ తండ్రి, నైజాం నవాబు సికిందర్ ఝా కన్నుమూశారు. గోహర్ అలీ ఖాన్ సోదరుడు నాసిరుద్దౌలా (Nasir-ud-Dowlah) నైజాం నవాబుగా బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత నైజాం సంస్థానంలో సరికొత్త రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రతినిధి, బ్రిటీషు రెసిరెంటుగా నూతన ఆధికారి జనరల్ ఫ్రేజర్ (General Fraser) బాధ్యతలు స్వీకరించాడు. నూతనంగా నైజాం చేరుకున్న ఆంగ్లేయాధికారి నవాబు నాసిరుద్దౌలా మీద మరింతగా పట్టు బిగించాడు. ఆ పరిణామాలను సహజంగా గోహర్ అలీ ఖాన్ సహించలేకపోయారు.

అ సమయంలో ఆంగ్లేయ పాలకుటంటే ఏమాత్రం సరిపడని వహాబీ ఉద్యంతో, ఉద్యమకారులతో గోహర్‌అలీ ఖాన్‌కు పరిచయం ఏర్పడింది. ఆనాడు వహాబీ ఉద్యమ నిర్మాత సయ్యద్ అహమ్మద్ బరేల్వి వహాబీ ఉద్యమం లక్ష్యాలను వివరిస్తూ, వలస పాలకులకు వ్యతిరేకంగా పోరుబాట నడవాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతూ గోహర్ అలీ ఖాన్ తండ్రి, నిజాం నవాబు సికిందర్ ఝాకు కూడా లేఖలు రాశారు. ఆ లేఖల ప్రభావం ఆనాటి నిజాం నవాబు మీద ఏమాత్రం లేకున్నా, చిన్ననాటి నుండి ఆంగ్లేయుల పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ వచ్చిన గోహర్ అలీ ఖాన్ మీద మంచి ప్రభావం చూపడంతో గోహర్ అలీ ఖాన్ సహజంగా వహాబీ ఉద్యమం వైపు మొగ్గుచూపారు.

ఆంగ్లేయ పాలకులతో నైజాంకు ముప్పుతప్పదని భావించిన గోహర్ ఖాన్ స్వయంగా అరబ్బు, ఆఫ్గాన్ జాతి సైనికులను సమకూర్చుకుంటూ, నగరంలోని తన ప్రాసాదాన్ని దుర్భేద్యమైన కోటగా మార్చుకున్నారు. ఆంగ్లేయ పాలకుల ఆటకట్టించేందుకు సన్నద్ధమౌతూ

1829లో ఆ కార్యక్రమాలను మరింత ముమ్మరం చేశారు. ఈ మేరకు ఏర్పడుతున్న ప్రతికూల వాతావరణాన్ని పసిగట్టిన ఆంగ్లేయ అధికారులు గోహర్ అలీ కార్యకలాపాల గురించి నైజాం నవాబుకు తెలిపారు. తమ్ముడు గోహర్ అలీ ఖాన్ మీద చర్యలు తీసుకోడానికి నవాబు సంశయించ సాగాడు. చివరకు నయానా-భయాన నవాబుకు నచ్చచెప్పి గోహర్ అలీని అదుపులోకి తెచ్చేందుకు కల్నల్ స్టివార్ట్ (Col. Stewart) నాయకత్వంలో హైదరాబాదు సైనిక పటాలం 1931 జనవరి 6న నగరం చేరుకుంది.

ఈసారి బ్రిటీషు బలగాలను గోహర్ అలీ ఖాన్ బలగాలు అడ్డుకోలేదు. ఆ అవకాశంతో ఆంగ్లేయుల బలగాలు ఆధిపత్యం సాధించాయి. ఆనాడు గోహర్ అలీ బలగాలు ఆంగ్లేయ బలగాలను అడ్డుకుని ఉన్నట్టయితే తమకు పరాజయం తప్పేదికాదని, కల్నల్ మెడోస్ టైలర్ (Col. Meadows Taylor) పేర్కొన్నాడు. ఆ ఆంగ్లేయాధికారి రాసిన The Story of My Life అను గ్రంథంలో ఈ సంఘటనను పూసగుచ్చినట్టు వివరిస్తూ, **ఆ సన్నటి సందులు-గొందులలో గోహర్ అలీ ఖాన్ మనుషుల నుండి చిన్నపాటి ప్రతిఘటన ఎదురైై ఉన్నా చాలా నష్టం జరిగేది. సంతోషం ఏమిటంటే ఒక్క తుపాకి గుండు కూడా పేల్చలేదు.**, అని పేర్కొన్నాడు. (The Freedom Struggle In Hyderabad, Vol. I, Page. 121)

అనంతరం ఆంగ్లేయాధికారి కల్నల్ స్టివార్ట్ నేతృత్వంలోని సైనిక పటాలం 1830 ఏప్రిల్ 19న గోహర్ అలీఖాన్ ను గొల్కొండకోటలో నిర్బంధించింది. ఈ విధంగా మరోసారి గొల్కొండ కోటను చేరుకున్న గోహర్ అలీ ఖాన్ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేక భావజాలాన్ని కోటలోని సైనికదళాలకు నూరిపోసి వారిని తనకు అనుకూలంగా మలచుకున్నారు. ఈ మేరకు కొంత బలపడిన తరువాత ఆంగ్లేయులకు వ్యతిరేకంగా నిజాం నవాబు నాసిరుద్దౌలా మీద ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించసాగారు.

ఆ సమయంలో, గొల్కొండ కోటలో ఉన్న నిజాం ఖజానా నుండి కొంత సొమ్మును తీసుకొచ్చేందుకు నిజాం నవాబు తన కోశాధికారిని పంపాడు. ఖజానా తరలించడాన్ని ససేమిరా అంటూ గోహర్ అలీ ఖాన్ తన బలగాలతో అడ్డుకున్నాడు. ఆ సంఘటనతో నగరంలో దిగ్భ్రమకర వాతావరణం ఏర్పడింది. ఈ నిరాకరణను సాకుగా చేసుకుని నిజాం నవాబుకు చెందిన అరబ్బు, రోహిల్లా, సిక్కు, ఫ్రెంచి సైనికులు సుమారు ఐదు వేల మంది గోల్కొండను చుట్టుముట్టారు. నిజాం నవాబు ఆంగ్లేయులను ఆశ్రయించాడు. ఆ సమయంలో నిజాం నవాబు ఎటువంటి చర్యకు పాల్పడినా కుటుంబపరంగా పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్న భయంతో గోహర్ అలీఖాన్‌కు నచ్చచెప్పేందుకు Col. Meadows Taylor నిశ్చయించాడు. ఈ కార్యక్రమాన్ని నిజాం నవాబు కోరిక, రెసిడెంటు ఆదేశాల మేరకు ఆంగ్లేయ సైన్యాధికారి చేపట్టాడు. ఆ దిశగా పాచికలు కదిపిన ఆ ఆంగ్లేయాధికారి చివరకు

గోహర్ అలీ ఖాన్‌కు నచ్చచెప్పాడు. ఈ కార్యక్రమాన్ని నిజాం నవాబు అభీష్టం, రెసిడెంటు ఆదేశాల మేరకు గోహర్ అలీ ఖాన్ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న మున్షీని వలలో వేసుకుని అతని ద్వారా గోహర్ అలీ ఖాన్‌ను ప్రభావితం చేసి సమస్యను నిజాం నవాబుకు ఆనుకూలంగా పరిష్కరించాడు. ఆ సమస్య అప్పటికి సమసిపోయినా 1838 నాటికి గోహర్ సాగిస్తున్న బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాలు పరాకాష్టకు చేరుకున్నాయి.

ఆపాటికి వహబీ ఉద్యమ నేత మౌల్వీ సయ్యద్ అహమ్మద్ బరేల్వి అనుచరులైన మౌల్వీ ఇనాయత్ అలీ, మౌల్వీ సలీంలు దక్కన్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ వహాబీ యోధులు మద్రాసు, బెంగళూరు, కర్నూలు, బొంబాయి తదితర ప్రాంతాలలో పర్యటించి ప్రజలకు వహాబీ ఉద్యమం గురించి పరిచయం చేస్తూ, బ్రిటీష్ వ్యతిరేకతను బాగా నూరి పోయసాగారు. ఆ నాయకుల ప్రేరణ, ప్రోత్సాహంతో మౌల్వీ సయ్యద్ అహమ్మద్ బరేల్వి ప్రతినిధిగా గోహర్ అలీ ఖాన్ ఉద్యమ కార్యక్రమాల నిర్వహణకు పూనుకున్నారు.

దక్కన్ ప్రాంతానికి వహబీ ఉద్యమం నాయకునిగా గోహర్ అలీ ఖాన్‌ను గుర్తిస్తు 'రైసుల్ ముస్లిమీన్' (Ra'isul Muslimin), 'ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్' (Oomer Bin Abboodl Azeez ) అను హోదాలను ఆయనకు వహాబీ ఉద్యమనేతలు ప్రసాదించారు. గోహర్ అలీ ఖాన్ ఆ హోదాలలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం చేసేందుకు కలసి రమ్మని కోరుతూ నైజాం సంస్థానంలోని ప్రముఖులకు,ఇతర ప్రాంతాల ప్రముఖులకు లేఖలు పంపడం ఆరంభించారు. ఈ విషయాలను ఆయన నాయకత్వంలో సాగిన **సర్కారు వ్యతిరేక కార్యకలాపాల** మీద విచారణ జరిపిన **విచారణ సంఘం** (Commission of Enquiry) వివరంగా తన నివేదికలో వెల్లడించింది. (The Freedom Struggle In Hyderabad, VolI, Page. 28)

ఆంగ్లేయుల పెత్తనాన్ని మట్టిపాలుచేయడానికి సంకల్పించిన గోహర్ అలీ ఖాన్ ప్రజల అండదండల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇస్లాం ధార్మిక పండితులతోపాటుగా, మంచి ఉపన్యాసకులు, రచయితలను కూడా ప్రచార కార్యక్రమానికి వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమాలలో మౌల్వీ సలీం, లాల్ ఖాన్ అలియాస్ అబ్దుల్ హాది, మౌల్వీ సయ్యద్ అబ్బాస్, ఖ్వాజి ముహమ్మద్ అసిఫ్, ఇలాహి బక్ష్ అలియాస్ అఫ్జల్ ఖాన్, అబ్దుర్ రజాఖ్, మౌలానా పీర్ ముహమ్మద్, ముహమ్మద్ ఫైజుల్లా, మున్షీ ఫక్రుద్దీన్ అలియాస్ అబ్దుర్ రహమాన్ ఖాన్, మౌల్వీ సయ్యద్ ఖాశింలు సహకారం అందించారు. ఈ యోధులు గోహర్ అలీ ఖాన్ ప్రతినిధులుగా కర్నూలు, బొంబాయి, ఉదయగిరి, నాగపూర్, జోధ్‌పూర్, గ్వాలియర్, కలకత్తా, బందా, సతారా, మద్రాసు, సింధ్, టోంక్, మైసూరు సంస్థానాధీశుల వద్దకు, ఆ సంస్థానాలలోని ప్రజల వద్దకు గోహర్ సందేశాన్ని తీసుకెళ్ళారు. ఆయా ప్రాంతాల ప్రజలు, ప్రముఖులను బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలకు ఉద్యమించాల్సిందిగా కోరారు.

గోహర్ అలీ ఖాన్ నైజాం సంస్థానంలో మాత్రమే కాకుండా నైజాం సంస్థానం బయట బ్రిటీష్ వ్యతిరేకతను మూటగట్టేందుకు అవిశ్రాంతంగా శ్రమించారు. గోహర్ పట్టుదల ఆయన అనుచరుల, ఆయనకు మద్దతు తెలుపుతున్న ధార్మిక పండితుల, వహాబీ ఉద్యమకారుల నిర్విరామ కృషి కారణంగా సుమారు లక్షమంది యోధులు గల బ్రిటీష్ వ్యతిరేక పోరాటయోధుల పటాలం హైదరాబాదు వెలుపల ఏర్పడిదని, ఆంగ్లేయాధికారులు ఏర్పాటు చేసిన విచారణ సంఘం ఎదుట గోహర్అలీ ఖాన్ అనుచరుడు గులాం అహమ్మద్ వెల్లడించాడు. (The Freedom Struggle In Hyderabad,Vol. I,Page.141)

గోహర్ అలీ ఖాన్ ప్రయత్నాలు చాలా వరకు ధార్మిక పర్యటనల ముసుగులో జరిగాయి. ఈ పర్యటనలకు, ప్రయత్నాలకు అయ్యే యావత్తు ఖర్చు మొత్తాన్ని గోహర్ అలీ తన ఖజానా నుండి భరించారు. నైజాం సంస్థానం నుండి బొంబాయి లాంటి సుదీర్ఘ ప్రాంతాలకు కూడా అనుచరులను పంపి అక్కడి ప్రముఖుల, ప్రజల అనుకూలత సంపాదించేందుకు శత విధాల ప్రయత్నాలు చేయసాగారు. ఈ ప్రయత్నాల ఫలితంగా హైదరాబాద్ నగరంలో సుమారు 20 వేల మంది యోధులను గోహర్ అలీ ఖాన్ సమకూర్చుకున్నారని ఆంగ్లేయాధికారులు బ్రిటీష్ రెసిడెంటుకు తెలిపారు.

ఆ సమయంలో బ్రిటీష్ వారు అఫ్ఘన్ యుద్ధాలలో నిమగ్నమై ఉన్నారు. రష్యన్లు మధ్య ఆసియా ద్వారా భారతదేశం వైపుకు దూసుకవస్తున్నారని వదంతులు బలంగా ఉన్నాయి. బ్రిటీష్ బలగాలకు వ్యతిరేకంగా రష్యన్ బలగాలు తమతో చేతులు కలుపగలవని భావించిన వహాబీలు ఇనుమడించిన ఉత్సాహంతో బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాలను మరింత ముమ్మరం చేయడంతో వహాబీల కార్యక్రమాలు బాగా ఊపందుకున్నాయి. (నిజాం-బ్రిటీష్ సంబంధాలు, డాక్టర్ సరోజినీ రెగాని, పేజి. 273)

ఈ ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నా, తగినన్ని ఆధారాలు లేకపోవడంతో ఆంగ్లేయాధికారులు నిజాం నవాబుకు ఫిర్యాదు చేయడానికి సాహసించలేదు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాట కార్యక్రమాన్ని తీసుకోవాలన్న గోహర్ అలీ ఖాన్ నిర్ణయానుసారంగా కర్నూలు నవాబు గులాం రసూల్ ఖాన్ ఆయనకు అన్ని విధాల తోడ్పాటు ఇవ్వసాగారు. ఈ క్రమంలో గోహర్ అలీ ఖాన్‌కు గులాం రసూల్ ఖాన్‌కు మధ్యన ఉత్తరప్రత్యుత్తరాలు ముమ్మరంగా సాగాయి. గులాం రసూల్ ఖాన్ పోరాటానికి అవసరమయ్యే ఆయుధాలను పెద్దఎత్తున సమీకరించి, తయారు చేయించి కర్నూలులోని తన కోటలో, పరిసర ప్రాంతాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రహస్య ప్రదేశాలలో దాచిపెట్టారు.

ఈ విధంగా నైజాం సంస్థానం ఇంటా బయటా బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నాయి. ఆ సమయంలో నెల్లూరు మేజిస్ట్రేటు స్టోన్ హౌజ్ బ్రిటీష్ రెసిడెంటు జనరల్

ఫ్రేజర్‌కు వహాబీల సాగిస్తున్న బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాల గురించి తెలుపుతూ అందులో గోహర్ అలీ ఖాన్ నిర్వహిస్తు అత్యంత కీలక పాత్రను ప్రస్తావించాడు. ఆ సమాచారంతో జనరల్ ఫ్రేజర్ అప్రమత్తుడయ్యాడు. ఆ దిశగా ఆ ఆంగ్లేయుడు దృష్టి సారించి గూఢచర్యాన్ని మరింత పకడ్బందిగా నిర్వహించాడు. ఆ ప్రయత్నంలో భాగంగా గోహర్ అలీ ఖాన్ సాగిస్తున్న కార్యకలాపాలను పూర్తిగా పసికట్టిన జనర్ ఫ్రేజర్ లాంటి ఆంగ్లేయాధికారులు ఆ విషయాలను ఈస్ట్ ఇండియా కంపెనీ ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ వచ్చారు. ఆ క్రమంలో నైజాం నవాబుకు కూడా గోహర్ అలీ ఖాన్ ప్రయత్నాలను ఎరుకపర్చుతూ, బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాలను నిజాం వ్యతిరేక కార్యకలాపాలుగా వర్ణిస్తూ, నిజాం నవాబుకు అది ప్రమాదకరమని వక్రీకరించి వివరిస్తూ గోహర్ అలీ ఆట కట్టించేందుకు మరిన్ని సాక్ష్యాధారాలు, నైజాం నవాబు సానుకూలత కోసం ఎదురు చూడసాగారు.

ఆ నిరంతర ప్రయత్నాలలో భాగంగా నిజాం నవాబు సన్నిహితులైన అధికారులకు, మంత్రులకు ఆంగ్లేయాధికారులు గోహర్ అలీ ఖాన్ బ్రిటీష్ వ్యతిరేక ప్రయత్నాల గురించి తెలియజేస్తూ ఆయన మీద కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని నైజాం నవాబుకు తెలియపర్చమని కోరసాగారు. గోహర్ అలీ ఖాన్, నిజాం నవాబు నాసిరుద్దౌలా సోదరులు కనుక ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా నవాబు ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్న భయంతో ఎవ్వరూ సాహసించలేదు. చివరకు నిజాం ఆంతరంగికుడైన మున్షీ రషీదుల్ ముల్క్ ద్వారా గోహర్ అలీ ఖాన్ కార్యకలాపాల గురించి నైజాం నవాబుకు చేరవేశాడు.

ఆ తరుణంలో కర్నూలు నవాబు గులాం రసూల్ ఖాన్ సాగిస్తున్న బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాల సమాచారాన్ని గూఢాచారుల ద్వారా రాబట్టుకున్న ఆంగ్లేయాధికారులు కర్నూలు వ్యవహారాలతో గోహర్ అలీ ఖాన్‌కు గల సంబంధాలను స్థిరపర్చగల సాక్షులను సంపాదించ గలిగారు. గులాం రసూల్ ఖాన్‌ను పదవీచ్యుతుని చేసి గద్దెనెక్కాలని ఆశిస్తున్న ఆయన సోదరులు అందించిన సమాచారం, సాక్ష్యాలతో ఆంగ్లేయాధికారులు ప్రమాదకర వివరాలను నిజాం నవాబుకు చేరవేయగలిగారు. కర్నూలు నవాబు మాత్రమే కాకుండా పలువురు ఇతర సంస్థానాధీశులు గోహర్ అలీ ఖాన్‌కు చేదోడుగా నిలవడానికి సిద్ధంగా ఉన్న విషయం ధూందాస్ అను సిక్కు గూఢచారి ద్వారా జనరల్ ఫ్రేజర్‌కు అందింది.

ఈ సమాచారమంతా తెలుసుకున్న నిజాం నవాబు జనరల్ ఫ్రేజర్‌ను పిలిపించాడు. ఆంగ్లేయాధికారి, నిజాం నవాబు, మున్షీ చందూలాల్ కలసి పరిస్థితులను సమీక్షించి గోహర్ అలీ ఖాన్‌ను మరోమారు గోల్కొండ కోటలో బందీగా ఉంచడానికి నిర్ణయించారు (నిజాం–బ్రిటీష్ సంబంధాలు, డాక్టర్ సరోజినీ రెగాని,పేజి. 273). అంతటితో ఊరుకోకుండా ఆంగ్లేయ అధికారులు, నైజాం సంస్థానంలోని నిజాం అధికారులు అంతా కలసి నిజాం మీద తీవ్ర

ఒత్తిడి తెచ్చారు. ఆ ఒత్తిడి పర్యవసానంగా గోహర్ అలీ ఖాన్‌ను నిర్బంధించడానికి నిజాం నవాబు నాసిరుద్దౌలా అధికారులకు ఆదేశాలు జారీచేశాడు. ఆ ఆజ్ఞల మేరకు నిజాం సైన్యాలు, ఆంగ్ల సైన్యాలతో కలసి గోహర్ అలీ ఖాన్ ఇంటిని చుట్టుముట్టి రాకుమారుడ్ని నిర్బంధించి గట్టి బందోబస్తుతో నగరం నుండి గోల్కొండ కోటకు చేర్చాయి.

ఆ విధంగా గోహర్ అలీ ఖాన్ నిర్బంధంలోకి తీసుకున్నాక, ఆయన కార్యకలాపాల మీద పూర్తిస్థాయి వివరాలను సేకరించేందుకు జనరల్ ఫ్రేజర్ ఒక విచారణ సంఘాన్ని ఏర్పాటు చేశాడు. ఈస్ట్ ఇండియా కంపెనీ పక్షాన ముగ్గురు అధికారులు, నిజాం ప్రభుత్వం పక్షాన ఎజాజుద్దౌలా, ఖుర్షీద్ జంగ్, బేనజీర్ జంగ్‌లను విచారణసంఘంలో చేర్చారు. ఈ విచారణ సంఘం 1839 జూన్ 28 నుండి 1840 మార్చి వరకు విచారణ జరిపింది. గోహర్ అలీ ఖాన్, ఆయన అనుచరులను దోషులుగా నిర్ణయిస్తూ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులకు విచారణ సంఘం తన నివేదిక అందించింది. ఆ నివేదిక ఆధారంగా 1840 మేలో గోహర్ అలీ ఖాన్, ఆయన అనుచరులను అరెస్టు చేశారు.

ఆ తరువాత గోహర్ అలీ ఖాన్ అనుచరుల మీద కూడా విచారణ జరిపిన ఆంగ్లేయ-నిజాం ప్రభుత్వం వారందర్ని దోషులుగా నిర్ధారిస్తూ కఠిన శిక్షలు విధించింది. ఈ శిక్షలు ఆనాడు కడు విమర్శలకు గురయ్యాయి. భయానక నేరాలు చేసిన వారికి కూడా క్షమాబిక్ష పెట్టిన జనరల్ ఫ్రేజర్ వలసపాలకుల అధిపత్యాన్ని సహించని నిజాం యోధుల పట్ల అత్యంత క్రూరంగా వ్యహరించడాన్ని బట్టి కంపెనీ పెత్తనానికి ఈ యోధులు ఎంతటి ముప్పుతెచ్చే ప్రయత్నం చేశారో, ఈ ఘట్టాలు నైజాం సంస్థానం చరిత్రలో ఎంతటి ప్రాధాన్యతను సంతరించుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ విధంగా నిజాం సంస్థానంలో సాగిన బ్రిటీష్ వ్యతిరేకపోరాటం 1854 జూన్ 25న నిజాం రాకుమారుడు మీర్ గోహర్ అలీ ఖాన్ (ముబారిజుద్దౌలా) చివరిశ్వాస విడవడంతో తాత్కాలికంగా ముగిసింది.

◆◆◆

'.వీర సిపాయిల్లారా ! ఇంతకు ముందు రాజరికాల్లోని మీ సాహసకృత్యాలు ఇప్పటకీ భద్రంగా ఉన్నాయి. మహాభారత కాలంలో భీముడు, అర్జునుడు మీతో ఉన్నారు. ముస్లింలలో అమీర్ తౌమూరు, చంఘీస్ ఖాన్, హలాఖు ఖాన్‌ల గొప్ప సైన్యసంపత్తి జ్ఞప్తికి తెస్తున్నాం...ప్రజలకు వీరంతా మార్గదర్శకులే. ఇదేవిధంగా మన స్వాతంత్ర్య సంగ్రామం కూడా చరిత్రలో లిఖించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా మన వీరోచిత గాథలు చరిత్రలో శాశ్వతంగా నిలచిపోతాయి. మీ వీరత్వం ముందు ఫిరంగులు ఏపాటివి ? స్వాతంత్ర్య సముపార్జన కోసం విజృంభించండి...' **- మౌలానా బాఖర్**



## బ్రిటీష్ రెసిడెన్సీపై దాడిచేసిన పోరుబిడ్డల నేత

# 5. పఠాన్ తుర్రేబాజ్ ఖాన్

**(- 1859)**

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ జ్వాలలు ఉత్తర భారతదేశంలో రగిలినప్పటికీ, అవి అక్కడికే పరిమితం కాలేదు. బానిస బంధనాల నుండి మాతృభూమిని విముక్తం చేయాలని ప్రజానీకంలో పెల్లుబికిన బలమైన కాంక్షకు జాతి, మతం, కులం, భాషలు, ఆచార సాంప్రదాయాలు, ప్రాంతాలు అడ్డుగోడలు కాలేకపోయాయి. ఆయా ప్రాంతాలలోని బ్రిటీషర్ల తొత్తులైన రాజులు, నవాబులు, సంస్థానాధీశులు కూడా తిరుగుబాటును నిలువరించలేక పోయారు. ఉప్పెనలా ఉవ్వెత్తున ఎగిసిన తిరుగుబాటును ఆపడం ఎవరి తరం కాలేదు. చివరకు ఉరి కొయ్యలు, చెరసాలలు కూడా స్వేచ్ఛాపిపాసువులను ఆపలేక పోయాయి.

ఆధునిక ఆయుధాలు కలిగి, అపారమైన సైనిక బలగాలున్న బ్రిటీష్ పాలకులను ఎదుర్కోవడం ఆత్మహత్యాసదృశ్యం కాగలదని స్పష్టంగా తెలుసు. పోరుబాటలో మరణం తథ్యమన్న చేదు నిజం తెలిసి కూడా పరాయిపాలకులను తరిమి కొట్టేందుకు నడుం కట్టారు. ఆయుధం చేతపట్టి కదన రంగాన అరివీర భయంకరులై పోరాడి అమరులయ్యారు. ఆ కోవకు చెందిన యోధులలో పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ ఒకరు.

పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ పరాక్రమాలకు పెట్టింది పేరైన రొహిల్లా సైనిక పటాలానికి చెందిన నాయకుడు. ప్రఖ్యాతి చెందిన అరబ్బులు, రొహిల్లాలు గల సైనిక దళానికి నాయకత్వం

వహించిన తుర్రేబాజ్ ఖాన్, హైదరాబాద్ నివాసి పఠాన్ రుస్తుం ఖాన్ కుమారుడు. ఆయన బ్రిటీష్ సైన్యంలో చేరి ఔరంగాబాదు బ్రిటీష్ కంటోన్మెంటులో జమేదారుగా పనిచేశారు.

భారత దేశమంతటా తిరుగుబాటు బావుటాలు ఆకాశవీధుల్లో రెపరెలాడుతున్న రోజులవి. ఆ రోజుల్లో ధార్మిక పెద్దలు కూడా బ్రిటీష్ పాలకుల నుండి మాతృగడ్డను విముక్తి చేయమని యవతీ యువకులను, భారతీయ సైనికులను, స్వదేశీ పాలకులను ప్రోత్సహిస్తున్న వాతావరణం. ఆ సమయంలో బానిసత్వం నుండి విముక్తికై పోరాడమని మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ తుర్రేబాజ్ ఖాన్‌కు ఉద్బోధించారు. ఆ ధార్మిక పెద్దల ప్రభావంతో ఫిరంగీలను హతమార్చమంటూ, హైదరాబాద్ నగరంలోని గోడల మీద ప్రకటనలు వెలువడ్డాయి.

ఆ వాతావరణానికి ప్రభావితులైన కొందరు నైజాం సంస్థానం పరగణాలోని బ్రిటీషు అధికారులను కాల్చివేశారు. ఈ విషయమై మాట్లాడేందుకు నిజాం అనుమతి కోరిన రొహిల్లాలను ఆయన బ్రిటీష్ అధికారులకు అప్పగించాడు. ఈ చర్యకు ఆగ్రహించిన మౌల్వీలు ధర్యపోరాటానికి పిలుపు నిచ్చారు. ఆ పిలుపును అందుకున్న పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ మౌల్వీ అల్లావుద్దీన్ సహకారంతో బ్రిటీష్ ఆధిపత్యానికి నిలయమైన **హైదరాబాద్ రెసిడెన్సీ** మీద ఐదువందల మంది సాహసికులతో 1857 జూలై 17న దాడి చేశారు. ఈ దాడిలో పలువురు సహచరులను కోల్పోయిన ఖాన్, బ్రిటీష్-నిజాం బలగాలకు 1857 జూలై 22న పట్టుబడ్డాడు. తిరుగుబాటుకు నాయకత్వం వహించి ప్రజలను రెచ్చగొడుతున్నాడన్న నేరారోపణ మీద ఆయనకు ద్వీపాంతరవాస శిక్షను విధించి, ఆయన యావదాస్తిని బ్రిటీష్ పాలకులు స్వాధీనం చేసుకున్నారు. తుర్రేబాజ్ ఖాన్‌ను బందిఖానాలో నిర్బంధించారు.

బ్రిటీష్ పాలకులు విధించిన ఆ శిక్ష అమలు జరిగేలోగా సాహసవంతుడైన ఖాన్ తనకు కాపలాగా పెట్టిన సెంట్రీలలో కూడా మాత్రుభూమి పట్ల గౌరవాభిమానాలను ప్రోదిచేసి 1859 జనవరి 18న జైలు నుండి తప్పించుకున్నారు. ఆయన తప్పించుకునే సరికి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా ఖ్యాతిగాంచిన తిరుగుబాట్లను బ్రిటీష్ పాలకులు అణచివేశారు. అయినప్పటికి తిరుగుబాటు నాటి స్ఫూర్తిని గుండెల నిండా నింపుకుని ఖాన్ పోరు కొన సాగించేందుకు ఆయత్తమయ్యారు. అది పసికట్టిన నిజాం ప్రభుత్వం తుర్రేబాజ్ ఖాన్‌ను సజీవంగా గాని నిర్జీవంగా గాని పట్టితెచ్చిన వారికి, 1859 జనవరి 19న అయిదు వేల రూపాయల నజరానను ప్రకటించింది. ( 'A reward of Rs.5000/- was proclaimed by the Nizam's Government on 19-1-1859 for his arrest ' - Who's who of Freedom Struggle In Andhra Pradesh, Vol.1, Ed., by Dr.Sarojini Regani, AP Govt. Publications 1978, P. 535).

ఆనాటి కాలంలో ఐదు వేల రూపాయలు చాలా విలువైన నగదు నజరానా. అంతటి నజరానాను తుర్రేబాజ్ ఖాన్ తలకు ఖరీదు కట్టారంటే, పాలకులకు ఆయన ఎంతగా సింహస్వప్నం అయ్యాడో ఊహించవచ్చు.



ఈ ప్రకటనతో అప్రమత్తుడై రహస్యంగా తిరుగుతూ, బ్రిటీష్ సేనలపై తిరిగి దాడులకు తుర్రేబాజ్ ఖాన్ శతవిధాల ప్రయత్నాలు చేయసాగారు. ఖైదు నుండి తప్పించుకున్న ఖాన్‌ను ఎలాగైనా పట్టుకుని అంతం చేయాలన్న పట్టుదలతో బ్రిటీషు సైన్యాలు–నిజాం సేనలు నిఘాను తీవ్రతరం చేశాయి.

చివరకు నిజాం నవాబు ప్రకటించిన నగదు బహుమతికి ఆశపడిన కుర్‌బాన్ అలీ అను నమ్మకద్రోహి తుర్రేబాజ్ ఖాన్ ఆచూకిని నిజాం సైనికులకు చేరవేశాడు. ఆ సమాచారంతో తుర్రేబాజ్ ఖాన్ మీద నిఘాను పెంచిన బ్రిటీష్ బలగాలకు 1859 జనవరి 24న మెదక్ జిల్లా పరిసర ప్రాంతాలలోని తూఫ్రాన్ గ్రామం వద్ద ఆయన ఉన్నాడని ఉప్పు అందింది. ఆ సమాచారం తో ఆఘమేఘాల మీద తుఫ్రాన్ చేరుకున్న సైనికులు గ్రామం మీద విరుచుకు పడ్డారు.

బ్రిటీష్ సైన్యాలు, నిజాం బలగాలు తుర్రేబాజ్ ఖాన్ ఉంటున్న ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. గతంలో చిట్టెలుకలా సైనిక బలగాల కళ్ళల్లో మన్నుకొట్టి తప్పించుకున్న ఆయనకు ఈసారి అది సాధ్యం కాలేదు. విజయమో–వీరస్వర్గమో తేల్చు కోవాల్సిన పరిస్థితి. చీమలదండులా వచ్చిపడిన శతృ సైనికులను ఒంటరిగా నిలువరించడం తుర్రేబాజ్ ఖాన్‌కు అసాధ్యమైంది. చివరకు బ్రిటీష్ సైనికులు ఆయనను చుట్టుముట్టి నిరాయుధుడ్ని చేశాయి. శత్రువు కళ్ళుగప్పి

తప్పించుకునేందుకు ప్రయత్నించారు. అది సాధ్యం కాలేదు. ఆ ప్రయత్నంలో జరిగిన పెనుగులాటలో పఠాన్ తుర్రేబాజ్ ఖాన్‌ను జనవరి 24న శత్రుసైనికులు కాల్చి చంపారు. (Apprehended by British a week later and shot dead while he was resissting capture. - Who's who of Indian Martyrs Vol. 3, Edited by P.N Chopra, page 148 ).

స్వదేశీ పాలకుల మీద ఆంగ్లేయుల పెత్తనానికి చరమగీతం పాడాలన్న లక్ష్యంతో ఆంగ్ల–నైజాం సైనిక బలగాల మీద అవిశ్రాంత పోరాటాన్ని సాగించిన తుర్రేబాజ్ ఖాన్ మృతదేహాన్ని తూఫ్రాన్ నుండి హైదరాబాదుకు తరలించారు. ఆ తరువాత తుర్రేబాజ్ ఖాన్ భౌతికకాయాన్ని సంకెళ్ళతో కట్టేసి హైదరాబాద్ నగరంలో **ప్రస్తుతం సుల్తాన్ బజారు పోలీసు స్టేషన్ ఉన్న చోట బహిరంగంగా వేలాడదీసారు**. ఆ భయంకర దృశ్యాన్ని చూసిన వారెవ్వరూ కూడా భవిష్యత్తులో ఇటువంటి తిరుగుబాటుకు సాహసించ కూడదని పాలకులు కలలగంటూ తమలోని క్రౌర్యాన్ని వెల్లడించుకున్నారు. ( His corpse was hung up by chains in a public place in Hyderabad as a warning against future anti-British rebellions, - ibid page 148 )

బ్రిటీషు సైనికుల గుండెల్లో భయోత్పాతం సృష్టించిన పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ భౌతికకాయం పట్ల కూడా ఆంగ్లేయులు, ఆంగ్లేయుల తొత్తులు కిరాతకంగా, అవమానకరంగా వ్యవహరించారు. ఆనాడు పరాయి పాలకులు కన్న కలలను కల్లలు చేస్తూ, పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ లాంటి స్వాతంత్ర్యసంగ్రామయోధుల వారసత్వాన్ని స్వీకరించిన ప్రజలు, చివరకు ఆంగ్లేయ మూకలను మాతృభూమి నుండి తరిమిగొట్టి అలనాటి త్యాగధనుల ఆకాంక్షలను నిజంచేశారు.

ఈ క్రమంలో పఠాన్ తుర్రేబాజ్ ఖాన్, మౌల్వీ అల్లావుద్దీన్ తదితర యోధుల సాహసోపేత నాయకత్వంలో బ్రిటీషు రెసిడెన్సీ భవంతి మీద జరిగిన దాడి సంఘటనలకు గుర్తుగా, ఆ నాటి వీరయోధుల స్మారకార్థం, హైదరాబాదు నగరం నడి బొడ్డున గల కోటిలోని సిటీ బస్టాండు వద్ద (అది అనాటి రెసిడెన్సీ ప్రాంతం) స్వతంత్ర భారత ప్రభుత్వం 1957లో ఓ స్మారక స్థూపాన్ని నిర్మించింది. గ్రానైట్ స్థంభం, దాని నాలుగు దిశలా పహరా కాస్తున్నట్టుగా ఉన్న నాలుగు ఏనుగుల శిలా విగ్రహాలతో చక్కని స్మారక చిహ్నం ఏర్పాటయ్యింది.

◆◆◆

## ఆంగ్లేయుల తుదముట్టించేందుకు కత్తిపట్టిన ధార్మికవేత్త

# 6. షేక్ పీర్ షా

(-)

పరాయి పాలకుల దాస్యం నుండి విముక్తి కోసం కత్తిపట్టి కదలిన యోధులలో అసమాన్యులతోపాటు అతి సామాన్యులున్నారు. పరాయి పాలన స్థానంలో స్వదేశీ పాలనను స్థిరంచేయాలన్న బలమైన ఆకాంక్ష తప్ప మరేవిధమైన బలంగాని, బలగంగాని లేని వికలాంగులు కూడా దేశభక్తి ప్రపూరితులై అంగవైకల్యాన్ని అతిసునాయాశంగా అధిగమించి ఈస్ట్ ఇండియా కంపెనీ బలగాలను ఎదుర్కొనేందుకు ముందుకు సాగారు. ఈ మేరకు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఉద్యమించి స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో 'షేక్ పీర్ షా సంఘటన' అని ప్రత్యేక పుటను లిఖింపచేసుకున్న యోధుడు షేక్ పీర్ షా.

ఈస్ట్ ఇండియా కంపెనీ సైనిక బలగాలలోని స్వదేశీ సైనికులను ఆకట్టుకుని తిరుగుబాటుకు బాటలు వేసిన షేక్ పీర్ షా కడపజిల్లా పూర్వపు సిద్దవట్టం తాలూకా యల్లంపేట గ్రామ నివాసి. తండ్రి పేరు షేక్ హైదర్ షా. పీర్ షా పుట్టుకతో అంధుడైన నిరుపేద కుటుంబీకుడు. ఆయన నిజంగా అంధుడా? లేక ఆంగ్ల అధికారులను ఏమార్చడానికి అంధుడిగా నటించాడా? అన్న విషయం మీద పలు విరుద్ధ వాదనలు వినవస్తున్నాయి. ఆయన అంధుడు కాదని డాక్టర్ జి.సాంబశివారెడ్డి (చరిత్ర శాఖాధ్యక్షులు, యోగి వేమన విశ్వవిద్యాలం, కడప) ఘంటాపథంగా చెబుతున్నారు.ఆయన కొన్ని సాక్ష్యాలూ చూపున్నారు. ఈ విషయం మీద మరింత పరిశోధన జరగాల్సి ఉంది. ఈ విషయం ఎలా ఉన్నా పీర్‌షా

మాత్రం పరాయి పాలకుల పెత్తనాన్ని సహించలేని అభిమానధనుడు, స్వతంత్ర భావాల ఆలోచనాపరుడు.

స్వంత గడ్డనుండి పరాయిపాలకులను తరిమికొట్టాలన్న బలమైన కాంక్షగల షేక్ పీర్ షా అందుకు నడుంకట్టారు. ఆ ప్రయత్నంలో ఆయనకు అంధత్వం ఏమాత్రం అడ్డుకాలేదు. ఆటంకాలను అధిగమించగల ఆత్మవిశ్వాసం, మేథాసంపత్తితో ఆయన ముందుకు సాగారు. కంపెనీ కొలువులో వున్న స్వదేశీ సైనికులను ఆయుధాలుగా మలచుకుని తిరుగుబాటు ఆరంభించడానికి పథకం రూపొందించుకున్నారు. ఆ లక్ష్యాన్ని సాధించుకునేందుకు కడపకు 20 మైళ్ళ దూరంలో ఉన్న తన స్వగ్రామం సిద్దవట్టం నుండి కడపకు విచ్చేశారు. కడపలోని ముస్లిం ధార్మిక మహానీయుల దర్గాల వద్ద బసచేస్తూ పథకాన్ని అమలుపర్చడం ఆరంభించి స్థానికంగా గల ముస్లిం ప్రముఖులను కలుసుకుని వారితో మంచి సంబంధాలు ఏర్పచ్చుకున్నారు.

ఈస్ట్ ఇండియా సైనిక స్థావరానికి చెందిన 30వ పటాలంలోని స్వదేశీ సైనికులతో షేక్ పీర్ షా సంబంధాలు ఏర్పర్చుకున్నారు. స్వదేశీ సైనికులలో స్వదేశీయుల పాలన పట్ల జాగృతిని కలుగచేసి, పరాయిపాలకుల వ్యతిరేకంగా వారిని చైతన్యవంతుల్ని చేసి ఐక్యం చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఆ పటాలంలోని సైనికుల అవసరాలను తీర్చుతూ, వారికి ధార్మిక పరిజ్ఞానం పంచుతూ స్నేహ సంబంధాలను మరింత పటిష్టం చేసుకున్నారు. ఆంగ్లేయ సిపాయీలకు, స్వదేశీ సిపాయీల మధ్యన ఉన్న అన్నిరకాల అంతరాలను ఎకరువు పెడుతూ స్వదేశీ సైనికుల్లో ఐక్యమత్యాన్ని ఆయన ఆశించారు.

ఈ క్రమంలో స్వదేశీ బిడ్డలైన హిందూ-ముస్లింలలో ఐకమత్యాన్ని కోరుకుంటూ, ఆ దిశగా కృషి చేస్తూ, తెల్లవారి ఆధిపత్యాన్ని సవాల్ చేయాలని సంకల్పించారు. హిందూ -ముస్లింల మతమనోభావాలను అగౌరవపర్చేలా కంపెనీ సైనికాధికారులు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ స్వదేశీ సైనికులలో బ్రిటీషు సైనికాధికారుల పట్ల వ్యతిరేకభావనలను ప్రోదిచేశారు. కంపెనీ ప్రభుత్వం కొత్తరకం తుపాకులను ప్రవేశపెట్టింది. ఈ తుపాకుల తూటాలకు ఆవు, పంది కొవ్వు పదార్థాలతో పూసి వుంచారు. అటువంటి తూటాలను సిపాయీల ఉపయోగానికి ప్రభుత్వం ఉంచింది. ఆ తూటాల వాడకం వలన హిందూ-ముస్లింలు ధార్మికంగా భ్రష్టులుగాగలరని సిపాయీలలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆంగ్లేయులకు మద్దతు పలుకుతున్న నైజాం నవాబు చర్యలను కూడా ఆయన నిశితంగా విమర్శించారు. పరాయిపాలకుల వంతపాడుతున్న వారంతా దేశద్రోహులని షేక్ పీర్ షా చాలా స్పష్టంగా ప్రకటించారు.

ఈ నేపథ్యంలో, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ శంఖారావం పూరించబడగానే షేక్ పీర్ షా పూర్తిగా రంగలోకి దిగారు. సైన్యంలోని స్వదేశాభిమానం గల యోధులను తిరుగుబాటుకు ప్రేరేపిస్తూ, హిందూ ముస్లిం సైనికులంతా కలసి కట్టుగా ఉద్యమిస్తే ఆంగ్లేయ ప్రభుత్వం కూలిపోతుందని, స్వదేశీయులపాలన తిరిగి నెలకొన బడుతుంది. అందుకోసం అన్నివిధాల త్యాగాలకు సిద్ధం కండి అంటూ సందేశాలు పంపారు. చివరకు 1857 ఆగస్టు 28న తిరుగుబాటు జరగాలని ముహూర్తం పెట్టారు. రాష్ట్రంలో హిందూ-ముస్లింలు కలిసి జరుపుకునే మొహర్రం పండుగ రోజును తిరుగుబాటుకు అనువైన సమయంగా ఆయన భావించారు.

ఈ విషయమై 30వ పటాలానికి చెందిన హిందూ-ముస్లిం సిపాయిలు : హవల్దార్ వరదరాజులు, లాన్స్‌నాయక్ పరుశురాం, సిపాయి వీరాస్వామి, దలాయత్ యల్లప్ప, సుబేదార్ మేజర్ మహమ్మద్ అష్రాఫ్, దలాయత్ సత్యాజీ, జమేదార్ సి.జగ్గయ్య, హవల్దార్ మహమ్మద్ గౌస్, మౌల్వీ అబ్దుల్ అజీజ్ హుస్సేన్ తదితరులతో ఆయన రహస్యంగా సంప్రదించారు. వారితో మంతనాలు జరిపారు. ఈ క్రమంలో స్వదేశీ సైనిక నేతలను పలుమార్లు కలసి వారిలో తిరుగుబాటు జ్వాలలను రగిలించారు.

షేక్ పీర్ షా సాగించిన ప్రయత్నాల ఫలితంగా కంపెనీ సైన్యంలోని స్వదేశీ సిపాయిలలో అంకురించిన తిరుగుబాటు ఆలోచనలను ఆంగ్ల అధికారులు తమ గూఢచారుల ద్వారా పసిగట్టగలిగారు. ఆ ఆలోచనలతో ఏకీభవించిన వారి మీద దృష్టిసారించి మూలాల నుండి తిరుబాటు భావాలను తుడిచి వేయాలనునుకున్నారు. షేక్ పీర్ షాతో ఆలోచనలు పంచుకున్న స్వదేశీ సైనికులలో ఒకరిని నిర్బంధిచి నయానా భయాన నచ్చచెప్పి లొంగ దీసుకున్నారు. అతనికి ఆశించినంత లంచమిచ్చి పీర్ షా సాగించిన రహస్య మంతనాల సారాంశాన్ని పూర్తిగా రాబట్టగలిగారు.ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేశారు.

సైనిక తిరుగుబాటుకు కుట్ర జరుగుతుందన్న విషయం తెలియగానే ఈస్ట్ ఇండియా కంపెనీ, సైనికాధికారులు అప్రమత్తులయ్యారు. ఈ తిరుగుబాటు ప్రయత్నానికి ఓ సాధారణ గ్రామీణుడు సూత్రధారి అని తెలుసుకుని మరింతగా నిర్ఘాంతపోయారు. హిందూ-ముస్లిం తేడా లేకుండా స్వదేశీ సైనికులలో కంపెనీ ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను ప్రోదిచేయటమే కాకుండా అంగబలం ఆయుధబలం గల కంపెనీ సైన్యం మీద తిరుగు బాటుకు పకడ్బందీగా పథకం రూపొందించి, దానిని దాదాపు విజయవంతం చేయగల స్థాయికి చేర్చింది ఓ పుట్టు అంధుడని తెలుసుకున్న ఆంగ్లేయులు నివ్వెరపోయారు. దక్షణ భారతదేశంలో తిరుగుబాటు ప్రభావం అంతగా లేదనుకుని నిశ్చింతగా ఉన్న ఆంగ్లేయాధికారులు షేక్ పీర్ షా తిరుగుబాటు ప్రయత్నాల గురించి విని హడలిపోయారు.

ఆఘమేఘాల మీద తమ బలగాలను తరలించి తిరుగుబాటు ప్రయత్నాలకు సూత్రధారి అయినటువంటి షేక్ పీర్ షాను తొలుత నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆ తరువాత ఆయన ప్రభావంతో కంపెనీ బలగాల మీద పోరాటానికి సన్నద్ధులైన వారందర్నీ ఒక్కొక్కరిగా అదుపులోకి తీసుకున్నారు. తిరుగుబాటుకు సంబంధించిన సమాచారం సేకరించి విచారణలు జరిపారు. చివరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుకు భారీ కుట్రను రూపొందిచారని, ఆ కుట్రకు సూత్రధారి షేక్ పీర్ షాగా తగిన సాక్ష్యాధారాలతో గుర్తించి ఆయన మీద కుట్ర అభియోగం మోపి విచారణ జరిపారు.

ఆ విచారణ సందర్భంగా న్యాయమూర్తి షేక్ పీర్ షా ప్రయత్నాల గురించి ప్రస్తావిస్తూ, He effects to be blind, whether so or not, his other senses are evidently keen, and I therefore deem it my duty to sentence the Prisioner Shaik Peer Shah to 10 years' imprisonment, with hard labour in Irons' (The Freedom Struggle in Andhra Pradesh (Andhra), Volumes I, Govt. of AP, Hyderabad, 1997, Page.161-163 ) అని వ్యాఖ్యానిస్తూ షేక్ పీర్ షాకు పది సంవత్సరాల కఠిన కారాగారశిక్షను విధించాడు.

ఈ విధంగా సైనిక న్యాయస్థానం శిక్షను ప్రకటించాక షేక్ పీర్ షాను కడప జైలు నుండి మధుర లేక తిరున్వేలి జైలుకు తరలించాల్సిందిగా ఆజ్ఞలు జారీఅయ్యాయి. ఆ ఆజ్ఞలు క్షణాల మీద అమలయ్యాయి. అవి అమలు కానట్టయితే ఎక్కడన్నా మిగిలి ఉన్న షేక్ పీర్‌షా అనుయాయులు తిరగబడతారన్న భయంతో అన్ని చర్యలను ఆంగ్లేయాధికారులు త్వరితగతిన తీసుకున్నారు.

షేక్ పీర్ షా తిరుగుబాటు ఉదంతం మీద దక్షణ భారత దేశంలో తిరుగబాటు తలెత్తకుండా చూసేందుకు నియమించబడిన ప్రత్యేక పోలీసు కమీషనర్ ఇ.ఇలియట్ వ్యాఖ్యానిస్తూ షేక్ పీర్ షాను ఆంగ్లేయాధికారులు **'వంచన'** తో లొంగదీసుకున్నారన్నాడు. ఆ విధంగా చేయకున్నట్టయితే మద్రాసు సైనిక స్థావరంలోని సిపాయీలందర్నీ ఆయన తనవైపు తిప్పుకుని తిరుగుబాటులతో సంచలనం సృష్టించి ఉండేవాడన్నాడు.

ఆ వ్యాఖ్యానం ఈ విధంగా సాగింది : **పీర్ షాను వంచనతో లొంగదీసుకోక పోయినట్టయితే అతను మద్రాసు సిపాయిలందరిలో సంచలన కలిగించి ఉండేవాడు.** (వ్యాసంః **దేశభక్తిని పెంపొందించిన షేక్ పీర్ షా** (ఆగస్టు28, 1857), వ్యాసకర్తః డాక్టర్ జి. సాంబశివా రెడ్డి, గీటురాయి వారపత్రిక, హైదరాబాద్, 9-1-2004, పేజి.18) ఆనాడు షేక్ పీర్ షా చేసిన తిరుగుబాటు ప్రయత్నం మీద ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన అత్యున్నత ఆంగ్లేయాధికారి ఆ విధంగా వ్యాఖ్యానించాడంటే అంధుడైన ఓ గ్రామీణ సాహసి ఏ స్థాయిలో వలసపాలకుల ఉద్వాసనకు ప్రయత్నాలు సాగించారో అర్థం చేసుకోవచ్చు.

◆◆◆

## ఆంగ్లేయులను తరిమికొట్టేందుకు ఆధ్యాత్మికబాట పట్టిన

# 7. అమానుల్లా ఖాన్

(-1875)

**మా**తృదేశాన్ని బ్రిటీషర్ల బానిస బంధనాలనుండి విముక్తి గావించేందుకు అహింసా మార్గంలో కొందరు, సాయుధ పోరాటబాటలో మరికొందరు సాగగా ఆధ్యాత్మిక మార్గాన్ని ఎన్నుకుని ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం సాగించారు అమానుల్లాఖాన్.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కృష్ణా జిల్లా విజయవాడ నివాసి అమానుల్లాఖాన్. ఆయన తాత సయిదుల్లా జాగీర్దార్. తండ్రి పేరు తెలియదు. అమానుల్లా ఖాన్ పూర్వీకులు లక్నో నుంచి విజయవాడకు వచ్చి స్థిరపడ్డారని చెబుతారు. తాత జాగీరు తండ్రి హయాంలో పూర్తిగా హరించి పోయింది. అమానుల్లాకు కొండపల్లి కాగితాల మీద రాసిన ఖురాన్ గ్రంథం, పేదరికం తప్ప తండ్రి మరేమి ఇవ్వలేదు. అమానుల్లా విజయవాడలోని బంగారుకొట్ల సందులోని మసీదు సమీపంలో నివసించేవారని చెబుతారు.

పరాయిపాలకుల ఊడిగం బాధించినంతగా ఆయనను అంటిపెట్టుకుని ఉన్న దారిద్ర్యం అమానుల్లాను బాధపెట్టలేదు. ఆ కారణంగా తెల్లపాలకుల మీద 'నమాజ్' అను ఆధ్యాత్మిక ఆయుధంతో పోరాటం సాగించాలని భావించారు. నమాజు ద్వారా తిరుగుబాటు చేయడానికి అల్లా అనుగ్రహాన్ని అర్థించారు. అమానుల్లా కవి. ఆయన రాసిన ఒక కవితలో, **భయం లేకుండా స్వేచ్ఛగా నమాజుచేసుకోడానికి తిరుగుబాటు చేయడానికి బలం ఇవ్వు...ఈ**

**నేలమీద ఈ కొండల్లో...నేను చేసే నమాజ్ ప్రతిధ్వనించి తెల్లగుండెలు తారెత్తి పోవాలి..నా సోదరులంతా నాతోపాటుగా స్వేఛ్ఛగా సర్వేశ్వరుడ్ని ధ్యానించాలి**, అన్నారు.

ఈ భావనలతో ఈనాడు గాంధీ పర్వతంగా పిలువబడుతున్న ఆనాటి 'ఆర్ హిల్' మీద కూర్చొని ధార్మికతను మేళవించిన తిరుగుబాటు కవిత్వం రాశారు. అమానుల్లా వైఖరి తెల్లదొర గ్లాడ్‌స్టోన్‌కు కొరుకుడు పడలేదు. ఆయనను అరెస్టు చేసి శిక్షవిధింప చేసేందుకు సాకు దొరకలేదు. ఒకసారి అమానుల్లా ఖాన్ పర్వతం మీద నుండి అజాం (నమాజ్‌కు రమ్మని పిలుపు) ఇస్తుండగా నిద్రాభంగం కల్గిందంటూ ఆయనను అరెస్టుచేసిన ఆ ఆంగ్లేయుడు కొరడాతో నిర్ధాక్షిణ్యంగా చితకబాదాడు. ఆ దెబ్బలు కదుములు కట్టి పుండ్లు పట్టాయి. ఆ పుండ్ల బాధను అలాగే భరిస్తూ, **ఎంతో సంతోషంగా ఉంది. ప్రార్ధనతో ఐకమత్యం... ఐకమత్యంతో స్వాతంత్ర్యం...స్వాతంత్ర్యంతో ప్రార్ధన...ప్రార్ధనతో భగవంతుని రాజ్యం... భగవంతుని అనుగ్రహంతో ప్రజల రాజ్యం**, అని అమానుల్లా ఖాన్ కవితలల్లారు.

అవి 1875 నాటి రోజులు. ఆమానుల్లాను నిర్బంధించేందుకు విభజించు-పాలించు కుటిల నీతికి గ్లాడ్‌స్టోన్ పాల్పడ్డాడు. ముస్లింలను హిందువులకు వ్యతిరేకంగా రెచ్చ గొడుతున్నాడని నిందలు వేశాడు. ఆ పరిస్థితులలో ఆయన కృంగిపోయారు. తెల్లవాడి కొరడా దెబ్బలు కలిగించిన పుండ్ల వలన ఆయన పరిస్థితి విషమించింది. సర్వజనావళి ఐక్యత సాధించనిదే తాము కోరుకున్న స్వేచ్ఛ లభించదని దృఢంగా నమ్మిన అమానుల్లా జనసమూహాల మధ్యన ఐక్యత ఆకాంక్షిస్తూ, భగవంతుడ్ని ప్రార్ధించేందుకు పర్వతం మీదకు వెళ్లిపొయారు. ప్రజలను ఉన్మాదం నుండి దూరంగా ఉంచమంటూ అవిశ్రాంతంగా అల్లాను ప్రార్థిస్తూ అమానుల్లా ఖాన్ ప్రాణాలు వదిలారు.

అమానుల్లా ఖాన్ పుట్టుపూర్వోత్తరాలు గురించి, అ తరువాత అయన నిర్వహించిన కార్యక్రమాల వివరాలు పూర్తిగా తెలియడం లేదు. ఆమానుల్లా కవితలు ఆయన ఎంచుకున్న ఆంగ్లేయ వ్యతిరేకతను చూచాయగా మాత్రమే బహిర్గతం చేస్తున్నాయి. ఆనాటి పోలీసుల నివేదికలు, 'ఎ గైడ్ టూ గుంటూరు' గ్రంథం పేర్కొన్న వివరాల ద్వారా ఆంగ్లేయాధికారుల దురహంకారాన్ని ప్రతిఘటించి, ప్రజల ఐక్యతను ఆకాంక్షిస్తూ, అల్లాహ్‌ను అర్థిస్తూ స్వేచ్ఛా-స్వాతంత్ర్యాల సాధనకు పిలుపునిచ్చిన విశిష్ట ధార్మికుడిగా అమానుల్లా ఖాన్ సాక్షాత్కరిస్తారు.

**(చరిత్ర పరిశోధకులు, సీనియర్ పాత్రికేయులు, బహుగ్రంథ రచయిత**
**శ్రీ యల్.వి. రమణ (విజయవాడ) అందించిన సమాచర సహకారంతో )**

◆◆◆



## కత్తిపట్టి కదనానికి కదలి నడిచిన ధార్మిక పండితుడు

# 8. మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్

(-1884)

బ్రిటీష్ వ్యతిరేక పోరాటంలో అగ్రభాగాన నిలచిన దక్షిణాది ఆధ్యాత్మిక ప్రముఖులలో మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ ఎన్నదగిన ధార్మికులు. ఆయన నివాసస్థలం హైదరాబాద్ నగరం. ఆయన జననం, తల్లితండ్రుల వివరాలు, బాల్యం గురించి ఎటువంటి సమాచారం అందుబాటులో లేదు. 1857లో నైజాం సంస్థానం రాజధాని హైదరాబాదులో సాగిన తిరుగుబాటు సందర్భంగా ఆయన వెలుగులోకి వచ్చారు.

1857 ప్రథమ స్వాతంత్ర్య పోరాటం ప్రారంభం కాగానే నైజాం నవాబు కూడా ఆ పోరులో భాగస్వాములవుతారని స్వేచ్ఛాపిపాసులైన వారు ఆశించారు. నిజాం నవాబు తమ గుప్పెట నుండి తప్పుకున్నట్టయితే దక్షిణాదిన తమ పట్టు జారిపోగలదన్న భయంతో నిజాం నవాబు తమకు దూరం కాకుండా ఆంగ్లేయాధికారులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ కారణంగా నైజాం సంస్థానంలోని స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలను కోరుకుంటున్న ప్రజలు ఆశించినట్టుగా నైజాం సంస్థానాధీశుడు ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో చేరలేదు.

ఆ వాతావరణంలో రంగప్రవేశం చేసిన మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ హైదరాబాదు కేంద్రంగా జరిగిన తిరుగుబాటు కార్యకలాపాలకు కేంద్ర బిందువయ్యారు. తిరుగుబాటు కార్యకలాపాలు మౌల్వీ మార్గదర్శకత్వంలో ముమ్మరమయ్యాయి.

నిజాం–ఆంగ్ల సైన్యాల మీద తిరుగుబాటుకు సిద్ధపడ్డ ప్రజలు మౌల్వీ ఇబ్రహీం నాయకత్వంలో 1857 జూన్ 10న తిరుగుబాటు చేయాలనుకున్నారు. ఈ మేరకు మౌల్వీ అక్బర్ దానికి తగిన విధంగా ప్రచారం కూడా నిర్వహించారు. ఈ ప్రచారంతో సైనిక స్థావరాలలోని స్వదేశీ సైనికులు ఆంగ్ల అధికారులను లెక్కచేయక ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ఆరంభించారు. పలు ప్రాంతాలలో వివిధ విభాగాల సైనికులు తిరుగుబాటు దళాలతో కలసి పోతున్నారని వార్తలు గుప్పుమనసాగాయి.

ఆ వార్తలతో ప్రజలు ఉత్తేజితులవుతుండగా మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ లాంటి ఆలోచనాపరులు తిరుగుబాటుకు అవసరమైన ఆర్థిక, అంగ, ఆయుధ బలగాలను సమకూర్చుకో సాగారు. ఆ క్రమంలో నిజాం నవాబును ఈస్ట్ ఇండియా కంపెనీ మీద తిరగబడమని కోరుతూ నగరంలో పోస్టర్లు కూడా వెలిశాయి. 1857 జూన్ 13న చార్మినార్ దగ్గరలోని మక్కా మసీదులో నమాజు తరువాత ప్రసంగం సాగుతుండగా, ఇరువురు వ్యక్తులు లేచి స్వాతంత్ర్యసంగ్రామం గురించి ప్రసంగించమని కోరారు. ఆ యోధులను ప్రభుత్వ సైనికులు పట్టుకునేందుకు ప్రయత్నించగా స్వేచ్ఛను కోరుకుంటున్న ప్రజలు వారిని శత్రువు చేతిలో పడకుండా కాపాడుకున్నారు.

ఈ మేరకు నైజాం రాజధాని తిరుగుబాటు వార్తలతో అతలాకుతలం అవుతుండగా, నైజాం సంస్థానంలో భాగమైన ఔరంగాబాద్‌లో ప్రథమ ఆశ్వికదళం, బుల్దానాలోని మరొక దళం తిరుగుబాటు చేశాయని వార్తలందాయి. ఈ రెండు దళాలు హైదరాబాదుకు చెందినవి కావడం వలన తిరుగుబాటు వార్త సహజంగా హైదరాబాదులో ఉద్రిక్త పరిస్థితికి కారణమైంది. ఔరంగాబాద్ తిరుగుబాటుకు నాయకులైన జమేదార్ అమీర్ ఖాన్, దఫేదార్ మీర్ ఫిదా అలీలలో ఫిదా అలీని ప్రభుత్వ సైనికులు పట్టుకున్నారు. మీర్ ఫిదా అలీ ఉరిశిక్షకు గురికాగా, అమీర్ ఖాన్ తప్పించుకున్నారు. బుల్దానా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన జమేదారు చిద్దా ఖాన్ తన 10 మంది అనుచరులతో జూన్ 24న హైదరాబాద్ నగరం చేరుకున్నారు. నైజాం ప్రభుత్వం నుండి రక్షణ లభిస్తుందన్న భావనతో విచ్చేసి, సాలార్ జంగ్‌ను కలసిన చిద్దాఖాన్‌ను ఆయన అనుచరులను సంస్థానాధీశుడు ఖైదు చేయించాడు. ఆ తరువాత ఆ యోధుల చర్యల మీద విచారణ నిమిత్తం బ్రిటీషు రెసిడెన్సీకి అప్పగించాడు. ఈ వార్తతో నగర ప్రజల హృదయాలు భగ్గుమన్నాయి. ఫిరంగీయులను చంపమంటూ నగరంలోని పోస్టర్లు దర్శనమిచ్చాయి. (History of The Deccan, J D E Gribble, Vol.2, Mittal Publications, New Delhi, 1990, Page 237 )

1857 జూలై 17న చారిత్రక మక్కా మసీదులో పెద్ద సంఖ్యలో ప్రజలు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో మౌల్వీ అల్లావుద్దీన్ పాల్గొన్నారు. చిద్దాఖాన్ ఆయన

అనుచరులను విడుదల చేయించాలని నిర్ణయించారు. అందుకుగాను నలుగురు మౌల్వీల ప్రతినిధివర్గాన్ని బ్రిటీషు రెసిడెంట్ వద్దకు పంపాలని, ఆ ప్రయత్నం ఫలప్రదం కానట్టయితే బలప్రయోగానికి పూనుకోవాలని నిశ్చయించారు. ఈ విషయం తెలుసుకున్న నిజాం నవాబు మక్కా మసీదులో సమావేశమైన వారిని చెదరగొట్టి, ఆ విషయాన్ని బ్రిటీషు రెసిడెన్సీకి కబురు చేసి, ఆ పరిణామాల వలన భయపడాల్సిన అవసరంలేదని, రక్షణకు అవసరమైన అన్నిచర్యలు తీసుకున్నట్టు రెసిడెంట్‌కు విన్నవించుకున్నాడు.

ఈ చర్యతో మౌల్వీ అల్లావుద్దీన్ ఆగ్రహించారు. ఆయన మస్తిష్కంలో రూపు దిద్దుకుంటున్న వ్యూహం త్వరితగతిన పోరాటరూపును సంతరించుకుంది. ఆయన అదేశాల మేరకు అగ్నిగుండంలోనైనా దూకేందుకు మూడు వందల మంది సాహస యోధులు సిద్ధంగా ఉన్నారు. ఆ సాహసుల దళం మౌల్వీ అల్లావుద్దీన్ ఆదేశాల కోసం ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూస్తుంది. చివరకు ఆ క్షణం రానే వచ్చింది.

బ్రిటీష్ రెసిడెంట్, నిజాం ప్రతిస్పందనల మీద తన సహచరుడు ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ యోధుడు పఠాన్ తుర్రేబాజ్ ఖాన్‌తో మౌల్వీ అల్లావుద్దీన్ సంప్రదించారు. 1857 జూలై 17న మధ్యాహ్నం నాలుగు గంటల సమయానికి మౌల్వీ అల్లావుద్దీన్, పఠాన్ తుర్రేబాజ్ ఖాన్‌ల నాయకత్వంలో వందలాది పోరాటయోధులు రణనినాదం చేస్తూ, పోరుకు సిద్ధమయ్యారు. విజయమో వీరస్వర్గమో అంటూ బయలుదేరిన యోధులు ప్రస్తుత సుల్తాన్ బజారు దిశగా బ్రిటీష్ రెసిడెన్సీ వైపుకు దూసుకవచ్చారు. ఈ విషయం గమనించిన నైజాం నవాబు బ్రిటీషు రెసిడెంటును అప్రమత్తం చేస్తూ, తమ బలగాలు వచ్చేంత వరకు అత్మరక్షణకు పూనుకోవాల్సిందిగా వర్తమానం పంపాడు. ప్రస్తుతం హైదరాబాదు నగరంలోని కోటి సెంటరులో గల మహిళా కళాశాల ఆనాడు బ్రిటీషు రెసిడెన్సీగా పిలువబడిన ఆంగ్ల అధికారి నివాసం మరియు కార్యాలయంగా ఉండేది.

మౌల్వీ అల్లావుద్దీన్, ఫఠాన్ తుర్రేబాజ్ ఖాన్‌ల నేతృత్వంలోని తిరుగుబాటు దళాలు, రెసిడెన్సీకి పడమర వైపు నుండి దాడికి సమాయత్తమయ్యాయి. ఆ ప్రాంతంలో ఉన్న అబ్బాన్ సాహెబ్, జయగోపాల్ దాస్ అను షావుకార్ల భవనాలను తమ స్థావరాలుగా చేసుకున్నాయి. ఆ ప్రాంతం నుండి పుత్లీ బౌలీ, దిల్‌షుక్ తోటల వైపుఉన్న ద్వారాల మీద అదుపు సాధించేందుకు వీలుగా వ్యూహత్మకంగా చర్యలు తీసుకున్నాయి.

ఆ సమయంలో ఆంగ్లేయాధికారి మేజర్ హెచ్.సి బ్రిగ్స్ రెసిడెన్సీ రక్షణ బాధ్యత స్వీకరించాడు. రాత్రిపూట కావడం వలన తిరుగుబాటు దళాలను ఏమార్చి, ఆ బలగాల చుట్టూతా తన బలగాలను మోహరించేందుకు వ్యూహాత్మకంగా సమయం తీసుకున్నాడు. శత్రువు మీద ఎంతో కసితో ఉన్న తిరుగుబాటు బలగాలు దూకుడుగా ముందుకు ఉరికేసరికి,

పోరు ప్రారంభమైంది. ఆంగ్లసేనలు తెల్లవారుజాము వరకు కాల్పులు జరిపాయి. ఆంగ్లేయుల ఫిరంగి గోళాల సెగలు పొగలకు తట్టుకుని నిలబడగలిగేందుకు తగిన ఆచ్ఛాదన కరువు కావడంతో తిరుగుబాటు బలగాలు వెనక్కు తగ్గాయి. తిరుగుబాటు దళాలను దిగ్బంధం చేసేందుకు ఏర్పాటు చేసిన అరబ్బు దళాలు తిరుగుబాటు యోధులకు అనుకూలంగా వ్యవహరించాయి. ఆ దళాల సహకారంతోనే, తిరుగుబాటు దళాలు అబ్బాన్ సాహెబ్, జయగోపాల్ దాస్‌ల గృహాలను వదలి, పోరులో మరణించిన వారిని వదలి, గాయపడిన సహచరులను మాత్రం వెంట తీసుకుని వెనుకకు తగ్గి వెళ్ళిపోయాయి.


ఈ పోరాటంలో మొత్తం మీద నలుగురు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. ఆంగ్లసేనలు, నైజాం ప్రభువు సహకారంతో తిరుగుబాటు దళాలను దాడిని తిప్పికొట్ట గలిగాయి. తిరుగుబాటు దళాలకు సహకరించిన అబ్బాన్ సాహెబ్, జయగోపాల్ దాస్‌ల భవనాలను ఆంగ్లసేనలు ధ్వంసంచేసి, నేలమట్టం చేశాయి. ఆ ప్రముఖుల కుటుంబ సభ్యులను ఊచకోత కోసాయి, ఆస్తిపాస్తులను జప్తు చేశాయి.

1957 జూన్ 18న నగరంలోని తిరుగుబాటు దళాల మీద ఆంగ్ల సైన్యాలు పూర్తి స్థాయిలో విరుచుకు పడ్డాయి. భారీ ఎత్తున అరెస్టులు జరిగాయి. మౌల్వీ అల్లావుద్దీన్ ఆంగ్ల సైనికుల కన్నుగప్పి తప్పించుకున్నారు. ఒకటిన్నర సంవత్సరం పాటు ఆంగ్లసైనికుల కంటపడకుండా రహస్యజీవితం గడిపారు. ఆయనకు పీర్ మహమ్మద్ అను వ్యక్తి ఆశ్రయం కల్పించి కాపాడాడు. ఆ సమయంలో మౌల్వీ అల్లావుద్దీన్ ఫరూఖ్‌నగర్, బెంగుళూరు తదితర ప్రాంతాలు పర్యటించారు. తిరుగుబాటు యోధులు సయ్యద్ భిక్కూ, సయ్యద్ లాల్, మహమ్మద్ అలీలతో సంప్రదింపులు జరిపారు.

ఈ విధంగా ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని సవాల్ చేసి, తిరుగుబాటుకు నాయకత్వం వహించిన మౌల్వీ అల్లావుద్దీన్‌ను ఎలాగైనా పట్టుకోవాలని కసితో ఉన్న ఆంగ్లేయాధికారులు మౌల్వీని పట్టిచ్చిన వారికి నాలుగు వేల రూపాయల నజరానాను నైజాం ప్రభుత్వం ద్వారా ప్రకటింపచేశారు. (' A reward of 4 thousand for his arrest was announced by Nizam's Government...', Who's Who Of Freedom Struggle in Andhara Pradesh, Vol. , Ed. by Dr.Sarojini Regani, AP Govt. Publications, 1978, page 457)

చివరకు మౌల్వీ అల్లావుద్దీన్‌ను ఆంగ్లేయులు పట్టుకున్నారు. అనంతరం విచారణ తంతును జరిపించి ఆయనకు ద్వీపాంతరవాస శిక్ష విధించారు. చివరకు 1859 జూన్ 28న అండమాన్ దీవులలోని సెల్యూలర్ జైలుకు పంపించారు. ఆ దీవులల్లోనే పాతికేళ్లు దుర్భర నిర్బంధ జీవితం గడిపిన మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ 1884లో కన్నుమూశారు.

◆◆◆



## పునర్వికాసోద్యమ తొలితరం వైతాళికుడు

# 9. ముల్లా అబ్దుల్ ఖయ్యూం

(1853-1906)

**రా**జభక్తి స్థానంలో దేశభక్తి ఆలోచనలు కలగటమే 'రాజద్రోహం' గా పరిగణించి బహిష్కార శిక్షలు అమలవుతున్న హైదరాబాదు సంస్థానంలో, నిజాం ప్రభువు ఫర్మానాలకు, హూంకరింపులకు ఏమాత్రం భయపడకుండా, జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించడమే కాక ప్రముఖులను, ప్రజలను ఆ దిశగా కదిలిస్తూ ముందుకు సాగి, బ్రిటీషు వ్యతిరేక పోరాటాల దిశగా ప్రజల్ని మేల్కొల్పిన తొలితరం వైతాళికుడు ముల్లా అబ్దుల్ ఖయ్యూం.

ముల్లా అబ్దుల్ ఖయ్యూం 1853లో మద్రాసులో జన్మించారు. బాల్యం మైసూరులో గడిచింది. ఎనిమిది సంవత్సరాల వయస్సులో ఆయన తల్లితండ్రులు హైదరాబాదుకు వచ్చి నైజాం సంస్థానంలో స్థిరపడ్డారు. స్థానికంగా 'దారుల్ ఉలూం'లో పర్షియన్, అరబ్బీ భాషలను నేర్చుకుని ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూరు వెళ్ళి ఆయన ఉన్నత విద్యపూర్తిచేశారు. 1875లో హైదరాబాదు సంస్థానంలోని 'సర్వే-సెటిల్‌మెంటు శాఖ'లో ఉద్యోగం లభించింది. ఆ తరువాత ప్రముఖ విద్యావేత్త మొహ్‌సినుల్-ముల్క్ (Mohsinul-Mulk) ఆధ్వర్యంలో హైదరాబాదు సంస్థానం కోసం గజిట్‌ల కూర్పు జరుగుతున్న శాఖలోని పర్షియన్ విభాగం అధిపతిగా ముల్లా అబ్దుల్ ఖయ్యూం నియుక్తులయ్యారు. ఆయన ప్రతిభా సామర్థ్యాలకు తగ్గట్టుగా ఆ తరువాత విద్యాశాఖ సహాయ సంచాలకులుగా పదోన్నతి పొందారు. ఆ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సందర్భంగా ముల్లా అబ్దుల్ ఖయ్యూంకు సరోజినీ నాయుడు

తండ్రి డాక్టర్ అఘోరనాథ్ చటోపాధ్యాయతో 1880లో పరిచయం కలిగింది. ఆ పరిచయం అతి త్వరలో ఉత్తమ స్నేహబంధంగా పరిణితి చెంది, హిందూ-ముస్లింల మధ్య ఐక్యతకు ప్రతీకగా నిలచింది. ఆ తరువాత ఆ స్నేహం హైదరాబాదు సంస్థానంలో జరిగిన ప్రముఖ చారిత్రక సంఘటనలకు, పునర్వికాసోద్యమ పరిణామాలకు కారణమైంది.

ప్రజోపకర కార్యక్రమాల పట్ల చిన్నతనం నుండి శ్రద్ధ చూపుతూవచ్చిన ముల్లా అబ్దుల్ ఖయ్యూం, ప్రభుత్వాధికారిగా బాధ్యతల నిర్వహిస్తూ ప్రజా సంక్షేమం ప్రధాన లక్ష్యంగా సాంఘిక సంస్కరణలకు, విద్యావ్యాప్తికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. ప్రజలను చైతన్య పర్చేందుకు **'ఇఖ్వాన్-అజ్-సుఫా'** (Ikwan-us-Sufa) అను సంస్థను స్థాపించారు. ప్రతి మాసం సాంఘిక-ఆర్థిక-విద్యా పరమైన సంస్కరణల మీద మాట్లాడేందుకు నిష్ణాతులైన ప్రముఖులను ఆహ్వానించి చర్చలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు, అవసరమగు సమాచారం ప్రజలకు అందించేందుకు ఒక మాసపత్రికను కూడా ఆయన నడిపారు.

డాక్టర్ అఘోరనాథ్ చటోపాధ్యాయతో కలసి ముల్లా అబ్దుల్ ఖయ్యూం జరిపిన కృషి ఫలితంగా పరాయి పాలకులు స్వదేశీ ప్రభువుల మీద పెత్తనం చేస్తూ, ఆర్థిక దోపిడికి పాల్పడుతున్న వైనాన్ని అర్థం చేసుకోగల చైతన్యాన్ని మేధావివర్గం సంతరించుకుంది. ఆ వాతావరణంలో బ్రిటీషు ప్రభుత్వ భాగస్వామ్యంతో హైదరాబాదు ప్రభుత్వం 1883లో 'చందా రైల్వే పథకం' (The Chanda Railway Scheme) రూపొందించింది. ఈ చందా రైల్వే పథకం ప్రకారంగా, **'హైదరాబాదు నుండి వాడి వరకున్న రైల్వే స్టేషన్లనన్నింటినీ ఒక బ్రిటీష్ కంపెనీకి అప్పగించడం, ఆ కంపెనీ వారు రైల్వే మార్గాన్ని వరంగల్ వరకూ విస్తరించడం, పథకంలోని ప్రధానాంశాలు.** (హైదరాబాదు సంస్థానంలో స్వాతంత్ర్యోద్యమం, వెల్దుర్తి మాణిక్యరావు, భారత ప్రభుత్వ ప్రచురణలు, న్యూడిల్లీ, 1992, పేజీ.11)

ఈ విషయమై ముల్లా అబ్దుల్ ఖయ్యూం, డాక్టర్ చటోపాధ్యాయలు ప్రజల పక్షంగా రంగంలోకి దిగారు. ఆ ఇరువురి నాయకత్వంలో 'The Committe to consider Chanda Railway Scheme' రూపుదిద్దుకుంది. **ఈ పథకం వల్ల హైదరాబాదు సంస్థానం ప్రజల ప్రయోజనాలకు భంగం వాటిల్లగలదని ... కొత్తరైలు మార్గం నిర్మాణం పనిని భారతీయులకు అప్పగించాలని**' కమిటీ పట్టుబట్టింది. (హైదరాబాదు సంస్థానంలో స్వాతంత్ర్యోద్యమం, వెల్దుర్తి మాణిక్యరావు,పేజీ.11). చందా రైల్వే పథకం ప్రతిపాదన గురించి పునరాలోచించమని కోరుతూ బ్రిటీషు వైశ్రాయ్‌కి నివేదన పంపాలని కమిటీ నిర్ణయించింది. కమిటీ వాదనతో ఏకీభవిస్తున్న మేధావులంతా ఆ నివేదన పత్రం మీద సంతకాలు చేశారు. **'అంతవరకు నిద్రాణంగా ఉన్న పౌరులలోని ఒక వర్గం ప్రభుత్వం చేపట్టిన ఒక చర్యను నిరోధించడానికి**

**సమాయత్తం కావడం హైదరాబాదు ప్రభుత్వాధినేతలకు రుచించలేదు.'** (Ibid : Page.11) ప్రభువు చర్యపట్ల అసంతృప్తిని వ్యక్తంచేస్తూ, బ్రిటీషు వైశ్రాయికి 'నివేదన పత్రం' పంపించే స్థాయికి పాలితులు చేరుకోవడం పాలకులు సహించలేకపోయారు. **'ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే సాహసమే కనక ప్రజలకు కలిగినట్లయితే అది ఎంత దూరమైనా వెళ్ళవచ్చునని పాలకులు అనుమానించసాగారు'.** (Ibid : Page. 11). ఈ అనుమానం రావడమే తరువాయి అఘోరనాథ్ రెండు సంవత్సరాల ప్రవాస శిక్షకు గురికాగా, అబ్దుల్ ఖయ్యూం భహిష్కరణకు గురయ్యి హైదరాబాదు నగరం వదలి మద్రాసులో తలదాచుకోవాల్సి దుస్థితి వచ్చింది.

అబ్దుల్ ఖయ్యూం, డాక్టర్ అఘోరనాథ్ లాంటి నేతల ప్రయత్నాలు విఫలమైనా, ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు ప్రజలు తలవంచాల్సిన అవసరంలేదన్న చైతన్యాన్ని ప్రజలలో తీసుకురావడంలో ఘనవిజయం సాధించారు. ఆ కారణంగా హైదరాబాదు సంస్థానంలో ప్రజా చైతన్యానికి కారకులైన తొలితరం యోధులుగా, భారత పునర్వికాస ఉద్యమానికి పథనిర్దేశకులుగా ఈ నాయకద్వయం సుప్రసిద్ధులయ్యారు. (Who's Who of Freedom Struggle in Andhra Pradesh, Volume One, Govt. of Andhra Pradesh, Hyderabad,1978, Page. 458)

ప్రవాస శిక్షలకు గురైన ముల్లా అబ్దుల్ ఖయ్యూం తిరిగి హైదరాబాదు చేరుకునే సరికి భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన జరిగింది. ఈ పరిణామం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ, హైదరాబాదు నగరం నుంచి జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించిన మొట్టమొదటి ముస్లిం నాయకుడుగా ఆయన చరిత్ర సృష్టించారు. ఆ తరువాత **'భారత జాతీయ కాంగ్రెస్‌కు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించటంలోనూ, రాష్ట్రంలోని కొంతమంది విద్యావంతులలో జాతీయ భావాల బీజాలను నాటడంలోనూ వీరు అమోఘమైన కృషి సల్పినారు.'** (హైదరాబాదు సంస్థానంలో స్వాతంత్ర్యోద్యమం, పేజి. 11)

జాతీయ కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ ప్రముఖ విద్యావేత్త సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ సాగిస్తున్న బలమైన ప్రచారాన్ని ముల్లా ఖయ్యూం ఎదుర్కొన్నారు. జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావాన్ని సమర్ధిస్తూ Safir-e-Deccan పత్రికలో వ్యాసాలు రాస్తూ, ప్రజలందర్ని జాతీయ కాంగ్రెస్‌లో చేరమని ఆయన ఉద్బోధించారు. సర్ సయ్యద్ వాదనలను పూర్వపక్షం చేస్తూ, ప్రముఖ జాతీయవాది, పండిత అయోధ్యనాథ్ కుంజ్రూ (Pandit Ayodhya-nath Kunzru) A Sprited Defence of the Congress అను శీర్షికతో రాసి ప్రచురించిన కరపత్రాన్ని తెప్పించి, స్వయంగా దానిని పునర్ముద్రించి, తన సన్నిహిత మిత్రుడు మౌల్వీ షర్ఫుల్ హఖ్‌తో (Sharf-ul-Huq) కలసి హైదరాబాదు సంస్థానంలో పంపిణీ చేశారు.

ప్రభుత్వ ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రభువుల అభిష్టానికి వ్యతిరేకంగా అబ్దుల్ ఖయ్యూం రాజకీయ కార్యకలాపాలకు పాల్పడడం హైదరాబాదు పాలకులకు ఏమాత్రం

రుచించలేదు. ఈ విషయమై తగిన సంజాయిషి ఇవ్వమని ఆదేశిస్తూ, ప్రభుత్వ వ్యతిరేక రాజకీయ కార్యకలాపాలను విరమించుకోవాల్సిందిగా ఆజ్ఞాపిస్తూ, 1888 సెప్టెంబరు 29న Office of the Political and Financial Minister కార్యాలయం నుండి ఆయనకు నైజాం ప్రభుత్వం నుండి తాఖీదు జారీ అయ్యింది. ఈ తాఖీదులో, 'Safir-e-Deccan **పత్రికలో భారత జాతీయ కాంగ్రెస్‌కు మద్దతునిస్తూ మీరు రాసిన లేఖను ప్రస్తావిస్తున్నాం. మీరు వ్యవహరిస్తున్న తీరుతెన్నులు హైదరాబాదు ప్రభుత్వం రాజకీయ విధానానికి వ్యతిరేకం. దేశభక్త సంఘానికి** (Patriotic Association) **అనుకూలం. మీరు, మీ మిత్రులు మీ లక్ష్యాల నుండి ఉద్దేశ్యాల నుండి పూర్తిగా విరమించుకుంటారని భావిస్తాము. మీరు అలహాబాదు నుండి తెప్పించి పంపిణీ చేస్తూన్న కరపత్రం కాపీలను తక్షణమే ప్రభుత్వానికి అంద చేయాల్సింది...ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వాధికారులు ప్రవర్తించడం సరికాదన్న విషయం మీకు ప్రత్యేకంగా తెలియపర్చాల్సిన అవసరం లేదనుకుంటా**', అని ఆ శాఖ సహాయ కార్యదర్శి పేర్కొన్నాడు. (The Freedom Struggle In Hyderabad, Volume-3, AP Govt. Publications, Hyderabd, page.10). ఈ తాఖీదులను, హెచ్చరికలను ముల్లా అబ్దుల్ ఖయ్యూంగాని, ఆయనతోపాటుగా ఆ కార్యకలాపాలలో పాల్గొన్న మౌల్వీ షరఫుల్ హఖ్‌గాని, (Moulivi Sharf-ul-Haq, Officiating Superintendent, Excise Department, Secunderabad) ఇతర మిత్రులు గాని ఏమాత్రం లెక్కచేయక భారత జాతీయ కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించుకుంటూ ముందుకు సాగిపోయారు.

ముల్లా అబ్దుల్ ఖయ్యూం 1886లో ఈనాంల విచారణకు డిప్యూటీ కమీషనర్‌గా గుల్బర్గాకు బదిలీ అయ్యారు. ఆయన ఎక్కడ ఉన్నా ప్రజలలో విద్యావ్యాప్తికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. కులీన-సంపన్న వర్గాలలో కూడా ఆశించిన మేరకు విద్యాగంధం లేకపోవడం గమనించి ఆ సమస్య మీద ప్రధానంగా దృష్టి సారించారు. ప్రజలలో చదువు పట్ల ఆసక్తి కలిగించేందుకు విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలన్నారు. నిరుద్యోగ సమస్యను అధిగమించడానికి సాంకేతిక విద్యగరపాలని సూచించారు. ఈ మేరకు గుల్బర్గాలో Madrasa-e-Sardaran అను సాంకేతిక శిక్షణ ఇచ్చే విద్యాలయాన్ని స్వయంగా స్థాపించారు.

మానవ జీవితంలోని అన్ని పార్శ్వాలను, చరిత్రను అధ్యయనం చేస్తేగాని భవిష్యత్తు మరింత సుందరంగా నిర్మించుకోజాలమన్న వాస్తవదృక్పథం కలిగిన అబ్దుల్ ఖయ్యూం చరిత్ర పరిశోధనలకు, అధ్యయనానికి ప్రాధాన్యతనిస్తూ 1891లో 'Dairat-ul-Maurif' అను చరిత్ర పరిశోధనా సంస్థను స్థాపించారు. ఈ సంస్థ స్వదేశంలో మాత్రమే కాకుండా విదేశాలలో కూడా 'Great Research Centre' గా ఖ్యాతి గడించింది. ఆ కృషిలో భాగంగా ప్రజలకు- పరిశోధకులకు అపూర్వ గ్రంథాలను అందుబాటులో ఉంచాలని భావించి 1892లో

హైదరాబాదు నగరంలో State Central Library స్థాపనకు ముల్లా అబ్దుల్ ఖయ్యూం కారణమయ్యారు.

ముస్లింల ధార్మిక వ్యవహారాలలో బ్రిటీషు అధికారుల జోక్యాన్ని సహించకపోగా, ఆ ప్రయత్నాలను సాహసంతో అబ్దుల్ ఖయ్యూం అడ్డుకున్నారు. ముస్లింలు పవిత్రంగా భావించి సేవించు 'పవిత్ర జలం' అందిస్తున్న మక్కాలోని జమ్-జమ్ బావి అక్కడ ఆనారోగ్య వాతావరణం ఏర్పడడానికి కారణమంటూ ఆ బావిని తక్షణమే మూసి వేయాలని, 1894లో బ్రిటీషు అధికారి డాక్టర్ ఎర్నెస్ట్ హార్ట్ (Dr.Earnest Hart) హైదరాబాదు వచ్చి స్థానిక పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగిన బహిరంగ సమావేశంలో ప్రకటించాడు. ఆ సమావేశంలో పాల్గొన్న నగరంలోని ముస్లిం ప్రముఖులంతా ఆంగ్లేయుడి వ్యాఖ్యానాల మీద ఏమాత్రం స్పందించకుండా మిన్నకుండిపోగా, ముస్లింల ధార్మిక విషయాలలో జోక్యం చేసుకుంటే సహించేదిలేదని ముల్లా అబ్దుల్ ఖయ్యూం తీవ్రంగా హెచ్చరించడంతో ఖంగుతిన్న ఆ ఆంగ్లేయుడు నగరం నుండి చల్లగా జారుకున్నాడు.

హజ్ యాత్రకు సంబంధించిన అనుమతుల విషయంలో విధించిన అహేతుక నియమ-నిబంధనలను 1905లో బెనారస్‌లో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ప్రస్తావించి, ఆ ఆవరోధాలను ముల్లా అబ్దుల్ ఖయ్యూం రద్దుచేయించారు. జాతీయంగా-అంతర్జాతీయంగా ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యల మీద స్పందిస్తూ పలు చర్యలు చేపట్టారు. ఆనాడు టర్కీ సమస్యల వలయంలో చిక్కుకున్నందున డెమాస్కస్ నుండి మదీనా వరకు వేయనున్న రైలు మార్గానికి గాను ఆర్థిక చేయూత నిచ్చేందుకు Hejaj Railway Construction Fund ను ఏర్పాటు చేశారు. Hejaj Railway Construction Fund కోసం దేశమంతా పర్యటించి అత్యధిక మొత్తాన్ని సమకూర్చి ఆ నిధిని రైలుమార్గం నిర్మాణం కోసం పంపారు. (The Freedom Struggle In Hyderabd, Page. 69)

విద్యావ్యాప్తి కోసం నిర్బంధ విద్యావిధానాన్ని మొదటి నుండి ప్రచారం గావిస్తూన్న ముల్లా అబ్దుల్ ఖయ్యూం, ఆ ప్రయత్నంలో తనకు కలిగిన తీపి-చేదు వాస్తవాల నేపథ్యంలో తన అభిప్రాయాలను, ఆలోచనలను క్రోడీకరించి ఉర్దూ భాషలో 'An Appeal For Compulsory Education' అను ఉద్గ్రంథాన్ని 1894లో ప్రచురించారు. ఈ గ్రంథం విద్యావేత్తలను ఆలోచింపచేయడం మాత్రమే కాకుండా, ప్రజలలో చర్చకు కారణమై సంచలనం సృష్టించింది. ఈ గ్రంథంలో, ప్రజలు చదువుకుంటే, చైతన్యవంతులై ప్రభుత్వ చర్యలను ప్రశ్నిస్తారన్న పాలకుల ఆరోపణలకు జవాబిస్తూ, మంచి ప్రభుత్వాల పునాదులు విద్యావంతులు, సమర్థులైన ప్రజల ఆలోచనల ఆధారంగా ఏర్పడతాయన్నారు. 'నిర్భంధం' అన్నది మంచిది కాదని, 'నిర్భంధ విద్య' వలన ప్రజల నుండి వ్యతిరేకత వస్తుందన్నారు. విద్యావ్యాప్తికి

అధికంగా వ్యయం కాగలదన్న వ్యతిరేక వాదనలను ప్రస్తావిస్తూ, ప్రజల జీవన ప్రమాణాలను ఉన్నతీకరించేందుకు విద్యావ్యాప్తిని నిర్బంధంగానైనా అమలుపర్చక తప్పదన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం ప్రధానమైనప్పుడు వ్యయం గురించి పాలకులు ఆలోచించ కూడదన్నారు. సామాన్య ప్రజలు విద్యావంతులైతే ఉన్నతవర్గాల పట్ల గౌరవమర్యాదలు పాటించరని సాగిన ప్రచారాన్ని ఖండిస్తూ, ఉచ్ఛనీచాల వివక్ష వ్యక్తుల వ్యక్తిత్వాలను బట్టి ఉంటాయని ముల్లా అబ్దుల్ ఖయ్యూం స్పష్టం చేశారు. (The Freedom Struggle In Hyderabd, Page.65)

జాతీయ కాంగ్రెస్‌ను మనసావాచ కర్మణా అభిమానించిన ముల్లా అబ్దుల్ ఖయ్యూం ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం నిర్దేశించిన విధంగా నడుచుకోని స్వార్థపూరిత అధికారులను ప్రజల పక్షంగా నిలదీయడానికి భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడిందన్నారు. ఈ సంస్థ ఏం తప్పు చేసింది? ప్రభుత్వం ప్రజలకు కల్పించిన హక్కులను ప్రశ్నించింది. అటువంటి సంస్థ చట్టవిరుద్ధం ఏలా అవుతుంది? ఏ కమ్యూనిటీలను ఈ సంస్థ రెచ్చగొట్టింది? ప్రభుత్వ భజనపరులు, వ్యక్తి పూజగాళ్ళు, స్వదేశీ శత్రువులు మాత్రమే భారత జాతీయ కాంగ్రెస్ వ్యతిరేకులని ప్రకటిస్తూ ఆయన తన విమర్శకుల మీద తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. (The Freedom Struggle In Hyderabd, Page.66)

ప్రతిభ, కార్యదక్షత వలన ప్రభుత్వంలో పదోన్నతులు పొందుతూ ముందుకు సాగిన ముల్లా అబ్దుల్ ఖయ్యూం 1900 ప్రాంతంలో రాయచూరు జిల్లా లింగసూర్ వద్ద కలక్టరుగా నియుక్తులయ్యారు. అక్కడ ఆయన పని చేస్తుండగా, ఆ ప్రాంతంలో ప్లేగు వ్యాధి వ్యాపించింది. ఆ సందర్భంగా ఎటువంటి పునరావాస ఏర్పాట్లు చూపకుండా అకస్మాత్తుగా గ్రామాలు ఖాళీచేయమని ప్లేగు బాధితులను, ప్రజలను ఆంగ్లేయాధికారులు ఆదేశించడాన్ని, ప్రజలను బలవంతంగా తమ గ్రామాల నుండి తరలించడాన్ని ఆయన తీవ్రంగా నిరసించారు.

ఈ సందర్భంగా ఆంగ్లేయాధికారుల నిర్ణయాలను, చర్యలను తప్పుపట్టడంతో అధికారులు ముల్లా అబ్దుల్ ఖయ్యూం మీద కక్షగట్టారు. అసత్య ఆరోపణలతో ఆయన మీద ఫిర్యాదులు చేశారు. ఆ ఫిర్యాదుల వెనుకనున్న నిజానిజాలు తెలిసినా కూడా ఆంగ్లేయుల పెత్తనం సాగుతున్న హైదరాబాదు సంస్థానంలో ఆయనకు న్యాయం జరగకపోవడంతో, 1901లో ప్రభుత్వ ఉద్యోగానికి అబ్దుల్ ఖయ్యూం రాజీనామా చేశారు.

ప్రభుత్వ సర్వీసు నుండి విముక్తి పొందిన ముల్లా అబ్దుల్ ఖయ్యూం భారత జాతీయ కాంగ్రెస్, ప్రజా సంక్షేమ కార్యకలాపాలలో మరింత చురుకుగా పాల్గొన సాగారు. నిజాం సంస్థానాధీశుని రాజకీయ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, జాతీయ కాంగ్రెస్ పక్షం వహించి ప్రచార కార్యక్రమాలను మరింతగా ఉధృతం చేయడం ఇష్టంలేని ప్రభుభక్తిపరులైన కొంత మంది స్వజనులు, నిజాం అనుగ్రహం ఆశించే కొన్ని ఉర్దూ పత్రికలు

పనిగట్టుకుని ఆయనను విమర్శించసాగాయి. ఆ కువిమర్శలను ఆయన ఏమాత్రం పట్టించుకోకుండా మద్రాసు, బెనారస్‌లలో జరిగిన బారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలకు ఉత్సాహంగా హాజరయ్యారు. ఆ సమావేశాలకు హాజరు కావడం మాత్రమే కాకుండా ఆ సమావేశాలలో జరిగిన చర్చలు, నిర్ణయాల సారాంశానికి అక్షర రూపం కల్పించి కరపత్రాలు ముద్రించి ప్రజలకు అందించసాగారు. ఈ విధంగా జాతీయోద్యమంలో ఆయన మరింత ముందుకు సాగుతున్న కొద్దీ విమర్శల జడివాన మరీ తీవ్రతరమయ్యింది.

ఆ వాతావరణంలో మిన్నకుండిపోవడం ఏమాత్రం సరికాదనుకున్న ముల్లా ఖయ్యూం, Indian National Congress and the Muslims అను శీర్షికతో 1905లో కరపత్రం ప్రచురించారు. ఈ కరపత్రంలో ప్రత్యర్థుల విమర్శలను చాలా బలంగా పూర్వపక్షం చేస్తూ, విమర్శకుల నోళ్ళు మూయించారు. భారత జాతీయ కాంగ్రెస్ స్వభావాన్ని-స్వరూపాన్ని ఆయన ఈ కరపత్రంలో వివరించారు. స్వజనుల ప్రయోజనాల విషయంలో మతం-ప్రాంతం ఏమాత్రం అడ్డుకావన్నారు. ప్రజల పక్షం వహించి, ప్రజల సంక్షేమం కోసం కృషిసల్పే సంస్థల పట్ల పాలకులు గాని అధికారులుగాని కినుక వహించాల్సిన అవసరం ఏమాత్రం లేదని ఆయన చాలా స్పష్టంగా వివరించారు.

ఈ విమర్శల జడివానకు ఉర్దూ పత్రిక **ముఖబరా-యే-దక్కన్** (Mukhabar-e-Deccan) నాంది పలికి ప్రచారం కల్పించగా, **ది ప్యాసా అక్బార్** (The Paisa Akbhar) అను పత్రిక ఆయన సమాధానాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి ప్రచురించింది. ఈ విమర్శలకు స్వయంగా ముల్లా అబ్దుల్ ఖయ్యూం మాత్రమే కాకుండా ఆయన కుమారుడు అబ్దుల్ మునిం కూడా సమాధానమిస్తూ, భారత జాతీయ కాంగ్రెస్‌ను అన్ని మతాల ప్రజల భాగస్వామ్య సంస్థగా పేర్కొన్నారు. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల సాధన విషయంలో వ్యక్తిగత, మత పరమైన ధార్మిక విభేదాలు అడ్డుకాలేవన్నారు. ఓ సాంఘిక జనసముదాయం మనోభావాలను గాయపర్చే అంశాలను జాతీయ కాంగ్రెస్ చర్చకు స్వీకరించరాదన్న తీర్మానాన్ని ఉటంకిస్తూ, ప్రజలంతా ముఖ్యంగా ముస్లింలు జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించాలని ఒకవైపున కోరుతూ, ప్రత్యర్థులు రేకెత్తించిన విమర్శలకు చరిత్ర-ధార్మిక గ్రంథాల ఆధారంగా ముల్లా అబ్దుల్ ఖయ్యూం మరోవైపున పదునైన సమాధానాలు ఇచ్చారు.

1905లో బెంగాలు విభజన సందర్భంగా వెల్లువెత్తిన స్వదేశీ ఉద్యమంలో డాక్టర్ అఘోరనాథ్ చటోపాధ్యాయతో కలసి హైదరాబాదు సంస్థానంలో స్వదేశీ ఉద్యమానికి జవసత్వాలు అందించడంలో అబ్దుల్ ఖయ్యూం తోడ్పడ్డారు. జాతీయోద్యమం విజయం కోసం హిందూ-ముస్లింల ఐక్యతావసరాన్ని గుర్తించి ఆ దిశగా కృషి సాగించారు. మహారాష్ట్రలో బాలగంగాధర తిలక్ ప్రారంభించిన 'గణేష్ మహోత్సవ' కార్యక్రమాన్ని

హైదరాబాదులో తొలిసారిగా నిర్వహించిన కేశవరావు కొర్టార్ (Mr. Keshav Rao Koratkar) ఆహ్వానం మేరకు ముల్లా ఖయ్యూం గణేష్ మహోత్సవంలో పాల్గొన్నారు. ముల్లా అబ్దుల్ ఖయ్యూం హిందూ-ముస్లింల ఐక్యత కోసం ఆనాడు చేసిన కృషిని సరోజిని నాయుడు ప్రస్తావిస్తూ, '**ఆయన హిందూ-ముస్లింల ఐక్యతా ప్రవక్త మాత్రమే కాకుండా ఐక్యతకు సజీవరూపం**' (He was not only the messenger but the living messenger of Hindu-Muslim Unity) అని ప్రస్తుతించారు.

అక్షరజ్ఞానానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చిన ముల్లా అబ్దుల్ ఖయ్యూం జీవితాంతం ఆ దిశగా బహుళ ప్రచారం గావించారు. ఆయన ప్రచారం, కృషి ఫలితంగా 1915లో హైదరాబాదు నగరంలో, ప్రముఖ ఉర్దూ పత్రిక **'సహీఫా'** (Sahifa) యజమాని- సంపాదకులు మౌల్వీ మహమ్మద్ అక్బర్ అలీ, మీర్జా మొహమ్మద్ బేగ్, అబ్దుల్ బాసిత్, మౌల్వీ మొహమ్మద్ ముర్తాజా లాంటి యువ గ్రాడ్యుయేట్లు కలసి First Educational Conference ను నిర్వహించారు. ఆ క్రమంలో సాగిన పలు ప్రయత్నాల ఫలితంగా 1919 ఆగష్టు 28న '**ఉస్మానియా విశ్వ విద్యాలయం**' ఉనికిలోకి వచ్చింది. ఈ మేరకు ముల్లా అబ్దుల్ ఖయ్యూం కలలను నిజమయ్యాయి. ( Highlights of Freedom Movement in Andhra Pradesh, Dr. Sarojini Regani, AP Govt. Publications, Hyderabd,1972, Page173)

ఈ విధంగా జీవితపర్యంతం అటు విద్యావ్యాప్తికి, ప్రజలలో పునర్వికాసానికి, ఇటు భారత జాతీయోద్యమానికి తనను తాను పూర్తిగా అంకితం చేసుకుని **'గొప్ప ముస్లిం, గొప్ప భారతీయుడు, మరియు గొప్ప మనీషి'** అని ప్రముఖులు, ప్రజలచే కీర్తించబడిన ముల్లా అబ్దుల్ ఖయ్యూం 1906 అక్టోబరు 27న కన్నుమూశారు.

'భారతకోకిల' సరోజినీ నాయుడు తన తండ్రి డాక్టర్ అఘోరనాథ్ చటోపాధ్యాయతో ముల్లా అబ్దుల్ ఖయ్యూంకు గల సన్నిహిత స్నేహబంధాన్ని, ఆయనలోని దేశభక్తి భావనను, భారత జాతీయ కాంగ్రెస్ పట్ల ఆయనలో గల నిబద్ధతను, ఆయన విశిష్ట గుణ గణాలను స్మరణకు తెచ్చుకుంటూ 1941 జూన్ 19న రాసిన సుదీర్ఘ 'అక్షరనివాళి'లో **బ్రిటీషు ఇండియాలోని 'ఇండియన్ స్టేట్' లో దేశభక్తి గురించి ఆలోచించటమే రాజద్రోహంగా పరిగణిస్తున్న తరుణంలో దేశ రాజకీయ విముక్తికోసం, ప్రగతికోసం గొంతెత్తడం అత్యంత ధైర్య సాహసాలతో కూడిన అసాధారణ విషయం ... ఆయన గొప్ప మేధావి, పోరాట యోధుడు, గొప్ప దేశభక్తుడు,** అని ముల్లా అబ్దుల్ ఖయ్యూం వ్యక్తిత్వాన్ని అభివర్ణించారు. ( The Freedom Struggle In Hyderabad, Vol. III, Page. 73)

◆◆◆

## మన్యం పోరులో అల్లూరికి అండదండలందించిన

# 10. ఫజులుల్లా ఖాన్

(-1922)

**జా**తీయోద్యమంలో పాల్గొని కష్టనష్టాలను సంతోషంగా అనుభవించిన వారు అసంఖ్యాకం. దుర్భరమైన జైలు జీవితం, చిత్రహింసలు, యావజ్జీవ కారాగారవాసం, ప్రవాస జీవితం, చివరకు ఉరిశిక్షలు తప్పవని తెలిసినా పరాయి పాలకులను మాతృభూమి నుండి పారద్రోలేందుకు లెక్కకు మించి ముందుకు వచ్చారు. ఆ త్యాగధనులు ఆశించిన స్వేచ్ఛా –స్వాతంత్ర్యాలు లభించినా, అలనాటి యోధులందరి సాహసకృత్యాలు చరిత్ర పుటలకు ఎక్కలేదు. ఈ పరిస్థితి ముస్లిం యోధులలో మరింతగా ఎక్కువగా కన్పిస్తుంది.

అనాసక్తి, అవిద్య, ఆర్థికలేమి ఈ పరిస్థితికి ఒక కారణమైతే, భారత విభజనాంతర పరిణామాలు చరిత్ర నమోదును మరింత జటిలం చేసి, నిష్పాక్షికతకు దూరం చేశాయి. ఆ కారణంగా పలువురి త్యాగమయ పోరాట చరిత్రలు చరిత్ర పుటలలో సరైన స్థానం పొందలేదు. అక్కడక్కడ కన్పించినా అవి సామాన్యులకు అందుబాటులో ఉండని ప్రామాణిక చరిత్ర గ్రంథాలకు పరిమితమయ్యాయి. ఆ చరిత్రలు పాపులర్ చరిత్ర గ్రంథాలలో చోటు చేసుకోకపోవటం వలన ప్రజా బాహుళ్యానికి బహుముఖంగా అందకుండా పోయాయి. ఈ మేరకు మరుగున పడిపోయిన స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రలలో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వంలో డిప్యూటీ కలక్టరుగా బాధ్యతలు నిర్వహించిన ఫజులుల్లా ఖాన్‌గారిదొకటి.

ఖిలాఫత్-సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన ఉద్యమాల తరువాత ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రత్యేక వాతావరణం ఏర్పడింది. ఆ వాతావరణం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని అటవీ ప్రాంతమైన మన్యంలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో **మన్య విప్లవం** 1922-24 మధ్యలో సాగింది. గిరిజన ప్రాంతంలో రగిలిన ఈ విప్లవం ప్రత్యేక చరిత్ర సృష్టించుకుంది.

ప్రపంచ ప్రజలను ఆకట్టుకున్న ఆ చారిత్రక మన్యం పోరాటం సమయంలో మన్యం ప్రాంతపు డిప్యూటీ కలక్టరుగా పనిచేస్తున్న ఫజులుల్లా ఖాన్, మన్యం యోధుల నాయకుడు అల్లూరి సీతారామరాజు పోరాటానికి తోడ్పాటునిచ్చారు. ఈ పోరాటంలో రాజుకు తనదైన రీతిలో ఆయన సహాయపడ్డారు. ఆయనకు అడ్డతీగల సమీపంలో 60 ఎకరాల భూమిని ఫజులుల్లా ఖాన్ మంజూరు చేయించారు. అల్లూరి తండ్రి వెంకట్రామ రాజుకు ఫజులుల్లా ఖాన్ సహాధ్యాయి. ఆ ఇరువురు మంచి మిత్రులు. ఆ ఇరువురి నడుమ స్నేహం ఆ మిత్రుల వయస్సులతో బాటు పెరిగింది. అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను **'మన్యంలో విప్లవం (అల్లూరి సీతారామరాజు)'** పేరిట రాసిన పొన్నలూరి రాధాకృష్ణమూర్తి తన గ్రంథంలో డిప్యూటీ కలక్టరు ఫజులుల్లా ఖాన్ గురించి, మన్యం విప్లవంలో ఆయన పాత్ర, అల్లూరికి ఆయన అందచేసిన అండదండల గురించి వివరంగా పేర్కొన్నారు.

ఆ వివరాల ప్రకారం, రామరాజు తండ్రికి, ఫజులుల్లా ఖాన్‌కు మంచి స్నేహ సంబంధాలున్నాయి. ఆ విషయాన్ని వివరిస్తూ, **రామరాజు తండ్రియైన వెంకట్రామరాజు గారికి ఫజులుల్లా ఖాన్ గారు చిన్ననాటి సహాధ్యాయులు. వారిరువురి నడుమ స్నేహము వారి వయస్సుతో బాటుగా పెరిగి పెద్దదైనది....తన స్నేహితుని కుమారుని ప్రమాదములలో బడద్రోయుటకు మనసొప్పలేదు. తనకు గల అధికార మూలమున రక్షణ చేయదలచెను,** అని పొన్నలూరి పేర్కొన్నారు. (మన్యంలో విప్లవం (అల్లూరి సీతారామరాజు), పొన్నలూరి రాధాకృష్ణమూర్తి, ప్రజా ప్రచురణలు, ఏలూరు, 1975, పేజి.64).

అల్లూరి సీతారామరాజుకు ఫజులుల్లా ఖాన్‌కు మధ్యగల సంబంధం-సందర్భాన్ని **'తెలుగు వెలుగు (విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జీవిత కథ)'** గ్రంథంలో కూడా గ్రంథ రచయిత్రి కె రాజ్యలక్ష్మి ఉటంకించారు. 1988లో మొదటి సారిగా రవీంద్ర పబ్లిషింగ్ హౌస్ (గుంటూరు) ప్రచురించిన ఈ గ్రంథంలో ఫజులుల్లా ఖాన్ వ్యక్తిత్వం గురించి రాస్తూ, **పోలవరంలో ఫజులుల్లా ఖాన్ అను నొక మహమ్మదీయుడు డెప్యూటీ కలెక్టరుగా పని చేయుచున్నాడు. అతడు ఉత్తమమైన శీలము గలవాడు. దైవభక్తి పరాయణుడు** అని పేర్కొన్నారు. రామరాజు కుటుంబానికి ఆయనతో సంబంధాన్ని ప్రస్తావిస్తూ, ఆయన **రామరాజు తండ్రికి స్నేహితుడు. అతని పట్ల రామరాజునకు గురుభావము గలదు. రామరాజు అతనియెడ గల గౌరవభావము చేత అతని మాట కాదనలేదు,** అని వివరించారు. (పేజి.51)

అంతేకాకుండా ఫజులుల్లా ఖాన్‌ను రామరాజు **'బాబా'** అని పిలిచినట్టుగా రచయిత్రి కె రాజ్యలక్ష్మి గ్రంథంలో పేర్కొనడాన్ని బట్టి రామరాజుకు ఆయన పట్ల ఎంతటి గౌరవభావం ఉన్నదో విశదమౌతుంది.

డిప్యూటీ కలక్టర్ ఫజులుల్లా ఖాన్‌కు అల్లూరి పట్ల ఏర్పడిన ప్రత్యేక ఆసక్తి వలన ఆయనను తనవద్దకు తరుచుగా పిలిపించుకుని రాజుతో ఆయన వేదాంత విషయాలను చర్చించేవారట. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, **నరిసిపట్నములో నిర్బంధ వాసము నాల్గు వారములు గడిచిన పిదప, ఫజులుల్లాగారు ఒకనాడు రాజును పిలిపించి చాల సేపు వేదాంత చర్చ సలిపిరి**. అని పొన్నలూరి పేర్కొన్నారు. (మన్యంలో విప్లవం, పేజి.64). ఈ వేదాంత చర్చల చాటున రాజు, ఫజులుల్లా ఖాన్‌లు ప్రభుత్వ చర్యలు, అడవిబిడ్డల మీద అధికారుల జులుం, పరిష్కారమార్గాలు, ఆ మార్గాల ద్వారా సత్ఫలితాలు రాబట్టేందుకు అనుసరించాల్సిన పథకాల గురించి చర్చించారు. ఆ చర్చల పర్యవసానంగా ఏర్పడిన పునాదుల మీద ఆ తరువాతి కాలంలో మన్య విప్లవ నిర్మాణం సాగింది.

ఈ విధంగా రాజు సాగించిన పోరాటానికి ఫజులుల్లా ఖాన్ క్రియాశీలక తోడ్పాటు అందించారు. రామరాజు మన్యంలో స్థిరపడేందుకు సాగించిన ప్రయత్నాలకు ఖాన్ పూర్తిగా చేయూత నిచ్చారు. వ్యవసాయం ముసుగులో అల్లూరి మన్యంలో స్థిరపడి మన్యం వీరులను ఆంగ్లేయ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవింప చేయడంలో ఫజులుల్లా ఖాన్ క్రియాశీలక భాగస్వామ్యం అందించారు. పథకం ప్రకారంగా రాజు తనకు కావాల్సిన భూమిని ప్రభుత్వం నుండి పొందేందుకు ఫజులుల్లా ఖాన్ ద్వారా అర్జీ పంపుకున్నారు. ఈ విషయమై అప్పటికే ఓ నిర్ణయానికి వచ్చి ఉన్న ఫజులుల్లా ఖాన్ ఆయనకు సహకరించారు. ఈ విషయంలో ఫజులుల్లా తన అధికారహోదాతో సిఫారస్సు చేసి భూమిని రాజుకు దఖలు చేయించారు.

ఆ విషయాన్ని పొన్నలూరి ప్రస్తావిస్తూ, **నిరుపేదయగు రాజు ఈ మన్యమునందే జీవించుటకు వలసిననంత భూమిని యిప్పించమని కలెక్టరు ఫజులుల్లా ద్వారా ప్రభుత్వమును కోరెను**. ఆ మేరకు, **పైడిపుట్టి యను గ్రామము గలదు. అచట దాదాపు 60 ఎకరముల భూమిని ఫజులుల్లాగారు ఇప్పించిరి. ఆ భూమిని దున్నించి పెట్టు బాధ్యత దచ్చెర్తి ముఠాదారుని పై ఆనతించిరి**, అని పేర్కొన్నారు. (మన్యంలో విప్లవం : పేజి. 64). ఈ భూమి లభించడంతో, అక్కడ గృహనిర్మాణం గావిస్తూ, భూమిని సాగుచేస్తూ, వ్యవసాయ కార్యకలాపాలలో తాను నిమగ్నమైనట్టుగా నటిస్తూ, విప్లవోద్యమాన్ని రగిలించేందుకు అల్లూరికి అవకాశం దక్కింది.

అల్లూరి, ఫజులుల్లాల మధ్య ఏర్పడిన స్నేహసంబంధం మరింత పరిపక్వత చెంది **మన్య విప్లవం** దిశగా సాగింది. మన్యంలో విప్లవం నిర్మాణం గురించి ఈ ఇరువురి

మధ్యన చర్చలు చాలా రహస్యంగా సాగాయి. పథకం ప్రకారంగా ఈ ఇరువురి మధ్యన వేదాంత చర్చల చాటున సాగిన విప్లవోద్యమానికి సంబంధించిన రహస్య చర్చలను ఫజుల్లా ఖాన్ సహచర అధికారులు గానీ, ఆంగ్లేయ అధికారులు గాని, ఆంగ్ల ప్రభుత్వ ఉద్యోగులు గాని అంతగా పట్టించుకోలేదు.

ఈ విషయం గురించి రాధాకృష్ణమూర్తి రాస్తూ, **ఎప్పుడైనా అతడు** (రామరాజు) **వెలుపలికి కదలుచో శ్రీ ఫజులుల్లా గారింట పోలీసులకు ప్రత్యక్షమగువాడు. ఖాన్ గారితో సలుపు యీ సమావేశములకు మత వేదాంత అభిరుచులే కారణమని ఉద్యోగులు భ్రమించువారు**, అని రాశారు (పేజి.67). బ్రిటీషు అధికారుల, పోలీసుల నిఘా నుండి రాజు తప్పించుకుని స్వేచ్ఛగా ప్రజలలో సంచారం చేసేందుకు, ప్రజలతో సత్సంబంధాలు పెట్టుకునేందుకు, బ్రిటీషు పాలకులు, అధికారుల చర్యలకు వ్యతిరేకంగా అటవీపుత్రులను కూడగట్టేందుకు ఫజులుల్లా ఖాన్ ఆయనకు పరోక్షంగా సహకరించారు.

ఈ విషయాన్ని పొన్నలూరి వివరిస్తూ, **కలెక్టరు గారగు ఫజులుల్లా ఖాను గారికి రామరాజు మరొక పిటీషన్ పెట్టెను.** ఆ పిటీషనులో, **నాకు భయము ఎక్కువగానున్నది. నేను మన్యమున నుండజాలను. నన్నీ పోలీసుల దృష్టి నుండి తమరు తప్పించినచో, నేను సన్యాసిని గాన నేపాలు పోయెదను**, అని భావము వచ్చేలా పేర్కొన్నారు. ఆ పిటీషను మీద స్పందిస్తూ, **వెంటనే ఫజులుల్లా గారు పోలీసులకు ఉత్తర్వులు బంపించి, రామరాజును స్వేచ్ఛగా తిరుగనీయ వలసినదిగా తెలియజేసిరి**, అని వివరించారు. (పేజి. 68)

ఈ వివరాలను పరిశీలించినట్లయితే, రామరాజుకు డిప్యూటీ కలక్టరు ఫజులుల్లా ఖాన్ కేవలం మిత్రుని కుమారుడు కనుక సహకరించడం కాకుండా, పరాయి పాలకుల పెత్తనాన్ని తుదముట్టించాలన్న ఆలోచనలు కూడా ఆయనలో ఉన్నట్టు అవగతం కాగలదు. ఆ కారణంగా ఆయన బ్రిటీష్ ఉన్నతాధికారులకు ఎటువంటి అనుమానం కలుగకుండా రామరాజుకు ఖాన్ అండదండలు అందించారు. మన్యం చేరిన రామరాజుకు మన్యంలో ఉండి విప్లవాగ్ని రగిల్చేందుకు ఫజలుల్లా అన్నివిధాల సహకరించారు.

ఈ విషయమై పొన్నలూరి మరింత వివరంగా రాస్తూ, **కృష్ణదేవి పేటలో అలజడి యారంభమైనపుడే రాజును స్థాన భ్రష్టునిజేయక, అతనికి భూములిప్పించి, మన్యములోనే నిల్పిన ఖాన్‌గారి చర్యలు ఈ పితూరికి పూర్తి సహాయమైనటుల తెల్ల ఉద్యోగులు** (ప్రభుత్వ ఉద్యోగులు) **తమ విశ్వాసమును ప్రకటించిరి,** అని పేర్కొన్నారు (పేజి.76). రచయిత పొన్నలూరి అంతటితో ఆగలేదు. మన్యం విప్లవానికి రామరాజు నాయకుడైతే, ఆ నాయకుడెక్కిన రథాన్ని నడిపించు సారధిగా ఫజులుల్లా ఖాన్‌ను అభివర్ణించారు. అత్యంత ప్రాధాన్యతగల ఈ అంశాన్ని మరింతగా వివరిస్తూ, **రామరాజు ప్రవేశించి నంతనే, విపదాంధకారయుత**

**మగు మన్యలోకమున విప్లవ భానుడుదయించి నటులయ్యెను. కాని యా భానుని** (రాజు) **తీవ్ర గమనమునకు రథ సారధ్యమును వహించవలసిన శ్రీయుత ఫజులుల్లా ఖానుగారు మృత్యు శయ్యపై నున్నారు. ఫజులుల్లాగారు గొప్ప వ్యాధిగ్రస్తులైపోయిరి. పిదప అనతి కాలంలో ఖాను గారు స్వర్గస్తులైరి.** (మన్యంలో విప్లవం, పేజి.76)

ఈ వ్యాఖ్యానాన్ని బట్టి మన్యం విప్లవం ఆవిర్భావంలో, దాని నడకలో డిప్యూటీ కలక్టరు ఫజులుల్లాఖాన్ ప్రధాన భాగస్వామి అని తెలుస్తుంది. ఆయన ఏ మేరకు ముందుకు సాగారంటే, బ్రిటీష్ ప్రభుత్వ ఉన్నతాధికారి అయిన ఫజులుల్లా ఖాన్ మరికొంత కాలం జీవించి ఉంటే ఆయన పూర్తిగా విప్లవోద్యమంలో నిమగ్నమైపోయేవారు. రాజు పోరాటం జరుపుతున్న యోధుడైతే, ఆ యోధుడికి మార్గం చూపుతూ, రక్షణ కల్పిస్తూ ముందుకు తీసుకపోగల రథసారధిగా ఫజులుల్లా ఖాన్‌ను పొన్నలూరి వర్ణించడం ద్వారా రామరాజు సాగించిన మన్యం పోరాటంలో ఖాన్ క్రియాశీలక పాత్ర దర్శనీయమౌతుంది.

అంతటి ప్రముఖ పాత్రను ఫజులూల్లా ఖాన్ నిర్వహిస్తే ఆంగ్లేయ ప్రభుత్వం మిన్నకుంటుందా? ప్రభుత్వ ఉన్నతాధికారి విప్లవోద్యమానికి సారధ్యం వహిస్తే ఆంగ్లేయ అధికారులు మిన్నకుంటారా? ఊరకుండిపోవడం ఏమాత్రం జరగదన్నది నిర్వివాదాంశం. ప్రభుత్వాధికారులందరికి గుణపాఠం కలిగేలా ఫజులుల్లా ఖాన్ మీద ప్రభుత్వం తప్పక చర్యలను తీసుకుంటుది. ఈ విషయాన్ని కూడా రచయిత పొన్నలూరి రాధాకృష్ణ ఆంగ్ల ప్రభుత్వం చేత నిషేధించబడిన తన గ్రంథంలో వివరిస్తూ, **ఖాన్ గారు మరికొంతకాలం జీవించియున్నచో, ఆయన కంఠానికి ఉరిబెట్టి ప్రభుత్వము తన ఆగ్రహమును లోకమునకు ప్రకటించేది**, అని ప్రకటించారు. (మన్యంలో విప్లవంః పేజి76)

ఈ విషయం ఆంగ్ల ప్రభుత్వంలో ఉన్నతాధికారి అయినటువంటి ఫజులుల్లా ఖాన్‌కు తెలియదా? తెలిసి కూడా ఆయన రామరాజుకు రక్షణ, ప్రేరణ కల్గించడం ద్వారా ఆయనలో గూడు కట్టుకుని ఉన్న మాతృభూమి పట్లగల గౌరవం, ప్రజలను పట్టి పీడిస్తున్న ఆంగ్ల ప్రభుత్వం, ఆంగ్లేయాధికారుల పట్ల వెల్లువెత్తుతున్న విద్వేషం విదితమౌతుంది. ఉరిశిక్ష తప్పని స్థాయిలో ఆయన చర్యలను చేపట్టి ముందుకు సాగి మన్యం ప్రజలలో విప్లవాగ్నులు రగిలించేందుకు వ్యూహాత్మకంగా ముందుకు సాగిన ఆయన అన్ని కష్టనష్టాలకు సిద్ధమైనట్టుంది.

మన్యం పోరుకు ప్రజలను సమాయత్తం చేయడం, పోరు బాటకు పునాదులు వేయు ప్రయత్నాలలో గణనీయమైన పాత్రను నిర్వహించిన డిప్యూటీ కలక్టరు ఫజులుల్లా ఖాన్‌కు చరిత్రలో తగినంత స్థానం లభించలేదు. విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజుకు అన్నివిధాల తోడ్పాటునందించి, మన్యవిప్లవం ప్రజ్వరిల్లేందుకు గట్టి పునాదిని నిర్మించడంలో భాగస్వామ్యం వహించిన ఆ యోధునికి సరైన స్థానం లభించకపోవటం విచారకరం.

ప్రభుత్వం ఉరి విధించగల శిక్షకు కూడా ఏమాత్రం వెరవక, ప్రాణాలను తృణప్రాయంగా భావించి అల్లూరికి అండదండలందిస్తూ ముందుకు సాగిన ఉన్నతాధికారియైన ఫజులుల్లా ఖాన్ పాత్రకు చరిత్రకారులు తగిన న్యాయం చేయలేదు.

ఈ విషయం పట్ల పొన్నలూరి కూడా కడు విచారం వ్యక్తం చేస్తూ, **ఇంతకును ఫజులుల్లా దేశభక్తి మరుగున పడినది,** అన్నారు. (మన్యంలో విప్లవం : పేజి.76). బ్రిటీష్ ప్రభుత్వం దృష్టిలో ఫజులుల్లా కంఠానికి ఉరిబెట్ట దగినంత నేరపూరిత చర్యకు ఆయన పాల్పడ్డారని, అల్లూరి సీతారామరాజుకు అన్ని విధాల అండగా నిలిచారని పొన్నలూరి రాధాకృష్ణమూర్తి కథనం స్పష్టంగా తెలుపుతోంది.


ఈ క్రమంలో డిప్యూటీ కలక్టరు ఫజులుల్లా ఖాన్ 1922 జూలై 27న మరణించారు. ఆయన కనుక సజీవంగా ఉండి ఉంటే అల్లూరి సీతారామరాజు సాగించిన మన్యం పోరాటానికి తప్పకుండా పూర్తి స్థాయిలో మార్గదర్శకత్వం వహించి ఉండేవారని పొన్నలూరి వ్యక్తంచేసిన అభిప్రాయాన్ని బట్టి ఫజులుల్లా దేశభక్తిని, త్యాగనిరతి స్థాయిని అర్థం చేసుకోవచ్చు.

ఈ విధంగా అటు ప్రభుత్వంలో అధికారులుగా, ఉద్యోగులుగా ఉంటూ కూడా రహస్యంగా విప్లవకారులకు, ఉద్యమకారులకు తోడ్పాటు అందజేసిన త్యాగధనులు ఎందరో ఉన్నప్పటికీ, ఆ యోధులను కూడా ఫజులుల్లా ఖాన్‌ను మరచినట్టే చరిత్ర మరచిపోవడంతో, పరాయి పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటాలలో భాగస్వామ్యం వహించినటువంటి యోధుల విశేషాలు ప్రజలకు అందకుండా పోయాయి.

◆◆◆

మహత్తర పోరాటాల్లో పాల్గొంటున్న వారిని ఎన్నటికీ మరచిపోకండి ... మంచినీ, చెడునూ కూడా గుర్తుంచుకోండి ... మీ కోసం ఆత్మబలిదానం చేసిన వారిని గురించి సాధ్యమైనంత ఎక్కువ సమాచారం సేకరించండి ... ఈ విశేషాంశాలే రేపటికి చరిత్రగా స్థిరపడతాయి.

**– జ్యూలియస్ ఫ్యూజిక్.**



## నైజాం నడిగడ్డ మీద విదేశీ వస్త్రాలను దగ్ధం చేసిన

# 11. బద్రుల్ హసన్

(1898-1937)

**మా**తృభూమి విముక్తి కోసం పోరాటాలకు సిద్ధమైన స్వాతంత్ర్యసంగ్రామ వీరులు శతృవు ఎంతటి బలవంతుడైనా ఏమాత్రం లెక్కచేయకుండా ముందుకు సాగారు. ముంచుకు వచ్చే ముప్పును సైతం ఏమాత్రం ఖాతరు చేయక శతృవును తరిమి కొట్టేంత వరకు తమదైన పోరుబాటన నడిచి పలువురికి ఆదర్శప్రాయులయ్యారు. అటువంటి మార్గదర్శకులైన స్వాతంత్ర్యసమరయోధులో బద్రుల్ హసన్ ముఖ్యులు.

నాటి నైజాం సంస్థానం రాజధాని హైదరాబాద్‌లోని సంపన్న కులీన కుటుంబంలో బద్రుల్ హసన్ 1898లో జన్మించారు. ఆయన తండ్రి అమీర్ హసన్. నిజాం సంస్థానంలో అధికారి. ఆయన తల్లి ఫక్రుల్ హజియా హసన్ విలక్షణ వ్యక్తిత్వం గల మహిళ. ఆమె స్వాతంత్ర్యోద్యమానికి సర్వస్వం ధారబోశారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్‌చంద్ర బోస్, మౌలానా అబుల్‌కలాం ఆజాద్ లాంటి ప్రముఖులు ఆమెను ఎంతో గౌరవాభిమానాలతో **'అమ్మా జాన్'** అని సంబోధించేవారు. హైదరాబాద్‌లోని ట్రూప్ బజారులో గల 'అబిద్ మంజిల్' ఆమె నివాసం. సహాయనిరాకరణ-ఖిలాఫత్ ఉద్యమంలో భాగంగా 1920లో ఆమె తన అబిద్ మంజిల్‌లో విదేశీ వస్త్రాలను అగ్నికి ఆహుతిచ్చారు.

అమ్మా జాన్ స్వతంత్ర భావాలు ఆమె ముగ్గురు కుమారులను మరింతగా ఉద్దీపింప

చేశాయి. బద్రుల్ హసన్ పెద్ద కుమారుడు. రెండవ కుమారుడు జాఫర్ హసన్. ఆయన ప్రముఖ విద్యావేత్త. జాఫర్ కూడా అన్న బద్రుల్ హసన్‌తో కలసి జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఆమె మూడో కుమారుడు అబిద్ హసన్ సఫ్రాని. ఆయన నేతాజీ సుభాష్ చంద్రబోస్ సహచరుడు. స్వాతంత్ర్యోద్యమ సాహిత్య చరిత్రలో అపూర్వమనదగిన '**జైహింద్**', '**నేతాజీ**' నినాదాలను సృష్టించిన చిరస్మరణీయుడు.

అమ్మా జాన్ పెంపకంలో బద్రుల్ హసన్ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అభిలషించే జాతీయవాదయ్యారు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న ఆయన జర్నలిజం వైపు మొగ్గు చూపారు. జర్నలిస్టుగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను ఆకాంక్షిస్తున్న ప్రజల మనోభావాలకు అద్దం పడుతూ, జాతీయ దృక్పథాన్ని తన రచనల ద్వారా వ్యక్తం చేశారు. ఆ క్రమంలో ఆయన మహాత్మా గాంధీజీ సిద్ధాంతాలకు, బోధనలకు ఆకర్షితులయ్యారు. గాంధీజీ వద్ద స్వయంగా శిష్యరికం చేయాలన్న సంకల్పంతో హైదరాబాద్ వదలిపెట్టి సబర్మతి ఆశ్రమం చేరుకున్నారు. సబర్మతి ఆశ్రమంలో ఆశ్రమ నియమాలను పాటిస్తూ, చిత్తశుద్ధితో బాధ్యతలను నిర్వహిస్తూ మహాత్ముని మన్ననలు పొందారు.

గాంధీజీ సంపాదకత్వంలో ప్రచురితమవుతున్న '**యంగ్ ఇండియా**' పత్రికలో మద్యపాన నిషేధావశ్యకతను విశ్లేషిస్తూ వ్యాసాలు రాశారు. ఆ పత్రిక నిర్వహణలో గాంధీజీకి తొడ్పాటునందించారు. '**యంగ్ ఇండియా**' లో కొంతకాలం గడిపాక అలహాబాద్ నుండి వెలువడుతున్న '**ఇండిపెండెంట్**' ఆంగ్లపత్రికకు విలేకరిగా బాధ్యతలను నిర్వహించారు. ఈ పత్రికలో చాలాకాలం ఉద్యోగం చేశారు. ఆ సమయంలో బద్రుల్ హసన్ లోని జాతీయవాది తనదైన రీతిలో స్పందించాడు. జాతిని చైతన్యపరిచే రచనలు ముమ్మరంగా చేశాడు. జాతీయోద్యమానికి ప్రేరణ కలిగించే అంశాల మీద ఆయన రచనావ్యాసంగం సాగింది. ఆయన రచనలలో భావస్పష్టీకరణ, విషయ విశ్లేషణ బలంగా ఉండటంతో ఆయన వ్యాసాలు ప్రజల మనోభావాలను ఆకట్టుకోగలిగేవి, మేధావులను ఆలోచింపచేసేవి.

బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించగలగడమే కష్టతరంగా ఉండగా బద్రుల్ హసన్ 1920లో తిలక్ స్వరాజ్య నిధికి ధనం సమకూర్చేందుకు నడుంకట్టారు. ఈ మేరకు 23వేల రూపాయలను సేకరించి బొంబాయి వెళ్ళి స్వరాజ్యనిధికి స్వయంగా అందచేశారు. నిజాం నవాబు ఎన్ని ఆంక్షలను విధించినా, ఎన్ని కట్టుదిట్టాలు చేసినా గాంధీజీ తాత్విక సిద్ధాంతాలతో ప్రభావితులైన ఉద్యమకారులను నిలువరించలేకపోయాడు. బద్రుల్ హసన్ ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. విదేశీ వస్తువులను, బట్టలను త్యజించారు. బ్రిటీష్ రాకుమారుడు భారతసందర్శన సందర్భంగా విదేశీ వస్త్రాలను దగ్ధం చేశారు. బ్రిటీష్ పాలకులకు మిత్రుడు అయినటువంటి నిజాం నవాబు రాజ్యంలో

చిన్నపాటి నిరసన తెలపడం కూడా ఎంతో సాహసోపేత చర్య. అటువంటి కార్యక్రమాన్ని ధైర్యసాహసాలతో విజయవంతంగా నిర్వహించి నైజాం గడ్డ మీద విదేశీ వస్త్రాలను తగులపెట్టిన తొలి తెలుగు బిడ్డడు అయ్యాడు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన Who is Who of Freedom Struggle in Andhra Pradesh,1983, Page 387లో ప్రముఖ చరిత్ర పరిశోధకురాలు డాక్టర్ సరోజిని రెగాని ప్రత్యేకంగా పేర్కొన్నారు.

బద్రుల్ హసన్ ఖద్దరు ఉద్యమానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. ఖద్దరు ఉత్పత్తిని అత్యధికం చేసేందుకు బొంబాయి నుండి రాట్నాలు తెప్పించారు. హైదరాబాదు రాష్ట్రంలో ఆధునిక రాట్నాలను ప్రవేశపెట్టిన తొలి వ్యక్తిగా ఘనత వహించారు. ఆయన స్వయంగా ఖద్దరు ధరించారు. నైజాం పాలకుల అభీష్టానికి వ్యతిరేకంగా బద్రుల్ హసన్, అయన సోదరులు జాఫర్ హసన్‌లు సాంప్రదాయకమైన దుస్తులకు బదులుగా ఖద్దరు ధోవతి, గాంధీ టోపిని ధరించడంతో పాలకులు మండిపడ్డారు. ఈ బెదిరింపులను హసన్ ఖాతరు చేయలేదు. జాఫర్ హసన్, శ్రీకృష్ణ, పద్మజానాయుడులతో కలసి ఖద్దరు ఉద్యమ వ్యాప్తికి ఆయన అవిశ్రాంతంగా శ్రమించారు.

**నిజాం రాష్ట్రంలోని వివిధ కుల,మత వర్గాలకు చెందిన వారిలో సామరస్యం కలుగచేయాలని, ప్రాథమిక సభ్యత్వాలు సమకూర్చాలని, రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వం స్థాపించాలన్న** ఉద్దేశ్యంతో బూర్గుల రామకృష్ణారావు మార్గదర్శకత్వంలో పద్మజా నాయుడు, శ్రీనివాస శర్మ, అబుల్ హసన్ సయ్యద్ అలీ, ఫజులుర్రెహమాన్, సిరాజుల్ హసన్ తిర్మిజ్ లాంటి ప్రముఖులతో కలసి **నిజాం సబ్జెక్ట్సు లీగ్** (Nizam Subjects League) అను సంస్థను ఏర్పాటు చేయడంలో బద్రల్ హసన్ తోడ్పాటు అందించారు.

నిజాం సబ్జెక్ట్సు లీగ్ సంస్థ వ్యక్తం చేసిన భావాలలో ఉన్న ఔన్నత్యాన్ని ప్రజలలో ప్రచారం చేయలన్న ఉద్దేశ్యంతో బద్రుల్ హసన్ **విదర్ హైదరాబాద్** (Whither Hyderabad) అను గ్రంథాన్ని రాశారు. ఈ గ్రంథ రచన ద్వారా ప్రజలలో జాతీయ భావాలను, ప్రజా ప్రాతినిధ్య ఆలోచనలకు కలుగచేయాలని ప్రయత్నించారు. ఈ గ్రంథ రచన పూర్తిచేసినప్పటికి ప్రచురణ కష్టసాధ్యమైంది. గ్రంథ ప్రచురణకు నిజాం ప్రభుత్వం తీవ్ర ఆటంకాలు కల్పించింది. ఆ కారణంగా నిజాం సంస్థానం బయటకు వెళ్ళి ఆ గ్రంథాన్ని ప్రచురించాల్సి వచ్చింది. అలా వెలువడిన ఆ గ్రంథాన్ని నిజాం ప్రభుత్వం నిషేధించింది.

జాతీయోద్యమ కార్యక్రమాల నిర్వహణ, ప్రచార కార్యక్రమాలను మరింత ముమ్మరం చేసేందుకు బద్రుల్ హసన్ దృఢంగా సంకల్పించారు. ఉద్యమ సహచరుల మధ్యన సమన్వయం-సమాచారం కోసం ఆయన ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయన 'హైదరాబాదు బుక్ డిపో' పేరుతో పుస్తక విక్రయ కేంద్రం ఆరంభించారు. ఆ కేంద్రంలో

రహస్యంగా జాతీయోద్యమకారులైన హిందూ-ముస్లిం ప్రముఖుల సమావేశాలు నిర్వహించారు. జాతీయోద్యమ కార్యక్రమాల గురించి చర్చించేందుకు, కార్యకలాపాల రూపకల్పనకు 'హైదరాబాదు బుక్ డిపో' మంచి రహస్య కేంద్రంగా, కార్యకర్తలకు కూడలిగా ఉపయోగపడింది. (ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్యోద్యమం చరిత్ర : కాటం రమేష్)

మహాత్ముని అడుగుజాడల్లో సాగుతున్న బద్రుల్ హసన్ గ్రామీణాభివృద్ధి పట్ల అత్యధిక శ్రద్ధ కనపర్చారు. గ్రామాలలో కుటీర పరిశ్రమలను, అంతరించి పోతున్న వృత్తి పనులను పునరుద్ధరించాలని అభిలషించారు. ఆ దిశగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించారు. కుటీర పరిశ్రమల స్థాపనకు ఆయన దోహదకారయ్యారు. పరస్పర సహకారం ద్వారా పెట్టుబడుల సమస్యను అధిగమించగలమని, నైపుణ్యాన్ని అభివృద్ధి పర్చుకోగలమని విశ్వసించిన ఆయన సహకారోద్యమానికి కారకులయ్యారు. సహకార రంగంలో సంస్థల స్థాపనకు ఉద్యుక్తులయ్యారు. సహకారోద్యమ వ్యాప్తికి ఎంతో శ్రమించారు. సహకార భావన సమకూర్చే సత్ఫలితాలను, కలిగే మేలును ప్రజలకు వివరించారు. ఈ మేరకు హైదరాబాదులో సహకారవ్యవస్థకు ప్రాణప్రతిష్ట చేసిన ప్రముఖులలో బద్రుల్ హసన్ ఒకరయ్యారు. సహకార వ్యవస్థ విస్తరణకు నిరంతరం కృషిసల్పిన ఆయన సహకార భావనలు ప్రజలలో పరివ్యాప్తిగావించేందుకు 'Imdad-e-Bahami' అను ఉర్దూ పత్రికను ప్రారంభించి, దాని ద్వారా సహకార వ్యవస్థ ప్రాముఖ్యతను వివరించారు.

ఈ విధంగా అటు బ్రిటీష్, ఇటు నైజాం పాలకవర్గాలకు వ్యతిరేకంగా నిజాం గడ్డమీద స్వేచ్ఛా-స్వాతంత్ర్య భావనలను పరివ్యాప్తి చేయడంలో మాత్రమే కాకుండా, మహాత్ముని అడుగు జాడల్లో అటు కుటీర పరిశ్రమల పునరుద్ధరణ, ఖద్దరు ధారణను ప్రోత్సహించడం, ఇటు సహకార వ్యవస్థకు ప్రాణ ప్రతిష్ట చేయడం కోసం చివరి నిమిషం వరకు కృషిసల్పిన బద్రుల్ హసన్ 1937లో కన్నుమూశారు.

◆◆◆

**తోడో గులామీకే జంజీరే, బరసావో అంగారా !**
**హిందూ, ముసల్మాన్, సిఖ్ హమారా**
**భాయీ భాయీ ప్యారా**
**యే హై ఆజాదికా ఝుండా,**
**ఇసే సలామ్ హమారా !**

(1857లో ప్రథమ స్వాతంత్యసంగ్రామం సందర్భంగా, పోరాటయోధులను ఉత్తేజపర్చుతూ **మౌల్వీ లియాఖత్ అలీ ఖాన్** రాసిన ప్రబోధ గీతంలోని చరణాలు)



## బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఖ్యాతిగడించిన ధార్మికవేత్త

# 12. డాక్టర్ ఉమర్ అలీషా

(1885-1945)

స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఏదొక పాత్రను పోషించడాన్ని ప్రతి భారతీయుడు ఒక మహా భాగ్యంగా భావించారు. జాతీయోద్యమంలో పాల్గొనని భారతీయుడు ఉండని వాతావరణాన్ని ఆనాటి దేశభక్తియుత సమాజం సృష్టించింది. ఈ గడ్డ మీద పుట్టి పెరిగిన ప్రజలు ఏ వృత్తిలో వున్నా, ఏ ప్రవృత్తి కలిగియున్నా, ఎక్కడ ఉన్నా విదేశీ పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించడం తమ విధ్యుక్త ధర్మంగా భావించారు.

ఈ దిశగా తొలుత అక్షరజ్ఞానం గల చైతన్యవంత జనసముదాయం ఉద్యమించింది. ఆ తరువాత సామాన్య జనప్రవాహాన్ని పోరాట మార్గంలో మళ్లించేందుకు కృషి సాగించింది. ఆ ప్రయత్నంలో కవులు-కళాకారులు, రచయితలు కళా-సాహితీ రంగాల నుండి తగినపాత్ర నిర్వహించారు. ఆయా కళారూపాలు, సాహితీప్రక్రియల ద్వారా ప్రజలను చైతన్యవంతుల్ని చేశారు. ఒకవైపు సాంఘిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి, ప్రజలలో దేశభక్తి భావనలను ప్రబలం చేయాలన్నది సాంస్కృతిక పోరాట యోధుల ఆకాంక్ష. అజ్ఞానం, మూఢనమ్మకాలు, మతమౌఢ్యం, పేదరికం, బానిసత్వం, అవిద్య లాంటి భయంకర సాంఘిక రుగ్మతలతో కొట్టుమిట్టాడుతున్న సమాజాన్ని సంస్కరించి, బానిసత్వం ఎంత భరించరాని రుగ్మతో తెలిపి, విదేశీ పాలకుల మీద ధ్వజమెత్తడానికి ప్రజలను ఆయత్తం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేసిన తెలుగు గడ్డకు చెందిన కవులు, రచయితలకు, జాతీయోద్యమంలో ఓ ప్రత్యేక

స్థానం లభించింది. అటువంటి ప్రత్యేకతను సంతరించుకున్న స్వాతంత్ర్యసమర యోధుడు డాక్టర్ ఉమర్ అలీషా.

డాక్టర్ అలీషా పూర్వీకులు శతాబ్దాల క్రితం పర్షియా (ఇరాన్) నుండి ఢిల్లీ వచ్చి, అటునుండి హైదరాబాద్ చేరి, చివరకు పిఠాపురంలో స్థిరపడ్డారు. ఆ విషయాన్ని ఉమర్ అలీషా ఈ విధంగా వివరించారు.

**"... ... ... మహా ప్రభాత**
**గరిమగాంచిన మా వంశమరయ పార**
**సీకమును బాసి ఢిల్లీకి చేరి హైద్ర**
**బాదు నుండి పిఠాపురి వచ్చి నిలచె "**

ఉమర్ అలీషా పూర్వీకులలో, తొలుతగా రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో అడుగు పెట్టింది కబీర్‌షా. ఆయన కుమారుడు మదార్‌షా, మదార్‌షా కుమారుడైన హసన్ మియాషాకు కహనేషావలి జన్మించారు. కహనేషావలి కుమారుడు మొహిద్దీన్ బాద్షా, ఆ మొహీద్దీన్ బాద్షా కుమారుడు ఉమర్ అలీషా.

డాక్టర్ ఉమర్ అలీషా 1885 ఫిబ్రవరి 28న, పిఠాపురంలో జన్మించారు. ఆయన తల్లి పేరు చాంద్‌బీబి. సాహిత్య, సారస్వత, ధార్మిక సేవా కార్యక్రమాల వాతావరణం నడుమ జన్మించిన ఉమర్ అలీషా, తమ పూర్వీకుల శక్తి సామర్థ్యాలను, ప్రజ్ఞాపాటవాలను సంతరించుకుని ఎనిమిదవ ఏటనే అశువుగా కవిత్వం చెప్పటం ఆరంభించారు. పద్నాలుగు సంవత్సరాల వయస్సులో ఛందోబద్ధంగా తెలుగులో పద్యాలు రాయడం ప్రారంభించారు. ఉమర్ అలీషాకు పద్యాలను ధారాళంగా అల్లగల నేర్పు సునాయాసంగా అబ్బడంతో 18వ ఏటనే నాటకాలు రాశారు. 1905 ప్రాంతంలో గద్యపద్యాత్మకమైన **మణిమాల** నాటకాన్ని రాశారు. ఈ నాటకం ప్రముఖ ఆంగ్ల రచయిత షేక్స్పియర్ నాటకాల స్థాయిలో నిలిచిందని, పండిత ప్రముఖులు, పత్రికలు ఉమర్ అలీషా ప్రతిభను బహుధా ప్రశంసించాయి.

ఉమర్ అలీషా విద్యాభ్యాసం పిఠాపురంలోని ఉన్నత పాఠశాలతో ముగిసింది. ఆ తరువాత డిగ్రీల చదువు మీద ఆయన దృష్టి సారించలేదు. తండ్రిని ప్రధాన గురువుగా స్వీకరించి విద్యాభ్యాసం కొనసాగించారు. ఆనాటి పండితులు సృజియించిన సాహిత్య సంపద ఆయనకు ప్రధాన ఉపాధ్యాయ వర్గమైంది. పలు భాషల్లో రాసిన ఆధ్యాత్మిక, సాహిత్య, విజ్ఞానదాయక గ్రంథాలను అధ్యయనం చేసి మంచి విద్వత్తును సొంతం చేసుకున్న ఉమర్ అలీషా సంస్థానాల నుండి తన గడపతొక్కిన ఉన్నతోద్యోగాలకు సంబంధించిన ఆహ్వానాలను తిరస్కరించి మాతృభూమి సేవ, భాషాసేవ, సారస్వత సేవ, వేదాంత సేవ, సమాజ సేవలో పూర్తిగా నిమగ్నం కావాలని నిర్ణయించుకున్నారు.

ఆ దిశగా ఉపక్రమించిన ఉమర్ అలీషా కవిగా అతికొద్ది కాలంలోనే, అసమాన ప్రతిభను చూపుతు పలు సాహితీ ప్రక్రియలలో అపూర్వమైన సారస్వత సంపదను సృష్టించారు. ఈ విషయాలను ఒక పద్యంలో స్వయంగా ఈ విధంగా సృష్టీకరించారు.

**రచియించినాడ విభ్రాజితదివ్య ప్ర**
**బంధముల్ పది కావ్య బంధములుగ**
**వ్రాసినాడను కల్పనాసక్త మతిపది**
**నాటకంబులను కర్నాటఫక్కి**
**కూర్పినాడను కళాకోవిదుల్ కొనియాడ**
**నవలలు పది నవ నవలల లనగ**
**తెలిగించినాడ సుద్ధీపితాఖండ పా**
**రసికావ్యములు పది రసికులలర**
**రసము పెంపార నవధానక్రమములందు**
**ఆశువులయందు పాటలయందు కవిత**
**చెప్పినాడ నుపన్యాస సీమలెక్కి**
**యవని "ఉమ్రాలిషాకవి" యనగ నేను.**

మహాకవిగా ఉమర్ అలీషా భారత దేశమంతటా పర్యటించి పలు పండిత సభలలో పాల్గొని సాహిత్య-ఆధ్యాత్మిక ఉపన్యాసాలిచ్చి, అద్భుతమైన ధారణతో ప్రతిభను ప్రదర్శించి సన్మానాలు, సత్కారాలు పొందారు. **భారతభూమి నేనుప న్యాసము లిచ్చుచున్ దిరిగి నాడను ఉమ్రాలిషా కవీంద్రుడన్ ... సవరించితిని పెద్ద సారస్వతంబును శబ్ద శాస్త్రంబులు జదివి చదివి** అని ఆయన సగర్వంగా ప్రకటించుకున్నారు. ఆయన ప్రతిభను గుర్తించిన విశ్వ విద్యాలయాలు ఆయనకు గౌరవ బిరుదులను ఇవ్వడానికి ఉత్సాహపడ్డాయి. 1924 లో All India Oriental Conference లో **పండిట్** బిరుదుతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా "First Muslim Telugu Poet in Andhra Pradesh to have learnt Sanskrit, Persian, Arabic and English" అని ఆయన బహుభాషా పాండిత్యాన్ని కొనియాడుతూ ఆ సంస్థ ప్రకటించింది. (Encyclopaedia of Muslim Biography Ed. Mr. Nagendra Kr. Singh, A.P. HPC,2001). అలీఘర్ విశ్వవిద్యాలయం ఆయనకు **మౌల్వీ** బిరుదునిచ్చి గౌరవించింది. ఫ్రాన్స్ దేశానికి చెందిన ఆర్యన్ విశ్వవిద్యాలయం (Aryan University of France) Professor in Hindu-Muslim Culture అవార్డుతో గౌరవించింది. 1933లో Muslim Board of Studies for Teluguలో సభ్యుడిగా పలు కార్యక్రమాలకు మార్గదర్శకత్వం నెరపమని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయన్ను ఆహ్వానించింది. కాశీలోని హిందూ విశ్వవిద్యాలయం ఆయనను విద్యాభివృద్ధి కమిటీలో సభ్యునిగా నియమించుకుంది. 1936లో ACADEMIA INTERNATIONAL AMERICANA లో

ఆయనను DOCTOR LITIERARUM (DOCTOR OF LITERATURE) తో గౌరవించింది. ఏ విశ్వవిద్యాలయం నుండి ఎటువంటి డిగ్రీ లేని వ్యక్తికి, అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించడం చాలా అరుదైన సంఘటన. డాక్టర్ ఉమర్ అలీషా తన సాహిత్య సంపదతో **ఆంగ్లేయులకు షేక్స్పియర్, ఇటాలియన్‌లకు డాంటే, ఉర్దూ మాట్లాడే ప్రజలకు డాక్టర్ ఇక్బాల్ ఎలాగో తెలుగు మాట్లాడే ప్రజలకు డాక్టర్ ఉమర్ అలీషా అటువంటి వారని** కీర్తించబడ్డారు. (Brahma Rishi Dr. Umeralisha-Telugu Poet by M.N.Huda in his article Published in The Illustrated Weekly of Pakisthan, 11 May, 1969)

ఆధ్యాత్మిక-సాహిత్య రంగాలలో నిమగ్నమైన ఉమర్ అలీషా, అంతవరకు మాత్రమే తన చుట్టూ గిరి గీసుకుని కూర్చోలేదు. సమకాలీన రాజకీయ పరిణామాలకు వ్యక్తిగా, దేశభక్తునిగా క్రియాత్మకంగా స్పందించారు. విద్యాభ్యాసం చేస్తున్న సమయంలోనే పరాయి పాలన సృష్టిస్తున్న ఇక్కట్లను ఆయన గ్రహించారు. బ్రిటీష్ పాలకుల చర్యలకు వ్యతిరేకంగా ప్రజలు వ్యక్తంచేస్తున్న స్వేచ్ఛా-స్వాతంత్ర్యకాంక్షకు కవిగా, బాధ్యతగల ఈ గడ్డ బిడ్డడిగా స్పందించి తగిన విధంగా తోడ్పాటు నందించారు. 1906 నాటి వందేమాతర ఉద్యమం సందర్భంగా బ్రిటీషు వ్యతిరేక ఉద్యమాలకు ఉమర్ అలీషా క్రియాశీలక తోడ్పాటునిచ్చారు. బెంగాలు విభజనతో ఊపందుకున్న జాతీయోద్యమంలో పాల్గొనడం ద్వారా ఉమర్ అలీషా స్వాతంత్ర్యోద్యమంలో నేరుగా ప్రవేశించారు.

తొలిదశలో ఆయన విప్లవకార్యకలాపాల వైపు మొగ్గుచూపారు. విప్లవోద్యమంలో ఉద్యమకారులకు ఆశ్రయం కల్పించారు. విప్లవోద్యమం సృష్టించిన కరపత్రాలు, విప్లవకారుల సమకూర్చుకున్న ఆయుధాలు తదితర సామగ్రిని పిఠాపురంలోని తన స్వగృహంలో దాచిపెట్టి విప్లవకారులకు సహాయసహకారాలు అందించారు. ఈ విషయాన్ని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు కృత్తివెంటి నాగేశ్వరరావు (1886-1956) '**స్వీయచరిత్ర**'లో పేర్కొన్నారు. విప్లవ కార్యకలాపాలకు ఉమర్ అలీషా అందించిన సహకారాన్ని కృత్తివెంటి ప్రస్తావిస్తూ, '...**ఆ వందేమాతరం రోజుల్లోనే సీక్రెట్ సొసైటీ వొకటి బెట్టాము ... నిజాం నుండి దొంగతనంగా కొన్ని రివాల్వర్లు తెప్పించాము. ఇంకా అవసరం వెంబడి కత్తులు, బాకులు, అన్నీ జాగ్రత్త పెడ్తూండేవారము. ఇట్టిరకపు సామాన్లు దాపరికానికి నాకు రహస్య సెంటర్లు పిఠాపురం ఉమర్ అలీషాగారు, కృష్ణాకు కోటంరాజు రాజేశ్వరారావు గారు, రాజమండ్రికి నేను యీ విధముగా కొన్ని సెంటర్లు ఏర్పరచుకున్నాము.**' (1906 లో ఆనగనగా..., ఆంధ్రజ్యోతి దినపత్రిక, 04-02-2006).

ఆ తరువాతి కాలంలో అల్లూరి సీతారామరాజు సాగించిన మన్యం పోరాటానికి కూడా మద్దతు తెలిపారు. మన్యం వీరులకు ఆశ్రయం కల్పించడంలో, ఆయుధాలను దాచిపెట్టి, అవసరం మేరకు ఉద్యమకారులకు అందజేయడంలో మౌల్వీ ఉమర్ అలీషా

కుటుంబం ఎంతగానో తొడ్పడింది.

1916లో భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించారు. ఆ క్రమంలో మహాత్మాగాంధి ప్రభావంతో ఉమర్ అలీషా అహింసోద్యమంలో భాగస్వాములయ్యారు. ప్రముఖ కవిగా అప్పటికే బహుళ ఖ్యాతి గడించిన ఉమర్ అలీషాకు ప్రముఖ జాతీయ నాయకులు బిబిన్ చంద్ర, చిత్తరంజన్ దాస్, అరవింద ఘోష్‌లతో మంచి స్నేహం ఏర్పడింది. ఆ నాయకుల ప్రభావంతో ఆయన జాతీయోద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. మాతృభూమి పట్ల అపార ప్రేమాభిమానాలు గల కవిగా ఉమర్ అలీషా మాతృదేశం ఘనతను తన **చంద్రగుప్త** నాటకంలో అలెగ్జాండర్ పాత్రచే ఈ విధంగా ప్రస్తుతింపచేశారు.

**“ఏ మహారాజ్ఞికి హిమవన్నగంబులు**
**కులగిరుల్ పెట్టని కోటలొక్కొ**
**ఏ లతాతన్వికి హిందు గంగానదుల్**
**దరిలేని మంచి ముత్యాల సరులొ**
**ఏ సరసిజాస్యకు నా సింహళ ద్వీప**
**మత్యంత రత్న సింహాసనంబొ**
**ఏ రమారమణికి భారత యోధుల**
**గాళిదాసాదుల గన్న కడుపొ**
**అట్టి సుగుణ రత్నాకరమైన జగాన**
**నసదృశ విలాసినిగ నలరారుచుండ**
**భారత వర్ష వధూటిని బడయవలయు**
**..................”**

ఆనాడు మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్రను వేరుచేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతూ ఆరంభమైన ఉద్యమంలో మౌల్వీ ఉమర్ అలీషా విశేషపాత్ర నిర్వహించారు. ఆంధ్ర మహాసభ నేతృత్వంలో ప్రత్యేక ఆంధ్ర పోరాటం సాగింది. ఈ సందర్భంగా 1917 సెప్టెంబరు 30న బెజవాడలో జరిగిన ఆంధ్రమహాసభ సమావేశంలో ప్రత్యేకాంధ్ర డిమాండ్ గురించి చర్చించేందుకు బ్రిటీష్ ప్రభుత్వ కార్యదర్శి మాంటేగ్ వద్దకు ఒక ప్రతినిధివర్గాన్ని పంపాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం మేరకు ఆంధ్ర ప్రాంతంలోని ప్రముఖులు, పండితుల బృందమొకటి మాంటేగ్‌ను సందర్శించింది. ఆ బృందంలో ఒకరుగా ఉమర్ అలీషా పాల్గొన్నారు. కవిగా సాహిత్య సృష్టి చేయడం మాత్రమే కాకుండా ఆ దిశగా సాగిన కార్యాచరణలో కూడా ఉమర్ అలీషా చురుగ్గా పాల్గొన్నారు. (ఆంధ్రోద్యమం చరిత్ర, మాదల వీరభద్రరావు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్, హైదరాబాద్, 2005 పేజి.45)

ఉమర్ అలీషా భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరినప్పటి నుండి పార్టీ పిలుపు మేరకు సాగిన ఉద్యమ కార్యక్రమాలన్నిటిలో చురుగ్గా పాల్గొన్నారు. మహాత్మాగాంధీ, అలీ సోదరులు, మహమ్మద్ అన్సారి లాంటి ప్రముఖులు విజయవాడ వచ్చినప్పుడు వారితో జరిగిన చర్చలలో ఆయన పాల్గొన్నారు. **పశ్చిమగోదావరి జిల్లాలో స్వాతంత్ర్య సంగ్రామం** అను అంశం మీద పరిశోధన జరిపిన చరిత్రోపన్యాసకులు డాక్టర్ జి.గోపాలస్వామి (అత్తిలి) వ్యాసకర్తతో మాట్లాడుతూ గోదావరి జిల్లాలలో అలీషా సుడిగాలి పర్యటనలు చేశారన్నారు. ప్రజలలో దేశభక్తిని, త్యాగనిరతిని ప్రోదిచేస్తూ ఆయన చేసిన ప్రసంగాలు ప్రజలను బాగా ప్రభావితం చేశాయని వెల్లడించారు. ఉమర్ అలీషా ప్రసంగం ఉందంటే ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేవారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని డాక్టర్ ఉమర్ అలీషా జాతీయ కాంగ్రెస్‌కు అవసరమగు నిధులను కూడా సేకరించడంలో ఎంతగానో సహకరించారు. జాతీయోద్యమంలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో పర్యటించి తన ప్రసంగాలతో ఉమర్ అలీషా ప్రజలను కార్యోన్ముఖులను చేశారు.

1924లో మౌల్వీ ఉమర్ అలీషా అఖిల భారత ఖిలాఫత్ కమిటి ప్రధాన కార్యదర్శిగా, ముస్లిం లీగ్ మద్రాసు శాఖకు ఉపాధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా నాయకత్వం వహించారు. జాతీయ ఉద్యమకారునిగా ఉమర్ అలీషా వ్యక్తం చేసిన రాజకీయ భావాలను గమనించిన మహాత్మా గాంధీ **ఉదాత్తమైన రాజకీయ భావాల వ్యక్తి**,గా (a man with sound political ideas) ఆయనను ప్రశంసించారని, Mr. M.N.HUDA తాను Illustrated Weekly of Pakistan (May11,1969) లో BRAHMARISHI DR. UMAR. ALISHA - Telugu Poet, శీర్షికతో రాసిన వ్యాసంలో ఉటంకించారు.

1928లో ఉమర్ అలీషా తండ్రి మొహిద్దీన్ బాద్షా కన్నుమూయడంతో ఆయన నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక పీఠం బాధ్యతల భారాన్ని ఉమర్ అలీషా మోయాల్సి వచ్చింది. అందువలన ఖిలాఫత్ ఉద్యమం తరువాత జాతీయోద్యమ కార్యక్రమాలలో ఆయన చురుగ్గా పాల్గొననప్పటికీ క్రియాశీలక రాజకీయాలకు మాత్రం ఆయన దూరం కాకుండా ఉభయ గోదావరి జిల్లాలలో జరిగిన జాతీయోద్యమ కార్యక్రమాలకు పూర్తిగా సహకరించారు.

1935లో అఖిల భారత శాసనసభకు జరిగిన ఎన్నికల సందర్భంగా ఆయనకు అఖిల భారత ముస్లిం లీగ్ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం లభించింది. ఆ ఎన్నికలలో ఆయన ఉత్తర మద్రాసు నియోజకవర్గం రిజర్వుడ్ స్థానం నుండి పోటీచేసి విజయం సాధించారు. ఆ తరువాత ఆయన భారత శాసనసభలో పది సంవత్సరాల పాటు అనగా 1945 వరకు ప్రజా ప్రతినిధిగా పలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. అఖిల భారత శాసనసభలో ప్రజల సంక్షేమం కోరుతూ, అవసరాన్ని బట్టి ప్రభుత్వాన్ని వాదనా

పటిమతో విమర్శిస్తూ ఆచరణాత్మక సూచనలతో, అనర్గళంగా ప్రసంగాలు చేసి ప్రజాప్రతినిధిగా కూడా ఉమర్ అలీషా సభికులను ఆకట్టుకున్నారు. భారతదేశంలోని విభిన్న మతాలకు చెందిన ధార్మిక, ఆధ్యాత్మిక, చరిత్ర గ్రంథాల నుండి పలు విశేషాంశాలను తన వాదనకు అనుకూలంగా ఉటంకిస్తూ సాగించే ఆమర ప్రసంగాలను వినడానికి ప్రజా ప్రతినిధులు ఉత్సాహం చూపేవారని తెలుస్తుంది. ప్రజాప్రతినిధిగా ప్రజల పక్షాన ప్రభుత్వం లోటు-పాట్లను ఉమర్ అలీషా విమర్శించే తీరు ప్రభుత్వాధినేతల నుండే కాకుండా, సభాసదుల ప్రశంసలు కూడా అందుకున్నాయి. ఈ విషయాన్ని స్వయంగా ఉమర్ అలీషా, **చూపించితి రాజ్య లోపంబు లాంగ్ల ప్రభుత్వంబు ముంగరమోపి మోపి** అని తన పద్యాలలో చెప్పుకున్నారు.

భారత శాసనసభలో హిందూ లా ముసాయిదాసు రూపొందిస్తున్న సమయంలో ధార్మిక అంశాల మీద ఉత్పన్నమైన సందేహాల నివృత్తి కోసం డాక్టర్ భగవాన్ దాస్ లాంటి ప్రముఖులు స్వయంగా ఉమర్ అలీషాను పలుమార్లు సంప్రదించడాన్ని బట్టి, సంస్కృత భాష మీదనే కాకుండా హిందూ మత ఆధ్యాత్మిక-వేదాంత గ్రంథాల మీద ఆయనకు ఉన్న పట్టు ఏపాటిదో తెలుస్తుంది. ధార్మిక విషయాల మీద మాత్రమే కాకుండా చారిత్రక అంశాలకు సంబంధించిన వాదవివాదాలలో ఆయన ప్రముఖ పాత్ర వహించారు. ఈ వివాదాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహమ్మద్ అలీ జిన్నా లాంటి ప్రముఖులు డాక్టర్ ఉమర్ అలీషాతో సంప్రదింపులు, ఉత్తరప్రత్యుత్తరాలు జరిపారు.

డాక్టర్ ఉమర్ అలీషా ఏ రంగాన్ని ఎన్నుకున్నా అద్వితీయమైన ప్రతిభతో ఆ రంగాలలో బహుముఖంగా రాణించారు. అటు రాజకీయంలోను ఇటు సాహిత్యంలోను ఘనుడని గణుతికెక్కిన ఆయన ఆధ్యాత్మిక రంగంలో కూడా అఖండుడన్పించుకున్నారు. ఆయన పూర్వీకులు స్థాపించిన శ్రీ విశ్వ విజ్ఞాన విద్యాధాత్మిక పీఠాచార్యునిగా అసంఖ్యాకులైన శిష్యుల మనస్సులను చూరగొన్నారు. సర్వమత సమభావనా కేంద్రంగా తమ పీఠాన్ని తీర్చిదిద్దిన కారణంగా ఉమర్ అలీషా చుట్టూ అసంఖ్యాక శిష్యగణం చేరింది.

ఉమర్ అలీషా సర్వమత సమభావన, ఆధ్యాత్మిక-వేదాంత భావాలు ప్రముఖ పండితుడు సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను కూడా ఆకట్టుకున్నాయి. ఉమర్ అలీషా ధార్మిక చింతనా ధోరణులను రాధాకృష్ణన్ బహుధా కొనియాడారు. (ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం 03-04-1994). **ఆదర్శ గురువుగా అంతేవాసుల ఆరాధ్య దైవంగా...ఆయన గౌరవ మర్యాదలందుకున్నారు.** మతాల ప్రసక్తి, మతాచారాలతో సంబంధం లేకుండా ఉమర్ అలీషా పీఠాధిపత్యంలోని **జ్ఞానసభ** ప్రజలను ఆహ్వానించింది. ఈ సభలో కులమత జాతి భేదాలు లేవు. ఈ విషయాన్ని వివరిస్తూ, **సభామందిర ద్వారమెపుడు తెఱచి యుండు పూత చరిత్రులై యుండు వారు వచ్చి జ్ఞానంబు నేర్చుకోవచ్చు సతము మంచి నీళ్ళను**

**కలశాల ముంచినట్లు** అని మౌల్వీ ఉమర్ అలీషా స్వయంగా ప్రకటించారు.

ఆధ్యాత్మిక బోధనలో ఆయన పూర్తిగా నిమగ్నమై ఉన్నప్పటికి జాతీయ స్థాయి రాజకీయాలకు దూరం కాలేదు. అఖిలభారత శాసనసభ సభ్యునిగా డాక్టర్ ఉమర్ అలీషా కార్యక్రమాలలో పాల్గొంటూ వచ్చారు. అఖిల భారత ముస్లింలీగ్ అభ్యర్థిగా ఎన్నికయిన ఆయన రాష్ట్రంలో జరుగుతున్న ముస్లిం లీగ్ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ క్రమంలో 1945 జనవరి 21న బాపట్లలో జరిగిన గుంటూరు జిల్లా ప్రైమరీ లీగ్ అధ్యక్ష కార్యదర్శుల ప్రథమ సమావేశంలో డాక్టర్ ఉమర్అలీషా ముఖ్యఅతిధిగా పాల్గొని స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఆయన ముస్లింలీగ్ అభ్యర్థిగా ఎన్నికైనప్పటికి లీగ్ వేర్పాటు వాద ధోరణులకు వ్యతిరేకించారు. గుంటూరు జిల్లాలో జరిగిన లీగ్ సభలలో ఈ విషయాన్ని ఆయన చాలా స్పష్టంగా ప్రకటించారు. ఈ విధంగా తన చివరి రాజకీయ ప్రసంగం ముగించిన మౌల్వీ ఉమర్ అలీషా గుంటూరు జిల్లా నుండి పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వెళ్ళారు.

గుంటూరు జిల్లా నుండి నరసాపురం చేరుకున్న డాక్టర్ ఉమర్ అలీషా అక్కడ నుండి స్వగ్రామం పిఠాపురం వెళ్ళేందుకు సమాయత్తం అవుతుండగా 1945 జనవరి23 సాయంత్రం ఆకస్మికంగా కన్నుమూశారు. ఆయన మృతిచెందిన విషయాన్ని తెలుపుతూ 'ఆంధ్రప్రతిక' దినపత్రిక స్వాతంత్ర్య సమరయోధునిగా డాక్టర్ ఉమర్ అలీషా అందచేసిన సేవలకు గుర్తింపుగా '**సుప్రసిద్ద దేశ సేవకులు, పండితులు...రాజకీయాలందు వీరు జాతీయవాది**' అని నివాళులు అర్పించింది. ఉమర్ అలీషా కన్నుమూసారన్న వార్త వేగంగా రాష్ట్రమంతటా వ్యాపించింది. ఆయన శిష్యులు, అభిమానులు, జాతీయోద్యమంలోని ఆయన సహచరులు, ప్రజలు చివరిచూపు కోసం రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా, పక్కనున్న రాష్ట్రాల నుండి కూడా పెద్ద సంఖ్యలో పిఠాపురం వచ్చారు.

చివరకు 1945 జనవరి 24న పిఠాపురం పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపాన గల ఆరామంలో కవిరాజు, ధార్మికాచార్యులు, సంఘ సంస్కరణాభిలాషి, స్వాతంత్ర్య సమర యోధులు, ప్రజాప్రతినిధి, మౌల్వీ ఉమర్ అలీషా భౌతికకాయాన్ని ఆప్తజనుల సమక్షంలో భక్తి శ్రద్ధలతో ఖననం చేశారు.

◆◆◆

' నా దేశంలోని కుక్కలు పిల్లులు కూడా బ్రిటీష్ బానిసత్వపు సంకెళ్ళల్లో బందీలుగా ఉండరాదన్నది నా అభిమతం'

**– అలీ సోదరుల తల్లి ఆబాది బానో బేగం.**



## నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన కలం యోధుడు

# 13. షోయాబుల్లా ఖాన్

(1920-1948)

**బా**నిస బంధనాల నుండి విముక్తి కోసం సాగిన ప్రపంచ ప్రజాపోరాటాల చరిత్రలో అన్నివర్గాల ప్రజానీకంతోపాటుగా కలం యోధులైన పాత్రికేయులు, సంపాదకులు పలు నిర్బంధాలకు గురయ్యారు, చిత్రహింసల పాలయ్యారు, ఆంక్షలకు-నిషేధాలకు బలయ్యారు. ఈ క్రమంలో జాతీయ స్థాయిలో **ఢిల్లీ అక్బార్** పత్రిక సంపాదకులు మౌల్వీ మహమ్మద్ బాకర్ అరుదైన త్యాగంతో 1857లో చరిత్ర సృష్టించారు. చిరస్మరణీయుడైన మహమ్మద్ బాకర్ మార్గంలో స్వేచ్ఛ-స్వాతంత్ర్యాల కోసం అక్షరాలను ఆయుధంగా చేసుకుని చివరి శ్వాసవరకు పోరాడిన హైదరాబాద్ యోధుడు షోయాబుల్లా ఖాన్.

అది 1920 సంవత్సరం. జాతీయోద్యమం పరవళ్ళు తొక్కుతుంది. భారతదేశ వ్యాప్తంగా సాగుతున్న పర్యటనలో భాగంగా మహాత్మాగాంధీ విజయవాడకు వెడుతున్నారు. ఆయన ప్రయాణిస్తున్న రైలు ప్రస్తుత వరంగల్ జిల్లా మహబూబాబాద్ రైల్వేస్టేషన్ మీదుగా సాగుతోంది. అక్కడ శాంతి భద్రతల పరిరక్షణకు హబీబుల్లా ఖాన్ అను పోలీసు అధికారిని నియమించారు. ఆయన డ్యూటీలో ఉండగా గాంధీజీ ప్రయాణిస్తున్న రైలు రానే వచ్చింది. గాంధీజీని సమీపం నుండి చూసే అవకాశం లభించినందుకు ఆనందిస్తూ డ్యూటీని ముగించుకున్న హబీబుల్లా ఖాన్ ఇంటికి వెళ్ళారు. ఆయన ఇల్లు చేరుకోగానే కుమారుడు పుట్టాడన్న శుభవార్త అందింది. ఆ రోజు అక్టోబరు17. ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ

బిడ్డను చూసిన ఆయన  మరింతగా సంతోషిస్తూ, **అరే వీడు అచ్చం గాంధీజీ లాగే ఉన్నాడే ...అవే కళ్ళు...అదే నుదురు. అచ్చం గాంధీలానే ఉన్నాడు**, అంటూ మరింత సంబరపడిపోయాడు. ఆ బిడ్డకు **షోయాబుల్లా ఖాన్** అని నామకరణం చేసినా హబీబుల్లా ఖాన్ మాత్రం తన  పుత్రరత్నాన్ని ఎంతో ప్రేమతో **షోయాబుల్లా గాంధీ** అని పిలుచుకోసాగారు.

ఆ బాలుడు చిన్నతనం నుండే, మహాత్మాగాంధీ గురించి వింటూ విద్యార్థిగా ఆయన రచనలను విస్తృతంగా చదువుతూ వచ్చాడు. ఆ క్రమంలో గాంధేయ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడైన ఆయన  గాంధీజీ బాటను తన జీవితమార్గంగా నిర్ణయించుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం షోయాబుల్లా ఖాన్ నుండి గ్రాడ్యుయేషన్ చేశారు. నైజాం సంస్థానంలో మంచి హోదాగల ఉద్యోగం లభించగల అవకాశం ఉన్నా జాతీయోద్యమానికి సేవలందించేందుకు షోయాబుల్లా ఖాన్ జర్నలిజంను ప్రధాన వృత్తిగా చేపట్టారు.

ప్రజాస్వామిక వ్యవస్థ పట్ల పూర్తి నమ్మకం, గౌరవం గల షోయాబుల్లా ఖాన్ తొలుత నుండి నిరంకుశ పాలకులను వ్యతిరేకించారు. ఆ లక్ష్యంగా రచనా వ్యాసంగాన్ని ఆరంభించారు. జాతీయ భావాలను ప్రోత్సహిస్తున్న **తేజ్** ఉర్దూ వారపత్రికలో ఆయన చేరారు. ఆనాటి హైదరాబాద్ సంస్థానాధీశులైన నిజాం పాలకుల నిరంకుశత్యం, ఆ పాలకుల తాబేదార్లయిన రజాకారుల, భూస్వాముల అమానుషకృత్యాలను విమర్శిస్తూ వ్యాసాలు రాయడం ప్రారంభించారు. ఆయన వ్యాసాలు సహజంగానే పాలకవర్గాలకు రుచించలేదు. ఆ కారణంగా తేజ్ పత్రిక నిషేధానికి గురయ్యింది.

ఆ తరువాత స్వాతంత్ర్యసమర యోధులు మందుముల నరశింగరావు ఆధ్వర్యంలో నడుస్తున్న **రయ్యత్** ఉర్దూపత్రికలో షోయాబుల్లా ఖాన్ చేరారు. నిజాం పాలకుల దాష్టీకాలను, రజాకారుల చర్యలను తీవ్రంగా ఎండగడ్తూ రచనలు చేయడాన్ని ఆయన కొనసాగించారు. ఆ కారణంగా షోయాబుల్లా ఖాన్‌ను హెచ్చరిస్తూ అజ్ఞాత వ్యక్తుల నుండి బెదిరింపు లేఖలు రాసాగాయి. ఆ బెదిరింపులను ఆయన ఏ మాత్రం ఖాతరు చేయలేదు. చివరకు **రయ్యత్** పత్రిక కూడా పాలకవర్గాల ఆగ్రహానికి ఎరకాక తప్పలేదు.

ఆయన అధైర్యపడలేదు. ప్రజల పక్షంగా అక్షరాయుధంతో నిరంకుశ పాలకుల మీద పోరాటం సాగించాల్సిందేనని షోయాబుల్లా ఖాన్ నిశ్చయించుకున్నారు. స్వయంగా జాతీయ భావాలను పెంపొందించగల పత్రికను ఆరంభించడానికి పూనుకున్నారు. భార్య, తల్లి ఆభరణాలను అమ్మగా వచ్చిన సొమ్ముతో **ఇమ్రోజ్** ఉర్దూ దినపత్రికను ప్రారంభించారు. **ఇమ్రోజ్** ప్రథమ సంచిక 1947 నవంబరు 15న విడులయ్యింది. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడ్తున్నా, **ఇమ్రోజ్‌**ను ప్రజల పత్రికగా తీర్చిదిద్దారు. ప్రభువుల నిరంకుశత్వం, ఉన్మాదుల మత దురహంకారం  మీద తిరుగులేని సమరం కొనసాగించారు.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది. దేశంలోని సంస్థానాలన్నీ **ఇండియన్ యూనియన్**లో కలసి పోతున్నాయి. జునాఘడ్, రాంపూర్ లాంటి కొన్ని సంస్థానాలతో పాటుగా తొలుత నుండి బ్రిటీష్ పాలకులతో స్నేహం నెరపిన నైజాం సంస్థానాధీశులు ఇండియన్ యూనియన్‌లో తమ సంస్థానాలను విలీనం చేయడానికి నిరాకరించారు. ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయాలన్న డిమాండ్‌ను అడ్డుకునేందుకు అంతర్జాతీయ స్థాయిలో నైజాం పాలకులు చర్యలు చేపట్టారు.

ఆ విపత్కర వాతావరణంలో **ఇమ్రోజ్** పత్రికా సంపాదకునిగా షోయాబుల్లా బృహత్తర బాధ్యతలను నిర్వర్తించారు. నైజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయాలని కోరుతూ సంపాదకీయాలు రాశారు. భారతదేశ ప్రయోజనాల దృష్ట్యా విలీనం ఎంతటి అవసరమో వివరిస్తూ నిజాం నిరాకరణ వెనుక గల స్వార్ధ రాజకీయాలను తూర్పార పడుతూ వ్యాసాలు ప్రచురించారు. హైదరాబాద్ సంస్థానం పరిధిలోని ప్రజలలో ఎక్కువ మంది ఉర్దూ చదువుకున్న వారు కావడంతో ఇమ్రోజ్ రాతల ప్రభావం వలన రోజురోజుకూ విలీనంకు అనుకూలంగా మేధావులు, ప్రజలు స్పందించసాగారు.

1948 జనవరి 29 నాటి **ఇమ్రోజ్** సంచికలో **'పగటి ప్రభుత్వం–రాత్రి ప్రభుత్వం'** అను శీర్షికతో షోయాబుల్లా రాసిన సంపాదకీయం ఈ క్రింది విధంగా సాగింది. '...**ఈనాడు గ్రామస్తులు ప్రభుత్వ తిరుగలిలో పిండి చేయబడుతున్నారు. ఇంత వరకు జరిగిన సంఘటనలు ప్రజల ఎదుట ఉన్నాయి. అరాచకం ఏవిధంగా రాజ్యం చేస్తోందో అందరికి తెలుసు ... ఇత్తేహదుల్ ముసల్‌మీన్ సభ్యులు గాంధీ టోపీలు ధరించి గాంధీజీకి జై అనే నినాదాలు చేస్తూ గ్రామాలను దోచుకుంటున్నారు. బాధ్యతయుతమైన పదవుల్లో వున్న వ్యక్తులు వీటినన్నిటిని సాధారణ చోరీ నేరాల క్రింద త్రోసివేస్తున్నారు...మా అభిప్రాయంలో ఈ అరాచక వ్యవస్థ ఒక విషవలయంగా పరిణమించింది. ఒక గ్రామీణుడు బాధతో 'పగటిపూట ఒక ప్రభుత్వం, రాత్రి మరొక ప్రభుత్వం రాజ్యం చేస్తున్నది' అన్న మాట సత్యదూరమేమీ కాదు...ఇత్తేహదుల్ ముస్లిమీన్ సంస్థ కార్యకలాపాలపై ప్రభుత్వం ఆంక్షలను ఎందుకు విధించకూడదు? ప్రజలందరికి ప్రాతినిధ్యం వహించే మంత్రివర్గాన్ని యెందువల్ల ఏర్పాటు చేయదు. ప్రజాభిప్రాయాన్ని మన్నించి పరిపాలన సాగిస్తేనే ఏమైనా, ఏ ప్రభుత్వమైనా మనగలుగుతుంది...**' (హైదరాబాద్ అజ్ఞాత చరిత్ర పుటలు, హిందీ మూలం : శ్రీ ఖండేరావు కులకర్ణి, తెలుగుసేత : శ్రీ నిఖిలేశ్వర్, నవభారతి, విజయవాడ, 1979, పేజి.70–71.)


ఈ పరిణామాలు నిజాం పాలకవర్గాలకు కంటక ప్రాయమయ్యాయి. కలం యోధుడు షోయాబుల్లాను నయానా, భయానా నచ్చచెప్పి ఆయన కలాన్ని నియంత్రించాలని

పాలక వర్గాలు శతవిధాల ప్రయత్నించాయి. అన్నిరకాల ఆశలు చూపాయి. తమ ప్రయత్నాలు ఏమాత్రం నెరవేరకపోవడంతో, భయంకర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని, చివరికి పరోక్షంగా, ప్రత్యక్షంగా హెచ్చరికలు జారీ చేశాయి. ఆ హెచ్చరికలను ఏమాత్రం లెక్కచేయక, నైజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయాల్సిందేనని, ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా **నిజాం సంస్థానాన్ని** స్వతంత్ర రాజ్యం కానివ్వరాదన్న పట్టుదలతో రచనలు చేస్తూ వచ్చిన షోయాబుల్లా ఖాన్ ఆ హెచ్చరికలను గడ్డిపోచ క్రింద జమకట్టారు.

అనునిత్యం హెచ్చరికలను ఎదుర్కొంటూ కూడా వజ్ర సంకల్పంతో ముందుకు దూసుకుపోతున్న షోయాబుల్లా అంటే ప్రేమాభిమానాలు గల స్వాతంత్ర్యసమరయోధులు బూర్గుల రామకృషారావు జాగ్రత్తగా ఉండాల్సిందిగా ఆయనకు సలహాలిచ్చారు. ఆ సలహాలకు సమాధానంగా, **సత్యాన్వేషణలో ఒక వ్యక్తి మరణిస్తే అది గర్వించదగిన విషయమని గాంధీజీ చెప్పారుకదా! అటువంటప్పుడు నేనెందుకు భయపడాలి**' అంటూ షోయాబుల్లా ఖాన్ ప్రత్యుత్తర మిచ్చి బూర్గులను ఆశ్చర్యచకితుల్ని చేశారు.

మతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా జీవించాలని కోరుకుంటూ తన రచనల ద్వారా ప్రజలను ప్రభావితం చేస్తున్న షాయాబుల్లా ఖాన్ వలన కలుగుతున్న నష్టాలను రజాకారులు, నిజాంను సమర్థిస్తున్న భూస్వామ్యవర్గాలు గమనించసాగాయి. మతం పేరుతో ప్రజలను విడదీసి, స్వతంత్ర రాజ్యాన్ని నిలుపుకోవాలనుకుంటున్న స్వార్థపరశక్తులకు షోయాబుల్లా రచనలు భరించరానివిగా తయారయ్యాయి. మతసామరస్యం ఐక్యత, పరస్పర సదవగాహన, మత మనోభావలను గౌరవించడం లాంటి ప్రయత్నాలు నైజాం పాలకవర్గాల కలలను కల్లలు చేస్తాయని నైజాం అనుకూడ శక్తులు నిర్ణయానికి వచ్చాయి. ఒక చిన్న ఉర్దూ పత్రిక సంపాదకుడు బలమైన నైజాం ప్రభువుల అభీష్టానికి వ్యతిరేకంగా రాయడాన్ని, ప్రభువు పక్షాన వెలువడిన ఆజ్ఞలను ఎదిరిస్తూ ముందుకు సాగుతున్న షోయాబుల్లా ఖాన్‌ను ఏమాత్రం నియంత్రించలేక పోవడాన్ని అవమానంగా భావించారు. ఆ విధంగా ఆగ్రహించిన పాలకవర్గాల తొత్తులు నైజాం సంస్థానానికి, రజాకారులకు వ్యతిరేకంగా పత్రికల్లో రాసేవారి, ప్రజల్లో మాట్లాడేవారి అంతు చూస్తామని బహిరంగంగా ప్రకటించారు.

ఈ మేరకు 1948 ఆగస్టు 19న హైదరాబాదులోని జమురుద్ సినిమా హాలులో జరిగిన సభలో రజాకారుల నాయకుడు ఖాశింరజ్వీ ప్రసంగిస్తూ, **ముస్లింల ఐక్యతను విచ్ఛిన్నం చేసే శక్తులు సజీవంగా ఉండటానికి వీలులేదు. భారతప్రభుత్వ ఏజెంట్లుగా మా సమైక్యతను ధ్వంసం చేయాలన్న కీలుబొమ్మల చేతులు ఉండడానికి వీలులేదు. ఆ చేతులు క్రిందకు దిగాలి లేదా నరికి వేయబడాలి**' అని ప్రకటించాడు. (హైదరాబాద్ అజ్ఞాతచరిత్ర పు.73). ఆ ప్రకటను అనుగుణంగా కార్యాచరణ దూపుదిద్దుకుంది.



రజాకార్ల క్రూరత్వానికి చేయి కోల్పోయిన షోయాబ్ సహచరుడు మహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్

అది 1948 సంవత్సరం ఆగస్టు 21. అర్ధరాత్రి గడిచింది. ఆ రాత్రి షోయాబుల్లా ఖాన్ జీవితంలో భయంకర కాళరాత్రి అవుతుందని ఎవ్వరూ ఊహించ లేదు. ఆయన **ఇమ్రోజ్** ఉర్దూ పత్రిక కార్యాలయం నుండి సహచరులు మహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్‌తో కలసి లింగంపల్లి చౌరాస్తా సమీపాన ఉన్న ఇంటికి బయలు దేరారు. చౌరాస్తా దాటి కొంత ముందుకు వెళ్ళేసరికి వారిని ఎవరో అను సరిస్తున్నట్టు అన్పించింది. అది ఆయన దారిలో మృత్యువు రూపంలో కాపువేసి ఉన్న గుంపు. ఆయన దాన్ని ఏమాత్రం పట్టించు కోలేదు. ఆ గుంపు ఆయనను అనుసరిస్తూ వెనకాల వచ్చింది. ఆకస్మికంగా షోయాబుల్లా ఖాన్, ఆయన సహచరుడు ఇస్మాయిల్ మీద దాడి చేసింది. షోయాబుల్లా పైన తుపాకి గుళ్ళ వర్షం గురిసింది. తుపాకి గుండ్లకు గురైన షోయబుల్లా నేల కూలారు. బాధను పంటిబిగువున పట్టి, దుండగుల నుండి తప్పించుకోటానికి ప్రయత్నించారు. అయినా వదలకుండా ఆ హంతక ముఠా ఆయనను తరిమి తరిమి చేజిక్కించుకుని మతోన్మాద చర్యలను, నిరంకుశత్వాన్ని నిరసిస్తూ సంపాదకీయాలు రాసిన ఆయన చేతులను నరికి వేసింది. ఈ విధంగా నైజాం పాలకుల ఉద్దేశ్యాలకు వ్యతిరేకంగా వ్యాసాలు, సంపాదకీయాలు రాసిన షోయాబుల్లా ఖాన్ చేతులు తెగి హైదరాబాద్ నగరం నడిబొడ్డున పడ్డాయి.

ఆ దుర్మార్గాన్ని అడ్డుకున్న షోయాబుల్లా ఖాన్ సహచరులు ఇస్మాయిల్ కూడా దాడికి గురయ్యారు. ఆయన ముంజేతిని దుండగులు దారుణంగా నరికేశారు. ఆయన మీద కత్తులు దాడులు చేశాయి. ఆయన మరో చేతి వేలు కూడా తెగిపడింది. ఆయన కేకలు వేశారు. ఆ కేకలకు సమీపంలోగల ప్రజానీకం ఇళ్లనుండి బయటకు రావడంతో కిరాతకులు పరారయ్యారు. తుపాకి కాల్పుల వలన, కత్తుల దాడి వలన బాగా గాయపడి రక్తంవోడుతున్న షోయాబుల్లా ఖాన్‌ను ప్రజలు ఆసుపత్రికి తరలించారు.

ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్న చివరి క్షణాలలో కూడా తనకు ప్రియమైన ఇమ్రోజ్‌ను సక్రమంగా నడపాలన్న ఆకాంక్షను షోయాబుల్లా ఖాన్ వ్యక్తంచేశారు. కన్నీరు మున్నీరుగా రోదిస్తున్న తల్లితండ్రులను సముదాయిస్తూ, **మరణం అనివార్యం. చావు నుండి**


**ఎవ్వరూ తప్పించుకోలేరు. ఆ మరణం ఒక లక్ష్యం కోసం సంభవిస్తే గర్వించాలి. నేను దేశం కోసం మరణిస్తున్నందుకు మీరు సంతోషించాలి**, అన్నారు. అసమాన ధైర్య సాహసాలతో చివరిక్షణం వరకు అక్షరసమరం సాగించిన షోయబుల్లా ఖాన్ మృత్యువుతో పోరాడుతూ 1948 ఆగస్టు22 తెల్లవారుజామున కన్నుమూశారు.

కలంయోధుడు అంతిమ యాత్రకు నైజాం ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అతికొద్ది మంది బంధువులు, జాతీయ కాంగ్రెస్ కార్యకర్తలు, బహు కొద్దిమంది జర్నలిస్టులు మాత్రమే అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో ఎవరెవరు పాల్గొంటున్నారన్న విషయమై ఆరా తీసేందుకు ప్రభుత్వ గూఢచారి విభాగం పెద్ద సంఖ్యలో అంతిమ యాత్రను అనుసరించడం వలన భయానక వాతావరణం నెలకొంది. ప్రజల మనస్సులో ఆ కలం యోధునికి అంతిమ శ్రద్ధాంజలి అర్పించాలని ఉన్నా ప్రభుత్వ పోలీసువర్గాల భయం కారణంగా ఆయన చివరి యాత్రలో పాల్గొనలేక పోయారు. చివరకు షోయాబుల్లా ఖాన్ భౌతికకాయాన్ని గోషామహాల్ కుంట ఎదురుగా ఉన్న ఖబరస్థాన్‌లో ఖననం చేశారు.

ఆ మరుసటి రోజున షోయాబుల్లా ఖాన్ హత్యోదంతం మీద నైజాం ప్రభుత్వం నుండి అధికారిక ప్రకటన వెలువడింది. ఈ సంఘటన మీద గూఢచారి విభాగం దర్యాప్తు జరిపిందని, అది రాజకీయ హత్య ఏమాత్రం కాదని, ఈ హత్యవెనుక ఎటువంటి రాజకీయ కారణాలు ఏమీ లేవని ప్రకటించింది. అది వ్యక్తిగతమైన శత్రుత్వం వలన మాత్రమే జరిగిందని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలిందంటూ, ఈ సంఘటన మీద ఇంకా విస్తృతంగా దర్యాప్తు జరుగుతుందని ప్రకటించి నైజాం ప్రభుత్వం చేతులు దులుపుకుంది.

1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం జరిపి ముహమ్మద్ బాకర్ అమరుడైన తరువాత ఒక సంపాదకునిగా జాతీయ ప్రయోజనాలను కాంక్షిస్తూ, నిరంకుశ పాలకుల కిరాతకత్వానికి బలైన ఏకైక పాత్రికేయుడిగా షోయాబుల్లా ఖాన్ మరోచరిత్ర సృష్టించారు. భారతదేశ స్వాతంత్ర్యసంగ్రామ చరిత్రలో 1857లో ముహమ్మద్ బాకర్, 1948లో షోయాబుల్లా ఖాన్ తప్ప, ఆంగ్లేయుల, ఆంగ్లేయుల వత్తాసుదారుల దాష్టీకాలను అక్షరాయుధాలతో ఎదుర్కొని, ఆ క్రమంలో ప్రాణాలను సైతం బలిపెట్టిన మరో సంపాదకుడు గాని, ఇంకో పత్రికాధిపతి గాని కన్పించరు. ఆ విధంగా భారత స్వాతంత్ర్యసంగ్రామ చరిత్ర తొలిదశలో **ఢిల్లీ అక్బార్** పత్రిక సంపాదకులు మౌల్వీ ముహమ్మద్ బాకర్, మలిదశలో **ఇమ్రోజ్** పత్రిక సంపాదకులు షోయాబుల్లా ఖాన్ ప్రాణ త్యాగాలు చేసి భారతీయ పత్రికారంగానికి ఎనలేని గౌరవప్రతిష్టలు సమకూర్చిపెట్టారు.

◆◆◆



### జాతీయోద్యమంలో 'ఖద్దరు ఇస్మాయిల్' గా ఖ్యాతిగాంచిన

# 14. ముహమ్మద్ ఇస్మాయిల్

(1892-1948)

**జా**తీయోద్యమంలో పాల్గొని, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ ద్వారా తమదైన ప్రత్యేక గుర్తింపును పొంది, ఆయా సంఘటనలు, ఉద్యమాలు, కార్యక్రమాల పేర్లతో ముడివడిన స్వాతంత్ర్యసమరయోధులు పలువురున్నారు. ఆ విధంగా గాంధేయవాదాన్ని తమ ఊపిరిగా స్వీకరించి తు.చ తప్పక ఆచరించిన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ **సరిహద్దు గాంధీ**గా, అల్లా బక్ష్ సుంర్రో **బెలూచి గాంధీ**గా ఖ్యాతిగాంచారు. ఈ కోవలో రాష్ట్రంలోని గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన మేళ్ళచెర్వు ఆంజనేయ శాస్త్రి, పాకిస్థాన్‌లోని కరాచిలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశానికి టిక్కెట్టు లేకుండా రైలులో ప్రయాణించి **కరాచి** గా తన పేరును స్థిరపర్చుకున్నారు. మహాత్ముని మార్గదర్శకత్వంలో ఖద్దరు ఉద్యమంలో భాగంగా తెనాలిలో ఖద్దరు దుకాణం ఆరంభించి, చివరివరకు **ఖద్దరు**తో తన పేరు పెన వేసుకున్న ముహమ్మద్ ఇస్మాయిల్ **ఖద్దరు ఇస్మాయిల్**గా సుప్రసిద్ధులయ్యారు.

ముహమ్మద్ ఇస్మాయిల్ గుంటూరు జిల్లా నకరికల్లు గ్రామంలో 1892లో జన్మించారు. తండ్రి మహమ్మద్ మస్తాన్ సాహెబ్ పోలీసు కానిస్టేబుల్. తల్లి కులుసుం బీబి. కాలక్రమంలో ఇస్మాయిల్ నకరికల్లు నుండి తెనాలి వచ్చి స్థిరపడ్డారు. యువకుడిగా గాంధీజీ పట్ల ప్రత్యేక ఆసక్తిని ప్రదర్శిస్తూ వచ్చిన ఆయన సహజంగానే జాతీయోద్యమం వైపు ఆకర్షితులయ్యారు. చిన్ననాటి మిత్రుడు వేల్పుల గంగయ్యతో కలసి జాతీయోద్యమంలో

పాల్గొన్నారు. ప్రధానంగా ఖద్దరు ఉత్పత్తిని, వాడకాన్ని ప్రోత్సహించేందుకు నడుం కట్టారు. ఆ కృషిలో భాగంగానే తెనాలిలో ఖాదీ షాపును ఆరంభించారు. షాపును వ్యాపార దృష్టితో కాకుండా ప్రత్యేక లక్ష్యంతో నడిపారు. రాట్నం, దారం తీయటానికి దూది, చిలపలు, తకలీలు తదితర సామగ్రిని తెచ్చి, ఆసక్తిగల వారికి అందుబాటులో ఉంచారు. ఖద్దరు తయారీని, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించేందుకు స్వయంగా గ్రామాలు తిరిగారు. స్వయంగా ఖద్దరు ధరించటం కాకుండా ప్రతి ఒక్కరిని ఖద్దరు ధరించమని అభ్యర్థించారు.

1926లో ముహమ్మద్ ఇస్మాయిల్ గుంటూరు జిల్లాలో తొలి ఖద్దరుషాపు తెనాలిలో ప్రారంభించారు. ఖద్దరు దుకాణం ప్రారంభించడానికి ప్రేరణ ఏంటన్న ప్రశ్నకు ఆయన భార్య శ్రీమతి హాజరా బీబి సమాధానమిస్తూ, '...**రాట్నం వడికితే స్వాతంత్ర్య వస్తుందన్నారు మహాత్మా గాంధీ, ఆయన మాట మాకు వేదవాక్కు ... అందువల్లే ఖద్దరు వాడకాన్ని ప్రోత్సహించేందుకు 'ఖద్దరు షాపు' ప్రారంభించాం**', అని అన్నారు. ఆ దుకాణం ఆనాటి స్వాతంత్ర్య సమరయోధులకు ప్రధాన కూడలి కేంద్రమయ్యింది. చిన్న చిన్న సమావేశాలు, చర్చలు ఇక్కడే జరిగాయి. కళా వెంకటరావు, శరణు రామస్వామి చౌదరి, నన్నపనేని వెంకట్రావు, వెలువోలు సీతారామయ్య తదితర ప్రముఖులు నిత్యం ఖాదీ షాపు వద్దకు వచ్చేవారు. డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య, ఆచార్య రంగా లాంటి ప్రముఖులతో ఇస్మాయిల్ సన్నిహిత సంబంధాలు నెరిపారు. అలనాటి యోధులంతా ప్రతిరోజూ సాయంత్రం అయ్యేసరికి ఇస్మాయిల్ ఖద్దరుషాపు వద్ద చేరేవారు. ఆ క్రమంలో ముహమ్మద్ ఇస్మాయిల్ కాస్తా **ఖద్దర్ ఇస్మాయిల్** అయ్యారు.

ముహమ్మద్ ఇస్మాయిల్ జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్న ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. ఆయనకు 18 మాసాల కారాగారవాస శిక్ష పడింది. ఆనాటి గాంధీ–ఇర్విన్ ఒప్పందం వలన, కొంత కాలం శిక్ష అనుభవించాక 1931 మార్చి 14న విడుదలయ్యారు. ఆ అరెస్టులు, జైళ్ళు ఆయనలోని ఉద్యమకారుడ్ని ఆపలేక పోయాయి. ఆ కారణంగా అనాటి నుండి లాఠీ దెబ్బలు, మళ్ళీ శిక్షలు పర్యవసానంగా మళ్ళీ జైలు జీవితం. ఆ తరువాత రాష్ట్రంలో సాగిన వ్యక్తిగత సత్యాగ్రహంలో తెనాలి నుండి ఖద్దర్ ఇస్మాయిల్ ప్రముఖ పాత్ర నిర్వహించారు. 1941 ఫిబ్రవరి 21 నుండి మూడు మాసాల పాటు జైలు, 150 రూపాయల జరిమానాకు ఆయన గురయ్యారు. ఈ విధంగా పరాయి పాలకుల నుండి మాతృభూమిని విముక్తం చేయాలన్న దృఢసంకల్పంతో సాగిన విముక్తిపోరాట కార్యక్రమాలలో పాల్గొని ఆంగ్ల ప్రభుత్వ ఆగ్రహానికి ఖద్దరు ఇస్మాయిల్ మొత్తం మీద సంవత్సరాల పాటు జైలుగోడల మధ్యన గడిపారు. ఈ క్రమంలో ఆయన తెనాలి, గుంటూరు, రాజమండ్రి, బళ్ళారి, తిరుచునాపల్లి, రాయవెల్లూరు తదితర జైళ్ళల్లో పలుమార్లు శిక్షలు అనుభవించారు.

మహ్మద్ ఇస్మాయిల్ జాతీయ భావాలు కలిగి ఉండడం నచ్చని అఖిల భారత ముస్లింలీగ్ ప్రభావం గల తెనాలి ముస్లిం పెద్దలు కొందరు ఆయనను హెచ్చరించారు. ముస్లింలీగ్ మతతత్వ రాజకీయాలు నచ్చని లౌకికవాదైన ఇస్మాయిల్ ఆ బెదిరింపులకు వెరవలేదు. స్వమతస్థుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా ఆనాడు తన కుమార్తెలను హిందీ నేర్చుకోడానికి యలమంచిలి వెంకటప్పయ్య గారు నడిపిన **ఆదర్శ బాలికా పాఠశాల** కు పంపారు. ఆ నేరానికి గాను ఆయన కుటుంబం అప్రకటిత సాంఘిక బహిష్కరణకు గురయ్యింది. జాతీయ ఉద్యమకారుడు ఇస్మాయిల్‌ను ఆ బహిష్కరణలు, బెదిరింపులు నిలువరించలేక పోయాయి. ఆనాడు సభావేదికల మీద జాతీయ గీతాలను పాడేందుకు తన ఆడబిడ్డలను ఆయన, ఆయన భార్య హజరా స్వయంగా ప్రోత్సహించారు. ముస్లిం బాలికలు వేదికలెక్కడం, పాటలు పాడటం ఆనాడు ఊహించలేని సంఘటన.

ముహమ్మద్ ఇస్మాయిల్ జాతీయ భావనలను, చర్యలను ఛాందసులు జీర్ణం చేసుకోలేక పోయారు. చివరకు ఆయన కుటుంబానికి బెదిరింపులు ప్రారంభమయ్యాయి. ఆ హెచ్చరికలకు ఏమాత్రం లొంగని ఇస్మాయిల్ తన జీవిత చరమాంకం వరకు జాతీయ భావాలతో లౌకిక వ్యవస్థ పట్ల అచంచల విశ్వాసంతో ముందుకు నడిచారు. మతప్రసక్తి లేకుండా అందరితో సఖ్యతగా ఉండడమే కాక హిందూ-ముస్లింల ఐక్యత కోసం కృషి సల్పుతున్న ఇస్మాయిల్ కుటుంబం ముస్లిం లీగ్ పెద్దల వలన కష్టనష్టాలను చవి చూడాల్సి వచ్చింది. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా జాతీయోద్యమంలో తాను పాల్గొనడం మాత్రమే కాకుండా యావత్తు కుటుంబాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములను చేశారు.

1942లో క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా తెనాలి రైల్వే స్టేషన్ తగుల బెట్టినప్పుడు, ఇస్మాయిల్ తన ఏడు సంవత్సరాల వయస్కుడైన పెద్ద కుమారుడు మహమ్మద్ తమీజుద్దీన్‌తో కలసి పాల్గొన్నారు. 1945లో గాంధీజీ వలివేరు ప్రాంతానికి వచ్చిన సందర్భంగా ఆయనను కలసి ఇస్మాయిల్ జాతీయోద్యమానికి వ్యక్తిగత విరాళం సమర్పించారు. ఆయన జైలులో ఉండగా తీవ్రంగా అనారోగ్యం పాలయ్యారు. జైలు నుండి విడుదలయ్యాక, అనారోగ్యంతో బాధపడుతూ కూడా ఆయన కుటుంబం స్వాతంత్ర్య సాధన దిశగా తమ కృషి కొనసాగించింది. ఆ కృషికి ఖద్దరు ఇస్మాయిల్ మార్గదర్శకం వహించారు.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక స్వాతంత్ర్య సమర యోధులకు ప్రభుత్వం ప్రకటించిన ఐదు ఎకరాల భూమిని, ఆర్థిక సహాయాన్ని ఖద్దరు ఇస్మాయిల్ కుటుంబానికి అందివ్వచూసింది. మాతృభూమి సేవ మాతృమూర్తి సేవతో సమానం అంటూ, అటువంటి సేవలకు ప్రతిఫలం స్వీకరించడం సరికాదన్న అభిప్రాయంతో ప్రభుత్వం అందచేయ సంకల్పించిన సహాయాన్ని ఇస్మాయిల్ దంపతులు నిరాకరించారు. స్వాతంత్ర్య

సమర యోధులుగా తాము పుట్టిన గడ్డ రుణం తీర్చుకున్నాం తప్ప, తామెప్పుడూ ఎటువంటి లబ్ధిని ఆశించలేదని ఆ దంపతులు ప్రకటించారు. అందువలన ప్రభుత్వం ప్రకటించిన పొలం, ఆర్థిక సహాయం అక్కరలేదన్నారు. జాతీయోద్యమంలో పాల్గొన్న ప్రతిఒక్కరూ మాతృభూమి విముక్తి కోసం ఉద్యమించడం ప్రతి వ్యక్తి సహజ కర్తవ్యం, ధర్మంగా భావించారు. ఆ విధంగా భావించిన మేము కూడా మహాత్ముని బాటలో జాతీయోద్యమంలో పాల్గొన్నాం. మా విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాం. అందువలన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించిన వ్యక్తి ఎటువంటి ప్రతిఫలం ఆశించరాదని ఖద్దరు ఇస్మాయిల్ ప్రకటించారు. ఈ విషయంలో ఖద్దరు ఇస్మాయిల్ భార్య హజరా కూడా భర్త మాటను గౌరవిస్తూ చివరివరకు తమకు ఎటువంటి సహాయం అక్కరలేదని స్పష్టం చేశారు.

ఖద్దరు ఇస్మాయిల్ రాయవెల్లూరు జైలులో ఉండగా ఆయనకు కామెర్ల సోకింది. ఆ వ్యాధి బాగా ముదరడంతో ప్రభుత్వం ఆయను విడుదల చేసింది. ఆ వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురైన ఖద్దరు ఇస్మాయిల్ మళ్ళీ కోలుకోలేదు. అనారోగ్యంతో బాధపడుతూ, స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలను కోరుకుంటూ స్వాతంత్ర్య సమరంలో భాగస్వామి అయిన ముహమ్మద్ ఇస్మాయిల్ నిరంతరం కలలుగన్న స్వతంత్ర భారతదేశంలో 1948 నవంబరు 19న కన్నుమూశారు.

◆◆◆

'**భారత దేశ ప్రజల్లారా !** (' The people of India' ) మన పవిత్ర స్వాతంత్ర్య దినోత్సవం ఉదయించింది. ఇంగ్లీషు వారు మోసాలకు పాల్పడవచ్చు. ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను, హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలను రెచ్చగొడతారు. ముస్లింలారా ! మీరు పవిత్ర ఖురానును గౌరవిస్తున్నట్టయితే, హిందువుల్లారా! మీరు గోమాతను ఆరాధిస్తున్నట్టయితే, మీలోని స్వల్ప విభేదాలను మరచి ధర్మయుద్ధంలో చేతులు కలపండి. ఒక పతాకం కింద పోరాడండి. మన హిందూస్థాన్ మీద ఆంగ్లేయుల పెత్తనం సృష్టించిన మరకలను మీ రక్తంతో శుభ్రం చేయండి...'

**- రొహిల్‌ఖండ్ నేత ఖాన్ బహదూర్ ఖాన్.**

## నైజాం విలీనోద్యమంలో జైలుకు వెళ్ళిన

# 15. నఫీస్ ఆయేషా బేగం

(-)

**స్వ**రాజ్యం కోసం సాగిన సుదీర్ఘపోరాటంలో ప్రజానీకం పరోక్షంగా ప్రత్యక్షంగా పాల్గొన్నారు. పాలక పక్షాలకు వ్యతిరేకంగా ప్రత్యక్ష కార్యాచరణకు దిగిన వారికి ప్రతిఫలంగా పలురకాల శిక్షలు లభించాయి. జాతీయోద్యమానికి పరోక్షంగా సహాయ-సహకారాలు అందించి పోలీసుల చిట్టాలకు ఎక్కకుండా ఉండిపోయిన ఆడపడుచులు ఎందరో అజ్ఞాతంగా ఉండిపోయారు. ఆ తల్లుల త్యాగాలు ఎంత శ్లాఘనీయమైనవైనా అవి ఆయా అధికారిక చిట్టాలకెక్కి అక్షరరూపం ధరించక పోవడంతో, ఆ వివరాలు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. ప్రత్యక్ష పోరులో శిక్షలకు గురైనవారి వివరాలు పోలీసుల రికార్డులలో నిక్షిప్తమై ఉన్నందున కొంతలో కొంత సమాచారం లభ్యం అవుతుంది.

ఈ మేరకు పోలీసు రికార్డుల ఆధారంగా తయారైన గ్రంథాలలో స్థానం పొందిన రాష్ట్రానికి చెందిన ముస్లిం మహిళా యోధురాలు నఫీన్ అయేషా బేగం. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చెందిన స్వాతంత్ర్య సమర వీరుడు జనాబ్ హమీద్ ఆలీఖాన్ కుమార్తె నఫీస్ ఆయేషా బేగం. తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు కావడంతో, ఆయన భావాలతో ప్రభావితురాలైన నఫీస్ తొలుత హైదరాబాద్ కేంద్రంగా సాగిన జాతీయోద్యమంలో భాగస్వాములయ్యారు.

స్వాతంత్ర్యం సిద్ధించాక ఇండియన్ యూనియన్‌లో చేరడానికి నిరాకరించిన నైజాం సంస్థానాధీశుల పట్ల నఫీస్ ఆయేషా బేగం నిరసన వ్యక్తంచేశారు. నైజాం సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని, నైజాం నివాసులంతా భారత దేశ పౌరులుగా పరిగణించ బడాలని నఫీస్ ఆయేషా ఆకాంక్షించారు. అందుకు భిన్నంగా నిజాం సంస్థానాధీశుడు, ఆయన మద్దతుదారులు వ్యవహరించడంతో ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలు ప్రదర్శనలుగా మారి ఆ తరువాత ఉద్యమం స్థాయికి చేరుకున్నాయి.

ఈ వ్యతిరేక ప్రదర్శనల పట్ల ఆగ్రహించిన నిజాం ప్రభుత్వం ప్రదర్శనకారులను నిర్బంధించింది. అరెస్టుల పర్వం సాగించింది. ఈ అరెస్టులలో భాగంగా ఆయేషా బేగం జైలు పాలయ్యారు. ఆమెను 1948, సెప్టెంబర్16న అరెస్టు చేసి హైదరాబాద్ సెంట్రల్ జైలులో నిర్బంధించారు. చివరకు ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానం విలీనమైంది.

ఆ స్వాతంత్ర్య సమరయోధురాలి పూర్తి వివరాలు తెలియలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డాక్టర్ సరోజిని రెగాని సంపాదకత్వంలో రూపొందించిన Who's Who of Freedom Struggle in Andhra Pradesh సంపుటాలలో స్థానం పొందగలిగిన ఏకైక ముస్లిం మహిళ నఫీస్ అయేషా బేగం కావడం విశేషం.

ఆ గ్రంథంలో ఆమె అరెస్టుకు సంబంధించిన వివరాలను, కొద్దిపాటి వ్యక్తిగత విశేషాలను పేర్కొనడంతో ఈ మాత్రమైనా ఆమె గురించి తెలుసుకునే అవకాశం కల్గింది. రాష్ట్రంలోని పలువురు ముస్లిం మహిళలు స్వరాజ్య సాధనకోసం సాగిన పోరాటాలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నప్పటికీ ఒక్క నఫీస్ ఆయేషా బేగం మాత్రమే ఆ సంపుటాలలో స్థానం పొందడం విచారకరం.

◆◆◆

ప్రపంచంలోని ఏ ముస్లిం దేశమైనా మన దేశాన్ని ఆక్రమించ చూస్తే, ఈ దేశపు చివరి ముస్లిం వరకు కూడా పోరాడుతారు ... ఖలీఫాగాని మరే ఇతర ఆక్రమణదారుడు గాని మనదేశం వైపు కన్నెత్తి చూసినా ఆ శక్తుల నుండి మాతృదేశాన్ని రక్షించుకోవడం ముస్లింల ప్రధాన కర్తవ్యమని ఇస్లాం ఆదేశిస్తోంది.

**– మౌలానా అబుల్ కలాం ఆజాద్.**

## నిజాం ప్రభుత్వంచే బహిష్కృతుడైన జాతీయవాది

# 16. మగ్బూల్ అహ్మద్ జమాయ్

(1902-1963)

**భా**రత స్వాతంత్ర్య సంగ్రామం జరుగుతున్న రోజుల్లో ఈ గడ్డ మీది కొన్ని ప్రాంతాలు స్వదేశీ పాలకుల ఏలుబడిలో ఉన్నాయి. బ్రిటీష్ పాలకులకు **జో హుకుం** అంటూ సాగిలపడిన పాలకులలో అన్ని మతాలకు చెందిన వారున్నారు. పాలకుడు స్వమతస్థుడైనా, పరమతస్థుడైనా అతను బ్రిటీష్ పాలకులకు మిత్రుడిగా వ్యవహరిస్తే, అటువంటి పాలకులను స్వదేశీ శత్రువులుగా పరిగణించడం జాతీయోద్యమకారులకు పరిపాటయ్యింది.

విముక్తి పోరాట యోధులను మతం ఆధారంగా మంచి చేసుకొనేందుకు కొందరు పాలకులు ప్రయత్నించినా, ఆ ప్రయత్నాలను ఛీత్కారాలతో తిప్పికొట్టిన పలువురు స్వాతంత్ర్య సమరయోధులు ఉరికొయ్యల నెక్కారు. తుపాకి గుండ్లను స్వీకరించారు. స్వంత గడ్డ నుంచి బహిష్కృతులయ్యారు. ఈ ఒరవడిలో విముక్తి పోరాటం సాగిస్తూ తుర్రేబాజ్ ఖాన్ ఉరికొయ్య నెక్కి భాగ్యనగరం నడిబొడ్డున ఉయ్యాలలూగితే, సయ్యద్ అహ్మద్ పోరుబాటలో ప్రాణాలను అర్పించారు. మౌల్వీ అల్లావుద్దీన్ అండమాన్ దీవుల్లోని సుదీర్ఘకాలం మగ్గి కన్నుమూశారు.

ఆ త్యాగధనుల వారసుడిగా నైజాం ప్రభుత్వం చేత బహిష్కృతుడైన హైదరాబాదు నివాసి మగ్బూల్ అహమ్మద్ జమాయ్ 1902 మే 28న జన్మించారు. జాతీయ భావాల పట్ల మొగ్గు చూపిన అహమ్మద్ ఆలీఘర్‌లోని Mohammedan Anglo Oriental Collegeలో బి.ఎ. చదువుతూ, గాంధీజీ పిలుపు మేరకు సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని కళాశాల

విద్యకు స్వస్తి చెప్పారు. జాతీయ భావాల పరిమళాలను వెదజల్లడానికి జాతీయోద్యమకారుల ద్వారా స్థాపితమైన, జామియా మిలియా ఇస్లామియా కళాశాలలో బి.ఎ. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఆ తరువాత జాతీయోద్యమంలో ప్రవేశించారు.

భారత జాతీయ కాంగ్రెస్ పిలుపుమేరకు దేశంలోని పలు ప్రాంతాలు తిరుగుతూ జాతీయోద్యమ ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని సియోని ప్రాంతంలో ఉప్పు తయారు చేసి జైలుశిక్షను అనుభవించారు. 1931లో గాంధీ-ఇర్విన్ ఒప్పందం ఫలితంగా విడుదలయ్యారు. ఏనాడూ అరెస్టులకు వెరవని అహ్మద్ శాసనోల్లంఘనోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బ్రిటీష్ పాలకులను తీవ్రంగా విమర్శిస్తూ సియోల్‌కోట్‌లో చేసిన ప్రసంగంతో, మండిపడిన ప్రభుత్వం ఆయనకు 1932 జనవరి ఒకటిన 15 మాసాల కఠిన కారాగారావాస శిక్షతో పాటుగా 400 రూపాయాల జరిమానా విధించింది. భారత శిక్షాస్మృతి 117 సెక్షన్ క్రింద మరో ఆరు మాసాల అదనపు జైలు శిక్షను కూడా అనుభవించాల్సి వచ్చింది.

ఆ శిక్షాకాలం తరువాత మగ్బూల్ అహమ్మద్ మళ్ళీ పలు ప్రాంతాలలో పర్యటిస్తూ స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమాలలో తనదైన భాగస్వామ్యాన్ని అందిస్తూ ముందుకు సాగారు. చాలాకాలం తరువాత 1938లో తన స్వస్థానమైన హైదరాబాద్‌కు వచ్చారు. బ్రిటీష్ పాలకులను ఈ దేశం నుండి తరిమి కొట్టాలన్న ఏకైక లక్ష్యంతో సాగుతున్న ఉద్యమంలో భాగస్వామ్యం వహిస్తున్న అహమ్మద్ హైదరాబాదు రావడం, బ్రిటీష్ వలసపాలకుల అండదండలతో అధికారం వెలగబెడుతున్న నైజాం పాలకులకు రుచించలేదు. వలసపాలకుల అయిష్టతకు గురికావాల్సి వస్తుందన్న భయం, స్థానికులలో రగులుతున్న విముక్తి పోరాట జ్వాలలను ఆయన మరింతగా జ్వలింప చేస్తారని అనుమానించిన నైజాం ప్రభుత్వం, మగ్బూల్ అహమ్మద్‌ను హైదరాబాద్ వదలి వెళ్ళాల్సిందిగా ఆదేశిస్తూ హుకుం జారీ చేసింది.

మతతత్వ రాజకీయాలు ఏమాత్రం నచ్చని మగ్బూల్ ఆహమ్మద్ మొదటినుంచి ముస్లిం లీగ్‌కు దూరంగా ఉన్నారు. మతాభిమానం ఉన్నా, మత దురభిమానం కూడదన్నది ఆయన అభిమతం. ఆయన హైదరాబాదులో జన్మించినా, యావత్తు భారతదేశం తనదని అనుకున్నారు. ఆ కారణంగా భారత దేశ వ్యాప్తంగా ఆయన సాగిస్తున్న పర్యటనలలో భాగంగా హైదరాబాద్ నుండి కేరళ చేరుకున్నారు. ముస్లింలు అత్యధిక సంఖ్యలో నివసిస్తున్న మలబార్ ప్రాంతానికి ఆయన వెళ్ళారు. అక్కడ కూడా మతతత్వ రాజకీయాలను నిరసిస్తూ తనదైన ధోరణిలో ప్రసంగాలు చేశారు. ఆ ప్రాంతంలోని ముస్లిం లీగ్ నేతలకు జాతీయ భావాలతో కూడిన మగ్బూల్ అహమ్మద్ ప్రసంగాలు నచ్చలేదు. ఆ కారణంగా ఆయన ఆక్కడ చేదు అనుభవాలను చవి చూడాల్సి వచ్చింది.

జాతీయ భావాలను ప్రచారం చేస్తూ, మగ్బూల్ అహమ్మద్ కాలికట్‌లో ప్రముఖ జాతీయోద్యమ నాయకులు డాక్టర్ షౌకత్ ఆలీ అధ్యక్షతన భారీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం ఏర్పాటు వలన స్థానిక ముస్లిం లీగ్ నాయకుల ఆగ్రహానికి గురయ్యారు. తమ ప్రాబల్యం గల ప్రాంతంలో, భారత జాతీయ కాంగ్రెస్ నేతలు భారీగా సమావేశం ఏర్పాటు చేయడం లీగ్ నేతలు సహించలేకపోయారు. అహమ్మద్ లాంటి నేత మలబారులో ఇంకా ఎక్కువ కాలం ఉండడం తమ రాజకీయాలకు ప్రమాదకరమని భావించిన లీగ్ నేతలు, ఆయనను అక్కడి నుండి తప్పించే ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ ప్రయత్నాల ఫలితంగా 1945లో మగ్బూల్ అహమ్మద్ మలబార్ వదిలి పెట్టాల్సి వచ్చింది.

అటు నుండి మధ్యప్రదేశ్ చేరిన మగ్బూల్ అహమ్మద్ అక్కడ స్థానికంగా పట్టు సంపాదించారు. జాతీయ రాజకీయాలలో తనదైన పాత్రను పునఃప్రారంభించారు. అచిర కాలంలోనే ఆయన అక్కడి ప్రధాన నాయకులలో ఒకరయ్యారు. 1946లో సియోని కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులయ్యారు. తనదైన రాజకీయ అభిప్రాయాలతో జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించిన ఆయన, మౌలానా అబుల్ కలాం అజాద్ అధ్యక్షతన గల Nationalist Muslim Conference కార్యక్రమాల కమిటీ సభ్యులయ్యారు. NMC నేతగా ఆయన దక్షిణ భారతదేశ పర్యటన చేశారు. ఈ సందర్భంగా మత సామరస్యం ప్రబోధిస్తూ పలు ప్రాంతాలు తిరిగారు. తన ప్రసంగాలతో అనేకులను ప్రభావితులను చేశారు. ఉత్తరభారతదేశంలో మతోన్మాదం పెచ్చరిల్లి ప్రళయ నృత్యం చేస్తున్న సందర్భంగా, హైదరాబాద్ రాజ్యంలో కూడా మత సామరస్య ప్రచారం నిర్వహిస్తూ, హిందూ-ముస్లింల ఐక్యత కోసం శ్రమించారు.

జాతీయోద్యమ నేతగా వేర్పాటువాదాన్ని తిరస్కరించిన మగ్బూల్ అహ్మద్ ఆలోచనలకు వ్యతిరేకంగా భారతదేశం మతం పేరిట పాకిస్తాన్-హిందూస్తాన్‌గా రెండు ముక్కలు కావడం ఆయన మనస్సును తీవ్రంగా బాధించింది. జరగరానిది జరిగిపోయిన తరువాత, జరిగిన దాని గురించి ఆలోచించే కంటే జరగబోయే దాని గురించి ఆలోచనలు చేయడం ఉత్తమంగా భావించిన ఆయన నవభారత నిర్మాణానికి నడుంకట్టారు.

స్వాతంత్ర్యోద్యమకారునిగా తమ కలలను పండించుకున్న అదృష్టవంతునిగా, ఉత్సాహంతో కార్యరంగంలోకి దిగారు. చివరివరకు కాంగ్రెస్ పార్టీలో గడిపిన అహమ్మద్ రాష్ట్ర రాజకీయాలలో ప్రధాన పాత్ర నిర్వహించారు. 'ఆంధ్ర-బి-ప్రొవిన్షియల్ కాంగ్రెస్ కాంట్రాక్ట్ కమిటీ' కి సభ్యునిగా నియుక్తులయ్యారు. ఇండియన్ యూనియన్‌లో విలీనం అయ్యేందుకు నిజాం నిరాకరించిన సమయంలో విలీనం డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన పోలీస్ యాక్షన్‌లో బాధితులను, నిరాశ్రయులను ఆదుకోటానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. పోలీసు చర్య తరువాత సైనిక ప్రభుత్వం ఏర్పాటు

చేసిన పునరావాసక-సహాయక కార్యక్రమాల కమిటీలో సభ్యునిగా విరామమెరుగక శ్రమించారు. 1952-56 సంవత్సరంలో హైదరాబాద్ విధాన సభ సభ్యునిగా నియమించ బడ్డారు. 1956-60 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విధాన సభలో కాంగ్రెస్ పార్టీ నేతగా పలు బాధ్యతలను ఆయన నిర్వహించారు.

జర్నలిస్టుగా రాణించాలన్న ప్రగాఢమైన కోరిక గల మగ్బూల్ అహమ్మద్ పలు భాషలను నేర్చుకున్నారు. మంచి సాహిత్యం మీద ఎక్కువ మక్కువ గల ఆయన విభిన్న అంశాల మీద తనదైన అభిప్రాయాలను సూటిగా వ్యక్తం చేశారు. భాషమీద పట్టుకోసం, 1932 లోనే ORIENTAL UNIVERSITY నుంచి బి.ఏ. డిగ్రీ తీసుకున్నారు. ఉర్దూ భాషపట్ల మక్కువ గల ఆయన పలు వ్యాసాలు రాశారు. పలు పుస్తకాలను రాసి వెలువరించారు. ఔత్సాహిక రచయితలను ప్రోత్సహించేందుకు గాను, తనదైన భావాలను వ్యక్తీకరించేందుకు గాను, DAILY SALTANAT, PAISA AKHBAR, MUSHEER-E-DECCAN, AMAR BHARAT అను వార్తాపత్రికల సంపాదకవర్గాలలో సభ్యునిగా విశేష కృషి సల్పారు. సాహిత్య, సామాజిక సేవ ప్రధాన లక్ష్యంగా పలు సంస్థల ఏర్పాటుకు ఆయన మార్గదర్శకులయ్యారు. మంచి వక్తగా, స్వాతంత్ర్య సమరయోధునిగా విధానసభ సభ్యునిగా, ప్రజానాయకునిగా, పాత్రికేయునిగా, సంపాదకునిగా 'శభాష్' అనిపించుకున్న మగ్బూల్ అహమ్మద్ 1963 జూలై 14న హైదరాబాద్‌లో తన 61న ఏట అంతిమ శ్వాస వదిలారు.

◆◆◆

'...ప్రతి ఒక్కరి జీవితంలో ఒక్కొక్కసారి ప్రాణాలను రక్షించుకోడానికి తెలివిగా ప్రవర్తించాల్సిన అవసరం వస్తుంది. అయితే అన్ని సమయాలలో ప్రాణాలు కాపాడు కోవడమే ప్రధానం కాదు. కొన్ని సమయాలలో ఆశయాల కోసం, మాతృభూమి గౌరవ ప్రతిష్టల కోసం జీవితాలను పణంగా పెట్టాల్సి వస్తుంది. మాతృభూమి కోసం బలి కావటం తన భూమి పట్ల గల ప్రేమకు నిదర్శనమౌవుతుంది...నా సహచరులను నా కళ్ళ ముందే ఉరి తీశారు. ఇంకా చాలా మందిని ఉరి తీయగలరు. నన్నూ చంపగలరు. అయితే ఒక విషయం గుర్తుంచుకోండి. బలమైన స్వేచ్ఛాకాంక్షతో, స్వాతంత్ర్యం కోసం రక్తతర్పణలకు సిద్ధమౌతున్న ఈ పుడమి తల్లి బిడ్డలను నిలువరిం చడం మీకు కాదు కదా, మరే శక్తికీ సాధ్యం కాదు. ఈ రణంలో చిందిన మా రక్తపు బిందువుల వలన స్వాతంత్ర్య సమరయోధుల శరీరాలలో అగ్ని పుడుతుంది. ఆ అగ్నిజ్వాలల వేడిమిలో మీ ప్రభుత్వం, మీరూ మాడి మసైపోవటం తథ్యం...'

**- మౌల్వీ పీర్ అలీ ఖాన్**



## సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడిన ఆచార్యుడు.

# 17. మఖ్దూం మొహియుద్దీన్

(1908-1967)

స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో మాతృదేశ విముక్తి ప్రధానంగా త్యాగాలకు సిద్ధమైన మహానుభావులు కొందరయితే, మరింత విశాల దృక్పథంతో ప్రపంచ ప్రజల క్షేమం, కార్మికవర్గ సౌభాగ్యం కోరుతూ పోరుబాటను ఎన్నుకున్న మహనీయులు మరికొందరు. అటువంటి రెండవ తరహా యోధులలో మఖ్దూం మొహియుద్దీన్ ఒకరు.

1908 ఫిబ్రవరి 4న ఆంధ్రప్రదేశ్‌లోని మెదక్ జిల్లా ఆందోల్ గ్రామంలో జన్మించిన మఖ్దూం మొహియుద్దీన్ పూర్తిపేరు అబూ సయీద్ మహమ్మద్ మఖ్దూం మొహియుద్దీన్ ఖాద్రి. ఆయన పూర్వీకులది ఉత్తరప్రదేశ్‌లోని అజాంఘడ్. ఆయన వంశం పితామహుడు రషీదుద్దీన్ ఔరంగజేబు కాలంలో దక్కన్ పీఠభూమికి వచ్చి స్థిరపడ్డాడు. తండ్రి గౌస్ మొహియుద్దీన్ ఆందోల్ తాలూకా తహసీల్ కార్యాలయంలో ఉద్యోగి. మఖ్దూం నాలుగేండ్ల వయస్సులో తండ్రి మరణించడంతో పినతండ్రి బషీరుద్దీన్ ఇంట పెరిగారు. మతాభినివేశం గల బషీరుద్దీన్ ఇంట శోత్రియ వాతావరణం అతనికి అబ్బింది. పినతండ్రి ప్రభావంతో నియమం తప్పక ధార్మిక విధులను పాటించడం అలవాటయ్యింది.

పినతండ్రి ఇంట భోజన సమయంలో దస్తర్‌ఖాన్ మీద అంతా అసీనులయ్యాక, ఆ రోజు ప్రపంచంలో జరిగిన ముఖ్య విశేషాలను పినతండ్రి వివరించడం ఆనవాయితి. భారతదేశంలో సాగుతున్న జాతీయోద్యమం విశేషాలతో పాటుగా, ఒక రోజున రష్యాలో


ప్రజలు సాధించిన విజయాలను, ఆ విజయాల పర్యవసానంగా ప్రజా జీవనంలో రానున్న మార్పులను ఆయన ఆసక్తికరంగా వివరించారు. ఆర్థిక-సాంఘిక అసమానతలు లేని సమాజం గురించి పినతండ్రి చెప్పిన మాటలు పదేళ్ళ మఖ్దూంను ఆకట్టుకున్నాయి. అప్పటి నుండి అటువంటి సమాజాన్ని మనం సాధించలేమా? అనే ప్రశ్న మఖ్దూం మనస్సును పట్టేసింది.

మెదక్ జిల్లా సంగారెడ్డిలో మెట్రిక్యులేషన్ పూర్తిచేసిన మఖ్దూం, 1929లో ఉన్నత చదువుల కోసం హైదరాబాదు చేరుకున్నారు. ఆ రోజుల్లో జీవిక కోసం చిన్నచిన్న పనులు చేసుకుంటూ చదువు కొనసాగించారు. పరిహాసాలకు, అల్లరికి ప్రసిద్ధుడైన మఖ్దూం సహాధ్యాయులందరికి ఆప్తుడు. **జమాలుద్దీన్ జోక్స్** అంటూ ప్రసిద్ధి చెందిన జోక్స్‌లో కన్పించే **జమాలుద్దీన్** పాత్రను మఖ్దూం స్వయంగా సృష్టించారు. 1937లో ఆయన ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి యం.ఏ డిగ్రీ చేసి, **ఉర్దూ నాటకం** (DRAM IN URDU) మీద పరిశోధనా పత్రం సమర్పించి డాక్టరేట్ పొందారు. ఆ తరువాత బ్రతుకుదెరువు కోసం పలు చిన్నా చితక ఉద్యోగాలు చేస్తూ వచ్చి, చివరకు ఆయన 1929లో హైదరాబాద్ నగరంలోని సిటీకాలేజీలో అధ్యాపకునిగా స్థిరపడ్డారు.

ప్రజలు అనుభవిస్తున్న కష్టనష్టాలను, అలవిగాని దాస్యాన్ని మఖ్దూం నిశితంగా గమనించారు. ముస్లింలు-హిందువులలోని కొన్ని వర్గాలు, సంస్థలు ఇరువర్గాల మధ్యన తగాదాలను సృష్టిస్తున్న పరిస్థితులు ఆయనకు ఆందోళన కలిగించాయి. బ్రిటీష్ సామ్రాజ్యవాద శక్తుల దాస్యంలో మగ్గుతున్న ప్రజలు ఆ దాస్యం నుండి విముక్తికి సమైక్యంగా పోరాడాల్సింది పోయి అంతర్గత కలహాలతో అలసి పోవడాన్ని మఖ్దూం సహించలేక పోయారు.

ఆ రోజుల్లో నియాజ్ ఫతేపూర్ అను పాత్రికేయుడు **'నిగార్'** పత్రికలో రాసే వ్యాసాలు, కవితలు హేతువాద దృష్టిని నింపుకుని, యువకుల్లో ఆలోచనలు రేకెత్తించేవి. దానికి తోడు బ్రిటీష్ సామ్రాజ్యవాదుల విస్తరణ కాంక్షకు వ్యతిరేకంగా, సామ్యవాద వ్యవస్థ, ప్రజాతంత్ర లౌకిక విధానాల గురించి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చేస్తున్న ప్రసంగాలు యువకులను బాగా ఆకట్టుకున్నాయి. చిన్నవయస్సు నుండే జాతీయోద్యమం గురించి వింటూ వచ్చిన మఖ్దూం ఆ వాతావరణానికి సహజంగానే ప్రతిస్పందించారు.

1934లో **'టూర్'** అను భావగీతం ద్వారా తనలోని కవితా తృష్ణకు ఆయన అక్షరరూపం కల్పించారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా మఖ్దూం కలం పట్టారు. ఆయన రచించిన **'విదురుల గృహాలు'** నాటకం రవీంద్రనాథ్ టాగూర్ ప్రశంసలను అందుకుంది. ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన బాధితులను ఆదుకోడానికి కూడా ఆయన నాటకాలు రాసి ప్రదర్శించారు. 1936లో THE ANJUMANE TARQQI-E-URDU అను ప్రగతిశీల రచయితల సంఘాన్ని స్థాపించారు. నరసింగరావు, అఖ్తర్ హుస్సేన్


యువకవి మగ్దూం మొహిద్దీన్

రాయ్‌పూరి లాంటి వారితో కలసి సరోజినీ నాయుడు గృహమైన **'స్వర్ణ దేహళి'**లో సమకాలీన రాజకీయాల మీద, ఉర్దూ సాహిత్యం మీద జరిగే చర్చలలో చురుగ్గా పాల్గొంటూ చక్కని సాహిత్య సృష్టికి పునాదులు వేసుకున్నారు. జాతీయ భావాలతో పాటుగా, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా పయనిస్తున్న మఖ్దూంకు కమ్యూనిస్టు సిద్ధాంతాలు పరిచయం అయ్యాయి. కమ్యూనిస్టు సాహిత్యాన్ని రహస్యంగా తెప్పించి, వాటిని అనువదించి యువకులలో ఆ భావలను పరిచయం చేయడం ప్రారంభించారు.

1939లో ద్వితీయ ప్రపంచ సంగ్రామం ప్రారంభమైంది. ఆ సమయంలో యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ **సిపాయి, అంధేరా** (చీకటి) అను సుప్రసిద్ధ గేయాలు మఖ్దూం రాశారు. పెట్టుబడిదారి శక్తుల పుణ్యమే ఈ అనర్దదాయక యుద్ధమని ఆయనఆగ్రహం వ్యక్తంచేశాడు. అంధేరా గేయం ఉత్తమమైనదని ప్రశంసలు పొందింది.

1939-40 ప్రాంతంలో నాగపూర్ కమ్యూనిస్టు సహచరుల, మిత్రుల సహకారంతో హైదరాబాదులో విద్యార్థి సంఘాన్ని స్థాపించారు. అంతేకాకుండా కమ్యూనిస్టు పార్టీ నగర శాఖను ప్రారంభించడంలో ఆయన ప్రధాన పాత్ర వహించారు. చివరకు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం, పార్టీ కార్యక్రమాల కోసం అధ్యాపక ఉద్యోగానికి రాజీనామా చేసి కమ్యూనిస్టు ఉద్యమానికి పూర్తిగా అంకితమయ్యారు.

1942లో దేశమంతటా క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఒక సమావేశంలో, భారతదేశంలో జాతీయ ప్రభుత్వం ఏర్పడాలని, బ్రిటీషర్లు దేశం వదలి వెళ్లాలని డిమాండ్ చేస్తూ మఖ్దూం ప్రసంగించారు. ఆగ్రహించిన ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసి మూడు మాసాల జైలు, 250 రూపాయల జరిమాన శిక్షగా విధించింది. ఈ సందర్భంగా జైలులో జాతీయోద్యమకారులు, నిజాం స్టేట్ కాంగ్రెస్ నేతలు స్వామీ రామానంద తీర్థ, అచ్యుతరావు దేశ్‌పాండే లాంటి ప్రముఖులు ఆయనకు పరిచయమయ్యారు.

1946 ప్రాంతంలో పలు పారిశ్రామిక వాడలలోని కార్మికులు, కార్మిక సంక్షేమానికి సంబంధించిన చట్టాలు లేక పడుతున్న ఇక్కట్ల పరిష్కారానికి మఖ్దూం నడుం కట్టారు. ఆ క్రమంలో హైదరాబాదు రాష్ట్ర కార్మిక సంఘాన్ని స్థాపించారు. ఆ సంఘానికి అధ్యక్షునిగా

బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుండి కార్మికోద్యమానికి పూర్తిగా అంకితమై పనిచేశారు. శ్రమజీవుల సంక్షేమం ప్రధాన లక్ష్యంగా ఆయన జరిపిన నిర్విరామ కృషి ఫలితంగా కార్మికోద్యమం బలపడింది. అంతర్జాతీయ స్థాయిలో కార్మికోద్యమం పట్ల మంచి అవగాహన కలిగిన ఆయనను 1953లో వియన్నాలోని ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యాలయంలో పనిచేసేందుకు అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఎంపికచేసింది. 1954 వరకు అక్కడ పనిచేసి తిరిగి వచ్చిన ఆయన అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యకలాపాల మీద దేశమంతా తిరుగుతూ, కార్మిక సమస్యలను పరిష్కరిస్తూ, కార్మికోద్యమ పటిష్టతకు మఖ్దూం నిర్విరామంగా శ్రమించారు.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం లభించి, 1948 ప్రాంతంలో పోలీసు చర్య పూర్తయిన తరువాత ఆయన అజ్ఞాతం నుండి బయటకు వచ్చారు. పరిస్థితులు అనుకూలంగా లేక మరో మారు అజ్ఞాతంలోకి వెళ్ళాల్సి వచ్చింది. కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం విధించిన ప్రభుత్వం 1951 మార్చిలో ఆయనను అరెస్టు చేసింది. కానీ 1952 నాటి పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకుని మఖ్దూంను విడుదల చేశారు. ఆ ఎన్నికలలో పీపుల్స్ డెమాక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా హైదరాబాదు నియోజకవర్గం నుండి పోటీచేసి ఓడిపోయారు. ఆ తరువాత అసెంబ్లీకి జరిగిన ఉపఎన్నికలో హుజూర్‌నగర్ నియోజకవర్గం నుండి మఖ్దూం విజయం సాధించారు.

ఆయన సేవలను గుర్తించిన కమ్యూనిస్టు పార్టీ 1958లో రాష్ట్ర శాసనమండలికి పంపింది. శాసనమండలిలోని కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధుల వర్గానికి ఆయన నాయకత్వం వహించారు. 1957లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో మెదక్ నియోజకవర్గం నుండి పీపుల్స్ డెమాక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ సారి కూడా ఆయనకు విజయం దక్కలేదు. ఆ తరువాత 1967లో రాష్ట్ర శాసనమండలికి మరోసారి ఎంపికైన ఆయన కన్నుమూసే వరకు రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించారు.

మఖ్దూం మొహియుద్దీన్ కార్మికోద్యమ నాయకునిగా, కమ్యూనిస్టు పార్టీ నేతగా ఎంత సుప్రసిద్ధులో అంతకంటే ప్రఖ్యాత ఉర్దూకవిగా, రచయితగా లబ్ధప్రతిష్టులయ్యారు. విద్యార్థిగా ఉన్నప్పుడు జీవికను సంపాదించుకుంటూ చదువుకుంటున్న సమయంలో అవసరం నిమిత్తం ఆయన ప్రఖ్యాత రచయితల గ్రంథాలు చదవాల్సి వచ్చింది. ఆ అధ్యయనం వలన జాతీయ, అంతర్జాతీయ సాహిత్య ప్రముఖుల సాహిత్యంతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ఆయనలోని కవిని, రచయితను మరింత పదును తేల్చింది. కమ్యూనిస్టు సిద్ధాంతాల నిబద్ధుడు కనుక ఆ దృక్కోణం నుండి సమకాలీన పరిస్థితులకు ప్రతిస్పందిస్తూ

# మఖ్దూం రాసిన "హైదరాబాద్" ఉర్దూ రచనను నిషేధిస్తూ నైజాం ప్రభుత్వం జారీచేసిన ఫర్మానా

RESIDENCY ORDERS NOTIFICATIONS.

No. 64.-P, dated the 24 May, 1947.

-----

In exercise of the power conferred by sub-rule (1) of Rule 3 of the Indian States Prevention of Importation of Objectionable Documents Rules, published in the Political Department Notification No.207-I.B., dated the 30th September 1937, the Resident is pleased to prohibit the entry into the Administered Areas in the Hyderabad State of all copies of the book in Urdu entitled "Hyderabad" by Makhdoom Mohiuddin, published by Qaumi Dar-ul-Ishayat (National Publicity) of Lahore and Bombay and printed at the Co-operative Cadel Press, Lahore, and all other documents containing copies, reprints, and translations of, or extracts from the said publication.

A.C.K. Maunsell,
Secretary to the Hon'ble the Resident.

-----

No. 65-P, dated the 24 May, 1947.

----

In exercise of the powers conferred by section 99-A of the Code of Criminal Procedure, 1898 (Act V of 1898) as applied to the Hyderabad Administered Areas, the Resident is pleased to declare to be forfeited to His Majesty all copies wherever found, of the book in Urdu entitled "Hyderabad" by Makhdoom Mohiuddin, published by Qaumi Dar-ul-Ishayat (National Publicity) of Lahore and Bombay and printed at the Co-operative Cadel Press, Lahore, and all other documents containing copies, reprints, translations of, or extracts from the said book, on the ground that the said book contains matter the publication of which is punishable under section 124-A of the Indian Penal Code as applied to the said Areas.

A.C.K. Maunsell,
Secretary to the Hon'ble the Resident.

اعلیٰ حضرت بندگان عالی متعالی مدظلہ العالی

H. E. H. The Nizam's Peshi Office,
King Kothi,
Hyderabad-Deccan.

۱۲-جمادی الاول ۱۳۶۶ھ

ضروری

آپ کو تحریر کیا جاتا ہے کہ سرکار کا جو حکم ہوا ہے وہ حسب ذیل ہے۔

کوتوال بلدہ نے میرے ملاحظہ میں ایک رسالہ پیش کیا ہے جس کا نام حیدرآباد ہے جس کو ڈاکٹر مخدوم محی الدین نے طبع

کیا ہے اس میں از ابتدا تا انتہا جو مضامین لکھے گئے ہیں وہ کھلے باغیانہ رنگ میں ہیں خصوصاً ایسے پر آشوب زمانہ میں ایسے

مضامین سے ہر قسم کے فتنے برپا ہونے کا اندیشہ ہے۔ لہذا میری دانست میں اسکی خرید و فروخت اندرون ممالک

محروسہ سرکار عالی مسدود ہونا اور کاپیاں بحق سرکار ضبط ہونے کے قابل ہیں تاکہ اس فتنہ و شر کا انسداد ہو سکے۔

مجھے امید ہے کہ کونسل کو میری رائے سے اتفاق ہوگا اور جلد اس طرف متوجہ ہوگی۔

کوتوال بلدہ نے جو رسالہ پیش کیا تھا وہ کونسل کے پڑھنے کے لئے بھیجا جا رہا ہے

مدارالمہام

అసంఖ్యాకంగా కవితలు, గేయాలు, నాటకాలు, గజళ్ళు రాశారు. ఆయన ఉర్దూలో రాసిన కవితలు కొన్నింటిని గజ్జెల మల్లారెడ్డి, దాశరధి రంగాచార్య, సి.నారాయణ రెడ్డి, రాంబట్ల కృష్ణమూర్తి, కౌముది లాంటి ప్రముఖులు తెలుగులోకి అనువదించారు.

కవిగా మఖ్దూం మొహియుద్దీన్ **అగ్నిగుండం, తెలంగాణా, నిరీక్షణ, ఫగ్ పూర్ ఆత్మ**, లాంటి పలు గేయాలు రాశారు. ఈ కవితల్లో ఆయన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిప్పులు కక్కారు. బ్రిటీష్ పాలనను నుద్దేశించి, మృత్యువునీ, వినాశనాన్ని కల్గించేందుకు నా ఇంట్లోకి అమాంతం జొరబడింది, అన్నారు. అలాగే **అజాదీ-ఏ-వతన్** అను గేయంలో, భారతదేశం భవిష్యత్తునే మార్చేసేందుకు యువకులు ఉవ్వెత్తున ఉరుకులు పెడుతూ రావాలని ఉద్బోదించారు. ఆనాడు తెలంగాణా ప్రాంతంలోని ప్రజల మీద పెత్తనం చేస్తున్న ఫ్యూడలిజాన్ని **'హవేలి'** అను గీతంలో దుయ్యబట్టారు. ప్రజల మధ్య ఎల్లప్పుడూ ఉండాలని కోరుకునే ఆయన, ఈ భావనను జైలులో ఉన్నప్పుడు రాసిన **'ఖైదు'** అను గేయంలో చాలా బాగా వ్యక్తం చేశారు. ఆయన రాసిన ప్రసిద్ద గీతం **'చాంద్ తారోంకా బన్'** లో స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తరువాత, భవిషత్తును ప్రస్తావించారు. ఈ గేయంలో మనం చేయాల్సింది ఎంతో ఉందంటూ, ప్రతి ఒక్కరు మంచి భవిత కోసం ముందడుగు వేయాలన్నారు. ఆయన గీతాల మీద నైజాం ప్రభుత్వం 1947లో నిషేధాన్ని విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ రకంగా **తూర్పు, తెలంగాణా, సిజ్దా, జవాని, యాద్ హై, మైం, షాయర్, ఇంతెజార్, ముస్తఖ్బిల్, దోకతయో, ఇన్తిసాబ్, జంగ్, మశరిక్, ధుర్వా, ఇక్బాల్, అంథేరా, జంగ్ హై జంగ్ ఆజాదీకి, సితారే, చార్‌గల్, ఆజ్‌కిరాత్ నజా, చుప్‌సారహో, సన్నాటా, అప్నాషహర్** అను గీతాలను రాశారు. చివరి దశలో మఖ్దూం మొహియుద్దీన్ గజళ్ళు కూడా రాశారు.

ప్రజా జీవనరంగాలలో బహుముఖ పాత్రను ప్రతిభావంతంగా నిర్వహించిన మఖ్దూం మొహియుద్దీన్ 1969 ఆగస్టు 25న ఢిల్లీలో కన్నుమూశారు. ఆయన భౌతిక కాయాన్ని హైదరాబాద్‌కు తీసుకువచ్చి అంత్యక్రియలు జరిపారు. ఆ సందర్భంగా, మఖ్దూం ఎవరు? అని తనను తాను ప్రశ్నించుకున్న ప్రముఖ కవి ఖాజా అహమ్మద్ అబ్బాస్, తనకు తానే సమాధానం చెప్పుకుంటూ, '**మఖ్దూం జ్వలత్ప్రదీప్తిజ్వాల, హిమశీతల తుహిన మాల, ఆయన విప్లవ కాహళి, మంజీర ఝణంఝణా రవళి**' అని మఖ్దూంను అద్భుతంగా వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించాడు. ఈ సందర్భంగా, '..**ఒక విప్లవ కవి ఇక లేడు, ఒక భావ కవి. ఒక మధురమైన కవి మనకు కరువైనాడు, ఒక కమ్యూనిస్టు పార్టీ మహానాయకుడు. నిర్మాత పోయినాడు. ఒక ప్రముఖ కార్మిక నాయకుడు శాశ్వతంగా లేకుండా పోయాడు. ఒక నమ్మిన నేస్తం, ప్రేమించే తండ్రి. ఆదరించే ఆచార్యుడు. దుఖఃలో ముంచి పోయాడు**..' అంటూ మఖ్దూం మొహియుద్దీన్‌కు ప్రజలు, ప్రముఖులు నివాళులు అర్పించారు.

◆◆◆



## జాతీయోద్యమకారుల రూపకల్పనకు నడుంకట్టిన

# 18. డాక్టర్ జాకీర్ హుసైన్

(1897-1969)

**స్వ**రాజ్యం సాధించే యోధులుగానే కాకుండా స్వతంత్రం సాధించాక సుందర భారతాన్ని నిర్మించేందుకు అవసరమగు స్థిరచిత్తం గల పౌరులను రూపొందించడానికి తమ్ముతాము సంపూర్ణంగా అంకితం చేసుకున్న జాతీయ ఉద్యమకారులైన విద్యావేత్తలలో అగ్రగామి డాక్టర్ జాకీర్ హుసైన్.

ఆఫ్గనిస్తాన్ నుండి 1719లో ఇండియా వచ్చి స్థిరపడిన అఫ్రిది పఠానుల వారుసుడైన జాకీర్ హుసైన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రరాజధాని హైదరాబాద్‌లో 1897 ఫిబ్రవరి 8న జన్మించారు. జాకీర్ తండ్రి ఫిదా హుసైన్ ఖాన్ న్యాయవాది. తల్లి పేరు నజ్‌నీన్ (Nazneen). ఏడుగురు సంతానం గల ఆ దంపతులకు జాకీర్ మూడవ బిడ్డడు. ప్రముఖ న్యాయవాదిగా ఖ్యాతి గడించిన ఫిదా హుస్సేన్, న్యాయస్థానం తీర్పుల సంకలనాలను ప్రచురిస్తూ ప్రచురణకర్తగా కూడా మంచి పేరు మాత్రమే కాకుండా సంపద కూడా గడించారు.

ఆచార సంప్రదాయాలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చే ఫిదా హుసైన్ తన బిడ్డలకు చక్కని ఆచారవ్యహారాలను అలవాటు చేశారు. మంచి వస్త్రధారణ లేకుండా, కాళ్ళకు చెప్పులు ధరించకుండా రోడ్డుదాటి ఎదురింటికి వెళ్ళడం తమ కుటుంబ ప్రతిష్టకు ఏమాత్రం తగింది కాదని భావించే కుటుంబ కట్టుబాట్లలో జాకీర్ హుసైన్ బాల్యం సాగింది. ఆయన హైదరాబాద్ లోని సుల్తాన్ బజార్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో విద్యాభ్యాసం ఆరంభించారు.

జాకీర్ తొమ్మిదేళ్ళ వయస్సులో ఉన్నప్పుడు 1905లో తండ్రి ఫిదా హుసైన్ క్షయ వ్యాధివలన కన్నుమూశారు. తండ్రి కన్నుమూయడంతో జాకీర్ హుసైన్ తల్లి నజ్‌నీన్ బిడ్డలను తీసుకుని తమ పూర్వీకులు నివాసం ఉంటున్న బీహార్ రాష్ట్రంలోని ఖాశింగంజ్‌కు వెళ్ళిపోయారు. ఈ తరలింపుతో హైదరాబాదు బిడ్డడిగా తొమ్మిదేళ్ళు గడపిన జాకీర్ హుసైన్ బీహార్ రాష్ట్రానికి వెళ్ళిపోవాల్సి వచ్చింది.

బిడ్డలను తీసుకుని హైదరాబాద్ నగరం నుండి ఖాశింగంజ్ వెళ్ళిన నజ్‌నీన్ కుమారుల చదువు పట్ల అత్యధిక శ్రద్ధ కనపర్చారు. 1908లో జాకీర్‌ను ఎటావాలోని ఇస్లామియా ఉన్నతపాఠశాలలో చేర్చారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అల్తాఫ్ హుసైన్ నిబద్ధతగల జాతీయవాది కావడంతో ఆయన ప్రభావానికి లోనైన జాకీర్‌లో జాతీయ భావనలు అంకురించాయి. మంచి ధారణశక్తిగల ఆయన చురుకైన విద్యార్థిగా ఉపాధ్యాయుల మన్నన పొందారు. కఠోర శ్రమకు మారుపేరైన జాకీర్ శీఘ్రగతిన అరబిక్, పర్షియన్, ఉర్దూ భాషలను నేర్చుకున్నారు. విద్యార్థిగా బుద్ధి కుశలత చూపిన జాకీర్ తోటి విద్యార్థులచే గురువుగా (ముర్షద్) పిలువబడ్డారు.

1913లో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత తరువాత అలీఘర్‌లోని మొహమ్మదన్ ఆంగ్లో-ఓరియంటల్ కళాశాలలో చేరిన జాకీర్ హుసైన్ అనారోగ్యం వలన కొంతకాలం చదువు ఆపినప్పటికి 1918లో బి.ఎ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. అనంతరం ఆర్థికశాస్త్రం, న్యాయశాస్త్రం ప్రధాన పాఠ్యాంశాలుగా స్వీకరించి ఎం.ఎలో చేరిన ఆయన కళాశాల విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జాతీయ రాజకీయాలు మాత్రమే కాకుండా అంతర్జాతీయ రాజకీయాంశాల మీద కూడా మంచి అవగాహన గల ఆయన ఆయా అంశాల మీద అనర్గళంగా మాట్లాడుతూ మంచి వక్తగా పలు బహుమతులు గెలుచుకున్నారు.

జాకీర్ హుసైన్ విద్యాభ్యాసం చేస్తూనే షజహాన్ బేగంను వివాహమాడారు. భర్త కార్యకలాపాల పట్ల అత్యంత విశ్వాసం గల ఆమె ఎంతో ధైర్యస్థురాలు. అత్యుత్తమ పదవులు కాళ్ళ దగ్గరకు వచ్చినా తిరస్కరించి, స్వయంగా తెచ్చిపెట్టుకున్న పేదరికాన్ని భరిస్తూ, నేషనల్ ముస్లిం విశ్వవిద్యాలయం (జామియా మిలియా ఇస్లామియా) ఉపకులపతిగా అత్యంత తక్కువ జీతాన్ని తీసుకుంటూ జాకీర్ హుసైన్ బాధ్యతలు నిర్వహిస్తున్న కాలంలో ఎదురైన ఆర్థిక ఇబ్బందులతోపాటు, అన్నిరకాలైన ఇతర ఇక్కట్లును ఆమె ఎంతో నిబ్బరంగా భరించారు. జాకీర్ జీతం కుటుంబ అవసరాలను తీర్చేందుకు కూడా సరిపోక పోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితిని ఆమె ఎన్నోసార్లు ఎదుర్కొన్నారు. అయినా కుటుంబ ఇబ్బందులేవీ భర్త జాతీయోద్యమ కార్యక్రమాలకు, జామియా మిలియా ఇస్లామియా కార్యకలాపాల నిర్వహణకు అడ్డుకాకుండా షజహాన్ బేగం జాగ్రత్తలు తీసుకున్నారు.

1919లో మహాత్మా గాంధీ సహాయనిరాకరణ ఉద్యమాన్ని ప్రకటించారు. ప్రభుత్వ కళాశాలను బహిష్కరించమని ఆయన విద్యార్థులను కోరారు. అలీఘర్‌లోని మొహమ్మదన్ ఆంగ్లో-ఓరియంటల్ కళాశాల విద్యార్థులు ఆలోచనలో పడ్డారు. కళాశాల విద్యార్థులలో వర్గాలు ఏర్పడ్డాయి. జాకీర్ కళాశాల విద్యార్థుల వెంట నడుస్తూ, బహిష్కరణ ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థులను ఆకట్టుకునే ప్రసంగాలు చేశారు. ఆ ప్రసంగాలతో విద్యార్థులను మాత్రమే కాకుండా ప్రజానీకాన్ని కూడా సమ్మోహన పర్చుతున్న జాకీర్ ప్రయత్నాలను గమనించిన ఆంగ్ల ప్రభుత్వం ఆయనను తమ దారికి తెచ్చుకోవాలనుకుంది. ఆ ప్రయత్నాలలో భాగంగా జాకీర్‌కు 'నాయబ్ తహసిల్దార్' ఉద్యోగం ఆశ చూపగా ఆయన నిరాకరించారు. ఆంగ్ల అధికారులు ఎంతగా ప్రయత్నించినా ఏ ప్రతిపాదనలు కూడా ఆయనను మహాత్ముని మార్గం నుండి తప్పించలేక పోయాయి. (Encyclopedia of Muslim Biography, Volumes II, Nagendra Kumar Singh APHPC, New Delhi, 2001, Page.647)

అలీఘర్‌లోని మొహమ్మదన్ ఆంగ్లో-ఓరియంటల్ కళాశాల విద్యార్థుల మద్దతును రాబట్టేందుకు 1920 అక్టోబరు 12న గాంధీజీ కళాశాలను సందర్శించి సహాయనిరాకరణ ఉద్యమానికి చేయూతనివ్వాల్సిందిగా విద్యార్థులను కోరుతూ ప్రసంగించారు. ఆయన విజ్ఞప్తికి విద్యార్థులు ఏమాత్రం సానుకూలత వ్యక్తం చేయకపోగా, గాంధీజి ప్రసంగాన్ని కూడా పట్టించుకోలేదు. ఆ సమయంలో జాకీర్ హుస్సేన్ అలీఘర్‌లో లేరు. అలీఘర్ వచ్చాక ఆ విషయం తెలుసుకుని ఆయన చాలా నొచ్చుకున్నారు, సహచరులతో సంప్రదించారు. ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమాన్ని ఎందుకు సమర్థించాలో, మహాత్ముని బాటలో విద్యార్థులు నడవాల్సిన అవసరం ఏమిటో వివరించి సహచరులను ఇతర విద్యార్థిమిత్రులను ఆ దిశగా ఒప్పించగలిగారు. చివరకు ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమానికి సంపూర్ణంగా చేయూత ఇవ్వాలని జాకీర్ హుసైన్ దృఢ నిర్ణయానికి వచ్చారు. ఆ ప్రయత్నంలో ప్రత్యక్షంగా జాతీయ ఉద్యమంలో పాల్గొనడం కంటె ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొన గల, దృఢచిత్తులైన జాతీయ భావాల యువతను తయారుచేసి జాతీయోద్యమానికి అందించాలని సంకల్పించారు.

ఈ నేపథ్యంలో జాతీయోద్యమకారులు మౌలానా ముహమ్మద్ అలీ, హకీం అజ్మల్ ఖాన్, డాక్టర్ ఎం.ఎ అన్సారి తదితరులతో జాకీర్‌కు పరిచయం ఏర్పడింది. ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా ఆంగ్ల ప్రభుత్వం ఆర్థిక అండదండలతో నడుస్తున్న మొహమ్మదన్ ఆంగ్లో-ఓరియంటల్ కళాశాలను బహిష్కరించడానికి సిద్ధమైన విద్యార్థులలో జాతీయభావాలను మరింత బలంగా ప్రోదిచేయగల మరో స్వతంత్ర కళాశాల అవసరాన్ని మౌలానా ముహమ్మద్ అలీ, హకీం అజ్మల్ ఖాన్, డాక్టర్ ఎం.ఎ అన్సారిల దృష్టికి తెచ్చారు. ఈ కళాశాలను జాతీయోద్యకారులను తయారు చేయడం మాత్రమే కాకుండా జాతీయవిద్య ద్వారా స్వతంత్రం వచ్చాక జాతీయోద్యమ లక్ష్యాలకు అనుగుణంగా భారతదేశాన్ని తీర్చిదిద్దగల

ఉత్తమ పౌరులను రూపొందించాలన్నది తన ప్రధాన లక్ష్యంగా ఒక సందర్భంలో ఆయన స్పష్టంగా ప్రకటించారు. (' to train young men as citizens for carrying the struggle for freedom and for giving meaning and content to freedom once it had been achieved' - Zakir Husain, KRP Singh, NCERT Publications, Newdelhi, 1990)

ఈ లక్ష్యాలకు అనుగుణంగా ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా అలీఘర్ కళాశాల మసీదులో 'జామియా మిలియా ఇస్లామియా' (జాతీయ ముస్లిం కళాశాల) 1920 అక్టోబర్ 29న ఉద్భవించింది. జామియా మిలియా ఇస్లామియా విద్యాసంస్థ ఆర్థికశాస్త్రం అధ్యాపకుడిగా జాకీర్ నియమితులయ్యారు. ఆనాటి నుండి ఆయన పూర్తి స్థాయిలో జాతీయ కళాశాల ప్రధాన లక్ష్యానికి అనుగుణంగా నూతన విద్యా విధానం, పాఠ్యాంశాలతో రూపకల్పన చేయడానికి, బ్రిటీష్ విద్యావిధానానికి భిన్నంగా జాతీయ ముస్లిం కళాశాల దశ-దిశను నిర్ణయించేందుకు మహాత్మా గాంధీ, మౌలానా ముహమ్మద్ అలీ, హకీం అజ్మల్ ఖాన్, డాక్టర్ అన్సారీల ఆలోచనలు-తోడ్పాటు ఆయనకు లభించాయి.

జామియా మిలియా ఇస్లామియాలో జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు పాఠాలు చెప్పడం మాత్రమేకాకుండా ఒక సంవత్సరం పాటు నూతన విద్యార్థులకు ఖిలాఫత్-సత్యాగ్రహ ఉద్యమం లక్ష్యాలు-ఆశయాలు, అందుకు తగినట్టుగా అనుసరించాల్సిన ఉద్యమ రూపాల గురించి ఆరు వారాల పాటు ప్రత్యేక తరగతులను నిర్వహించారు. ఆ విధంగా శిక్షణ పొందిన విద్యార్థులు జట్లుగా దేశంలోని పలు ప్రాంతాలకు వెళ్ళి జాతీయోద్యమంలోకి ప్రజలను ఆకర్షించేందుకు ఎనలేని కృషిచేశారు. ఈ మేరకు జామియా మిలియా ఇస్లామియాలో శిక్షణ పొందిన విద్యార్థుల జట్లు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, కడప, అదోని, బనగానపల్లి, గోదావరి జిల్లాలకు వచ్చి ఖిలాఫత్-సత్యాగ్రహోద్యమంలో ప్రజలు పాల్గొనేందుకు పురికొల్పాయి. ఆ కారణంగా జామియా మిలియా ఇస్లామియాను **సహాయనిరాకరణ ఉద్యమానికి సంబంధించిన ఆరోగ్యకరమైన బిడ్డ** గా పండిత జవహర్‌లాల్ నెహ్రూ కీర్తించారు. (a healthy child of the non-cooperation movement.)

1922 ఫిబ్రవరిలో సహాయనిరాకరణ ఉద్యమాన్ని మహాత్మా గాంధీ రద్దుచేశారు. జాతీయ విద్యాభివృద్ధికి అంకితమైన జాకీర్ హుసైన్ తన మిత్రుడు కె.ఎం. హమీద్ ప్రోద్బలంతో 1922లో ఉన్నత విద్యకోసం జర్మనీ వెళ్లారు. ఆయన జర్మనీ భాషలో మహాత్మాగాంధి జీవితచరిత్ర, మహాకవి గాలిబ్ కవితలను (దివాన్-యే-గాలిబ్) గ్రంథాల రూపంలో ప్రచురించారు. జర్మనీలో ఉన్న మిత్రులతో జామియా మిలియా ఇస్లామియా భవితవ్యం గురించి ఆలోచనలు చేస్తూ, జాతీయ విధానం మీద అధ్యయనం సాగించారు. ఆయన జర్మనీలో ఉండగా ఖిలాఫత్ ఉద్యమం సమకూర్చిన నిధులతో కొనసాగిన జామియా మిలియా ఇస్లామియా నడపడం బహుకష్టంగా మారడంతో దానిని మూసివేయాలని కళాశాల పెద్దలు

నిర్ణయించారు. ఆ విషయం తెలుసుకున్న జాకీర్ తక్షణమే స్పందిస్తూ తాము ఇండియా వచ్చేవరకు కళాశాలను కొనసాగించమని అభ్యర్థించారు. జర్మనీలో ఆయనకు డాక్టర్ అబిద్ హుసైన్, డాక్టర్ ముహమ్మద్ ముజీబ్ లాంటి జాతీయ భావాలు పుణికిపుచ్చుకున్న సహచరులు లభించారు. ఈ ముగ్గురు మిత్రులు జామియా మిలియా ఇస్లామియా భవిష్యత్తు కోసం తమను తాము అంకితం చేసుకోవాలని సంకల్పించుకున్నారు.

1926 ఫిబ్రవరిలో జాకీర్ జర్మనీ నుండి ఇండియా తిరిగివచ్చి నేరుగా జామియా మిలియా ఇస్లామియా చేరుకుని **షేక్-ఉల్-జామియా** బాధ్యతలు చేపట్టారు. ఆయనకున్న విద్యార్హతలను బట్టి ఉన్నత ఉద్యోగాలు తన గుమ్మం ఎదుటకు వచ్చినా, జాతీయ విద్య ద్వారా జాతీయోద్యమాన్ని బలోపేతం చేసి తద్వారా జాతీయోద్యమకారులు కలలుగంటున్న స్వతంత్ర భారతదేశం ఉజ్వల భవిష్యత్తును నిజంచేయడం తన జీవిత లక్ష్యంగా ఎంచుకున్న జాకీర్ వాటిని తిరస్కరించి జాతీయ విద్యావ్యాప్తికి పునరంకితమయ్యారు. కళాశాలలో ఆయనతోటి వారంతా మూడు వందల రూపాయల జీతం పుచ్చుకుంటూ బాధ్యతలు నిర్వహిస్తుండగా జాకీర్ మాత్రం వంద రూపాయలను జీతింగా నిర్ణయించుకున్నారు. అంతేకాకుండా జామియా ఆర్థికస్థితి బాగా లేనందున వైస్‌ఛాన్స్‌లర్ అయి ఉండి కూడా కేవలం ఎనభై రూపాయలు చాలన్నారు. 1948లో అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షునిగా నియమితులైనంత వరకు ఆయన 80 రూపాయల జీతంతో సరిపెట్టుకున్నారు.

జాకీర్ హుసేన్ ఇస్లాం ప్రతిపాదించిన సాదాసీదా సామాన్యుని జీవితం గడిపారు. మహాత్మా గాంధీ విధానాలు జీవితగమనాన్ని నిర్ణయించాయని కూడా జాకీర్ స్వయంగా చెప్పుకున్నారు. 1927 నుండి జామియా మిలియా ఇస్లామియా న్యూఢిల్లీలోని ఓఖ్లాకు తరలినంత వరకు అద్దె ఇంట్లోనే గడిపారు. చివరివరకు ఆయనదంటూ సొంత ఇల్లు కూడా లేకపోయింది. ఆయన భార్య షజహాన్ బేగం ఎంతో సహనంతో భర్తకు అన్నివిధాల సహకరిస్తూ అరకొర ఆర్థిక ఒనరులతో కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. జాకీర్ హుసైన్ ఎన్నడూ కూడా కళాశాల నుండి తన జీతాన్ని అడగడం జరగలేదు. డబ్బు అవసరం వస్తే భార్య షజహన్‌ను మాత్రమే అడిగేవారు. భర్త అవసరాలను బట్టి ఆమె పలుమార్లు అప్పులు తెచ్చి కుంటుంబ అవసరాలకు వినియోగించిన సందర్భాలున్నాయి. ఆర్థిక సహాయం కోసం తమ ఇంటి తలుపుతట్టిన వార్ని నిరాశపర్చకుండా అప్పులుచేసి మరీ సహాయ పడిన సందర్భాలు ఆ దంపతుల జీవితంలో ఎన్నో ఉన్నాయి. (Dr. Zakir Husain, M,Mujeeb, NBT Publications, New Delhi, 1972 Page.50)

జాకీర్, ఆయన సహచరుల త్యాగాలతో నడుస్తున్న జామియా మిలియా ఇస్లామియా 1928 ప్రాంతంలో తీవ్రమైన నిధుల లేమిని ఎదుర్కొంది. ఈ దుస్థితిని

గమనించిన మహాత్మా గాంధీ జామియా మిలియా ఇస్లామియాను తప్పక కొనసాగించాలంటూ అందుకు **ధనం ఒక్కటే దాని సమస్య అయినట్టయితే దానికోసం నేను బిక్షాటన చేస్తాను** అన్నారు. (Zakir Husain, KRP Singh, NCERT Publications, New Delhi, 1990 Page.9) ఈ సంక్షోభం నుండి కళాశాలను గట్టెక్కించాలని జాకీర్ స్వయంగా పూనుకుని ప్రముఖుల వద్దకు వెళ్ళి నిధులను సేకరించారు. ఆయన కృషి వలన జమునాలాల్ బజాజ్, నిజాం నవాబు, సర్ మీర్జా ఇస్మాయిల్ లాంటి ప్రముఖుల సహకారం లభించడంతో జామియా మిలియా ఇస్లామియా బ్రతికి బట్టకట్టగలిగింది.

జాతీయోద్యమకారుల తయారీలో తనదైన పాత్ర వహిస్తున్న జాకీర్ 1930లో జరిగిన ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొనేందుకు జామియా విద్యార్థులను, అధ్యాపకులను ప్రోత్సహించారు. సాంఘిక సమానత్వ భావాలను విద్యార్థులలో పెంపొందించేందుకు ప్రతి ఏడాది ఏప్రిల్ మాసం 7 నుండి 13 వరకు **జాతీయ వారం** అను ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేశారు. శ్రమపట్ల గౌరవం, సమభావన, సాంఘిక సమానత్వం పట్ల ఆచరణాత్మక అవగాహన కల్గించేందుకు ఉద్దేశించబడిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల ఉద్యోగులు, అధ్యాపకులు, ప్రముఖులంతా ఏక మనస్కులై చిన్నా-పెద్ద తేడాలేకుండా కలసిమెలసి పాల్గొనడాన్ని ఆనవాయితీ చేశారు. ఈ విధంగా జాతీయ విద్యతోబాటు, సిబ్బందిలో కూడా జాతీయభావాలు నింపేందుకు జాకీర్ పలు విధానాలను అమలుచేశారు. మహాత్మా గాంధీ **స్వరాజ్య ఫండ్** సేకరణ ఆరంభించగా ఆయన మార్గదర్శకత్వంలో జామియా విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు తొట్టతొలుతగా నిధికి తమ వాటాను అందించారు.

జామియా మిలియా ఇస్లామియాలో జాతీయ విద్యావిధానాన్ని అనుసరిస్తూ వస్తున్న జాకీర్‌ను మహాత్మాగాంధీ అభిమానించారు. ఆయన దృష్టిలోగల జాతీయ విద్యను జాకీర్ అనుసరిస్తున్నందున 1937లో వార్ధాలో జరిగిన జాతీయస్థాయి విద్యావిషయక సమావేశంలో జాకీర్‌కు బేసిక్ విద్య గురించి మహాత్ముని ఆలోచనలకు అక్షరరూపం కల్పించే బాధ్యతలను అప్పగించారు. ఆ బాధ్యతలను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు. ఈ మేరకు దేశా వ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలలో జాతీయ విద్య, బేసిక్ విద్య లాంటి మౌలిక అంశాల మీద ప్రసంగాలు చేస్తూ జాకీర్ బహుళ ప్రచారం గావించారు. జాతీయ విద్యను, జామియా మిలియా ఇస్లామియాను తన ఏకైక కార్యక్షేత్రం చేసుకుని అందుకు పూర్తిగా అంకితమయ్యారు.

ఆనాడు ప్రతి జాతీయోద్యమకారుడు ఆకాంక్షించినట్టుగా జాకీర్ కూడా హిందూ-ముస్లింల ఐక్యతను ప్రగాఢంగా వాంఛించారు. ఆ దిశగా ఆయన పలు కార్యక్రమాలను రూపొందించి నిర్వహించి, ప్రచారం చేశారు. జామియాలో అటువంటి పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఒక సందర్భంగా కళాశాల **ఇస్లామియా** స్వభావాన్ని విడనాడడానికి కూడా

ఆయన సిద్ధపడగా మహాత్మాగాంధీ స్వయంగా **ఇస్లామియా** స్వభావానికి ఏమాత్రం విఘాతం కల్గించవద్దన్న సలహాను గౌరవిస్తూ జాకీర్ తన ప్రతిపాదనను విరమించుకున్నారు. (Dr. Zakir Husain, M.Mujeeb, NBT Publications, New Delhi, 1972 Page.46) ఆనాడు ముస్లిం లీగ్, భారత జాతీయ కాంగ్రెస్‌ల మధ్య సయోధ్య ఉండాలని ఆయన కోరుకున్నారు. జామియాలో కార్యక్రమాలు ఏర్పాటు చేసినప్పుడు ఇరువర్గాల నుండి ప్రముఖులను ఆహ్వానించి హిందూ–ముస్లింల ఐక్యతను మరింత బలోపేతం చేయాలని, ఈ రెండు జనసముహాల మధ్య నెలకొనియున్న ఐక్యతకు భంగం కల్గించే విధంగా, దేశంలో నెలకొనియున్న ప్రశాంత పౌర జీవితాలను చెడగొట్టేలా ఏ ఒక్కరూ ప్రవర్తించ వద్దని ఆయన తన ప్రసంగాలలో ప్రజలను కోరుతూ వచ్చారు. భారత విభజన నినాదం తలెత్తినప్పుడు మతం ఆధారంగా విభజన కూడదని స్పష్టంగా ప్రకటించారు. ఆ కారణంగా భారత విభజన సమయంలో ఆయన ప్రాణాలకు ముప్పు ఏర్పడింది. మహాత్మాగాంధీ, జవహర్ లాల్ లాంటి ప్రముఖుల ప్రమేయం వలన సురక్షితంగా బయట పడగలిగారు.

స్వతంత్ర భారత దేశంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విజ్ఞప్తి మేరకు అలీఘర్ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన జాకీర్ 1956 వరకు ఆ పదవిలో కొనసాగారు. ఈ పదవిని చేపట్టమని ప్రతిపాదన తనవద్దకు రాగా ఏకగ్రీవంగా ఎంపిక జరిగేట్టయితే తాను అంగీకరిస్తానని చెప్పగా అందుకు అంగీకరించి అప్పటి వరకు ఉపకులపతిగా ఉన్న నవాబ్ ముహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్ తన పదవికి రాజీనామా చేసి స్వయంగా జాకీర్ పేరును ప్రతిపాదించగా కమిటీ ఏకగ్రీవంగా ఆమెదించింది. జాకీర్ ఏ పదవి చేపట్టినా అది వివాదాస్పదం కాకుండా సంబంధితులందరి సమ్మతితో ఏకగ్రీవంగా ఎంపిక అయినట్టయితేనే ఆ పదవిని చేపట్టేవారు. ఈ విధానానికి ఆయన ఏనాడు కూడా మినహాయింపు ఇవ్వలేదు. 1952లో రాజ్యసభ్యకు ఎన్నికైనా, మళ్ళీ 1956లో రాజ్యసభకు ఎన్నిక కాబడినా, 1957లో బీహార్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టినా అందరి సమ్మతితో పదవులు చేపట్టారు. రాజ్యసభ ఛైర్మన్‌గా ఆయన తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి అందరి అభినందనలు అందుకున్నారు.

జాకీర్ ఏపదవి చేపట్టినా ఉపాధ్యాయుని పాత్రను ఏమాత్రం విస్మరించ లేదు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన గల 'ఇండియన్ యూనివర్శిటీస్ గ్రాంట్ కమీషన్'లో జాకీర్ సభ్యులయ్యారు. 'వరల్డ్ యూనివర్శిటీస్ సర్వీసస్' తో ఆయనకు సత్సంబంధాలు నెరిపారు. ఆయన మంచి రచయిత మాత్రమే కాకుండా మంచి జర్నలిస్టు. స్వతంత్ర రచనలు చేయడం మాత్రమే కాదు పలు గ్రంథాలను తర్జుమా చేశారు. ఆయన జర్మనీలో ఉన్నప్పుడు పలు వ్యాసాలు రాశారు. గాంధీ మీద ఆయన రాసిన వ్యాసాలు జర్మనీ భాషలో తర్జుమా చేయబడి స్థానిక పత్రికలలో ప్రచురితమయ్యాయి. జామియా మిలియా ఇస్లామియాలో


చేరిన తొలిదశలో జాకీర్ పబ్లికేషన్స్ విభాగాన్ని నిర్వహించారు. 'జామియా' అను పత్రికను నడిపారు. చిన్నపిల్లలను ఉద్దేశించి పలు గ్రంథాలను రచించారు. ఆ అనుభవంతో ప్రెస్ కమీషన్ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. ఏ పదవిలో ఉన్నా జాతీయ దృష్టితో వ్యవహరిస్తూ చేపట్టిన ప్రతి పదవికి జాకీర్ వన్నె తెచ్చారు. బాబూ రాజేంద్ర ప్రసాద్, సర్వేపల్లి రాధాకృష్ణన్ తరువాత మూడవ భారత రాష్ట్రపతిగా డాక్టర్ జాకీర్ హుసైన్ 1967 మే 3న ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక సమయంలో కూడా ఆయన వివాదరహితంగా మెలిగారు. రాష్ట్రపతి పదవికి ఎంపిక చేశాక అమెరికా సంయుక్త రాష్ట్రాల పర్యటనకు వెళ్ళిపోయారు. రాష్ట్రపతి ఎన్నిక ఇక మూడు రోజుల్లో జరగనుందనగా జాకి తిరిగి వచ్చారు.

జాతీయ విద్య పట్ల ప్రత్యేక అనురక్తి ప్రదర్శించిన జాకీర్ హుసేన్ ఏ పదవిలో ఉన్నా ఆ పదవులన్నీ తనలోని ఆధ్యాపకునికి లభించినట్టుగా చెప్పుకున్నారు. రాష్ట్రపతి పదవి చేపట్టాక **ఇది గురువుకు లభించిన గొప్ప గౌరవం** అని వ్యాఖ్యానించారు. (It is a great honour indeed, that the nation has bestowed on a mere teacher who, some forty-seven years ago, resolved to devote the best years of his life to national education) భారత దేశంలోని అత్యుత్తమ పదవిలో జాకీర్ రాణించారు. పలు విదేశీ పర్యటనలు గావించారు. అద్భుతమైన తన విద్వత్తుతో, భారతీయ సభ్యతా-సంస్కృతీల ప్రతీకగా నిలచిన ఆయన నల్లటి షేర్వాని, తెల్లటి చుడిదార్ పైజామా ధరించి, సభ్యతా సంస్కారంగల ఆకర్షణీయమైన చక్కని వేషధారణతో ప్రతి ఒక్కర్నీ ఆకట్టుకున్నారు. మాతృభూమి పేరు ప్రతిష్టలను విదేశీయుల గడ్డ మీద మరింతగా ఇనుమడింప చేశారు.

జాకీర్ హుసైన్ ఎక్కడ నివాసమున్నా ఆ ప్రాంతమంతా సుందర నందన వనంగా ఉండేది. ప్రకృతి, పచ్చని చెట్లు, మొక్కలు, పుష్పాలు అంటే ఆయనకు ప్రీతి. ఈ విషయంలో ఆయన వ్యక్తిగతంగా అమిత శ్రద్ధ చూపారు. అవిశ్రాంతంగా పదవీ బాధ్యతలు నిర్వరిస్తున్నా ఎంతోకొంత సమయాన్ని తోటపనులకు కేటాయించి స్వయంగా పరిసరాల శుభ్రత, ప్రకృతి సిద్ధమైన అందం-అలంకరణను చూడడం నిర్విరామంగా జరిగింది.

1963 మే మాసంలో అస్సాం పర్యటన పూర్తి చేసుకుని రాష్ట్రపతి భవన్ చేరుకున్న ఆయన మే3 ఉదయం సమయాన అలసటగా ఉందని చెబుతూ యథాప్రకారంగా తన పనులను చేసుకుంటూ గడిపిన జాకీర్ హుస్సేన్ మధ్యాహ్నం పదకొండున్నర ప్రాంతంలో చివరిశ్వాస వదిలారు. జాతీయ విద్య ద్వారా జాతీయోద్యమాన్ని పరిపుష్టం చేసిన జాతీయ విద్య ఆవిష్కర్త, భారత రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ భౌతికకాయాన్ని ఆయన అమితంగా ప్రేమించిన జామియా మిలియా ఇస్లామియా ఆవరణలోనే ఖననం చేశారు.

◆◆◆



## ఆంగ్లేయుల గులాంగిరిని ఏమాత్రం సహించని

# 19. ఏస్.ఎం.ఖాద్రి బియబానీ

(1894-1969)

**ఆ**ంగ్లేయుల గులాంగిరి పొడ కూడా ఏమాత్రం గిట్టక బ్రిటీష్ ప్రభుత్వం నుండి ఉన్నత ఉద్యోగాలకు ఆహ్వానాలు అందినా తిరస్కరించి స్వాతంత్ర్య పోరాటానికి పూర్తిగా అంకితమైన జాతీయోద్యమకారులలో ఒకరు సయ్యద్ షా మొహిద్దీన్ ఖాద్రి బియబానీ.

కర్నూలు జిల్లా కంభంలోని సంపన్న కుటుంబంలో 1894లో సయ్యద్ షా మొహిద్దీన్ ఖాద్రి బియబానీ జన్మించారు. తల్లి రుఖయా బీ. తండ్రి సయ్యద్ గౌస్ పీర్ ఖాద్రి బియబానీ, ఆయన 'అల్లాహ్‌షాఫి'గా పిలువబడిన ప్రఖ్యాత వైద్యులు. సయ్యద్ షా మొహిద్దీన్ ఖాద్రి విద్యాభ్యాసం కంభం ఉన్నత పాఠశాలలో జరిగింది. ఆ తరువాత మద్రాస్‌లోని ప్రెసిడెన్సీ కాలేజీలో గ్రాడ్యుయేషన్ చేశారు. చిన్ననాటి నుండే చురుకైన విద్యార్థిగా గురువుల మన్నన పొందిన ఆయన గ్రాడ్యుయేషన్‌లో అత్యధిక మార్కులతో స్వర్ణపతకం సాధించారు.

అలీఘర్‌లోని మొహమ్మదన్ ఆంగ్లో-ఓరియంటల్ కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించేందుకు అలీఘర్ వెళ్ళారు. అక్కడ ఆయనకు డాక్టర్ జాకీర్ హుసైన్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం పెను మార్పులకు కారణమైంది. జాకీర్ సహచర్యంలో ఆయనలో బ్రిటీష్ వ్యతిరేక భావనలు బలంగా పొటమరించాయి. ఆ క్రమంలో జాతీయోద్యమ నాయకుడు డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌ను రహస్యంగా కలిసిన కారణంగా బియబానీ అరెస్టుకు గురయ్యారు. అందుకు నిరసనగా మూడు రోజులపాటు అన్నం ముట్టకుండా కేవలం

ఉప్పు మాత్రమే స్వీకరించి బియబానీ సంచలం సృష్టించారు. ఆగ్రా జైలులో సహఖైదిగా ఉన్న మౌలానా అబుల్ కలాం ఆజాద్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. తెలుగు, ఉర్దూ, కన్నడం, తమిళం, ఆంగ్ల భాషల్లో పాండిత్యం సంపాదించిన బియబానీ మౌలానా అజాద్ రూపొందించిన 'తఫ్సిర్-యే-ఖురాన్' రచనా కార్యక్రమం సందర్భంగా ఆయనకు సహకరించారు.

అలీఘర్‌లో ఉన్నతవిద్య పూర్తిచేసిన బియబానీ, **ఆంగ్రేజోంకి గులాంగిరి నహీ కరూంగా** అంటూ డిప్యూటీ కలక్టర్ ఉద్యోగాన్ని తిరస్కరించారు. స్వతంత్రంగా బ్రతుకుతూ, వ్యవసాయం చేస్తూ, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనాలని నిర్ణయించుకున్న ఆయన 1923 మే నెలలో జరిగిన జాతీయ పతాక ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం ఆంక్షలను ధిక్కరిస్తూ కానాపూర్‌లో జరిగిన జాతీయపతాక సత్యాగ్రహానికి ఆంధ్ర ప్రొవిన్షియల్ కమిటీ దళం సభ్యుడిగా వెళ్ళారు. ఆ క్రమంలో రాష్ట్రంలో జరుగుతున్న జాతీయోద్యమ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ వచ్చిన బియబానీ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు పదకొండు మాసాల జైలుశిక్షను గయ కారాగారంలో అనుభవించారు.

**నేను ముస్లింను. నేను నా మతాన్నీ, నా అల్లాహ్‌ను అమితంగా గౌరవిస్తాను. కానీ నేను ముందుగా భారతీయుడనని చెప్పుకోడంలోనే ఆనందిస్తా...గర్విస్తా**, అని విస్పష్టంగా ప్రకటించిన బియబానీ మహాత్మా గాంధీ మార్గాన్ని విశేషంగా అభిమానించారు, ఆచరించారు. జీవితాంతం శుద్ధ ఖద్దరును ధరించారు. అఖిల భారత జాతీయ కాంగ్రెస్‌ను వ్యవస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు 5 వందల ఎకరాల భూమిని ఆయన విరాళంగా ఇచ్చారు. జాతీయోద్యమకారునిగా తనకు లభించిన 15 ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచేశారు. ఆయన వద్దకు వచ్చిన అవసరార్థులు అసంతృప్తితోగానీ, ఖాళీ చేతులతోగాని వెళ్ళేవారు కారని ప్రతీతి. కర్నూలు ప్రాంతంలో ఏ ప్రజోపకర కార్యక్రమం జరిగినా దానికి ముందుగా తాను ఆర్థిక చేయూత ఇవ్వడమే కాకుండా తనవారి నుండి, తన పరిచయస్తుల నుండి కూడా కార్య నిర్వాహకులకు భారీ మొత్తాలలో ఆర్థిక సహాయం అందేలా చూడడం సయ్యద్ షా మొహిద్దీన్ ఖాద్రి బియబానీ ప్రత్యేకత.

ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా బాధ్యతలు వహించిన బియబానీ చివరివరకు ప్రజాసేవలో గడిపారు. ఒకసారి కర్నూలుకు వచ్చిన పండిత జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ లాంటి ప్రముఖులు స్వయంగా ఆయన గృహం వద్దకు విచ్చేసి ఆయనను పలకరించిన గౌరవాన్ని పొందిన సయ్యద్‌షా మొహిద్దీన్ ఖాద్రి బియబానీ 1969 అక్టోబరు ఒకటిన హైదరాబాద్‌లో ఆకస్మికంగా కన్నుమూశారు.

◆◆◆

## నిజాం గడ్డ మీద విదేశీవస్త్రాలను తగులబెట్టిని సాహసి

# 20. ఫక్రుల్ హాజియా హసన్

(1870-1970)

**భా**రత స్వాతంత్ర్యసంగ్రామంలో స్వయంగా పాల్గొనడమే కాకుండా తన బిడ్డలను విముక్తిపోరాటం దిశగా ముందుకు సాగడానికి ప్రేరణగా నిలచిన తల్లులు అరుదుగా కన్పిస్తారు. జాతీయ స్థాయిలో ఆ విధంగా **'అలీ సోదరులు'** గా ఖ్యాతిగాంచిన మౌలానా షౌకత్ అలీ, మౌలానా ముహమ్మద్ అలీల తల్లి ఆబాదిబానో బేగం చరిత్ర సృష్టించారు. జాతీయోద్యమంలో స్వయంగా పాల్గొనడం మాత్రమే కాకుండా **'హైద్రాబాద్ హసన్ సోదరులు'** గా విఖ్యాతిగాంచిన ముగ్గురు కుమారులు బద్రుల్ హసన్, జాఫర్ హసన్, అబిద్ హసన్‌లను స్వాతంత్ర్య సమరయోధులుగా తీర్చిదిద్దిన ఫక్రుల్ హాజియా హసన్ చరితార్థులయ్యారు.

ఇరాన్ నుండి ఇండియా వచ్చి స్థిరపడిన కుటుంబానికి చెందిన ఫక్రుల్ హాజియా 1870లో జన్మించారు. ఉత్తరప్రదేశ్ నుండి హైదరాబాదు వచ్చిన అమీర్ హసన్‌ను వివాహం చేసుకున్న ఆమెకు ఆమె హైదరాబాద్ స్థిరనివాసం అయ్యింది. భర్త అమీర్ హసన్ హైదరాబాద్ సంస్థానంలో ఉన్నతాధికారి. ఆయన ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలను పర్యటిస్తున్నందున ఆమె కూడా ఆయా ప్రాంతాలలోని ప్రజల భాషల పట్ల అమితాసక్తి చూపుతూ ఉర్దూతోపాటుగా ఆంగ్లం, మరాఠీ, కన్నడ, గుజరాతీ, భాషలే కాకుండా తెలుగును కూడా నేర్చుకున్నారు. ఈ సందర్భంగా మహిళల దుస్థితిని గమనించిన ఆమె మహిళల ముఖ్యంగా బాలికల అభ్యున్నతికి కృషి ఆరంభించారు. మహిళలను సంఘటితపర్చి వారిలో చైతన్య జ్వాలలు రగిలించారు.

విద్యార్జన ద్వారా విజ్ఞానం తద్వారా అభ్యున్నతి సాధించవచ్చని నమ్మిన ఆమె బాలికలలో విద్యాభివృద్ధి లక్ష్యంగా పలు పాఠశాలలు పెట్టించడానికి కృషి సల్పారు. సంస్కరణోద్యమాలలో చురుగ్గా పని చేస్తూనే ఆమె జాతీయోద్యమం పట్ల అమితాసక్తి చూపారు.

బ్రిటిషర్ల ఆధిపత్యం సాగుతున్న హైదరాబాదు సంస్థానంలో నివసిస్తున్నా స్వతంత్ర భావాలు గల మహిళగా జాతీయోద్యమంలో ఆమె చురుకైన పాత్ర నిర్వహించారు. మహాత్ముని బాటలో తాను నడవడమే కాకుండా తన బిడ్డలను కూడా నడిపించి స్వాతంత్రోద్యమానికి తమ సర్వస్వం ధారబోశారు. 1920లో మహాత్ముని పిలుపు మేరకు నైజాం సంస్థానం రాజధాని హైదరాబాద్ నగరంలోని ట్రూప్ బజార్‌లోని తమ నివాసమైన 'అబిద్ మంజిల్'లో విదేశీ వస్త్రదహనం గావించారు. ఈ చర్యపట్ల సంస్థానాధీశుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నా ఆమె ఏమాత్రం భయపడలేదు. ఆ క్రమంలో ఆమె ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమాలలో చాలా చురుకైన పాత్ర వహించారు. భారత జాతీయ సైన్యంలోని ప్రతి ఒక్కరిని తన బిడ్డగా భావించిన ఆమె జాతీయ సైన్యం అరెస్టులకు గురైనప్పుడు వారి విడుదల కోసం సరోజినీ నాయుడి సహకారంతో ఎనలేని కృషి సల్పారు.

అలీసోదరుల తల్లి అబాది బానోను గౌరవించినట్టే మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్ర బోస్, మౌలానా అబుల్ కలాం అజాద్ లాంటి యోధులు ఫక్రుల్ హాజియా హసన్ పట్ల ఎంతో మర్యాద మన్నన చూపారు. ఆమెను ఆప్యాయంగా **అమ్మా జాన్** అని సంబోధిస్తూ ఎంతో గౌరవించారు. (నేతాజీ ఐ.ఎస్.ఎ, సిహెచ్. ఆచార్య, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 2001,పేజి.181)

అమ్మా జాన్ స్వతంత్ర భావాలు ఆమె కుమారులను ఉద్దీపింప చేశాయి. ఆ క్రమంలో ఆమె పెద్దకుమారుడు బద్రుల్ హసన్ జాతీయోద్యమకారుడిగా మహాత్మాగాంధీ వెంట నడిచారు. ఆమె చివరి కుమారుడు అబిద్ హసన్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ సహచరుడిగా ముందుకు సాగారు. ఆజాద్ హింద్ ఫౌజ్ ద్వారా భారత స్వాతంత్ర్య సంగ్రామ సాహిత్య చరిత్రలో విలక్షణ నినాదాలుగా నిలచిన **'నేతాజి', 'జైహింద్'**లను సృష్టికర్తగా అబిద్ హసన్ ఖ్యాతిగాంచారు. ఆమె రెండవ కుమారుడు జాఫర్ హసన్ విద్యావేత్తగా హైదరాబాదు సంస్థానంలో బాధ్యతలు నిర్వహిస్తూ, మహాత్ముని బాటలో తల్లి పక్షాన నిలిచారు.

ఈ విధంగా తాను మాత్రమే కాకుండా స్వాతంత్ర్యోద్యమానికి తన ముగ్గురు బిడ్డలను కూడా అంకితం చేసి మాతృభూమి విముక్తి కాంక్షిస్తూ పోరాటాల దిశగా వారిని ముందుకు నడిపించి **విలక్షణ మహిళ** గా విఖ్యాతిగాంచిన **అమ్మా జాన్** ఫక్రుల్ హాజియా హసన్ 1970లో కన్నుమూశారు.

◆◆◆



### విద్యార్థి - యువజన ఉద్యమాల నిర్మాత

# 21. షేక్ గాలిబ్ సాహెబ్

(1904-1970)

చరిత్ర ప్రసిద్ధిపొందిన సహాయనిరాకరణోద్యమ పోరాటరూపాలకు ఖ్యాతిగాంచిన గుంటూరు స్వాతంత్ర్యోద్యమానికి స్ఫూర్తిదాయకమైన కేంద్రంగా నిలచింది. ఈ గడ్డ అందించిన ఆణిముత్యాల్లాంటి త్యాగధనులలో షేక్ గాలిబ్ సాహెబ్ ఒకరు.

జాతీయోద్యమంలో రెండు దశాబ్దాల పాటు పాల్గొనడమే కాక అనేకసార్లు జైలు జీవితాన్ని అనుభవించిన షేక్ గాలిబ్ సాహెబ్ 1904 జూలై 15న గుంటూరులో జన్మించారు. షేక్ చింగా షా, షేక్ అమీనా బి ఆయన తల్లిదండ్రులు. ఆర్థిక ఇబ్బందులున్నా బిడ్డను యస్.యస్.యల్.సి. వరకు చదివించారు. విద్యార్థిగా షేక్ గాలిబ్ సాహెబ్ జాతీయోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు.

బ్రిటీష్ దాస్యశృంఖలాల నుండి మాతృభూమిని విముక్తి చేసేందుకు గుంటూరు యోధులు సాగిస్తున్న త్యాగాలు ఉత్తేజితుల్ని చేయడంతో 1928లో గాలిబ్ భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించారు. 1928 మేలో గుంటూరు పట్టణంలో ప్రప్రథమంగా యువజన సమితి ఏర్పడగా, ఆ స్ఫూర్తితో గుంటూరు కేంద్రంగా 1929లో విద్యార్థి సమాఖ్య ఆరంభమైంది. ఆ సమాఖ్య స్థాపనలో షేక్ గాలిబ్ సాహెబ్ కీలక పాత్రను నిర్వహించారు. విద్యార్థి సమాఖ్య ప్రారంభమైన తరువాత ఆ సమాఖ్యకు తొలి కార్యదర్శిగా గాలిబ్ 1929

నుండి 1931 వరకు పనిచేశారు. గుంటూరు పట్టణంలో యువజన, విద్యార్థి ఉద్యమాలను ఆయన పటిష్టం చేశారు. బ్రిటీష్ వ్యతిరేక పోరాటంలో కీలక పాత్ర నిర్వహించేట్టుగా విద్యార్థి యువజనుల సంఘాలను తీర్చిదిద్దారు. ఒకవైపు విద్యార్థి, యువజన ఉద్యమాల నిర్మాణంలో చురుకైన పాత్రను నిర్వహిస్తూ, భారత జాతీయ కాంగ్రెస్ ఆదేశాల మేరకు విద్యార్థి, యువజనులను ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాట దిశగా నడిపించారు. యువశక్తి పట్ల అపార నమ్మకంగల ఆయన బ్రిటీషర్లను తరిమికొట్టాలంటే యువజనులు ఉద్యమాలలో ముందుండాలని భావించారు. ఆ లక్ష్యాన్ని ఆచరణాత్మకంగా సాధించేందుకు 1932-1940 వరకు విద్యార్థి ఉద్యమంలో ఆయన ప్రధాన భూమిక నిర్వహించారు.

మహాత్ముని ఆలోచనలను ఆదేశాలుగా భావించిన గాలిబ్ సాహెబ్ ఆ దారిలో చివరి వరకు నడిచారు. గుంటూరు నగరంలో ఆయన తన సోదరుని పేరుతో నిర్వహించిన లాండ్రీ, జాతీయోద్యమకారులకు ప్రధాన రహస్య కూడలిగా ఉండేది. జాతీయోద్యమానికి సంబంధించిన పలు అంశాల మీద చర్చలు, సమావేశాలు లాండ్రీ వెనుక భాగాన గల గదిలో సాగేవి. బయటకు లాండ్రీలా కన్పించినా లోన రహస్యంగా ఉద్యమ కార్యక్రమాల వ్యూహ రచనలు సాగేవి. ఈ కార్యక్రమాల నిర్వహణలో గాలిబ్ ప్రధాన పాత్ర నిర్వహించారు.

ఈ క్రమంలో జాతీయోద్యమంతో ప్రగాఢ అనుబంధం ఏర్పడిన షేక్ గాలిబ్ సాహెబ్ కు **ఆనాడు సబ్ఇన్స్పెక్టర్ ఉద్యోగం వచ్చినా తెగించి అన్ని కాంగ్రెస్ ఉద్యమాలలో పాల్గొన్నారు.** (ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల 14వ వార్షిక మహాసభల ప్రత్యేక సంచిక, సంపాదకులు: ఏటుకూరి కృష్ణమూర్తి, గుంటూరు, 1995 ఏప్రియల్ 30, పేజి. 36-37). ప్రభుత్వ ఉద్యోగాన్ని కూడా లెక్కచేయలేదు. ఈ నిర్ణయం వలన ఆయన పూర్తికాలపు స్వాతంత్ర్య సమరయోధుడయ్యారు. అప్పటి నుండి షేక్ గాలిబ్ సాహెబ్ జీవితాంతం ఇటు మాతృభూమి సేవకు అటు ప్రజాసేవకు పూర్తిగా అంకితమయ్యారు.

1930 నుండి ఆయన కార్యక్రమాలు మరింతగా పరిణితి చెందాయి. మహాత్మా గాంధీ పిలుపుమేరకు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరెస్టయిన ఆయన ఏడాదిపాటు ఒరిస్సాలోని కోరాపూట్ జైలులో శిక్ష అనుభవించారు. 1932లో సాగిన శాసనోల్లంఘన ఉద్యమంలో క్రియాశీలక పాత్ర నిర్వహించినందుకు మరోమారు రాజమండ్రి జైలులో ఆరు మాసాల కారాగారవాసం అనుభవించారు. గాలిబ్ సాహెబ్‌కు విధించిన జరిమానా వసూలు చేసుకోడానికి ఆయన సోదరుని పేరుతో నడుస్తున్న లాండ్రీ మీద దాడిచేసి అక్కడి సామాను, ఇతర పరికరాలను పోలీసులు జప్తు చేశారు.

హిందూ-ముస్లింల ఐక్యతను ప్రగాఢంగా కోరుకున్న షేక్ గాలిబ్ సాహెబ్ ఆ దిశగా తన కార్యకలాపాలను రూపొందించారు. మత దురహంకారాన్ని ఏమాత్రం సహించని

ఆయన జాతీయ భావాలు గల ముస్లింలలో ఉత్తేజాన్ని కలిగించేందుకు జాతీయ ముస్లిం మహాసభలను నిర్వహించారు. పండిత జవహర్‌లాల్ ఆదేశాల మేరకు 1937 నుండి 1941 వరకు ఆయన 'ముస్లిం కాంటాక్ట్ మూవ్‌మెంట్' కార్యదర్శిగా పనిచేశారు. ముస్లింలీగ్ లాంటి సంస్థలు సాగిస్తున్న వేర్పాటువాద ఉద్యమం నిజస్వరూపాన్ని ముస్లిం ప్రజానీకానికి తెలియపర్చి, జాతీయోద్యమ కార్యక్రమాలను మరింతగా బలోపేతం చేయడంలో ముస్లిం కాంటాక్ట్ మూవ్‌మెంట్ క్రియాశీలక పాత్ర పోషించింది. రాష్ట్రంలో ఆ ఉద్యమానికి గాలిబ్ విలక్షణమైన నాయకత్వం మాత్రమే కాకుండా అనుభవాత్మక మార్గదర్శకత్వం అందించారు.

ప్రజలతో ప్రధానంగా విద్యార్థి, యువజనులతో మంచి సంబంధాలు ఏర్పర్చుకున్న గాలిబ్, తన నిరాడంబర జీవితంతో ప్రజలలో కలసిపోయారు. ఆదర్శవంతమైన ప్రవర్తనతో ఉదాత్తమైన భావాలతో, ఇటు విద్యార్థి–యువజనులతోపాటుగా ప్రజలను ఆకట్టుకున్నారు. మంచి ఉపన్యాసకునిగా ఖ్యాతిగాంచారు. స్వాతంత్ర సమరంలో భాగంగా ప్రస్తుత గుంటూరు, ప్రకాశం జిల్లాలో జరిగిన పలు సభలలో ప్రత్యేకంగా పాల్గొని ప్రసంగాలు చేసిన ఆయన జిల్లాలోని జాతీయోద్యమ అగ్రనాయకులలో ఒకరయ్యారు.

గాంధీమార్గంలో పయనిస్తున్న ఆయన రాజకీయ రంగానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజ సేవకు కూడా ఎంతో ప్రాధాన్యత నిచ్చారు. ప్రజాసేవకు అంకిత మనస్సుతో పనిచేసిన గాలిబ్ సాహెబ్‌ను గుంటూరు ప్రజలు పురపాలక సంఘానికి తమ ప్రతినిధిగా ఎన్నుకున్నారు. 1937 నుండి 1941వరకు గుంటూరు పురపాలక సంఘం సభ్యులుగా ఆయన బాధ్యతలను నిర్వహించారు. ఈ మేరకు ప్రజలకు అందచేసిన సేవలు ఆయన రాజకీయ జీవితానికి మరిన్ని మంచి రంగులద్దాయి, ఉన్నత పదవుల లభింపచేశాయి.

1940లో జరిగిన వ్యక్తి సత్యాగ్రహంలో గాలిబ్ పాల్గొన్నారు. ఆనాడు వ్యక్తి సత్యాగ్రహానికి ఎంపిక కావడాన్ని ప్రజలు గౌరవప్రదమని భావించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన రాయవెల్లూరు జైలులో ఏడాదిపాటు జైలు శిక్షను అనుభవించారు. అనంతరం 1942లో సాగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ఆరు మాసాల జైలు జీవితపు చేదును రుచిచూశారు. ఈ విధంగా పలుమార్లు అనుభవించిన దుర్భర జైలు జీవితం వలన ఆరోగ్యం పాడైపోయింది, క్షయ వ్యాధి సోకింది. అయినప్పటికీ అనారోగ్యాన్ని లెక్కచేయలేదు. ప్రాణమున్నంతవరకు పోరాటం సాగించాలని పట్టుదలతో జాతీయోద్యమ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు.

చివరకు ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి తగినంత ధనం కూడా లేకపోవడంతో మిత్రుల సహకారం స్వీకరించక తప్పని పరిస్థితి ఎదురయ్యింది. 1947లో మద్రాసులోని రాయపేట హాస్పిటల్‌లో శస్త్రచికిత్స జరిగింది. ఆయన పక్కటెముకలు తొలగించాల్సినంతగా

చెడిపోయాయి, శస్త్రచికిత్స తరువాత ఆయన క్షేమంగా బయటపడ్డారు. ఆ తరువాత అనారోగ్యం నుండి పూర్తిగా కోలుకున్న ముహమ్మద్ గాలిబ్ రాష్ట్ర రాజకీయాలలో కీలక పాత్ర వహించారు. గుంటూరు పురపాలక సంఘం సభ్యునిగా ప్రజల ప్రశంసలందుకున్నారు. 1950 నుండి 1952 వరకు ప్రొవిజనల్ పార్లమెంటులో సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధిగా షేక్ గాలిబ్ రైతు జన బాంధవుడిగా ఖ్యాతిగడించిన ప్రముఖ నాయకుడు యన్.జి.రంగాకు వ్యతిరేకంగా పోటీ చేశారు. ఈ పోటీలో గాలిబ్ పరాజయం పాలైనప్పటికి రంగా గెలుపును ఆయన అడ్డుకున్నారు.

భారత జాతీయ కాంగ్రెస్ సభ్యునిగా పనిచేస్తూ అటు స్వాతంత్ర్యోద్యమంలో, ఇటు ప్రజా జీవనంలో తన ప్రత్యేకతను చాటుకున్న షేక్ గాలిబ్ భారత జాతీయ కాంగ్రెస్ నాయకునిగా అందించిన సేవలకు గుర్తింపుగా 1954లో ఆయనకు రాజ్యసభ సభ్యత్వం లభించింది. ఈ పదవిలో ఆయన 1958 వరకు ఉన్నారు. ఆ తరువాత తన సహచరుడు, మిత్రుడు బెజవాడ గోపాల రెడ్డికి రాజ్యసభలో సీటును కల్పించేందుకు షేక్ గాలిబ్ తన పదవీకాలం పూర్తికాకముందే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆ తరువాత 1958లో రాష్ట్ర విధాన పరిషత్ సభ్యులైన ఆయన అ పదవిలో 1969 వరకు ఉన్నారు.

ఆ తరువాతి కాలంలో రాష్ట్ర రాజకీయాలపట్ల ఆసక్తి తగ్గించుకున్న షేక్ ముహమ్మద్ గాలిబ్ సాహెబ్ ప్రాంతీయ రాజకీయాల వైపు మొగ్గు చూపారు. గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ అధ్యక్షులుగా రాజకీయ సమరాంగణంలో నిలచి గెలిచి, జిల్లా ప్రజల ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టి సామాన్య పేదవర్గాల సేవ మీద ఎక్కువ దృష్టిసారించి అందరి అభిమానాన్ని చూరగొన్నారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతల నిర్వహణలో నిబద్దత, నిజాయితీకి మారుపేరుగా షేక్ గాలిబ్ చిరస్మరణీయమైన ఖ్యాతి పొందారు.

ఒకవైపు రాజకీయాలలో చురుకైన పాత్రను నిర్వహిస్తూ, మరోవైపు ముస్లింల సంక్షేమం అభ్యున్నతి కోరుతూ కార్యక్రమాలను నిర్వహిస్తున్న అంజుమన్ ఇస్లామియా లాంటి ధార్మిక సంస్థలకు మార్గదర్శకత్వం వహిస్తూ వచ్చిన షేక్ గాలిబ్ ఆంధ్రా విశ్వవిద్యాలయం సిండికేట్ సభ్యులుగా కూడా గురుతరమైన సేవలు అందచేశారు. గుంటూరు అంజుమన్ ఇస్లామియాకు సుదీర్ఘకాలం అధ్యక్షులుగా పనిచేసి చరిత్ర సృష్టించారు.

చిన్న వయస్సులోనే జాతీయోద్యమంలో ప్రవేశించి, విద్యార్థి, యువజన ఉద్యమాల నిర్మాతగా ఖ్యాతిగాంచిన, స్వాతంత్ర్యసమరయోధులు షేక్ గాలిబ్ సాహెబ్ స్వతంత్ర భారతదేశంలో కూడా ప్రజాజీవనంలో తనదైన బాధ్యతలను నిర్వహించి 1970 ఆగస్టు 21న కన్నుమూశారు.

◆◆◆



## విలీనం కోరుతూ నిజాం నవాబుకు లేఖ రాసిన సాహసి

# 22. బాఖర్ అలీ మీర్జా

(1900-1973)

స్వంత రాజ్యం ఏర్పాటు ప్రయత్నాలను నిర్వీర్యం చేసేందుకు, ఇండియన్ యూనియన్‌లో నైజాంను విలీనం చేయమని నైజాం సంస్థానాధీశుడికి సలహా ఇస్తూ వెలువడిన చారిత్రాత్మక ప్రకటనను రూపొందించిన సాహసి బాఖర్ అలీ మీర్జా.

1900 మార్చి ఏడున హైదరాబాద్‌లో జన్మించిన బాఖర్ అలీ మీర్జా ఆక్స్‌ఫర్డ్ నుండి బి.ఎ (ఆనర్స్) చేశారు. విద్యార్థి దశ నుండి సామ్రాజ్యవాద శక్తులను వ్యతిరేకిస్తూ వచ్చిన ఆయన ఆక్స్‌ఫర్డ్‌లో చదువుతున్న జాతీయభావాలు గల విద్యార్థుల సంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యి బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రస్సెల్‌లో జరిగిన అంతర్జాతీయ సామ్రాజ్యవాద వ్యతిరేక సభలకు ఆయన హజరయ్యారు. నిజాం ప్రభుత్వంలోని అటవీశాఖలో సహాయ కన్సర్వేటర్ ఉద్యోగం చేస్తున్న ఆయనను బ్రిటీష్ ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనని పూచీకత్తు ఇవ్వమని పాలకులకు కోరగా, అది తన స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలకు వ్యతిరేకమని నిరాకరిస్తూ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజాసేవకు పూర్తిగా అంకితమయ్యారు.

ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలలో పాల్గొంటూ కార్మిక పరిశోధన శాఖలో బాఖర్ అలీ మీర్జా బాధ్యతలు నిర్వహించారు. మూడులక్షల మంది శ్రామికుల సభ్యత్వం గల జనపనార కార్మికుల సంఘాన్ని బలోపేతం చేసి సమ్మెదిశగా నడిపి కార్మికుల డిమాండ్లను

సాధించారు. ఈ సందర్భంగా అరెస్టుకు గురయ్యి చాలాకాలం కారాగారంలో గడిపారు.

తొలినాటి నుండి స్వేచ్ఛా-స్వతంత్ర భావనలకు పట్టం కట్టిన బాఖర్ అలీ మీర్జా నైజాం సంస్థానాధీశుని వ్యవహారసరళి మీద కూడా కినుక వహించారు. ఆంగ్లేయుల ఆధిపత్యం నుండి విముక్తిని కోరుకున్న ఆయన 1947లో ఇండియన్ యూనియన్‌లో నైజాం విలీనం కావాలని ఆకాంక్షించారు. నైజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అందుకు భిన్నంగా స్వతంత్ర రాజ్యం ప్రకటించడంతో నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో కలసి పోవాలన్న డిమాండ్‌తో ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి పూనుకున్నారు.

స్వతంత్ర రాజ్యం ప్రకటించుకున్న నైజాం నవాబు, ఆయనకు మద్దతు పలుకుతున్న రజాకార్లు, భూస్వాములు విలీనం కోరుతున్నవారి పట్ల, ఆ భావాలను ప్రచారం చేస్తున్న వారిపట్ల అత్యంత రాక్షసంగా వ్యవహరిస్తున్న భయానక వాతావరణంలో తన మిత్రబృందంతో కలసి నిర్భయంగా బాఖర్ ముందుకు సాగారు. ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానాన్ని విలీనాన్ని చేయాలని డిమాండ్ చేస్తూ నిజాం నవాబుకు నేరుగా లేఖ రాయాలన్న తన మిత్రుల ఆలోచన మేరకు రజాకార్ల హెచ్చరికలను ఖాతరు చేయకుండా 'నిజాంకు ఏడుగురు ముస్లిం ప్రముఖుల లేఖ'గా ఖ్యాతిగాంచిన ఉత్తరాన్ని ఆయన రూపొందించారు. ఈ లేఖను ఉర్దూ పత్రికలు **పయాం, ఇమ్రోజ్‌**ల్లో ప్రచురింప చేసి సంచలనం సృష్టించారు. రజాకార్ల నుండి బెదిరింపులు వస్తున్నా ఎటువంటి భయాందోళనకు గురికాకుండా చివరివరకు స్థిరంగా నిలబడ్డారు. చివరకు నైజాం ప్రభుత్వం మీర్జా బాఖర్‌ను గృహనిర్బంధంలో ఉంచగా 1948 సెప్టెంబరులో జరిగిన పోలీసు యాక్షన్ తరువాత ఆయన విడుదలయ్యారు.

పోలీసు యాక్షన్ తరువాత హైదరాబాదు ప్రభుత్వంలో పబ్లిక్ సర్వీసు కమీషన్ సభ్యునిగా నియుక్తులైన బాఖర్ 1950-52లో ప్రొవిన్షియల్ పార్లమెంటు సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. టర్కీలోని ఇస్తాంబుల్‌లో జరిగిన ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ సమావేశాలకు పార్లమెంటరీ ప్రతినిధిగా ఆయన హాజరయ్యారు. 1953 నాటి భారత జాతీయ కాంగ్రెస్ నానాల్‌నగర్ సమావేశాలకు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వానికి ప్రెస్ సలహాదారునిగా మీర్జా బాఖర్ అలీ సేవలందించారు.

ప్రజా జీవితంలో పూర్తికాలం గడిపేందుకు చిన్న వయస్సులోనే ఉన్నత ఉద్యోగానికి రాజీనామా చేసి జీవితాంతం ప్రజలతో మమేకమై సాగిన ఆయన 1962 నుండి 1972 వరకు లోక్‌సభ సభ్యునిగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. ఏ పదవిలో ఉన్నా, ఏ కార్యక్రమం చేపట్టినా సమర్ధవంతంగా నిర్వహించి కార్యదక్షుడన్పించుకున్న బాఖర్ అలీ మీర్జా 1973 జనవరి ఒకటిన కన్నుమూశారు.

◆◆◆



### గాంధీజి పిలుపుకు తొలుతగా స్పందించిన ఆంధ్రుడు

# 23. మహమ్మద్ గులాం మొహిద్దీన్

(1882-1973)

సహాయనిరాకరణ-ఖిలాఫత్ ఉద్యమంలో భాగంగా ఆంగ్ల ప్రభుత్వం ప్రసాదించిన పదవులను, ఉద్యోగాలను, బిరుదులను త్యజించాలని మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రం నుండి తొలుతగా స్పందించిన యోధుడు మహమ్మద్ గులాం మొహిద్దీన్. కృష్ణా జిల్లా విజయవాడలోని సంపన్న జాగీర్దార్ కుటుంబంలో ఆయన 1882లో జన్మించారు. చిన్నతనం నుండి సేవాభావాన్ని అలవర్చుకున్న ఆయన అవసరార్థులను మన్ననలు పొందారు. నిడారంబర జీవితాన్ని ఇష్టపడిని ఆయన జాగీర్దారిని కూడా పరిత్యజించారు.

గులాం మొహిద్దీన్ ఇటు భారత జాతీయ కాంగ్రెస్, అటు అఖిల భారత ముస్లింలీగ్‌లో సభ్యత్వం స్వీకరించారు. 1919లో ఆరంభమైన సహాయనిరాకరణ-ఖిలాఫత్ ఉద్యమంలో భాగంగా ఆంగ్ల ప్రభుత్వం అందచేసిన పదవులును వదులుకోవాల్సిందిగా మహాత్ముడు కోరారు. గులాం మొహిద్దీన్ తక్షణమే ఆ పిలుపుకు స్పందిస్తూ తాను నిర్వహిస్తున్న గౌరవ మేజిస్ట్రేటు పదవికి రాజీనామా చేసి, ఆంగ్ల ప్రభుత్వం ఇచ్చిన పదవిని త్యజించిన తొలి ఆంధ్రుడిగా ఖ్యాతిగాంచారు. ఈ విషయాన్ని ప్రముఖ స్వాతంత్ర్యసమరయోదులు అయ్యదేవర కాళేశ్వరరావు పేర్కొంటూ, **నా ముఖ్య మిత్రులైన మహమ్మద్ గులాం మొహిద్దీన్ సాహెబుగారు మొదటి తరగతి గౌరవ మేజిస్ట్రేటుగ నుండిరి. నాతోపాటుగా తాను కూడా గౌరవ ఉద్యోగము వదలు కొనెదమని ప్రకటించిరి.అప్పుడు శ్రీమాన్ చక్రవర్తి రాజగోపాలచారి గారు కూడా**

**యుండిరి. ఆంధ్ర దేశములో మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ దౌర్జన్యరహిత సహాయ నిరాకరణోద్యమము ననుసరించి శాసనసభ అభ్యర్థిత్వమును, మొదటి తరగతి గౌరవ మెజిస్ట్రేట్ పదవిని వదలుకొన్నవారము అప్పటికి మేమిద్దరమే. ఈ సంగతి గాంధీగారు ఆ సభలో గుమికూడిన వేలాది ప్రజల ముందు కరతాళధ్వనుల మధ్య ప్రకటించిరి. తమ 'యంగ్ ఇండియా' పత్రికలో కూడా వ్రాసిరి**, అని పేర్కొన్నారు. (నా జీవిత కథ (నవ్యాంధ్రము), అయ్యదేవర కాళేశ్వరావు, పేజీ. 291)

మహమ్మద్ గులాం మొహిద్దీన్ విజయవాడ ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమ కమిటికీ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. సన్నిహిత మిత్రుడు అయ్యదేవరతో కలసి జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1921లో విజయవాడలో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశాల నిర్వహణకు సంకల్పించిన ఆయన పట్టుబట్టి సాధించారు. అయ్యదేవరతో కలసి కలకత్తా వెళ్ళి సమావేశాల నిర్వహణకు మహాత్ముడి అనుమతి పొందారు. ఈ సమావేశాలలో మహాత్మాగాంధీ, అబ్బాస్ తయాబ్జీ, హాకీం అజ్మల్‌ఖాన్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, మహమ్మద్ అలీ, షౌకత్ అలీ, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ తదితర ప్రముఖులు విజయవాడకు విచ్చేశారు. ఈ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ సమావేశాల కోసం మహమ్మద్ గులాం మొహిద్దీన్ సాహెబ్ తన ధనాన్ని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు.

ఈ విషయాన్ని శ్రీ అయ్యదేవర గాంధీజీకి తెలుపుతూ గులాం మొహద్దీన్ కాంగ్రెస్‌కు ఎంతో ఆర్థిక సహాయం చేశారనగా, ఆ మాటకు మొహిద్దీన్ వెంటనే స్పందిస్తూ, తాను కాంగ్రెస్ కోసం ఖర్చు చేయలేదనడంతో అక్కడున్న నాయకులు ఆశ్చర్యపడ్డారట. అంతలోనే, తన సంపదను తాను దేశం కోసం మాత్రమే వ్యయం చేశానని మహమ్మద్ గులాం మొహిద్దీన్ చెప్పడంతో నేతలంతా ఆనందిస్తూ గులాం సాహెబ్‌ను అనందించారట. ఆయన వితరణ, ఆతిథ్యాన్ని మరువని గాంధీజి విజయవాడ నుండి ఆయన వద్దకు ఎవరు వెళ్ళినా మొహిద్దీన్ సాబ్ ఏలా ఉన్నారు? అని ఆయన క్షేమసమాచారాలను కనుక్కొనేవారట. (ప్రముఖ పాత్రికేయుడు, రచయిత, చరిత్రకారుడు యల్.వి.రమణ (విజయవాడ) కథనం).

1948లో భారత విభజన సందర్భంగా విజయవాడలో ఏర్పడిన మతవైషమ్యాల నివారణకు ఆయన నడుం కట్టారు. ఆయన స్వయంగా గుర్రం మీద విజయవాడలోని వీధుల్లో తిరుగుతూ శాంతంగా, సామరస్యంగా ఉండమని అన్ని మతాల ప్రజానీకాన్ని కోరుతూ మత సామరస్యానికి విశేష కృషి సల్పారు. విజయవాడ పురపాలక సంఘం కౌన్సిలర్‌గా, ఉపాధ్యక్షునిగా చాలా కాలం బాధ్యతలు నిర్వహించారు. చివరివరకు చలువ ఖద్దరు ధరించిన ఆయన 1973 మార్చి 13విజయవాడలో తన 91వ ఏట కన్నుమూశారు.

### మతం పేర విభజన తగదంటూ 'లీగ్' ను ఎదుర్కొన్న

# 24. బేగం మజీదా బానో

(1919-1974)

**వ**లసపాలకుల తరిమివేతకు పోరాటం సాగిస్తున్న ప్రజలను, **ద్విజాతి సిద్ధాంతం** ఆసరాతో చీల్చి, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలన్న స్వార్థపర రాజకీయ శక్తులకు, వ్యక్తులకు వ్యతిరేకంగా కూడా జాతీయోద్యమంలో భాగంగా ప్రజలు ఉద్యమించారు. భారతదేశం లోని ముస్లింలకు ప్రతినిధిగా తనకు తానుగా ప్రకటించుకున్న **అఖిల భారత ముస్లింలీగ్** వేర్పాటువాద చర్యలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి, మతం పేరుతో అధికారాన్ని చేపట్టాలనుకుంటున్న శక్తుల ఎత్తులను చిత్తుచేయడానికి సాహసంతో బరిలోకి దిగిన ధైర్యశాలి బేగం మజీదా బానో.

ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదులో బేగం మజీదా బానో 1919లో జన్మించారు. ఆమె తండ్రి ముస్తాఫా అహమ్మద్. ఆయన నైజాం సంస్థానంలో అధికారి. మజీదా పదవ తరగతి చదువుతున్నప్పుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన న్యాయవాది మహమ్మద్ సిద్ధీఖీతో ఆమె వివాహం జరిగింది. ఆ తరువాత మజీదా బానో ఉత్తరప్రదేశ్ వెళ్ళిపోయారు. భర్త కుటుంబంతో సన్నిత సంబంధాలు గల ప్రముఖ జాతీయోద్యమ నాయకులు రఫీ అహమ్మద్ కిద్వాయ్ లాంటి ప్రముఖుల ప్రభావంతో ఆమె భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించి, జాతీయోద్యమంలో ప్రవేశించారు. జాతీయోద్యకారుడైన భర్త పూర్తి సహకారం లభించడంతో మాతృభూమి స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలు లక్ష్యంగా సాగుతున్న జాతీయోద్యమంలో

చురుగ్గా పాల్గొన్నారు. జాతీయోద్యమం సంపూర్ణ విజయం సాధించి స్వరాజ్యం సాధించాలంటే, మతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యం కావాల్సి ఉందని మజీదా బానో విశ్వసించారు. ఆ కారణంగా మతం పేరుతో వేర్పాటువాద రాజకీయాలు నడుపుతున్న ముస్లింలీగ్ నాయకుల తీరుతెన్నులను ఆ ప్రాంతంలో నెలకొని ఉన్న ప్రతికూల రాజకీయ వాతావరణంలో కూడా నిశితంగా విమర్శించిన సాహసి మజిదా బానో.

1935 భారత చట్టం ప్రకారంగా యావత్తు దేశంలో ఎన్నికలు జరుగుతున్నాయి. భారత జాతీయ కాంగ్రెస్ ప్రజలందరి ప్రతినిధిగా ఎన్నికల రంగంలో దిగగా, ముస్లింలీగ్ తాను ప్రత్యేకంగా ముస్లింల ప్రతినిధి అని ప్రకటించుకుంది. ఆ ఎన్నికలలో లక్నో మహిళా నియోజకవర్గం నుండి మజీదా బానో భారత జాతీయ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆమెకు ప్రతిగా **ముస్లిం లీగ్** అభ్యర్థి బేగం ఇనాం హబీబుల్లా ఎన్నికల్లో నిలిచారు.

ఈ ఎన్నికలలో అలీ సోదరులలో ఒకరైన మౌలానా షౌకత్ అలీ తదితర ప్రముఖ నాయకులు **లీగ్** గెలుపును కాంక్షిస్తూ మజీదా బానోకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. మౌలానా షౌకత్ అలీ స్వయంగా ఖుర్అన్ గ్రంథాన్ని చేత బూని ఎన్నికల ప్రచారం చేస్తూ ముస్లింలీగ్ అభ్యర్థికి అనుకూలంగా ప్రజల నుండి వాగ్దానాలు చేయించుకోవడాన్ని బట్టి, ముస్లింలీగ్ నాయకులు ఆ ఎన్నికలను ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారో అర్థమౌతోంది.

భారత జాతీయ కాంగ్రెస్ అభ్యర్థిగా మజీదా బానో పక్షాన కాంగ్రెస్ నేతలు, లక్నో విద్యార్థులు ప్రచారం చేశారు. ముస్లింలీగ్ నేతల వాదనలను పూర్వపక్షం చేస్తూ, హిందూ-ముస్లింల ఐక్యత, మత సామరస్యం కోరుతూ మజీదా బానో పర్దాతోపాటే ప్రచారాన్ని నిర్వహించారు. ఆ ఎన్నికలలో కేవలం 175 ఓట్ల తేడాతో మజీదా బానో ఓటమి చెందారు. అయినా ఎన్నికల జయాపజయాలతో ఏమాత్రం నిమిత్తం లేకుండా హిందూ-ముస్లింల ఐక్యతా నినాదంతో, వేర్పాటువాదానికి వ్యతిరేకంగా ఆమె ముందుకు సాగారు.

1936లో జాతీయవాదులైన కొందరు యువకులు ఏర్పాటు చేసిన **ఆజాద్ ముస్లిం లీగ్**లో బేగం మజీదా బానో భాగస్వాములయ్యారు. ఆజాద్ లీగ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలలో, కార్యక్రమాలలో ఆమె చాలా చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలీగ్ అధినేత ముహమ్మద్ అలీ జిన్నాకు వ్యతిరేకంగా ఆమె నినదించి సంచలనం సృష్టించారు.

స్వతంత్ర భారతదేశం అవతరించాక, సమాజసేవకు అధిక ప్రాధాన్యతనిచ్చి, చివరి క్షణం వరకు మతసామరస్యం ద్వారా జాతీయ సమైక్యత-సమగ్రతలను మరింతగా పటిష్టం చేసేందుకు కృషి చేస్తూ ప్రజాసేవలో గడిపిన మజీదా బానో 1974 ఫిబ్రవరి 12న బీహార్ రాష్ట్రం బారాబంకీలో కన్నుమూశారు.

◆◆◆



### తిరగబడ్డ చీరాల-పేరాల ప్రజలకు బాసటగా నిలచిన

# 25. ముహమ్మద్ గౌస్ బేగ్

(1885 -1976)

**జా**తీయోద్యమంలో భాగంగా ఆంధ్ర రాష్ట్రంలో సాగిన **'చీరాల-పేరాల'** పోరాటం చాలా ప్రఖ్యాతిగాంచింది. అద్భుత పోరాటపటిమతో సాగించిన ఈ శాంతియుత ఉద్యమం జాతీయోద్యమ చరిత్రలో మహోజ్వల ఘట్టంగా నిలిచిపోయింది. ఆ పోరాటంలో ప్రధాన భూమిక నిర్వహించిన ప్రముఖ యోధులలో మహమ్మద్ గౌస్ బేగ్ ఒకరు.

ప్రకాశం జిల్లా చీరాల మండలం గంటాయపాలెంలో 1885 సెప్టెంబరు 12న ముహమ్మద్ గౌస్ బేగ్ జన్మించారు. తల్లితండ్రులు హాజీ మోహిద్దీన్ బేగ్, ఫాతిమా. గౌస్‌బేగ్ తాత **ముహమ్మద్ దిలావర్ బేగ్ సంపన్న వ్యాపారవేత్త. చీరాలకు నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న వోడరేవులో ఈయన వోడలు ఉండేవి. పెద్ద ఎత్తున గోడవున్సుకు యజమాని. భారీ ఎత్తున వ్యాపారం చేసిన ఘనాపాటి...గౌస్ సాహెబ్ తండ్రి హయాములో వోడరేవు వ్యాపారం స్థంభించింది. కాని విస్తృతమైన ఆస్థి, సిరిసంపదలు సంక్రమించాయి.** (స్వాతంత్ర్యోద్యమం దేశనాయకులు, వి.యల్.సుందరదావు, 1989, పేజి.60).

ముహమ్మద్ గౌస్ 1907లో విద్యార్థిగానే వందేమాతరం ఉద్యమం రోజుల్లో జాతీయోద్యమంలో ప్రవేశించారు. బాపట్లకు చెందిన బేగ్‌కు 'చీరాల-పేరాల ఉద్యమం' నిర్మాత దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పరిచయం ఏర్పడింది. ఆయనతో కలసి 1920లో కలకత్తా భారత జాతీయ కాంగ్రెస్ సమావేశానికి హాజరు కావడంతో గౌస్ రాజకీయ జీవితం

ఆరంభమైంది. ప్రకాశం జిల్లా చీరాల-పేరాల గ్రామాలను కలిపి **పురపాలక సంఘం** ఏర్పాటు చేసి ప్రజానీకం మీద ప్రభుత్వం అత్యధిక పన్నుల భారం మోపింది. ఈ చర్యను వ్యతిరేకిస్తూ దుగ్గిరాల గోపాల కృష్ణయ్య రంగ ప్రవేశం చేశారు. ఆయన అత్యంత సన్నిహిత సహచరుడిగా గౌస్ బేగ్ కూడా ప్రత్యక్షకార్యాచరణకు దిగారు. 1921 ఏప్రిల్ 6న, విజయవాడ వచ్చిన మహాత్మా గాంధీని దుగ్గిరాల కలిసి ఉద్యమ కార్యాచరణకు అనుమతి పొందడంతో 'చీరాల-పేరాల' ఉద్యమంలో మహమ్మద్ గౌస్ పూర్తిగా నిమగ్నమయ్యారు. ఆనాటి మహత్తర ప్రజా ఉద్యమంలో పాలు పంచుకున్న భారత జాతీయ కాంగ్రెస్ నాయకులలో గౌస్ బేగ్ ఒకరు. ఈ ఉద్యమంలో ప్రజానీకం ఆర్థిక ఇక్కట్లు పడుతున్నందున పూర్వీకులు సంపాదించి పెట్టిన సంపదను ప్రజావసరాలకు ఆయన వ్యయం చేశారు. ఆ విధంగా **ఉద్యమానికి సర్వసంపదను, బలాన్ని చేకూర్చిన యోధుడు జనాబు గౌస్ బేగ్** (స్వాతంత్ర్యోద్యమం దేశ నాయకులు, వి.యల్.సుందరరావు, 1989, పేజి.61) గా ఆయన ఖ్యాతిగడించారు.

1921 నాటి ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమంలో గౌస్ బేగ్ ప్రధాన పాత్ర నిర్వహించారు. బ్రిటీష్ ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసింది. జాతీయోద్యమ కార్యక్రమాలలో ముమ్మరంగా పాల్గొంటూ వచ్చిన గౌస్‌బేగ్ **ఒంగోలు కారాగారంలో ఉన్న సందర్భంగా ఐపియస్ అధికారి హైదరీ దొర ఆయనను బంగళాకు తీసుకెళ్ళి బ్రాహ్మణ ప్రేరేపిత ఉద్యమంలో ఎందుకు పాల్గొంటున్నారు. మీ సాహెబులందరికి చెడ్డపేరు వస్తుంది. మీరు కోరుకుంటే 100 లేక 200 ఎకరముల భూమిని మంజూరు చేస్తా** అని నచ్చచెప్పేందుకు ప్రయత్నం చేశాడు. అందుకు, **ఈ రోజు పండగ రోజు (రంజాన్) నన్ను జైలుకు పోనివ్వండి. ఈ దేశభక్తి ఉన్మాదునికి కళంకం ఆపాదించకండి,** అని గౌస్ సమాధానం చెప్పడంతో, ఆ అధికారి ఏడాది జైలు, వెయ్యి రూపాయల జరిమానా విధించాడు. ఆ శిక్షను 1922 మార్చి2 నుండి రాజమండ్రి, కడలూరు జైళ్ళలో గౌస్ బేగ్ అనుభవించారు. జైలు నుండి విడుదలయ్యాక 'ఆంధ్రరత్న' గోపాలకృష్ణయ్య స్థాపించిన 'రామదండు' స్వచ్ఛందసేవకుల దళానికి ఆయన నాయకత్వం వహించి, జాతీయోద్యమ భావాలను ప్రజలలో ప్రచారం చేసేందుకు గ్రామల్లో పాదయాత్రలు నిర్వహించారు.

ఆనాటి నుండి గౌస్ సాహెబ్ జాతీయోద్యమ కార్యక్రమాలన్నిటిలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న క్రమంలో ఆస్తి అంతా కరిగిపోయింది. కుటుంబానికి భుక్తినిస్తున్న 23 ఎకరాల భూమిని విక్రయించి మరీ ఉద్యయం కోసం వ్యయం చేశారు. ప్రముఖ నేతలు భోగరాజు పట్టాభి సీతారామయ్య, దుర్గాబాయమ్మ, టంగుటూరి ప్రకాశం పంతులు లాంటి ప్రముఖులు, కార్యకర్తలు గౌస్ బేగ్ ఇంట ఆతిధ్యం స్వీకరించేవారు. ఆనాటి ఉద్యమకారులకు గౌస్‌గారిల్లు, తమ స్వంత గృహం లాగుండేది. నగదు నట్రా, పొలం పుట్రా కరిగిపోతున్న, బేగ్ దంపతులు బేఖాతర్ అన్నారు. మాతృభూమి కోసం సర్వం త్యాగం చేయగలిగిన వారే అదృష్టవంతులని

మహమ్మద్ గౌస్ బేగ్ దంపతులు చివరివరకు అభిప్రాయపడ్డారు. ఆ అభిప్రాయలకు అనుగుణంగా జాతీయోద్యమం కోసం తమ సర్వసంపదలను, చివరకు గౌస్ ఖాతూన్ ఆభరణాలను కూడా వ్యయంచేశారు. గౌస్ బేగ్ జాతీయోద్యమంలో ప్రవేశించాక ఆయనకు పూర్వీకులనుండి సంక్రమించిన మణులు, మాన్యాలు, తోటలు, భవంతులు అన్నీ హారతి కర్పూరంలా కరిగి పోయాయి. ప్రభుత్వ చర్యల కారణంగా ఆయన వ్యాపారాలన్నీ స్థంభించి పోయాయి. (స్వాతంత్ర్యోద్యమం దేశనాయకులు, వి.యల్.సుందరరావు)

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య సలహా మీద గౌస్ వ్యాపారం ఆరంభించారు. ఆయన వ్యాపార సంస్థకు 'రాం రహీమ్' అని నామకరణం చేశారు. ఆర్థికంగా పూర్వవైభవాన్ని సంపాదించేందుకు పలు వ్యాపారాలు చేశారు. వ్యాపారం ద్వారా లాభాలు అర్జించటం కంటె ఆయన దృష్టి అంతా జాతీయోద్యమం మీద లగ్నం కావడంతో వ్యాపారాలు లాభాల మాట అటుంచి పూర్తిగా నష్టాల బాటన వ్యాపారాలు సాగాయి.

1930-32 ప్రాంతంలో ఉప్పుసత్యాగ్రహానికి ఆయన నాయకత్వం వహించారు. చీరాలలోని యువకుల ఆహ్వానం మేరకు వెళ్ళి స్వచ్ఛంద సేవకులను అడ్డుకుంటున్న పోలీసులను లెక్కచేయకుండా ఉప్పు గుండాలలోకి ప్రవేశించి ధైర్యసాహసాలను ప్రదర్శించారు. ఆయన చూపిన చొరవతో మిగిలిన నాయకులు, యువకులు ఆయనను అనుసరించారు. (గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం, మాదల వీరభద్రరావు, పేజి. 141). ఈ సందర్భంగా దేవరంపాడు శిబిరానికి గౌస్ నాయకత్వం వహించి నడిపారు. ఆ శిబిరాన్ని నడిపినందుకు ఆయనకు ఏడాది పాటు జైలు శిక్షను ప్రభుత్వం విధించింది. ఈ సందర్భంగా ఆయన **పిడికిటిలోని ఉప్పు తీయటానికి పోలీసు లాఠీలు విఫలమైనాయి**. ఆయనను **ఎన్నోవిధాల హింసించినారు. ఈ సంఘటనను ఆంధ్రదేశమంతట ఎన్నో కథలుగా చెప్పుకున్నారు.** ఈ విధంగా శాసనోల్లంఘన ఉద్యమంలో గుంటూరు జిల్లా ఉద్యమంలో క్రియాశీలక పాత్రను నిర్వహించినందుకు, ఆగ్రహించిన ఆంగ్ల ప్రభుత్వం 1930 ఏప్రిల్ 24న ఏడాది జైలు శిక్షను విధించింది. ఆ సమయంలో ఉన్న కొద్దిపాటి ఆయన చరాస్థిని వేలం వేసి, లభించిన నగదును జరిమానా క్రింద ప్రభుత్వం జమ చేసుకుంది.

శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా గుంటూరు జిల్లా, పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమంలో గౌస్ బేగ్ క్రియాశీలక పాత్రను నిర్వహించారు. ఆ ఉద్యమనేత పర్వతనేని వీరయ్య చౌదరి ప్రధాన సహచరుడిగా ముహమ్మద్ గౌస్ వ్యవహరించారు. ఆ పన్ను నిరాకరణ ఉద్యమ లక్ష్యాలను ప్రజలకు వివరిస్తూ సాగిన ప్రచార కార్యక్రమంలో ఆయన ప్రత్యేక పాత్రను నిర్వహించినందున పోలీసుల దాష్టీకానికి పలుమార్లు గురయ్యారు. చివరకు 1932 మార్చి 10న ఆయనకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, పాతిక రూపాయల

జరిమానాను ప్రభుత్వం విధించి వెల్లూరు, రాజమండ్రి జైళ్ళలో నిర్బంధించింది. ఆ తరువాత 1933 జూలై 3న ముహమ్మద్ గౌస్‌బేగ్ విడుదలయ్యారు.

మహమ్మద్ గౌస్ బేగ్ మంచి వక్త. గుంటూరు, ప్రకాశం జిల్లాలో ఏర్పాటు చేసిన భారత జాతీయ కాంగ్రెస్ సభలు, సమావేశాలకు ప్రముఖ వక్తగా హాజరై ఉత్తేజపూరిత ప్రసంగాలు చేశారు. ప్రకాశం, గుంటూరు జిల్లాల భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనాయకులలో ఒకరిగా ఆయన స్థానం సంపాదించుకున్నారు. ఆయన మితభాషి, నిశ్చల శాంత స్వభావుడు. ఎటువంటి హంగు–ఆర్భాటం, హడావుడి లేకుండా ఒకచోటన స్థిరంగా ఉంటూ కనుసైగలతో ఎంతటి కార్యాన్ని సన్నిహితులతో విజయవంతంగా పూర్తిచేయించగల కార్యదక్షత కలిగిన నాయకుడిగా ఆయన పేర్గాంచారు. భారతదేశానికి స్వాతంత్ర్య లభించేంత వరకు భారత జాతీయ కాంగ్రెస్ ఆదేశాలను ఆయన త్రికరణ శుద్ధిగా పాటించారు. ఆనాడు ఆంధ్రదేశంలో గౌస్ బేగ్ తెలియనివారు లేరు. (స్వాతంత్ర్యోద్యమం దేశనాయకులు, వి.యల్. సుందరరావు) మహమ్మద్ గౌస్ బేగ్ మాత్రమే కాకుండా ఆయన సతీమణి గౌస్ ఖాతూన్ స్వాతంత్రోద్యమానికి పూర్తిగా అంకితమయ్యారు. విదేశీవస్తు బహిష్కరణ ఉద్యమంలో భాగంగా విదేశీ వస్తువులను త్యజించిన ఆ దంపతులు జీవితాంతం ఖద్దరు ధరించారు.

స్వాతంత్ర్యం సిద్ధించాక కూడా కొంతకాలం గుంటూరు జిల్లా రాజకీయాలలో మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు. ఆయన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా బాధ్యతలను నిర్వహించారు. 1961లో తమ స్వగ్రామం నుండి చీరాలకు వచ్చి గౌస్ స్దిరనివాసం ఏర్పరచుకున్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యునిగా ఉంటూ, చీరాల పురపాలక సంఘం సభ్యునిగా విజయం సాధించి పురపాలక సంఘం ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు.

చిన్ననాట నుండి మతసామరస్యం కోరుతూ వచ్చిన ఆయన రాజకీయాలకు దూరంగా, మత దురహంకారాన్ని నిరసిస్తూ, విభిన్న మతస్థుల మధ్యన సద్భావన, సదవగాహన కలిగించడం కోసం హిందూ–ముస్లింల మధ్య పటిష్టమైన స్నేహ సంబంధాల కోసం నిరంతరం కృషి సల్పారు. మనుషుల మధ్యన మత భేదభావాన్ని ససేమిరా అన్నారు. మతసామరస్యం కాపాడటం, వివిధ మతాలకు చెందిన ప్రజల మధ్యన 'శాంతి–స్నేహం' పటిష్టపర్చేందుకు చివరి శ్వాస వరకు ఆయన అవిశ్రాంతంగా శ్రమించారు.

జాతీయోద్యమంలో మహమ్మద్ గౌస్ బేగ్ ప్రదర్శించిన సాహసానికి త్యాగనిరతికి గౌరవ సూచకంగా 1972 ఆగస్టు 15న భారతప్రభుత్వం తామ్రపత్రంతో సత్కరించింది. చివరి క్షణం వరకు ప్రజలలో దేశభక్తి, స్నేహభావాలను పరిమళింపచేసేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన ముహమ్మద్ గౌస్ బేగ్ 1976 సెప్టెంబరు 19న కన్నుమూశారు.

◆◆◆

## అరెస్టులు కాకపోవడం అపచారంగా భావించిన

# 26. బేగం ఖుర్షీద్ ఖ్వాజా

**(1896-1981)**

**జా**తీయోద్యమంలో జైలుకు వెళ్ళడం బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించారు. జైలుకు ఎప్పుడెప్పుడు పోదామా అని అంతా ఎదురు చూశారు. ఏ కారణంగానైనా అరెస్టు కాకపోవడం, జైలుకు వెళ్ళకపోవడం అవమానంగా పరిగణించారు. జైలుకెళ్ళక పోవడం అపచారంగా భావించి జైలుకెళ్లాక ఆనందాన్ని వ్యక్తంచేసిన కుటుంబాలు ఆనాడు ఎన్నో ఉన్నాయి. అటువంటి ఉద్యమ స్ఫూర్తిగల కుటుంబ సభ్యురాలు బేగం ఖుర్షీద్ ఖ్వాజా.

ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ నగరంలో బేగం ఖుర్షీద్ ఖ్వాజా 1896లో జన్మించారు. ఆమె తండ్రి సర్ బులంద్ జంగ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి. ఆమె తాత సమీవుల్లా. ఆయన సర్ సయ్యద్‌గా ప్రఖ్యాతి చెందిన సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ సన్నిహిత మిత్రులలో ప్రముఖులు.

స్వగృహంలో బేగం ఖుర్షీద్ సాంప్రదాయక విద్యను పూర్తిచేశారు. తండ్రితో పాటుగా హైదరాబాదులో నివాసం ఉన్నప్పుడు ఆమెకు సరోజిని నాయుడుతో పరిచయమయ్యింది. ఆ పరిచయం ద్వారా స్వేచ్ఛా, స్వాతంత్ర్య భావాలతో ప్రభావితులైన ఆమె జాతీయోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. 1920లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించి జాతీయోద్యమంలో క్రియాశీలక పాత్ర నిర్వహించారు.

బేగం ఖుర్షీద్ అలీఘర్‌కు చెందిన న్యాయవాది ఖ్వాజా అబ్దుల్ మజీద్‌ను వివాహం చేసుకున్నారు. భర్త మజీద్ కూడా జాతీయోద్యమకారులు. వివాహానంతరం భర్తతో కలిసి ఆమె జాతీయోద్యమంలో ప్రత్యక్షంగా ప్రవేశించారు. 1921 డిసెంబరు 24, 25 తేదిలలో హైదరాబాద్ నగరంలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో ఆమె ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుండి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రతినిధిగా భారత జాతీయ కాంగ్రెస్ సబ్జెక్ట్స్ కమిటీకి ప్రాతినిధ్యం వహించారు. ఆ సమావేశాలలో బేగం హసరత్ మోహాని, బేగం ముహమ్మద్ అలీ, కమలా నెహ్రూ, స్వరూపరాణి నెహ్రూలతో కలిసి ఆమె పనిచేశారు.

జాతీయోద్యమంలో ప్రవేశించాక ఎదురైన మానసిక, ఆర్థిక కష్టనష్టాలను చిరునవ్వుతో భరిస్తూ లక్ష్యసాధనపట్ల దృఢచిత్తంతో ముందడుగు వేసిన బేగం ఖుర్షీద్ ప్రజల, జాతీయ కాంగ్రెస్ నాయక ప్రముఖుల ప్రశంసలందుకున్నారు. ఖిలాఫత్-సహాయ నిరాకరణోద్యమ కార్యకలాపాలలో అవిశ్రాంతంగా పాల్గొంటూ అందరికి ఆదర్శమయ్యారు. ఈ సందర్భంగా జాతీయోద్యమంలో భాగంగా అరెస్టుకావడం, జైలుకెళ్ళటం ప్రతి ఉద్యమకారుని విధ్యుక్తధర్మం, గౌరవమని ఆమె బహిరంగంగా ప్రకటించారు.

ఈ విషయమై గాంధీజీకి లేఖ రాస్తూ, **నా భర్త సహచరులంతా జైళ్ళకు వెళ్ళారు. నా భర్త మాత్రం ఇంత వరకు స్వేచ్ఛగా ఉండడం నాకు చాలా బాధగా ఉంది** అని ఆమె పేర్కొన్నారు. బేగం ఖుర్షీద్ బాధామయ వాక్యాల మీద గాంధీజీ వ్యాఖ్యానం చేస్తూ, **నిజమైన నిబద్ధతతో కూడిన భావనలు ఇలానే ఉంటాయి. స్వాతంత్ర్యం కోసం స్త్రీ, పురుషులు అంతా ఇలాగే జైళ్ళను నింపడానికి సంతోషంగా ముందుకు వచ్చిన రోజున స్వరాజ్యం తప్పక లభిస్తుంది,** అని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. (Collected Works of Mahathma Gandhi, Govt. Of India Publications, New Delhi)

ఖ్వాజా అబ్దుల్ మజీద్, బేగం ఖుర్షీద్ దంపతుల త్యాగగుణ సంపన్నతను వివరిస్తూ, **మహనీయురాలైన ప్రతిష్టాత్మక ధర్మపత్ని** అను శీర్షికతో గాంధీజీ రాసిన వ్యాసంలో సుఖభోగాలను వదలి బేగం ఖుర్షీద్ కుటుంబం సాదాసీదా జీవితాన్ని చేపట్టడం, జాతీయోద్యమంలో ఆ దంపతుల త్యాగాన్ని వివరించారు. అంతేకాదు ఆమె భర్త ఖ్వాజా అబ్దుల్ మజీద్ గుణగణాలను కూడా ఆయన ప్రస్తుతించారు. బేగం ఖుర్షీద్ కార్యనిర్వహణాదీక్ష, జాతీయోద్యమ లక్ష్యాల పట్ల ఉన్న నిబద్ధత గురించి గాంధీజీ ప్రత్యేకంగా ప్రశంసించారు.

సహాయనిరాకరణ ఉద్యమం సందర్భంగా ఉద్యమకారులంతా అరెస్టవుతూ తాను తన భర్త ఖ్వాజా అబ్దుల్ మజీద్ మాత్రం అరెస్టు కానందుకు ఆమె ఎంతో చింతిస్తూ వచ్చారు. చివరకు తన భర్త అరెస్టు కాగానే సంతోషం వ్యక్తంచేస్తూ ఆ విషయాన్ని టెలిగ్రాం

ద్వారా గాంధీజీకి తెలిపారు. ఆ టెలిగ్రాం సమాచారం అందుకున్న గాంధీజీ బేగం ఖుర్షీద్ ఉద్యమ స్ఫూర్తిని ప్రశంసిస్తూ **ప్రతిష్టాత్మక మహనీయుని ధర్మపత్ని** అను శీర్షికతో మరో వ్యాసం రాశారు. ఆ వ్యాసంలో **ప్రభుత్వం నా భర్తను అరెస్టు చేసిందన్న విషయం తెలుసుకున్న మీకు ఆనందం కలిగి ఉంటుంది** అని బేగం ఖుర్షీద్ ఆయనకు రాసిన లేఖలో తెలిపినట్టు గాంధీజీ పేర్కొన్నారు.

ఆ అరెస్టు సమయంలో ఖ్వాజా అబ్దుల్ మజీద్ జాతీయ విశ్వవిద్యాలయం **జామియా మిలియా ఇస్లామియా (అలీఘర్)** కులపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలలు బహిష్కరించిన, ప్రభుత్వ సహాయం నిరాకరించిన విద్యాసంస్థలలోని విద్యార్థుల కోసం, జాతీయ భావాలను ప్రచారం చేయడానికి ఆచరణాత్మక విద్యాబోధన గావిస్తున్న జామియా మిలియా ఇస్లామియాను ఆయన నిర్వహిస్తున్నారు.

భర్త ఖ్వాజా అబ్దుల్ మజీద్ అరెస్టుతో ఉద్యమ కార్యకలాపాలు ఏవీ ఆగిపోరాదని బేగం ఖుర్షీద్ వాంఛించారు. ఆ విషయాన్ని గాంధీజీకి తెలియచేస్తూ, **నా భర్త గైర్హాజరీలో జామియా మిలియా ఇస్లామియా కార్యకలాపాల బాధ్యతలన్నిటినీ నేను నిర్వహించేందుకు కృషి చేస్తాను** అని రాశారు. ఈ మేరకు తన భర్త అరెస్టు వలన జాతీయోద్యమ కార్యకలాపాలు కుంటుపడరాదని దృఢంగా నిర్ణయించుకున్న ఆమె భర్త ప్రతినిధిగా ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టి జాతీయ భావాలకు పుట్టినిల్లుగా నిలచిన జామియా మిలియా ఇస్లామియా విద్యాకేంద్రం కార్యకలాపాలను స్వయంగా పర్యవేక్షించారు.

జాతీయ భావాలను ప్రచారం గావించేందుకు, దేశభక్తి భావనలను ప్రోదిచేయడానికి అలీఘర్ కేంద్రంగా ఆమె **హింద్** అను ఉర్దూ మాసపత్రికను 1921లో ప్రారంభించి, ఆ పత్రిక సంపాదకత్వ బాధ్యతలను చేపట్టి నిర్వహించారు. ఆ పత్రిక ద్వారా దేశభక్తి భావాల ప్రచారం చేస్తూ, బ్రిటీషు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ఎండగడ్తూ, జాతీయోద్యమ ప్రచారాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం ఆగ్రహానికి గురయ్యారు.

మహిళల్లో విద్య ఆవశ్యకతను గ్రహించిన ఆమె, ఆ దిశగా చాలా శ్రద్ధ చూపారు. మహిళలు చదువుకుంటే తప్ప సమాజంలో ప్రగతి సాధ్యం కాదని ఆమె నమ్మకం. పరాధీన బ్రతుకుల నుండి విముక్తి కలగాలంటే జ్ఞానార్జన తప్ప మరొకమార్గం లేదని ఆమె ప్రచారం చేశారు. జ్ఞానార్జన ద్వారా చైతన్యం రగులుకుంటుందని, జాతీయోద్యమం విజయవంతం కావాలంటే మహిళల్లో చైతన్యం రావాలనీ, అది అక్షరజ్ఞానం ద్వారా మాత్రమే సాధ్యం అవుతుందని ఆమె పూర్తిగా విశ్వసించారు. ఈ మేరకు తన విశ్వాసాన్ని, ఆకాంక్షలను ఆచరణలో చూపేందుకు ఎంతగానో శ్రమించారు. ప్రజలలో అక్షరజ్ఞానం కల్గించేందుకు

ప్రచార కార్యక్రమాల నిర్వహణ కంటే విద్యావ్యవస్థల ఏర్పాటు, నిర్మాణం ద్వారా ఆ లక్ష్యాలు సాధ్యమౌతాయని, అవి శాశ్వతంగా నిలుస్తాయిని బేగం ఖుర్షీద్ ఖ్వాజా తలిచారు.

ఆమె అనుభవాలు, ఆకాంక్షలకు అనుగుణంగా 1930లో అలహాబాద్‌లో ఆడపిల్లలు, మహిళల కోసం బేగం ఖుర్షీద్ ఖ్వాజా స్వయంగా **హమీదియా బాలికల సెకండరీ స్కూల్** ను (Hamidiya Girls Secondary School) స్థాపించారు. ఆ విద్యాసంస్థ ఆమె కళ్ళ ఎదుట ఎదుగుతూ మహిళలలో విద్యాసుగంధాలను వెదజల్లుతూ పాఠశాల స్థాయి నుండి క్రమక్రమంగా కళాశాల స్థాయికి చేరుకుంది.

మహాత్ముని ఆదేశాల మేరకు ఖద్దరు ప్రచార కార్యక్రమాలలో బేగం ఖుర్షీద్ అత్యంత ఆసక్తి చూపారు. ఆశయాలను ఆచరణలో చూపడం ద్వారా ప్రజలను ఆమె ఆకర్షించారు. స్వయంగా ఖద్దరు ధారణ చేశారు. నూలు వడకడం మాత్రమే కాకుండా, నూలు వడకడాన్ని ప్రజలకు, ప్రధానంగా మహిళలకు, యువతులకు ఆమె స్వయంగా నేర్పారు. జామియా మిలియా ఇస్లామియా విద్యార్థులకు కూడా ఆమె నూలు వడకడం నేర్పారని గాంధీజీ లేఖల ద్వారా వెల్లడవుతుంది.

మాతృభూమి విముక్తి కోసం ఉద్యమించిన ఫలితంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి దేశానికి విముక్తి లభించినప్పటికి, భారతదేశం విభజనకు గురవడంతో బేగం ఖుర్షీద్ ఖ్వాజా బాగా కదలిపోయారు. ఆనాటి నుండి ప్రత్యక్ష రాజకీయాల నుండి పూర్తిగా వైదొలగి విద్యా, సామాజిక సేవారంగాలకు మాత్రమే ఆమె అంకితమయ్యారు. ఈ మేరకు అటు మాతృదేశ సేవ, ఇటు ప్రజాసేవకు జీవితాన్ని అర్పితం చేసిన బేగం ఖుర్షీద్ ఖ్వాజా 1981 జులైలో తుదిశ్వాస విడిచారు.

◆◆◆

" With all the logical, social and ethnic difference between communities in India... Mussalmans of India.... have no less love for the land of our birth than the members of the other communities. We are tied to her by the sacred association of ages, and we yield to none in our veneration and affections for our mother land.."

**- Syed Ali Imam**



## 'విశాఖ గాంధీ' గా గణుతికెక్కిన వైజాగ్ యోధుడు

# 27. ఫరీద్దుల్‌జమా

(1907-1983)

**మ**హాత్మా గాంధీ మార్గదర్శకత్వంలో అహింసామార్గం అవలబించి బ్రిటీష్ ప్రభుత్వం మీద ధ్వజమెత్తిన జాతీయోద్యమకారులలో కొందరు ఖచ్చితంగా ఆయన బాటన నడిచారు. అటువంటి వార్ని ఆయన ప్రతిరూపాలుగా ప్రజలు పరిగణించారు. ఆ కారణంగా ఆ నాయకులు తమ అసలు పేర్ల కంటె గాంధీజీ పేరుతో ముడివడి స్థిరపడిన పేర్లతోనే స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సుప్రసిద్ధులయ్యారు. ఆ కోవలో ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ **సరిహద్దు గాంధీ** గా, బెలుచిస్థాన్ ప్రజల నాయకులు ఖాన్ అబ్దుస్ సమద్ ఖాన్ **బెలూచి గాంధీ**గా పేర్గాంచారు. ఆ క్రమంలో మహాత్మా గాంధీ మార్గంలో జీవితాంతం పయనించి **విశాఖ గాంధీ** గా విశాఖపట్నం ప్రజల చేత ఎంతో ప్రేమాభిమానాలతో పిలిపించుకున్న అదృష్టవంతులు బాబులాల్ ఫరీద్దుల్ జమా.

1907లో ఫరీద్దుల్ జమా విశాఖపట్నంలో జన్మించారు. విశాఖపట్నంలోని ఖిలా బజారు ప్రాంతంలో ఆయన చిన్నతనం సాగింది. తల్లి తండ్రులు ఆయనకు ఫరీద్దుల్ జమా గా నామకరణం చేయగా విశాఖ ప్రజలు ఆయనను **బాబులాల్** గా పిలుచుకున్నారు. స్వేచ్ఛా-స్వతంత్ర భావనల పట్ల చిన్నతనం నుండి మొగ్గుచూపిన ఆయన జాతీయోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించిన తరువాత ఉద్యమ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు.



FREEDOM FIGHTER
Mr.JANAB BABULAL FAREEDULL JAMA

జాతీయోద్యమం దిశగా సాగించిన పయనంలో మహాత్మాగాంధీ మార్గం పట్ల బాబులాల్ పూర్తిగా ఆకర్షితులయ్యారు. ఆయుధాల కంటె అహింసోద్యమంతో విముక్తి పోరాటంలో విజయం సాధించ వచ్చని భావించి సత్యాగ్రహోద్యమాన్ని ఆయుధం చేసుకుని ముందుకు సాగారు.

1824లో బాబులాల్ మద్రాసులో జరిగిన **నీల్ సత్యాగ్రహం**లో పాల్గొన్నారు. ఆనాడు ఆంగ్లేయాధికారి నీల్ ప్రజల పట్ల వ్యవహరించిన తీరుతెన్నులకు కినిసిన మద్రాసు ప్రెసిడెన్సీలోని ఉద్యమకారులు మద్రాసులో నీల్ విగ్రహం ప్రతిష్ఠించడాన్ని అవమానంగా భావించారు. ఆ విగ్రహాన్ని అక్కడ నుండి తొలిగించాలని నిర్ణయించు కున్నారు. ఆ నిర్ణయాన్ని ఎలాగైనా అమలు చేసేందుకు ప్రజలు ఉద్యమించారు. ఆ సందర్భంగా ప్రజలు సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఫరీద్దుల్‌జమా విశాఖపట్నం నుండి మద్రాసు వెళ్ళారు. మద్రాసులో జరిగిన నీల్ వ్యతిరేక సత్యాగ్రహ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఆ కారణంగా ప్రభుత్వం పరీద్దుల్ జమాను అరెస్టు చేసి జైలు శిక్షను విధించింది. బ్రిటీషు ప్రభుత్వం పోలీసుల లాఠీలకు గాని, కఠిన కారాగార శిక్షలకు గాని ఏమాత్రం భయపడకుండా ఫరీద్దుల్ జమా ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలను సమరోత్సాహంతో కొనసాగించారు. ఆ తరువాత ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమం వ్యక్తి సత్యాగ్రహం, ఉప్పుసత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు.

ఈ విధంగా ఒకవైపున గాంధీ మార్గంలో సత్యాగ్రహోద్యమాలలో పాల్గొంటూ జాతీయోద్యమంలోని అగ్రనాయకులతో సన్నిహిత సంబంధాలను సాగించిన ఆయన విప్లవకారులతో కూడా సత్సంబంధాలను నెరిపారు. ఆ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడినందున ఆయను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీని నిర్బంధించిన జైలులోనే ఫరీద్దుల్ జమాను కూడా పోలీసులు నిర్బంధించారు. అది తనకు లభించిన అత్యంత గౌరవప్రదమైన అదృష్టంగా బాబులాల్ భావించారు.



విశాఖపట్నం వచ్చిన జవహర్ లాల్ నెహ్రూకు స్వాగతం పలుకుతున్న 'విశాఖ గాంధి'.

మహాత్ముని మార్గంలో ఖద్దరు ప్రచారానికి ఆయన విశేష ప్రాధాన్యత ఇచ్చారు. జీవితపర్యంతం ఖద్దరు ధరించారు. విశాఖలో ఏర్పడిన ఖాదీ భండారు ఉద్యోగిగా ఆయన విశేష సేవలందించారు. ఈ సందర్భంగా ఖద్దరు ధారణ మీద ప్రజలకు అనురక్తి పెంపొందించేందుకు నిరంతరం శ్రమించారు. రాజకీయ ఉద్యమంలో భాగస్వామ్యం వహించడమే కాకుండా సాంఘిక-సంస్కరణోద్యమాలలో కూడా ఆయన ఆసక్తి చూపారు. అశృస్పృత నివారణకు, గ్రంథాలయోద్యమ వ్యాప్తికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు.

స్వాతంత్ర్యం లభించాక సమాజంలో శాంతి, ప్రజల మధ్యన సఖ్యతల పటిష్టత కోసం కులమతాలకు అతీతంగా కృషిచేస్తూ ప్రజల మన్నన పొందారు. ఆయనను **విశాఖ గాంధీ**, **బాబూలాల్** పేర్లతో ప్రజలు పిలుచుకున్నారు. ఎటువంటి పదవీలాలస లేకుండా సేవాభావంతో ప్రజల సంక్షేమం-అభ్యున్నతి కోసం తాపత్రయంపడుతున్న ఆయన కృషికి ప్రతిఫలంగా ఆయనను విశాఖ పురపాలక సంఘానికి తమ ప్రతినిధిగా 40 సంవత్సరాలపాటు వరుసగా ప్రజలు ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆయన చరిత్ర సృష్టించారు. విశాఖపట్నం పురపాలక సంఘం ఉపాధ్యక్షునిగా కొంత కాలం ఆయన బాధ్యతలు నిర్వహించారు.

మహాత్ముని ప్రబోధం మేరకు స్వాతంత్ర్యోద్యమం కాలంలోనే గ్రంథాలయాల స్థాపన, అభివృద్ధి పట్ల అధిక శ్రద్ధచూపిన బాబులాల్ ముస్లిం జనసముదాయాలు ప్రపంచ జ్ఞానాన్ని పెంచుకునేందుకు అవసరమయ్యేట్టుగా ఉర్దూ గ్రంథాలను ప్రజలకు అందుబాటులోకి

తీసుకరావాలని తలచారు. ఆ ఆలోచన వచ్చిందే తడవుగా విశాఖపట్నం జిల్లాలో తొలి ఉర్దూ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఆ గ్రంథాలయాన్ని స్వయంగా నిర్వహించి అభివృద్ధి పర్చారు. అవసరార్థులకు సహాయం అందించడం మాత్రమే తప్ప ఇతరుల నుండి ఆర్థిక సహాయం అర్థించే అలవాటు లేని ఆయన ఆ గ్రంథాలయం కోసం తన స్వంత నిధులనే పూర్తిగా వినియోగించారు. విశాఖపట్నం జిల్లాలోనే తొలి ఉర్దూ గ్రంథాలయమైన ఈ పఠనాలయం ఆ తరువాతి కాలంలో **బాబులాల్ గ్రంథాలయం** గా ప్రసిద్ధి చెందింది.

**విశాఖపట్నంలోని తొలితరం కాంగ్రెస్ నాయకులైన మారేమల్లి రామచంద్ర శాస్త్రి, బుచ్చిసుందరరావు, మల్లెమడుగు బంగారయ్య, మల్లె మడుగుల కోదండరామస్వామి, మల్లెమడుగుల జగన్నాధరావు, దిగుమర్తి రామస్వామి, తెన్నేటి విశ్వనాధం, కొల్లూరి సూర్యనారాయణ గుప్తా, వి.జె.గుప్తా, పురిపండా, కొల్లూరి వీరభద్రరావు వంటి జాతీయ వాదులతో సన్నిహితంగా మెలుగుతూ వారందరి గౌరవాదరణలు పొందిన విశిష్ట వ్యక్తి బాబూలాల్.** (విశాఖ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర, ప్రచురణ : విశాఖ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం, విశాఖపట్నం, సెప్టెంబరు,1992 పేజి.187)

విశాఖపట్నంలో జరిగిన ప్రతి ప్రజాహిత కార్యక్రమంలో బాబులాల్ చురుకుగా పాల్గొంటూ వచ్చారు. అయన ఇటు ప్రజలకు అటు ప్రముఖులకు మధ్య వారధిలా తన కార్యకలాపాలు నిర్వహించారు. ఆయన స్వయంగా పలు కార్యక్రమాలను చేపట్టి విజయవంతంగా నిర్వహించారు. ప్రజలకు సంబంధించిన ఏ కార్యక్రమమైనా ఆయన ప్రమేయం లేకుండా, ఆయన ప్రసక్తి రాకుండా విశాఖపట్నంలో జరగడం చాలా అరుదయ్యింది. ఆయన పాల్గొనని కార్యక్రమం అంటూ విశాఖపట్నంలో ఉండేదికాదని తెలుస్తుంది.

స్వతంత్ర భారత దేశంలో ఎటువంటి స్వార్థప్రయోజనాలను ఆశించకుండా తనకున్నదంతా అటు జాతీయోద్యమం కోసం ఇటు ప్రజల కోసం వ్యయంచేశారు. భారత ప్రభుత్వంలోని ఉన్నత స్థానాలలో ఉన్న ప్రముఖులతో తనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నా కూడా తన స్వప్రయోజనాలకు ఆయన ఏనాడూ ఆ పరిచయాలను ఉపయోగించుకోలేదు. ప్రజల సమస్య పరిష్కారం విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా కృషి చేస్తూ, **ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, పార్టీలు మారకుండా, నిష్కామంగా కాంగ్రెసుకు ఎల్లప్పుడు కైవారాలు చేస్తూ గొంతెత్తి దేశభక్తి నినాదాలు చేస్తూ వినయ సంపన్నంగా విశాఖపట్టణ వీధుల్లో తిరిగిన** (విశాఖజిల్లా దర్శిని, 2002) విశాఖగాంధీ ఫరీద్దుల్‌జమా 1983 డిసెంబరు 2న కన్నుమూశారు.

◆◆◆

## నిరంతర ఖద్దరు ధారణలో ప్రత్యేకతను నిలబెట్టుకున్న

# 28. ఖాశిం బేగ్

(1905-1984)

**జా**తీయోద్యమంలోని వివిధ ఉద్యమరూపాలను తమ నిత్యజీవితానికి అన్వయించు కున్న ఉద్యమకారులు జాతీయోద్యమ చరిత్రలో మనకు దర్శనమిస్తారు. ఆ తరహాలో ఖద్దరు ప్రచార ఉద్యమంలో పలువురు పాల్గొన్ని విశేష కృషి సల్పారు. ఆ విధంగా నిరంతరం ఉద్యమం ప్రచారానికి పాటుపడిన వారు ఆ ఉద్యమంతో మమేకమైనందున వారి పేర్లు కూడా వారి ఉద్యమస్ఫూర్తిని వెల్లడిచేసే విధంగా రూపాంతరం చెందాయి. అటువంటి వారిలో తెనాలికి చెందిన ముహమ్మద్ ఇస్మాయిల్ ఖద్దరు ప్రచారంలో భాగంగా **ఖద్దరు విక్రయశాల** ఆరంభించి **ఖద్దరు ఇస్మాయిల్** గా పేర్గాంచారు. ఆ కోవలో ఖద్దరు ప్రచారంలో భాగంగా ఖద్దరుతో కుట్టబడిన ప్రత్యేకమైన జుబ్బాను ఎల్లప్పుడు ధరించినందున **ఖద్దరు జుబ్బా ఖాశిం బేగ్** గా ఖ్యాతిగాంచారు బాపట్లకు చెందిన ఖాశిం బేగ్.

స్వాతంత్రోద్యమంలో పాల్గొని తమదైన రీతిలో మాతృభూమి రుణం తీర్చుకున్న బాపట్ల ప్రాంతం యోధులలో  ఖాశిం సాహెబ్ ఒకరు. ఆయన సామాన్య రైతు కుటుంబంలో 1905 ఆగస్టు 26న జన్మించారు. తండ్రి ఖాదర్ బేగ్, తల్లి అమీనా. చిన్ననాటనే దర్జీ పని నేర్చుకుని 1931లో బాపట్లలో టైలరింగ్ ప్రారంభించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు మంతెన వెంకటరాజు సాంగత్యం వలన జాతీయోద్యమం వైపు ఆకర్షితులయ్యారు. జాతీయ రాజకీయాల గురించి తెలుసుకుంటూ తన జీవనోపాధిని చూసుకుంటూ, రాజు

వెంట భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చీరాల-పేరాల ఉద్యమంలో తనదైన ప్రత్యేక పాత్రను నిర్వహించిన ఖాశిం బేగ్ ఆ తరువాత విదేశీ వస్త్ర బహిష్కరణ, పెదనందిపాడు పన్నుల నిరాకరణ, శాసనోల్లంఘన ఉద్యమాలలో పాల్గొన్నారు. చివరకు క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏడాది పాటు జైలు జీవితం గడిపారు.

స్వాతంత్ర్యసమరయోధులు ఖద్దర్ ఇస్మాయిల్ ప్రోత్సాహంతో బాపట్లలో ఖద్దరు క్లాత్ ఎంపోరియంను ఖాశిం బేగ్ ప్రారంభించారు. ఆ సమయంలో ఆయన నిరంతరం ధరించే జుబ్బా వలన ఆయనను **ఖద్దరు జుబ్బా ఖాశిం బేగ్** అని పిలువసాగారు. ఖద్దరు విక్రయశాల కూడా ప్రారంభించడంలో ఖద్దరు ఉద్యమానికి ఆయన మరింత సన్నిహితులు అయ్యారు. ఖద్దరు విక్రయశాల ద్వారా ఖద్దరు ప్రచార ఉద్యమ వ్యాప్తి దృష్టి తప్ప లాభాలు సంపాదించి పెట్టే విధంగా వ్యవహరించకపోవడం, అసలు వ్యాపార మెళుకువలు పూర్తిగా తెలియక పోవడంతో ఆ వ్యాపారంలో ఖాశిం బేగ్ భారీగా నష్టపోయారు. ఆ నష్టాల నుండి మళ్ళీ తేరుకోలేదు. చివరకు స్వాతంత్ర్య సమర యోధునిగా లభించిన ఐదు ఎకరాల భూమిని సైతం విక్రయించాల్సిన దుస్థితి ఆయనకు వచ్చింది.

స్వాతంత్ర్యసమరయోధులకు కల్పిస్తున్న 'పెన్షన్' వద్దంటూ, తనకంటే కష్టాలను అనుభవిస్తున్న ఇతరులకు ఇవ్వాల్సిందిగా కోరియున్నందున, పెన్షన్ రూపంలో వచ్చే నాలుగు రూకలు కూడా ఆయనకు లభించే అవకాశం లేకుండా పోయింది. చిల్లిగవ్వ ఆదాయం లేక, అనారోగ్య కారణంగా రోజులు గడవటం వృద్ధాప్యంలో ఆయనకు కష్టమైపోయింది. చివరకు మరోమార్గం కన్పించక మిత్రుల ఒత్తిడి వలన పెన్షన్ కోసం దరఖాస్తును పెట్టుకున్నారు. అప్పటికి పెన్షన్ మంజూరు చేయడం సాధ్యం కాదంది ప్రభుత్వం.

ఆ కారణంగా ఆర్థిక పరిస్థితులు మరింత దిగజారడంతో చివరివరకు దుర్భర దారిద్ర్య పరిస్థితులను అనుభవిస్తూ 1983లో ఖాశింబేగ్ కన్నుమూశారు. ఆయన తోడునీడగా నిలచిన సతీమణి మస్తాన్‌బి కూడా కష్టనష్టాల నీడలో పలు కడగండ్లను అనుభవిస్తూ 1984లో అంతిమశ్వాస విడిచారు.

◆◆◆

నా మాతృభూమి శాంతి సౌభాగ్యాలతో నిరంతరం తులతూగాలి. నాదేముంది నేను ఉండొచ్చు. ఉండకపోవచ్చు.

**– షహీద్ అష్ఫాఖుల్లా ఖాన్**



## చారిత్రక ' జైహింద్ - నేతాజీ ' నినాదాల సృష్టికర్త

# 29. అబిద్ హసన్ సఫ్రాని

(1911-1984)

బ్రిటీష్ వలసపాలకుల కబంధ హస్తాలనుండి విముక్తి గావించాలన్న మహత్తర లక్ష్యం దిశగా తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి అన్నిరకాల త్యాగాలకు సిద్ధమైన ఆజాద్ హింద్ ఫౌజ్ సాహస యోధులలో సుపరిచితులు అబిద్ హసన్ సఫ్రాని.

భాగ్యనగరంగా ఖ్యాతిగాంచిన హైదరాబాదు నగరంలో లో అబిద్ హసన్ సఫ్రాని 1911 ఏప్రిల్ 11న జన్మించారు. ఆయన తండ్రి అమిర్ హసన్. ఆయన హైదరాబాదు సంస్థానంలో ఉన్నతాధికారి. తల్లి పేరు ఫక్రుల్ హాజియా బేగం (1870-1970). ఫక్రుల్ హాజియా స్వతంత్ర భావాలు మహిళ. ఆమె పెంపకంలో అబిద్ కూడా జాతీయోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. కళాశాల చదువుకు స్వస్తిచెప్పారు. తొలుత గాంధీజీ పట్ల ప్రత్యేక ఆసక్తి పెంచుకున్న అబిద్ 1931లో సబర్మతి ఆశ్రమం చేరుకున్నారు.

సబర్మతి ఆశ్రమంలో కొంతకాలం గడిచిన తరువాత, కర్కశులైన వలస పాలకులను మాతృభూమి నుండి తరిమి వేయాలంటే సాయధపోరాటం మాత్రమే మార్గమని తలచారు. సాయుధ పోరులో భాగంగా శత్రువును బలహీన పర్చాలంటే, శత్రువు ఆయుధాలను, సదుపాయాలను ధ్వంసం చేయాలన్న ఆలోచనల ప్రకారంగా నాసిక్ సైనిక స్థావరానికి చెందిన రిఫైనరీని నాశనం చేయాలని సంకల్పించిన విప్లవకారుల దళంతో కలసి ఆయన

పనిచేశారు. ఆ యాక్షన్‌లో స్వయంగా పాల్గొన్నారు. ఆ కారణంగా అబిద్‌కు ఒక ఏడాది కఠిన కారాగార శిక్ష పడింది. ఆ శిక్షాకాలం పూర్తికాక ముందే 'గాంధీ-ఇర్విన్ ఒడంబడిక' వలన అబిద్ హసన్ జైలు నుండి విడుదలయ్యారు.

ఆ తరువాత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ వచ్చిన ఆయన దశాబ్దకాలం భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు అన్ని ఉద్యమ కార్యక్రమాలలో భాగస్వాములయ్యారు. ఆ కార్యక్రమాలతో ఆయన సంతృప్తి చెందలేదు. బ్రిటీష్ దాస్యంలో మగ్గుతున్న స్వదేశీయులకు త్వరితగతిన పూర్తి స్వేచ్ఛను ప్రసాదించే బలమైన సాధనం, పదునైన ఆయుధం కోసం అన్వేషించసాగారు.

ఆ మార్గం నేతాజీ సుభాష్ చంద్రబోస్‌లో ఆయనకు దర్శనమైంది. ఆ సమయంలో నేతాజీ బ్రిటీష్ వలసపాలకుల మీద యుద్ధభేరిని మ్రోగించి ఉన్నారు. ద్వితీయ సంగ్రామం పరిణామాల నేపధ్యంలో బ్రిటన్‌కు శత్రువైన జపాన్‌తో స్నేహం నెరపి విముక్తి పోరాటాన్ని విజయవంతం చేసి భారత దేశపు విజయపతాకను వినువీధుల్లో ఎగుర వేయాలని నేతాజీ ప్రయత్నిస్తున్నారు. ఆ దిశలో ఆయన సాధించిన ప్రగతి, విప్లవ భావాలు గల యువతకు గొప్ప స్ఫూర్తినిచ్చాయి. ఉమ్మడి శత్రువైన బ్రిటీషర్లను పరాభవించేందుకు యువకులు పెద్దసంఖ్యలో ముందుకు వచ్చారు. అంతకుపూర్వం మలయాలో మోహన్ సింగ్ అను భారతీయ సైనికాధికారి జపాన్‌కు పట్టుబడిన భారతీయ యుద్ధఖైదీలతో భారతీయ జాతీయ సైన్యాన్ని (Indian National Army) ఏర్పాటుచేశారు. ఆ సమయంలో నేతాజీ రంగప్రవేశం చేసి INA కు జీవం పోయటమేకాక పటిష్టం చేశారు. ఆ తరువాత భారతీయ సైనికులు, యువకులు అసంఖ్యాకంగా నేతాజీ వెంట నడిచారు.

1941లో సుభాష్ చంద్ర బోస్‌కు బెర్లిన్‌లో అబిద్ హసన్ సఫ్రాని పరిచయం అయ్యారు. ఆ పరిచయం అబిద్ హసన్ సఫ్రాని లోని సాయుధ పోరాటవీరుడ్ని తట్టి లేపింది. ఆ మరుక్షణమే నేతాజీ నేతృత్వాన ఆంగ్లేయ ప్రభుత్వం మీద పోరాటం సాగించేందుకు అబిద్ హసన్ ముందుకు వచ్చారు. ఆ విధంగా నేతాజీ నాయకత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరిన ఆయన తనదైన చురుకుదనం, వ్యక్తిగత ప్రతిభ, లక్ష్యసాధన పట్ల నిబద్ధతతో నేతాజీ వ్యక్తిగత సిబ్బందిలో ఒకరై పోయారు.

చిన్నవయస్సులోనే పలు భాషల అధ్యయనం పట్ల మక్కువ పెంచుకున్న అబిద్ జర్మనీ, ఫ్రెంచి, ఇంగ్లీష్, అరబిక్, సంస్కృతం, పర్షియన్, పంజాబీ, హిందీ, తెలుగు, ఉర్దూ భాషలలో రాయడంతోపాటు చదవటం క్షుణ్ణంగా మాట్లాడటంలో దిట్టగా తయారయ్యారు. ఈ విధంగా పలు భాషల మీద పట్టు సాధించడంలో అబిద్ చూపిన ప్రతిభ ఆయనకు ఆజాద్ హింద్ ఫౌజ్‌లో సువర్ణావకాశాలను కల్పించింది. పంజాబీ భాషను బాగా

మాట్లాడగలగడంతో ఆజాద్ హింద్ ఫౌజ్‌లోని సైనికులతో, అధికారులతో అబిద్ హసన్ సత్సంబంధాలను ఏర్పచుకోగలిగారు.

1942 మే నుండి రెండు సంవత్సరాలపాటు అబిద్ హసన్ ఐఎన్‌ఏ అధినేత నేతాజీ వ్యక్తిగత కార్యదర్శిగా ఆయన వెంటున్నారు. ఆ రోజుల్లో జపాన్ ఇంకా పలు దేశాధినేతల సహాయ సహకారాలను ఆకాంక్షిస్తూ నేతాజీ పలు దేశాలను పర్యటిస్తూన్నారు. ఈ సందర్భంగా నేతాజీతో పాటుగా అబిద్, South East Asia దేశాల పర్యటనలు చేశారు. బోస్ పోరాట జీవితంలో అతి కీలకమైన సమయంగా పరిగణించబడిన ఆ రోజుల్లో ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా నేతాజీ వెంట ఉండి తనదైన పాత్రను అబిద్ నిర్వహించారు. ఆ సమయంలోనే **ఆజాద్ హింద్ ఫౌజ్** కు స్ఫూర్తిదాయకంగా నిలచిన **జైహింద్** నినాదం, సుభాస్ చంద్రబోస్ పేరును కూడా మర్చి పోయేలా భారతీయలను మురిపించి వారి హృదయాలలో చిరస్థాయిగా నిలచిపోయిన **నేతాజీ** అను పదాలను అబిద్ హసన్ సఫ్రాని స్వయంగా సృష్టించారు.

ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఉత్సాహపరిచే నినాదాల కోసం అన్వేషణ జరుగుతున్న సందర్భంగా అబిద్ హసన్ సఫ్రాని **జైహింద్** నినాదాన్ని సూచించగా బోస్ అంగీకరించి అభినందించారని తెలుస్తుంది. ఈ నినాదం భారతీయులను ఉత్తేజపర్చుతూ స్వాతంత్ర్యోద్యమ సాహిత్య చరిత్రలో సజీవంగా నిలచిపోయింది. ఆ తరువాత సుభాస్ చంద్ర బోస్‌ను తొలుతగా **నేతాజీ** అని అబిద్ గౌరవాభిమానాలతో పిలిచారు. ఆనాటి నుండి అబిద్ విజ్ఞప్తి మేరకు బోస్ సహచరులంతా అయనను **నేతాజీ** అని పిలువసాగారు. ఈ మేరకు భారత స్వాతంత్ర్యోద్యమ సాహిత్యంలో సుప్రసిద్ధమైన **నేతాజీ, జైహింద్** లాంటి అద్భుత నినాదం, పేరును సృష్టించిన అబిద్ హసన్ సఫ్రాని చరిత్రలో చిరస్మరణీయమైన స్థానం పొందారు. (నేతాజీ-ఐ.యస్.ఎ, సిహెచ్ ఆచార్య, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 2001)

ఈ విషయమై వ్యక్తమౌతున్న భిన్నాభిప్రాయాలను దృష్టిలో ఉంచుకుని, ఈ చారిత్రక విషయం గురించి మరింత స్పష్టత కోసం 'FORGOTTEN WARRIORS OF INDIAN WAR OF INDEPENDENCE 1941-1946 (Indian National Army) 2005' అని నాలుగు బృహత్తర సంపుటాలను రూపకల్పన చేసిన బోస్ సహచరులు, ఆజాద్ హింద్ ఫౌజ్ సైన్యాధికారి Captain S.S Yadava కు ఈ గ్రంథ రచయిత లేఖ రాశాడు. ఆనాడు ఇండియన్ నేషనల్ ఆర్మీలో పనిచేసిన సామాన్య సిపాయి నుండి ఉన్నత స్థాయి అధికారి వరకు ఎవ్వరినీ విడిచి పెట్టకుండా వేలాది యోధుల సంక్షిప్త వివరాలను తన గ్రంథంలో నిక్షిప్తం చేసిన వ్యక్తి కెప్టన్ యాదవ్. All India INA Committe, General Secretary గా ప్రస్తుతం బాధ్యతలు

నిర్వహిస్తున్న ఆయన ఈ రచయిత లేఖకు సమాధానమిస్తూ 31-09-05న ఒక లేఖ, 11-11-05న మరొక లేఖ రాస్తూ, '**నేతాజీ-జైహింద్**' లను అబిద్ హసన్ సఫ్రాని సృష్టించారని చాలా స్పష్టంగా పేర్కొన్నారు. ఆ లేఖలలో '...National salutation JAI HIND and NETAJI, as far as I know both were coined by Abid Hasan Safrani. In South East Asia, he was the person who persuaded High Ranking INA Officers to address Netaji as Netaji. Netaji and Mr. Safrani greeted South East Asian INA officers with JAI HIND. JAI HINDI became popular not only among INA officers but also among Indian, Malaya, Thais, Burmese and Chinese...these things were adopted in Germany by Abid Hasan Safrani...in Germany...' అని మరింత వివరణ కూడా ఇచ్చారు. ఈ విషయాన్ని నేతాజీకి Personal Intelligence Officerగా బాధ్యతలు నిర్వర్తించిన K.R.Palta కూడా తాను వెలువరించిన My Adventures with the INA గ్రంథంలోలో ఆనాటి విషయాలను వివరిస్తూ **జైహింద్** సృష్టికర్తగా అబిద్ హసన్‌ని పేర్కొన్నారు.

ఆజాద్ హింద్ ఫౌజ్‌లో అబిద్ హసన్ సఫ్రాని లాగే మేజర్ జనరల్ షానవాజ్, కల్నల్ హబీబుర్రెహమాన్ లాంటి చాలా మంది ముస్లిం ప్రముఖులున్నారు. చివరిక్షణం వరకు నేతాజీ వెంట ఉన్న సహచరుడిగా కల్నల్ హబీబుర్రెహమాన్ ఖ్యాతిని దక్కించుకున్నారు. ఆ బాటలోనే ఒక అరుదైన చారిత్రక నినాదాలను సృష్టించిన వ్యక్తిగా అబిద్ చరిత్రలో నిలచిపోయారు. ఈ విషయాన్ని ప్రముఖ రచయిత Mr. Santimay Ray తన Freedom Movement and Indian Muslims లో, 'In his 90 day submarine dash from Berlin he was accompanied by only one Indian, Abid Hassan, who acted as his Secretary' అని రాశారు.

1943 ఫిబ్రవరి 8న నేతాజీతో కలసి అబిద్ సాగించిన **జలాంతర్గమి ప్రయాణం** గురించి నేతాజీ సోదరుని కుమారుడు శిశిర్ బోస్ తన **ఐ.యస్.ఐ ఇన్ ఇండియా టుడే** గ్రంథంలో వివరించారు. ఆ వివరాల ప్రకారం, జలాంతర్గామిలో నిటారుగా నిలబడడానికి గాని కాస్త సౌకర్యంగా పడుకోడానికి గాని చాలీచాలని స్థలం కావడం, ఆహార పదార్థాల కొరత వలన నేతాజీ, అబిద్‌లు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. భరించరాని డీజిల్ వాసన వలన కూర్చుని ఆహారం తీసుకోవటం కూడా అసాధ్యమయ్యేది. ఈ ఇక్కట్లు ఇలా ఉండగా పలు ప్రమాదాలను దాటుకుని ముందుకు సాగుతూ, మడగాస్కర్ కోస్తాలో ఎదురైన అతిపెద్ద ప్రమాదాన్ని బోస్-అబిద్‌లు అత్యంత ధైర్యసాహసాలతో అధిగమించారు. ఈ విధంగా పూర్తిగా మూడు మాసాలు పట్టిన ఈ జలాంతర్గామి ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసి మే6 నాటికి బోస్-అబిద్ గమ్యం చేరగలిగారు. ఈ ప్రయాణం సందర్భంగా నేతాజీ భవిష్యతు కార్యక్రమాన్ని రూపొందించారు. ఆ కార్యక్రమ వివరాలను నేతాజీ చెబుతుండగా అబిద్ హసన్ నోట్స్ రాశారు.

అనంతరం అబిద్ హసన్ సఫ్రానిని భారత జాతీయ సైన్యంలో **గాంధీ బ్రిగేడ్**



జలాంతర్గామిలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్‌తో అబిద్ హసన్ సఫ్రాని.

కమాండర్‌గా నేతాజీ నియమించారు. గాంధీ బ్రిగేడ్ శత్రువుతో పోరాడుతూ తూర్పు ఇండియా లోని ఇంఫాలా వద్ద బ్రిటీషు అధికారుల వలయంలో చిక్కుకపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో **గాంధీ బ్రిగేడ్** నేతగా అబిద్ హసన్ అరెస్టు అయినా, ఆయన నాయకత్వంలోని గాంధీ బ్రిగేడ్ సాహసాన్ని శత్రువులు కూడా ప్రశంసించకుండా ఉండలేకపోయారు.

అబిద్ 1941 నుండి 1947 మధ్యకాలంలో జైలులో గడపాల్సి వచ్చింది. (నేతాజీ ఐ.ఎన్.ఎ, సిహెచ్.ఆచార్య, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 2001, పేజి.181). అబిద్ సింగపూరు జైలులో ఉన్నప్పుడు ఒకసారి మౌంట్‌బాటన్‌తో కలసి జైలును సందర్శించిన నెహ్రూ అబిద్ హసన్‌ను గుర్తుపట్టి పలకరించారు. ఆయన ఆ జైలులోని దుర్భరమైన వాతావరణాన్ని చవిచూడాల్సి వచ్చింది. జైలులోని దుస్థితిని, తనతోపాటుగా తన సహచరులు పడుతున్న ఇక్కట్లను లేఖల ద్వారా తల్లి ఫక్రుల్ హజియా హసన్‌కు అబిద్ తెలుపుతూ వచ్చారు. ఆ లేఖాంశాలను చదివి భరించలేకపోయిన ఫక్రుల్ హజియా ఐ.ఎన్.ఎ యోధుల విడుదల కోసం న్యాయపోరాటం సాగించేందుకు నడుంకట్టారు. ఈ కృషిలో ఆమె సన్నిహితురాలు సరోజిని నాయుడు ఆమెకు సహకరించారు.

1945 ఆగస్టు 6న బ్యాంకాక్‌కు బయలు దేరిన నేతాజీతోపాటుగా అబిద్ హసన్, కల్నల్ హబీబుర్రెహమాన్ తదితరులు కూడా బయలుదేరారు. అనివార్యకారణాల వలన అబిద్, ఇతర సహచరులు సెప్టెంబరు 17న సైగాన్‌లో దిగిపోగా నేతాజీతోపాటు కల్నల్ హబీబుర్రెహమాన్ ఒక్కరు మాత్రమే వెళ్ళారు. ఆ విమానం 1945 ఆగస్టు 18న ప్రమాదానికి

గురికావడంతో కల్నల్ హబీబుర్రెహమాన్ మాత్రం తీవ్రగాయాలతో బయటపడగా నేతాజీ అంతర్ధానయయ్యారు.

ఆ తరువాతి పరిణామాల ఫలితంగా అబిద్ హసన్‌ను బర్మాలో బ్రిటీష్ సైన్యాలు అరెస్టుచేశాయి. ఈ అరెస్టు సందర్భంగా ఆయన సింగపూరు జైళ్ళలో మగ్గుతున్నప్పుడు భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది. స్వాతంత్ర్య సమరయోధుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా అఖండ భారతం రెండుగా చీలిపోవడం సహజంగానే అబిద్ హసన్‌కు బాధ కలిగించింది. ఆ బాధ నుండి త్వరితగతిన బయట పడిన అబిద్ హసన్ సఫ్రాని స్వతంత్ర భారతదేశం భవిష్యత్తు నిర్మాణం కోసం నడుంకట్టారు.

జైలు నుండి బయటపడిన అబిద్ అనారోగ్యం పాలయ్యారు. ఆయన హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని 'ధూప్ ఛావ్' భవనంలో సేదతీరుతూ కొంతకాలానికి కోలుకున్నారు. మాతృభూమి విముక్తి కోసం సాయుధపోరాటం చేసిన అబిద్ స్వేచ్ఛాభారతంలో జీవన పోరాటం కోసం తొలుత రేడియోల వ్యాపారం చేశారు. ఆ వ్యాపారం సక్రమంగా నడవక పోవడంతో ఆయన సోదరుడు ప్రొఫెసర్ జాఫర్ హసన్ సలహా మేరకు 'ఇండియన్ ఫారిన్ సర్వీస్' పరీక్షలు రాశారు. బహు భాషాకోవిదుడు, మేధావి అయినటువంటి అబిద్ హసన్ ఆ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. అబిద్ హసన్ మేధాసంపత్తి గురించి ముందుగా ఎరిగిఉన్న భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆయనను స్వయంగా ఇంటర్వ్యూ చేసి ఇండియన్ ఫారిన్ సర్వీసుకు ఎంపిక చేశారు.

ఆ విధంగా భారత విదేశాంగ విధానంలో ప్రత్యక్ష పాత్రను సమర్ధవంతంగా నిర్వహించిన అబిద్ హసన్ సఫ్రాని పెకింగ్, కైరోలలో ప్రప్రథమ కార్యదర్శిగా కీలకమైన పాత్రను చేపట్టారు. ఆ తరువాత డెమాస్కస్, బాగ్దాద్, డెన్మార్క్‌లలో భారత దేశపు కౌన్సల్–జనరల్‌గా పనిచేశారు. సెనగల్, మారిషస్, ఐవరీకోస్ట్, జాంబియా, కోపెన్‌హేగ్‌లలో అబిద్ భారత రాయబారి బాధ్యతలను అత్యంత ప్రశంసనీయంగా నిర్వహించారు.

అబిద్ హసన్ సఫ్రాని తాను కలలుగన్న స్వతంత్ర భారతంలో అత్యున్నత పదవులను నిర్వహించి, మాతృభూమి కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేసిన అదృష్టాన్ని దక్కించుకున్నారు. పదవీ విరమణ తరువాత స్వంతగడ్డ హైదరాబాద్ చేరుకున్నారు. స్వాతంత్ర్యసమర చరిత్రలో అపూర్వమనదగిన, యావత్తు భారతదేశం గర్వించదగిన **జైహింద్**, **నేతాజీ** లాంటి చారిత్రక నినాదాలను సృష్టించి స్వాతంత్ర్యోద్యమంలో మాత్రమే కాకుండా స్వాతంత్ర్యోద్యమ సాహిత్య చరిత్రలో కూడా తనదైన విశిష్ట, శాశ్విత స్థానాన్ని భద్రంగా పదిలపర్చుక్ను అబిద్ హసన్ సఫ్రాని 1984లో కన్నుమూశారు.

◆◆◆



### మతసామరస్యాన్ని పరిపుష్టం చేసేందుకు శ్రమించిన

# 30. మీర్జా మహబూబ్ బేగ్

(1894-1985)

**జా**తీయోద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి, ఆంగ్లేయుల పాలనకు చరమ గీతం పాడిన జాతీయోద్యమకారుల్లో కొందరు భవ్య భారతదేశం నిర్మాణాన్ని ఆకాంక్షిస్తూ ఆ దిశగా కూడా మరింత క్రియాశీలకంగా పనిచేశారు. ఈ మేరకు సేవాకార్యక్రమాలతో మాతృభూమి రుణం తీర్చుకున్నవారిలో మీర్జా మహబూబ్ బేగ్ ఒకరు.

ప్రకాశం జిల్లా మార్కాపురంలో 1894లో మీర్జా మహబూబ్ బేగ్ జన్మించారు. ఆయన తండ్రి మీర్జా అల్లీబేగ్, తల్లి సయ్యదా హమీదా బీబి. తండ్రి ప్రముఖ వ్యాపారవేత్త. మహబూబ్ బేగ్ విద్యాభ్యాసం చాలా వరకు ఇంటి వద్ద సాగింది. మహబూబ్ బేగ్ ఉర్దూ, తెలుగు, అరబిక్, పర్షియన్ భాషలలో ప్రవేశం సంపాదించారు. ఆయన కుటుంబం సంపన్న వ్యాపార కుటుంబం కావడంతో ఉన్నత చదువుల జోలికి వెళ్ళకుండా వాణిజ్య రంగంలోకి ప్రవేశించిన మహబూబ్ బేగ్ చిన్నతనంలోనే వ్యాపారరంగంలో ఉన్నత స్థాయికి చేరుకున్నారు.

మహబూబ్ బేగ్ తన కార్యకలాపాలను వాణిజ్యం వరకు మాత్రమే పరిమితం చేయకుండా, ప్రజాసేవారంగం లోనికి బాగా విస్తరింపచేశారు. ప్రజాసేవా కార్యక్రమాలో చురుకైన పాత్ర నిర్వహించడం మాత్రమే కాకుండా దాతృత్వంలో కూడా ఉన్నతుడు అన్పించుకున్న ఆయన అన్నివర్గాల అభిమానాన్ని చూరగొన్నారు. ప్రజోపకరమైన పనులకు

ఆర్థిక-హార్థిక చేయూతనిచ్చిన ఆయన మహాత్ముని పిలుపు మేరకు ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమంలో ప్రవేశించి క్రియాశీలక తోడ్పాటును అందించారు.

ఒకవైపు వ్యాపార రంగాన 'సౌదాగర్' అన్పించుకుంటూనే మీర్జా మహబూబ్ బేగ్ ప్రత్యక్ష రాజకీయాలలోకి ప్రవేశించారు. భారత స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన జమాయత్-ఉల్-ఉలేమా-యే-హింద్ సభ్యత్వంతోపాటు భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించారు. 1924లో మార్కాపురం లోకల్ పంచాయితీ బోర్డు సభ్యునిగా ఎన్నికైన ఆయన 1928లో సృష్టించబడిన బోర్డు ఉపాధ్యక్ష పదవిని చేపట్టారు. ఆ పదవిలో 35 ఏండ్లపాటు ఏకబిగిన కొనసాగి చరిత్ర సృష్టించారు. 1932లో మార్కాపురం తాలూకా బోర్డు సభ్యునిగా, 1944లో జిల్లా బోర్డు సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించారు. రాజకీయ-సేవా రంగాలలోనే కాకుండా ధార్మిక సంస్థలలో కూడా ప్రముఖ పాత్ర నిర్వహించారు. స్థానిక జామియా మస్జిద్ పేష్ఇమాంగా 1931లో నియుక్తులైన మీర్జా మహబూబ్ బేగ్ ఆ పదవిలో 55 ఏండ్లు ప్రతిఫలరహితంగా సామాజిక-ధార్మిక సేవలందించారు.

జాతీయోద్యమం తొలిదశలో ఉద్యలీకార్యక్రమాలకు పరోక్షంగా తోడ్పడిన మీర్జా మహబూబ్ బేగ్ క్రమంగా భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడిగా ప్రత్యక్ష కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు. ఆ కారణంగా పలుమార్లు నిర్బంధానికి గురికాగా రెండు మాసాలు వెల్లూరు జైలులో శిక్షను అనుభవించారు. భారత జాతీయ కాంగ్రెస్ అనుబంధంగా ఏర్పడిన పలు స్థానిక ప్రజా, సేవాసంఘాలు, సంస్థలలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. జాతీయోద్యమం దిశగా ప్రజలను కదలించడంలో ఎంతో కృషిచేశారు. మహాత్ముని బాటలో శాంతియుత, అహింసా మార్గంలో వలసపాలకులను తరిమికొట్టాలన్న లక్ష్యంతో మున్ముందుకు సాగారు. జాతీయవాదిగా ముస్లింలీగ్ వేర్పాటు వాదాన్ని తిరస్కరించారు. మతసామరస్యం కోసం, హిందూ-ముస్లింల మధ్య ఐక్యతను మరింత పరిపుష్టం చేసేందుకు నిరంతరం కృషి చేశారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించాక ఏర్పడిన పలు స్థానిక ప్రభుత్వ, ప్రజా సేవా సంఘాలలో, సంస్థలలో మహబూబ్ బేగ్ పలు బృహత్తర బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. 1952లో అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో మార్కాపురం నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మీర్జా బేగ్ ఓటమి పాలయ్యారు. 1967లో మార్కాపురం పురపాలక సంఘం ప్రపథమ 'ఎల్డర్‌మన్'గా ఎన్నికయ్యారు. రాజకీయ, ప్రజా సేవారంగాలలో తనదైన రీతిలో అన్నివర్గాల ప్రజానీకానికి తగిన తోడ్పాటు అందించిన మీర్జా మహబూబ్ బేగ్ తన జీవిత పర్యంతం హిందూ-ముస్లింల ఐక్యత, అభ్యున్నతికి కృషి సల్పుతూ 91ఏండ్ల వయస్సులో 1985 ఏప్రిల్ 23న మార్కాపురంలో కన్నుమూశారు.

◆◆◆



## ప్రజా సంక్షేమమే పరమార్థంగా సాగిన నిరాడంబరుడు

# 31. మున్షీ సయ్యద్ మహబూబ్

(-1985)

**రా**జకీయంగా ముస్లింలీగ్‌ను అభిమానించినా సాధారణ జీవితంలో మహాత్ముని మార్గంలో నిరాడంబర శ్రమైకజీవనం గడిపిన స్వాతంత్ర్య సమరయోధులు మున్షీ సయ్యద్ మహబూబ్, తెనాలి తాలూకా యడ్లపల్లి గ్రామంలో జన్మించారు. ఉర్దూలో మంచి అభిరుచి కల్గిన ఆయన అదీబ్-ఏ-ఫాజిల్ చేసి మున్షీ అయ్యారు. ఆ రోజు నుంచి సయ్యద్ మహబూబ్ కాస్తా '**మున్షీ మహబూబ్**' గా ప్రసిద్ధి చెందారు.

చిన్నతనం నుండే స్వతంత్ర జాతీయ భావాలను పెంపొందించుకున్న సయ్యద్ మహబూబ్ జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఆల్ ఇండియా ముస్లింలీగ్‌లో కూడా చేరిన ఆయన మద్రాసు లీగ్ నాయకుల పెత్తనం నుండి ముస్లింలీగ్‌ను విముక్తం చేసి రాష్ట్రంలో లీగ్‌ను బలోపేతం చేశారు. ఆ కృషిలో భాగంగా 1945లో తెనాలిలో ముస్లింలీగ్ స్థాపనకు నడుంకట్టి ముస్లిం లీగ్‌లో నాయకత్వాన్ని తమ గుప్పెట బంధించిన నగరవాసుల, మద్రాసు నేతల ఆధిపత్యానికి వ్యతిరేకంగా సామాన్యకార్యకర్తల పక్షాన పోరాడారు.

ప్రజలను భారీగా సమీకరించి తెనాలిలో గుంటూరు జిల్లా ముస్లింలీగ్ ప్రథమ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సభలలో ప్రముఖ లీగ్ నేతలతోపాటుగా ప్రముఖ కవి, జాతీయోద్యమ నాయకులు డాక్టర్ ఉమర్ అలీషా పాల్గొన్నారు. ముస్లిం లీగ్

నిర్మాణం కోసం ఆయన ఎంతో కార్యదక్షతతో పనిచేశారు, అన్నివిధాల శ్రమపడ్డారు.

అనంతర కాలంలో ముస్లింలీగ్‌లో పొడచూపిన వేర్పాటువాదం ఆయనలో కలవరం కలిగించాయి. ఆ కారణంగా ప్రమాదకరమైన వేర్పాటు ధోరణులను ఆయన బాహాటంగా విమర్శించారు. మతం ప్రాతిపదికన ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టిన లీగ్ చర్యలను తీవ్రంగా నిరశించారు. ఈ వైఖరి భారతీయుల భవిష్యత్తుకు ప్రమాదకరమని పేర్కొంటూ ముస్లింలీగ్ పోకడలను ఆక్షేపించారు. ఆ సమయంలో ముస్లింలీగ్ సహచరులు ఆయన మీద ఎంతటి ఒత్తిడి తెచ్చినా లీగ్ చర్యలను సహేతుకంగా విమర్శించడం మానలేదు. చివరకు లీగ్‌లో ఇమడలేక ఆయన ముస్లింలీగ్‌కు రాజీనామా చేశారు. ఆ తరువాత భారత జాతీయ కాంగ్రెస్ నేతృత్వంలో సాగుతున్న జాతీయోద్యమంలో పాల్గొంటూనే, పేద బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటుపడ్డారు.

సామ్యవాద సిద్ధాంతాలతో ఆకర్షితులైన మున్షీ మహబూబ్ కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. స్వాతంత్ర్యం సిద్ధించాక ఆ పార్టీలో నిబద్ధత గల కార్యకర్తగా ఆయన క్రియాశీలక పాత్రను పోషించారు. 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతం నుండి పోటీచేసిన కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులు విజయం సాధించటానికి ఆయన కృషిసల్పారు. ఆ కృషికి గుర్తింపుగా మున్షీ మహబూబ్‌ను ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యత్వం వరించింది.

కామ్రేడ్ మహబూబ్‌గా పిలువబడే ఆయన తెనాలిలో అనేక సేవాసంస్థల ఏర్పాటుకు కృషి చేశారు. 1951లో అంజుమన్-ఏ-వతన్ అను సంస్థను ప్రారంభించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలను నిర్వహించారు. అంతేకాదు జ్ఞానార్జనకు దోహదం చేసే గ్రంథాలయం ఏర్పాటు చేశారు. మంచి పుస్తకాలు ఆ గ్రంథాలయంలో లభించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆ గ్రంథాలయానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరు పెట్టారు.

రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు 'ఆంధ్ర ముస్లిం వక్ఫ్ఆస్తుల సంరక్షణ సంఘం' ఏర్పాటు చేసి, ఆ సంఘం అధ్యక్షులుగా ముస్లిం సమాజానికి చెందిన వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా సయ్యద్ మహబూబ్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు పలు ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఆ క్రమంలో విజయవాడకు చెందిన స్వాతంత్ర్యసమరయోధులు కమ్యూనిస్టు నాయకులు ఎండి.ఆదంతో కలసి గ్రంథాన్ని కూడా వెలువరించారు. ఈ సందర్భంగా స్వార్థపరశక్తుల నుండి పలు ఇక్కట్లను ఎదుర్కొన్నారు. ఆయన అనుభవిస్తున్న పేదరికాన్ని ఆసరా చేసుకుని తమ అవసరాలకు ఆయనను వినియోగించుకునేందుకు ప్రయత్నించిన వ్యక్తుల-శక్తుల కుయుక్తులను తిప్పికొట్టారు. అనుకూలిస్తే అందలాలు ఎక్కిస్తామని ఆశచూపినా ఆయన తనదైన మార్గాన్ని వీడలేదు.



గుంటూరు జిల్లా ముస్లింలీగ్ మహాసభ ప్రథమ సమావేశం (1945-46) తెనాలిలో జరిగినప్పటి ప్రజా సందోహ దృశ్యం

అనునిత్యం సంఘసేవలో గడిపిన సయ్యద్ మహబూబ్ నిత్య దారిద్ర్యంలో కూడా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా సంసార నౌకను సాగించారు. ప్రజా ప్రతినిధిగా అనేక సంవత్సరాలు పలు అధికార పదవులను చేపట్టినా, ఆ పదవులను ప్రజల ప్రయోజనార్థం ఉపయోగించారు తప్ప వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించలేదు. అధికార పదవులు ప్రసాదించిన అధికారం నుండి ఆయన ఏమీ కోరుకోలేదు, మరేమీ సంపాదించుకోలేదు, ఏమీ దాచుకోలేదు. కుటుంబం గురించి గాని, తన బిడ్డల భవిష్యత్తు గురించి గాని ఏమాత్రం ఆలోచించకుండా సమాజ సంక్షేమం కోసం జీవితాంతం పనిచేశారు.

సయ్యద్ మహబూబ్ మంచి కళాకారుడు. కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం అని నమ్మిన ప్రజా కళాకారుడు. ఆయన ప్రజానాట్యమండలి సభ్యత్వం స్వీకరించారు. ప్రజా నాట్యమండలి కళాకారునిగా ఆయన ధరించే ఫకీర్ పాత్ర ఎంతటి పేదదో అంతకంటే ఎక్కువ పేదరికాన్ని నిజ జీవితంలో అనుభవించిన సయ్యద్ మహబూబ్ తన చివరిశ్వాస వరకు ఆ పాత్రను ఎంతో సహజంగా పోషించారు. ఆంధ్ర ప్రజా నాట్యమండలి కళాకారునిగా ఎన్నో పాత్రలను పోషించారు. ఆయన ఎన్ని పాత్రలు పోషించినా అన్నింటికంటే ఎంతో మక్కువతో ఆయన ధరించే ఫకీర్ పాత్ర మంచి ఖ్యాతి తెచ్చిపెట్టింది.

మృత్యువు మరికొన్ని రోజులలో సయ్యద్ మహబూబ్‌ను సమీపిస్తుందనగా, తెనాలి వహాబ్ చౌక్‌లో జరిగిన ఓ సభలో ఆయన ప్రసంగించారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ,

'...మై ఘర్ ఘర్‌కా ఫకీర్ హూం, ఆజ్ మేరి హాలత్ యహ్ హై కి మేరి మయ్యత్ పర్ కఫన్ కేలియే భీ మేరేపాస్ పైసా నహీ, అగర్ మేరే మౌత్ హోనేపర్ ఇస్ షేర్వానీసే మేరా దఫన్ కియాజాయె...' (నేను ఇంటింటి ఫకీర్‌ను....నా స్థితి ఎలాంటిందంటే నా అంత్యక్రియల కోసం శవవస్త్రం కోనుగోలుకు కూడా నా వద్ద డబ్బులేదు. నా మరణం సంభవిస్తే నా షేర్వానితో నన్ను ఖననం చేయండి) అని బాధామయ కంఠంతో పలికిన ఆయన పలుకులు సభికులందరి చేత కన్నీరు పెట్టించాయి. ఈ మాటలు ఆయన నిజస్థితికి అద్దం పడతాయి. ఆ స్థితిలో కూడా ఆయన ఒకరి వద్ద చేయిచాప లేదు సరికదా తనవద్ద ఉన్నదానిలో తనకంటే దుర్భరస్థితిని అనుభవిస్తున్న వ్యక్తులకు సహాయపడ్డారని స్వాతంత్ర్య సమరయోధులు సయ్యద్ అబ్దుల్ అజీం, మున్షి మస్తాన్ (తెనాలి) 1999లో రచయితకు తెలిపారు.


సయ్యద్ మహబూబ్ మంచి వక్త. ఆయన అనర్గళంగా ప్రసంగాలు చేస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు అర్దమయ్యేలా విప్పి చెబుతూ ప్రజలను ఆకట్టుకోవడంలో దిట్ట. ఆ కారణంగా పార్టీ సభలకు సమావేశాలకు ఆయనకు ప్రత్యేకంగా ఆహ్వానాలు వచ్చేవి. ప్రజలు కూడా ఆయన హావభావాలతో కళాత్మకంగా సాగించే ప్రసంగాల కోసం పెద్ద సంఖ్యలో హజరయ్యేవారని తెనాలి వాసులు సయ్యద్ అబ్దుల్ అజీం, మున్షీ మస్తాన్ లాంటి పెద్దల కథనం ద్వారా తెలుస్తుంది. ఈ వ్యాఖ్యానాలు వక్తగా సయ్యద్ మున్షీ మహబూబ్ శక్తి, సామర్థ్యాలను వెల్లడిస్తాయి.

బ్రతికినంత కాలం స్వాతంత్ర్య సమరయోధుడు, నిజాయితీ-నిబద్ధత గల పక్కా కమ్యూనిస్టుగా బ్రతికిన ఆయన వసుధైక కుటుంబం కోసం జీవితాంతం కృషిచేశారు. సమ సమాజ స్థాపన లక్ష్యంగా జీవితపు చివరిఘడియ వరకు అవిశ్రాంతంగా శ్రమించిన సయ్యద్ మహబూబ్ 1985 ఫిబ్రవరిలో కన్నుమూశారు.

◆◆◆

'..భారతదేశ సోదరులారా మీరు ఏ మతానికి, సంప్రదాయానికి చెందిన వారైనా సరే, దేశసేవలో కృషిచేయండి. వృధాగా పరస్పరం కలహించకండి. అన్ని పనులూ ఒకే లక్ష్యాన్ని సాధించేందుకు సాధనాలు. అలాంటప్పుడు ఈ వ్యర్థపు కోట్లాటలూ, కుమ్ములాటలు ఎందుకు? ఐకమత్యంతో దేశంలోని దొరతనాన్ని ఎదిరించండి. దేశాన్ని స్వతంత్రం చేయండి...చివరగా అందరికి నా సలాం. భారతదేశం స్వతంత్రమగు గాక. నా సోదరులు సుఖంగా ఉందురు గాక..'

**-షహీద్ అష్ఫాఖుల్లా ఖాన్**



## రాష్ట్ర మున్సిపల్ వర్కర్ల ఉద్యమ నిర్మాత

# 32. ముహమ్మద్ హనీఫ్

(1914-1990)

బ్రిటీషర్ల పాలన నుండి స్వేచ్ఛా-స్వాతంత్ర్యాల కోసం జాతీయోద్యమంలో పాల్గొన్న యోధులలో కొందరు తమ కార్యక్షేత్రాన్ని స్వరాజ్య సాధన వరకు మాత్రమే సరిపెట్టుకోకుండా అసమాన సమాజం నుండి ప్రజలను విముక్తం చేసి సమానత్వం ప్రసాదించేందుకు కూడా ముందుకు సాగారు. ఆ దిశగా చివరిదాక సాగిన యోధులలో ముహమ్మద్ హనీఫ్ ఒకరు.

అటు స్వాతంత్ర్యోద్యమంలో ఇటు సమసమాజ స్థాపనకోసం సాగిన ఉద్యమాలలో తనదైన పాత్రను నిర్వహించిన ముహమ్మద్ హనీఫ్ 1914 మార్చి 15న బాపట్ల ప్రాంతంలో జన్మించారు. తండ్రి షేక్ మీరా సాహెబ్. ఆయన పి.డబ్యూ.డి శాఖలో ఉద్యోగి. స్వతహాగా పది ఎకరాల భూమిగల రైతు కుటుంబం వారిది. ముహమ్మద్ హనీఫ్ తండ్రి బ్రిటీష్ ప్రభుత్వంలో ఉద్యోగం చేస్తున్నా భారత జాతీయ కాంగ్రెస్ సానుభూతిపరులు. ఆయన విజయవాడ పట్టణంలో 1921లో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో పాల్గొని కాంగ్రెస్ స్వచ్ఛంద సేవాదళం కమాండర్‌గా సేవలందించారు.

చిన్నతనంలో ముహమ్మద్ హనీఫ్ తండ్రి షేక్ మీరా సాహెబ్‌కు మద్రాసు బదలీ అయ్యింది. ఆ కారణంగా 1922లో తల్లితండ్రులతో కలసి హనీఫ్ మద్రాసుకు వెళ్ళి పోయారు. మద్రాసులో తన ఇంటి వద్దనే ప్రాథమిక విద్యను పూర్తిచేసుకున్న ఆయన

పెరంబూరులోని కన్నం చెట్టియార్ ఉన్నతపాఠశాలలో విద్యనభ్యశించారు.

జాతీయోద్యమం పట్ల అనురక్తిని తండ్రి నుండి వారసత్యంగా పొందిన ముహమ్మద్ హనీఫ్‌కు 1924 ప్రాంతంలో జాతీయోద్యమకారుడు శ్రీపాద శంకర్‌తో పరిచయం కలిగింది. శ్రీపాద చిన్నతమ్ముడు ఆత్మారాం హనీఫ్‌కు సహవిద్యార్థి కావడంతో ఆయన భావాలతో హనీఫ్ ప్రభావితమయ్యారు. ఆయన సహచర్యంలో హనీఫ్ కూడా సత్యాగ్రహం, పికిటింగ్ కార్యక్రమాలలో పాల్గొని చిన్నవయస్సులోనే జాతీయోద్యమ కార్యక్రమాలలో పాలుపంచుకున్న వారయ్యారు. ఈ పికిటింగ్ సందర్భంగా అకృత్యాలకు పాల్పడుతున్న మద్యపాన దుకాణాల యజమానుల రౌడీల గుంపుల దాష్టీకాలను తన కండబలంతో భౌతికంగా ఎదుర్కొంటూ ముహమ్మద్ హనీఫ్ భారత జాతీయ కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా నిలిచారు.

1927లో ప్రముఖ కార్మికనాయకుడు వరహగిరి వెంకట గిరి నాయకత్వం వహిస్తున్న రైల్వే ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగుల సమ్మె జరిగింది. ఆ సమయంలో భారత జాతీయ కాంగ్రెస్ స్వచ్ఛంద సేవాదళం సభ్యులుగా ముహమ్మద్ హనీఫ్ రైల్వే ఉద్యోగుల సమ్మెకు పూర్తిగా మద్దతు పలకడమేకాక వారికి అవసరమగు సేవలను అందించారు. ఈ సమ్మె సమయంలో ముహమ్మద్ హనీఫ్ తన సహచరులతో కలసి పరిసర గ్రామాలలో పర్యటించి సమ్మె అవసరం గురించి ప్రజలకు తెలుపుతూ, రైల్వే ఉద్యోగుల సమ్మెకు ప్రజల మద్దతు సంపాదించడంతోపాటుగా సమ్మె చేస్తున కార్మికుల కోసం నిధులను, ఆహారపదార్థాలను సేకరించడాన్ని ఎంతో బాధ్యతగా నిర్వహించారు. ఈ సందర్భంగా మద్రాసులోని రైల్వే ఉద్యోగుల శిబిరానికి విచ్చేసిన మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూలను సందర్శించే అవకాశం ముహమ్మద్ హనీఫ్‌కు లభించడమే కాకుండా, ఆయనకు ప్రముఖ కార్మిక నేత సత్యమూర్తితో పరిచయం కలిగింది.

1928లో మద్రాసులో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో ఆయన తన తండ్రిలాగే కాంగ్రెస్ స్వచ్ఛంద సేవాదళం సభ్యునిగా పాల్గొని సేవలందించారు. 1928లో ఆరంభమైన సైమన్ బహిష్కరణోద్యమంలో ముహమ్మద్ హనీఫ్ చురుకుగా పాల్గొన్నారు. ఆ క్రమంలో జాతీయోద్యమకారునిగా రూపుదిద్దుకున్న ఆయన 1930లో తంజావూరును తన కార్యక్షేత్రంగా చేసుకుని కార్యకలాపాలను కొనసాగించారు. జాతీయోద్యమంలో భాగంగా జైలు కెళ్ళాలన్న ప్రధాన లక్ష్యంతో సత్యాగ్రహోద్యమంలో పాల్గొనేందుకు మాత్రమే స్థానిక ప్రతినిధిగా తంజావూరును ఎన్నుకున్నట్టు ముహమ్మద్ హనీఫ్ చెప్పుకున్నారు.

( '..I deliberately choose Tanjzvur as venue of my activity since I wanted to offer Sathyagraha, court arrest and go to jail.' In Retrospect, Volume No.5, Inguva Mallikarjuna Sarma,Ravi Sasi Enterprises, Hyderabad, 2003, P. 222)

ఆ సంకల్పానికి అనుగుణంగా ఆయన ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ధరించిన గాంధీ టోపీని పోలీసులు లాగివేశారు. ముహమ్మద్ హనీఫ్ వయస్సులో చిన్నవారైనప్పటికి టోపీని బలవంతంగా లాగివేయడాన్ని అవమానంగా భావించి పోలీసులతో ఘర్షణకు దిగారు. ఆ దృశ్యాన్ని చూసిన సహచర సత్యాగ్రహ మిత్రులు కూడా పోలీసుల మీద ఎగబడి వారిని నెట్టివేస్తూ ఆందోళనకు దిగారు. ఈ సంఘటన చాలా అలజడి సృష్టించింది. సత్యాగ్రహ కార్యకర్తలను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీలను ఝుళిపించారు. చివరకు ముహమ్మద్ హనీఫ్‌ను ఆదుపులోకి తీసుకుని తీవ్రంగా హింసించి 15రోజుల పాటు కస్టడీలో ఉంచుకున్నారు. ఆ విషయం తెలిసిన తల్లితండ్రులు తమ పలుకుబడిని ఉపయోగించి, అధికారులను ప్రసన్నం చేసుకున్న మీదట ఆయన పోలీసుల చెర నుండి విడుదలయ్యారు. (Ibid. Page.222)

ఆ సంఘటనతో ముహమ్మద్ హనీఫ్‌కు మద్రాసులో మంచి ప్రాచుర్యం లభించింది. ఆశ్చర్యకరమైన రీతిలో హనీఫ్ జాతీయోద్యమ కార్యక్రమాలలో భాగంగా ప్రత్యక్ష కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొంటున్నప్పటికి వయస్సురీత్యా మైనరు కావడంతో పోలీసుల అరెస్టు నుండి తప్పించుకున్నారు కానీ పోలీసుల హింస మాత్రం తప్పలేదు. ఈ విధంగా పలు సంఘటనలలో చురుగ్గా పాల్గొంటున్న ఆయనను పలుమార్లు అదుపులోకి తీసుకున్న పోలీసులు చితకబాదినా ఆయన మాత్రం తన మార్గాన్ని మార్చుకోలేదు. జాతీయోద్యమ కార్యక్రమాలలో ఎన్నడూ పాల్గొనరాదని పోలీసులు బెదిరించినా భయమంటే ఎరుగని ఆయన యధాప్రకారంగా తన కార్యకలాపాలలో మరింత చురుకుగా పాల్గొంటూ ఇటు ప్రజల అటు జాతీయోద్యమ నాయకుల అభిమానానికి పాత్రుడయ్యారు.

జాతీయోద్యమంలో పాల్గొంటూనే తన చదువును కొనసాగిస్తున్న ముహమ్మద్ హనీఫ్ పెరంబూరులోని కన్నం చెట్టియార్ ఉన్నతపాఠశాల నుండి ముత్యాలపేట ఉన్నత పాఠశాలలో చేరి తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. ఆనాటి ఉద్యమ కార్యకలాపాల రోజుల్లో ముహమ్మద్ హనీఫ్ లాంటి యువకులు తమ జేబుల్లో జాతీయ పతాకం, చేతిలో బెత్తం లాంటి కర్రను కలిగిఉండేవారు. ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు జేబులోని జాతీయ పతాకాన్ని బెత్తానికి తగిలించి గాలిలో ఎగురవేస్తూ ఉత్సాహంగా ఉరకలెత్తడం విద్యార్థుల అలవాటు. ఈ మేరకు హనీఫ్ అయన సహచరులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి, 1931లో మోతీలాల్ నెహ్రూ మృతికి సంతాపం సూచకంగా మద్రాసులో అప్రకటిత హర్తాల్ చేయించారు. ఆ సందర్భంగా తమ పాఠశాలలో సంతాప సభను నిర్వహించాలని ఆయన నిర్ణయించారు. ఆ సభకు రాజాగోపాలాచారిని వక్తగా ఆహ్వానించారు. ఏ కారణంగానో ఆయన రానన్నా, పట్టుబట్టి మరీ ఆయన్నే తీసుకొచ్చి సభను విజయవంతం చేశారు. ఏ కార్యక్రమాన్నైనా ఎంతో కార్యదక్షతతో నిర్వహిస్తూ హనీఫ్ ప్రజల మన్నన పొందారు.

జాతీయోద్యమ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్న ముహమ్మద్ హనీఫ్‌కు గుమ్మడిదల దుర్గాబాయమ్మతో మంచి పరిచయం ఏర్పడింది. విదేశీవస్తువుల బహిష్కరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న ఆమెతో కలసి ముహమ్మద్ హనీఫ్ కూడా పలు కార్యక్రమాలలో భాగస్వాములయ్యారు. ఆ సందర్భంగా ఒక కార్యక్రమంలో పోలీసులు ఆయన మీద విరుచుక పడ్డారు, చాలా గందరగోళం జరిగింది. నిర్భయుడైన హనీఫ్ పోలీసుల లాఠీలకు ఏమాత్రం బెదరలేదు.

జాతీయభావాలను తండ్రి నుండి పుణికిపుచ్చుకున్న ముహమ్మద్ హనీఫ్ ఆంగ్లేయాధికారుల పట్ల వ్యతిరేకతను ప్రత్యక్షంగా ప్రదర్శించేవారు. ఆంగ్లేయాధికారి మన్రో (Munroe) చర్యల పట్ల ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఆ నిరసనలో భాగంగా మద్రాసులోని నాలుగు మూలల కూడలిలో ఆంగ్లేయాధికారి మన్రో (Munroe) శిలా విగ్రహాన్ని తొలగించాలని నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయం మేరకు విగ్రహాన్ని విధ్వంసం చేస్తుండగా అనుకోకుండా ఆంగ్లేయుల సైన్యం అటుగా వచ్చింది. ఆ సైనికపటాలాన్ని చూసిన హనీఫ్ సహచరులు ఆయన మీద ఒత్తిడి తెచ్చి ఆ ప్రయత్నాన్ని విరమింపచేశారు.

ఈ విధంగా ఇంతింతై వటుడింతై అన్నట్టు స్వాతంత్ర్యోద్యమంలో పూర్తిస్థాయిలో భాగస్వామి అవుతున్న ముహమ్మద్ హనీఫ్ కార్యకలాపాలను గమనించిన హితైషులు ఆయన తండ్రి షేక్ మీరా సాహెబ్‌కు ఫిర్యాదు చేశారు. మీరా సాహెబ్ కూడా స్వేచ్ఛా- స్వాతంత్ర్యాల అభిలాషి కావడంతో కుమారుడ్ని నియంత్రించలేదు. ఆయన కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకమూ కల్పించలేదు. ఆ కారణంగా చిన్నతనంలోనే జాతీయోద్యమంలో ప్రవేశించిన ముహమ్మద్ హనీఫ్ తన కార్యకలాపాలను మరింతగా ఉధృతం చేశారు.

1932 ద్వితీయ శాసనోల్లంఘన కార్యక్రమానికి మహాత్ముడు పిలుపిచ్చారు. మద్రాసు కేంద్రంగా జాతీయోద్యమంలో చురుకుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ముహమ్మద్ హనీఫ్ ఆ పిలుపుకు స్పందించి, ఆ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేందుకు సమాయత్తం కాసాగారు. ఆ సమయంలో ముహమ్మద్ హనీఫ్ కుటుంబం మద్రాసు నుండి ఆంధ్రప్రదేశ్‌లోని గరికపాడుకు తరలి వచ్చేసింది. ఆయన కూడా తల్లితండ్రులతో సహా మద్రాసు నుండి గరికపాడు వచ్చేశారు. అనూహ్యంగా జరిగిన మార్పుతో హనీఫ్ కార్యకలాపాలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. జాతీయోద్యమ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటూ ఆయన చదువును పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఆ కారణంగా 1932 నాటికి అతికష్టం మీద ముహమ్మద్ హనీఫ్ 'ఫిఫ్త్ ఫారం' మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

గరికపాడులో కొంతకాలం గడిపిన ముహమ్మద్ హనీఫ్ కుటుంబం 1934లో మళ్ళీ మద్రాసుకు చేరుకుంది. మద్రాసులో మీరా సాహెబ్ స్వంత వ్యాపారం ప్రారంభించారు.

ఆ వ్యాపారంలో తండ్రికి సహకరిస్తూ గడిపిన ముహమ్మద్ హనీఫ్ తిరిగి జాతీయోద్యమ కార్యక్రమాలలో పాల్గొనడం పట్ల ఆసక్తి చూపారు. 1936 నాటి ఎన్నికలలో జాతీయ కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి ఆయన ఎంతో కృషిచేశారు. ఆ తరువాత జరిగిన 1939 నాటి వ్యక్తి సత్యాగ్రహంలో ఆయన పాల్గొనాలని అనుకున్నారు. ఆ సత్యాగ్రహంలో స్వేచ్ఛగా ప్రతి ఒక్కరూ పాల్గొనే అవకాశం లేకుండా, వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొనేందుకు స్థానిక కాంగ్రెస్ కమిటి అనుమతి తీసుకోవాలని, కమిటీ అనుమతి ఉన్నవారు మాత్రమే సత్యాగ్రహంలో పాల్గొనాలని విధించబడిన నిబంధనను ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై తన మిత్రుడు చక్రపాణిరెడ్డి, సహచరులతో కలసి కాంగ్రెస్ నేతలతో వాగ్వ్యయుద్ధానికి దిగారు. ఆ కారణంగా మహమ్మద్ హనీఫ్ వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొనలేకపోయారు.

1940లో ముహమ్మద్ హనీఫ్ తల్లి చనిపోయాక ఆయన కుటుంబం తిరిగి ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లకు ఆరు కిలోమీటర్ల దూరంలో గల నరసాయపాలెం చేరుకుంది. ఆ సమయంలో కమ్యూనిస్టు ఉద్యమకారులు కొల్లా వెంకయ్య, దున్నా అశీర్వాదం లాంటి ప్రముఖులతో హనీఫ్‌కు పరిచయం కలిగింది. ఆ పరిచయంతో ఆయన కూడా కమ్యూనిస్టుగా మారారు. 1941లో బాపట్ల మున్సిపల్ వర్కర్ల స్థితిగతులను మెరుగుపర్చేందుకు తన సహచరుడు చివుకుల శేషయ్యశాస్త్రితో కలసి ఆయన మున్సిపల్ వర్కర్ల యూనియన్ స్థాపించారు. ఆనాటి నుండి ప్రజాసంఘాలను ఆరంభించడం, పలు ప్రజాసంఘాలలో ప్రవేశం పొంది ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం ఆయన అనుదిన కార్యక్రమం అయ్యింది.

1939లో ఆరంభమైన ద్వితీయ ప్రపంచ సంగ్రామాన్ని వ్యతిరేకిస్తూ సాగిన యుద్ధ వ్యతిరేక ఉద్యమంలో ముహమ్మద్ హనీఫ్ చురుగ్గా పాల్గొన్నారు. బాపట్ల రైల్వేగేటును ధ్యంసం చేశారన్న నేరాన్ని ఆపాదించి పోలీసులు ఆయనను నిర్బంధించారు. 1942 నాటికి జాతీయోద్యమ రంగం మీదకు క్విట్ ఇండియా ఉద్యమం వచ్చింది. ఈ ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం మేరకు ఆయన చురుకుగా పాల్గొనకపోయినప్పటికి క్విట్ ఇండియా ఉద్యమకారులకు అన్నివిధాల చేయూతనిచ్చారు.

1942లో గాంధీజీ-జిన్నా చర్చలు విఫలమయ్యాక ఏర్పడిన ప్రత్యేక పరిణామాల ఫలితంగా పాకిస్థాన్ డిమాండ్ ఊపందుకుంది. ఆ కారణంగా క్రమక్రమంగా ముస్లింలీగ్ బలపడ సాగింది. ఆ సమయంలో ముస్లింలీగ్‌లో ప్రవేశం పొంది, వామపక్ష భావాలకు అనుకూలంగా ముస్లింలలో మార్పుతెచ్చేందుకు, కమ్యూనిజం పట్ల వారిలో ఉన్న వ్యతిరేకతను తగ్గించేందుకు కమ్యూనిస్టు పార్టీలో చురుగ్గా పనిచేస్తున్న ముస్లిం యువకులను పార్టీ ప్రోత్సహించింది (Ibid. Page.227). ఆ ప్రయత్నాల నుండి దూరంగా ఉండిపోయిన ముహమ్మద్ హనీఫ్ ఎన్నడూ, ఏకారణంగానైనా ముస్లింలీగ్‌లో చేరలేదు.

1946 ప్రాంతంలో ప్రముఖ కమ్యూనిస్టు నేత వేములపల్లి శ్రీకృష్ణ నేతృత్వంలో ముహమ్మద్ హనీఫ్ ఆధునిక పద్ధతిలో దండలు మార్చుకుని వివాహం చేసుకున్నారు. మతపరమైన వివాహవిధానాన్ని పాటించలేదని స్వజనులు ఆయన వివాహాన్ని బహిష్కరించినా తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడిన వ్యక్తిగా ముహమ్మద్ హనీఫ్ నిబద్ధతతో నిలిచారు. అభ్యంతరాలు, అటంకాలు ఎన్ని వచ్చిన తాను నమ్మిన సిద్ధాంతాల పట్ల నిబద్దతతో నిలవడం మాత్రమే కాకుండా ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొనడం, వానిని నిర్వహించడంలో మహమ్మద్ హనీఫ్ ఎప్పుడు కూడా వెనుకాడలేదు.

1946లో తొలిసారిగా ఆంధ్రలో మున్సిపల్ వర్కర్ల సమ్మెను ముహమ్మద్ హనీఫ్ నిర్వహించారు. మున్సిపల్ వర్కర్ల నాయకులుగా ఆయన తన సహచరులతో కలసి సమ్మెను విజయవంత చేసి మున్సిపల్ వర్కర్ల డిమాండ్లను సాధించుకున్నారు. కమ్యూనిస్టు ఉద్యమకారునిగా  పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్యలతోనూ, జాతీయోద్యమ కార్యకర్తగా రాజగోపాలాచారి, కామరాజ్ నాడర్ లాంటి నేతలతో మంచి సంబంధాలు నెరపిన ముహమ్మద్ హనీఫ్ ఇటు స్వాతంత్ర్య సమరయోధునిగా జాతీయోద్యమంలో అటు కమ్యూనిస్టుగా ప్రజాఉద్యమాలలో చిరస్మరణీయమైన పాత్ర నిర్వహించారు.

స్వతంత్ర భారత దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా మతసామరస్యాన్ని పటిష్టం చేసే క్రమంలో చివరి వరకు కృషిచేశారు. అన్ని సాంఘిక జనసమూహాలతో నెయ్యం చేస్తూ ఆయావర్గాల ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తూ, ఆ ప్రయత్నాలలో భాగంగా పోరాటాలలో భాగస్వాములవుతూ, కష్టాలు నష్టాలను అధిగమిస్తూ చివరివరకు ప్రజల మనిషిగా నిలచిన ముహమ్మద్ హనీఫ్ 1990లో కన్నుమూశారు.

◆◆◆

' It is one of the greatest frauds on the people to suggest that religious affinity can unite all areas, which are geographically, economically, linguistically and culturally different. It is true that Islam sought to establish a society, which transcends racial, linguistic, and economic and political frontiers. History however proved that after the few decades or at most after the first century Islam not able to unite all the Muslim countries on the basis of Islam alone..'

- Moulana Abul Kalam Azad



## మాతృదేశ సేవకు సర్వం సమర్పించిన త్యాగశీలి

# 33. ముహమ్మద్ గౌస్ ఖాతూన్

(-1990)

స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యక్ష, పరోక్ష కార్యాచరణ కలిసికట్టుగా సాగింది. ప్రత్యక్ష కార్యక్రమాలలో ధైర్యసాహసాలు ప్రధానం కాగా, పరోక్ష కార్యకలాపాలకు సమర్పణ, సహనం, ఓర్పు, సాహసం త్యాగాలు పంచప్రాణాలు. ఈ మేరకు పరోక్ష కార్యాచరణలో భాగంగా త్యాగాల బాటలో నడిచిన మహిళలలో మహమ్మద్ గౌస్ ఖాతూన్ ఒకరు. ఆమె ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు ముహమ్మద్ గౌస్ బేగ్ జీవిత సహచరిణి.

భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ప్రత్యేకస్థానం పొందడమేకాక, మహాత్ముని అభినందనలు అందుకున్న **చీరాల-పేరాల పోరాటం, పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం, ఉప్పుసత్యాగ్రహం**లో ప్రత్యేక పాత్ర నిర్వహించిన ముహమ్మద్ గౌస్ బేగ్ జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఖాతూన్ బీబి మాత్రం ప్రత్యక్షంగా జాతీయోద్యమ కార్యక్రమాలలో పాల్గొనలేదు. ఆమె ముహమ్మద్ గౌస్ బేగ్‌కు అన్నివిధాల అండదండలుగా నిలవటమే కాక, జాతీయోద్యమ నేతలు భోగరాజు పట్టాభి సీతారామయ్య, దుర్గాబాయమ్మ, టంగుటూరి ప్రకాశం పంతులు లాంటి ప్రముఖులకు తన ఇంట ఆతిధ్యం కల్పించి ఆదుకున్నారు. భారత జాతీయ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల పట్ల ఖాతూన్ ఎంతో ఆదరణ, ఆప్యాయతలు చూపారు. జాతీయోద్యమ కాలంలో ఆమె ఇల్లు జాతీయోద్యమ నేతలకు, ఉద్యమకారులకు స్వంత గృహం లాగుండేది.

1921 నాటి ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమంలో మహమ్మద్ గౌస్ బేగ్‌ను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసి ఒక సంవత్సరం జైలు, వెయ్యి రూపాయల జరిమానా విధించింది. జరిమానా కట్టడానికి డబ్బు కావాల్సి వచ్చింది. చేతిలో చిల్లిగవ్వలేని సమయంలో ఖాతూన్ తన ఆభరణాలను అమ్మి జరిమానా కట్టారు. ఆ తరువాత మరోసారి గుంటూరు జిల్లా, పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర వహించిన గౌస్ బేగ్‌ను ప్రభుత్వం అరెస్టు చేసి, సంవత్సరం జైలు, వెయ్యిరూపాయల జరిమానా విధించింది. ఆ సమయంలో కూడా ఖాతూన్ తన వంటి మీద ఉన్న బంగారు ఆభరణాలను అమ్మగా వచ్చిన సొమ్ముతో జరిమానా కట్టారు. ఆడంబరాలెరుగని గౌస్ ఖాతూన్ అప్పటి నుండి తన జీవితంలో మరెప్పుడూ బంగారం ధరించలేదు.

శాసనోల్లంఘన ఉద్యమంలో గుంటూరు జిల్లా ఉద్యమ బాధ్యతలను గౌస్ బేగ్ సమర్థవంతంగా నిర్వహించారు. అందుకు ఆగ్రహించిన ప్రభుత్వం ఆయన చరాస్థిని వేలం వేసి, లభించిన నగదును జరిమానా క్రింద జమ చేసుకుంది. ఆ కారణంగా ఆర్థిక ఇక్కట్లు చుట్టుముట్టినా ఖాతూన్ ఏ మాత్రం చలించక పోగా మాతృభూమి రుణం తీర్చుకునే అవకాశం ఈ విధంగానైనా లభించిందని సంతోషించారు. బంగారం, నగదు నట్రా, పొలం పుట్రా అంతా కర్పూరంలా కరిగిపోతున్నా, పేదరికం చుట్టుముడుతున్నా గౌస్ ఖాతూన్ బేఖాతర్ అన్నారు. మాతృభూమి కోసం సర్వం త్యాగం చేయగలిగిన అదృష్టం తమకు లభించిందంటూ ఆ దంపతులు ఆనందించారు.

జాతీయోద్యమంలో పాల్గొంటున్న కార్యకర్తలు, నాయకులు తమ తమ కుటుంబాలను వదలి వచ్చి బ్రిటీష్ ప్రభుత్వపు క్రూరత్వానికి గురవుతున్నప్పుడు, ఆ మాత్రం సేవలందించి మాతృభూమి రుణం తీర్చుకోలేకపోతే ఎలా? అంటూ ప్రశ్నించిన గౌస్ ఖాతూన్ భర్త పలుమార్లు జైలు పాలైన, లాఠీ దెబ్బలను రుచిచూసిన ప్రతిసారి ఆమె ఎంతో గర్వించారు. స్వదేశీ వస్త్రధారణకు, స్వదేశీ వస్తు వినియోగానికి ఆమె అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఖాదీ ప్రచారంలో ఆమె ఎంతో శ్రద్ధగా పాల్గొన్నారు. జీవితాంతం భర్తతోపాటుగా ఆమె కూడా ఖద్దరు ధరించారు. ఆమె భర్త మహమ్మద్ గౌస్ బేగ్ 1976లో మరణించగా గౌస్ ఖాతూన్ 1990 నవంబరు 20న తనువు చాలించారు.

◆◆◆

The British rulers are like dogs. If you kick them, they will lick you, but if you lick them, they will kick you.

- Yusuf Meharaly



## భారత దేశంలో తొలి మహిళా మంత్రిగా చరిత్ర సృష్టించిన

# 34. మాసుమా బేగం

(1902-1990)

**జా**తీయోద్యమంలో భాగస్వాములవడం తోపాటు స్వతంత్ర భారత ప్రభుత్వంలో కూడా బాధ్యతలు నిర్వహించగల భాగ్యాన్ని దక్కించుకున్న అదృష్టవంతులకు అతికొద్ది మంది స్వాతంత్ర్యసమరయోధులలో మాసుమా బేగం ఒకరు.

**ఆంధ్రప్రదేశ్ తొలి మంత్రివర్గంలో తొలి మహిళా మంత్రి, తొలి ముస్లిం మంత్రి, మొత్తం భారత దేశంలోనే మంత్రిపదవిని నిర్వహించిన తొలి ముస్లిం మహిళ** మాసుమా బేగం 1902 అక్టోబరు 7న ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌లో జన్మించారు. తల్లి తయ్యిబా బేగం బిల్‌గ్రామి (Tayyiba Begum)**.** తండ్రి పేరు ఖదీవ్ జంగ్ (Khedv Jung). తాత సయ్యద్ హుస్సేన్ బిల్‌గ్రామి (Syyid Husain Bilgrami).

చిన్నతనం నుండి విద్యావంతురాలు, సంఘసేవకురాలయిన తల్లి తయ్యిబా బేగం బిల్‌గ్రామి ద్వారా మాసుమా బేగం ప్రభావితురాలయ్యారు. స్వతంత్రభావాలు గల మహిళగా తయ్యిబా బేగం పత్రికలలో వ్యాసాలు రాయడం మాత్రమే కాకుండా మహిళల జీవితాలకు సంబంధించిన అంశాలను ఇతివృత్తంగా తీసుకుని నాలుగు నవలలు కూడా వెలువరించిన రచయిత్రి. మాసుమా బేగం తండ్రి ఖదీవ్ జంగ్ వైద్యశాఖలో ఉప డైరక్టరుగా పనిచేశారు. ఆమె సోదరుడు అలీయావర్ జంగ్ హైదరాబాదు ప్రభుత్వంలో విద్యామంత్రిగా, ఆ తరువాత ఈజిప్టు, యుగోస్లోవియాలలో భారత రాయబారి పదవిని నిర్వహించారు. ఆయన మహారాష్ట్ర

గవర్నర్‌గా సత్కీర్తి పొందారు. ఆమె వంశంలోని అకిల్ జంగ్ పి.డబ్ల్యూ.డి మంత్రిగానూ, ఆమె మేనమామ మోహీద్దీన్ యార్‌జంగ్ గుజరాత్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

తయ్యిబా బేగం బిల్‌గ్రామి  పెద్ద కుమార్తెగా మాసుమా బేగం జన్మించారు. ఆమె తన చెల్లెళ్ళతో హైదరాబాద్‌లోని మహబూబియా బాలికల పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తూ చిన్ననాటనే మంచి ప్రతిభగల విద్యార్థిగా గుర్తింపు పొందారు. ఉన్నత పాఠశాల విద్యార్థినిగా ఆమె చూపిన ఉర్దూ భాషలో పాండిత్యానికి బంగారు పతకం సాధించారు.

1922లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చదివిన తమ సమీప బంధువు హుసైన్ అలీ ఖాన్‌ను మాసుమా బేగం వివాహం చేసుకున్నారు. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం అధిపతిగా పనిచేశారు. డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు లాంటి ప్రముఖులకు గురువుగా గణనకెక్కారు. అంతటి విద్వత్తు, స్వతంత్ర, ఉదార భావాలు గల వ్యక్తి భర్తగా లభించడంతో చిన్నతనం నుండి సమాజ సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి చూపిన మాసుమా బేగం ఆ బాటలో ఇనుమడించిన ఉత్సాహంతో మరింత ముందుకు సాగారు.

తొమ్మిది సంవత్సరాల వయస్సులో 'లేడి హైదరి క్లబ్' సభ్యురాలిగా సంఘసేవా కార్యక్రమాలలో ప్రవేశించిన మాసుమా ఆ దిశగా అవిశ్రాంతంగా శ్రమిస్తూ వచ్చారు. సంఘసేవా కార్యక్రమాలతో పాటుగా, విద్యావ్యాప్తికి ఆమె నడుం కట్టారు. మహిళల్లో చైతన్యాన్ని చదువు ద్వారా సాధించవచ్చని, సమస్యల పరిష్కారానికి విద్య ఇతోధికంగా తోడ్పడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. సమాజసేవా కార్యక్రమాల నిర్వహణ ద్వారా లభించిన అనుభవం మేరకు అన్ని సామాజిక రుగ్మతలకు నిరక్షరాస్యత ప్రధాన కారణమని భావించిన ఆమె ఆ రంగాన్ని ప్రధానంగా ఎంచుకున్నారు. 1921లో విద్యావ్యాప్తి ప్రధాన లక్ష్యంగా గల **అంజుమన్–యే–ఖవాతీన్** సంస్థకు అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. విద్యా, సాంఘిక సేవా సంస్థల ఏర్పాటుకు కృషిచేయడమే కాకుండా ఆయా సంస్థల కార్యక్రమాలకు నిర్వహణకు తన అత్యధిక సమయాన్ని కేటాయించారు.

1927లో అఖిల 'భారత మహిళా సంస్థ' హైదరాబాద్ శాఖ ఏర్పాటు చేసి, పలు బాధ్యతలను నిర్వహించారు. ఆ సందర్భంగా మహిళలచే అఖిల భారత మహిళా సంస్థ శాఖలను ప్రారంభింపచేసి ఆ సంస్థ కార్యకలాపాలను స్వయంగా పర్యవేక్షించారు. ఆమె నిర్వహించిన సేవలకు గుర్తింపుగా అఖిల భారత మహిళా సంస్థ ఉపాధ్యక్ష పదవి ఆమెకు లభించింది. ఆ తరువాత 1962–64లో అఖిల భారత మహిళా సంస్థ అధ్యక్షురాలయ్యారు. 1963లో లండన్ విమన్స్ కాన్ఫెరెన్స్ ఆహ్వానం మీద లండన్ వెళ్ళారు. అక్కడ ఆమె గౌరవార్థం హౌస్ ఆఫ్ కామన్స్‌లో భారీ విందు ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా మాసుమా బేగం చేసిన ప్రసంగం ప్రముఖులను ఆకట్టుకుంది. ప్రపంచ వ్యాప్తంగా పలు

ప్రాంతాలను విస్తృతంగా పర్యటించి పలు అంతర్జాతీయ వేదికల మీద భారతీయ మహిళలకు ఆమె ప్రాతినిధ్యం వహించారు.

సామాజికసేవా కార్యకర్తగా జాతీయోద్యమంలో భాగంగా సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు కృషిచేయడమే కాకుండా ఆనాటి రాజకీయల మీద దృష్టి సారించిన మాసుమా బేగం భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాల పట్ల ఆసక్తి చూపారు. జాతీయోద్యమంలో భాగంగా ఉనికిలోకి వచ్చిన పలు సంస్థలలో ఆమె సభ్యురాలయ్యారు. ఈ మేరకు పలు కార్యక్రమాలలో పాల్గొంటూ అటు ప్రజల అభిమానం, మద్దతుతోపాటుగా ఇటు ప్రముఖ నేతల గుర్తింపు, మన్నన పొందారు.

ఆ కారణంగా స్వతంత్ర భారతదేశం అవతరించాక 1952లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మాసుమా బేగంను కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఆమె షాలిబండ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎన్నికల బరిలో దిగారు. ప్రముఖ కవి, కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, కార్మికనేత మగ్దూం మోహిద్దీన్‌తో ఆమె పోటీపడ్డారు. ఆ ఎన్నికలలో ఏడు వందల 74 ఓట్ల ఆధిక్యతతో మాసుమా బేగం విజయం సాధించారు.

ఆ తరువాత 1957లో మరోసారి అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమె పోటీ చేసి గెలిచారు. ఈసారి ఫత్తర్‌ఘట్టీ అసెంబ్లీ నుండి ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు అఖ్తర్ హుస్సేన్ మీద 513 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. ఈ ఎన్నికల సందర్భంగా ఆమె నిర్వహించిన ప్రచారం తీరు ప్రజలను అమితంగా ఆకట్టుకుంది. ప్రతిరోజు వేకువ ఝామున ప్రచారానికి బయలుదేరి ప్రత్యర్థులు ప్రచారానికి జనంలోకి వచ్చేలోగా ఆమె తన ప్రచారాన్ని ముగించడం విశేషం. (Secluded Scholors, Gail Minault,OUP, New Delhi, 1999, Page. 272-273).

ఈ విజయాల వలన మాసుమా బేగంకు ఎనలేని కీర్తిప్రతిష్టలను తెచ్చిపెట్టిన పదవులు లభించాయి. 1957లో Congress Legislative Party Deputy Leader గా ఆమె నియమితులయ్యారు. ఆ సంవత్సరంలోనే Member-in-Charage-International Relations గా ఆమె ఎంపికయ్యారు. ఆ పదవిలో ఆమె తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రముఖుల ప్రశంసలను అందుకున్నారు. (The Legend Makers Some-Eminent Muslim Women of India, Gouri Srivastava, Concept Publishing Company, New Delhi, 2003, Page. 91)

ఆ తరువాత 1960లో ప్రముఖ కాంగ్రెస్ నేత దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలో ఆమె సాంఘిక సంక్షేమశాఖ, ముస్లిం ఎండోమెంట్స్ శాఖా, సాలార్‌జంగ్ ఎస్టేట్ నిర్వహణల శాఖామంత్రి అయ్యారు. ఈ విధంగా భారతదేశం మొత్తం మీద

ముస్లిం మహిళా మంత్రిగా గల మంత్రివర్గం ఏర్పడిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రకెక్కింది. ఈ పదవిలో 1960 నుండి 1962 వరకు ఆమె కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ తొలి మంత్రివర్గంలో తొలి మహిళా మంత్రిగా, తొలి ముస్లిం మంత్రిగా, మొత్తం భారతదేశంలోనే మంత్రిపదవిని నిర్వహించిన తొలి ముస్లిం మహిళగా మాసుమా బేగం చరిత్ర సృష్టించారు.

1962లో మరోమారు ఫతర్‌ఘట్టీ నియోజకవర్గం నుండి స్వతంత్ర అభ్యర్థి సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆమె పరాజితులయ్యారు. అప్పటి నుండి ఆమె రాజకీయాలకు దూరంగా ఉంటూ సమాజ సేవాకార్యక్రమాలకు పరిమితం అయ్యారు. ప్రభుత్వపరంగా వివిధ మహిళా, శిశు సంక్షేమ సంస్థలు, విద్యావ్యాప్తి కోసం ఏర్పడిన సంఘాలు, సంస్థలలో ఆమె బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని **అంజుమన్-యే-ఖవాతీన్, లేడీ హైదరీ క్లబ్** లాంటి సేవాసంస్థలో ప్రధాన సభ్యురాలుగా, **రెడ్‌క్రాస్** సంస్థ కార్యనిర్వాహక సమితి సభ్యురాలిగా బాధ్యతలు నిర్వహించారు.

1966లో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా-శిశు సంక్షేమ సమితికి ఆమె సభ్యురాలయ్యారు. చిన్నతనం నుండి పసిపిల్లల ఆరోగ్యం, విద్య తదితర అంశాల మీద ప్రధానంగా దృష్టి నిల్పి పనిచేసిన మాసుమా బేగం కృషి వలన పిల్లల పెంపకం విషయంలో తల్లులను సుశిక్షితులను చేయడం, పిల్లల అభివృద్ధిపట్ల అత్యధిక శ్రద్ధ చూపాల్సిన అవసరాన్ని గుర్తించడం, ఆ దిశగా మాసుమా బేగం కృషి చేయడం వలన యూనిసెఫ్ సహకారంతో మన దేశంలో పలు నూతన శిశు సంక్షేమ పథకాలు అమలులోకి వచ్చాయి.

మంచి వక్త, కార్యదక్షురాలుగా ఖ్యాతిగాంచిన మాసుమా బేగం అఖిల భారత మహిళా సంస్థ నేతగా 1957లో కొలంబో, అఖిల భారత మహిళా సంస్థ ప్రతినిధి మండలి డిప్యూటీ నాయకురాలిగా 1959లో రష్యా, ఐక్యరాజ్యసమితి సమావేశాలకు జెనీవా వెళ్ళి వచ్చారు. ఆ తరువాత యుగస్లోవియా, ఇండోనేషియాలలో పర్యటించారు. 1972లో ఆమె మరోమారు జెనీవా వెళ్ళారు. భారతీయ మహిళల ప్రతినిధిగా ప్రపంచంలో ఎక్కడకు వెళ్ళినా ప్రతిఒక్కరి మన్ననలు పొందిన మాసుమా బేగం దేశ ప్రతిష్టను మరింతగా ఇనుమడింప చేశారు.

అటు జాతీయోద్యమంలో పాల్గొనడమే కాకుండా, స్వాతంత్ర్యం లభించినాక రాజకీయ రంగాన, ఇటు సేవారంగాన మాత్రమే కాకుండా సాహిత్య రంగాన కూడా తనదైన కృషితో అగ్రగామి అన్పించుకున్న మాసుమా బేగం 1990లో కన్నుమూశారు.

◆◆◆



## సాంఘిక బహిష్కరణలకు వెరవని ధీమంతురాలు

# 35. హాజరా బీబి ఇస్మాయిల్

(-1994)

**జీ**విత భాగస్వాములతో పాటుగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని త్యాగాలతో చరిత్ర సృష్టించిన మహిళల జీవితవిశేషాలను కొంతవరకు జాతీయోద్యమ చరిత్ర మనకు అందిస్తుంది. బానిస బంధనాల విముక్తికోసం పోరాడుతున్న సహచరుడికి తోడుగా నిలచి, భర్త కన్నుమూసినప్పటికీ, ఆయన నడిచిన సన్మార్గం వీడకుండా, ముందుకు సాగిన అరుదైన మహిళామణులలో హాజరా బీబి ఒకరు.

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మహమ్మద్ ఇస్మాయిల్ సాహెబ్ గుంటూరు జిల్లా తెనాలి కేంద్రంగా జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఆయన భార్య హాజరా బీబి. గాంధీజీ ప్రబోధంతో ప్రభావితులై ఖద్దరు ప్రచారోద్యమంలో ఆ దంపతులు అమితోత్సాహంతో పాలుపంచుకున్నారు. గుంటూరు జిల్లాలో తొలి **ఖద్దరు దుకాణం** ప్రారంభించి, ఖద్దరు ప్రచారంలో నిత్యం నిమగ్నమై ఉండే భర్తకు హాజరా బీబి అన్నివిధాల తోడ్పాటునిచ్చారు.

ఆనాడు తెనాలిలో ముస్లింలీగ్ ప్రభావం కొంత మేరకు ఉండేది. మహమ్మద్ ఇస్మాయిల్ దంపతులు భారత జాతీయ కాంగ్రెస్‌లో కొనసాగడం, గాంధీజీ విధానాల పట్ల అత్యంత గౌరవభావంతో ఉండడం ముస్లింలీగ్ కార్యకర్తలకు, అభిమానులకు ఇష్టం లేకపోయింది. ఆ కారణంగా ఆ దంపతులు అవస్థలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ సమయంలో

హాజరా బీబి ఎంతో ఓర్పుతో కుటుంబ వ్యవహారాలను సరిచూసుకుంటూ, తన ఇంటికి వచ్చే జాతీయోద్యమ కార్యకర్తలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ భర్తకు అన్నివిధాల అండగా నిలిచారు.

**ఖద్దరు విక్రయశాల** ఆరంభించి, **ఖద్దరు ఇస్మాయిల్**గా ప్రసిద్ధిగాంచిన మహమ్మద్ ఇస్మాయిల్ పలుసార్లు జైలుకు వెళ్ళినా హాజరా అధైర్యపడలేదు. జాతీయోద్యమ కార్యకర్తగా ఆయన జైలుకు వెళ్ళడమే ఎంతో గౌరవంగా భావించిన ఆమె భర్తను ఆ దిశగా మరింత ప్రోత్సహించారు. పిల్లలకు జాతీయవిద్యను అందించాలన్న లక్ష్యంతో స్వసమాజం నుండి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా, ఆడబిడ్డలను జాతీయ విద్యాబోధన గావించే హిందీ పాఠశాలకు పంపారు. ఈ పద్ధతులు నచ్చని వ్యక్తులు ఇస్మాయిల్ కుటుంబాన్ని అప్రకటిత సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. ఆ చర్యకు ఆమె ఏ మాత్రం చలించలేదు. భర్త ఇస్మాయిల్‌గాని తాను గాని నడుస్తున్నది మహాత్మా గాంధీ మార్గంలో కనుక ఎవరు ఏమనుకున్నా, ఏమి చేసినా ఎదుర్కోవడం తప్ప గాంధీబాట నుండి వెనుదిరిగేది లేదని స్థిరంగా నిర్ణయించుకుని, ఆ నిర్ణయం ప్రకారంగా హాజరా ముందుకు సాగారు.

జాతీయోద్యమంలో మహమ్మద్ ఇస్మాయిల్ సంవత్సరాల పాటు జైలుశిక్షలను అనుభవించారు. చివరిసారిగా జైలులో అనారోగ్యం పాలై, ఆ తరువాత 1948లో కన్నుమూశారు. ఆయన కన్నుమూశాక స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే భూమిని ప్రభుత్వం ఆమెకు సంక్రమించ చేయదలచింది. ఈవిషయాన్ని అధికారులు ఆమెకు తెలియబర్చారు. స్వాతంత్ర్య సమరయోధురాలుగా తమ దేశభక్తిని ప్రభుత్వం ఇచ్చే భూమితో విలువ కట్టడం ఇష్టం లేని ఆమె ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరించారు.

ప్రభుత్వం ఇస్తానన్న భూమిని తిరస్కరించడం మాత్రమే కాకుండా తన భర్త జీవించి ఉండగా తెనాలి సమీపాన గల కావూరు వినయాశ్రమానికి భూమి ఇస్తానని చేసిన వాగ్దానాన్ని నెరవేర్చేందుకు ఆమె ముందుకు వచ్చారు. ఖద్దర్ ఇస్మాయిల్ కుటుంబానికి గల రెండున్నర ఎకరాల మాగాణి భూమిని కావూరు వినయాశ్రమానికి దానం చేసి భర్త వాగ్దానాన్ని నెరవేర్చి, ఆమె తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల సమావేశస్థలిగా భాసిల్లిన తెనాలిలోని తమ **ఖద్దరు విక్రయశాల**ను భర్త మరణానంతరం కూడా తన బిడ్డల చేత ఆమె నిర్వహింపచేశారు. ఖద్దరు ధరిస్తూ గాంధీజీ బాటలో భర్త ఆశయాలకు అనుగుణంగా చివరిక్షణం వరకు గడిపిన హాజరా బీబి 1994 జూన్ 16న తుదిశ్వాస విడిచారు.

◆◆◆



అవిశ్రాంత అహింసాయుత పోరాట యోధులు

# 36. షేక్ మహమ్మద్ మొహిద్దీన్

(1922-1994)

**మ**హాత్ముని మాట శిరోధార్యమంటూ అహింసాయుత పోరుకు అంకితమై చివరిశ్వాస వరకు ప్రజాజీవనంతో పెనవేసుకుని, సమాజసేవలో అవిశ్రాంతంగా గడిపిన స్వాతంత్ర్య సమరయోధులలో షేక్ మహమ్మద్ మొహిద్దీన్ ఒకరు.

గుంటూరు జిల్లా నరసరావుపేటలో మహమ్మద్ ఖమ్రుద్దీన్, హిదాయతున్నీసా బేగం లకు 1924లో మహమ్మద్ మొహిద్దీన్ జన్మించారు. చిన్ననాటనే స్వతంత్ర భావాలు, సేవా దృక్పథాన్ని సంతరించుకున్న ఆయన మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు ప్రభావితులయ్యారు. ఆ కారణంగా భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరిన ఆయన కాంగ్రెస్ ప్రకటించిన జాతీయోద్యమ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు.

1941 ఏప్రిల్ మాసంలో జాతీయోద్యమంలో భాగంగా మహాత్ముని పిలుపు మేరకు సాగిన అహింసాయుత సత్యాగ్రహంలో మహమ్మద్ మొహిద్దీన్ పాల్గొన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వావిలాల గోపాలకృష్ణయ్య, రావి సత్యనారాయణ, గార్లపాటి సుబ్రమణ్య శాస్త్రి, కాసు బ్రహ్మానంద రెడ్డిలతోపాటుగా అరెస్టయిన ఆయన ఆరు మాసాలపాటు జైలుశిక్షను అనుభవించారు. జాతీయోద్యమ లక్ష్యాలను బాగా ఆకళింపు చేసుకున్న ఆయన ప్రముఖ జాతీయోద్యమకారుల ప్రసంగాలను శ్రద్ధగా ఆలకిస్తూ అచిరకాలంలో మంచి

వక్తగా పరిణితి చెందారు. ఆ కారణంగా భారీ బహిరంగ సభలు-సమావేశాలలో మహమ్మద్ మొహిద్దీన్ ఆలోచనాత్మక, ఉత్సాహపూరిత ప్రసంగం తప్పనిసరయ్యింది. ఈ ప్రసంగాల వలన ఆయన పలుమార్లు పోలీసు లాఠీదెబ్బలను కూడా చవిచూడాల్సి వచ్చింది.

1942లో 'కరో-యా-మరో' అంటూ విముక్తి పోరాటం తుది రూపంగా మహాత్మా గాంధీ ఇచ్చిన ఆదేశాలను శిరసావహిస్తూ బ్రిటీష్ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో, నల్లజెండాల ప్రదర్శనలో పాల్గొన్న సందర్భంగా జరిగిన లాఠీచార్జీలో మొహిద్దీన్ తీవ్రంగా గాయపడ్డారు. 1942 ఆగస్టులో తెనాలిలో జరిగిన భారీ బహిరంగ సభ, ఆ మరుసటి రోజున జరిగిన సంపూర్ణ హర్తాళ్ కార్యక్రమాలలో ఆయన ప్రముఖ పాత్ర వహించారు. ఈ హర్తాళ్ సందర్భంగా తెనాలి రైల్వేస్టేషన్ కార్యాలయాన్ని దగ్ధంచేసి జాతీయోద్యమకారులు చరిత్ర సృష్టించారు. ఆ సమయంలో జరిగిన అరెస్టుల నుండి మొహిద్దీన్ తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్ళారు.

ఆ తరువాత 1943-44 ప్రాంతంలో జాతీయోద్యమాన్ని అణిచివేసేందుకు ప్రభుత్వం నిర్బంధాలు, క్రూరచర్యలకు పాల్పడగా అరెస్టును తప్పించుకునేందుకు ఆరుమాసాల పాటు నల్లమల అడవుల్లో కడు ఇబ్బందులు పడుతూ అజ్ఞాతంగా గడిపారు. జిల్లాలోని విద్యార్థులను, యువకులను తన ప్రసంగాలు, వాక్చాతుర్యంతో ఆకట్టుకుని ఉద్యమిస్తూ, పోలీసుచర్యలకు ఏమాత్రం భయపడకుండా భారీ ప్రదర్శనల నిర్వహణలో భాగం పంచుకున్నారు. లాఠీ దెబ్బలు, నిర్బంధాలు అలవాటుగా మారిన ఆయన పలుమార్లు తీవ్రంగా గాయపడినా అదృష్టవశాత్తు కోలుకుంటూ ద్విగుణీకృతశక్తితో ఉద్యమించారు.

మతం ప్రాతిపదికన మాతృభూమి విభజన కోరుతున్న ముస్లింలీగ్ వైఖరి ఏమాత్రం సరికాదన్నారు. నైజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయాలని కోరుతూ మహమ్మద్ మొహిద్దీన్ ఆలోచనాత్మక ప్రసంగాలు చేశారు. ఆధునిక ఆలోచనలకు అనుగుణంగా సాగిన ఆయన జీవనయాత్రలో సంఘసేవికగా ప్రసిద్ధిగాంచిన ఆయన భార్య ముంతాజ్ బేగం ప్రధాన పాత్రవహించారు. ఆడపిల్లలకు మగపిల్లలతో సమానంగా స్వేఛ్ఛను ఇచ్చారు. ఆయన తన పదిమంది బిడ్డలకు ఆధునిక చదువులు చెప్పించారు.

చివరివరకు హిందూ-ముస్లిం ఐక్యతకు, మతసామరస్యానికి ప్రతీకగా నిలచిన మొహిద్దీన్ పలు సాంఘిక సేవా సంస్థలలో సభ్యునిగా ప్రజాసేవకు అంకితమయ్యారు. నరసరావుపేట పురపాలక సంఘం సభ్యునిగా ఆయన పట్టణ ప్రజలకు సేవలందించారు. ఉన్నత పదవులలో ఉన్న ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు ఉన్నా వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించకుండా, అర్థించకుండా ప్రజల పక్షాన సమస్యల పరిష్కారం కోరుతు తన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని నిలుపుకున్న షేక్ మహమ్మద్ మొహిద్దీన్ 1994 డిసెంబరు 23న కన్నుమూశారు.

◆◆◆



### ప్రజా పోరాటాలకు ఆఖరిచిక్షణం వరకు అండగా నిలచిన

# 37. మహమ్మద్ రజబ్ అలీ

(1920-1996)

**జా**తీయోద్యమంలో పాల్గొనడం మాత్రమే కాకుండా నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలంటూ ఉద్యమబాటన నడిచి, ఆ తరువాత స్వతంత్ర భారతంలో ప్రజాపక్షంగా పలు పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొన్ని ప్రజల మనన్నతో పలుమార్లు ప్రజా ప్రతినిధిగా ఎన్నికై చరిత్ర సృష్టించిన యోధులు మహమ్మద్ రజబ్ అలీ.

ఖమ్మం జిల్లా పాపటపల్లి గ్రామంలో అమీనాబీ, మహబూబ్ అలీ దంపతులకు 1920 జనవరి ఒకటిన మహమ్మద్ రజబ్ అలీ జన్మించారు. స్వగ్రామంలో ప్రాథమిక విద్యానంతరం ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి వరకు చదివిన ఆయన ఉట్కూరు గ్రామం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. కొంతకాలం తరువాత ఆ ఉద్యోగాన్ని వదలి తెలుగు–ఉర్దూ అనువాదకునిగా హైదరాబాదులోని ప్రభుత్వ ప్రెస్‌లో మరికొంతకాలం పనిచేసి, తిరిగి స్వగ్రామం వచ్చి గ్రామకరణంగా ఆయన బాధ్యతలు చేపట్టారు.

చిన్ననాటి నుండి స్వతంత్ర భావాలుగల రజబ్ అలీ ఆంధ్రమహాసభ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై జాతీయోద్యమంలో ప్రవేశించారు. 1944లో తన 24వ ఏట ఆంధ్ర మహాసభలో పూర్తిస్థాయి కార్యకర్తగా సభ్యత్వం స్వీకరించారు. భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు ఆంధ్రమహాసభ నిర్వహించిన కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఆంధ్ర

మహాసభ నిర్వహించిన 'భూమి-భుక్తి' పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ చర్యలకు ఆగ్రహించిన ప్రభుత్వం ఆయనను 'డిటెన్యూ'గా ప్రకటించి మూడున్నర ఏండ్లపాటు నిర్బంధంలో ఉంచింది. ఆ తరువాత కూడా ఉద్యమ కార్యకలాపాలను కొనసాగిండంతో 1946లో నైజాం సైన్యాలు ఆయనను వరంగల్ జైలులో మూడు మాసాల పాటు నిర్బంధంలో ఉంచాయి.

1947లో ఆరంభమైన నైజాం విలీనం పోరాటంలో రజబ్ అలీ పాల్గొన్నారు. ఆ క్రమంలో కమ్యూనిస్టులతో ఏర్పడిన సాన్నిహిత్యం, సామ్యవాద భావనల పట్ల ఏర్పడిన ఆసక్తి ఫలితంగా 1947లో ఆయన కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఆ కారణంగా ఆయనను మూడేండ్ల మూడు నెలల పాటు వివిధ ప్రాంతాలలోని జైళ్ళల్లో ఉన్నారు. జైలు జీవితంలో ఆయన క్షయవ్యాధిగ్రస్తుడై బ్రతికి బయటపడ్డారు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటలో ఆయన క్రియాశీలక పాత్ర నిర్వహించారు. ఆ పోరాటంలో చురుగ్గా వ్యవహరిస్తున్నందున యూనియన్ సైన్యం ఆయనను అరెస్టు చేసింది. ఆయనతోపాటు అరెస్టయిన వారినందరిని కాల్చి చంపిన సైన్యం రజబ్ అలీని జైలుకు పంపింది. ఆ విధంగా ఆయన మరోసారి మృత్యువు దరిచేరి బ్రతికి బయటపడ్డారు.

స్వతంత్ర భారత దేశంలో రజబ్ అలీ రైతాంగం పక్షాన, శ్రమజీవుల పక్షాన నిలిచారు. నందికొండ ప్రాజెక్టు సాధన కోసం తెన్నేటి విశ్వనాథం, వావిలాల గోపాలకృష్ణయ్య, చలసాని వాసుదేవరావు, కళా వెంట్రావు లాంటి యోధులతో కలసి ప్రాజెక్టు సాధన యాత్రలో పాల్గొన్నారు. 1964లో చైనా యుద్ధం సందర్భంగా 18మాసాల పాటు ఆయన నిర్బంధానికి గురయ్యారు. 1971లో చరిత్రాత్మక 'ఆకలియాత్ర'ను ఖమ్మం జిల్లాలో నిర్వహించారు. చక్కని సైద్ధాంతిక స్పష్టత, విషయాన్ని విడమర్చి చెప్పడంలో ఆసక్తిదాయకంగా తన వాదనను ప్రవేశపెట్టి పార్టీ ప్రముఖులను, సామాన్యులను సైతం ఆకట్టుకోగల నేర్పు ఉన్న నేతగా పేర్గాంచిన రజబ్ అలీ నాయకత్వంలో పలు ప్రజా పోరాటాలు విజయవంతమయ్యాయి.

ఈ మేరకు సంపాదించుకున్న ప్రజాభిమానం ఫలితంగా 1967లో సిపిఎం పార్టీ టిక్కెట్టు మీద ఖమ్మం అసెంబ్లీ అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికయ్యారు. 1972లో సిపిఐ అభ్యర్థిగా శాసనసభకు ఎంపిక కాగా 1978 ఎన్నికలలో పరాజితులయ్యారు. ఆ తరువాత 1983, 1985, 1989, 1994లలో సుజాతనగర్ అసెంబ్లీ నియోజకవర్గం సిపియం అభ్యర్థిగా నుండి ఘనవిజయం సాధించారు. పలు ప్రజా, ప్రభుత్వ సంస్థల నుండి గౌరవ పురస్కారాలు, సత్కారాలందుకున్నారు. ఆయన ఎంత ఎత్తు ఎదిగినా ప్రజల వద్ద మాత్రం అంతగా ఒదిగి నడుచుకుని సామాన్యప్రజల అంతులేని అభిమానానికి పాత్రుడైన మహమ్మద్ రజబ్ అలీ 1996 మార్చి ఒకటిన కన్ను మూశారు.

◆◆◆



## జాతీయోద్యమ కార్యక్రమాల రహస్య ప్రచారకర్త

# 38. షేక్ మహబూబ్ ఆదం

(1914-1997)

**జా**తీయోద్యమం రూపొందించిన పలు ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాల వివరాలను బ్రిటీష్ ప్రభుత్వ పోలీసులు, గూఢచారుల దృష్టిలో పడకుండా ప్రజల్లోకి, ఉద్యమ కార్తకర్తల వద్దకు తీసుకెళ్ళడంలాంటి సాహసోపేత కార్యక్రమాలను అతి రహస్యంగా నిర్వహించగల సమర్థులను ఆనాటి జాతీయోద్యమం రూపొందించింది. ఆ విధంగా రూపొందించబడిన కార్యకర్తలలో ఎన్నదగిన వారు షేక్ మహబూబ్ ఆదం సాహెబ్.

గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకా రొంపిచర్ల గ్రామంలో షేక్ సిలార్ సాహెబ్, షేక్ జైనబ్బీలకు షేక్ మహబూబ్ ఆదం సాహెబ్ 1914లో జన్మించారు. చిన్నతనంలోనే తల్లి తండ్రులను కోల్పోయిన ఆయన తెనాలి పట్టణంలో అక్కయ్య ఇంట పెరిగారు. విద్యార్థిగా మహాత్మాగాంధీ మార్గం పట్ల ఆకర్షితులైన ఆదం సాహెబ్ ఖద్దరు ధరించడం, భావోద్వేగంగా ఉపన్యాసాలు ఇవ్వడాన్ని ఇష్టపడ్డారు. ఆ క్రమంలో జాతీయోద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించదలిచారు. ఆ కారణంగా బ్రిటీష్ ప్రభుత్వంలో పోలీసు ఉద్యోగం చేస్తున్న తన బావగారింట ఉండటం ఇష్టంలేక అక్కయ్య ఇల్లు వదిలేశారు. ఆయన భావాలతో ఏకీభవించిన సన్నిహిత మిత్రులు టి.వెంకటేశ్వరరావు (విజయవాడ కార్పొరేషన్ తొలి మేయర్) లాంటి వారితో కలసి, ఇంటికొక అన్నం ముద్ద తెచ్చుకుని **ముద్దకూడు** తింటూ, గ్రామాలలోని దేవాలయాల నీడన సేదతీరుతూ జాతీయోద్యమ ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం

ఆరంభించారు. ఆ తరువాత వారాల అబ్బాయిగా తెనాలిలో విద్యాభ్యాసం చేశారు.


ఆ సమయంలో మహాత్ముడు శాసనోల్లంఘన ఉద్యమానికి పిలుపునివ్వగా ఆ ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి రాష్ట్రంలో రహస్యంగా రాజకీయ శిక్షణా తరగతుల నిర్వహణకు నాయకులు నడుం కట్టారు. ఈ మేరకు తెనాలిలో జరగనున్న రహస్య సభల సమాచారాన్ని జాతీయకాంగ్రెస్ ప్రతినిధులకు చేరవేసి ప్రతినిధుల సమీకరణ కోసం తన గురువు మంత్రవాది వెంకటరత్నంతో కలసి పోలీసుల కన్నుగప్పి, కాలినడకతో గ్రామాలను చుట్టేస్తూ మారు వేషాలతో ప్రచార కార్యక్రమాలను నిర్భయంగా నిర్వహించి విద్యార్థి దశలోనే షేక్ మహబూబ్ ఆదం ఎంతో పోరాట పటిమను ప్రదర్శించారు.

ఆ తరువాత విద్యాభ్యాసం నిమిత్తం గుంటూరు చేరిన మహబూబ్ ఆదం ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు పులుపుల శివయ్యలాంటి వారి సహచర్యంలో సామ్యవాద భావాల పట్ల ఆకర్షితులయ్యారు జాతీయోద్యమంలో భాగంగా సాగుతున్న విద్యార్థి ఉద్యమాలలో చురుకైన పాత్ర నిర్వహించిన ఆదం సాహెబ్ సత్యాగ్రహోద్యమం, ఉప్పుసత్యాగ్రంలో చురుకుగా పాల్గొని పోలీసు నిర్బంధాలను, కడలూరు జైలులో జైలుశిక్షను చవిచూశారు.

1938లో ఉద్యోగం చేపట్టిన ఆదం గుంటూరు నుండి విజయవాడకు తన మకాం మార్చారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ఆదం ప్రభుత్వ సేవకన్నా ప్రజాసేవలో గడపడం మిన్నగా భావించి ఉద్యోగానికి రాజీనామాచేసి పూర్తికాలపు కమ్యూనిస్టుగా మారారు. పార్టీ ఆదేశాల మేరకు ముస్లింలీగ్‌లో చేరి ఆ పార్టీలోని స్థానిక కార్యకర్తలను వేర్పాటువాద భావాల నుండి దూరం చేయడానికి ప్రయత్నించారు. ఆ విధంగా పనిచేస్తూనే ముస్లింలీగ్‌లో ప్రముఖ నాయకునిగా వెలుగొందారు. ఈ క్రమంలో మహమ్మద్ అలీ జిన్నా, జనాబ్ అలీ బేగ్ (విజయవాడ) లాంటి ప్రముఖనేతల స్నేహాన్ని, సాన్నిహిత్యాన్ని సంపాదించిన మహబూబ్ ఆదం సాహెబ్ లాహోర్, ఢిల్లీలోను జరిగిన సభలలో పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం వచ్చాక కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలో పాల్గొన్న మహబూబ్ ఆదం పలుమార్లు జైలుశిక్షలను అనుభవించారు. ప్రజాపక్షంగా సాగిన ప్రతి ఉద్యమంలో ఆయన పాల్గొన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శాంతి సంఘీభావ సంఘాలలో అవిశ్రాంతంగా పనిచేశారు. 1972లో స్వాతంత్ర్యసమరయోధునిగా ఆయనను గౌరవిస్తూ తామ్రపత్రం అందచేయడానికి ఆహ్వానించగా దేశం కోసం పోరాడం తప్ప తామ్రపత్రం, ఇతర సదుపాయాల స్వీకరణకు కాదంటూ ప్రభుత్వ ఆహ్వానాన్ని తిరస్కరించారు. అటు స్వాతంత్ర్య సమర యోధునిగా దేశం కోసం, ఇటు కమ్యూనిస్టుగా సామాన్య పేదవర్గాల ప్రజల కోసం జీవిత పర్యంతం శ్రమించిన షేక్ మహబూబ్ ఆదం 1997 సెప్టెంబర్ ఆరున కన్నుమూశారు.

◆◆◆



## జీవిత చరమాకం వరకు నమ్మిన విలువల్ని పాటించిన

# 39. మీర్ అక్బర్ అలీ ఖాన్

(1899 -1998)

**భా**రత స్వాతంత్ర్యోద్యమంలోని ప్రధాన పోరాట రూపాలలో ప్రథమస్థానం అనదగ్గ ఖిలాఫత్-సహాయ నిరాకరణోద్యమంలో మహాత్ముని పిలుపు మేరకు జాతీయోద్యమ బాట పట్టిన అలీఘర్ విద్యార్థుల బృందంలో ఒకరు మీర్ అక్బర్ అలీ ఖాన్.

1899 నవంబరు 17న హైదరాబాదులో మీర్ వాజిద్ అలీ ఖాన్, అజీమున్నిసా బేగంలకు మీర్ అక్బర్ అలీ ఖాన్ జన్మించారు. సంపన్న కుటుంబంలో జన్మించిన అక్బర్ అలీ ఖాన్ స్థానికంగా ప్రాథమిక విద్యను పూర్తిచేసి ఆ తరువాత పలు విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించారు.

1920లో ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా ప్రభుత్వ గ్రాంటులతో నడుస్తున్న కళాశాలలను బహిష్కరించమని గాంధీజీ ఇచ్చిన పిలుపు మేరకు అలీఘర్‌లో విద్యాభ్యాసం చేస్తున్న అక్బర్ అలీ ఖాన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్ లాంటి ప్రముఖుల బాటలో జాతీయోద్యమంలో ప్రవేశించి కళాశాలను బహిష్కరించారు. ఆ తరువాత జాతీయ ముస్లిం విశ్వవిద్యాలయం (జామియా మిలియా ఇస్లామియా)లో ప్రవేశించి విద్యాభ్యాసం చేస్తూ జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఆ ఉద్యమ విరమణ తరువాత లండన్ వెళ్ళి న్యాయశాస్త్రంలో పట్టా పొంది న్యాయవాదిగా తిరిగి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

అక్బర్ అలీ ఖాన్ ప్రత్యక్ష రాజకీయాలలో అంతగా పాల్గొనకపోయినప్పటికి న్యాయవాదిగా సంపాదనే ప్రధానం అనుకోకుండా మానవీయ విలువల పెంపుదల దిశగా స్వచ్ఛంద సంస్థల నిర్మాణం, తద్వారా ప్రజోపకర సేవాకార్యక్రమాల వైపు దృష్టి సారించారు. ఈ మేరకు విద్యార్థులు, యువకుల ప్రయోజనార్థం 'అంజుమన్–యే–తెల్సినిన్' అను సంస్థను స్థాపించి నిర్వహించారు. నైజాం సంస్థానం రాజధాని హైదరాబాదు నగరంలో హిందూ–ముస్లింల మధ్య స్నేహ సంబంధాలను, ఐక్యతను మరింత పటిష్టం చేసేందుకు అక్బర్ అలీ ఖాన్ నిరంతరం కృషి సల్పారు. మతాలకు అతీతంగా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని  వాంఛించారు. నగర ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం ఆయన విశేషంగా పని చేశారు. సాంఘిక, రాజకీయ, విద్యా, పారిశ్రామిక రంగాలలో అభినివేశం గల వ్యక్తిగా ఆయా రంగాల ద్వారా ప్రజానీకం ప్రగతి ఫలాలను అనుభవించాలన్న లక్ష్యంతో ఎంతో శ్రమించారు. నిజాం పరిపాలన కాలంలో పరిమిత ప్రజాస్వామ్య పద్ధతిలో నైజాం పాలన సాగాలని కోరిన కొద్దిమంది ముస్లిం ప్రముఖులలో ఆయన ముఖ్యులు.

1940లో ఆయను ముస్లింలీగ్‌లో చేరమని స్వయంగా మహ్మద్ అలీ జిన్నా ఆహ్వానించగా సున్నితంగా తిరస్కరించిన అక్బర్ అలీ ఖాన్ 1949లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముస్లిం ప్రముఖునిగా పార్టీలో ప్రముఖ పాత్ర వహించిన ఆయన 1956 ఏప్రిల్‌లో రాజ్యసభ సభ్యునిగా, 1960 ఏప్రిల్‌లో మరోమారు రాజ్యసభకు ఎంపికయ్యారు. 1971 వరకు రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించిన ఆయన 1972 నుంచి 74 వరకు ఉత్తరప్రదేశ్ గవర్నరుగా పనిచేశారు. ఆ తరువాత 1974 నుంచి 1976 వరకు ఒరిస్సా రాష్ట్రం గవర్నర్‌గా పదవీ బాధ్యతలను గౌరవప్రదంగా నిర్వహించారు.

అత్యున్నత పదవులను నిర్వహించిన మీర్ అక్బర్ అలీ ఖాన్ హైదరాబాదు నగరంలో సాగిన సాంఘిక సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు. హైదాబాద్ విశ్వవిద్యాలయం (సెంట్రల్ యూనివర్శిటీ) పాలక మండలి సభ్యునిగా ఆయన మంచి పాత్ర నిర్వహించారు. ఆ తరువాత గాంధీ పీస్ సెంటర్, గాంధీ అధ్యయన సంస్థలో పాలకమండలి సభ్యులుగా శ్లాఘనీయమైన కృషి చేశారు. అటు జాతీయోద్యమంలో ఇటు స్వతంత్ర భారత దేశంలో చేసిన కృషికి గుర్తింపుగా మీర్ అక్బర్ అలీ ఖాన్‌కు భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' పుస్కారంతో  గౌరవించి  సన్మానించింది.

ఈ మేరకు ప్రజా జీవన రంగాలతో మమేకమై ఆయా కార్యక్రమాలలో పాల్గొంటూ సేవలందించిన మీర్ అక్బర్ అలీ ఖాన్ చివరి వరకు హిందూ–ముస్లిం సమైక్యతకు కృషి చేస్తూ 1998 ఫిబ్రవరి 26న కన్ను మూశారు.

◆◆◆



## జీవిత చరమాకం వరకు మహాత్ముని మార్గంలో నడిచిన

# 40. మున్షీ మహమ్మద్ మస్తాన్

(1913 -1999)

**మహాత్ముని మాట నాకు బంగారు బాట** అంటూ జీవిత చరమాంకం వరకు ఆ బాటన సాగిన గాంధేయవాదులు అరుదుగా కన్పిస్తారు. తల మీద తెల్లటి గాంధీ టోపి తెల్లటి ఖద్దరు దుస్తులు ఎప్పుడూ చెరగని చిరునవ్వుతో చకచకా సాగిపోతూ, ఎదురు పడిన ప్రతి వ్యక్తిని ప్రేమ పూర్వకంగా పలకరించే పొట్టి మనిషి ఆయన. రాష్ట్రంలో ఎక్కడ కన్పించినా, ఆయనను **మున్షీ మస్తాన్**గా ఇట్టే గుర్తుపట్టగల ప్రత్యేకత ఆహార్యం ఆయనది. ఆయన అసలు పేరు షేక్ మహమ్మద్ మస్తాన్ సాహెబ్. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి ఉర్దూలో **మున్షీ** పట్టాను పుచ్చుకున్న ఆయన గుంటూరు జిల్లా తెనాలిలోని ఉర్దూ పాఠశాలలో మున్షీగా పనిచేసిన కారణంగా మహమ్మద్ మస్తాన్ సాహెబ్ కాస్తా **మున్షీ మస్తాన్** అయ్యారు.

గుంటూరు పట్టణంలోని సంగడిగుంటలో సామాన్య కుటుంబంలో 1913 జూలై 1న మహమ్మద్ మస్తాన్ సాహెబ్ జన్మించారు. తండ్రి మీరాసాహెబ్, తల్లి హుస్సేన్ బీ. విద్యార్థిగా జాతీయోద్యమం పట్ల ఆకర్షితులై భారత జాతీయ కాంగ్రెస్ సభ్యులయ్యారు. 1932 నాటి శాసనోల్లంఘన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు, శ్రీ యన్. వి. యల్. నరసింహారావు శ్రీ చందు నాగభూషణం తదితరుల మార్గదర్శకత్వంలో సుశిక్షిత జాతీయోద్యమ కార్యకర్తగా మహమ్మద్ మస్తాన్ రాటు దేలారు.

యువకులైన ముస్తాన్‌కు కేవలం నిరసనలు, పికిటింగులు ద్వారా వలస పాలకులను తరిమికొట్టే ప్రయత్నాలు నచ్చలేదు. అవసరమైతే ప్రాణ త్యాగాలు చేయడానికి సిద్ధమవుతున్న విప్లవకారుల పంథా అమితంగా ఆకర్షించింది. 1935లో విప్లవకారులైన జాతీయ కాంగ్రెస్ కార్యకర్తలతో కలసి రహస్యంగా కరపత్రాలు పంచే కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు. 1936లో ప్రముఖ విప్లవకారుడు అన్నాప్రగడ కామేశ్వరరావు నాయకత్వంలో ప్రకాశం జిల్లా కొత్తపట్నం గ్రామంలో జరిగిన రహస్య రాజకీయ శిక్షణాశిబిరంలో పాల్గొన్నారు. ఈ శిబిరం పై పోలీసులు కిరాతక దాడి జరిపారు, బీభత్సం సృష్టించారు. శిబిరంలో పాల్గొన్న నాయకులను అరెస్టు చేశారు. ఆ సందర్భంగా మున్షీ మస్తాన్‌ను పోలీసులు తీవ్రంగా చావ చితకబాది బలవంతంగా లాక్కెళ్ళారు. ఎటువంటి ఆరోపణలు లేకుండానే 21 రోజులపాటు పోలీసులు కస్టడీలో ఉంచుకుని మానసిక హింసలకు గురిచేసి విడుదల చేశారు.

మద్రాసు విశ్వవిద్యాలయం గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన తరువాత మస్తాన్ 1942లో తెనాలి తాలూకా ఉన్నత పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయునిగా నియమించ బడ్డారు. ఒకవైపున ఉపాధ్యాయునిగా బాధ్యతలు నిర్వహిస్తూనే మున్షీ మస్తాన్ జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొనడం కొనసాగించారు. 1942లో సాగిన క్విట్ ఇండియా పోరాటాన్ని తెనాలి స్వాతంత్ర్య సమర యోధులు తమ రుధిరజ్వాలలతో మహోజ్వలం చేశారు. 1942 అగష్టు 12న జరిగిన పోలీసు కాల్పుల సంఘటనలో ఏడుగురు అమరులయ్యారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న మస్తాన్ సాహెబ్ వెంట్రుకవాసిలో మృత్యువు నుండి తప్పించుకున్నారు.

1943లో ఆన్నాప్రగడ నాయకత్వంలో రానున్న స్వాతంత్ర్యోత్సవ సంబరాలను పురస్కరించుకుని జరిగిన ఊరేగింపులో పాల్గొన్న నేరానికి 1943 జనవరి 24 నుండి, ఫిబ్రవరి 7 వరకు ఆయన గుంటూరు సబ్‌జైలులో నిర్బంధానికి గురయ్యారు. ఆ తరువాత కార్యక్రమాలను మరింత ఉధృతం చేయగా ఆయన మీద అరెస్టుకు వారెంటు జారీ అయ్యింది. ఆ వారెంటు నుండి తప్పించుకొడానికి పార్టీ నేతల ఆదేశాల ప్రకారంగా మస్తాన్ అజ్ఞాతానికి వెళ్ళారు. అజ్ఞాతంగా పార్టీ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తూ 1942 జూన్ మాసం నుండి 1943 డిసెంబరు వరకు పోలీసులకు చిక్కలేదు.

హిందూ–ముస్లింల ఐక్యత కోసం మున్షీ మస్తాన్ అవిశ్రాంత కృషి సల్పారు. ముస్లింలీగ్ ద్వారా ప్రభావితులైన తెనాలి ప్రాంతంలోని కొందరు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికి భారత జాతీయ కాంగ్రెస్‌ను వీడిపోకుండా, ప్రాణం ఉన్నంత వరకు కొనసాగుతానని ప్రకటించి లీగ్ కార్యకర్తల ఆగ్రహానికి గురయ్యారు. భారతదేశం భవిష్యత్తు, ఈ దేశంలోని ప్రధాన సాంఘిక జన శ్రేణులైన హిందూ–ముస్లింల ఐక్యత ద్వారా మాత్రమే మహోజ్వలం కాగలదని ఆయన భావించారు. ఈ మేరకు తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో

అనర్గళంగా ప్రసంగాలు చేస్తూ, ప్రజలలో నిర్మాణాత్మక ఆలోచనలు రేకెత్తించారు.

స్వాతంత్ర్య సిద్ధించే తరుణం సమీపించే కొద్ది 'భారత విభజన' ఒక సమస్యగా వ్యాపించ సాగింది. జాతీయభావాలు గల ఉలేమాలు ఒక సంస్థగా ఏర్పడినప్పటి నుండి జాతీయోద్యమంలో పాల్గొనడం మాత్రమే కాకుండా విభజనను వ్యతిరేకిస్తూ ఉద్యమించారు. ఆ సంస్థకు కోస్తా, రాయలసీమ ప్రాంతాల బాధ్యునిగా మున్షీ మస్తాన్ పనిచేశారు. **భారత విభజన** ఆలోచనలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే ప్రయత్నాన్ని ఆయన ముమ్మరంగా నిర్వహించారు. మతపరమైన ఆలోచనలతో మాతృభూమిని ముక్కలు చేసే శక్తుల వలన ఆయన కష్టాల పాలైనప్పటికీ తాను నమ్మిన సైద్ధాంతిక బాటను వీడలేదు.

దశాబ్దాల క్రితం గుంటూరు నుండి తెనాలికి తరలి వచ్చినా, సొంతగూడు కూడా ఆయన నిర్మించుకోలేదు. కటిక పేదరికం నుండి ఆయన విముక్తి పొందలేక పోయారు. ప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూతో మంచి పరిచయాలు గల ఆయనను 'పెన్షన్' కోసం దరఖాస్తు చేసుకోమని పలువురు సలహా ఇచ్చారు. అయినా 'పెన్షన్' కోసం ప్రయత్నించ లేదు. తెనాలిలోని ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయునిగా మూడు దశాబ్దాలకు పైగా పనిచేసిన మున్షీ మస్తాన్ 1973లో రిటైర్ అయ్యారు. ఉపాధ్యాయునిగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో అవిరళ కృషి సల్పారు. ఉర్దూ భాషకు మతం రంగు పులుముతున్న కొందరి చర్యలను ఆయన నిరశించారు. ఉర్దూ భాష భారతదేశంలో రూపుదిద్దుకున్న భారతీయుల భాషగా ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. ఉర్దూ భాషకు మతాలతో సంబంధం లేదని, ఇది భారతీయుల ఉమ్మడి సంస్కృతికి చిహ్నమని ఆయన ప్రకటించారు, ప్రచారం చేశారు.

స్వాతంత్ర్యం లభించాక, జాతీయోద్యమ కార్యకర్తగా మతతత్వ భావాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ, అన్నిరంగాలలో చితికిపోతున్న ముస్లిం ప్రజానీకం సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి సల్పారు. వక్ఫ్ బిల్లు, ఖాజీ బిల్లులను రూపొందించే కార్యక్రమంలో ముస్లింల మద్దతు కోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటించారు. అనేక సభలు, సమావేశాలను నిర్వహించారు. పలు ప్రజాప్రతినిధి బృందాలకు నాయకత్వం వహించారు. 1955లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ లాంటి ప్రముఖుల ప్రశంసలందుకున్నారు. రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ గుంటూరు వచ్చినప్పుడు ముస్లిం జనావళి పక్షాన పూలమాల వేసి ఆయనకు స్వాగతం పలికే గౌరవం మున్షీ మస్తాన్‌కు దక్కింది.

1957లో ఆంధ్రప్రదేశ్ ముస్లిం కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. టునీషియా, మొరాక్‌లో జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటాలను సమర్థిస్తూ గుంటూరులో అఖిల పక్ష సమావేశాలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ధార్మికనేత మౌలానా హఫీజుర్రెహమాన్ ఆహ్వానం మేరకు ఢిల్లీలో జరిగిన అఖిల భారత ముస్లిం కన్వెన్షన్‌కు ఆయన హాజరయ్యారు.

1967-72 వరకు తెనాలి పురపాలక సంఘం కౌన్సిలర్‌గా, 1976-1980 వరకు గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షునిగా సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించారు. దక్షణ భారతదేశ ఉర్దూ అకాడమీ కార్యనిర్వాహక కమిటీ సభ్యునిగా ఆయన ఉర్దూ భాషాభివృద్ధికి విశేష కృషి సల్పారు. ఆయన సేవలకు గుర్తింపుగా 1991లో తెనాలిలోని ఒక ఉర్దూ పాఠశాలకు **మున్షీ మస్తాన్ మున్సిపల్ టౌన్ ఉర్దూ ప్రాధమిక పాఠశాల** గా నామకరణం చేసి ఆయన పట్ల ఉన్న ప్రేమాభిమానాలను తెనాలి ప్రజలు ప్రకటించుకున్నారు.

ఆయనకు అన్ని సమయాలలో అండగా నిలచిన భార్య రహీమున్నీసా అకాల మృతి చెందడం, పేదరికంతో నిత్యసహవాసం వలన రోజు గడవని దుర్భర పరిస్థితులు ఎదురుకావడంతో, సహచరుల, మిత్రుల బలవంతం మీద పెన్షన్ కోసం ఆయన దరఖాస్తు చేసుకున్నారు. పరిపాలనా వ్యవస్థలోని అలసత్వం, లంచగొండితనానికి ఆయన ససేమిరా తలవంచక పోవడంతో అపరిమిత కాలవ్యయంతో 1998లో పెన్షన్ మంజూరైంది. ఆయనకు చెందాల్సిన పెన్షన్ బకాయిలుగా 21 వేలు రాగా కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నా, ఆ మొత్తాన్ని ఉర్దూ భాషాభివృద్ధికి విరాళంగా సమర్పించారు.

జీవిత చరమాంకం వరకు ఎంతో హుషారుగా తిరుగుతూ, జాతి జనుల చైతన్యం, అభ్యున్నతి కోసం పనిచేస్తున్న యువకులను, సంస్థలను ప్రోత్సహిస్తూ, వారికి మార్గదర్శకత్వం వహిస్తూ, ఎంతో ఉత్సాహంతో గడిపిన నిగర్వి, నిరాడంబరులు మహమ్మద్ మున్షీ మస్తాన్ 1999 సెప్టెంబరు 29న తెనాలిలో చివరిశ్వాస విడిచారు.

◆◆◆

'..భారత సైన్యంలో తిరుగుబాట్లు జరిగాయి; కాని ఇప్పుడు జరుగుతున్న తిరుగుబాటుకి స్వభావసిద్ధమైనట్టీ, వినాశకరమైనట్టీ లక్షణాలున్నాయి. తమ యూరోపియన్ ఆఫీసర్లను సిపాయి రెజిమెంట్లు చంపివేయడం ప్రపథమంగా ఇప్పుడే జరిగింది; హిందువులూ మహ్మదీయులూ పరస్పర వైషమ్యాలను విసర్జించి, తమ ఉమ్మడి ప్రభువు పై తిరగబడడమూ హిందువులతో ఆరంభమైన అల్లర్లు, ఢిల్లీ సింహాసనం పై మహమ్మదీయ చక్రవర్తిని వాస్తవంగా అధిష్టింపజేయడంతో తుట్టతుదకు అంతమొందడమూ; తిరుబాటు ఏ కొద్ది ప్రాంతాలకో పరిమితమై ఉండకపోవడమూ ఇప్పుడే ప్రథమము...',

**(ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం 1857-1859, మార్క్స్-ఎంగెల్స్, ప్రగతి ప్రచురణాలయం, మాస్కో, 1983, పేజి.43)**



## ప్రజా సేవకు అంకితమైన అవివాహిత సేవాతత్పరుడు


# 41. షేక్ మహమ్మద్ యాశిన్

(1913 - 2000)

స్వాతంత్ర్యసంగ్రామం పరాయిపాలన నుండి విముక్తి కోసం ప్రజలను ఉద్యమింప చేయడం మాత్రమే కాకుండా ప్రజాసేవకు కూడా జాతీయోద్యమకారులను ప్రేరేపించింది. ఈ మేరకు స్ఫూర్తిపొంది ప్రజాసేవకు సంపూర్ణ జీవితాన్ని సమర్పించుకున్న స్వాతంత్ర్య సమరయోధులలో షేక్ మహమ్మద్ యాశిన్ ఒకరు.

1913 ప్రాంతంలో షేక్ యాశిన్ విజయవాడలోని సంపన్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రిపేరు షేక్ అబ్దుల్ ఖాసిం, తల్లిపేరు ఫర్దీబి. యాసిన్ పెద్దగా చదువుకోనప్పటికి చిన్ననాటనే స్వతంత్ర భావనలు, నాయకత్వపు లక్షణాలను ప్రదర్శిస్తూ అనునిత్యం అవసరార్థులను ఆదుకుంటూ అందరి ప్రేమకు పాత్రులయ్యారు.

1939 ప్రాంతంలో ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధులు అయ్యదేవర కాళేశ్వరరావు ప్రభావంతో ఆయన పూర్తిస్థాయిలో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించారు. ఆచార్య యన్.జి.రంగా, కాకాని వెంకటరత్నం లాంటి ప్రముఖులకు షేక్ యాశిన్ అత్యంత సన్నిహితులయ్యారు. ఆ తరువాతి కాలంలో ఆచార్య రంగా లాంటి ప్రముఖులు కాంగ్రెస్ పార్టీని వీడినప్పటికి ఆయన మాత్రం జీవిత చరమాకం వరకు జాతీయ కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి నిలిచారు.



1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో షేక్ యాశిన్ చురుకైన పాత్ర పోషించారు. మంచి కార్య దక్షుడైన ఆయన మౌలానా అబుల్ కలాం ఆజాద్ మార్గదర్శకత్వంలో ముందుకు సాగారు. ముస్లింలీగ్ రాజకీయాలను నిరసించారు. 1947లో భారత విభజన సందర్భంగా విభజనకు వ్యతిరేకంగా గళం విప్పారు. విభజన వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ కారణంగా విజయవాడలోని కొందరు ప్రముఖ ముస్లిం నాయకుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ ఆగ్రహం ఎంత దూరం వెళ్ళిందంటే ఆయను నమాజు చేసుకొడానికి మసీదులకు కూడా రాన్వికుండా కొందరు అడ్డుపడేంతవరకు వెళ్లింది. అయినా ఆయన ఏమాత్రం చెక్కు చెదరకుండా తన అభిప్రాయాల మీద స్థిరంగా నిలిచారు.

స్వాతంత్ర్యం లభించిన అనంతరం పూర్తిగా సమాజసేవలో గడపాలని నిర్ణయించుకున్న షేక్ యాశిన్ వివాహం చేసుకోలేదు. ప్రముఖ నాస్తికులు గోపరాజు రామచంద్రరావును సామాజిక సేవారంగంలో ఆదర్శం చేసుకుని సామాజిక సేవకు అంకితం అయ్యారు. ఆయన ఆచరణాత్మక సేవా దృక్పథం వలన విజయవాడ పురపాలక సంఘం కౌన్సిలర్ పదవిని ప్రజలు యాశిన్ ప్రదానం చేశారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల మనిషిగా ఆయన ఖ్యాతి గడించారు. పేదవర్గాల ప్రజలకు ఆవాసం కల్పించడంలో విశేషకృషి చేసిన ఆయన **పాకల యాశిన్** గా పిలవబడ్డారు.

షేక్ యాశిన్ నిడారంబర జీవితం గడిపారు. స్వంత ఆస్తిపాస్తులను కరిగించి ప్రజల కోసం వ్యయం చేశారు తప్ప సంపాదన మీద ఆయన ఎన్నడూ దృష్టి నిల్పలేదు. ఆ కారణంగా స్వంత ఆస్తి కాస్త కరిగిపోయింది. నాలుగుసార్లు విజయవాడ పురపాలక సంఘం కౌన్సిలర్గా, మరొకసారి కార్పొరేటర్గా ఎన్నికైనప్పుటికి ఆయన స్వంత ఆస్తిగా నయాపైసా కూడా కూడ పెట్టలేదు. చివరివరకు అటు స్వాతంత్ర్యసమరయోధునిగా మాతృభూమి సేవలో ఇటు ప్రజల మనిషిగా సామాజిక సేవారంగంలో యావత్తు జీవితాన్ని గడిపిన షేక్ మహమ్మద్ యాసిన్ తన 87వ ఏట 2000 ఆగస్టు 30న విజయవాడలో కన్నుమూశారు.

◆◆◆

‘ నా మాతృభూమిని ఆంగ్లేయుల పెత్తనం నుండి విముక్తి చేసేందుకు మాత్రమే నేను ఆయుధం చేపట్టాను’. **– మౌల్వీ లియాఖత్ అలీ.**



## జనహిత కార్యక్రమాలకు జవసత్వాలందించిన

# 42. సయ్యద్ అబ్దుల్ అజీం

## (1919-2001)

**జా**తీయోద్యమంలో చురుకుగా పాల్గొన్న పలువురు స్వాతంత్ర్యసమరయోధులు దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక తమ వ్యక్తిగత కార్యక్షేత్రాలను నిర్ణయించుకుని కుటుంబాలకు పరిమితమైపోయిన వారు చాలా మంది కన్పిస్తారు. అలా కాకుండా దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని భావించి ఉపాధి చూసుకుంటూనే ప్రజాసేవకు అంకితమై పూర్తిగా అంకితమైన వ్యక్తులలో ఒకరు సయ్యద్ అబ్దుల్ అజీం.

1919 సెప్టెంబరు 16న ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలులో సయ్యద్ అబ్దుల్ అజీం జన్మించారు. తండ్రి సయ్యద్ రహంతుల్లా తల్లి సయ్యద్ ఇమాం బీబి. విద్యార్థి దశలో అజీం ఒంగోలుకు చెందిన విప్లవకారుడు షేక్ రహమతుల్లా సాహసోపేత చర్యలకు ప్రభావితులయ్యారు. అజీం తండ్రి టైలరింగ్ షాపు వద్దకు ప్రముఖ నాయకులు టంగుటూరి ప్రకాశం పంతులు తరుచుగా వచ్చేవారు. ఆ సమయంలో ఆయన మాట్లాడుతూ **స్వాతంత్ర్యం వస్తే రూపాయికి ఆరు మానికలకు బదులుగా 16 మానికల బియ్యం వస్తాయి**, అని పలికిన పలుకులు అజీంను జాతీయోద్యమం దిశగా నడిపించాయి.

ఆనాటి నుండి విద్యార్థి నాయకునిగా మిత్రబృందంతో కలసి భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు జరిగిన పలు కార్యక్రమాలలో అజీం పాల్గొనసాగారు. ఒకసారి

మహాత్మాగాంధీ, కస్తూరీబా గాంధీ విరాళాలు సేకరిస్తూ రైలులో ప్రయాణిస్తుండగా, ఆ రైలులో తానుకూడా ప్రయాణించి, ప్రయాణీకుల నుండి విరాళాలు సేకరించి, తల్లితండ్రులు తనకిచ్చిన పాకెట్ మనీతో సహా గాంధీజీకి అందజేసి మహాత్ముని అభినందనలు అందుకున్నారు. మరోసారి జవహర్‌లాల్ మద్రాసు సమావేశానికి హాజరై తిరిగి ఢిల్లీ వెడుతుండగా అజీం రైలులో నెహ్రూ వెంట తెనాలి వరకు ప్రయాణించి ఆయనతో మాట్లాడి ప్రేరణ పొందారు. ఇంకోసారి నేతాజీ సుభాస్ చంద్రబోస్ గుంటూరుకు రాగా, ఆ సభకు వెళ్లడానికి తన వద్ద డబ్బు లేకపోవడంతో సైకిల్ మీద 70 మైళ్ళు ప్రయాణించి గుంటూరు నగరం వెళ్ళి నేతాజీ ప్రసంగం విని పులకరించి పోయారు.

జాతీయోద్యమ కార్యక్రమాల సందర్భంగా ప్రముఖ నాయకులు ఎక్కడకు వచ్చినా వ్యయప్రయాసలు కోర్చి తన మిత్రబృందాన్ని ఉత్సాహపర్చి తీసుకెళ్ళడం, నాయకులు చేసిన ప్రసంగాంశాల మీద చర్చలు జరిపి యువతను మరింతగా ఉద్యమ దిశన కార్యోన్ముఖులు చేయడం ఆయన ప్రత్యేకత. ఉప్పు సత్యాగ్రహోద్యమ ప్రచార కార్యక్రమాలలో అజీం చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు నాయకత్వంలో జరిగిన ఊరేగింపులో పాల్గొని బ్రిటీష్ వ్యతిరేక నినాదాలు చేసినందుకు పోలీసులు చావ చితగ్గొట్టారు.

1939 ప్రాంతంలో అజీం కుటుంబీకులు ఒంగోలు నుండి గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి వచ్చి స్థిరపడ్డారు. అక్కడి జాతీయోద్యమకారులతో సత్సంబంధాలను నెలకొల్పుకున్న అజీం క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. విప్లవ భావాల వైపు మొగ్గుచూపిన అజీం రైళ్ళు ఆపడం, సిగ్నల్స్ విరిచివేయడం, తీగలు తెంచడం లాంటి చర్యలకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా తెనాలి రైల్వేస్టేషన్ తగుల పెట్టిన చారిత్రక సంఘటన జరిగింది. ఈ సంఘటనను పురస్కరించుకుని తిరుగుబాటు భావాలు గల ఉద్యమకారులను అరెస్టు చేయడానికి పోలీసులు ముమ్మరంగా గాలింపులు ప్రారంభించారు. ఆ సమయంలో నాయకుల సలహా మీద అజీం తెనాలి నుండి మద్రాసు వెళ్ళి ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొంటూ అక్కడ ఆరు మాసాల పాటు అజ్ఞాతంలో గడిపారు.

1940 నాటికి పుచ్చలపల్లి సుందరయ్య భావాలకు ప్రభావితుడైన అజీం కమ్యూనిస్టు కార్యకర్తగా పార్టీ కార్యక్రమాల పట్ల ఉత్సాహం చూపసాగారు. తెనాలికి చెందిన కమ్యూనిస్టు నాయకులు రావి అమ్మయ్య మార్గదర్శకత్వంలో ఆయన పనిచేశారు. తెనాలిలో ముస్లింలీగ్ కార్యక్రమాలు సాగుతుండేవి. ముస్లింలీగ్‌లో చేరాల్సిందిగా ఆయనకు వచ్చిన వత్తిళ్ళను బేఖాతర్ అన్నారు. చివరివరకు ఆయన మత రాజకీయాలను వ్యతిరేకించారు.

1945లో తెనాలి పురపాలక సంఘం సర్వీసులో చేరారు. అయినా జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాలలో పాల్గొనడం మానలేదు. పోలీసుల కన్నుగప్పి తగు జాగ్రత్తలు



భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు (ప్రథమ ముద్రణ) గ్రంథాన్ని సయ్యద్ అబ్దుల్ అజీంకు అందిస్తున్న రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్

తీసుకుంటూ స్వాతంత్ర్యోద్యమ ప్రచార కార్యక్రమాలలో పరోక్షంగా పాల్గొన్నారు.

1947లో భారతదేశానికి స్వాతంత్యం సిద్ధించిన తరువాత ఉనికిలోకి వచ్చిన భారత విభజనను అజీం పూర్తిగా వ్యతిరేకించారు. **ఈ గడ్డమీద పుట్టాం...ఇక్కడే ఉంటాం ... చస్తాం .. కాని ఈ నేలను విడిచిపెట్టం** అని పాకిస్తాన్ వెడదామన్న మిత్రులకు ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన ప్రధాన పాత్ర వహించారు. ముస్లింలీగ్ భావాలకు ప్రభావితులైన కొందరు ఆయనను వ్యతిరేకించారు, అదిరించారు, బెదిరించారు. అయినా నమ్మిన విషయాలను, దేశానికి మంచిదన్న భావాలను ప్రచారం చేయడాన్ని అజీ ఏనాడు మానలేదు. స్వాతంత్ర్యానంతరం రాజకీయాలకు దూరంగా ఉంటూ సంఘ సేవాకార్యక్రమాల వైపు దృష్టి సారించారు.

1974లో ఉద్యోగ విరమణ చేసిన తరువాత సంఘ సేవకు ఆజీం పూర్తిగా అంకితమయ్యారు. ప్రజాసేవా కార్యక్రమాలలో అవిశ్రాంతంగా పాల్గొంటూ, తెనాలి స్థాయి నుండి గుంటూరు జిల్లా స్థాయికి చేరుకున్న ఆయన అనేక రాష్ట్రస్థాయి ప్రజా సంఘాలలో, సంస్థలలో ప్రధాన బాధ్యతలను నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ ప్రజాహిత కార్యక్రమం జరిగినా, తెలిస్తే చాలు ఎనభై సంవత్సరాల వయస్కులై ఉండి కూడా అక్కడకు చేరుకుని నిర్వాహకులను అభినందించడం, అవసరాన్ని బట్టి ఆర్థికంగా సహకరించడం ఆయన అలవాటు. ఆయనకు తెలిసిన ప్రతి కార్యక్రమానికి తప్పక హాజరు కావడం, కార్యక్రమాల గురించి ఇతర ప్రాంతాలలో ప్రచారం చేయడం, సంఘహితం కోరే సాహిత్యాన్ని సేకరించడం,

ఆసక్తిగల వారికి ఆ సాహిత్యాన్ని ఉచితంగా అందచేయడం, కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రధాన పాత్రధారులను ప్రోత్సహించడం ఆయనకు చాలా ఆసక్తిదాయకం. సమాజ హితం కోరుతూ విశాల దృక్పథం గల యువకులను ప్రోత్సహిస్తూ లేఖలు రాయడం ఆయన ప్రత్యేకత. ప్రజాసేవతోపాటుగా రాజకీయాల పట్ల కూడా ఆసక్తి చూపిన అజీం బహుజన సమాజ్ పార్టీ జిల్లా నాయకునిగా బాధ్యతలు నిర్వహించారు. దళిత, బహుజన వర్గాల ఐక్యతను ఆకాంక్షిస్తూ ఆయన చురుకుగా పనిచేశారు.

అర్ధశతాబ్దం పైగా ప్రజాసేవలో గడిపిన ఆయన సేవలకు గుర్తింపుగా 1988లో తెనాలి ప్రజలు ఘనంగా సన్మానించారు. ఆ సభలో, **సమ సమాజ నిర్మాణ సారథి, ఆకలి చీకటి, అలసట, ఏదో ఒకటి బాధిస్తున్నా, బందూకులు, బద్మాషులు వెంటపడి వేధిస్తున్నా, అయినవాళ్ళు ఆ పైవాళ్ళు, హితులు, సన్నిహితులు వద్దని వారిస్తున్నా, మంది కోసం గాని, పదిమంది కోసమే కాదు...నా పోరాటం అంటూ, తిమిరంతో సమరం సాగించిన శ్రీ ఎస్.ఎ.అజీంజీ మీకివే మా విప్లవాభినందనలు**, అంటూ తెనాలి ప్రజలు ఆయన సేవలను ఘనంగా కొనియాడారు.

స్వాతంత్ర్య సమరయోధులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన ఏనాడూ కోరుకోలేదు. బ్రిటీష్ వ్యతిరేక పోరాటంలో పాల్గొనడం తన విధ్యుక్త ధర్మంగా భావించినందున పెన్షన్ తదితర సౌకర్యాలను కోరడం తామందించిన మాతృదేశ సేవలకు విలువ కట్టడమేనని అజీం భావించారు. ఆనాడు అరెస్టు కానందున తనను స్వాతంత్ర్య సమరయోధునిగా ప్రభుత్వం పరిగణించడం లేదని సయ్యద్ అజీం ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం గుర్తించకున్నా ప్రజలు గుర్తించి ప్రేమాభిమానాలను పంచుతున్నందుకు ఎంతో ఆనందించారు. చివరిక్షణం వరకు అసమానతలు లేని సమాజం సాధనదిశగా ప్రజలను చైతన్యవంతుల్ని చేయడం కోసం శ్రమించిన సయ్యద్ అబ్దుల్ అజీం 2001 జనవరి 1న తెనాలిలో కన్నుమూశారు.

◆◆◆

నేను భారతీయుడ్ని కావటం నాకు గర్వకారణం. అవిచ్ఛిన్నమైన ఐక్యత వున్నట్టి జాతీయతలో నేనొక భాగాన్ని. అతి సుందరమైన ఈ భారత జాతీయత, నేను లేకపోతే అసంపూర్ణమైపోతుంది. భారతదేశం నిర్మాణంలో నేను కూడా ఒక ముఖ్యమైన ఉపకరణాన్ని. ఈ హక్కును నేను కోల్పోదలచుకోలేదు.

**-మౌలానా అబుల్ కలాం ఆజాద్.**



## ప్రజా పోరాటాలకు బాసటగా నిలచిన యోధురాలు

# 43. జమాలున్నీసా బాజి

(1915-)

**జా**తీయోద్యమంలో ప్రవేశించి తద్వారా బ్రిటీషర్ల బానిస బంధనాల నుండి మాతృభూమి విముక్తి కోసం పోరాడడం మాత్రమే కాకుండా విముక్తి పోరాటాల స్ఫూర్తితో సమతా-మమతల ఉత్తమ వ్యవస్థలను స్థాపించాలన్న లక్ష్యంతో ఉద్యమించిన మహిళలు ఎందరో స్వాతంత్ర్యోదమ చరిత్రలో కన్పిస్తారు. జాతీయోద్యమంలో, ఇండియన్ యూనియన్‌లో నైజాం రాష్ట్రం విలీనం కోరుతూ సాగిన ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా ఆ క్రమంలో సాగిన తెలంగాణా సాయుధ పోరాటంలో ప్రజలపక్షం వహించిన అరుదైన ముస్లిం మహిళా ఉద్యమకారులలో జమాలున్నీసా బాజి ఒకరు.

జమాలున్నీసా 1915 ప్రాంతంలో హైదరాబాదులో జన్మించారు. ఆమె తల్లి హైదరాబాదుకు చెందినవారు కాగా తండ్రిది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. తండ్రి నైజాం సంస్థానంలో న్యాయాధికారిగా పనిచేశారు. కుటుంబంలోని పెద్దలు ఆచార సంప్రదాయాల పట్ల అనురక్తులైనప్పటికి తల్లితండ్రులు మాత్రం ఉదార స్వభావులు. ఆ కారణంగా తండ్రి నుంచి లభించిన స్వేచ్ఛ ఫలితంగా చిన్నతనంలోనే జమాలున్నీసాకు స్వతంత్ర భావనలతోపాటుగా జాతీయ భావనలు అలవడ్డాయి. ఆనాటి విప్లవకారులకు కరదీపికగా ఖ్యాతిగాంచిన **'నిగార్'** ఉర్దూ పత్రికను పదమూడేండ్ల వయస్సులోనే ఆమె చదవడం ఆరంభించారు. లక్నో నుండి వెలువడుతున్న ఆ పత్రికకు నియాజ్ ఫతేపూరి సంపాదకులు. ఆ పత్రిక, ఛాందసత్వానికి,

మతమౌఢ్యానికి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడటమే కాకుండా స్వేచ్ఛ-స్వాతంత్ర్యం, సామ్రాజ్యవాద వ్యతిరేక లక్ష్యాన్ని ముందుకు తీసుక పోవడానికి నిరంతరం కృషి చేసింది. ఆ దిశగా ప్రజా చైతన్యానికి కృషి చేస్తున్న ఈ పత్రిక అత్యంత ప్రమాదకరమైనదని భావించిన ఆంగ్ల-నైజాం ప్రభుత్వాలు హైదరాబాదు సంస్థానంలోకి నిగార్ ప్రవేశాన్ని నిషేధించింది. (హైదరాబాదు సంస్థానంలో రాజకీయ చైతన్యం, విద్యార్థి-యువజనుల పాత్ర (1938 -1956), ఎస్.ఎం. జవాద్ రజ్వి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1985, పేజి. 25).

చిన్నతనం నుండి స్వేచ్ఛ-స్వతంత్ర భావాలను తల్లితండ్రుల నుండి పుణికి పుచ్చుకున్న జమాలున్నీసా బాజీ మతపరమైన ఛాందసాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ఆ కారణంగా జమాలున్నీసా కుటుంబం స్వజనుల నుండి ఇక్కట్లను ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, **మమ్మల్ని కాఫిర్లనేవాళ్ళు. మతద్రోహులని పిలిచేవాళ్ళని** జమాలున్నీసా చెప్పుకున్నారు. స్వతంత్ర ఆలోచనలు, ఉదార స్వభావం గల కుటుంబంలో జన్మించి, ఆ వాతావరణంలో ఎదిగిన జమాలున్నీసా వివాహం సంకుచిత ఆలోచనలు గల కుటుంబంలో జరిగిన కారణంగా అత్తవారింట చాలా ఇబ్బందులు పడ్డారు.

ఈ విషయాన్ని వివరిస్తూ, **మా అత్తవారిల్లు చాలా వెనుకబడ్డ కుటుంబం. మొదట్లో చాలా బాధ వేసేది. కష్టంగా అనిపించేది. నేను కొంత సరిపుచ్చుకోవాల్సి వచ్చేది...నన్ను ఒక సంవత్సరం దాకా మా వాళ్ళు మా అమ్మ ఇంటికి పోనివ్వలేదు. మా నాన్న నన్ను ఇంటికి తీసుకెళ్ళుతుండేవాడు. నా భర్త అన్న, అతని భార్య చాలా సంకుచిత స్వభావం కలవారు. ఎవర్నీ బయటకు వెళ్ళనిచ్చేవారు కారు. మూడు సంవత్సరాలు నేను ఒక కుటుంబ స్త్రీగానే ఉన్నాను-కుట్టుపని నేర్చుకున్నాను. ఇంట్లో కట్టేసినట్టుండేది కాని నాకున్న కొన్ని అభిప్రాయాలను మాత్రం దాచలేదు. పుస్తకాలు చదివేదాన్ని. కాని ఏదో సర్దుకుపోయేదాన్ని -కుటుంబ జీవితంలో. తర్వాత మేం వేరే ఇల్లు ఉస్మాన్‌పురా కట్టెల మండి దగ్గర తీసుకున్నాం. నా కొడుకప్పుడు మూడేళ్ళవాడు. సెలవుల్లో మా నాన్న దగ్గరకు వెళ్ళుతుండేదాన్ని. అది మా అత్తగారింట్లో ఇష్టం ఉండేది కాదు,** అన్నారు. (మనకు తెలియని మన చరిత్ర (తెలంగాణా రైతాంగపోరాటంలో స్త్రీలు-ఒక సజీవ చరిత్ర), ప్రచురణ: స్త్రీ శక్తి సంఘటన, హైదరాబాద్, 1986,పేజి. 176). అటువంటి ప్రతికూల వాతావరణంలో జమాలుల్నీజా బాజి స్వతంత్ర భావనలను వదులుకోకుండా తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ వచ్చారు. ఆ తరువాతి కాలంలో అత్తవారింటి వాతావరణంలో కొంత మార్పు రావడం, నెమ్మదస్తుడైన భర్త సహకారం కూడా కొంతలో కొంత లభించడంతో కుటుంబ జీవితం ఆరంభంలో తాత్కాలికంగా తెరపడిన కార్యకలాపాలను ఉత్సాహంతో ఆమె పునఃప్రారంభించారు.

చిన్నతనంలోనే జాతీయోద్యమం పట్ల ఆకర్షితురాలైన జమాలున్నీసా స్వదేశీ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ విషయాన్ని స్వయంగా ప్రస్తావిస్తూ, **స్వదేశీ ఉద్యమం కూడా మమ్మల్ని ప్రభావితం చేసింది. నేను స్వదేశీ బట్టలనే కట్టుకునేది.** (మనకు తెలియని మన చరిత్ర : పేజి. 173) అన్నారు. ఆ సమయంలో జమాలున్నీసా కుటుంబం స్వాతంత్ర్య సమరయోధులు, సుప్రసిద్ధ కవి మౌలానా హస్రత్ మోహని వలన ప్రభావితమయ్యింది. ఆయన తరచూ హైదరాబాదు వచ్చేవారు. ఆ క్రమంలో ఆయన మల్లేపల్లి మసీదు వద్ద కొన్ని సంవత్సరాలు నివాసం ఉన్నారని, ఆయనకు తమ కుటుంబంతో సన్నిహిత బంధుత్వ సంబంధాలున్నాయని జమాలున్నీసా చెప్పుకున్నారు.

మౌలానా మోహాని చాలా చురుకైన స్వదేశీ ఉద్యమకారుడు. అద్భుతమైన వక్త. జాతీయోద్యమంలో బ్రిటీషర్లకు వ్యతిరేకంగా పోరాడుతూ పలుమార్లు జైళ్ళపాలయ్యారు. ఆయనను సహచరులు **ఫైర్ బ్రాండ్** గా పరిగణించేవారు. ఆయన పలు విషయాలలో నేరుగా మహాత్ముడితో తలపడిన సంఘటనలు చాలా ఉన్నాయి. అటువంటి యోధునితో ఏర్పడిన పరిచయం జమాలున్నీసా కుటుంబ సభ్యులను జాతీయోద్యమం, స్వదేశీ ఉద్యమం, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాల దిశగా నడిపించింది.

ఆ కారణంగా జమాలున్నీసా జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. అయినప్పటికి చేయాల్సినంతగా చేయలేదని ఆమె చెప్పుకున్నారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, **మొదట్నించి జాతీయోద్యమంలో వుండేవాళ్ళం. మేమేం చేయడం లేదని ఎప్పుడూ అన్పించేది. మేము అజంతాలో వున్నప్పుడు ముహమ్మద్ అలీ, ఆయన భార్య అక్కడికొచ్చారని తెలిసింది. మేము, అఖ్తర్** (సోదరుడు), **మా పెద్దనాన్న మా పాకెట్ మనీ-15,20 రూపాయలు జమచేసి బేగం ముహమ్మద్ అలీకి ఇచ్చాం,** అన్నారు. (మనకు తెలియని మన చరిత్ర, పేజి. 175).

జాతీయోద్యమంలో పాల్గొన్న జమాలున్నీసా బాజి ఆ తరువాతి కాలంలో సంతరించుకున్న కమ్యూనిస్టు భావాల కారణంగా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనలేదు. ఈ విషయాన్ని కూడా ఆమె ప్రస్తావిస్తూ, **క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనలేదు. కాని ఆ ఉద్యమం పట్ల, ఉద్యమకారుల పట్ల సానుభూతి ఉండేదని,** చెప్పుకున్నారు. ఆనాడు బాజి కుటుంబం గాంధీ కంటే నేతాజి సుభాష్ చంద్రబోసు అభిప్రాయాలతో ఎక్కువగా ఏకీభవించారు. ఈ విషయాన్ని కూడా స్పష్టంచేస్తూ **గాంధీ కంటె నెహ్రూనే ఇష్టపడేవాళ్ళం. సుభాస్ బోస్‌ను కాంగ్రెస్ నుంచి తీసేసినపుడు మాకు చాలా కోపం, బాధ కలిగింది,** అన్నారు. (మనకు తెలియని మన చరిత్ర : పేజి. 175).

జమాలున్నీసాకు చిన్నతనంలో సరైన పాఠశాలలో విద్య లభించలేదు. ఆమె స్వయంగా శ్రమించి ఉర్దూ, ఆంగ్ల భాషలను నేర్చుకున్నారు. ఆ విధంగా సంపాదించుకున్న

భాషా పరిజ్ఞానంతో చెల్లెలు రజియా బేగంతో కలసి సాహిత్య సమావేశాలకు హాజరయ్యారు. ఆ క్రమంలో హైదరాబాదు నగరంలోని మలక్‌పేటలో గల తమ గృహాన్ని సాహిత్యకారుల కూడలిగా మార్చారు. ఆమె **'బజ్మె ఎహబాబ్'** పేరుతో ఒక సాహితీ మిత్రుల సంఘం ఏర్పాటు చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో వారి ఇంట సాహితీ సమావేశాలు, చర్చలు, గోష్ఠులు జరిపారు. ఆ సమావేశాలలో యువ రచయితలు-కవులు పాల్గొనేవారు. ఆ సత్సంగంలో సాహిత్య చర్చలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజల సమస్యల గురించి, జాతీయోద్యమం గురించి, సామ్యవాద భావాల గురించి, కమ్యూనిస్టు పార్టీ గురించి, అహేతుక ఆచారసంప్రదాయాల మీద చర్చలు సాగేవి. ఆ చర్చలలో జమాలున్నీసా తన సోదరి రజియా మాత్రమే కాకుండా ఆమె అన్నదమ్ములు కూడా భాగస్వామ్యులయ్యేవారు.

ఆ కార్యక్రమాలలో భాగంగా ఏర్పడిన భావాల మూలంగా పరాయి పాలకుల పెత్తనం నుండి మాత్రమే కాకుండా మతమౌఢ్యం, ఛాందసం భావాల నుండి కూడా ప్రజలు విముక్తి కావాలని ఆమె ఆశించారు. ఇస్లాం మతం ప్రబోధించిన మౌలిక ధార్మిక సూత్రాలకు వ్యతిరేకంగా వివిధ అహేతుక కర్మకాండలు స్వమతస్థులలో చోటు చేసుకున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. అటువంటి అహేతుక సంప్రదాయాలను ఆమె నిరాకరించడమే కాకుండా వాటి మీద చర్చలు జరిపారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు పండుగను (మిలాద్-యే-నబి) పురస్కరించుకుని చర్చా కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితి చేశారు.

ఈ సందర్భంగా ఇస్లాం మతం యొక్క నిజమైన సందేశాన్ని వివరిస్తూ, కొంత మంది ముస్లింలు అనుసరిస్తున్న అభ్యంతరకరమైన కర్మకాండల గురించి చర్చించి, హేతుబద్ధం కాని ఆచార సంప్రదాయాలను పూర్తిగా తిరస్కరించాల్సిందిగా జమాలున్నీసా ప్రజలను కోరారు. ఆ కాలంలో అమలులో ఉన్న పర్దా పద్ధతిని ఆమె తిరస్కరించారు. ఆ తిరస్కారం స్వజనుల ఆగ్రహానికి కారణమైనప్పటికి జమాలున్నీసా లెక్కచేయలేదు. ఆగ్రహించిన సన్నిహితులకు తన అభిప్రాయాన్ని తర్కబద్ధంగా వివరించి నచ్చచెప్ప ప్రయత్నించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల నైతిక మద్దతుతో తన అభిప్రాయాల మీద జమాలున్నీసా బాజీ చివరివరకు దృఢంగా నిలిచారు.

జాతీయోద్యమ కార్యక్రమాలలో తనదైన పాత్ర నిర్వహిస్తూ వచ్చిన జమాలున్నీసా, కమ్యూనిస్టు ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. అసమాన సమాజంలోని ప్రజలకు సమసమాజం స్థాపించి పెట్టేందుకు ఆయుధంగా వెలుగులోకి వచ్చిన కమ్యూనిజం ప్రభావానికి ఆమె సోదరులు అన్వర్, జఫర్, సోదరి రజియా బేగం ప్రభావితులయ్యారు. సామ్యవాద సాహిత్యాన్ని పఠిస్తూ, చర్చిస్తూ సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ ప్రజలలో కలసి పనిచేయడం ఆరంభించారు. అన్నిరంగాలలో సమానత్వం సాధించడం, సమసమాజ స్థాపన

లాంటి మహోత్తర లక్ష్యాలు కమ్యూనిజం ద్వారా మాత్రమే సాధ్యమని నమ్మిన జమాలున్నీసా బాజి కుటుంబ సభ్యులు ఆ దిశగా ఎంతో నిబద్ధతతో ముమ్మందుకు సాగారు.

ఈ లక్ష్యాల సాధనకు తమ ప్రాణాలు బలిపెట్టడానికి కూడా ఆమె అన్నదమ్ములు జఫర్, అన్వర్‌లు సిద్దమయ్యారు. ఆ సోదరులకు మద్దతుగా జమాలున్నీసా బాజి, చెల్లెలు రజియా బేగం, ఇతర కుటుంబ సభ్యులు కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల ప్రచారానికి తోడ్పడ్డారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీ మీద పలు ఆంక్షలు, నిషేధాలు ఉన్నప్పటికి పోలీసుల, గూఢచారుల కంటపడకుండా తమ ఇంటిని రహస్య కేంద్రంగా చేసుకుని జమాలున్నీసా ఎంతో ధైర్యంతో పార్టీ కార్యకలాపాలను నిర్వహించారు.

జమాలున్నీసా కుటుంబం వామపక్షభావాల వైపుగా సాగించిన ప్రస్థానం గురించి ఈ విధంగా వెల్లడించారు. ఆ కథనం ప్రకారం, **మొదట్నించీ మేము వామపక్షానికి దగ్గరగా వుండేవాళ్ళం. 1941లో అభ్యుదయ రచయితల సంఘం అని ఒకటి వుండేది. మఖ్దూం, నజర్ హైదరాబాద్ ఎప్పుడూ వస్తూండేవారు. మేం నలుగురు అక్క చెల్లెళ్ళం. ఈ మీటింగులకి బహిరంగంగా వెళ్ళేవాళ్ళం. అమ్మకూడా వచ్చేది. కొంతమంది చిల్‌మన్ల** (చాటుకోసం చేసిన ఏర్పాటు) **వెనుక కూర్చునేవాళ్ళు...సజ్జాద్ జహీర్, ఓంకార్, పర్షాద్ లాంటి వాళ్ళు చాలా మంది అండర్‌గ్రౌండ్‌లో వున్నప్పుడు మా యింట్లో వుండే వాళ్ళు. 1947 తర్వాత లక్నోలో హిందీ కాన్ఫెరెన్స్-మౌలానా ఎసియాటిక్ కాన్ఫరెన్స్-వెళ్ళాం. అక్కడ ఎర్ర జెండాలు ఎగరేశాం. చాలా మంది అరెస్టయ్యారు.**

ఈ క్రమంలో జమాలున్నీసా ప్రముఖ కమ్యూనిస్టు నేత ప్రమీలా తాయిని కలుసు కున్నారు. 1946లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. 1946 నవంబరులో పార్టీ మీద నిషేధం విధించబడింది. కమ్యూనిస్టు పార్టీ మీద విధినిషేధాల కారణంగా, నిజాం ప్రభుత్వం చర్యల మూలంగా రహస్యంగా ఆమె కార్యకలాపాలను నిర్వహించాల్సి వచ్చేది. నాయకులకు, పార్టీ కార్యకర్తలకు ఆశ్రయం కల్పించడం, ఆహారం అందించడం, నాయకుల మధ్య సమాచారం చేరవేయడం, ఆయుధాలను సరఫరా చేయడం, ఆయుధాలను దాచి పెట్టడం లాంటి బాధ్యతలను జాగ్రత్తగా నిర్వహించారు.

ఆ విషయాలను వివరిస్తూ, **నేను బయటకు వెళ్ళలేకపోయేదాన్ని కాదుకాని అండర్ గ్రౌండ్‌లో ఉన్నవాళ్ళు వచ్చి ఉండిపోయేవారు. భర్తతో వాళ్ళు నా అన్న స్నేహితులని చెప్పేదాన్ని. మా కుటుంబం వాళ్ళనంతా చూసి క్రమంగా ఆయనకొక నమ్మకం కుదిరింది. నా అన్న తమ్ముళ్ళంతా కాలేజీలు వదలి ఉద్యమంలో చేరి చాలా బాధలుపడ్డారు. అయుధాలిక్కడే దాచేవారు. అన్వర్, జఫర్, నా అన్న వరస హఫీజ్ వీళ్ళంతా కలసి పని చేసేవారు. వాళ్ళంతా అరెస్టయ్యారు. అన్వర్ చాలా సీరియస్ జబ్బుతో బాధపడుతుండేవాడు.**

**ఖమర్, మజర్ అండర్ గ్రౌండ్‌లో ఉండి అరెస్టయ్యారు. అన్వర్ అత్తగారిల్లు ఎక్కడో దూరంగా హబ్సీగూడా రామాంతపూర్‌లో వుండేది. మఖ్దూం, ఓంకార్ అక్కడే ఉండేవాళ్ళు. మఖ్దూం, జఫర్, షఫీఖ్, బెవ్‌జద్‌తోపాటు అరెస్టయ్యాడు...జఫర్ సాయుధ పోరాటం జరుగుతున్నప్పుడు ఊళ్ళకి వెళ్ళి, అక్కడి పరిస్థితులను చూసి నిరాశతో తిరిగి వచ్చాడు. జఫర్ రివాల్వర్లను దాచిపెడితే, అఖ్తర్ వాటిని ఒక పెట్టెలో పెట్టి పోలీసులు వచ్చినప్పుడు వాటిపైన కూర్చుంది. ఆమె మురాద్ నగర్ వెళుతూ రివాల్వర్ నాకిచ్చింది. నేను దాన్ని ఇక్కడే దాచాను.**

**జిన్నా ఇంటిర్మ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్లజెండాల ప్రదర్శనలిమ్మని పిలుపునిచ్చాడు. అందరూ దాన్ని పాటించారు. కాని మేము పాటించలేదు. మా అన్నలు ఎర్రజెండా ఎగురవేశారు. చుట్టుపక్కల వాళ్లంతా ఇష్టపడలేదు. రాజ్ బహుదుర్ గౌడ్, జవార్ (జవ్వాద్ రజ్వీ) హస్పిటల్ నుంచి తప్పించుకుని ఇక్కడికే మొదలు వచ్చారు. 1947 ప్రారంభంలో ఎక్కడ చూసినా పోలీసులుండేది. రిక్షాకు పర్దా కట్టించి వాళ్ళనిక్కడి నుంచి వేరొకచోటుకి తీసుకెళ్ళాం. రాజ్ మమ్మల్ని అండర్ గ్రౌండ్ వెళ్ళిపొమ్మన్నాడు. అఖ్తర్ మధ్యలో ఒకసారి పెరోల్ మీద వచ్చి వెళ్ళిపోయాడు.**

**1948లో నా భర్త చనిపోయాడు. నేను తెలుగు నేర్చుకోవడం ప్రారంభించాను. పార్టీ కోరకు డబ్బు వసూలు చేయటం మొదలుపెట్టాను. తాయి (ప్రమీలా తాయి) యశోదా బెన్, బ్రిజ్‌రాణి అంతా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ మీద నిషేధం వచ్చిన తర్వాత అంతా ఇక్కడికి రావడం ప్రారంభించారు. అభ్యుదయ రచయితల సమావేశాలు కూడా జరిగేవి. కమ్యూనిస్టు పార్టీలో విభేదాలు ఎక్కువైపోయాయి. ఆర్.యన్ (రావి నారాయణ రెడ్డి) బొంబాయి వెళ్ళాడు. తర్వాత అఖ్తర్, గోపాలన్ (ఎ.కే.గోపాలన్), జ్యోతిబసు, ముజఫర్ అహమ్మద్‌తో ఏర్పడిన డెలిగేషన్ ఒకటి వచ్చి-1951లో సాయుధ పోరాటం కొనసాగించాలా విరమించాలా అనే విషయం చర్చించడానికి వచ్చారు. మా ఇంటి ముందున్న యింట్లో వాళ్ళు ఉండడానికి ఏర్పాటు చేశాము. మా నాన్న సహాయం చేశాడు. చాలా రాత్రి వరకు మీటింగులు, చర్చలు జరిగేవి,** అని ఆనాటి విషయాలను జమాలున్నీసా వివరించారు.

ఈ విధంగా పోరాట కార్యక్రమాలలో పాల్గొన్న జమాలున్నీసా బాజి కమ్యూనిస్టు పార్టీ పోరాటాన్ని విరమించుకున్న తరువాత పార్టీపరంగా ప్రజలలో పనిచేయాలనుకున్నారు. ప్రధానంగా మహిళలలో ఆమె ఎక్కువగా పని ప్రారంభించారు. ఆ విశేషాలను ప్రస్తావిస్తూ, **పోరాటం విరమించుకున్న తర్వాత, మహిళా సంఘాలు ప్రారంభించాం. కామ్రెడ్ ఘనీ అసిఫ్‌నగర్‌లో అతని భార్యతో ఒక మహిళా సంఘం పెట్టాడు. పర్దావేసుకునే స్త్రీలు ఒక సెంటర్ నుంచి ఇంకో సెంటర్ వెళ్ళేవారు కారు. ఆఘాపురాలో ఒక రాత్రి బడి, మాస్క్ దగ్గర ఇంకో సెంటర్ పెట్టారు. కథలు, గోర్కీ రచనలు చదివేవాళ్ళం. చాలా రోజులు అలా**

**చేశాం. కొంతమంది అమ్మాయిలు పార్టీ సభ్యురాళ్ళయ్యారు. ఎన్నికల్లో పనిచేశారు. నాతో కలసి గుంటూరు, విజయవాడకు వచ్చారు. ఇప్పుడు వాళ్ళంతా పెళ్ళిల్లు చేసుకుని, ఏమీ చేయటం లేద**ని ఆమె పేర్కొన్నారు.

కమ్యూనిస్టు పార్టీకార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్న పలువురు పార్టీ కార్యక్రమాల నుండి క్రమంగా దూరమైప్పటికి జమాలున్నీసా మాత్రం ప్రజాచైతన్య కార్యక్రమాలతో అలాగే కొనసాగారు. ఆ క్రమంలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు మగ్దూం మొహిద్దీన్ మార్గదర్శకత్వంలో సాగిన కార్యకలాపాలను ఆమె వివరిస్తూ, **1952లో మఖ్దూం విడుదలయిన తర్వాత నన్ను స్త్రీలతో పనిచేయమన్నాడు. మేమెట్లా చేయగలుగుతాం? తాయి (ప్రమీలా తాయి) ఇంకా విడుదల కాలేదు. ఆహార ధాన్యాల ధరల సమస్య బాగా పనికొచ్చింది. ముస్లింలలో నిరుద్యోగ సమస్య చాలా ఎక్కువైపోయింది. ఈ సంఘాలు వారిని ఆకర్షించలేదు. ఇంకా కొంత ఆకర్షణీయమైనవి కావాల్సి వచ్చింది. ఓంకార్ స్త్రీల ప్రజాస్వామ్య సంఘం పెట్టడానికి తోడ్పడ్డాడు. దాని నియమావళి తయారు చేశాడు. నలభై మంది స్త్రీలు కుట్టుపని, చేతిపని నేర్చుకునేవారు. మేము రాయటం, చదవటం నేర్పించేవాళ్ళం. పత్రికలు పుస్తకాలు కొనేవాళ్లం. చదవటం, చర్చలు పెట్టడం చేసేవాళ్ళం. డబ్బు సరిపోయేది కాదు. కోఆపరేటివ్ ఇనస్పెక్టరు కోఆపరేటివ్ పెట్టమని సలహా యిచ్చాడు. చాలామంది కాలేజీ టీచర్లు షేర్ హోల్డర్స్‌గా చేరారు. ఆడవాళ్ళకు జీవనాధారం చూపించటం, ఏదైనా పనిగానీ ఒక స్కిల్‌గాని నేర్పించటం ఆ కోపరేటివ్ ఆశయం. చాలా మంది పరీక్షలిచ్చి పాసయ్యారు కూడా. ఇప్పుడు కూడా ఆ పని జరుగుతోంది కాని, తక్కువ శక్తితో, ఇద్దరు టీచర్లున్నారు. తెలుగు, ఉర్దూ ఎనిమిదవ తరగతి దాకా నేర్పుతారు. టెక్నికల్ ఏడ్యుకేషన్ బోర్డు కూడా దీన్ని గుర్తించింది. మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ బ్రాంచ్‌లు కూడా ఉన్నాయి.**

గతంలో **పర్దాలాంటి సమస్యల గురించి చర్చించేవాళ్ళం. చాలా మంది రజియా సజ్జార్ జహీర్, ఇస్మత్ చోగ్తాయి లాంటి వాళ్ళు వచ్చి మాట్లాడేది. ఆ రోజుల్లో స్త్రీలు చదువుకున్న వాళ్ళు రాకపోయినప్పుటికి ప్రశ్నలడిగి ఎన్నో నేర్చుకునేవారు. ఇప్పుడెవరికీ ఆ కుతూహలం లేదు. పార్టీ గురించిగాని, రాజకీయ సమస్యల గురించి కానీ తెలియదు. బహుశ గల్ఫ్‌దేశాల నుంచి వచ్చే డబ్బు కారణం కావచ్చు. కొంత వరకు పార్టీకి ఆసక్తి లేదు. ఏమి పట్టించుకోదు. మహిళా ప్రజాస్వామిక సంఘం ఏమైనా కాన్ఫెరెన్స్ కెళ్ళాల్సి వచ్చినప్పుడే పనికొస్తుంది.** ఆ విధంగా స్థానికంగా మహిళలలో పనిచేస్తూ జాతీయస్థాయి కార్యక్రమాలలో కూడా ఆమె చురుకుగా పాల్గొన్నారు. స్వయంగా ఇతర ప్రాంతాలలో జరుగుతున్న సభలు, సమావేశాలకు హాజరయ్యారు. ఆనాడు జమాలున్నీసా, ఆమె సహచరులు ఎదుర్కొన్న ఇబ్బందులు అమె మాటల్లో ఇలా ఉన్నాయి.

**1952-53లో ఢిల్లీ కాన్ఫెరెన్స్‌లో మేము అఖిలభారత మహిళా కాన్ఫెరెన్స్** (AIWC) **నుంచి వేరుపడ్డాం. 1954లో కలకత్తా సమావేశంలో మహిళా ప్రజాస్వామిక సమాఖ్య నిర్ణయించబడి, ఒక నియమావళి తయారు చేశారు. రేణు చక్రవర్తి, హజ్రబేగం (హజరా బేగం) పాల్గొన్నారు. అఖిల భారత మహిళా కాన్ఫరెన్స్...కలకత్తా, ఢిల్లీ సమావేశాలకి వెళ్ళాను. ఇక్కడ పనిచేస్తున్న బద్రున్నిసాను తీసుకెళ్ళాను. ఆమెకు రెండేళ్ళ పాప వుండేది. ఆమె కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నట్టు పేపర్లో వస్తే ఆమె అత్తవారి వాళ్ళు అభ్యంతరం పెట్టారు. తర్వాత ఆమె భర్త విడాకులిచ్చాడు. ఆమె చాలా భయపడిపోయి ఇక్కడేవుండేది. ఆమెనోక ముసలతని కిచ్చి పెళ్ళి చేయాలని చూశారు. ఆమెకది ఇష్టం లేక ఒప్పుకోలేదు. ఇక్కడే టీచరు ఎంతో బాగా పనిచేస్తోంది. ఇప్పుడు చాలామంది స్త్రీలు కోఆపరేటివ్ సెంటరుకి నేర్చుకోవటానికి వస్తారు. కాని చాలా కొద్దిమంది పని చేయడానికి వస్తారు. వాళ్ళకు పని అంతగా అవసరం లేదు. వాళ్ళవాళ్ళెవరో ఒకరు బయట పనిచేస్తుంటారు కాబట్టి. మా బంధువొక అమ్మాయి క్లాసులు తీసుకోడానికి ప్రయత్నించింది. కాని ఎక్కువమంది రాలేదు. నాకేవిధంగా పనిసాగించాలో తెలియటం లేదు. మతోన్మాదము కూడా కొంత కారణమై యుంటుంది. ఇదివరకు పర్దాను వ్యతిరేకించడానికి ప్రయత్నించారు. ఇప్పుడట్లా కాదు. ఇదివరకు ముస్లిం స్త్రీలు ఊరేగింపుల్లో వచ్చేవారు. నేనే ఎన్నోసార్లు ఎలక్షన్ మీటింగులకి, కాంపేన్లకి** (ప్రచార కార్యక్రమాలకు) **తీసుకెళ్ళాను. హిందూ స్త్రీలు కూడా అంతగా పట్టించుకోవటం లేదు.**

ఆ ప్రతికూల వాతావరణంలో కూడా జమాలున్నీసా కమ్యూనిస్టు కార్యకర్తగా కొనసాగారు. పార్టీ నాయకులు ఎక్కడకు వెళ్ళమంటే అక్కడకు వెళ్ళి బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించారు. తెలంగాణా ప్రాంతానికి మాత్రమే ఆమె పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలలో కూడా పర్యటించారు. ఆ సమయంలో ప్రజలు ప్రధానంగా మహిళలు వారి పట్ల ఏవిధంగా స్పందించారో వివరించారు. ఆమెకు తెలుగు పూర్తిగా రాదు. ఆ కారణంగా తెలుగు మాట్లాడే ప్రజలతో ఆమె పూర్తిగా మమేకం కాలేకపోయారు.

ఈ విషయాన్ని వివరిస్తూ, **తెలుగు తెలిసి ఉంటే ఇంకా పని చేయడానికి తోడ్పడేది. చాలా మంది బాగా ఉత్సాహంగా ఉండే అమ్మాయిలుండేవారు. ఇప్పుడు వాళ్ళ పేర్లు జ్ఞాపకం రావటం లేదు. మమ్మల్నెక్కడకి వెళ్ళమంటే అక్కడికి వెళ్ళేవాళ్ళం, ఎక్కడికి ఎలా వెళ్ళడం అనికూడా అడక్కపోయేవాళ్ళం. ఆర్.వి (రావి నారాయణరెడ్డి) వెళ్ళమనేవాడు. మేం వెళ్ళిపోయేవాళ్లం. ఒకసారి ఆర్.యన్ తో మిర్యాలగూడ వెళ్ళాం...బోన్‌గిర్, హుజూర్ నగర్ ఎలక్షన్ ప్రాపగాండాకు వెళ్ళాం. ఒక ముసలమ్మ నన్ను తీసుకెళ్ళి భోజనం పెట్టింది. కామ్రేడ్లని ఎప్పుడూ బాగా చూసుకునేవారు ప్రజలు,** అని ఆమె అన్నారు.

జమాలున్నీసా కుటుంబం యావత్తు అటు కమ్యూనిస్టులు కావటంగాని లేదా కమ్యూనిస్టు సానుభూతిపరుగా మెలగటం వలన కాని, ఆ క్రమంలో కుటుంబ సభ్యులు ప్రదర్శించిన నిబద్ధత మూలంగా కాని వారికి కమ్యూనిస్టుపార్టీలో ప్రముఖులుగా వెలుగొందుతున్న వ్యక్తులతో సత్సంబంధాలు కుదిరాయి. ఆ కారణంగా ఆమె చెల్లెలు, తమ్ముళ్లకు ఖైఫి అజ్మీ లాంటి ప్రముఖ కవుల కుటుంబం నుండి పెళ్ళి సంబంధాలు వచ్చాయి. ఆ విషయాన్ని కూడా జమాలున్నీసా ఈ క్రింది విధంగా వివరించారు.

**ఖైఫి అజ్మీ నా చిన్న ఆడబిడ్డను పెళ్ళిచేసుకున్నాడు. జకియా(నా చిన్న చెల్లెలు)ను విశ్వామిత్ర ఆదిల్‌కిచ్చి పెళ్ళిచేస్తే బాగుంటుందని ఆయన అన్నాడు. ఆదిల్ పార్టీ సభ్యుడవడమే ముఖ్యకారణం. అంటే పార్టీసభ్యులంటే ఆరోజుల్లో మంచి అభిప్రాయ ముండేది. వ్యక్తిగత సామర్థ్యము గాని, క్లాసు కల్చరల్ బ్యాక్‌గ్రౌండ్ గురించి గాని ఆలోచించే వాళ్ళం కాదు. బతుల్ ఇంకొక ఉదాహరణ. ఆమె పార్టీసమావేశాల కొచ్చేది. పాటలు పాడేది, కవిత్వం చదివేది. ఆమె ఒక నవాబు కూతురు. పార్టీలోకి వచ్చింది. ఆమె తండ్రికి ఇంకొక స్త్రీతో సంబంధముండేది. తన తల్లి చనిపోయిందనే కసితో బతుల్ పార్టీలో చేరింది. అటు వంటప్పుడు ఎన్నాళ్ళుంటుంది పార్టీలో ? కొంతవరకు కమిట్‌మెంట్, ఆసక్తి ఉండి రావటం వేరు-ఆమెకొక పదకొండు సంవత్సరాల కొడుకు కూడా ఉండేవాడు. ఆ దశలో పార్టీలోకి చాలామంది స్త్రీలు, పురుషులు వచ్చారు. పార్టీ వాళ్ళకు సైద్ధాంతికంగా సరియైన శిక్షణ కూడా ఇవ్వలేదు. మానసికంగా బతుల్ షియా అవటం వల్ల బాధను ఓర్చుకోగల్గాలి అనే భావంతోనూ, తన మానసిక సమస్యలతోనూ పార్టీలోకి వచ్చింది. వాటిని దాటలేక పోయిందామె. తర్వాత ఆమె భర్తను వొదిలేసింది. పార్టీ మళ్ళీ కలపడానికి ప్రయత్నించింది. కాని చేయలేకపోయింది. పార్టీ ఆమెను సపోర్టు చేసింది. జహీర్ ఇంకో ఉదాహరణ. చాలా క్లిష్ట పరిస్థితులలో ఆమె కుటుంబాన్ని వదలి, పార్టీలో కొచ్చింది. మోయిస్‌ను పెళ్ళిచేసుకుంది. ఇద్దరూ పార్టీలో చాలా ఆక్టివ్‌గా ఉండేవాళ్ళు చివరిదాకా. మూడేళ్ళ క్రితం ఆమె కాన్సర్‌తో చనిపోయింది. అతను మెదక్ పార్టీ యూనిట్‌కి సెక్రటరీ.**

**ఇప్పుడు పార్టీలో సరియైన ప్రోగ్రాం గాని, పనిగాని లేదు. పైగా ఆత్మవిమర్శన చేస్తూ వుంటాము. నేను అమ్మాయిలనీ, అబ్బాయిలనీ పిలచి మీటింగులు పెట్టాను. మహేంద్ర కూడా వచ్చాడు. ఎలక్షన్ల తర్వాత ఎవరూ పట్టించు కోలేదు. యువకుల్ని చైతన్యవంతుల్ని చేసి కార్యకర్తలుగా తయారుచేయడానికి ఎటువంటి గట్టిప్రోగాం లేదు. చిన్నవాళ్ళను తేవాలి. మేమింకా ఎన్నాళ్ళు చేస్తాము? 25,30 సంవత్సరాలు చేశాము. పార్లమెంటరీ బై ఎన్నికలప్పుడు రాజ్ (రాజ్ బహుదుర్ గౌడ్) కి చెప్పాను-ఎక్కువగా వోటు వచ్చింది ఆసిఫ్ నగర్ నుంచి-2200 దాకా, దాంట్లో 25-30 దాకా మా కుటుంబందే. రాజ్ అభ్యర్థి కాబట్టి మేమే తప్పనిసరిగా పనిచేయాలనుకున్నాం,** అన్నారు. ఈ విధంగా ఆనాటి రాజకీయ

పరిస్థితులను, పార్టీ విధివిధానాల్లో వచ్చిన మార్పులకు ప్రత్యక్ష్యసాక్ష్యులుగా నిలచిన జమాలున్నీసా బాజి పేర్కొన్నారు.

చివరి వరకు కమ్యూనిస్టుగా కొనసాగిన ఆమె ఆనాటి త్యాగాలను, ఈ వివరాలను తెలిపేనాటికి కమ్యూనిస్టు పార్టీపరిస్థితి, పార్టీనాయకులు వారి కుటుంబాల తీరుతెన్నులను తన కుటుంబ సభ్యుల త్యాగాలతో పోల్చుతూ, **ఇక, ఇప్పుడు పార్టీ లీడర్ల పిల్లల్ని చూస్తే... వాళ్ళు పార్టీకై ఏమి చేయరు. కొంత మంది మాస్కో వెళ్ళి వచ్చారు. అయితే పార్టీకేంచేశారు? నా అన్నదమ్ములా–జఫర్ ఆక్సిడెంటులో చనిపోయాడు. అన్వర్ చాలా కష్టాలు పడ్డాడు. జాల్నా జైలులో వున్నాడు. ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని తర్వాత చనిపోయాడు. ఆయన కూతురు ఎం.ఎస్. సి చేస్తున్నది. భార్య తర్వాత చదువుకుని ఉద్యోగం చేసింది...ఆ రోజుల్లో 500 మంది స్త్రీలను పోగుచేయగలిగేదాన్ని. ఇప్పుడు 50 మంది రారు,** అంటూ జమాలున్నీసా బాజీ నిరాశను వ్యక్తంచేశారు.

ఈ విధంగా అటు జాతీయోద్యమం, ఇటు నిజాం వ్యతిరేకపోరాటం, మరోవైపున తెలంగాణా రైతాంగ పోరాటాలలో మాత్రమే కాకుండా సామాజిక మార్పులకు, మత ఛాందసానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాలలో చురుకుగా పాల్గొన్న జమాలున్నీసా చివరి వరకు ప్రజలకోసం, ప్రధానంగా మహిళా సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పనిచేస్తూ, తన ఆలోచననలను పలువురితో పంచుకుంటూ గడిపారు.

(ఈ వ్యాసాన్ని 1986లో స్త్రీ శక్తి సంఘటన (హైదరాబాద్) వారు ప్రచురించిన **'మనకు తెలియని మన చరిత్ర (తెలంగాణా రైతాంగపోరాటంలో స్త్రీలు–ఒక సజీవ చరిత్ర)'** గ్రంథంలోని వివరాల ఆధారంగా రూపొందించాను. ఈ గ్రంథం సంపాదకవర్గం 1981 –82 ప్రాంతంలో జమాలున్నీసా బాజి, ఆమె చెల్లెలు రజియా బేగంలను కలసి మాట్లాడగా వారు తమ కార్యకలాపాలను స్వయంగా తెలిపారు. ఆ సమాచారాన్ని '**మనకు తెలియని మన చరిత్ర**' పుస్తకంలో సంపాదకులు అక్షరబద్ధం చేశారు. ఈ సందర్భంగా '**మనకు తెలియని మన చరిత్ర**' గ్రంథం సంపాదకులు, ప్రచురణకర్తలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. – రచయిత.)

◆◆◆

## యుద్ధం వద్దు..వద్దని నినదించిన చియ్యేడు ఆడపడుచు

# 44. రబియాబీ

(-)

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న సామాన్య స్త్రీలు పలు ఇక్కట్లు పడాల్సి వచ్చింది. ఈ వెతలు మూడు రకాలుగా ఆనాడు మహిళలను చుట్టుముట్టాయి. తొలుత కుటుంబం, ఆ తరువాత సమాజం, చివరకు బ్రిటీష్ పోలీసు మూకల నుండి ఇబ్బందుల వాతావరణం. ఈ సమస్యలు ముస్లిం మహిళల విషయానికి వచ్చేసరికి మరింత కఠినమై వారిని ముందుకు సాగనిచ్చేవి కావు. బ్రిటీష్ పోలీసుల దారుణ దాష్టీకాల కంటే, కుటుంబం, సమాజం కల్పించే ఆటంకాల ప్రభావం వారి మీద ఎక్కువ ఉండడం వలన, మాతృదేశ సేవామార్గంలో కొంతవరకు అవరోధాలయ్యాయి. అయినప్పటికీ రబియాబీ లాంటి సాహసులు ప్రతికూల వాతావరణాన్ని అధిగమించి జాతీయోద్యమంలో పాల్గొని చరిత్ర సృష్టించారు.

అనంతపురం జిల్లా చియ్యేడు గ్రామానికి చెందిన మహిళ రబియాబీ. ఆమె భర్త యం.మొహిద్దీన్ సాహెబ్ స్వాతంత్ర్య సమరయోధులు. భర్తతోపాటుగా ఆమెను కూడా జాతీయ భావాలను ఆకర్షించాయి. ఆనాడు మహాత్ముని నేతృత్వంలో సాగుతున్న జాతీయోద్యమంలో ఆమె భాగం పంచుకోవాలనుకున్నారు. కుటుంబం, సమాజం సహజంగానే ఆ ఆలోచనలను ముందుకు సాగనివ్వలేదు. ఆమె నిరాశ చెందలేదు. భర్త కూడా స్వాతంత్ర్య సమరయోధుడు కావడం వలన ఆయనతో తన అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకున్నారు. భార్య ఆలోచనల పట్ల మొహిద్దీన్ సాహెబ్ సానుకూలంగా స్పందించారు. విముక్తి పోరాటంలో

పాల్గొనాలని అభిలషిస్తున్న ఆమెను ఆయన ప్రోత్సహించారు, ఆమెకు తోడుగా నిలిచారు.

ఆ సమయంలో ద్వితీయ ప్రపంచయుద్ధం సాగుతోంది. భారతీయుల ఇష్టా యిష్టాలతో పని లేకుండా, భారతదేశాన్ని కూడా బ్రిటీష్ పాలకులు తమపక్షంలో కలిపేసుకున్నారు. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా భారత జాతీయ కాంగ్రెస్ ఉద్యమించింది. భారతదేశ వ్యాప్తంగా యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు ఊపందుకున్నాయి. ఆంధ్రులు కూడా మరెవ్వరికీ ఏమాత్రం తీసిపోకుండా ఉద్యమించారు, ప్రదర్శనలు నిర్వహించారు. ఆ క్రమంలో అనంతపురం జిల్లాలో జరిగిన యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలలో రబియాబీ స్వయంగా పాల్గొన్నారు. పర్దా చాటున వుండే ముస్లిం మహిళ బహిరంగ ప్రదర్శనలో పాల్గొటం మాత్రమే కాకుండా **యుద్ధం వద్దు వద్దంటూ** నినదించడంతో ప్రజలు ఆశ్చర్యపోయారు, ఆమె ధైర్యసాహసాలను అభినందించారు.

ఆ తరువాత కూడా ఆమె పలు కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు. 1941లో అనంతపురం ఆర్ట్సు కళాశాల ఆటల మైదానంలో జరిగిన వ్యక్తి సత్యాగ్రహంలో రబియాబీ పాల్గొన్నారు. ఒక ముస్లిం మహిళ జాతీయోద్యమంలో భాగంగా సాగిన ప్రదర్శనలో పాల్గొనడం, యుద్ధానికి వ్యతిరేకంగా నినాదాలు ఇవ్వడం, వ్యక్తి సత్యాగ్రహంలో స్వయంగా బహుముఖ పాత్ర వహించడం తెలుగుగడ్డ మీద ప్రథమమని పలువురు శ్లాఘించారు.

ఆనాడు జైళ్ళల్లో మహిళలకు అవసరమైన కనీస వసతులు కూడా ఉండకపోవడంతో మహిళలు అరెస్టులకు ఇష్టపడేవారు కాదు. జాతీయోద్యమంలో భాగంగా సాగిన పలు కార్యక్రమాలలో రబియాబీ పాల్గొన్నప్పటికీ, ఆమె ఏనాడు అరెస్టు కాకపోవడంతో ఆ యోధురాలి సాహసకృత్యాలు నమోదుకు నోచుకోలేదు. ఆ కారణంగా రబియాబీకి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో లేకుండా పోయింది.

◆◆◆

' నా మాతృభూమి విముక్తి కోసం ఏనాడయితే నేను పోరాట దీక్ష చేపట్టానో, ఆనాడే నా ప్రాణం మీద తీపిని వదులుకున్నాను...మన శత్రువులలో ఒకరిని నేను అంతం చేశాను...నేను నా కర్తవ్యాన్ని నిర్వహించాను...నా పవిత్ర కార్యంలో భగవంతుని వద్ద మీరంతా నాకు సాక్ష్యం...నేను చేసిన పని పట్ల కించిత్తు కూడా బాధపడటంలేదు. నిజమైన పఠాన్‌గా ఎంతో గర్విస్తూ, మరణాన్ని స్వీకరిస్తున్నాను '

**– మహమ్మద్ షేర్ అలీ**



## రజాకార్ల మీద నిషేధం విధించమని నిజాంను కోరిన సాహసి

# 45. ముల్లా అబ్దుల్ బాసిత్

(1889-0)

**స్వ**దేశీ పాలకుల మీద పరాయి ప్రభువుల పెత్తనం అంగీకరించలేక వలస పాలకులను పాలద్రోలాలన్న ఆశయానికి కట్టుబడి శతాబ్దికాలంగా కృషిచేసిన యోధుల కుటుంబం నుండి వచ్చి ప్రముఖులు ముల్లా అబ్దుల్ బాసిత్.

1889లో ప్రస్తుత కర్నాటక రాష్ట్రం గుల్బర్గాలో ముల్లా అబ్దుల్ బాసిత్ జన్మించారు. పునర్వికాసోద్యమ నాయకునిగా ఖ్యాతిగడించిన ముల్లా అబ్దుల్ ఖయ్యూం ఆయన తండ్రి. సోదరుడు అబ్దుల్ మునీం కూడా జాతీయ భావాలు కలిగిన రచయిత. అబ్దుల్ బాసిత్ పంజాబ్ విశ్వవిద్యాలయం నుండి **ఫాజిల్** పూర్తిచేశారు. తండ్రి ముల్లా అబ్దుల్ ఖయ్యూం జాతీయ భావాల మీద వెలువడిన కువిమర్శలను ముల్లా బాసిత్ తన పదునైన సమాధానాలతో విమర్శకుల అటకట్టించి ఇటు తండ్రికి, అటు జాతీయోద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారు. ఆయన నైజాం ప్రభుత్వంలో జిల్లా న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు.

ముల్లా అబ్దుల్ బాసిత్ తండ్రి అబ్దుల్ ఖయ్యూం మార్గంలో జాతీయ భావాలను పుణికి పుచ్చుకున్నారు. తండ్రి బాటలో నడుస్తూ **ది రెడ్ క్రెసెంట్ సోసైటీ** అను స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి 1912 నాటి బల్కన్ యుద్ధంలోని టర్కీ క్షతగాత్రులకు మూడు లక్షల రూపాయలను విరాళం అందచేశారు. 1905లో తండ్రి ప్రోత్సాహంతో ఏర్పడిన **అంజుమన్ మారిఫ్** లో ప్రధాన పాత్ర వహించారు. ఈ సంస్థ ద్వారా హైదరాబాదు ప్రజల


ఆర్థిక, సామాజిక, మేధోపరమైన అభివృద్ధికి మార్గదర్శకత్వం వహించారు. 1905లో అక్బర్ అలీ సంపాదకత్వంలో ఆరంభమైన **సహీఫా** ఉర్దూ పత్రికను దినపత్రికగా మార్చి జాతీయ భావాలకు ప్రాధాన్యత కల్పించారు. స్వయంగా రచయిత అయిన బాసిత్ **సహీఫా** ద్వారా తన రచనలతో జాతీయవాదులకు తొడ్పాటునిచ్చారు. విద్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ 1915 లో **హైదరాబాద్ ఎడ్యుకేషనల్ కాన్ఫెరెన్స్** స్థాపించి అవసరార్థులైన పేద విద్యార్థులకు నలభైవేల రూపాయల ఉపకారవేతనాలను ఆయన స్వయంగా అందించారు.

ఈ విధంగా పలు ఇటు జాతీయోద్యమానికి అటు ప్రజోపకర కార్యక్రమాలకు తొడ్పాటునిస్తూ హైదరాబాద్ ప్రజా జీవనంలో తనదైన పాత్రను నిర్వహించిన అబ్దుల్ బాసిత్ **ఖాదిం** ఉర్దూ పత్రిక ఆరంభించారు. సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా జాతీయవాదుల పక్షంగా నిలచిన ఈ పత్రిక నైజాం విలీనోద్యమంలో కూడా ప్రముఖ పాత్ర వహించింది. రజాకార్ల వ్యవస్థను రద్దుచేయాలని కోరుతూ,ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానాన్ని విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు బహిరంగ లేఖ రాయాలని సంకల్పించిన ఫరీద్ మీర్జా వ్యక్తంచేసిన ఆలోచనలకు ఆయన **ఖాదిం**లో అక్షరరూపం కల్పించడం మాత్రమే కాకుండా, ఆ డిమాండ్‌కు మేధావుల మద్దతును కూడగట్టారు. ఆ ప్రకటన తరువాత ముల్లా బాసిత్ వద్దకు హకీం మక్సూద్‌ను నిజాం నవాబు పంపాడు. ఆ ప్రకటనను ఉపసంహరించుకోవాలని, తక్షణమే తన హాజరీకి రావాలని ఆదేశించాడు. ఆ ఆదేశాలను ముల్లా బాసిత్ ఆయన మిత్రబృందం ఖాతరు చేయలేదు.

నిజాం నవాబు ఆగ్రహాన్ని, రజాకార్ల బెదిరింపులను ఏమాత్రం ఖాతరు చేయకుండా **ఖాదిం** ద్వారా జాతీయ భావాలను వెల్లడిచేస్తూ, రజాకార్ల చర్యలను రచ్చకీడ్చారు. ఆ కారణంగా ఖాదిం పత్రిక నిషేదానికి గురయ్యింది. ఇండియన్ యూనియన్‌లో నైజాం విలీనం కోరుతున్న ప్రముఖులను దేశ ద్రోహులు, భారత ప్రభుత్వ ఏజెంట్లు అని చిత్రీకరిస్తూ 'ఇత్తెహదుల్ ముస్లీమీన్' అనుకూల పత్రికలు కుమ్మరిస్తున్న ఆరోపణలను **ఖాదిం** ద్వారా ఆయన పూర్వపక్షం చేశారు. ఈ చర్యలతో మండిపడిన నిజాం ప్రభుత్వం విశ్రాంత నైజాం ప్రభుత్వాధికారిగా బాసిత్‌కు లభిస్తున్న పెన్షన్‌ను నిలిపి వేసింది. ఆలోగా నైజాం సంస్థానం మీద పోలీసు యాక్షన్ జరగడం, ఇండియన్ యూనియన్‌లో నైజాం విలీనం కావడంతో ముల్లా అబ్దుల్ బాసిత్‌కు ఆ తరువాత ఎటువంటి నష్టం కలుగలేదు.

ఈ పోలీసు చర్య తరువాత ఏర్పడిన మిలటరీ ప్రభుత్వం ద్వారా ప్రజల పునరావాస కార్యక్రమాల కమిటీలో సభ్యునిగా నియమితులైన ఆయన బాధిత ప్రజానీకానికి సేవలను అందించారు. ఈ మేరకు తాను ఏర్పాటు చేసిన సంస్థలను, పత్రికలను నిర్వహిస్తూ ముల్లా అబ్దుల్ బాసిత్ హైదరాబాద్ ప్రజాజీవనంలో మమేకమై ప్రశాంత జీవితం గడిపారు.

◆◆◆



## తెలంగాణా ప్రజాపోరుకు తోడ్పడిన యోధురాలు

# 46. రజియా బేగం

(1916-)

**ప**రాయి పాలకుల పెత్తనం నుండి స్వదేశీయులను విముక్తిగావించేందుకు నడుం కట్టి ముందుకు నడిచిన మహిళామ తల్లుల్లో కొందరు ఆ తరువాత విశ్రాంతిగా కూర్చోకుండా ఇండియన్ యూనియన్‌లో కలవడానికి ఇష్టపడని సంస్థానాధీశులను ఒప్పించడానికి ఉద్యమించారు. అటువంటి మహిళా పోరాటయోధులలో రజియా బేగం ఒకరు.

1916 ప్రాంతంలో హైదరాబాదు సంస్థానంలో రజియా బేగం జన్మించారు. ఆమె తల్లిది హైదరాబాదు కాగా తండ్రి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. నైజాం సంస్థానంలో ఆమె తండ్రి న్యాయాధికారి. తల్లితండ్రులు ఉదార స్వభావులు కావడంతో లభించిన స్వేచ్ఛ వలన రజియా బేగంకు అన్నదమ్ముల తోపాటుగా చిన్ననాటనే స్వతంత్రభావనలు అలవడ్డాయి. పన్నెండు సంవత్సరాల వయస్సులోనే అక్కయ్య జమాలున్నీసా బాజి ఇతర కుటుంబ సభ్యులతో కలసి నిజాం సంస్థానంలో నిషేధించబడిన **'నిగార్'** ఉర్దూ పత్రికను రహస్యంగా చదవడం ఆరంభించారు. ఆ పత్రిక లక్నోకు చెందిన నియాజ్ ఫతేపూరి సంపాదకత్వంలో ప్రచురితం అయ్యేది. మతమౌఢ్యానికి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడడమే కాకుండా స్వాతంత్ర్య సాధన, సామ్రాజ్యవాద వ్యతిరేక లక్ష్యాల దిశగా ప్రజలను **నిగార్** పత్రిక చైతన్యపర్చింది. (హైదరాబాదు సంస్థానంలో రాజకీయచైతన్యం, విద్యార్థి–యువజనుల పాత్ర (1938–1956), ఎస్.ఎం.జవాద్ రజ్వి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1985, పేజి.25)

విశాల ఉదారభావాలు గల కుటుంబంలో పుట్టిన రజియా బేగం తన కుటుంబం గురించి, తన గురించి, తమ కార్యకలాపాల గురించి వివరిస్తూ, **మా కుటుంబం చాలా సంకుచిత స్వభావం కలది. ఒక్క మా తండ్రిగారే ఉదార స్వభావం కలవాడు. మేము పల్లెటూళ్ళో ఉండేది. బాజి పెళ్ళయిన** (జమాలున్నీసా బాజి) **తరువాత మాకు పట్నంలో ఒక చోటంటూ దొరికింది. మేము ఉర్దూ, పర్షియన్ నేర్చుకున్నాం. ఇంగ్లీషు వచ్చేదికాదు. ఒక గోడపత్రిక 'తమీర్' అని ప్రారంభించాం. అంతా చేత్తోనే రాసేవాళ్ళం. మేం చదివి ఇతరులను కూడా చదివించేవాళ్ళం. ఇంగ్లీషు నేర్చుకోవడం ప్రారంభించాను. రెండు డిక్షనరీలు ఉర్దూ–ఇంగ్లీషు–ఉర్దూ పెట్టుకుని నేర్చుకున్నాను. షేక్స్‌పియర్, విక్టర్ హ్యూగో చదివాను. అర్థమయినపుడు యెంతో ఆనందించాను. మెల్లిగా అనువాదాలు చేయడం ప్రారంభించాను. 'ఇవాన్' అనే పత్రిక చదవటం మొదలుపెట్టాను. చిన్న చిన్న కథలు రాయటం, తర్వాత ఉస్మానియా జర్నల్‌లో ప్రచురించడం మొదలు పెట్టాను. ఒక నవల కూడా రాశాను**, అన్నారు. (మనకు తెలియని మన చరిత్ర (తెలంగాణా రైతాంగపోరాటంలో స్త్రీలు–ఒక సజీవ చరిత్ర), ప్రచురణ: స్త్రీ శక్తి సంఘటన, హైదరాబాద్, 1986, పేజి. 173)

స్వయంకృషితో విద్యార్జన వైపు దృష్టిసారించిన రజియా తనకు నచ్చని ఆచారాలను పద్ధతులను వ్యతిరేకించారు. ఆ ప్రయత్నంలో మిత్రులను సంఘటితపర్చి, **బజ్మె ఏహ్‌బాబ్** అను సంస్థను ఏర్పాటు చేసి పలు సామాజిక–సాహిత్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సాహిత్య కార్యక్రమాల పట్ల అత్యధిక శ్రద్ధచూపారు. ఆ కార్యక్రమాలలో, **యూనుస్ సలీమ్, ముస్లిమ్ జియా, ఇంకా చాలమంది రచయితలు నియాజ్, జాకిర్, హుస్సేన్, సాహిర్, జిగర్, సిద్ధిఖీ లాంటి కవులు వచ్చేవాళ్లు, కొంతమంది మా ఇంట్లోనే వుండేవాళ్లు. సాహిత్యానికి సంబంధించిన కార్యక్రమాలు చాలా జరిగేవి. మేమంతా మార్క్సిస్టు సాహిత్యం చదవలేదు. కాని నిగార్‌లో కొన్ని వ్యాసాలు వచ్చేవి. ఉర్దూ పత్రికలు చాలా ఉండేవి. రాజకీయ సమస్యలు కూడా చాలా చర్చించేది. యుద్ధం, జర్మనీ, హిట్లర్, మొదలైనవి. ఉర్దూ, ఇంగ్లీషు పుస్తకాలు చాలా తెప్పించుకుని ఎన్నో నేర్చుకునే వాళ్ళం,** అని రజియా వివరించారు. (మనకు తెలియని మన చరిత్ర, పేజి: 174)

చదువు మీద ఆసక్తిగల రజియా బేగం ఆంగ్ల భాషను బాగా నేర్చుకోవానుకున్నారు. అందుకు ఉపాధ్యాయునిగా ఓ యువకుడ్ని నియమించుకున్నారు. యువకుడి చేత పాఠాలు చెప్పించుకుంటున్నందుకు ఆమె బంధువులు ఆమెను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయాన్ని ఆమె సోదరి జమాలున్నీసా బాజి చెబుతూ, **రజియాకు ఇంగ్లీషు చెప్పటానికి ఒక బ్రాహ్మణ అబ్బాయి వచ్చేవాడు. మా కుటుంబం అభ్యంతరం పెట్టింది. బంధువులంతా వెలివేశారు. చాలా కొద్దిమంది అమ్మాయిలు ఆ రోజుల్లో చదువుకునేవాళ్ళు. మా అమ్మ మమ్మలెప్పుడూ సపోర్టు చేసేది. ఒక స్నేహితురాలిగా**, అని తల్లితండ్రుల ధోరణిని

వివరించారు. (మనకు తెలియని మన చరిత్ర, పేజి: 174) ఈ విధంగా తల్లితండ్రులు అందించిన ప్రోత్సాహం వలన రజియా బేగం యం.ఎ వరకు చదువుకున్నారు.

రజియా బేగం అక్క, అన్నదమ్ములతో కలసి జాతీయోద్యమంలో భాగస్వాములు అయ్యారు. ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధులు, జాతీయోద్యమంలో 'చిచ్చరపిడుగు'గా ఖ్యాతిగాంచిన మౌల్వీ హస్రత్ మోహాని (లక్నో) రజియా బేగం కుటుంబానికి సన్నిహిత బంధువు. ఆయన తరుచు హైదరాబాదుకు రావడమే కాకుండా ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో చాలాకాలం హైదరాబాదులో ఉన్నారు. ఆయన ప్రభావం నుండి రజియా బేగం తప్పించుకోలేకపోయారు. స్వతహగా స్వేచ్ఛాయుత భావాలు గల ఆమె బానిసత్వం నుండి విముక్తిని కోరుకున్నారు. ఆ కృషిలో భాగంగా ఆమె స్వదేశీ ఉద్యమంలో పాల్గొన్నారు. జాతీయోద్యమ కార్యక్రమాల నిర్వహణకు అవసరమగు నిధుల సేకరణ బాధ్యతలు నిర్వహించారు. ఆమె జాతీయోద్యమంలో పనిచేస్తూ కూడా **మొదట్నించీ జాతీయోద్యమంలో వుండేవాళ్ళం. మేమేం చేయడంలేదని ఎప్పుడూ అన్పించేది**, అని చెప్పుకున్నారు.

ఆ క్రమంలో సాగుతున్న రజియా కుటుంబానికి కమ్యూనిజం పరిచయం కావడంతో అన్నదమ్ములు, అక్క అంతా కమ్యూనిస్టు పార్టీ వైపుకు మొగ్గుచూపారు. సామ్యవాద భావాలను అధ్యయనం చేశారు. ఆయా విషయాల మీద జరిగే చర్చలలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ క్రమంలో జరిగిన కార్యక్రమాల నిర్వహణలో ఆ కుటుంబం యావత్తు భాగం పంచుకుంది. ఆ విషయాలను వివరిస్తూ, **1941లో అభ్యుదయ రచయితల సంఘం అని ఒకటి వుండేది. మఖ్దూం, నజర్ హైదరాబాద్ ఎప్పుడూ వస్తూండేవారు. మేం నలుగురు అక్కచెల్లెళ్ళం. ఈ మీటింగులకి బహిరంగంగా వెళ్ళేవాళ్ళం. అమ్మకూడా వచ్చేది. కొంతమంది చిల్‌మన్ల (చాటున) వెనుక కూర్చునేవాళ్ళు ...సజ్జాద్ జహీర్, ఓంకార్, పర్షాద్ లాంటి వాళ్ళు చాలా మంది అండర్‌గ్రౌండ్‌లో వున్నప్పుడు మా యింట్లో వుండేవాళ్ళు**, అని పేర్కొన్నారు. ఈ మేరకు ఏర్పడిన పరిచయాలు, నూతన అభిప్రాయాల వలన, కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం మేరకు రజియా బేగం 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనలేదుకాని క్విట్ ఇండియా ఉద్యమం పట్ల సానుభూతి ఉండేదని రజియా బేగం వెల్లడించారు.

1942 ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ మీద నిషేదం విధించిన సందర్భంగా రజియా బేగం కమ్యూనిస్టుల కార్యకలాపాలకు తోడ్పాటునిచ్చారు. నైజాం సంస్థానంలో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులే ఇక్కట్లు పడుతుండగా, నిషేధిత కమ్యూనిస్టుపార్టీ సానుభూతిపరులుగా రజియా కుటుంబం మరిన్ని కష్టాలు పడాల్సి వచ్చింది. ఆనాటి భయానక వాతావరణంలో కూడా రజియా బేగం, ఆమె అక్కయ్య జమాలున్నీసా బాజి, అన్నదమ్ములు కమ్యూనిస్టు ఉద్యమకారులకు చేయూతనిచ్చారు. ఒకవైపు ఈ కార్యక్రమాలన్నిటిని కొనసాగిస్తూనే

1944లో రజియా బేగం యం.ఎ పూర్తి చేశారు.

బ్రిటీషర్ల మిత్రుడిగా మారిన నైజాం సంస్థానాధీశుడి చర్యల మీద జమాలున్నీసా తనదైన స్వతంత్ర అభిప్రాయాలను ఏర్పాటు చేసుకున్నారు. ఆమె అభిప్రాయాల స్థిరత్వానికి ఆమె కుటుంబ వాతావరణం కూడా తోడ్పడింది. ఆమె అన్నదమ్ములు అన్వర్, అఖ్తర్, అక్కయ్య జమాలున్నీసా కూడా స్వతంత్ర ఆలోచనలు కలిగిన వ్యక్తులు. ప్రజల పక్షంగా పోరాటాలలో పాల్గొన్న ఉద్యమకారులు. ఆనాడు నిజాం మీద వ్యతిరేకతతోపాటుగా, మత సంబంధమైన కొన్ని ఆచార సంప్రదాయాల విషయంలో కూడా సమకాలీన సమాజానికి భిన్నంగా ప్రవర్తించడం వలన రజియా బేగం పలు ఇక్కట్లను ఎదుర్కొన్నారు. ఆ విషయాలను ప్రస్తావిస్తూ, కొందరు **మమ్మల్ని కాఫిర్లనేవాళ్ళు. మతద్రోహులమని పిలిచేవాళ్ళ**ని ఆమె స్వయంగా చెప్పుకున్నారు. (మనకు తెలియని మన చరిత్ర, పేజి.173)

1947లో స్వరాజ్యాన్ని సాధించుకున్నాక వెనువెంటనే ఆరంభమైన ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానం విలీనం కోరుతూ ఆరంభమైన పోరాటంలో రజియా బేగం తనదైన పాత్ర నిర్వహించారు. ఆ పోరాటం అంతిమ దశకుచేరుతున్న సందర్భంగా అంకురించిన తెలంగాణ పోరాటంలో కూడా రజియా బేగం కుటుంబం యావత్తు పాల్గొంది. అక్కయ్య జమాలున్నీసా బాజి, ఉద్యమకారులైన అన్నదమ్ములు అన్వర్, అఖ్తర్ తెలంగాణ పోరాటంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పాత్రధారులయ్యారు.

ఈ సందర్భంగా రజియాబేగం పోలీసుల దాష్టీకాలను ఎదుర్కొన్నారు. అరెస్టులకు గురయ్యారు. జైలులో కూడా గడిపారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, **ఆ రోజుల్లో చాలా మంది కామ్రేడ్లతో పోరాటం గురించి మాట్లాడేదాన్ని, జైల్లోవున్నప్పుడు, ఒక స్త్రీ కామ్రేడ్‌తో మాట్లాడేదాన్ని. ఒక డైరీ కూడా రాసేదాన్ని. ఆది దొరికితే ఇంకా చాలా వివరాలు తెలుస్తాయి. నాకొక గది ఉండేది**, అని అన్నారు.

ఆనాడు తెలంగాణ పోరాటయోధులు రావి నారాయణ రెడ్డి నాయకత్వంలో రజియా బేగం తన సోదరి-సోదరులతో కలసి పాల్గొన్నారు. నాయకుల ఆదేశాలను తు.చ తప్పక పాటిస్తూ, ఆడమగ భేదం లేకుండా ఎటువంటి ప్రమాదకరమైన పనిని అప్పగించినా, ఏ తెలియని ప్రదేశానికి వెళ్ళిరమ్మని పంపినా ఏమాత్రం అధైర్యపడకుండా ఎంతో సాహసంతో పార్టీ అప్పగించిన పనులను, బాధ్యతలు రజియా బేగం సమర్ధవంతంగా నిర్వర్తించారు. ఆ ఉద్యమకార్యక్రమాలలో భాగంగా పోరాటయోధులకు ఆశ్రయం కల్పించడం, ఆయుధాలను సేకరించడం వాటిని దాచిపెట్టడం, ఉద్యమకారులకు అందచేయడం, ఉద్యమకారులకు సమాచారాన్ని చేరవేయడం తదితర పనులను తమ ఇంటిని, ఆ పరిసర ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని నిర్వహించారు. ప్రముఖ కమ్యూనిస్టు నేతలు డాక్టర్ మహేంద్ర, రావి

నారాయణరెడ్డి, మఖ్దూం మొహిద్దీన్, రాజ్ బహుద్దూర్ గౌడ్, జవ్వాద్ రజ్వీ తదితరులకు ఆమె ఇంట్లో ఆతిథ్యం, ఆశ్రయం లభించింది. ఆ ఆశ్రయం నుండి నాయకులను మరింత సురక్షిత ప్రాంతాలకు చేరవేయడం లాంటి కార్యక్రమాలను పోలీసుల నిరంతర నిఘా నీడల్లో కూడా రజియా సాహసోపేతంగా నిర్వహించారు.

1951లో తెలంగాణ సాయుధ పోరాటాన్ని విరమించాలా? కొనసాగించాలా? అను అంశం చర్చనీయాశంమైంది. ఆ సమయంలో, **అఖ్తర్, గోపాలన్ (ఎ.కె. గోపాలన్), జ్యోతిబసు, ముజఫర్ అహమ్మద్‌తో ఏర్పడిన డెలిగేషన్ ఒకటి వచ్చి- 1951లో సాయుధ పోరాటం కొనసాగించాలా? విరమించాలా? అనే విషయం చర్చించడానికి వచ్చారు ... ఆ విషయం గురించి చాలా రాత్రి వరకు మీటింగులు, చర్చలు జరిగేవి,** అని ఆ వాతావరణాన్ని ఆమె వివరించారు. ఈ విషయంలో తండ్రి ఎంతో సహకరించారని తమ ఇంటికి వచ్చిన నాయకులకు ఆయన బస ఏర్పాట్లు చూశారని ఆమె వెల్లడించారు.

తెలంగాణ పోరాటం ముగిశాక జరిగిన ఎన్నికల ప్రచారంలో రజియా చురుకుగా పాల్గొన్నారు. చదువు మీద, మహిళా అభ్యున్నతి కార్యక్రమాల మీద ఎక్కువగా దృష్టి సారించారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు వివిధ వృత్తులలో శిక్షణ, మహిళలలో చైతన్యం కలిగించేందుకు రాత్రి బడులు, గ్రంథాలయాలు ఏర్పాటు, ప్రగతిశీల సాహిత్యం చదివించడం, ఆయా అంశాల మీద చర్చలు జరపడం ఈ కేంద్రాలలో ఆనవాయితి. ఈ కార్యక్రమాలలో భాగంగా కలకత్తా, ఢిల్లీ లాంటి ప్రాంతాలతో జరిగిన అఖిల భారత మహిళా సంఘాల సమావేశాలలో ఆమె పాల్గొంటూ మహిళా ఉద్యమాలకు చేయూతనిచ్చారు.

1944 ఎం.ఏ చేసిన రజియా బేగం వుమెన్స్ కాలేజిలో లెక్చరర్ అయ్యారు. ఆ తరువాత 1966లో యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజిలో చేరారు. పర్షియన్‌లో పి.హెచ్.డిని ఇరాన్‌లో చేశారు. సరోజిని నాయుడు కుమార్తె లీలామణి నాయుడుతో కలసి కాలేజీలో సాహిత్య గోష్ఠులు జరుపుతూ ఔత్సాహిక కవులకు-రచయితలకు తోడ్పాటు అందించారు.

తెలంగాణ సాయుధ పోరాట కార్యక్రమాల తరువాత రజియాకు రాజకీయాల పట్ల ఆసక్తి తగ్గుముఖం పట్టింది. ఆ సమయంలో ఆమె తండ్రి రిటైర్ కావడంవల్ల, మిగతా వాళ్ళంతా పార్టీలో పని చేస్తుండటం వల్ల ఆమె స్వయంగా కుటుంబ ఆర్థిక భారాన్ని మోయాల్సి వచ్చింది. ఆమె ఆర్థికంగా స్థిరపడి కుటుంబ భారాన్ని మోస్తున్నప్పటి పురుషులతో సమానం అన్పించకపోవడంతో రజియా బేగం ఆవేదనకు గురయ్యారు.

ఈ విషయాన్ని మరింత విస్తారంగా వివరిస్తూ, **'ఇంట్లో అంతా తోడ్పడేవాళ్ళు. పురుషులు కూడా కొంత పనిచేసేవాళ్ళు. పిల్లలు కూడా కొంత చేసేవాళ్ళు. అయినప్పటికీ**

**కొంత మన బాధ్యతే అన్పిస్తుంది. కొన్ని కారణాలు పరిశీలించాలి. స్త్రీగా వుండటమనేది ఒకటి. యుగాల నుంచి వస్తున్న సాంఘిక వ్యవస్థ ఆమెను తక్కువ స్థాయిలో వుంచింది. ఆర్థిక స్వాతంత్ర్యం వున్నప్పటికీ, స్త్రీ పురుషుని కంటే తక్కువగానే భావిస్తుంది. అతని మీదే ఆధారపడుతుంది. స్త్రీ ఒంటరిగా ఉండటం మనేటటువంటి భయం ఘోరమైంది, ప్రపంచమంతటా వుంది. ఆమె తను ఒంటరిగా బయటకెళ్ళడానికి భయపడతారు, పురుషులైతే ఒంటరిగా వెళతాడు, ఎవరూ బాధించరు. పురుషుడికి స్వేచ్ఛవుంది. స్త్రీలను ఏ విధంగా చూస్తారనే దాని గురించి పుస్తకాలు రాస్తున్నారు. ఈ బంధాలెలా తెంచుకుంటామనేది చూడాలి. సిండరెల్లా అనే చక్కని పుస్తకంలో, స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నప్పటికి ఇంకా విముక్తి పొందకుండా వుండటమనే సమస్య గురించి చర్చించారు. ఆ రోజుల్లో ఆర్థిక స్వాతంత్ర్యమే ముఖ్యమైన సమస్య అనుకునేవాళ్ళం. నేను చదువుకుని, సంపాదించి ఎవరి మీద ఆధారపడకుండా వుంటానని నిర్ణయించుకున్నాను. నాన్నకు చెప్పాను, ఆయన ఏమీ అభ్యంతరం పెట్టలేదు, కాని బంధువులు విమర్శించారు. తర్వాత కూడా పెళ్ళి గురించి ఆలోచించలేదు. నా పనిలో నిమగ్నురాలినై, దాని గురించి ఆలోచించ లేదు. బహుశ సరియైన సమయంలో ఎవరూ కనిపించలేదేమో! అన్ని సంబంధాలు కూడా వరకట్నం, బేరాలతో నియమించబడేవి. అవంటే అసహ్యం వచ్చి, ఎవరితోటీ ఆ విషయం గురించి మాట్లాడకపోయేది. నాన్న కూడా వాటిని వ్యతిరేకించేది. మా కుటుంబంలో చాలా మంది పెళ్ళిళ్ళు చేసుకోలేదు.'** ఆమె పేర్కొన్నారు.(మనకు తెలియని మన చరిత్ర, పేజి.180)

ఈ ప్రకటన ఆమెలోని ప్రగతిశీల భావాలకు అద్దం పడతాయి. ఆ అభిప్రాయాలకు అనుగుణంగా నడుచుకున్న రజియా బేగం అవివాహితగా గడిపారు. చిన్న వయస్సులోనే సంఘసంస్కరణోద్యమం, ఆ తరువాత జాతీయోద్యమం, అనంతరం కమ్యూనిస్టు ఉద్యమం, ఆ క్రమంలో ఇండియన్ యూనియన్‌లో నైజాం విలీనోద్యమం, అటు తరువాత తెలంగాణ సాయుధ పోరాటం, కమ్యూనిస్టు ఉద్యమంలో చివరి వరకు పాల్గొన్న యోధురాలు రజియా బేగం ప్రజా, రాజకీయ ఉద్యమాల చరిత్రలో తనదైన ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నారు.

(ఈ వ్యాసం ప్రధానంగా 1986లో స్త్రీ శక్తి సంఘటన (హైదరాబాద్) వారు ప్రచురించిన **' మనకు తెలియని మన చరిత్ర (తెలంగాణా రైతాంగపోరాటంలో స్త్రీలు-ఒక సజీవ చరిత్ర) '** గ్రంథంలో రజియా బేగం ఆమె సోదరి జమాలున్నీసా బాజిలు ఇంటర్వ్యూలో స్వయంగా తెలిపిన సమాచారం ఆధారంగా రూపొందించడం జరిగింది. ఆ గ్రంథం సంపాదకులు, ప్రచురణకర్తలకు ధన్యవాదాలు. - రచయిత)

◆◆◆



## నైజాం విలీనం కోరుతూ నిజాం మీద అక్షరపోరు సాగించిన

# 47. ఫరీద్ మీర్జా

(1918-)

స్వతంత్ర రాజ్యాన్ని ప్రకటించుకున్న నైజాం సంస్థానాధీశుడు మీర్ అలీ ఖాన్ అభీష్టానికి వ్యతిరేకంగా ఇండియన్ యూనియన్‌లో నైజాంను విలీనం చేయమంటూ వ్యక్తం అవుతున్న ప్రజాభిప్రాయానికి అనుగుణంగా, ఆనాటి ప్రాణాంతక వాతావరణాన్ని కూడా ఏమాత్రం లెక్కచేయక విలీనం కోసం అక్షర పోరుకు సిద్ధపడిన యోధుడు ఫరీద్ మీర్జా.

1918 జూలై 7న ఫరీద్ మీర్జా హైదరాబాదులో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆయన బి.ఎ పట్టా పొందారు. గ్రాడ్యుయేట్ అయిన ఫరీద్ మీర్జాకు నైజాం సంస్థానంలో మంచి ఉద్యోగం లభించింది. ఆ ఉద్యోగ నిర్వహణలో పలు ప్రాంతాలను తిరుగుతున్నా, నైజాం నవాబు ప్రభుత్వంలో ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నా కూడా ఫరీద్ మీర్జా తనలోని జాతీయ సమైక్యతా, మతసామరస్య భావనలను, స్వేచ్ఛా-స్వాతంత్ర్య ఆలోచనలను ఏమాత్రం దాచిపెట్టలేదు.

1947లో భారతదేశం స్వాతంత్ర్య పొందాక నైజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయడానికి అంగీకరించని నిజాం నవాబు 'ఉస్మానిస్థాన్' పేరిట స్వతంత్ర రాజ్యం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాడు. స్వతంత్ర రాజ్య స్థాపనకు అవసరమైన జాతీయ, అంతర్జాతీయ సమ్మతి కోసం శతవిధాల ప్రయత్నిస్తూ, ఆ ప్రయత్నాలలో భాగంగా ఆయన అభిమతానికి అడ్డువచ్చే ఏ శక్తిని, వ్యక్తిని విడిచిపెట్టడం లేదు. నవాబు అభీష్టానికి

అనుగుణంగా రజాకార్లు, ఇత్తెహదుల్ ముస్లీమీన్ కార్యకర్తలు ప్రతికూలశక్తుల, వ్యక్తుల అణిచివేతకు అన్నిరకాల చర్యలకు పాల్పడుతూ భయానక వాతావరణాన్ని సృష్టించారు.

ఆ సమయంలో నాందేడు జిల్లా లోహా తాలూకా తహసిల్దార్‌గా పనిచేస్తున్న ఫరీద్ మీర్జా రజాకార్ల చర్యలను సహించలేక పోయారు. ఆ చర్యలను చూస్తూ తట్టుకోలేక ఏదోఒకటి చేయాలని భావించి 1948 జూలై 15న ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ రాజీనామాను స్వయంగా కలక్టరుకు అందచేసి, రాజీనామా చేయాల్సిన పరిస్థితులను వివరించి, అంతరాత్మ ప్రబోధం మేరకు రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. ఈ చర్యపట్ల జిల్లాలోని ఇత్తెహదుల్ ముస్లింమీన్ నేతలు ఆయన మీద ఆగ్రహావేశాలను వ్యక్తంచేశారు.

ఉద్యోగానికి రాజీనామా చేసిన మరుక్షణమే ఫరీద్ మీర్జా కుటుంబంతో సహా హైదరాబాద్ నగరం చేరుకున్నారు. మిత్రులకు తన అనుభవాలను వివరించారు. జరుగుతున్న అవాంఛనీయ సంఘటనల మీద జాతీయ భావాలు గల ముస్లింలు నోరువిప్పాలని, విచ్ఛినకర వాతావరణం ప్రబలుతున్నప్పుడు మేధావులు ప్రధానంగా ముస్లిం మేధావులు మౌనంగా ఉండడం ఏమాత్రం సబబు కాదని మిత్రులకు తెలియచెప్పారు. ఆనాటి ప్రతికూల, భయానక వాతావరణంలో తన మనోభావాలను బహిరంగంగా వ్యక్తం చేయడానికి ఫరీద్ మీర్జా ఏమాత్రం భయపడలేదు. నైజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అభిమతానికి వ్యతిరేకంగా రహస్యంగా మాట్లాడటమే ప్రమాదకరంగా ఉన్న పరిస్థితులలో బహిరంగ నిరసన వ్యక్తం చేయడం అత్యంత ప్రమాదకరమని బారిస్టరు మీర్ అక్బర్ అలీ ఖాన్ లాంటి సన్నిహితులు, మిత్రులు ఎంతగా వారిస్తున్నా ఫరీద్ మీర్జా ఏమాత్రం వెనుకంజ వేయలేదు.

జాతీయ భావాలుగల, మతసామరస్యం కాంక్షిస్తున్న ముస్లిం ప్రముఖులు ఇండియన్ యూనియన్‌లో నైజాం విలీనం డిమాండ్ పక్షాన తమ అభిప్రాయాలను నిజాం నవాబుకు తెలియజేయాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందని భావించిన ఫరీద్ మీర్జాకు ఆ ప్రయత్నాలలో ముందుకు సాగారు. విఖ్యాత జాతీయవాది, **ఖాదిం** పత్రిక సంపాదకుడు ముల్లా అబ్దుల్ బాసిత్‌ను కలిసి, నాండేడ్‌లోని తన అనుభవాలను, అక్కడ రజాకారుల సాగించిన ఆగడాలను, **ఇత్తెహదుల్ మస్లిమీన్** చర్యలను వివరించి, ముల్లా స్నేహహస్తాన్ని పొందారు.

ఆ తరువాత నైజాం సంస్థానం విలీనాన్ని వ్యతిరేకిస్తూ రజాకారులు సాగిస్తున్న చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని, రజాకారుల దుర్వర్తనను బహిర్గతం చేస్తూ బహిరంగ ప్రకటన విడుదల చేయాలని ఫరీద్ మీర్జా తనతో ఏకీభవిస్తున్న మిత్రులకు సూచించారు. ఫరీద్ మీర్జా అభిప్రాయాలతో ఏకీభవించిన ముల్లా అబ్దుల్ బాసిత్ తన మిత్రులు బాఖర్ అలీ మీర్జాతో సంప్రదించి ఫరీద్ మీర్జా సూచన మేరకు ప్రకటనను రూపొందించవలసిందిగా కోరారు. విద్యాభ్యాసం సాగిస్తున్నప్పుడే సామ్రాజ్యవాద వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న

జాతీయవాది, కార్మికోద్యమ నాయకులుగా ఖ్యాతి గడిచిన బాఖర్ అలీ మీర్జా ఆ ప్రతిపాదనకు అంగీకరించి, ప్రకటన చిత్తు ప్రతిని తయారు చేశారు.

ఆ ప్రతిని చూసిన మంజూర్ జంగ్ ప్రకటన చాలా బాగుందంటూ ఆ చిత్తుప్రతి మీద నేరుగా సంతకం చేసి ఫరీద్ మీర్జా ప్రయత్నాలను ప్రోత్సహించారు. ఆ ప్రతిని తీసుకుని ఫరీద్ మీర్జా నగరంలోని పలువురు ముస్లిం పెద్దల ఇళ్ళచుట్టూ తిరిగారు. చివరకు ఆయన కోరినట్టు ఆ ప్రకటన మీద మంజూర్ జంగ్, మహమ్మద్ హుస్సేన్, బాఖర్ అలీ మీర్జా, ముల్లా అబ్దుల్ బాసిత్, అహ్మద్ మీర్జా, హుస్సేన్ అబ్దుల్ మునీం, ఫరీద్ మీర్జా లాంటి ప్రముఖులు సంతకాలు పెట్టారు. ఈ విధంగా రూపొంది, **ఏడవ నిజాంకు ఏడుగురు ముస్లిం ప్రముఖుల వినతి** పేరుతో ప్రఖ్యాతి చెందిన ఆ ప్రకటన 1948 ఆగస్టు 13 ఖాజీ అబ్దుల్ గఫార్ సంపాదకత్వంలోని **పయాం** ఉర్దూ పత్రికలో తొలుతగా ప్రచురితమైంది. ఆ తరువాత ముల్లా అబ్దుల్ బాసిత్, షోయాబుల్లా ఖాన్‌ల సంపాదకత్వంలోని **ఖాదిం, ఇమ్రోజ్** లాంటి ఉర్దూ పత్రికలలో ప్రముఖంగా ప్రచురితమై సంచలనం సృష్టించింది.

అ సమయంలో నిజాం నవాబు తన అభీష్టాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యరాజ్య సమితికి ఒక ప్రతినిధివర్గాన్ని పంపి ఉన్నాడు. **ఏడవ నిజాంకు ఏడుగురు ముస్లిం ప్రముఖుల వినతి**, దాని బహిరంగ ప్రకటన నిజాం ప్రతినిధివర్గం ప్రయత్నాల మీద నీరు చల్లింది. నిజాం ప్రతినిధివర్గం ప్రయత్నాలను వమ్ము చేయడానికి భారత ప్రభుత్వం ఈ ప్రకటనను తన వాదనకు అనుకూలంగా ఉపయోగించుకుంది. ఈ పరిణామాలతో ఇత్తెహాదుల్ ముస్లిమీన్ నాయకులు, రజాకార్లు ప్రకటనకు ఆధ్యుడు ఫరీద్ మీర్జా మీద, ప్రకటన మీద సంతకాలు చేసిన ముస్లిం ప్రముఖులు మీద, ఆ ప్రకటనను తమ పత్రికల్లో ప్రచురించిన సంపాదకులు ముల్లా అబ్దుల్ బాసిత్, ఖాజీ అబ్దుల్ గఫార్, షోయాబుల్లా ఖాన్‌ల మీద మండిపడింది.

నిజాం నవాబుకు, ఇత్తెహాదుల్ ముస్లిమీన్‌కు వంతపలుకుతున్న పత్రికలు విలీనం కోరుతున్న ముస్లిం ప్రముఖులను **దేశద్రోహులు** అంటూ దుమ్మెత్తిపోశాయి. ఈ మేరకు సాగిన కుట్ర ఫలితంగా **ఇమ్రోజ్** సంపాదకులు షోయాబుల్లా రజాకార్ల తుపాకి గుండ్లకు బలయ్యారు. షోయాబుల్లాను హతం చేసినట్టే మిగిలిన వారిని కూడా అంతం చేస్తారని పుకార్లు గుప్పుమన్నాయి. అయినా ఏమాత్రం భయపడలేదు సరికదా నాందేడ్‌లోని లోహా గ్రామంలో రజాకారులు సాగించిన దుర్మార్గాలను వివరిస్తూ ఫరీద్ మరో ప్రకటనను విడుదల చేశారు. ఆ ప్రకటనలలోని అంశాలన్నీ వాస్తవాలతో కూడుకున్నవి కావడంతో ఫరీద్ మీర్జాకు ప్రజలు, ముస్లిం ప్రముఖుల నుండి మంచి మద్దతు లభించింది.

ఈ ప్రకటనలు కలిగించిన కలవరం నుండి బయటపడేందుకు నిజాం నవాబు తన దూతగా హకీం మఖ్సూద్ అలీ ఖాన్‌ను ముల్లా అబ్దుల్ బాసిత్ వద్దకు పంపి, ఫరీద్

మీర్జాను తమతో మాట్లాడవలెనని, **ఏడవ నిజాంకు ఏడుగురు ముస్లిం ప్రముఖుల వినతి** ప్రకటనను పూర్తిగా ఉపసంహరించుకోవాలని ఆదేశించాడు. నిజాం ఆదేశాల మేరకు మఖ్సూద్ అలీ ఖాన్ వచ్చి ఫరీద్ మీర్జాను ఆయన మిత్రులను కలిశాడు. ఆ ఆదేశాలకు సమాధానంగా, '**మేము 1948 ఆగస్టు 13న విడుదల చేసిన ప్రకటన వాస్తవాలన్నీ తెలియక చేసింది కాదు. మరో ప్రకటన మీద మేం నిజాం సమక్షంలో సంతకాలు పెడతామని వాగ్దానం చేయం. మేము చేసిన ప్రకటన నిజంగా సత్య దూరమయిందని నిజాం మాకు నమ్మకం కలిగించితే మా పూర్వ ప్రకటన సరికాదని, దాన్ని ఖండిస్తూ మరొక ప్రకటన వెలువరింప చేస్తామే కాని మేము నిజాం వ్రాయించిన ప్రకటన మీదగానీ, లేక నిజాం అందచేసిన ప్రకటన మీదగాని నిజాం సమక్షంలోగాని, పరోక్షంలోగానీ సంతకాలు చేయము**' అనడంతో హకీం మఖ్సూద్ అలీ ఖాన్ దౌత్యం విఫలమైంది. (హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, పేజి.620)

ఆ తరువాత ఆ చారిత్రాత్మక ప్రకటన మీద సంతకాలు పెట్టిన ప్రముఖుల మీద నిఘా ఎక్కువైంది. అవాంఛనీయ వాతావరణం స్పష్టం కాసాగింది. ఆ సమయంలో ఫరీద్ మీర్జాను వార్ధాకు వెళ్ళాల్సిందిగా పలువురు మిత్రులు కోరారు. **'డాక్టర్ రాజేంద్రప్రసాద్, భారతదేశంలోని ముస్లింలు హైదరాబాదుకు వెళ్ళి అక్కడి వారిలో జాతీయ భావాలు కలిగించాలనీ, హిందూ-ముస్లింల ఐక్యత అవసరాన్నీ, దాని తత్వాన్ని తెలియపరచి, వారీనాడు జరుపుతున్న అనుమానుష చర్యలను మానుకోవలసిందిగా ప్రోత్సహించాలనీ బహిరంగ ప్రకటన చేసినారు. కాబట్టి హైదరాబాదు ముస్లింలు భారత ప్రాంతానికి వెళ్ళిపోవడంలో అర్థంలేదు. హైదరాబాదు గడ్డ మీదనే మనం చేయవలసిన పని ఎంతైనా ఉంది'** అంటూ మిత్రుల సలహాను మీర్జా తిరస్కరించారు. (హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, పేజి.621) చివరకు 1948 ఆగస్టు 27న ఫరీద్ మీర్జా కుటుంబాన్ని హతమార్చుతామని హెచ్చరికలు వెలువడ్డాయి. ఆ భయానక హెచ్చరికలను కూడా ఎంతో ధైర్యంగా ఎదుర్కొంటూ ఫరీద్ మీర్జా హైదరాబాద్‌లో ఉండి పోయారు.

ఆ తరువాత పరిణామాల మూలంగా జరిగిన పోలీసు చర్య వలన నష్టపోయిన ప్రజల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కమిటీలో సభ్యులుగా ఆయన సేవలందించారు. 1949 ఆగస్టు 1న హైదరాబాదు ప్రభుత్వంలో డిప్యూటీ కలెక్టరుగా చేరిన ఆయన 1961 ఏప్రిల్‌లో రాజీనామా చేశారు. చివరకు స్వయంగా ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసుకుని, జీవిత భీమా సంస్థ ప్రతినిధిగా పనిచేస్తూ శేషజీవితాన్ని హైదరాబాదు నగరంలో ఫరీద్ మీర్జా స్వతంత్రంగా గడిపారు.

◆◆◆



## నేతాజీ నాయకత్వంలో పోరుబాట సాగిన యోధుడు

# 48. ఖముర్రుల్ ఇస్లాం

## (1919-)

**'మీ**రు రక్తాన్ని ఇవ్వండి...నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తా' అంటూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇచ్చిన స్పూర్తిదాయక పిలుపును అందుకుని, ప్రాణాలకు తెగించి బ్రిటీష్ సైనిక బలగాలతో తలపడి స్వాతంత్ర్యం సాధించుకునేందుకు సిద్ధపడిన ఆజాద్ హింద్ ఫౌజ్ యోధులు ఖముర్రుల్ ఇస్లాం.

1919లో నాటి నైజాం సంస్థానంలో భాగమైన పర్భనీ జిల్లా (ప్రస్తుతం మహారాష్ట్రలో ఉంది) నిపుత్తా గ్రామంలో ఖముర్రుల్ ఇస్లాం జన్మించారు. ఆయన పూర్వీకులు చాలాకాలం క్రిందట ఉత్తరప్రదేశ్ నుండి నైజాం వచ్చి పర్భనీ జిల్లాలో స్థిరపడ్డారు. ఔరంగాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తిచేసిన ఖముర్రుల్ ఇస్లాం నైజాం ప్రభుత్వ సైన్యంలో చేరారు. ఆ తరువాత ఆయన హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారు. ఆనాడు ఉత్తర భారతదేశంలో సాగుతున్న జాతీయోద్యమానికి ఆయన బాగా ప్రభావితులయ్యారు.

1939 నవంబరు 3న ద్వితీయ ప్రపంచ యుద్ధం ఆరంభమైంది. ఆ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వం సైనిక సమీకరణకు పూనుకుంది. నిజాం నవాబు కొలువులో ఉన్న ఖముర్రుల్ ఇస్లాం బ్రిటీష్ ప్రభుత్వం ఆధీనంలోని భారతీయ సైన్యంలో చేరారు. ఆనాడు బ్రిటీష్ వారికి ఆసియా తూర్పు ప్రాంతంలో జపాన్ సైన్యం నుండి పెను ప్రమాదాన్ని ఎదురయ్యింది. ఆ కారణంగా సింగపూర్, థాయిలాండ్, మలయాలలో బ్రిటీష్ ప్రభుత్వం తమ సైన్యాలను

కేంద్రీకరించింది. ఆ విధంగా మోహిరించిన భారతీయ సైనికులలో ఒకరుగా ఖముర్రుల్ ఇస్లాం తూర్పుభాగానికి వెళ్లారు. 1920లో జపాన్ సింగపూర్‌ను కైవసం చేసుకోగా బ్రిటీష్ ప్రభుత్వం సుమారు 20వేల భారతీయ సైనికులను అక్కడే వదలిపెట్టాల్సి వచ్చింది. ఆవిధంగా వదిలి పెట్టబడిన సైన్యం కెప్టెన్ మోహన్‌సింగ్ నాయకత్వంలో **'భారత జాతీయ సైన్యం'** గా రూపొందింది. ఈ సైన్యాన్ని సర్వాధికారాలతో నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు కెప్టన్ సింగ్ అప్పగించారు. ఆ సైన్యం ఆ తరువాత ఆజాద్ హింద్ ఫౌజ్‌గా చరిత్ర సృష్టించింది.

ఆజాద్ హింద్ ఫౌజ్‌లోని **'బహుదూర్ దళం'**లో ఖముర్రుల్ ఇస్లాం సభ్యులయ్యారు. 1944 మార్చి18న ఆజాద్ హింద్ ఫౌజ్ బర్మా సరిహద్దుదాటి మాతృభూమిలోకి ప్రవేశించాక అరకాన్ పర్వత శ్రేణిలోని బిషంపూర్‌లో **బహుదూర్ దళం** వంతెన నిర్మిస్తుండగా శత్రుసైన్యం అనూహ్యంగా దాడిచేసింది. ఆ సందర్భంగా జరిగిన కాల్పులలో బహుదూర్ దళసభ్యులు చాలామంది కన్నుమూయగా ఖముర్రుల్ ఇస్లాం తీవ్రంగా గాయపడి బయటపడ్డారు.

1945 ఏప్రిల్ 24న ఆజాద్ హింద్ ఫౌజ్‌కు అండదండలిచ్చిన జపాన్ పరాజం పొందడంతో ఆజాద్ హింద్ ఫౌజ్‌లోని సైన్యాధికారులు, సైనికుల మీద దేశద్రోహం ఆరోపణలను మోపి బ్రిటీష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆ తరువాత ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన విచారణలో భారతీయ న్యాయవాదులు ఆజాద్ హింద్ పౌజ్ పక్షాన వాదించి తమ కేసుకు గెలిపించుకోవడంతో అందర్నీ ఆంగ్ల ప్రభుత్వం విడుదల చేయక తప్పలేదు.

ఆ సమయంలో లక్నోలోని దిల్‌ఖుష్ శిబిరంలో నిర్బంధంలోనున్న ఖముర్రుల్ ఇస్లాం 1945 డిసెంబరు 5న విడుదలయ్యారు. ఆజాద్ హింద్ ఫౌజ్ సభ్యుడిగా వీరోచిత పోరులో అత్యంత ధైర్యసాహసాలను ప్రదర్శించిన ఖముర్రుల్ ఇస్లాం ఆజాద్ హింద్ ఫౌజ్ అధ్యక్షులు కల్నల్ థిల్లాన్ అనుమతి మేరకు డిసెంబరు 20న స్వస్థలం చేరుకున్నారు. ఆయనకు హైదరాబాద్ నగరంలో స్వాగతం లభించింది.

**అస్సాం అడవుల్లో రంగూన్ పరిసర దుర్గమారణ్యాలలో ఎటు వెళ్ళినా మేము స్రవింప చేసిన రక్తపు మరకలు, మేము నడిచిన ఆనవాళ్ళు, మా సహచరుల సాహస కృత్యాలు పలకరిస్తాయి.** ఈనాడు **దేశ సమగ్రతకూ, పరిరక్షణకూ కనుక మేము బలైపోయే అవకాశమే వస్తే మేం ధన్యులంగా భావిస్తాం. మా జీవితాలు చరితార్థమవుతాయి**, అంటారు ఖముర్రుల్ ఇస్లాం. బహుదూర్ దళం సభ్యునిగా మాతృభూమి విముక్తి కోసం సాగిన పోరాటంలో భాగంగా ఆయన వంటి మీద మిగిలిపోయిన గాయాల మచ్చలను అజాద్ హింద్ ఫౌజ్ తనకు ప్రసాదించిన గొప్ప బహుమతిగా భావించిన ఖముర్రుల్ ఇస్లాం వెల్లడిస్తున్న ఆకాంక్ష ఆయనలోని దేశభక్తికి, త్యాగనిరతికి ప్రతీకలుగా నిలుస్తాయి.

◆◆◆



## పరిటాల రిపబ్లిక్ పతాక యోధుడు

# 49. షేక్ మౌలా సాహెబ్

(1922-)

**ప**రిటాల రిపబ్లిక్ ప్రకటన భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర చివరిదశలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన మహత్తర ఘట్టం. స్వాతంత్ర్యసంగ్రామ జ్వాలలు బ్రిటీష్ పాలకులను అన్ని వైపుల నుండి చుట్టుముట్టాక ఆ సెగల–పొగలను తట్టుకోలేక మూటాముల్లే సర్దుకుని భరతభూమిని వదలి వెళ్ళాల్సిన పరిస్థితులు ఆంగ్లేయులకు దాపురించాయి. ఆ సమయంలో బ్రిటీష్ పాలకుల దయాదాక్షిణ్యాల మీద బ్రతుకుతూ, పరదేశీయులకు మద్దతు పలుకుతున్న సంస్థానాధీశులు ఈ పరిణామాలతో తీవ్రంగా కలవరపడుతున్న వాతావరణం. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా అతి చిన్న కదలిక కన్పించినా సంస్థానాధీశుల రక్షక దళాలు అమాంతం విరుచుకుపడుతున్న భయానక పరిస్థితులు.

సంస్థానాధీశుల దాడులు ఏ స్థాయిలో ఉన్నా, బ్రిటీష్ బలగాలు ఎంతటి దాష్టీకాలకు పాల్పడుతున్నా, ఆయా సంస్థానాలలో నివశిస్తు కూడా స్వతంత్ర జాతీయ భావాలతో, దేశభక్తి ప్రపూరితులైన ప్రజలు జాతీయోద్యమం వైపు పెద్ద సంఖ్యలో మొగ్గు చూపారు. అంతటితో ఆగకుండా వలసపాలకులకు వత్తాసు పలుకుతున్న సంస్థానాధీశులకు వ్యతిరేకంగా పలు ప్రాంతాలలోని ప్రజలు పోరుబాటను ఎంచుకున్నారు. ఆ విధంగా సంస్థానాధీశులను బేఖాతర్ అంటూ పోరుబాట ఎంచుకుని, బ్రిటీష్ పాలన ఇంకానా? ఇక జాంతానై అంటూ విప్లవించి, స్వతంత్ర్య రాజ్యంగా ప్రకటించుకొని, రిపబ్లిక్ తిరుగుబాటు పతాకాన్ని రెపరెపలాడించిన,

కృష్ణా జిల్లా పరిటాలకు చెందిన పరిటాల రిపబ్లిక్ యోధులలో షేక్ మౌలా సాహెబ్ ఒకరు.

కృష్ణాజిల్లా కంచికర్ల మండలంలో **వజ్రాల దిన్నె**గా ఖ్యాతిగాంచిన పరిటాల గ్రామంలోని షేక్ మీరాసాహెబ్, మొహమ్మద్ బీ దంపతులకు షేక్ మౌలా సాహెబ్ 1922 ప్రాంతంలో జన్మించారు. కట్టెలు కొట్టుకుని బ్రతుకు బండిని నెట్టుకొస్తున్న నిరుపేద కుటుంబంలో పుట్టిన షేక్ మౌలా సాహెబ్ తన మేనకోడలు మహబూబ్ బీని వివాహం చేసుకున్నారు. గ్రామంలోని పాఠశాలలో ఫోర్తు ఫారం వరకు చదువుకున్న మౌలా ఆ తరువాతి చదువులకు అటు ఖమ్మంగాని, ఇటు మధిరకుగాని వెళ్లాల్సిన పరిస్థితులు, వ్యయప్రయాసలు భరించలేని తల్లితండ్రులు ఆయనను చదివించలేక పోయారు.

మౌలా కూడా కట్టెలు కొడుతూ కుటుంబానికి ఆధారమయ్యారు. తెలుగు, ఉర్దూ భాషలు తెలిసిన మౌలా బాల్యమిత్రుల సహచర్యంలో ఆనాడు సాగుతున్న స్వాతంత్ర్య సంగ్రామం పట్ల ఆసక్తి కనపర్చారు. సన్నిహిత మిత్రుడు మాదిరాజు దేవరాజుతో కలసి జాతీయోద్యమ ఆలోచనలను పంచుకున్నారు. నైజాం ప్రాంతంలో నెలకొన్న మత విద్వేష పరిస్థితులను గమనించిన ఆయన తమ గడ్డకు స్వేచ్ఛ ప్రసాదించాలని, మతసామరస్యం పరిఢవిల్లాలని కోరుకున్నారు. ఆనాడు పరిటాల పరిసర గ్రామాలు నైజం సంస్థానంలో భాగమై ఉన్నాయి. బత్తినపాడు, గనిఆత్కూరు, ముగల్తూరు, ఉస్తేపల్లి, మల్లపల్లి, కొడపటిగల్లు గ్రామాలు కలసి ఖానత్ తాలూకాగా పరిగణించబడ్డాయి. ఆ ఖానత్‌కు నైజాం సంస్థానాధీశుని ప్రతినిధిగా జాగిర్దార్ కంబ్లియార్ జంగ్ పాలన సాగుతోంది.

అది 1947. భారతదేశం బ్రిటీష్ పాలన నుండి విముక్తి పొంది స్వేఛ్ఛావాయువులు పీల్చుకునేందుకు సిద్దమౌతున్న తొలి రోజులు. బ్రిటీష్ పాలన క్రింద ఉన్న రాష్ట్రాలు, ఇతర ప్రాంతాలు విముక్తమై 'ఇండియన్ యూనియన్'లో చేరడానికి నైజాం సంస్థానాధీశుడు నిరాకరించాడు. ఆ కారణంగా భారతదేశమంతటా స్వేచ్ఛా పవనాలు వీస్తున్నా నైజాం నవాబు పాలన వలన నైజాం సంస్థానంలోని పరిటాల ఖానత్ తాలూకా స్వేఛ్ఛాగాలులు పీల్చలేని పరిస్థితి. పరిటాల ప్రజలు అస్వతంత్రులుగా ఉండలేకపోయారు. 'మాకొద్దు తెల్ల దొరతనం' స్థానంలో, 'మాకొద్దు నిజాం దొరతనం' అంటూ నినదించారు. పరిటాల ఖానత్ లోని ఏడు గ్రామాలలోని ప్రజలు కలసికట్టుగా స్వతంత్రం ప్రకటించుకున్నారు.

పరిటాల పరగణాలోని పోలీసు బలగాలను, అధికారులను తరిమివేశారు. ప్రభుత్వ కార్యాలయాలను పూర్తిగా స్వాధీనం చేసుకుని, ఆయుధాలతో పాటుగా, ఎనిమిది వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మహత్తర సంఘటనకు పరిటాల గ్రామస్తుడు షేక్ మౌలా స్నేహితుడు మాదిరాజు దేవరాజు నాయకత్వంలోని పాతిక మంది యువకులు కారకులయ్యారు. పరిటాల కేంద్రంగా 'పరిటాల రిపబ్లిక్' ప్రకటించుకుని, సర్వసత్తాక గణతంత్ర

రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ చారిత్రక సంఘటనలో షేక్ మౌలా సాహెబ్ ప్రముఖ పాత్ర వహించారు. ఆ సమయంలో ఆయన వయస్సు సుమారు పాతికేళ్ళు. ఆయన సహచర యువకులతో కలసి దేశభక్తిని ప్రోదిచేసే పాటలను పాడుతూ గ్రామ ప్రజలకు ఉద్యమస్ఫూర్తిని పంచుతూ పరిటాల రిపబ్లిక్ నిర్మాణంలో, ఆ తరువాత రిపబ్లిక్ కార్యక్రమాలలో అధ్యక్షులు మాదిరాజుకు చురుకైన భాగస్వామ్యాన్ని అందించారు.

ఆనాడు నైజాం సంస్థానంలో భారత జాతీయ కాంగ్రెస్ పతాకాన్ని ఎగుర వేయడం రాజద్రోహం, అది భయంకర నేరం. జాతీయ పతాకాన్ని ఎగురవేస్తే మూడు సంవత్సరాల జైలుశిక్షను పాలకులు అమలు చేస్తున్నారు. నైజాం తాబేదారులు మరింత ముందుకు వెళ్ళి ప్రాణాలు హరించే చర్యలు చేబడుతున్నారు. రిపబ్లిక్‌ను ప్రకటించాక, పరిటాల వీరులు జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని సంకల్పించి, నైజాం ప్రభుత్వం విధించే కఠిన శిక్షలను, పోలీసుల దాష్టీకాన్ని గుర్తుకు తెచ్చుకుని, ఏం చేయాలంటూ మీమాసంలో పడ్డారు.

ఆ సమయంలో ' నేనున్నా ... నేనున్నా ' నుంటూ షేక్ మౌలా సాహెబ్ ముందుకు వచ్చారు. పరిటాల నడిబొడ్డున ఎటువంటి పరిస్థితులలో జాతీయ పతాకాన్ని ఎగురవేయాలన్న దృఢ నిశ్చయానికి వచ్చిన మౌలా సాహెబ్ గ్రామకచ్చేరి మీదకు గబగబా ఎగబ్రాకి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్యసమరయోధులు తరుచుగా పాడే ఈ క్రింది పాటను ఆయన ఉద్వేగభరితంగా పాడారు.

2002 ఏప్రిల్ 21న ఆయనను కలసిన రచయితకు, మాదిరాజు దేవరాజు ఆనాటి వివరాలను పూసగుచ్చినట్టు తెలుపగా షేక్ మౌలా ఆనాటి పాటను పాడి విన్పించారు.

**దూర్ హటో దునియా వాలో**
**హిందూస్థాన్ హమారా హై**

..................................

**షురుహువాహై జంగ్ హమారా**
**జాగ్ హుతో ఐ హిందూస్థానీ జాగ్ హుతో**

....................................

**తుమ్‌నా కిసికే అగే జుక్‌నా**
**జర్మన్ హో యా జపానీ**

.....................................

**షురుహువాహై జంగ్ హమారా**
**జాగ్ హుతో ఐ హిందూస్థానీ జాగ్ హుతో**

ఆ పాటతో పులకరించి పోయిన పరిటాల రిపబ్లిక్ వీరులు స్వతంత్ర రిపబ్లిక్ పతాకానికి గౌరవ వందనం చేశారు. యుద్ధం ప్రారంభమైంది. మేల్కోండి భారతీయులారా అంటూ పాటలు పాడటమే కాదు, రిపబ్లిక్ స్థాపనలో కూడా మౌలా క్రియాత్మక పాత్రను పోషించారు. ఆయన గావించిన పతాకావిష్కరణతో పరిటాల రిపబ్లిక్ సర్వసత్తాక స్వతంత్ర పాలన ప్రారంభమైంది.

పరిటాల రిపబ్లిక్ వార్త, జాతీయ పతాకాన్ని గ్రామంలో ఎగురవేసిన సమాచారం నైజాం సంస్థానం అధినేతలకు అందింది. నైజాం సంస్థానాధీశుని ప్రతినిధి పరిటాల మీద విరుచుకు పడేందుకు సిద్ధమయ్యాడు. జాగీర్దార్ మార్గదర్శకత్వంలో పోలీసులు గ్రామం మీద దాడి చేశారు. ఆకస్మిక దాడులు, అనుకోని అవాంతరాలకు సిద్ధంగాలేని పరిటాల నేతలు తాత్కాలికంగా అజ్ఞాతంలోకి వెళ్ళారు. ప్రజలు మొక్కవోని ధైర్యంతో నిలబడి, బాధలను భరించారు. పరిటాల రిపబ్లిక్ ప్రజా పాలనకు నడుంకట్టారు. సంస్థానాధీశుల బలగాలను, పోలీసు దాడులను ఎదుర్కొనేందుకు నాయకులు ఏర్పాట్లు చేసుకున్నారు. పరిటాల రిపబ్లిక్ దళాలు ఏర్పడ్డాయి.

పరిటాల రిపబ్లిక్ అధ్యక్షుడు దేవరాజ్‌కు **కుడి భుజం** గా షేక్ మౌలా సాహెబ్ రిపబ్లిక్ వ్యవహారాలలో ప్రధాన పాత్ర వహించారు. పరిటాల ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని కులాల, మతాలకు చెందిన వారితో ఒక సమితిని ఏర్పాటు చేశారు. ఒక ప్రత్యేక రాజ్యాంగాన్ని రూపొందించుకున్నారు. పరిటాల రిపబ్లిక్‌లో భాగస్వామి అయినటువంటి ప్రతి గ్రామానికి ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఆ గ్రామ కమిటీ ప్రతినిధులు రిపబ్లిక్ కమిటీని ఎన్నుకునే ప్రజాస్వామిక పద్దతి తయారైంది. సారాను పూర్తిగా నిషేధించారు. ఈ నియమ నిబంధనలను ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలు విధించారు.

ఆనాడు కోరినట్టయితే పరిటాల రిపబ్లిక్‌లో మంచి పదవి వచ్చి వాలే అవకాశం ఉన్నా షేక్ మౌలా ఎటువంటి పదవులు ఆశించలేదు. మిత్రుడు దేవరాజ్ వెంట సాగుతూ రిపబ్లిక్ వ్యవహారాల పర్యవేక్షణలో ఆయన సహకరించారు. ఈ సాహసోపేత చర్య వలన షేక్ మౌలా సాహెబ్ పేరు పరిటాల పరగణా అంతా వ్యాపించింది. దాంతో ఆయనకు కడగండ్లు ప్రారంభమయ్యాయి. నైజాం సంస్థానాధీశుడు మతం రీత్యా ముస్లిం కనుక నిజాంకు వ్యతిరేకంగా వ్యవహరించ కూడదని కొంత మంది మతపెద్దల నుండి ఆయనకు తాఖీదులు అందాయి. ఆ ఆదేశాలను షేక్ మౌలా పట్టించుకోలేదు.

జాగీర్దార్ బలగాలు భౌతిక దాడులకు సిద్దమయ్యాయి. పరిటాల రిపబ్లిక్ ప్రజల మీద, ప్రధానంగా మౌలా సాహెబ్ లాంటి వ్యక్తుల మీద రజాకారులు కారాలు మిరియాలు నూరసాగారు. ఇస్లాం మతస్థుడై ఉండి నిజాం నవాబుకు వ్యతిరేకంగా వ్యవహరించడమా?



పరిటాల గ్రామంలో షేక్ మౌలా సాహెబ్‌ను 2002 ఏప్రిల్ 21న కలసి నశీర్ అహమ్మద్ రాసిన 'భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు' ప్రథమ ముద్రణను అందజేసినప్పటి చిత్రం

ఎంతటి నేరం ? అంటూ ఆగ్రహావేశాలు వ్యక్తంచేశారు. రిపబ్లిక్ నేతల కంటే కూడా మౌలా సాహెబ్‌ను ప్రధాన శతృవుగా భావించి, కక్ష పెంచుకున్నారు.

ఈ పరిస్థితులలో నైజాం పాలకుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని, గ్రామం లోని కొన్ని ముస్లిం కుటుంబాలు, పరిసర గ్రామాల ప్రజలు మౌలాను భయపెట్టసాగారు. పరిటాల చుట్టూ నైజాం పాలన సాగుతున్నందున ఏ సమయంలోనైనా బలగాలు పరిటాల మీద విరుచుకుపడవచ్చని సాగిన ప్రచారంతో భయపడిన మౌలా సాహెబ్ తల్లితండ్రులు ప్రాణాలు కాపాడుకోవాల్సిందిగా బిడ్డను బలవంతం చేశారు. తల్లితండ్రుల ఒత్తిడి మీద పరిటాల పొలాల్లో, పర్వత ప్రాంతాల్లో కొంతకాలం మౌలా రహస్య జీవితం గడిపారు.

భౌతికదాడులకు ప్రజలు లొంగకపోవడంతో నైజాం పాలకులు మార్గం మార్చు కున్నారు. మానసికంగా ఒత్తిడి తెచ్చి రిపబ్లిక్‌ను ఛిన్నాభిన్నం చేయడానికి కుయుక్తులు పన్నారు. షేక్ మౌలా సాహెబ్‌కు నయానా భయాన నచ్చచెప్పేందుకు నిజాం నవాబు తాబేదారులు పరిటాల చేరుకున్నారు. మత పంచాయితీ పెట్టి మౌలాకు వ్యతిరేకంగా తీర్మానం చేయించారు. ఒక సమయంలో నెత్తి మీద చెప్పులు పెట్టి ఆయనను అవమానించారు. మౌలా సాహెబ్ కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణకు గురిచేశారు.

ఈ దాష్టీకాలకు, అవమానాలకు మౌలా సాహెబ్ ఏ మాత్రం చలించలేదు. మత మనోభావాలకు ఆయన లొంగలేదు. **బయటి వ్యక్తులు పలు కారణాలు చూపుతూ పరిటాల ముస్లింలలో మత మౌఢ్యాన్ని రెచ్చగొట్టేందుకు విఫల ప్రయత్నాలు చేశారు.** (దేవరాజు

వివరణ) ఆ ప్రయత్నాలను షేక్ మౌలా ఎంతో ఓర్పు సాహసంతో ఎదుర్కొన్నారు. మౌలా లాంటి యోధుల వలన మతాతీతంగా ప్రజలంతా ఏకమై సాగడంతో పరిటాల రిపబ్లిక్ చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా, **బాల్యావస్థలోనున్న పరిటాల రిపబ్లిక్‌లోని ప్రజలను రజాకార్ల ముసుగులో దోచుకునేందుకు పరిసర గ్రామాలకు చెందిన కొందరు దుష్టులు కుట్రలు పన్నారు**. ఈ కుయుక్తులను దేవరాజు, షేక్ మౌలా సాహెబ్‌ల నాయకత్వంలో పరిటాల రిపబ్లిక్ యోధులు ఎదుర్కొని విఫలం చేశారు.

నైజాం సర్కారులోని రిపబ్లిక్ ఉనికిని సహించలేని జాగీర్దార్ బలగాలను ఎదుర్కొంటూ సుమారు 18 మాసాలు పరిటాల రిపబ్లిక్ మనుగడ సాగించింది. చివరకు నిజాం నవాబు ప్రతినిధి పరిటాల రిపబ్లిక్‌ను అంతం చేయడానికి బలగాలను పంపాడు. ఆ బలగాలు పరిటాలకు 10 మైళ్ళ దూరాన విడిది చేశాయి. పరిటాల రిపబ్లిక్ సేనలు శతృవును ఎదుర్కొనేందుకు సిద్దమయ్యాయి. అదృష్టవశాత్తు ఈ బలగాల మధ్యన రణం సాగలేదు. **ఆ సమయంలో శ్రీ కాకాని వెంకటరత్నం నాయకత్వంలోని సేవా దళం సభ్యులు, ఇండియన్ యూనియన్ బలగాలు పరిటాల వీరులకు అండగా నిలిచాయి**. (దేవరాజు వివరణ) అయినప్పటికీ నైజాం బలగాల శక్తి ఎదుట పదుల సంఖ్యలో గల పరిటాల రిపబ్లిక్ పరిమిత సైనికబలం చాలదని గ్రహించిన రిపబ్లిక్ ప్రతినిధులు ఆ ప్రతినిధుల వాతావారణంలో (**ముండా కాదు ముత్తైదువు కాని స్థితి**-మాదిరాజు దేవరాజ్ మాటల్లో) మహాత్మా గాంధిని కలిసారు. మాతృదేశంలో విలీనం కావడానికి పరిటాల ప్రతినిధులను సాదరంగా ఆహ్వానించిన మహాత్ముడు సర్దార్ వల్లభాయ్ పటేల్‌తో తాను మాట్లాడగలనని వాగ్దానం చేసి పంపారు.

చివరకు 1948 సెప్టెంబర్ మాసంలో నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది. అటు నైజాం విలీనం కాగానే ఇటు పరిటాల రిపబ్లిక్ కూడా ఇండియన్ యూనియన్‌లో భాగమై పోయింది. ఆవిర్భావం దగ్గర నుండి పరిటాల రిపబ్లిక్ కాస్తా ఇండియన్ యూనియన్‌లో కలిసి పోయేంత వరకు నిష్టతో, నిబద్దతతో, త్యాగాలతో పరిటాల రిపబ్లిక్‌ను కాపాడుకున్న పరిటాల యోధులు తమ ఆకాంక్షలు నెరవేరినందుకు, తమ గడ్డ భారతదేశంలో విలీనమైనందుకు ఆనందించారు.

స్వతంత్ర భారతదేశంలో తన శక్తిని నమ్ముకుని, భవిష్యత్తు మీద ఎంతో ఆశతో జీవితాన్ని షేక్ మౌలా సాహెబ్ ప్రారంభించారు. చిన్ననాటి నుండే తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వ్యక్తంచేసే స్వభావంగల షేక్ మౌలా ఆ తరువాత రాజకీయాల పట్ల ఆసక్తి చూపలేదు. ఉన్నదానితో సంతృప్తిపడే మనస్తత్వంగల ఆయన ఆర్థిక ప్రయోజనాల పట్ల గాని, అధికారిక పదవుల పట్లగాని ఎటువంటి ఉత్సుకత చూపలేదు. ఆ కారణంగా అయన తన గ్రామం వరకు పరిమితమయ్యారు. ఆయన సహచరులు రాజకీయంగా మంచి స్థానాలు





సయ్యద్ నశీర్ అహమ్మద్ రాసిన 'మైసూరు పులి టిపూ సుల్తాన్' గంథాన్ని (ప్రథమ ముద్రణ) 2002 మే 4న విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరిస్తున్న షేక్ మౌలా సాహెబ్

సంపాదించుకున్నా, ప్రయోజనాలను పొందినా ఆయన మాత్రం సామాన్య గ్రామస్తుడిగా పరిటాలలో మిగిలిపోయారు.

అటు బ్రిటీషర్ల నుండి ఇటు నైజాం సంస్థానాధీశుల నుండి తమ గడ్డను స్వతంత్రం చేసుకోగలిగినా, మౌలా సాహెబ్ తన కుటుంబాన్ని మాత్రం పేదరికం కోరల నుండి విముక్తం చేసుకోలేకపోయారు. నిజాం పోలీసుల తుపాకీ గుళ్ళకు, రజాకార్ల కరకు కత్తులకు భయపడని ధైర్యశాలి పేదరికానికి బెదిరిపోలేదు. రెక్కల కష్టం మీద ఐదుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగబిడ్డలు గల భారీ కుటుంబాన్ని మోస్తూ కష్టాలతో నిరంతరం సహవాసం చేశారు. కాయకష్టం చేసుకుంటూ, కొండలెక్కి కట్టెలు కొట్టుకొచ్చి విక్రయించుకుని లభించిన అత్తెసరు ఆదాయంతో బ్రతుకు బండిని నడుపుకుంటూ గడిపిన మౌలా దంపతులు తమ పిల్లలకు వివాహాలు చేశారు. వివాహాలు చేసుకున్న పిల్లలు రెక్కలొచ్చిన పక్షుల్లా తమ తమ జీవితాలను నిర్మించుకునేందుకు తలోదిక్కు వెళ్ళిపోయారు.

ఒంటరిగా మిగిలిన మౌలా దంపతులకు కాయకష్టం తప్పలేదు. ఆ కుటుంబం పడుతున్న ఇక్కట్లను చూసిన మౌలా సహచరులు స్వాతంత్ర్య సమర యోధుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోమని సూచించారు. కష్టపడడం తప్ప అన్యుల ఎదుట చేయిచాచడం ఇష్టంలేని మౌలా సాహెబ్ తొలుత సందేహించినా కటిక పేదరికం, మీద పడుతున్న వయస్సు ఆయనను ఆ పనికి బలవంతంగా ఒప్పించాయి. పేదరికం తెచ్చిపెడుతున్న కడగండ్లను భరించలేక 1986లో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

స్వాతంత్ర్య సంగ్రామంలో పాలుపంచుకున్న ఆ ప్రాంతంలోని 40 మందికి స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తింపు లభించింది. **'స్వయంగా తయారు చేసిన జాబితాలో**

**మౌలా సాహెబ్ పేరును తొలి పేరుగా రాసి పంపినా, మౌలాకు ఆనాడు అదృష్టం వరించలేదు...ఔరంగాబాద్‌లో గోవిందరావు షరాఫ్ నేతృత్వంలోని కమిటి దరఖాస్తులను పరిశీలించి మౌలా సాహెబ్ అంటే పడని వ్యక్తులు కుట్రతో ఆయన దరఖాస్తును తారుమారు చేశారు. ఆ తరువాత మౌలా అభ్యర్దనలను పరిశీలించడానికి అంగీకరించిన అధికారులు, మౌలా వేషధారణ, మాట తీరును చూసి ఆయనను రజాకార్ల సహచరుడిగా భ్రమించారు. పరిటాల రిపబ్లిక్ యోధుడిగా నమ్మలేక పోయారు..'** (మాదిరాజు దేవరాజ్ స్యయం వివరణ) అందువలన అధికారుల దృష్టిలో 'పరిటాల రిపబ్లిక్ పతాక వీరుడు' స్వాతంత్ర్య సమర యోధుడు కాలేక పోయాడు. ఆ తరువాత పెన్షన్ కోసం షేక్ మౌలా సాహెబ్ మళ్ళీ ప్రయత్నాలు సాగించలేదు. మాదిరాజు సహచరుడ్ని ఆదుకోడానికి ఎంతగా కృషి చేసినా, వ్యయప్రయాలకోర్చినా ప్రభుత్వ నియమ నిబంధనలు ప్రతిసారి అడ్డుకున్నాయి. రెక్కల కష్టం మీద ప్రగాఢ విశ్వాసంగల మౌలా సాహెబ్ బ్రతుకు బండిని లాగడం చాలా కష్టంగా ఉన్నప్పటికి, పెన్షన్ విషయం ప్రస్తావిస్తే, '..**ఆనాడు పెన్షన్ వస్తుందని మేం పోరాడలేదు. అందువల్ల దానికోసం ప్రస్తుతం వెంపర్లాడడం లేదు. బ్రతుకుతామో చస్తామో కూడా తెలియకుండా ముందుకు దూకాం. అంతేగాని ఎవరైనా వచ్చి సహాయం చేస్తారని అనుకోలేదు. అందువల్ల ఇప్పుడు కూడా ఎవరోవచ్చి సహాయం చేస్తారని ఆశించడం లేదని**..' అన్నారు. ఆనాటి విషయాలను, పరిటాల రిపబ్లిక్ స్థాపన, నిర్వహణలో ఆయన పాత్రను గురించి మౌలా సాహెబ్‌ను రచయిత గుచ్చి గుచ్చి అడిగినా అదేమంత పెద్ద వ్యవహారం కాదనట్టుగా వ్యవహరించారు. పలుమార్లు అడిగిన మీదట ఆనాటి విశేషాలను ఒక్కొక్కటిగా గుర్తుకు తెచ్చుకుని వివరిస్తూ, **మతాలకు అతీతంగా ఏక మనస్కులై ఉండాలనుకున్నాం. అధర్మానికి వ్యతిరేకంగా పోరాడడం ప్రతి ఒక్కరి విధి కదా, అందువలన నా విధిని నేను నిర్వర్తించడం ఏమంత గొప్ప విషయం చెప్పండి,** అన్నారు మౌలా సాహెబ్.

ఆయన భార్య మహబూబ్‌బీ కూలి పనులకు వెడుతున్నారు. 2002లో రచయిత మౌలా గృహానికి వెళ్ళినప్పుడు చిల్లులు పడిన పాత్రలో కారం కలుపుకుని అన్నం తింటున్న ఆమె మాట్లాడుతూ '..**కూలి చేసుకు బ్రతుకుతున్నాం. కూలికి వెళ్ళకపోతే ఎలా? ఆయనకు కళ్ళు సరిగ్గా కనపట్టం లేదు. కూలీ-నాలీ చేయలేక పోతున్నాడు. ఇద్దరం కష్టపడితేనే కదా ముద్ద నోట్లోకి వెళ్ళేది**..' అన్నారు. కట్టుకున్న చిరుగుల చీరను సరిచేసుకుంటూ కళ్ళల్లో సుళ్ళు తిరుగుతున్న నీళ్ళను కొంగుతో ఒత్తుకుంటూ ఆనాటి వివరాలను రచయితకు తెలిపారు. పరిటాల రిపబ్లిక్ సాధనలో మౌలా పాత్ర గురించి ప్రస్తావించగా, అదేమంత ఘనకార్యమా? అన్నట్టుగా ఆమె తొలుత చూశారు. ఆ తరువాత ఆనాటి రోజులను గుర్తుకు తెచ్చుకుంటూ, చాలా ఇబ్బందులు పడ్డామని, సాంఘిక బహిష్కరణకు గురయ్యామన్నారు.

అప్పట్లో మౌలా సాహెబ్ శిధిలావస్థలో ఉన్న చిన్న ఇంట్లో నివశిస్తున్నారు. కట్టెలు



పరిటాల గ్రామంలో షేక్ మౌలా సాహెబ్, శ్రీమతి మహబూబీ లను
రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ 2010 సెప్టంబర్ 26న కలసినప్పటి చిత్రం

కొట్టుకొచ్చి అమ్ముకునే శక్తి క్షీణించడంతో, వృద్ధాప్యంలో పాత రిక్షాబండిని తన బ్రతుకు బండిగా మార్చుకున్నారు. ఓపిక ఉన్న రోజున జాతీయ రహదారి మీద పేడను సేకరిస్తారు. ఆ పేడతో పిడకలు చేస్తారు, ఎరువుగా మార్చుతారు. ఆ పిడకలను, ఎరువును రైతులకు అమ్ముకుని తద్వారా లభించినంతలో తృప్తిపడి జీవిస్తున్నారు. కంటిచూపు మందగించడంతో భారీ వాహనాలతో రద్దీగా ఉండే జాతీయ రహదారి మీద పేడ సేకరించడం ప్రాణాంతకంగా మాడంతో కుటుంబీకులు ఆ పనిని మాన్పించారు.

షేక్ మౌలా సాహెబ్ కుటుంబ ఆర్థిక స్థితి ఎంత దారుణంగా ఉన్నా నీతి-నిమయాల కట్టుబాట్లను ఆయన ఏనాడు ఉల్లంఘించలేదు. గతంలో పంచాయితీ ఎన్నికల సందర్భంగా వార్డు మెంబరుగా ఎన్నికైన ఆయనకు సర్పంచ్ పదవికి పోటీపడిన ఒక వర్గానికి చెందిన వారు తమకు మద్దతు పలికితే పొలంతోపాటుగా భారీగా ముట్టజెబుతామని ఆశపెట్టినా ససేమిరా కాదంటూ తన స్వేచ్ఛను కాపాడుకున్న ఘనుడు మా మౌలా సాహెబ్ అంటూ ఈనాటికి గ్రామస్తులు మౌలా గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు.

స్వాతంత్ర్యోద్యమం పట్ల కనీస నిబద్ధత లేకున్నా, సామూహిక అరెస్టులలో భాగంగా పోలీసు రికార్డులలో నమోదైన వారంతా స్వాతంత్ర్యసమర యోధులయ్యారు. పోలీసుల చిట్టాలో నమోదు కాని షేక్ మౌలా సాహెబ్ లాంటి యోధులకు ఆ అదృష్టం దక్కలేదు. ఆ తరువాత కాలంలో స్వార్థ రాజకీయాలు రంగప్రవేశం చేయడంతో మౌలా సాహెబ్ లాంటి దేశభక్తులకు స్వాతంత్ర్యసమరయోధుల జాబితాలో స్థానం లభించలేదు. ఆకారణంగా పరిటాల


పతాక వీరుడు చాలా కాలం వరకు అధికారికంగా స్వాతంత్ర్య సమరయోధుడు కాలేక పోయాడు. **పలుకుబడి ఉపయోగించి ఎలాగోలాగా పెన్షన్ సంపాదిస్తానని ఎన్నిసార్లు చెప్పినా షేక్ మౌలా అంగీకరించడం లేదు. అక్రమంగా పెన్షన్ ఎందుకు తీసుకోవాలి? అంతటి అవసరమేంటీ? అని మొండి ఘటం మౌలా నిగ్గతీస్తున్నాడని,** పరిటాల రిపబ్లిక్ అధ్యక్షుడు, మాదిరాజు దేవరాజు రచయితతో మాట్లాడుతూ షేక్ మౌలా సాహెబ్ ఉత్తమ వ్యక్తిత్వానికి, నిక్కచ్చి స్వభావానికి సాక్ష్యం పలికారు.

మాదిరాజు పరిటాల రిపబ్లిక్ పోరాట సహచరుడు మౌలా సాహెబ్ గురించి మళ్ళీ ప్రస్తావిస్తూ, **మౌలా చాలా గొప్పవాడు. పరిటాల రిపబ్లిక్‌కు నేను నాయకత్వం వహించినా, వాడు నాకంటే గొప్పవాడు. పేదవాడైనా ఎవ్వరి సహాయాన్ని ఆశించని పెద్ద మనస్సు గలవాడు**, అంటూ మౌలా వ్యక్తిత్వాన్ని చాలా గొప్పగా అవిష్కరించారు. ఈ మాటలను బట్టి చూస్తే షేక్ మౌలా ఎంతటి నిస్వార్ధపరుడో తేటతెల్లమౌతుంది. స్వాతంత్ర్య సమర యోధుడిగా తనను గుర్తించకపోయినా, ఏమాత్రం బాధపడని షేక్ మౌలా సాహెబ్, ఈనాడు దేశంలో నెలకొంటున్న పరిస్థితులను చూసి తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. ఆనాడు తాము ఏమౌతామో కూడా ఆలోచించకుండా పోరాడాం ఏక మనస్కులై ఉండాలని అనుకున్నాం. (ఏక దిల్‌కే సాత్ రహనా కరక్కో).

ఆనాడు ఎన్నో ఆకాంక్షలతో ఆశతో సాధించిన స్వాతంత్ర్యం నేడు స్వార్ధ రాజకీయ నాయకుల స్వప్రయోజనాలకు బలవుతుందన్నారు. మందిరం-మసీదుల పేరుతో స్వార్ధ రాజకీయాలు చేస్తూ, వాదవివాదాలతో విద్వేషాలను సృష్టించుకుని శతృవులుగా విడిపోయి అనుమానాలు, అపనమ్మకాల నడుమ నివసిస్తున్న ప్రజలు, ప్రస్తుత పరిస్దితుల పట్ల షేక్ మౌలా తీవ్రంగా కలత చెందారు. ఈ రకమైన దురదృష్టకర పరిస్థితులు వస్తాయని ఊహించ లేదని షేక్ మౌలా బాధపడ్డారు. అధికారం కోసం రాజకీయ నాయకులు నైతిక విలువలకు, సిద్ధాంతాలకు పూర్తిగా తిలోదకాలు ఇవ్వడంతో ప్రస్తుత దుర్మార్గ పరిస్దితులు దాపురిస్తున్నాయని షేక్ మౌలా సాహెబ్ ఆవేదన వ్యక్తంచేశారు.

ప్రజాసంఘాలు, పలువురి పెద్దల కృషి వలన ప్రస్తుతం షేక్ మౌలా సాహెబ్‌కు స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ లభిస్తుంది. ఆ విధంగా కొంత ఆర్థిక వెసులుబాటు కలగడంతో కొండంత కష్టాలతో సతమతమౌతున్న ఆ వృద్ధ దంపతుల బ్రతుకులో గోరంత వెలుగు వచ్చింది. షేక్ మౌలా సాహెబ్‌ను 2010 సెప్టెంబర్ 26న మరోమారు కలసిన రచయితతో ఆయన మాట్లాడుతూ పెన్షన్ లభించడం కంటే స్వాతంత్ర్య సమరయోధునిగా గుర్తింపు లభించినందుకు సంతోషంగా ఉన్నారు.

◆◆◆



## ఆజాద్ హింద్ ఫౌజ్ యోధుడు

# 50. షేక్ ఖాదర్ మొహిద్దీన్

(1926-)

**ఆ**జాద్ హింద్ ఫౌజ్ అధినేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ పిలుపుకు ప్రతిస్పందిస్తు సర్వం త్యాగం చేయడానికి సంసిద్ధులై పోరుబాట దిశగా ఉరుకులు-పరుగులు పెట్టిన ఆనాటి తెలుగుగడ్డ బిడ్డలలో షేక్ ఖాదర్ మొహిద్దీన్ ఒకరు.

విజయనగరం జిల్లా వేపాడ గ్రామంలో షేక్ ఖాదర్ మొహిద్దీన్ 1926 డిసెంబరు 31న జన్మించారు. ఆయన తండ్రి షేక్ పీర్ సాహెబ్, తల్లి భులాఖ్ (బురాఖ్). ఆమె 1933లో కన్నుమూశారు. అతికొద్ది ఆదాయంతో అతికష్టం మీద కుటుంబాన్ని పోషిస్తున్న తండ్రికి ఆయన తోడ్పడినా ఆ కుటుంబం కష్టాలు తీరలేదు. తండ్రి ప్రోత్సాహంతో ఖాదర్ మొహిద్దీన్ ఐదవ తరగతి వరకు చదువుతున్నారు. చివరకు చదువు మాని పనికోసం వెతుకులాటను ఆరంభించిన ఖాదర్‌కు సింగపూరులోని రబ్బర్ ఎస్టేట్‌లలో పనిచేసేందుకు కూలీలను పంపుతున్న ఏజెంట్ల సహాయం లభించింది.

1938లో పన్నెండు ఏండ్ల వయస్సులోనే 'రబ్బర్ ఎస్టేట్ కూలి'గా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోడానికి షేక్ ఖాదర్ మొహిద్దీన్ బర్మా వెళ్ళారు. బర్మాలోని లోయర్ బర్మా మర్‌గోయి జిల్లాలోని 'కింగ్ ఐలాండ్ రబ్బరు ఎస్టేట్'లో నెలసరి ఏడున్నర రూపాయల జీతానికి ఆయన కుదిరారు. ఆ రబ్బర్ ఎస్టేట్‌లో అన్ని కష్టాలను భరిస్తూ ఖాదర్ మొహిద్దీన్ మూడు సంవత్సరాల ఎనిమిది నెలలపాటు పనిచేశారు.

1939లో ద్వితీయ ప్రపంచ సంగ్రామం అరంభమైంది. ఆ అవకాశాన్ని తీసుకుని నేతాజీ సుభాష్ చంద్రబోస్ జపాను సహకారంతో ఆంగ్లేయ ప్రభుత్వం మీద సమరం ప్రకటించారు. నేతాజీ అధినేతగా **ఆజాద్ హింద్ ఫౌజ్** ఉనికిలోకి వచ్చింది. ఆ సమయంలో జపాన్ సింగపూర్ మీద దాడిచేసి పూర్తిగా ఆక్రమించుకుంది. ఆంగ్లేయ ప్రభుత్వం మీద యుద్ధం ప్రకటించిన నేతాజీ దేశభక్తిగల యువతను **ఆజాద్ హింద్ ఫౌజ్** లో చేరమని పిలుపునిచ్చారు. ఈ మేరకు యువతను **ఆజాద్ హింద్ ఫౌజ్** లోకి రిక్రూట్ చేసేందుకు వివిధ ప్రాంతాలలో తగిన ఏర్పాట్లు చేశారు. ఆ విధంగా బర్మా నుండి యువతను ఫౌజ్‌లో చేర్చుకునే కార్యక్రమాన్ని నేతాజి ప్రతినిధి ఎస్.ఆర్.పాల్ చేపట్టారు.

అది 1942 సంవత్సరం. జపాన్ సేనలకు సింగపూరు లొంగిపోయాక నేతాజీ సుభాష్ చంద్రబోస్ సింగపూరు వచ్చారు. ఆంగ్లేయుల నుండి మాతృభూమిని విముక్తం చేసేందుకు కదలి రావాల్సిందిగా యవతను కోరుతూ ఆయన చేసిన ఉత్తేజపూరిత ప్రసంగాలు షేక్ ఖాదర్ మొహిద్దీన్ ఆకర్షించాయి. **ఆజాద్ హింద్ ఫౌజ్** లోకి యువతను రిక్రూట్ చేయడానికి నియుక్తులైన ఎస్.ఆర్.పాల్ ఆహ్వానం మేరకు ఖాదర్ మొహిద్దీన్ ఉత్సాహంతో **ఆజాద్ హింద్ ఫౌజ్**లో చేరారు. ఆ సమయానికి ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి తన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు తన జీతం నుండి, రంగూన్‌లో ఇతర పనులు చేస్తూ సంపాదించి జాగ్రత్తగా దాచిపెట్టుకున్న ఇరవైవేల రూపాయలను **ఆజాద్ హింద్ ఫౌజ్**కు ఖాదర్ మొహిద్దీన్ విరాళంగా అందచేశారు.

**ఆజాద్ హింద్ ఫౌజ్**లో చేరిన తొలి దినాలలో ఎస్.ఆర్.పాల్ మార్గదర్శకత్వంలో ఖాదర్ మొహిద్దీన్ కూడా రిక్రూటింగ్ ఏజెంటుగా బాధ్యతలు నిర్వహించారు. మంచి వాక్చాతుర్యం, నాయకత్వ లక్షణాలు గల యువకుల్లో దేశభక్తి భావనలు ప్రోదిచేస్తూ ఎంతో మందిని ఆయన ఫౌజ్‌లో చేర్చారు. ఆంగ్లేయ ప్రభుత్వం మీద నేతాజీ సాగిస్తున్న యుద్ధం తీవ్రత పెరిగేకొద్ది, దేశం కోసం ప్రాణత్యాగానికి సిద్దపడగల యువత అవసరం పెరిగేకొద్దీ ఖాదర్ మొహిద్దీన్ కూడా రైఫిల్‌మన్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ విధంగా తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ స్థానిక ఆజాద్ హింద్ ఫౌజ్ సహచరులలో మంచి గుర్తింపు, ప్రజానీకంలో మంచి ప్రజాదరణను సంపాదించుకున్నారు.

ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికునిగా షేక్ ఖాదర్ మొహిద్దీన్ ముందుకు సాగుతుండగా, 1945 ఏప్రిల్ 24 జపాన్ పరాజయం పాలయ్యింది. ఆ కారణంగా ఆజాద్ హింద్ ఫౌజ్ కూడా ఓటమి అంచుకు చేరుకుంది. ఆ క్లిష్టపరిస్థితులలో అధికారుల సలహా మేరకు కొంత మంది ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికులు సురక్షిత ప్రదేశాలకు వెళ్ళిపోయారు. ఆ విధంగా సురక్షిత ప్రజాజీవనంలోకి ప్రవేశించిన ఖాదర్ 1947లో బర్మా నుండి ఇండియాకు వచ్చేశారు.

బర్మాలో సంపాదించిన సొమ్మును ఆజాద్ హింద్ ఫైజ్‌కు విరాళంగా ఇచ్చేసిన ఖాదర్ ఇతరత్రా ఆర్జించిన ఆదాయం ఏమీలేక ఉత్తచేతులతో స్వగ్రామం చేరుకున్నారు. స్వగ్రామంలో ఆయన్ను ఆదుకున్నవారు లేకపోయారు. ఆయనకు ఇక్కడ జీవనోపాధి ఏమీ లభించలేదు. మూడు మాసాల పద్దెనిమిది రోజులు స్వగ్రామంలో గడిపిన ఆయన బ్రతుకు దెరువును వెతుక్కొంటూ మళ్ళీ బర్మా వెళ్ళిపోయారు. అక్కడ 1948 డిసెంబరులో స్థానిక యువతి ఫాతిమాను వివాహం చేసుకున్నారు. స్థానికంగా నివాసం ఉంటున్న భారతీయుల సహకారంతో కిరాణషాపును ఏర్పాటుచేసుకుని నూతన దంపతులు జీవితం ఆరంభించారు.

మొదటి నుండి ప్రజలతో మమేకమై పనిచేయడం, సేవా కార్యక్రమాలలో పాల్గొనడం, స్వచ్ఛంద సేవాసంస్థలకు తనకున్న దానిలోనే కొంత ఆర్థికంగా సహాయం అందజేయడం అలవాటుగా ఉన్న ఖాదర్ మొహిద్దీన్ బర్మాలో పలు స్వచ్ఛంద సేవాసంస్థలలో క్రియాశీలక పాత్ర నిర్వహించారు. ఆయన 'హయాతుల్ ఇస్లాం మదరసా', 'ఆల్ బర్మా ఇండియన్ కాంగ్రెస్' (మర్గోయి శాఖ) కార్యదర్శిగా ఆరు ఏండ్ల పాటు సేవలందించారు. 'ఆంధ్రా యంగ్‌మన్ రీడింగ్ సోసైటీ' అధ్యక్షునిగా, 'మల్బార్ ముస్లిం అసోసియేషన్' ఉపకార్యదర్శిగా పనిచేస్తూ ఖాదర్ మొహిద్దీన్ బర్మాలో పూర్తిగా స్థిరపడిపోయారు.

ఆ విధంగా 15 ఏండ్లపాటు బర్మాలో జీవనం గడిపిన షేక్ ఖాదర్ మొహిద్దీన్ 1964 ప్రాంతంలో బర్మాలో వచ్చిన రాజకీయ మార్పుల వలన కుదుపుకు లోనయ్యారు. బర్మా పరిపాలనలో ఏర్పడిన అస్థవ్యస్థ పరిస్థితుల మూలంగా బర్మా ప్రధాన సైనికాధికారి ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకున్నాక బర్మాలో స్థిరపడిన పరదేశీయులకు తిప్పలు వచ్చాయి. బర్మాలో ఏనాటి నుండో ఉంటున్న ఇతర దేశస్థులకు వ్యతిరేకంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ విపత్కర పరిస్థితులను తట్టుకుని నిలబడగల శక్తి చాలక షేక్ ఖాదర్ మొహిద్దీన్ లాంటి పలువురు బర్మాతో అన్ని సంబంధాలు వదలుకుని స్వదేశానికి చేరుకున్నారు. ఆ విధంగా 1964లో ఖాదర్ మొహిద్దీన్ భార్య ఫాతిమా, బిడ్డలతో సహా స్వగ్రామమైన విజయనగరం జిల్లా వేపాడకు చేరుకున్నారు. బర్మాలో అన్నీ వదలి వచ్చిన ఆయన వేపాడలో 'టీ స్టాల్' పెట్టుకుని సాదాసీదా బ్రతుకును ఆరంభించారు.

1942 నుండి 1945 వరకు ఆజాద్ హింద్ ఫౌజ్‌లో పలు బాధ్యతలు నిర్వహించిన ఖాదర్‌కు గుర్తింపుగా, చాలా ప్రయత్నాల తరువాత 1973లో అధికారిక పత్రాలు లభించాయి. ఆ అధికారిక పత్రాల వలన స్వాతంత్ర్య సమరయోధునిగా ఆయనకు గౌరవం దక్కినా ప్రభుత్వం నుండి ఎటువంటి గుర్తింపు గాని, ఆర్థిక సమస్యలతో అలమటిస్తున్న ఆయన కుటుంబానికి చేయూత గాని లభించలేదు. శతవిధాల విఫల ప్రయత్నాలు చేసిన ఆజాద్ హింద్ ఫౌజ్ యోధులు షేక్ ఖాదర్ చివరకు న్యాయం కోసం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించక తప్పలేదు. ఆ న్యాయపోరాటం ఫలితంగా 1997లో షేక్ ఖాదర్ మొహిద్దీన్‌కు

'స్వతంత్ర సైనిక్ సమ్మాన్' వర్తింపచేయాలంటూ కోర్టు తీర్పునిచ్చింది. ఆ తీర్పును అనుసరించి 1998 ఆగస్టు ఐదు నుండి ఆయనను స్వాతంత్ర్య సమరయోధునిగా గుర్తించిన ప్రభుత్వం అందుకు తగిన సదుపాయాలను కల్పించింది.

ఆ సదుపాయాలతో ఆర్థికంగా కొంత సేదదీరిన షేక్ ఖాదర్ మొహిద్దీన్ ప్రజా సేవాకార్యక్రమాల తోపాటుగా రాజకీయాల మీదకు దృష్టి సారించారు. ఆయన తెలుగుదేశం పార్టీ విజయనగరం జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షునిగా పనిచేశారు, మూడు పర్యాయాలు మండల కోఆప్షన్ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు. ఈనాటికి కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి సల్పుతూ అవసరార్థులను అన్నివిధాల ఆదుకుంటూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్న షేక్ ఖాదర్ మొహిద్దీన్ తెలుగు, ఉర్దూ, బర్మీస్, మళయాళం, తమిళం, హిందీ భాషలను ఈనాటికి ధారాళంగా మాట్లాడగలరు.

**'ఆనాడు నేతాజీ చూపిన బాట, మేము కోరుకున్న దేశం-సమాజం కానరావడం లేదు. మా కలలన్నీ కల్లలయ్యాయి. ఈనాటి రాజ్యం ప్రజారాజ్యంగా కాకుండా దోపిడీ రాజ్యంగా మారింది. ప్రజల కోసం పనిచేయడం మానుకున్న రాజకీయనాయకులు అధికారం కోసం అర్రులు చాస్తున్నారు. మనం బ్రిటీష్ ప్రభుత్వం నుండి మన దేశాన్ని విముక్తం చేసి ప్రజలకు అప్పగించాలి. మనం ఎటువంటి పదవులను ఆశించరాదు అని ఆనాడు నేతాజీ మాకు ఆదేశించారు. ఆ బాటలో అవినీతి రహిత సమాజ నిర్మాణాన్ని ఆకాంక్షిస్తూ, దైవభక్తి -దేశభక్తి, సేవాతర్పరతతో పాటుగా మతసామరస్యాన్ని పెంపొందించాలని తద్వారా అపూర్వ త్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని పరిపుష్టం చేయాలన్నది ప్రధానాశయంగా సాగుతున్నాను**' అని ప్రకటిస్తున్న షేక్ ఖాదర్ ఆ దిశగా నిర్మాణాత్మక ఫలితాలు సాధించేవరకు విశ్రమించేది లేదన్న పట్టుదలను కూడా రచయితకు రాసిన 10.11.209 నాటి లేఖలో వ్యక్తంచేశారు.

ఆనాడు ఆజాద్ హిండ్ ఫౌజ్‌లో చేరిన హైదరాబాద్ వజీర్ సుల్తాన్ టుబాకో కంపెనీ యజమాని కుమారుడు అలీ సుల్తాన్ ఫతే ముహమ్మద్, అబ్దుల్ సయ్యద్ ఉస్మాని, ఎండి.ఖాన్, షరీఫుద్దీన్ (హైదరాబాద్) మదార్ షా (అనంతపూర్), ఎండి హనీఫ్ (నైజాం), గులాం ఖ్వాజా (సికింద్రబాద్), షేక్ బాషా (భద్రాపురం, ప్రకాశం జిల్లా), మహబూబ్ అలీ, ఇమానుద్దీన్, మహమ్మద్ ఖాన్, ఖముర్రుల్ ఇస్లాం (హైదరాబాద్) లాంటి వారి త్యాగాలను, అబిద్ హసన్ సప్రాని (హైదరాబాద్) లాంటి ప్రముఖుల కార్యదక్షతను ఈనాటి యువతకు వివరిస్తూ ఎందరిలోనో దేశభక్తిని మరింతగా ప్రోదిచేస్తున్న చేస్తూ బ్రతుకు బండిని సాగిస్తున్న, ఆజాద్ హిండ్ ఫౌజ్ యోధులు, ఎనభైమూడేండ్ల షేక్ ఖాదర్ మొహియుద్దీన్ జీవితం అందరికీ స్పూర్తిదాయకం.

◆◆◆

# ప్రజాపోరాటయోధుల

## సంక్షిప్త వివరాలు

## (అనుబంధం -2)

# ఇందులో ...


| | | |
|---|---|---|
| 01. | షేక్ బందగీ సాహెబ్ | 333 |
| 02. | సయ్యద్ నాసిర్ హసన్ | 339 |
| 03. | జైనాబీ | 341 |
| 04. | షేక్ నన్నే బచ్చా | 345 |
| 05. | జహందర్ అఫ్సర్ | 347 |

## ప్రజా పోరాటాలకు ప్రేరణగా నిలచిన యోధుడు

# 1. షేక్ బందగీ సాహెబ్

(1905-1940)

**భా**రత దేశం బ్రిటీష్ బానిస బంధనాల నుండి విముక్తమయ్యాక, నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలన్న డిమాండ్ వెల్లువెత్తిన క్రమంలో నిజాం నవాబు తాబేదార్లయిన దొరలు–దేశ్‌ముఖ్‌ల–భూస్వాముల–దేశ్‌పాండేల క్రూరపెత్తనం, భరించరాని ఆధిపత్యం నుండి విముక్తమయ్యేందుకు సాగిన ప్రజాపోరాటంలో **తొలి అమరుడు**గా చరిత్ర పుటలకెక్కిన యోధుడు షేక్ బందగీ సాహెబ్.

షేక్ బందగీ సాహెబ్ వరంగల్ జిల్లా దేవరుప్పుల మండలం, కామారెడ్డి గూడెంలో 1905 ప్రాంతంలో మహమ్మద్ ఖాశిం, అమీర్ బీబీలకు జన్మించారు. బందగీ చిన్నతనం నుండి న్యాయవర్తనుడు, అన్యాయాన్ని సహించని గుణసంపన్నుడు. అభ్యుదయ భావాలు గలవాడు, నిత్యం ఆంధ్ర మహాసభ నేతలతో, కార్యకర్తలతో తిరిగేవాడు. గ్రామ సమస్యల మీద దృష్టి నిలిపేవాడు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేసేవాడు. ఆ క్రమంలో **కామారెడ్డిగూడెంలో ప్రజల మనిషిగా పేరు పొందిన వ్యక్తి షేక్ బందగీ సాహెబ్. విస్నూర్ దేశ్‌ముఖ్ నిరంకుశత్వాన్ని, అబ్బాస్ అలీ** (బందగీ పెదనాన్న కుమారుడు) **ఆక్రమాలను, ఫక్కీర్ మహ్మద్** (అబ్బాస్ అలీ కుమారుడు) **దోపిడీలను గ్రామప్రజల ద్వారా ఎదిరించాడు.** (బందగీ కోర్టుబాట–తెలంగాణా పోరుబాట (1928–40), వ్యాసకర్త : గయని యాదగిరి, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్, సెషన్స్ ప్రోసీడింగ్స్, సిద్దిపేట, 2006, పేజి.217)

షేక్ బందగీ సాహెబ్ పెదనాన్న కుమారుడు అబ్బాస్ అలీ. ఆయన కుమారుడు ఫకీర్ అహమ్మద్. ఫకీర్ అహమ్మద్ విస్నూర్ దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి వద్ద ఉద్యోగి. ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని అబ్బాస్ అలీ విస్నూర్ దేశ్‌ముఖ్‌కు నమ్మినబంటుగా మారాడు. 1941లో బందగీకి అతని పెదనాన్న కుమారుడు అబ్బాస్ అలీకి భూసంబంధమైన వివాదం తలెత్తింది. జ్యేష్టభాగంగా తనకు లభించిన ఎనిమిది ఎకరాల పొలాన్ని అమ్ముకున్న అబ్బాస్ అలీకి తన దాయాదులు అనుభవిస్తున్న మిగతా భూమిని కూడా కాజేయాలన్న దుర్బుద్ధి పుట్టింది. ఆ దుర్బుద్ధికి దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి అండదండలు అందాయి.

ఆ రోజుల్లో ' **నైజాం క్రింద ఉన్న దేశ్‌ముఖ్‌లలో నరరూప రాక్షసుడుగా, కలియుగ రావణాసురుడుగా పేరొందిన విస్నూర్ దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి, 40 వేల ఎకరాల భూమికి, 60 గ్రామాలకు సర్వాధికారి. ఈ 60 గ్రామాలపై తను చెలాయించని అధికారము అంటూ లేదు. నిర్వహించని దౌర్జన్యం అంటూ లేదు. నిర్బంధ వెట్టిచాకిరి చెప్పతరం కాదు. గ్రామాలలో గల ప్రతి కులము వారు కులాల వారిగా వెట్టిచాకిరి చెయ్యాలి. ప్రతి పండుగకు, పబ్బానికి మామూళ్ళు ఇచ్చుకోవాలి. వ్యవసాయ పనులకుగాను అన్నిరకాల వెట్టిచాకిరి సేవలు చెయ్యాలి. చివరకు బ్రహ్మణులను కూడా వదలలేదు. వీరు విస్తర్లు కుట్టి దొరల ఇండ్లకు సరఫరా చెయ్యాలి. భూస్వాముల, దొరల ఇండ్లలో పనులు చేయుటకు బానిసలుగా బాలికలను పంపే ఆచారము ఈ ఫ్యూడల్ దోపిడికెల్లా అతి దారుణమైంది. గ్రామాలలో ఎవరైనా ఎక్కడైనా మేకనో, గొర్రెనో కోస్తే దానిలో కొంత ఆ ఊరి దొరకు పంపాలి. 1940లో విస్నూరు గ్రామములో దేశ్‌ముఖ్ బంగ్లా నిర్మాణానికి వెట్టి కొరకు మనుషులనే కాక బండి నడిపే కోడెలను (పశువులను) నిర్బంధంగా తోలుకెళ్లినారు. చందాలు వసూళ్ళు చేయించాడు. ఆనాటి కాలములో పంటచేను, పాడిఆవు, పడుచు బిడ్డ, నడిచేగొడ్డు, నాలుగు కాసులు ఇవన్నీ దేశ్‌ముఖ్ దౌర్జన్యానికి బలి అయ్యేవి. గ్రామాలలో గొడవలు ఏర్పడితే వాటిని దేశ్‌ముఖ్ గడిలో పరిష్కరించడం ఆనవాయితి. దేశ్‌ముఖ్ ఆధీనములో గల గ్రామాలలో సివిల్, క్రిమినల్ కేసులతో సహా స్వంత పోలీసు బలగాలతో సర్వాధికారాలు చెలాయించాడు. అనాడు అతనిని ఎదిరించడం అంటే మృత్యువును ఆహ్వానించినట్టే. తన 60 గ్రామాలలోని ధనిక, భూస్వామ్య మక్తిదారులపై విస్నూర్ దేశ్‌ముఖ్ పెత్తనం చెలాయించాడు. తన ఆధిపత్యాన్ని అంగీకరించని వారి ఆస్తి-పాస్తుల్ని సర్వం విధ్వంసం చేయించేది. ఆతడు సాగించిన దౌర్జన్యాలు ఒక ఎత్తు అయితే, అతని ఏజెంట్లు, గుండాలు సాగించుకున్న పాశవిక నికృష్టాలు, చేసిన హత్యలు మరొక ఎత్తు'** (బందగీ కోర్టుబాట-తెలంగాణా పోరుబాట (1928-40), పేజి.216)

అటువంటి భయానక దేశ్‌ముఖ్ ప్రాపకం సంపాదించిన అబ్బాస్‌అలీకి తమ్ముళ్ళ భూమిని కాజేయడం ఏమాత్రం కష్టం అన్పించలేదు. ఒక పథకం ప్రకారంగా బందగీ,

అతని సోదరులు అనుభవిస్తున్న భూమి తన పూర్వీకు సంపాదించినది కాదని, అదంతా తాను సంపాదించింది కనుక ఆ భూమిని తనకు మాత్రమే చెందాలని బందగీ సోదరులతో తగాదా పెట్టుకున్నాడు. ఆ వివాదాన్ని కామారెడ్డి గూడెంలో తనకు అనుకూల పరిష్కారం పొందేందుకు అబ్బాస్ అలీ విఫల ప్రయత్నం చేశాడు. ఆ వివాదం తిన్నగా విస్నూర్ దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రా రెడ్డి గడికి చేర్చాడు. బందగీని ఆఘమేఘాల మీద తన వద్ద చేర్చాల్సిందిగా దేశ్‌ముఖ్ ఆదేశించాడు. బందగీ దేశ్‌ముఖ్ వద్దకు వెళ్ళి ఆ భూమి తమకు ఎలా చెందిందో వివరించాడు. అబ్బాస్ అలీకి జ్యేష్టభాగం క్రింద ఎనిమిది ఎకరాల భూమిని గతంలో దఖలు చేసిన విషయం ఆ భూమిని అతను అమ్ముకున్న వైనాన్ని పూసగుచ్చినట్టు దేశ్‌ముఖ్ రెడ్డికి అతను వివరించాడు. **అప్పుడు బందగీ వయస్సు సుమారు పాతికేళ్లు.**

ఆ వాదన ఏదీ దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి చెవికెక్కలేదు. బందగీ భూమిని ఏలాగైనా తన ఆశ్రితులకు చెందచేయాలని ముందుగా నిర్ణయించుకున్న దేశ్‌ముఖ్ రెడ్డికి బందగీ వాదనలోని వాస్తవాలు కనపడలేదు. చివరకు ఆ భూమి అబ్బాస్ అలీదని ప్రకటిస్తూ, దానిని అబ్బాస్ అలీకి స్వాధీనం చేయమని బందగీని ఆదేశించాడు. అది అన్యాయం అంటూ, ఆ భూమి న్యాయంగా తనది, తన సోదరులది కనుక దేశ్‌ముఖ్ తీర్పును బందగీ ఖాతరు చేయలేదు. అరవై గ్రామాల ప్రజలు హడలి చచ్చి అనుసరించే **'గడి తీర్పు'** ను కాదన్నవారికి **'పడిశాల భూస్వామి వెంకటరామిరెడ్డికి పట్టిన గతి పడుతుంది'** అంటూ బందగీని దేశ్‌ముఖ్ హెచ్చరించాడు. ఆయన తాబేదార్లు ఆ హెచ్చరికతో మరింతగా రెచ్చిపోయి బందగీని బెదిరించారు. ఆ దేశ్‌ముఖ్ హెచ్చరికలను గాని, అతని తాబేదార్ల బెదరింపులను గాని ఏమాత్రం పట్టించుకోకుండా ఎటువంటి జంకు లేకుండా ధైర్యంతో నిబ్బరంగా నిలచిన షేక్ బందగీని చూస్తూ విస్నూర్ దేశ్‌ముఖ్ రెడ్డి ఆగ్రహంతో రగిలిపోయాడు. **'నీవు ఒక పేద ఫక్కీర్‌వూ. నేను ఈ విస్నూర్ నుండి హైద్రాబాద్ (130 కిలోమీటర్లు) వరకు నాగలి సాళుతో డబ్బులు పోయగలను'** అంటూ దుర్భాషలాడి బందగీని భయపెట్టాడు. ఆ బెదిరింపులకు ఏమాత్రం దడవని బందగీ నిర్భయంగా సమాధానమిస్తూ **'దొర నేను పేద ఫక్కీరును. నీవు 60 గ్రామాలకు దొరవు. నీవు నీ సాటి దొరలను ఎదిరించాలి. కానీ, పూటకు గతిలేని నాలాంటి పేదవాడిని కాదు. ఇది నీ బలహీనత గాని మరొకటి కాదు'** అంటూ దేశ్‌ముఖ్ అహాన్ని, అహంకారాన్ని దెబ్బదీశాడు.


ఆ తరువాత కామారెడ్డిగూడెం నుండి గడి వరకు సాగిన ఈ భూ వివాదాన్ని న్యాయపోరాటం ద్వారా జనగామ న్యాయస్థానంలో సాధించుకోవాలని బందగీ నిర్ణయించుకున్నాడు. ఆ విషయం తెలిసిన దేశ్‌ముఖ్ మండిపడుతూ **గడితీర్పు**ను కాదంటూ న్యాయస్థానానికి వెడితే చావు తప్పదని బందగీని మళ్ళీ బెదిరించాడు. ఆ బెదిరింపులకు ఏమాత్రం ఖాతరు చేయని షేక్ బందగీ సాహెబ్ న్యాయం కోసం జనగామ కోర్టును (కేసు

నంబరు. 201/1345 ఫస్లీ) ఆశ్రయించాడు. బందగీ పక్షాన మహమ్మద్ గౌస్ సాహెబ్ ప్రత్యర్థి అబ్బాస్ అలీ పక్షాన మహమ్మద్ ఇబ్రహీం వాదించగా మీర్ వాజిద్ హుస్సేన్ ఖాన్, మౌల్వీ సయ్యద్ అబ్బాసుద్దీన్ హైమద్‌లు వ్యవహరించారు. షేక్ బందగీ 32 కిలోమీటర్ల దూరాన గల జనగామ కోర్టుకు కాలినడకన తిరిగాడు. గడి తీర్పును ధిక్కరిస్తూ, దేశ్‌ముఖ్ పెత్తనాన్ని ఖాతరుచేయకుండా న్యాయం కోసం న్యాయస్థానానికి వెళ్ళిన బందగీని ప్రజలు ప్రశంసించారు. ఒక్కపూట మాత్రమే కడుపు నింపుకుంటూ దూరాన ఉన్న న్యాయస్థానానికి కాలినడకన సాగుతూ దేశ్‌ముఖ్‌కు, గడి తీర్పుకు వ్యతిరేకంగా షేక్ బందగీ సాగిస్తున్న న్యాయపోరాటం గ్రామస్థులను ఆకట్టుకుంది. గ్రామ ప్రజలు ఆయనకు అండగా నిలిచారు. ప్రత్యక్షంగా కాకున్నా పరోక్షంగా అవసర సమయాల్లో ఆదుకున్నారు. విస్నూర్ దేశ్‌ముఖ్ క్రూర స్వభావం తెలిసిన గ్రామస్థులు బందగీకి వ్యతిరేకంగా వెల్లడవుతున్న విషయాలను ఆయనకు అందజేస్తూ అతనికి ఏ ప్రమాదం రాకుండా పరోక్షంగా సహాయపడ్డారు.

ఈ విధంగా బందగీ సాహెబ్ న్యాయపోరాటం సాగిస్తుండగా అతనిని అంతం చూడాలనుకున్న దేశ్‌ముఖ్ తన అనుచరుల ప్రోద్బలంతో బందగీ మీద దాడి చేయించాడు. న్యాయస్థానం తీర్పు మరో ఏడాదిలో వెలువడుతుందనగా జరిగిన ఈ దాడి సందర్భంగా షేక్ బందగీని ఒకడు కత్తితో నరకడానికి ప్రయత్నించాడు. ఆ సంఘటనలో దుండగుడి కత్తిని తన చేత్తో బలంగా పట్టుకోవడం వలన బందగీ వేళ్ళు తెగిపోయాయి. ఆ సంఘటనలో రక్తసిక్తమైన బందగీ తన మీద జరిగిన తొలిదాడి నుండి తప్పించుకున్నాడు. (తెలంగాణా సాయుధ పోరాట చరిత్ర (1946–57), మొదటి భాగం, దేవులపల్లి వెంకటేశ్వరరావు, ప్రోలిటేరియన్ లైన్ ప్రచురణలు, హైదరాబాద్, జూలై 1988, పేజి.127)

చివరకు ఆరు సంవత్సరాల తరువాత జనగామ న్యాయస్థానం ఆ భూమి షేఏక్ బందగీ సాహెబ్, అతని సోదరులకు మాత్రమే చెందుతుందని తీర్పు చెప్పింది. భూస్వామ్య వర్గాలు బొలెడంత డబ్బుపోసి, పైరవీలు చేసి, తప్పుడు సాక్ష్యాలు చెప్పించి, అధికారులను కూడగట్టుకుని రికార్డులను తారుమారు చేసినా కూడా న్యాయం బందగీ పక్షాన నిలిచింది. ఈ పరిణామానికి బందగీ సోదరులు సంతోషించగా, ప్రతికూల గడితీర్పు కాదంటూ న్యాయస్థానం నుండి అనుకూల తీర్పు పొందిన బందగీ సాహెబ్‌ను ప్రజలు అభినందించారు.

ఈ పరాభవాన్ని దేశ్‌ముఖ్ సహించలేక పోయాడు. ఈ ప్రతికూల వాతావరణం తన పెత్తనానికి గొడ్డలిపెట్టుగా భావించాడు, ఆగ్రహంతో రగిలిపోయాడు. ఒక చిన్న గ్రామానికి చెందిన బక్కరైతు తన గడితీర్పును ఖాతరు చేయకపోవడం, న్యాయస్థానానికి వెళ్ళి తన అనుచరులకు వ్యతిరేకంగా తీర్పు పొందడం అతనికి మింగుడు పడలేదు. ఈ పరిస్థితికి ఆదిలోనే మంగళం పాడకుంటే తన చెప్పుచేతల్లో మసిలే ఆరవై గ్రామాల ప్రజలు తనను,



తన పెత్తనాన్ని, తన ఆధిపత్యాన్ని ధిక్కరించవచ్చున్న భయం పట్టుకుంది. ఆ భయం నుండి భయానక ఆలోచనలు అతనిలో పురివిప్పాయి. ఆ క్రూర ఆలోచనలకు రూపమిచ్చేందుకు అతని అనుచరవర్గం సిద్ధమైంది.

జనగామ న్యాయస్థానం ద్వారా న్యాయాన్ని సాధించుకున్న షేక్ బందగీ, అతని సోదరులు తమ భూముల్ని తగు అధికారికపత్రాల ద్వారా అధికారికంగా నిలబెట్టుకోవాలని అనుకున్నారు. ఆ మేరకు న్యాయస్థానం తీర్పుకు సంబంధించిన కాగితాలను జనగామ న్యాయస్థానం నుండి తెచ్చుకోవాలనుకున్నారు. ఆ ప్రయత్నాలను గమనిస్తున్న దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి దుర్మార్గపు ఆలోచనలను ఏమాత్రం ఆలోచించకుండా షేక్ బందగీ సాహెబ్ ముందుకుసాగాడు.

1940 జూలై26 ఉదయాన షేక్ బందగీ సాహెబ్ జనగామ కోర్టుకు వెళ్ళి తీర్పుపత్రాలను తెచ్చుకునేందుకు కామారెడ్డిగూడెం నుండి రెండు ఫర్లాంగుల దూరాన ఉన్న బస్‌స్టేజి వద్దకు బయలుదేరారు. ఆ ప్రయాణం సమాచారాన్ని ముందుగా పసిగట్టిన ప్రత్యర్థులు, దేశ్‌ముఖ్ మనుషులు గ్రామం నుండి బస్‌స్టేజీకి వెళ్ళడానికి మధ్యన గల దారిలోనున్న పొలం కంచెల చాటున మారణాయుధాలతో మాటు వేశారు. ఆ విషయం తెలియని షేక్ బందగీ ఎప్పటిలాగే ముందుకు సాగారు. బస్‌స్టేజికి గల రోడ్డుకు పది మీటర్ల దూరంలో ఉండగా అకస్మాత్తుగా దేశ్‌ముఖ్‌తొత్తులు గొడ్డళ్ళతో బందగీ సాహెబ్ మీద దాడిచేసి ఆయన తల నరికి మొండం నుండి వేరుచేసి, క్షణాలలో పరారయ్యారు.

ఈ దుర్వార్త తెలియగానే బందగీ స్వగ్రామ ప్రజలు మాత్రమే కాకుండా పరిసర గ్రామాల జనం కూడా పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. బందగీ సోదరులు ఉరుకులు పరుగుల మీద సంఘటనా స్థలానికి వచ్చారు. బందగీ కుటుంబీకులు, గ్రామస్తులంతా కన్నీరు-మున్నీరుగా విలపించారు. విస్నూరు దేశ్‌ముఖ్‌ను ఎదిరించి నిలువగల ధైర్యాన్ని తమలో నింపిన షేక్ బందగీ సాహెబ్ హత్య జరిగిన ప్రాంతంలోనే ఆయన మృతదేహాన్ని ఖననం చేయాలని ప్రజలు నిర్ణయించారు. షేక్ బందగీ సాహెబ్ స్మారకంగా రాళ్ళతో సమాధి కట్టాలనుకున్నారు. ఆ విషయం తెలిసిన దేశ్‌ముఖ్ సమాధి నిర్మాణానికి ఎవ్వరైనా రాళ్ళిస్తే బందగీకి పట్టిన గతి వారికి కూడా పడుతుందని హెచ్చరికలు జారీచేశారు. ఒంటరిగా ఉంటే చంపుతాడు ఉమ్మడిగా రాళ్ళిస్తే దేశ్‌ముఖ్ ఎంతమందిని చంపుతాడో చూద్దాం అంటూ కామారెడ్డిగూడెం రైతాంగం బండెనక బండి కట్టి ఒక్కొక్క కుటుంబం నుండి ఒక్కొక్క రాయిని తెచ్చి షేక్ బందగీ సాహెబ్ స్మారక చిహ్నాన్ని గౌరవశ్రద్ధలతో నిర్మించారు.

**'ఈ విధంగా కామారెడ్డి గూడెంలో బందగీ నాయకత్వాన జరిగిన పోరాటం, 1944లో ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో జరిగిన సుదీర్ఘపోరాటానికి నాందీ ప్రస్తావనయ్యింది.'** ఈ ప్రజాపోరాటాలకు అద్వితీయ ప్రేరణ, స్ఫూర్తిని ఇస్తూ సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావులు 1946లో రచించిన 'మాభూమి' నాటకం-

**'భాయీ ... బందగీ**

**వీరయోధుడా హారతులివిగో / క్రూర నిరంకుశ దేశపాలకుల**

**దారుణ హింసల రూపుమాపగా**

**పోరాటమ్మున ప్రాణాలొసగిన త్యాగమూర్తివోయీ .. మార్గదర్శివోయీ'** అని షేక్ బందగీ సాహెబ్ స్మారకంగా నిర్మించిన ఆయన సమాధి వద్ద ఆ యోధునికి జోహార్లు పలుకుతున్న దృశ్యంతో ఆరంభం కావడం అనవాయితి అయ్యింది.

**ఈ నాటకం 1948లో నిషేదానికి గురయ్యేంతవరకు సుమారు 125 దళాలచే ఎక్కడో ఒకటీరెండు చోట్ల ప్రతిరోజూ (సరాసరిన) ప్రదర్శించబడింది.** ఈ ప్రదర్శనలు జరిగినప్పుడల్లా షేక్ బందగీ సాహెబ్ త్యాగనిరతి, ధైర్యసాహసాలకు లక్షలాది ప్రజా హృదయాలు ఉత్తేజాన్ని పొందాయి. ఈనాటికి బందగీ జ్ఞాపకార్థం ప్రతి ఏడు కామారెడ్డిగూడెం గ్రామస్థులు, పరిసర గ్రామాల రైతాంగం బందగీని ఖననం చేసిన చోట నిర్మించిన స్మారక చిహ్నం వద్ద **'బందగీ ఉర్సు'** జరుపుకుంటున్నారు. ప్రతి శుభకార్యం ఆరంభించే ముందు స్మారక చిహ్నం వద్దకు కుల, మతాలకు అతీతంగా ప్రజలు కుటుంబాలకు కుటుంబాలుగా వచ్చి షేక్ బందగీ సాహెబ్ ఆశీస్సులు ఆకాంక్షిస్తూ, ఆయన త్యాగాన్ని, ధైర్యసాహసాలను స్మరించుకుంటున్నారు.

◆◆◆



### అవిశ్రాంత పోరుబాటలో నేలరాలిన యోధుడు

# 2. సయ్యద్ నాసిర్ హసన్

(1928-1960)

**ఆ**జాద్ హింద్ ఫౌజ్ యోధుల మీద దేశద్రోహం నేరం మోపి వారిని నిర్బంధాల పాల్జేసిన బ్రిటీష్ ప్రభుత్వ చర్యలకు మండిపడి బోసుబాబు సహచరుల విడుదలను డిమాండ్ చేస్తూ రాష్ట్రంలో ఉవ్వెత్తున ఎగసిన విద్యార్థి ఉద్యమ నాయకుడు సయ్యద్ నాసిర్ హసన్.

నైజాం సంస్థానం రాజధాని హైదరాబాద్ నగరంలో కోఠీ సమీపాన ఉన్న బ్యాంక్ స్ట్రీట్‌లోని స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో 1928 ఆగస్టు రెండున సయ్యద్ నాసిర్ హసన్ జన్మించారు. తండ్రి సయ్యద్ ఆలం బర్దార్, తల్లి జోహరా. ఆమె ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు ఫక్రుల్ హాజియా కుమార్తె. అమ్మమ్మ ఫక్రుల్ హాజియా, మేనమామలు అబిద్ హసన్ సఫ్రాని, బద్రుల్ హసన్, ప్రొఫెసర్ జాఫర్ హసన్ నుండి స్వేచ్ఛ-స్వతంత్ర భావనలను పుణికి పుచ్చుకున్న నాసిర్ హసన్ నగరంలోని సిటీ కాలేజీలో ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్నారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించనున్న చివరిదశలో బ్రిటీష్ ప్రభుత్వం ఆజాద్ హింద్ ఫౌజ్ దళాలను అరెస్టు చేసి, వారి మీద దేశద్రోహం నేరం మోపి వివిధ ప్రాంతాలలోని జైళ్ళలో నిర్బంధించింది. మాతృభూమి విముక్తి కోరుతూ ప్రాణాలను తృణప్రాయంగా భావించి ఉద్యమించిన ఆజాద్ హింద్ ఫౌజ్ యోధులను నిర్బంధించడం పట్ల దేశవ్యాప్తంగా

ఆగ్రహం వెల్లువెత్తింది. ప్రధానంగా విద్యార్థులు, యువకులు ఆజాద్ హింద్ ఫౌజ్ యోధుల విడుదల కోరుతూ ఉద్యమించారు. ఈ నేపథ్యంలో నాసిర్ హసన్ 1946 నాటి హైదరాబాద్ విద్యార్థి ఉద్యమంలోకి వచ్చారు. అమ్మమ్మ, మేనమామల నుండి ఉద్యమస్ఫూర్తిని పొందిన సయ్యద్ నాసిర్ హైదరాబాద్ విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం సిద్ధించాక నైజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయాల్సిందిగా ఉనికిలోకి వచ్చిన డిమాండ్‌కు నాసిర్ హసన్ సానుకూలంగా స్పందించారు. నైజాం విలీనోద్యమంలో విద్యార్థిగా ఆయన ప్రధానపాత్ర వహించారు. నైజాం విలీనాన్ని డిమాండ్ చేస్తూ, నిజాం వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించమని హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ మీద ఒత్తిడి వచ్చింది. ఆ సందర్భంగా హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షుని ఇంటిని విద్యార్థులు చుట్టుముట్టారు. ఆ చారిత్రాత్మక సంఘటనలో సయ్యద్ నాసిర్ హసన్ క్రియాశీలక పాత్ర నిర్వహించారు. ఈ ఉద్యమంలో భాగంగా విద్యార్థులు సాగిస్తున్న ఆందోళనను అణిచి వేసేందుకు నల్గొండ జిల్లా సూర్యాపేటలో నిజాం పోలీసులు సాగించిన దారుణ దమనకాండ, నిర్బంధాలకు వ్యతిరేకంగా 1946 సెప్టెంబరులో విద్యార్థులు-యువకులను పెద్ద ఎత్తున సమీకరించి నాసిర్ ఆందోళన నిర్వహించారు.

ఈ క్రమంలో సయ్యద్ నాసిర్ హసన్ కమ్యూనిజం పట్ల ఆకర్షితులయ్యారు. స్వాతంత్ర్యం సిద్ధించాక అభ్యుదయ రచయిత సజ్జాద్ జహీర్ ఆహ్వానం మేరకు ఆయన పాకిస్థాన్ వెళ్ళారు. పాకిస్థాన్‌లో రైతులు, శ్రామికుల పక్షాన ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తూ పాకిస్తాన్‌లోని సింధ్ రాష్ట్రం కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి స్థాయికి ఆయన ఎదిగారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమాలను నిర్మిస్తున్న నాసిర్ పట్ల ఆనాటి మిలటరీ ప్రభుత్వం కన్నెర్ర చేసింది.ఆ కారణంగా పాకిస్థాన్‌లో గడిపిన 13 ఏండ్లలో నాలుగు సంవత్సరాలు నిర్బంధంలో, మరో రెండు ఏండ్లు దేశ బహిష్కరణకు నాసిర్ గురయ్యారు. బహిష్కరణ సమయంలో హైదరాబాద్ వచ్చి తల్లితండ్రులతో గడిపారు. ఆ సమయంలో ఎవ్వరికి ఇబ్బంది కలగకుండా ప్రచారానికి కడుదూరంగా ఉండి తిరిగి పాకిస్థాన్ వెళ్ళిపోయారు.

ఆనాటి పాకిస్థాన్‌లోని ఆయూబ్ ఖాన్ మిలటరీ ప్రభుత్వం చర్యలకు ఏమాత్రం భయపడకుండా కమ్యూనిస్టు నాయకునిగా ప్రజల పక్షంగా ఉద్యమిస్తున్న నాసిర్ హసన్ అడ్డు తొలిగించుకోవాలని నిర్ణయించిన పాలకులు ఆయన మీద కేసు బనాయించి లాహోర్ కోటలోని జైలులో నిర్బంధించారు. ఆయన జైలులో ఉండగా 1960 నవంబరు 13న విష ప్రయోగం వలన హత్యకు గురయ్యారు. ఆ కుట్ర గుట్టు రట్టవుతుందన్న భయంతో సయ్యద్ నాసిర్ హసన్ భౌతిక కాయాన్ని జైలులోనే తగులబెట్టి పాలకవర్గం ఊపిరి పీల్చుకుంది.

◆◆◆

### పోలీసుల కళ్ళుగప్పి పోరాటయోధులకు సహకరించిన

# 3. జైనా బీ

(0-0)

**బ**లమైన శత్రువును సాయుధంగా ఎదుర్కోవడం కష్టతరమైనప్పటికి పోరాట యోధులకు ఆశ్రయమిచ్చి ఆదుకుని కడుపులోపెట్టుకుని కాపాడగల ప్రజల అండదండలు లభించినట్టయితే ఏ పోరాటమైనా మున్ముందుకు సాగుతుంది. ఆశ్రయమివ్వడం, ఆదుకొనడం శత్రుగూఢచారి డేగకళ్ళనుండి తప్పించుకుని శత్రువు కదలికలను పోరాటయోధులకు చేరవేయడం సామాన్య ప్రజలకు కష్టతరమైన పని. ఆ కర్తవ్యాన్ని నిర్వహించబూనుకున్న ప్రజలు అత్యంత జాగరూకులై మెలగాలి. చిన్నతప్పు జరిగినా పెనుప్రమాదాలు ఎదురు కాగలవు. ఆ తరహా క్లిష్టతరమైన బాధ్యతలను ధైర్యసాహసాలతో నిర్వహించిన మహిళామ తల్లులలో జైనా బీ ఒకరు.

అటు నిజాం పాలకులకు చెందిన రజాకారులు, నిజాం తాబేదార్లయిన దేశ్‌ముఖ్‌లు, భూస్వాముల నిఘా, ఇటు భారతసైన్యం కళ్ళుగప్పి తెలంగాణా రైతాంగ పోరాటయోధులకు అండగా నిలచిన జైనా బీ రాజారం గ్రామం నివాసి. భర్తను పోగొట్టుకున్న ఆమె తన అన్నదమ్ములు, ఒక్కగానొక్క కుమారుని తోపాటు రాజరంలో ఉంటున్నారు. అన్నదమ్ములు, కుమారుడు కూలీనాలీ చేసుకుని బ్రతుకు బండిని భారంగా ఈడ్చుతున్న కుటుంబం ఆమెది. తన కుటుంబాన్ని పట్టి పీడిస్తున్నట్టుగా తన చుట్టుప్రక్కల ఉన్న ప్రజానీకాన్ని చుట్టుముట్టి పేదరికం ఏ విధంగా సతాయిస్తుందో ఆమె స్వయంగా గమనించింది.

ఆనాడు తెలంగాణా ప్రాంతంలో అటు నిజాం నవాబు, ఆ నిజాం నవాబు పేరుతో బ్రతికేస్తున్న దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు, భూస్వాములు వందల వేల ఎకరాలను తమ హస్తగతం చేసుకుని రైతులు, ప్రజల మీద పలు దాష్టీకాలకు పాల్పడుతున్నారు. భూమి మీద తిరుగులేని ఆధిపత్యం తెచ్చిపెట్టిన అహంకారంతో రైతాంగం మీద అంతులేని జులుం ప్రదర్శిస్తున్నారు. ఆనాడు వరంగల్ జిల్లా సూర్యాపేట తాలూకా దేశ్‌ముఖ్ జానా రెడ్డి ప్రతాప్‌రెడ్డి లక్షా 50వేల ఎకరాలకు, ఖమ్మం జిల్లా మధిర తాలూకా కల్లూరు దేశ్‌ముఖ్ లక్ష ఎకరాలకు, నల్గొండ జిల్లా జనగాం తాలూకాకు చెందిన విస్నూర్ దేశ్‌ముఖ్ 40వేల ఎకరాలకు, సూర్యాపేట దేశముఖ్ 20వేల ఎకరాలకు, మిర్యాలగూడా తాలూకా బాబా సాహెబ్‌పేట దేశ్‌ముఖ్ 10వేల ఎకరాలకు తిరుగులేని అధిపతులు. ఈ మేరకు 5వేల నుండి 10వేల ఎకరాలు కలిగిన దేశముఖ్‌లు, లక్షలాది ఎకరాల భూమిని తమ హస్తగతం చేసుకుని రైతాంగం మీద, ఇతర ప్రజల మీద అంతులేని అధిపత్యాన్ని చలాయిస్తున్న భూస్వాములు ఎంతో మంది ఉన్నారు. (Telangana Peoples Struggle and its Lessons, P.Sundaraiah, Foundations Books, New Delhi, Page.9-10)

ప్రజలను గడ్డిపోచల్లా పరిగణిస్తూ, గ్రామాలలో వివిధ వృత్తులతో సేవలందిస్తున్న ప్రజలను తమ ఆజన్మాంత సేవకుల్లా లెక్కిస్తూ భయంకర వెట్టిచాకిరి చేయించుకుంటున్న దారుణపరిస్థితి తెలంగాణలో తాండవిస్తోంది. సంస్థానాధీశులు, రాజ కుటుంబీకులు, పైగార్లులు, జాగీద్దారులు, బంజార్దారులు, ఇజరద్దారులు, మక్తాదారులు, దేశ్‌ముఖ్‌లు, అగ్రహారీకులు తదితర పేర్లతో ఈ భూస్వామ్య శక్తులన్నీ భూమిని, సంపదను తమ చెప్పు చేతుల్లో బంధించి తాము అడింది ఆట పాడింది పాటగా సాగించుకుంటున్నాయి.

భూస్వాముల దోపిడిని అరికట్టేందుకు, అరాచకాలను నిలువరించేందుకు ప్రజలు ముందుకు కదిలారు. ఏమిటి ఈ జులుం ఇంకానా? ఇకపై సాగదు అంటూ తిరగబడ్డారు. ఆ కదలిక చరిత్ర సృష్టించిన తెలంగాణా రైతాంగపోరాటానికి ఆయువుపట్టయ్యింది. ఈ పోరాటంలో గ్రామీణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అందిన ఆయుధాన్ని, వ్యవసాయ పనిముట్లులను తీసుకుని పురుషులు ఎగబడగా, మహిళలు రోకలిబండ, ఎర్రకారం సంచులతోపాటుగా, వడిసెల పట్టి వడివడిగా ముందుకు వచ్చారు. ఈ విధంగా ప్రత్యక్షంగా శత్రువుతో తలపడిన వారు కొందరైతే, పరోక్షంగా పోరుబాటన నడుస్తున్న యోధులకు, దళాలకు ఆశ్రయం కల్పించడం, ఆతిధ్యమివ్వడం, ఆయుధాలను అందివ్వడం, శత్రువు రాకపోకల సమాచారాన్ని చేరవేయడం, పార్టీ ఆదేశాలను అతి రహస్యంగా పోరాట వీరులకు అందచేయడం, పోరాటయోధుల అవసరాలలకు సంబంధించిన సమాచారాన్ని నేతలకు అందించడం లాంటి కీలక వ్యవహారాలను మహిళలు చాలా సమర్ధవంతంగా నిర్వహించారు.

ఆ క్రమంలో హాలియా మండలం రాజవరం నివాసి జైనా బీ కూడా ఇతర మహిళా యోధురాళ్ళతో సమానంగా అత్యంత ప్రధానమైన రహస్య కార్యకలాపాలను ఎంతో సమర్ధతతో నిర్వహించారు. తెలంగాణా రైతాంగ పోరాటంలో ఆమె ప్రత్యక్షంగా పాల్గొనక పోయినా, పోరాటయోధులకు అన్నపానీయాలు అందిస్తూ సహాయపడ్డారు. పోరాటయోధుడు చల్లా సీతారాంరెడ్డి దళానికి ఆమె కొరియర్‌గా పనిచేశారు. రాజవరం సమీపంలో ఉన్న నల్లమల అడవులలోని ముసలదాని బొందను స్థావరంగా చేసుకుని నైజాం పోలీసుల మీద చల్లా సీతారాంరెడ్డి దళాలు దాడులు చేస్తున్న సమయంలో గ్రామాల్లోని అన్ని రకాల సమాచారాన్ని దళాలకు తెలిచేసేందుకు జైనా బీ పేడతట్టలో సద్దిఅన్నం సర్ది ఆన్నంపైన పిడకలు కప్పి పొలం పనికి పోతున్నట్టు నటిస్తూ ఎవ్వరికి అనుమానం రాని పద్ధతిలో వ్యవహరిస్తూ భోజనం తీసుకవెళ్ళి దళంసభ్యుల ఆకలి తీర్చేది. చల్లా సీతారామిరెడ్డి ఇచ్చిన ఉత్తరాలను, సమాచారాన్ని ఆదిరెడ్డి దళానికి అందచేసేది. ప్రధాన దళం నుండి తప్పిపోయిన పోరాట యోధులను క్షేమంగా తిరిగి దళంలో చేర్చడంలో కూడా ఆమె ఎంతో సాహసోపేతంగా ప్రవర్తించి అలనాటి పోరాటానికి ప్రాణంగా నిలిచారు. (వీర తెలంగాణ మాది, సంపాదకులు : తెలకపల్లి రవి, ప్రజాశక్తి, హైదరాబాద్, 2006, పేజీ:166).

ఈ విధంగా తెలంగాణా సాయుధపోరాటంలో ప్రజాపక్షంగా తనదైన భాగస్వామ్యాన్ని అందించిన సాహసి జైనా బీ గురించి ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య 1972లో ప్రచురితమైన తన Telangana Peoples Struggle and its Lessons (Page. 251- 252) లో ప్రస్తావించారు. తెలంగాణా పోరాటంలో పాల్గొన్న మహిళల గురించి ఆయన తన గ్రంథంలో పేర్కొన్న వివరాలు-విశేషాలను ప్రజాశక్తి బుక్ హౌస్ 1999లో 'తెలంగాణా పోరాటంలో స్త్రీల వీరోచిత పాత్ర' అను శీర్షికతో చిన్నపుస్తకం ప్రచురించింది. ఆ పుస్తకంలోని ఎనిమిది-తొమ్మిది పుటలలో పుచ్చలపల్లి పేర్కొన్న జైనా బీ విశేషాలను ఈ క్రింది విధంగా ఉటంకించారు.

**జైనాబీ : రాజారం గ్రామంలో ఒక పేదకుటుంబీకురాలు. చిన్నతనానే భర్త పోయాడు. ఒక్క కొడుకు, తమ్ముడు, తానూ కూలికిపోయి దాని మీద బ్రతికేవారు. చల్లా సీతారామిరెడ్డి - ఆదిరెడ్డి దళం ఆ దగ్గర గుట్టలనే కేంద్రంగా చేసుకుని పనిచేస్తుండేది. ఆ దళానికి ఆహారం అందించి వస్తుండేది జైనా బీ. భారత సైన్యాలు వచ్చిన తర్వాత పార్టీకి బాగా పలుకుబడిగల గ్రామాలన్నింటా పెట్టినట్టే రాజారంలోనూ ఒక మిలటరీ క్యాంపు పెట్టారు. దానికి భయపడకుండా, అదివరకన్న ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటూ, మరింత ధైర్యంగా దళాలకు ఆహారం చేరవేసే కార్యక్రమాన్ని సాగించింది. ముగ్గురు గెరిల్లా దళసభ్యులు పొరపాటున దారి తప్పి కల్సుకోలేకపోతే, వారికి రక్షణ ఇచ్చి మెల్లగా దళకేంద్రానికి పంపి వేయగలిగింది.**

**ఒక రోజున మిలటరీ ఆమె ఇంటిపై దాడిచేసి, ఆమెను బాది 'సీతారామిరెడ్డి ఎక్కడున్నాడో చెప్పు-నిన్ను వదిలేస్తాం' అంటూ హింసించారు. 'నాకు తెలియదు' అన్నదే ఆమె జవాబు. జమేదారు ఆమెను బూటుకాళ్ళతో తొక్కాడు. వారి హింసాకాండకు తట్టుకుని నిలచి, మళ్ళీ పార్టీ కార్యక్రమాలలో పాల్గొంది. పేదరికం జైనా బీకి అనుభవమే! అందుకే ఆమెకు పార్టీ అంటే అంత ప్రేమ, విశ్వాసమూ.**

ఈ విధంగా తెలంగాణా పోరాటంలో ముస్లిం స్త్రీలు, పురుషులు ఇతర జనసముదాయాలతో కలసి ప్రజల బాగు కోసం ఎంతటి సాహసోపేత కార్యక్రమాలయినా, తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిర్వహించేందుకు ముందుకు వచ్చి తమదైన భాగస్వామ్యాన్ని అందించారు. పరాయిపాలకుల బానిసబంధనాల నుండి విముక్తికోసం, భూమికోసం-భూస్వాముల పీడన నుండి విముక్తి కోసం ప్రజలు సాగించిన అహింసాయుత -సాయుధ పోరాటంలో ఇతర జనసముదాయాలతో కలసి ముస్లిం మహిళలు కూడా ఉరకలుపెడ్తూ ఉద్యమించి అద్భుత చరిత్రను సృష్టించారు.

◆◆◆

'స్వేఛ్ఛాస్వాతంత్ర్యాల నిమిత్తం పోరాడుతున్న నా భర్త జీవితం తొలుత ఈ జాతి సొత్తు, ఆ తరువాత మాత్రమే నాది, మరెవరిదైనా. అందువలన నా భర్త జీవితాన్ని ఎలా ఉపయోగించుకోవాలన్నది జాతి జనులు నిర్ణయించాలి ...ప్రభుత్వాన్ని అర్థించి, నా భర్త నా మీద ఉంచిన విశ్వాసాన్ని భంగపరుస్తూ, ఆయన త్యాగపూరిత దృఢ నిశ్చయానికి వ్యతిరేకంగా నేను వ్యవహరించ లేను...జరిగేదేదో జరగనివ్వండి. ఆ ఘోర విపత్తుకు బ్రిటీష్ ప్రభుత్వమే కారణం కానివ్వండి...నా భర్తను సింహంలా మృత్యువును స్వీకరించనివ్వండి...జాతి ప్రయోజనాలు, ఆత్మ గౌరవాభిమానాల పరిరక్షణ విషయంలో వ్యక్తిగత జీవితాలు అంత ప్రాముఖ్యం కావు...మాతృదేశ విముక్తి పోరాటంలో ధనమాన ప్రాణాలను బలిపెట్టాల్సి ఉంటుంది...అందుకు ఎవ్వరూ చింతించాల్సిన అవసరం లేదు సరికదా, మనమంతా మరింతగా గర్వపడాలి ...బ్రిటీష్ వాళ్ళతో పోరాడినట్టే, మృత్యువుతో కూడా పోరాడి ఆయన విజయం సాధించగలరు. ఒకవేళ మృత్యువుదే పైచేయి అయినట్టయితే, గౌరవప్రదమైన జీవితం సాగించే ఉద్యమకారునికి లభించే మరణం, పదికాలాల పాటు నికృష్టంగా గడిపే భయంకర బానిస జీవితం కంటే ఎంతో ఉన్నతమైంది'

**- బేగం ఆలం.**



### శత్రు సైన్యాలను సాయుధంగా ఎదుర్కొన్న యోధుడు

# 4. షేక్ నన్నే బచ్చా

(0-0)

**స్వా**తంత్ర్యోద్యమం, నైజాం విలీనోద్యమం కొనసాగింపుగా నైజాం ప్రభుత్వంలోని భూస్వాముల పెత్తనం–ఆధిపత్యం నుండి విముక్తి కోసం భూమి–భుక్తి సాధించుకునేందుకు తెలంగాణా రైతాంగం సాగించిన పోరాటంలో సాయుధులై శత్రు సైన్యాలను ధైర్యసాహసాలతో ఎదుర్కొన్న సాహసికులలో ఒకరు షేక్ నన్నే బచ్చా.

**హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలించిన నిజాం ప్రభువులు (1724–1948) మతరీత్యా ముస్లింలు. కాని క్రింది స్థాయిలో అధికారాలు చెలాయించింది దొరలు, దేశ్‌ముఖ్‌లు తదితరులు ముస్లిమేతరులే ! ఇక్కడ సమస్య మతానికి కాదు. వ్యవస్థది. నిజాం ప్రభువుల్లో కొందరు తమ అధికారాన్ని నిలుపుకోడానికి మతాన్ని అడ్డుగా పెట్టుకుంటే, క్రింది స్థాయిల్లోని భూస్వాములు, దొరలు నిజాంను అడ్డుపెట్టుకొని తమ ఫ్యూడల్ పీడనను కొనసాగించారు. ఇందుకు చరిత్ర పుటల నిండా మనకెన్నో నిదర్శనాలు కన్పిస్తాయి.** (ఫ్యూడల్ విధానం పై న్యాయపోరాటం చేసిన తొలి యోధుడు షేక్ బందగీ, వ్యాసకర్త : సయ్యద్ ఖుర్షీద్, గీటురాయి వారపత్రిక, 20–05–2005, పేజి.30, హైదరాబాద్).

ఆనాడు సాగింది మతస్థుల మధ్య సమరం కాదు. అది ప్రజలను జలగల్లా పట్టి పీడిస్తున్న భూస్వామ్య వ్యవస్థ అవలక్షణాలకు వ్యతిరేకంగా, భూస్వాములు సాగించిన క్రూరాతి

క్రూరమైన ఆధిపత్యానికి వ్యతిరేకంగా. ఆ కారణంగా మతాలకు, కులాలకు అతీతంగా చైతన్యవంతులైన సామాన్య పీడిత జనం ఒక్కుమ్మడిగా సాయుధ పోరుబాట ఎంచుకున్నారు. భయానక భూస్వాముల భరతం పట్టేంతవరకు, భూస్వాముల బలగాలను, ఆ భూస్వాములకు అండగా నిలచిన శక్తులను సాహసోపేతంగా ఎదుర్కొన్నారు.

ఆ విధంగా సాయుధులై ప్రత్యర్థి బలగాలను ఎదుర్కొన్న షేక్ నన్నే బచ్చా నల్గొండ జిల్లా దామచర్ల మండలం నివాసి. ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలతో ఆయన ప్రభావితుడయ్యారు. 1940లో న్యాయపోరాటం సాగిస్తూ విస్నూర్ దేశ్‌ముఖ్ గూండాల రాక్షస దాడిలో అమరత్వం పొందిన కామారెడ్డిగూడెం నివాసి షేక్ బందగీ సాహెబ్, 1946లో కడివెండి గ్రామంలో దేశ్‌ముఖ్ దుండగుల కాల్పులలో అమరుడైన దొడ్డి కొమరయ్య వీరోచిత త్యాగాల నుండి షేక్ నన్నే బచ్చా ప్రేరణ పొందారు.

ఆ ప్రేరణతో, షేక్ నన్నే బచ్చా నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటబాట పట్టారు. ఆయన పోరాటకాలం నాటి విశేషాలను **'ప్రజాశక్తి'** దినపత్రిక ప్రతినిధితో 2007లో స్వయంగా వివరించారు. ఆ వివరణ ప్రకారంగా, నైజాం పోలీసులు, రజాకార్లు ప్రజలను హింసించడం, దౌర్జన్యాలు చేయడం ధనమాన ప్రాణాలను హరించడం వంటి చర్యలతో విసిగి కమ్యూనిస్టు గెరిల్లా దళంలో చేరారు. పుచ్చలపల్లి సుందరయ్య ఆదేశాల మేరకు తనను ఆనాడు మూసీనది, కృష్ణాపట్టీ ప్రాంతాల్లో దళసభ్యునిగా చేర్చుకున్నారని, తమ దళ కమాండర్‌గా చల్లా సీతారామిరెడ్డి ఉండేవారని ఆయన వివరించారు. దామరచర్ల ఏరియాకు దళనాయకుడిగా చిలకరాజు లక్ష్మీపతి ఉండేవారు. మంత్రాల అక్కిరెడ్డి, రాములమ్మతో కలసి తుపాకులు తీసుకుని నైజాం పోలీసులను,రజాకార్లను అనేకచోట్ల ఎదుర్కొన్నారు. దారగాని సాయన్న, దుగ్గే రాములు, రెంపటి చినరామయ్య లాంటివారు అడవుల్లోకి సద్దులు, సమాచారం తెచ్చిఇచ్చేవారు. (వీర తెలంగాణా మాది, సంపాదకులు : తెలకపల్లి రవి, ప్రజాశక్తి ప్రచురణలు, హైదరాబాదు,2 006, పేజి.99)

ఈ విధంగా తెలంగాణా రైతాంగ పోరాటంలో సాయుధుడై ముందుకు సాగిన షేక్ నన్నే బచ్చా 1948లో అరెస్టయ్యారు. **ఆయనతోపాటు దామరచర్ల లంబాడి సైదులు, గొంగటి సైదిరెడ్డిలను డియ్యస్పీ హనుమంత నాయక్ అరెస్టు చేసి మిర్యాలగూడెం జైలులో, నల్గొండ జైలులో, గులబర్గా జైలులో ఎనిమిది నెలలు ఉంచారు.** (వీర తెలంగాణా మాది, సంపాదకులు : తెలకపల్లి రవి, పేజి.99)

◆◆◆



### ఆధిపత్యం మీద అవిశ్రాంతంగా పోరాడిన అక్షరయోధుడు

# 5. జహందర్ అఫ్సర్

(1926-2006)

స్వేచ్ఛా-స్వతంత్ర భావనలు, ప్రజా సంక్షేమాభిలాష, పరాయిపాలకుల పెత్తనం సహించలేని ఆత్మాభిమానం గల వ్యక్తులు ఎక్కడున్నా, ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా కచ్చితంగా, నిర్భయంగా, నిబద్ధతో అభిప్రాయాలను వ్యక్తం చేస్తారు. ఆ కోవకు చెందిన యోధులు స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో దర్శమిస్తారు. అటువంటి నిబద్ధతగల నిర్భయులైన వ్యక్తులలో జహందర్ అఫ్సర్ ఒకరు.

జహందర్ అఫ్సర్ సంపన్న నవాబుల వంశంలో 1926లో హైదరాబాద్‌లో జన్మించారు. నవాబు వంశస్థుల సుఖభోగలాలసకు భిన్నంగా వ్యవహరించిన ఆయన విద్యార్థి దశ నుండి పరాయి పాలకుల పెత్తనాన్ని వ్యతిరేకించారు. నవాబు వంశస్థులై వుండి సంస్థా నాధీశుడి నిర్ణయాలను విమర్శించ పూనుకోవడం సరికాదని కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఎంతగా చెప్పినా వినకుండా ప్రజాశ్రేయస్సే ప్రధానంగా పోరుబాటన సాగటానికి అఫ్సర్ నిర్ణయించుకుని, ఆ నిర్ణయం మేరకు అక్షరాన్ని ఆయుధం చేసుకున్నారు.

బానిసత్వానికి వ్యతిరేకంగా ప్రజలలో స్వేచ్ఛ-స్వతంత్ర భావనలను ప్రోది చేయడానికి, ఆ దిశగా ప్రజలను చైతన్యవంతుల్ని చేయడానికి ఆయన అక్షరయుద్ధం ఆరంభించారు. ఆయన రచనల పట్ల కినుక వహించిన నిజాం మద్దతుదారులు, మత ఛాందసులు తీవ్ర పరిణామాల హెచ్చరికలు చేసినా ఆ కలం యోధుడు కలత చెందలేదు

సరికదా తన మార్గాన మరింత నిబద్ధత-నిజాయితీలతో నిర్భయంగా ముందుకుసాగాడు.

సంస్థానాధీశుల పట్ల ఆయన అనుసరిస్తున్న ఘర్షణాత్మక వైఖరికి ఆగ్రహించిన నిజాం వారసులు ఆయనకు లభించాల్సిన 250 రూపాయల అలవెన్సును ఆపివేశారు. ఆ కారణంగా ఆర్థిక ఇబ్బందులు పడినా ఆయన చలించలేదు. స్వాతంత్ర్యం లభించాక నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో చేరాల్సిన అవసరాన్ని, ప్రజలలో మత సామరస్యం కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ, ప్రతిపాదిస్తూ అఫ్సర్ పలు విశ్లేషనాత్మక వ్యాసాలు రాశారు.

1950లో జహందర్ అఫ్సర్ కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. హైదరాబాదులో కమ్యూనిస్టు ఉద్యమాల నిర్మాణంలో చురుకుగా ఆయన వ్యవహరించారు. కమ్యూనిస్టు నాయకులు రాజ్ బహుద్దూర్ గౌర్, మనోహర్ రాజ్ సక్సేనా లాంటి ప్రముఖులతో కలసి ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిసల్పారు. ప్రతి సమస్య మీద ప్రజలతో మమేకమై పనిచేసిన ఆయన అందజేసిన సేవలకు గుర్తింపుగా మొఘల్‌పురా డివిజన్ ప్రజలు అఫ్సర్‌ను తమ ప్రతినిధిగా రెండుసార్లు ఎన్నుకున్నారు.

అఫ్సర్ రాజకీయరంగంలో ఎంత చురుకుగా ఉన్నా రచయితగా తన బాధ్యతలను విస్మరించలేదు. **తాజ్ వీక్లీ, నిజాం డైలీ, ముషీరే దక్కన్, ఖుర్షీద్, మున్సిఫ్, సియాసత్** వంటి వివిధ ప్రముఖ ఉర్దూపత్రికలలో చాలా సంవత్సరాలు పనిచేశారు. పాత్రికేయునిగా, సమాజ సేవకునిగా సమాజంలోని పలు దుర్మార్గాల మీద ఆయన విమర్శనాస్త్రాలను సంధించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నిర్మాణంలో భాగస్వాములయ్యారు. ప్రధానంగా ఉర్దూ జర్నలిస్టుల సమస్యల పరిస్కారం కోసం అవిశ్రాంతంగా పనిచేశారు.

స్వాతంత్ర్యసమరయోధునిగా, ఈ నాటి ప్రజా ప్రతినిధిగా ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పలు బాధ్యతలు నిర్వహించిన అలుపెరుగని ప్రజల మనిషి, కలం యోధుడు, బహుగ్రంథ కర్త జహందర్ అఫ్సర్ 2006 జూన్ 13న హైదరాబాదులో కన్నుమూశారు.

ఈ సందర్భంగా జహందర్ అఫ్సర్, **'నిజాం వంశంలోపుట్టి, నిజాం పరిపాలనను వ్యతిరేకిస్తూ, మత ఛాందసాన్ని ధిక్కరిస్తూ కమ్యూనిస్టు యోధునిగా నిలవటం ఆయనకు ప్రజల పట్ల లౌకిక సంస్కృతి పట్లగల గాఢాభిమానానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తాయి ...మతోన్మాదానికి వ్యతిరేకంగా మతసామరస్యాన్ని కాంక్షిస్తూ, ప్రజల వాస్తవిక జీవన సమస్యలకు పరిష్కారాలను ప్రతిపాదిస్తూ కృషిచేశారు'** అని ప్రముఖులు, పత్రికలు జహందర్ అఫ్సర్‌కు ఘనంగా నివాళులు అర్పించాయి.

◆◆◆

# స్వాతంత్ర్యసమరయోధుల సంక్షిప్త వివరాలు

(అనుబంధం -3)

# ఇందులో ...


| | | |
|---|---|---|
| 01. | అనంతపురం జిల్లా | 351 |
| 02. | చిత్తూరు | 352 |
| 03. | కడప | 353 |
| 04. | కర్నూలు | 353 |
| 05. | తూర్పు గోదావరి | 354 |
| 06. | గుంటూరు | 355 |
| 07. | హైదారాబాద్ | 358 |
| 08. | ఖమ్మం | 364 |
| 09. | కృష్ణా | 364 |
| 10. | మహబూబ్ నగర్ | 366 |
| 11. | మెదక్ | 366 |
| 12. | నల్గొండ | 367 |
| 13. | పొట్టి శ్రీరాములు నెల్లూరు | 367 |
| 14. | ప్రకాశం | 368 |
| 15. | శ్రీకాకుళం | 369 |
| 16. | విశాఖపట్నం | 370 |
| 17. | విజయనగరం | 370 |
| 18. | వరంగల్ | 370 |
| 19 | పశ్చిమగోదావరి | 371 |

ఆంధ్రప్రదేశ్‌లో సాగిన
స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమాలలో పాల్గొన్న
సమర యోధులలో కొందరి వివరాలు
సంక్షిప్తంగా...

## అనంతపురం

**అబ్దుల్లా సాహెబ్** : తాడిపత్రి గ్రామవాసి. ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నందుకు 12-01-1922 నుండి 31-05-1922 వరకు బళ్ళారి సెంట్రల్ జైలులో కఠిన కారగారవాస శిక్ష అనుభవించారు.

**బడే సాహెబ్ ఉందకల్** : రాయదుర్గ తాలూక కనేకల్ నివాసి. తండ్రి ఫక్రుద్దీన్. గోల్డ్ స్మిత్. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 1941 జనవరి 11న ఏడు మాసాల జైలు శిక్షకు గురయ్యారు. అలీపురం, వెల్లూరు జైళ్ళల్లో గడిపారు.

**సులేమాన్ సాహెబ్** : 1892 అక్టోబరు 2న జననం. తాడిపత్రి నివాసి. తండ్రి కంట్రాక్టర్ మస్తాన్ సాహెబ్. రెండవ తరగతి వరకు చదువు. పిడబ్ల్యుడి కంట్రాక్టరు. సహాయనిరాకరణ ఉద్యమంలో భాగస్వామి. బళ్ళారి సెంట్రల్ జైలులో 1321 నవంబరు 25 నుండి ఆరు మాసాల జైలుశిక్ష అనుభవించారు.

**మహబూబ్ సాహెబ్ కె.** : కదిరి తాలూక కురుమాల నివాసి. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అటవీశాఖ అతిథి గృహానికి నిప్పుపెట్టినందుకు ఏడాదిపాటు జైలుశిక్ష అనుభవించారు.

**పీర్ సాహెబ్** : హిందూపురం తాలూకా సిరివరం నివాసి. 1918లో జననం.

తండ్రి ఫక్రూ సాహెబ్. దర్జీ. వ్యక్తి సత్యాగ్రహంలో భాగస్వామి. 1941 జనవరి 28న మూడు మాసాల కఠిన కారాగారవాస శిక్ష విధింపు. వెల్లూరు సెంట్రల్ జైలులో నిర్బందానికి గురయ్యారు.

**రబియాబి** ః ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో రబియాబి వివరాలు ఉన్నాయి.

**యం.మొహిద్దీన్ సాహెబ్** ః చియ్యడు గ్రామనివాసి. ఖిలాఫత్ ఉద్యమంలో పాల్గొన్నారు. యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలో భాగస్వామి. తాను మాత్రమే కాకుండా తన భార్య రబియాబీని కూడా ఉద్యమ దిశగా సాగేందుకు ప్రోత్సహించారు.

**షా మల్లిక్ షక్కర్ బుర్హా** ః 1879లో తాడిపత్రిలో జననం. ఐదవ తరగతి వరకు విద్యాభ్యాసం. కంట్రాక్టర్ వృత్తి. 1924లో సహాయనిరాకరణ ఉద్యమంలో భాగస్వామి. బళ్ళారి జైలులో మూడు మాసాల జైలుశిక్ష అనుభవించారు.

## చిత్తూరు

**అబ్దుల్ అలీ** ః 1919 నవంబరు 5న చంద్రగిలో జననం. తండ్రి షేక్ రహిముద్దీన్. ఆరవ తరగతి వరకు చదువు. జిల్లా పరిషత్తు పాఠశాలలో ప్యూన్ ఉద్యోగం. ఆ ఉద్యోగం వదలి సైన్యంలో చేరిక. జపాన్ సైన్యం చేత నిర్బంధించబడి మలయా జైలుకు తరలింపు. సుబాష్ చంద్ర బోస్ నాయకత్వంలోని ఇండియన్ నేషనల్ అర్మీలో చేరి, బ్రిటీష్ వ్యతిరేక పోరాటంలో భాగస్వామి అయ్యారు. 1942లో బ్రిటీష్ సైన్యాన్యానికి పట్టుబడ్డారు. పశ్చిమ బెంగాలోని జిగర్‌కాచా క్యాంపులో ఓ సంవత్సరం పాటు నిర్బంధానికి గురయ్యారు.

**మదార్ సాహెబ్** ః చంద్రగిరి తాలూకా తిరుపతి నివాసి. తండ్రి మిరాన్ సాహెబ్. వ్యాపారం. సహాయనిరాకరణ-ఖిలాఫత్ ఉద్యమంలో పాల్గొన్నందుకు 1922 ఫిబ్రవరి ఒకటిన ఏడాది జైలు, 50 రూపాయల జరిమానా, జరిమానా చెల్లించనట్టయితే అదనంగా మూడు మాసాల జైలుశిక్ష విధింపు. జరిమానా చెల్లించనందున వెల్లూరు, కడలూరు జైళ్ళలో 15 మాసాల పాటు జైలుశిక్ష ఆనుభవించారు.

**ముహమ్మద్ అఫ్జల్** ః చంద్రగిరిలో 1915 సెప్టెంబరు 15న జననం. తండ్రి మహమ్మద్ అబ్దుల్ మజీద్. యస్.యస్.యల్.సి వరకు చదువు. 1942 సెప్టెంబర్‌లో భారత జాతీయ సైన్యంలో భర్తీ. సింగపూరు, బర్మాలలో బ్రిటీషు వ్యతిరేక యుద్ధంలో భాగస్వామి. బ్రిటీష్ సైన్యాలకు పట్టుబడి 1945 ఏప్రిల్ 15 నుండి 1946 మే మూడు

వరకు రంగూన్ జైలు, పశ్చిమ బెంగాలులోని జిగర్‌కాచా క్యాంపులో మూడు మాసాలు నిర్బంధించబడ్డారు.

**షేక్ ఇమాం** : మదనపల్లి తాలూకా పెదపాలెం నివాసి. వ్యాపారస్థుడు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు 1930 మే 27 నుండి మూడు మాసాలపాటు మద్రాసు కేంద్ర కారాగారంలో కఠిన జైలుశిక్ష అనుభవించారు.

## కడప

**షేక్ పీర్ షా** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం – 1) లో షేక్ పీర్ షా వివరాలున్నాయి.

**హుస్సేన్ సాహెబ్, దూదేకుల** : పులివెందుల తాలూకా పైడిపాలెం నివాసి. తండ్రి ఫకీర్ సాహెబ్, వ్యక్తి సత్యాగ్రహంలో భాగస్వామి. వెల్లూరు కేంద్రకారాగారంలో 1941 ఫిబ్రవరి 26 నుండి రెండు మాసాలపాటు జైలుశిక్ష అనుభవించారు.

**షేక్ నబీ రసూల్ సాహెబ్** : జమ్మలమడుగు తాలూకా కొండాపురం నివాసి. తండ్రి ఖాజా హుస్సేన్. దర్జీ. వ్యక్తి సత్యాగ్రహోద్యమంలో భాగస్వామి. 1941 జనవరి 15న జైలుశిక్ష విధింపు. వెల్లూరు కేంద్ర కారాగారంలో మూడు మాసాలు శిక్షను అనుభవించారు.

**సయ్యద్ రసూల్ సాహెబ్** : జమ్మలమడుగు తాలూకా ముద్దనూరులో 1896 సంవత్సరంలో జననం. ప్రొద్దుటూరు తాలూకా కల్లూరు నివాసి. తండ్రి ఫక్రుద్దీన్ సాహెబ్. వ్యక్తి సత్యాగ్రహం సందర్భంగా యుద్ధ వ్యతిరేక నినాదాలు చేసినందున 1941 ఫిబ్రవరి 26న మూడు మాసాల జైలుశిక్ష విధింపు. వెల్లలూరు జైలులో శిక్ష అనుభవించారు. 1942లో ఉప్పు సత్యాగ్రహంలో భాగస్వామి అయ్యారు.

## కర్నూలు జిల్లా

**గులాం రసూల్ ఖాన్** : కర్నూలు నవాబు. ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమర యోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం – 1) లో గులాం రసూల్ ఖాన్ వివరాలున్నాయి.

**అక్బర్ అలీ యం** : 1922 జూలై ఒకటిన ఆలూరు తాలూక నేంకల్‌లో జననం. తండ్రి ముల్లా అలీ సాహెబ్. ఎనిమిదవ తరగతి వరకు చదువు. దర్జి పని. క్విట్ ఇండియా ఉద్యమంలో భాగస్వామి. 1942 సెప్టెంబరు ఎనిమిదిన అలీపూరు క్యాంపు జైలులో నిర్బంధం.

మద్యపాన నిషేదం, హరిజనోద్ధరణ, ఖాదీ ప్రచార కార్యక్రమాలలో పాల్గొన్నారు.

**బియబాని యస్.యం.కె** : కర్నూలు నివాసి. ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో బియబాని వివరాలున్నాయి.

**సుల్తాన్ మొహిద్దీన్** : అదోని తాలూకా పాండవగల్లు నివాసి. తండ్రి షా అలీ సాహెబ్. గ్రామ మున్సిఫ్. క్విట్ ఇండియా ఉద్యమంలో భాగస్వామి. 1942 ఆగస్టు 24 నుండి అక్టోబరు 19 వరకు అలీపూరు, బళ్ళారి జైళ్ళల్లో నిర్బంధం.

**యం.షంషేర్ బేగ్** : 1916లో కర్నూలులో జననం. నంద్యాల తాలూకా పాణ్యం నివాసి. తండ్రి ఖాదర్ బేగ్. వృత్తి వ్యవసాయం. 1932లో శాసనోల్లంఘనలో పాల్గొనేందుకు చదువుకు స్వస్తిచెప్పారు. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 1941 జనవరి ఆరున ఆరు మాసాల జైలుశిక్ష, ఐదు రూపాయల జరిమానా విధింపు. జరిమానా చెల్లించకుండా మరో మూడుమాసాలు అలీపురం జైలులో శిక్షను అనుభవించారు. క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించగా అలీపూరు జైలులో గడిపారు. 1942 జూలై 23న శిక్ష ముగిసింది. 1946-49లో కర్నూలు జిల్లా బోర్డు సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. ఆంధ్ర, మద్రాసు విశ్వ విద్యాలయాల సెనేట్ సభ్యులుగా 1948-49లలో పనిచేస్తూ విద్యాభివృద్ధికి కృషిచేశారు. 15 సంవత్సరాలపాటు జిల్లా కాంగ్రెస్ కార్యవర్గసభ్యులు. 19489-59 వరకు జిల్లా కమిటీ సంయుక్త కార్యదర్శి, రెండుసార్లు కాంగ్రెస్ పిసిసి సభ్యులుగా, 1971లో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అడ్‌హక్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. 1966లో ఆంధ్రప్రదేశ్ విధాన మండలి సభ్యులయ్యారు. 1972లో కూడా ఆయన విధానమండలికి ఎంపికయ్యారు.

**ముల్లా మహబూబ్ సాహెబ్** : 1905లో నంద్యాల తాలూకా టొగెర్చేడులో జననం. నంద్యాల నివాసం. తండ్రి సుల్తాన్ సాహెబ్. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1942 అక్టోబరు 23 నుండి 1943 ఏప్రిల్ 21వరకు అలీపూరు క్యాంపు జైలులో శిక్ష అనుభవించారు. 1950 నుండి 1970 వరకు గ్రామ పంచాయితీ బోర్డు సభ్యులుగా పనిచేశారు.

## తూర్పు గోదావరి

**ముహమ్మద్ మొహిద్దీన్ బాషా** : కాకినాడ నివాసి. తండ్రి వజీర్ సాహెబ్. విద్యార్థి. సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. మద్రాసులోని నేరస్థుల

సంస్కరణాలయంలో 1922 ఫిబ్రవరి నాల్గవ తేది నుండి 1922 ఆగస్టు మూడవ తేది వరకు నిర్బంధంలో ఉన్నారు.

**ఫజులుల్లా ఖాన్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో ఫజులుల్లా ఖాన్ వివరాలు ఉన్నాయి.

**ఉమర్ అలీషా మౌల్వీ** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో మౌల్వీ ఉమర్ అలీషా వివరాలు ఉన్నాయి.

## గుంటూరు

**అబ్దుల్ హుదా సాహెబ్** : సహాయనిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. 1921 నవంబరు 16న ఆయనకు ఏడాది పాటు జైలుశిక్ష విధింపు. రాజమండ్రి కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవించారు.

**అబ్దుల్ రజాఖ్** : బాపట్ల తాలూకా నివాసి. 1932 నాటి శాసనోల్లంఘ నోద్యమంలో భాగస్వామి. అరెస్టయ్యారు.

**దర్యాఖాన్** : 1914 సెప్టెంబరు 21న పొన్నూరులో జననం. తండ్రి మీరా ఖాన్. యస్.యస్.యల్.సి చదివారు. రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్గా కొంతకాలం చేసిన ఆయన జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మేనేజరుగా బాధ్యతలు నిర్వహించారు. వ్యక్తి సత్యాగ్రహంలో భాగస్వామి. 1941 జనవరి 10న నాలుగు మాసాల జైలుశిక్ష, యాభై రూపాయల జరిమానా విధింపు. జరిమానా చెల్లించకుంటే మరో నాలుగు మాసాల జైలు శిక్ష. జరిమానా చెల్లించి అలీపూర్, తిరుచునాపల్లి జైళ్ళల్లో శిక్ష అనుభవించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 'జాతీయ ముస్లింల సమావేశం' నిర్వహించడంలో ప్రధాన పాత్ర.

**చింతపల్లి హుస్సేన్ సాహెబ్** : మాచెర్ల నివాసి. 1921లో జరిగిన పల్నాడు అటవీ సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఎనిమిది మాసాల జైలుశిక్షకు గురయ్యారు.

**హాజరా బీబి** : తెనాలి నివాసి. ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో హజరా బీబి వివరాలున్నాయి.

**జాన్ అహమ్మద్** : మాచెర్ల నివాసి. 1921లో జరిగిన పల్నాడు అటవీ సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఎనిమిది మాసాల జైలుశిక్షకు గురయ్యారు.

**ముహమ్మద్ ఇస్మాయిల్** : తెనాలి నివాసి. ఖద్దరు ఇస్మాయిల్గా ప్రసిద్ధి చెందిన

ముహమ్మద్ ఇస్మాయిల్ వివరాలు ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో వివరాలు ఉన్నాయి.

**మౌల్వీ ముహమ్మద్ రజా సాహెబ్** : గుంటూరు నివాసి. 1921 నాటి సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా గౌరవ న్యాయమూర్తి పదవికి రాజీనామా చేశారు.

**మున్షీ ముహమ్మద్ మస్తాన్** : తెనాలి నివాసి. ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమర యోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో మున్షీ మస్తాన్ వివరాలున్నాయి.

**మున్షీ సయ్యద్ మహాబూబ్** : తెనాలి నివాసి. ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో వివరాలున్నాయి.

**రహమాన్ ఖాన్** : 1921 నాటి సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా తాను నిర్వహిస్తున్న గ్రామీణాధికారి పదవికి రాజీనామా సమర్పించారు.

**షేక్ ఆదం సాహెబ్** : 1921 నాటి సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా తాను నిర్వహిస్తున్న గ్రామీణాధికారి పదవికి రాజీనామా చేశారు.

**షేక్ దావూద్** : రేపల్లె నివాసి. 1921 సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ కారణంగా జైలుశిక్ష అనుభవించారు.

**షేక్ ఫకీర్ సాహెబ్** : పెదనందిపాడు నివాసి. 1922 జనవరి 15న, పెదనందిపాడు సత్యాగ్రహంలో భాగంగా గ్రామాధికారి పదవికి రాజీనామా సమర్పించారు.

**షేక్ గాలిబ్ సాహెబ్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం - 1) లో షేక్ గాలిబ్ సాహెబ్ వివరాలున్నాయి.

**షేక్ గాలిబ్ హుస్సేన్** : రేపల్లె నివాసి. 1921 సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. జైలు శిక్ష అనుభవించారు.

**షేక్ హటల్ సాహెబ్** : సత్తెనపల్లి తాలూకా నివాసి. తండ్రి షేక్ హుస్సేన్. వృత్తి టైలరింగ్. క్విట్ ఇండియా ఉద్యమంలో భాగస్వామి. 1943 జనవరి 15న 18 మాసాల కారాగారశిక్ష విధింపు. అలీపూరు క్యాంపు జైలులో శిక్ష అనుభవించారు.

**షేక్ మస్తాన్** : నిడుబ్రోలు నివాసి. తండ్రి ఖాశిం సాహెబ్ అలియాస్ హుస్సేన్ సాహెబ్. క్విట్ ఇండియా ఉద్యమంలో భాగస్వామి. 1942 అక్టోబరు 24న మూడున్నర మాసాల జైలు శిక్ష విధింపు.

**షేక్ ముహమ్మద్ సాలార్ :** మంగళగిరిలో 1910 జూలై ఒకటిన ఎస్.ఎం మగ్దూం మొహిద్దీన్, రాబియా బీలకు జన్మించారు. ఇంటర్ విద్యాభ్యాసం గుంటూరులో జరిగింది. గుంటూరులో వ్యాపారం ఆరంభించి ఇక్కడే స్థిరపడ్డారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు షేక్ ముహమ్మద్ గాలిబ్ గారి శిష్యరికంలో జాతీయోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమర యోధులు వావిలాల గోపాలకృష్ణయ్య, ఎన్‌జి రంగా, చేబ్రోలు హనుమయ్య, కొత్త రఘు రామయ్య తదితరులు సన్నిహిత మిత్రులు. జాతీయోద్యమంలోని కార్యక్రమాలకు ఆయన తోడ్పాటునందించారు. గుంటూరు పురపాలక సంఘం కౌన్సిలర్‌గా రెండుసార్లు ఎన్నికయ్యారు. 1970 ప్రాంతంలో గుంటూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. 1986 మార్చి 28న షేక్ ముహమ్మద్ సాలార్ కన్నుమూశారు.

**షేక్ మిర్జా అలీ సాహెబ్** : సత్తెనపల్లి తాలూక పాపాయపాలెం నివాసి. తండ్రి హుస్సేన్ సాహెబ్. వ్యవసాయదారుడు. పన్ను వ్యతిరేక ఉద్మమంలో పాల్గొన్నారు. 1922 ఫిబ్రవరి ఆరున ఆరు మాసాల జైలు శిక్షను రాజమండ్రి కేంద్రకారాగారంలో గడిపారు.

**షేక్ మొహిద్దీన్** : పెదనందిపాడు నివాసి. సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా 1922 జనవరి 15న ఉద్యోగానికి రాజీనామా చేశారు.

**షేక్ నబీ సాహెబ్** : వెదుళ్ళపల్లి నివాసి. తండ్రి షేక్ ఖాశిం సాహెబ్. వ్యాపారం. శాసనోల్లంఘన ఉద్యమంలో భాగస్వామి. 1933 జనవరి 16న ఏడాది కఠిన జైలుశిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధింపు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు మాసాల జైలుశిక్ష. 1933 ఆగస్టు 31 వరకు రాజమండ్రి జైలులో నిర్బంధం.

**షేక్ ఉస్మాన్** : రేపల్లె నివాసి. తండ్రి హుస్సేన్. 1921 సహాయనిరాకరణ ఉద్యమంలో భాగస్వామి. జైలు జీవితం అనుభవించారు.

**షేక్ ఉస్మాన్** : రేపల్లె నివాసి. తండ్రి మస్తాన్. 1921లో సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొన్న ఫలితంగా జైలు శిక్షను అనుభవించారు.

**సయ్యద్ అబ్దుల్ అజీం :** ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం - 1) లో సయ్యద్ అబ్దుల్ అజీం వివరాలున్నాయి.

**షేక్ సుబేదార్ అహమ్మద్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో షేక్ సుబేదార్ అహమ్మద్ వివరాలున్నాయి.

# హైదరాబాదు

**అబ్దుస్ సుభాన్** : తండ్రి అబ్దుస్ సలాం. 1920 ఖిలాఫత్ ఉద్యమంలో ప్రముఖ పాత్రవహించారు. ఆ సందర్భంగా సభలు-సమావేశాలను జరపరాదని నిజాం జారీ చేసిన ఫర్మానాలను ఉల్లంఘించి సభలు నిర్వహించారు. ఆ కారణంగా 1921 వరకు మన్ననూరు, మహబూబ్‌నగర్‌లో గృహనిర్బంధం శిక్షకు గురయ్యారు.

**అహమ్మద్ అలీ ఖాన్ మీర్** : 1905లో హైదరాబాద్‌లో జననం. 1920 నాటి ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమం ద్వారా జాతీయోద్యమంలో ప్రవేశం. ఖాదీ ప్రచారంలో భాగంగా అనేక సంవత్సరాలు 'హైదరాబాద్ ఖాదీ ప్రచార సంఘం' సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు. 1928-29లో 'ఉస్మానియా విశ్వవిద్యాలయం గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్' ఉపాధ్యక్షులుగా 1942లో అధ్యక్షులుగా పనిచేశారు. బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, అందులో ప్రజలకు భాగస్వామ్యం కల్పించాలని 1943లో నైజాం నవాబును కోరిన ప్రముఖులలో ఆయన ఒకరు. 1955లో 'ఆంధ్ర-తెలంగాణా యూనిఫికేషన్ కన్వెన్షన్' ఆయన ఆధ్యక్షతన జరిగింది. విశాలాంధ్రను కోరుతూ ఢిల్లీలోని కాంగ్రెస్ అధినాయకత్వం వద్దకు ఆయన ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి ప్రతినిధివర్గం వెళ్ళింది. 1951-55 ప్రాంతంలో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యి, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర-జాతీయ స్థాయిలో ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు వ్యక్తులు ఏర్పాటు చేసిన వివిధ ప్రజా సంఘాలలో, సాంస్కృతిక సేవా సంస్థలలో పలు బాధ్యతలను నిర్వహించారు. చివరి వరకు ఖాధీని ధరించిన ఆయన న్యాయవాది.

**అబిద్ హసన్ సఫ్రాని** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం- ) లో అబిద్ హసన్ సఫ్రాని వివరాలున్నాయి.

**అక్బర్ అలీ ఖాన్ మిూర్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో మిూర్ అక్బర్ అలీ ఖాన్ వివరాలున్నాయి.

**అమిూర్ అహమ్మద్** : హైదరాబాద్ నివాసి. తండ్రి షంషుద్దీన్ రజ్వి. హైదరాబాద్ సంస్థానంలో సాగిన ఖిలాఫత్ ఉద్యమంలో భాగస్వామి. మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్ననూర్‌లో నిర్బంధానికి గురయ్యారు.

**అటా హుసైన్** : హైదరాబాదు నివాసి. తండ్రి ముహమ్మద్ హుస్సేన్ ఖాన్. 1920లో ఖిలాఫత్ ఉద్యమంలో పాల్గొన్నారు. సభలు - సమావేశాలను నిషేధిస్తూ 1920

మే 30న నిజాం జారీచేసిన ఫర్మానాను ఉల్లంఘించారు. ఆ కారణంగా అరెస్టు అయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్ననూర్‌లో నిర్బంధానికి గురయ్యారు.

**బద్రుల్ హసన్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో బద్రుల్ హసన్ వివరాలున్నాయి.

**బాఖర్ అలీ మీర్జా** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో బాఖర్ అలీ మీర్జా వివరాలున్నాయి

**బేగం ఖుర్షీద్ ఖ్వాజా** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో బేగం ఖుర్షీద్ ఖ్వాజా వివరాలున్నాయి.

**బేగం మజీదా బానో** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో బేగం మజీదా బానో వివరాలున్నాయి.

**ఫరీద్ మీర్జా** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో ఫరీద్ మీర్జా వివరాలున్నాయి.

**ఫక్రుల్ హాజియా హసన్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో ఫక్రుల్ హాజియా హసన్ వివరాలున్నాయి.

**ఫతావుల్లా ఖాన్** : హైదరాబాదు నివాసి. తండ్రి రషీద్ హుస్సేన్ ఖాన్. రైల్వే ఉద్యోగి. నైజాం రాష్ట్ర రైలు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు. అఖిల భారత రైలు ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహణ. క్విట్ ఇండియా ఉద్యమంలో భాగస్వామి. స్వతంత్ర ఆలోచనల మూలంగా హైదరాబాదులోని కేంద్ర కారాగారంలో విచారణ ఖైదీగా నిర్బంధంలో ఉన్నారు. ఆ తరువాత 1942 డిసెంబరు 13 నుండి 1943 జనవరి 24 వరకు గుల్‌బర్గా, హైదరాబాదు కేంద్రకారాగారంలో నిర్బంధానికి గురయ్యారు.

**జమాలున్నీసా బాజి** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో జమాలున్నీసా బాజి వివరాలు ఉన్నాయి.

**జాన్ ముహమ్మద్** : హైదరాబాదు నివాసి. ప్రథమ స్వాతంత్ర్యసంగ్రామ యోధుడు. 1957 జూలై 17న బ్రిటీష్ రెసిడెన్సీ మీద పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ నాయకత్వంలో జరిగిన దాడిలో భాగస్వామి. తుర్రేబాజ్ ఖాన్‌ను నిర్బంధించేందుకు వచ్చిన బ్రిటీషు సైన్యాలను నిరోధిస్తూ సాగిన సాయుధ పోరాటంలో అమరులయ్యారు.

**ఖమ్రుల్ ఇస్లాం** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో ఖముర్రుల్ ఇస్లాం వివరాలు ఉన్నాయి.

**మగ్బూల్ అహ్మద్ జామాయ్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో మగ్బూల్ అహ్మద్ జామాయ్ వివరాలు ఉన్నాయి.

**మిర్జా హైదర్ హుస్సేన్** : 1922లో జననం. హైదరాబాదు నివాసి. తండ్రి మిర్జా ముహమ్మద్ హుస్సేన్. వృత్తిపరంగా జర్నలిస్టు. రాజకీయంగా కమ్యూనిస్టు. భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో భాగస్వామి. కొంతకాలం సంగారెడ్డి జైలులో నిర్బంధం. ఆ తరువాత 1947 సెప్టంబరు 16 నుండి 1948 మే మూడు వరకు గుల్‌బర్గా, హైదరాబాదు జైళ్ళలో శిక్షకు గురయ్యారు.

**ముహమ్మద్ అబ్దుర్రహమాన్ రయీస్** : హైదరాబాదు నివాసి. తండ్రి గులాం దస్తగిరి. హైదరాబాదు రాష్ట్రంలో సాగిన ఖిలాఫత్ - సహాయనిరాకరణ ఉద్యమంలో భాగస్వామి. సభలను-సమావేశాల నిర్వహణను నిషేధిస్తూ 1920 మే 30న నిజాం జారీ చేసిన ఫర్మానాలను ఉల్లంఘించారు. ఆ కారణంగా మహబూబ్ నగర్ జిల్లా మన్ననూరులో గృహనిర్బంధం శిక్షను అనుభవించారు.

**ముహమ్మద్ ఆయూబ్** : మహారాష్ట్ర ప్రాంతం ఔరంగాబాద్ జిల్లాలో 1916 డిసెంబరు 15న జననం. హైదరాబాదు నివాసి. తండ్రి ముహమ్మద్ గౌస్. ఐదవ తరగతి వరకు చదువు. ప్రైవేటు సంస్థలో ఉద్యోగం. భారతీయ సైన్యంలో నర్సింగ్ సిపాయిగా 1934 నవంబరు 2న చేరారు. ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో జపాను వారికి బందీగా చిక్కారు. అనంతరం ఇండియన్ నేషనల్ ఆర్మీలో హవల్దార్‌గా సింగపూరులోని తొమ్మిదవ గెరిల్లా రెజిమెంటులోని చేరారు. కౌలాలంపూరు వద్ద బ్రిటీషు సైన్యాలచే అరెస్టు కాబడి భారత దేశానికి పంపబడ్డారు. ఇండియన్ నేషనల్ ఆర్మీలో చేరినందుకు శిక్షగా ఆయనను బ్రిటీష్ ప్రభుత్వం సైనిక సర్వీసు నుండి 1946 ఫిబ్రవరి 28న తొలిగించింది.

**ముహమ్మద్ గౌస్** : హైదరాబాదు నివాసి. తండ్రి మొహమ్మద్ అమీర్. డ్రైవర్. క్విట్ ఇండియా ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొన్నందుకు 1944 ఫిబ్రవరి 14న ఏడాది కఠిన కారాగారవాస శిక్షకు గురయ్యారు. అలీపూర్, రాజమండ్రి జైళ్లలో నిర్బంధం.

**ముహమ్మద్ హనీఫ్** : హైదరాబాదు నివాసి. తండ్రి ముహమ్మద్ అలీ. మోటారు కంట్రాక్టర్. క్విట్ ఇండియా ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. 1944 ఫిబ్రవరి 14న సంవత్సరం పాటు జైలుశిక్షకు గురయ్యారు. అలీపూర్, రాజమండ్రి జైళ్లలో నిర్బంధం.

**ముహమ్మద్ హుసైన్** : సికింద్రబాద్ నివాసి. తండ్రి లాల్ అహమ్మద్. రైల్వే ఉద్యోగి. క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా జరిగిన రాష్ట్రవ్యాపిత రైల్వే సమ్మెలో భాగస్వామ్యం. 1942లో కొంతకాలం కేంద్రకారగారంలో విచారణ ఖైదీలుగా నిర్బంధం. ఆ తరువాత 1942 డిసెంబరు 13 నుండి 1943 జనవరి 24 వరకు హైదరాబాదు కేంద్ర కారాగారంలో నిర్బంధాన్ని చవి చూశారు.

**ముహమ్మద్ ముర్తుజా** : హైదరాబాద్ నివాసి. జాతీయవాది. నిజాం ప్రభుత్వంలో ఉన్నతోద్యోగి. ప్రముఖ విద్యావేత్త. చదువు ద్వారా మాత్రమే ప్రగతి సాధించగలమన్న ప్రతిపాదనతో 1904లో ఆయన ' Rooh-e-Taraqqi ' అను కరపత్రం ప్రచురించారు. ఆంగ్లభాషలో కాకుండా ఇతర భాషలతో విద్యాబోధన జరిగేలా హైదరాబాదులో ప్రత్యేకంగా ఓ విశ్వవిద్యాలయం ప్రారంభించాలని ప్రతిపాదించి, ఆ దిశగా ప్రయత్నాలు ఆరంభించిన వ్యక్తి. ఈ దిశగా సాగిన ప్రయత్నాలలో భాగంగా 1915లో జరిగిన ప్రథమ విద్యా సమావేశానికి నిర్వహకునిగా, కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 1920 నాటి ఖిలాఫత్–సహాయనిరాకరణ ఉద్యమాలకు మద్దతు పలికారు. ఆయనదైన తరహాలో తోడ్పాటు అందించారు.

**మొహిబ్ హుస్సేన్** : హైదరాబాదు నివాసి. జాతీయవాది. జర్నలిస్టు. సాంఘిక సంస్కర్త. స్త్రీ విద్య ప్రచారంలో అగ్రగామి. ఆశయాల ప్రచారానికి 1882లో Muallim-e-Shafiq అను పత్రికను ఆరంభించారు. 1892లో Mualliam-e-Nizwan అను మాసపత్రిక తెచ్చారు. 1904లో Ill-o-Amal ఉర్దూ వారపత్రిక ప్రచురించారు. భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాల మద్దతుదారుడు. ద్విజాతి సిద్ధాంతం, భూస్వామ్యవాద సంస్కృతికి వ్యతిరేకి. ముస్లిం మహిళలలో పర్దా పద్దతిని నిరశించారు. నైజాం ప్రభుత్వం అనుసరిస్తున్న దూర దృష్టిలేని విధానాలను విమర్శించారు. 1930లో కన్నుమూశారు.

**మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం–1) లో మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ వివరాలు ఉన్నాయి.

**ముబార్జిద్దౌలా** : అసలు పేరు మీర్ గోహర్ అలీ ఖాన్. ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం–1) లో వివరాలు ఉన్నాయి.

**ముల్లా అబ్దుల్ ఖయ్యూం** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం–1) లో ముల్లా అబ్దుల్ ఖయ్యూం వివరాలు ఉన్నాయి.

**మాసుమా బేగం** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో మాసుమా బేగం వివరాలు ఉన్నాయి.

**నూరుల్ ఉమ్రా బహదూర్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో నూరుల్ ఉమ్రా వివరాలు ఉన్నాయి.

**ముల్లా అబ్దుల్ బాసిత్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో ముల్లా అబ్దుల్ బాసిత్ వివరాలు ఉన్నాయి.

**నఫీస్ ఆయేషా బేగం** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో నఫీస్ ఆయేషా బేగం వివరాలు ఉన్నాయి.

**ఉమర్ ఖాన్** : సికింద్రాబాదు నివాసి. తండ్రి పేరు ఉస్మాన్ ఖాన్. నిజాం ప్రభుత్వంలోని రైల్వేల విభాగంలో ఫిట్టర్. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా సాగిన రైల్వే సమ్మెలో భాగస్వామి. కొంతకాలం నగరంలోని కేంద్రకారాగారంలో విచారణ ఖైదీగా నిర్బంధం. ఆ తరువాత 13-12-1942 నుండి 24-01-1943 వరకు కేంద్ర కారాగారంలో, గుల్‌బర్గాలోని జైలులో నిర్బంధం.

**ఉస్మాన్ సుభాని** : 1895 డిసెంబరు ఎనిమిదిన బొంబాయిలో జననం. హైదరాబాదు నివాసి. తండ్రి హాజి యూసుఫ్ సుభాని. ఉన్నత విద్యావంతుడు. పలు కర్మాగారాల యజమాని. రాజాప్రతాపగిర్జి మిల్స్ జనరల్ మేనేజరు. కాంగ్రెస్ వాది. 1920నాటి అఖిల భారత ఖిలాఫత్ ఉద్యమ కమిటి ఆర్థిక కార్యదర్శి. 1930 నాటి ఉప్పు సత్యాగ్రహంలో స్వయంగా పాల్గొనడం మాత్రమే కాకుండా ఉద్యమానికి రెండు లక్షల రూపాయల విరాళం కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యమంలో పాల్గొన్నందుకు నాసిక్ జైలులో నిర్బంధం. వితరణశీలి. స్వరాజ్ నిధికి భూరి విరాళం అందజేశారు. బొంబాయి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా బాధ్యతల నిర్వహణ. 1951-55 వరకు రాజ్యసభ సభ్యులు. Bombay Chronicle అను దినపత్రికను డొంబాయి నుండి ప్రచురించారు. బొంబాయి నగర పాలక సంస్థ కార్పొరేటర్ కూడా అయ్యారు. ఆర్థిక-సామాజిక-సేవా రంగాలకు మాత్రమే కాకుండా పారిశ్రామిక రంగంలో కూడ ఆయన తనదైన ముద్రతో సుప్రసిద్ధులయ్యారు. 1959 ఫిబ్రవరి ఒకటిన కన్నుమూశారు.

**రజియా బేగం** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో రజియా బేగం వివరాలు ఉన్నాయి.

**షేక్ అలీ అరబ్** : హైదరాబాదు నివాసి. 1859 అక్టోబరులో బ్రిటీషర్లకు వ్యతిరేకంగా మహారాష్ట్రలోని పర్భని జిల్లా బస్‌మత్ తాలూకా జ్వాలా గ్రామం వద్ద జరిగిన పోరాటంలో పాల్గొన్నారు. ఆయనను అరెస్టు చేసి ఉరితీశారు. ప్రజలలో భయభ్రాంతుల్ని చేయడానికి ఆయన భౌతిక కాయాన్ని వారం రోజుల పాటు నడి బజారులో ఉరికంబానికి వేలాడదీశారు.

**షోయాబుల్లా ఖాన్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో షోయాబుల్లా ఖాన్ వివరాలు ఉన్నాయి.

**సిరాజుల్ హసన్ తిర్మిజ్** : హైదరాబాదు నివాసి. జాతీయవాది. పూర్వపు హైదరాబాద్ రాజ్యంలో ప్రముఖ కాంగ్రెస్ నేత. పలు కార్మిక సంఘాల నాయకుడు. మతోన్మాదానికి వ్యతిరేకించిన ఉద్యమకారుడు. నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయాలని కోరుతూ 1947-48లలో సాగిన ఉద్యమంలో చురుకైన పాత్ర.

**సయ్యద్ అహమ్మద్** : హైదరాబాదు నివాసి. 1857 జూలై 17నాటి రెసిడెన్సీ మీద దాడి సంఘటనలో భాగస్వామి. బ్రిటీషు బలగాలతో పోరాడుతూ అమరులయ్యారు.

**సయ్యద్ ఇబ్రహీం** : హైదరాబాదు నివాసి. తండ్రి ముహమ్మద్ సాధిఖ్. పూర్వ హైదరాబాదు రాజ్యంలో జరిగిన 1920 నాటి ఖిలాఫత్ ఉద్యమంలో భాగస్వామి. అరెస్టు చేసి మహబూబ్ నగర్ జిల్లాలోని మన్ననూరులో ఏడాదిపాటు నిర్బంధం.

**సయ్యద్ ఇబ్రహీం** : అదిలాబాదు నివాసి. 1918లో హైదరాబాదులో జననం. తండ్రి సయ్యద్ ముబారక్. ఇంటర్మీడీయట్ వరకు చదువు. వరంగల్‌లోని అజాం జాహి మిల్ వర్కర్స్ యూనియన్ ఆర్గనైజరు, యూనియన్ కార్యదర్శి. క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా కార్మికుల చేత సమ్మె నిర్వహణ. ఆ కారణంగా నిజాం ప్రభుత్వం ఆయనను హైదరాబాదు నుండి బహిష్కరించింది.

**సయ్యద్ ముస్తఫా ఖాద్రి ఖతీబ్** : హైదరాబాదు నివాసి. తండ్రి సయ్యద్ ముర్తూజా. జర్నలిస్టు. Rahebar-e-Watan అను ఉర్దూ పత్రిక సంపాదకులు. ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమంలో నిర్బంధానికి గురయ్యారు. ఆ తరువాత హైదరాబాదు సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయాలని కోరుతూ సాగిన ఉద్యమంలో భాగస్వామి. ఆ కారణంగా 1947 నవంబరు 23 నుండి 1948 సెప్టంబరు 19 వరకు హైదరాబాదులోని కేంద్ర కారాగారంలో నిర్బంధం.

**తాజుద్దీన్** : 1921లో సికిందరాబాదులో జననం. హైదరాబాదు నివాసి. తండ్రి గులాం గౌస్. ద్వితీయ ప్రపంచ సంగ్రామం సందర్భంగా 1939 డిసెంబరు 18న భారత సైన్యంలో సిపాయి-డ్రైవర్‌గా చేరారు. 1941లో యుద్ధరంగంలోకి బదిలీ అయ్యారు. 1942 ఫిబ్రవరి 15న జపాను సైన్యాలకు బందీగా పట్టుబడ్డారు. ఆ తరువాత ఇండియన్ నేషనల్ ఆర్మీలో ప్రవేశం. జపాను పరాజయం తరువాత 1945 సెప్టెంబరు 8న ఇండియన్ నేషనల్ అర్మీనుండి ఇండియాకు తరలింపు. బొంబాయిలోని కళ్యాణి మిలటరీ జైలులో రెండు మాసాలపాటు నిర్బంధం. బొంబాయిలో మిలటరీ న్యాయస్థానంలో విచారణ జరిపి, లక్నో జైలుకు తరలింపు. అక్కడ మాసం గడిపాక 1946 మే 28న సర్వీసు నుండి తొలగింపు. ఆ తరువాతి పరిణామాలలో స్వేచ్ఛ పొందారు.

**తుర్రేబాజ్ ఖాన్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ వివరాలు ఉన్నాయి.

**జాకీర్ హూసైన్ డాక్టర్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో డాక్టర్ జాకీర్ హూసైన్ వివరాలు ఉన్నాయి.

## ఖమ్మం

**ముహమ్మద్ ఇస్మాయిల్** : కొత్తగూడెం నివాసి. తండ్రి ముహమ్మద్ అంకుస్. కమ్యూనిస్టు. నిజాం వ్యతిరేక, భూసామ్య వ్యతిరేక కార్యకలాపాల మూలంగా 1947 మే ఆరు నుండి 1947 నవంబరు ఐదు వరకు హైదరాబాదులోని కేంద్ర కారాగారంలో నిర్బంధం.

**ఖాదర్ బేగ్** : మదిర తాలూకా అసదర్లపాడు నివాసి. తండ్రి బుడ్డన్ బేగ్. నిజాం ఇండియన్ యూనియన్‌లో విలీనం కోరుతూ సాగిన ఉద్యమంలో భాగస్వామి. 1948 ఆగస్టు 13 నుండి 1948 సెప్టెంబరు 22 వరకు వరంగల్ కేంద్రకారాగారంలో నిర్బంధం.

**షేక్ బాబు** : మధిర తాలూకా అదసర్లపాడు నివాసి. తండ్రిపేరు రంజాన్ అలీ. 1930లో ఉప్పుసత్యాగ్రహోద్యమం సందర్భంగా సత్యాగ్రహదీక్షలో పాల్గొని నిర్బంధానికి గురయ్యారు. ఇండియన్ యూనియన్‌లో నిజాం సంస్థానం విలీనం కోరుతూ సాగిన ఉద్యమంలో పాల్గొన్నారు. 1948 ఆగస్టు 13 నుండి 1948 సెప్టెంబరు 22 వరకు వరంగల్ కేంద్రకారాగారంలో నిర్బంధం.

**ముహమ్మద్ రజబ్ అలీ** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్యసమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో ముహమ్మద్ రజబ్ అలీ వివరాలు ఉన్నాయి.

# కృష్ణా

**అమానుల్లా ఖాన్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో అమానుల్లా ఖాన్ వివరాలు ఉన్నాయి.

**ముహమ్మద్ గులాం మొహీద్దీన్** : విజయవాడ నివాసి. ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో ముహమ్మద్ గులాం మొహిద్దీన్ వివరాలు ఉన్నాయి.

**కొత్వాల్ అబ్బాస్ అలీ సాహెబ్** : నూజివీడు నివాసి. సహాయనిరాకరణ ఉద్యమంలో భాగస్వామి. 1922 జనవరి 20న తొమ్మిది మాసాల కారాగారవాస శిక్షకు గురయ్యారు. రాజమండ్రి కేంద్రకారాగారంలో నిర్బంధం. 1928 నుండి 1937 వరకు ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ సభ్యులు. 1926 నుండి 1940 వరకు నూజివీడు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా జాతీయోద్యమంలో చురుకైన భాగస్వామ్యం. కృష్ణా జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులుగా కృషి చేశారు. 1958 జనవరి 14న కన్నుమూశారు.

**కొత్వాల్ మహమ్మద్ హుసైన్** : నూజివీడు నివాసి. తండ్రి కొత్వాల్ అబ్బాస్ అలీ సాహెబ్. 1941 నాటి వ్యక్తి సత్యాగ్రహంలో భాగస్వామి. పోలీసుల లాఠీచార్జికి గురయ్యారు. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. నూజివీడు పట్టణ కాంగ్రెస్ కమిటీ సహాయ కార్యదర్శిగా పనిచేశారు.

**ముహమ్మద్ నశీరుల్లా ఖాన్** : విజయవాడ నివాసి. సహాయనిరాకరణ ఉద్యమంలో భాగస్వామి. 1922లో రాజమండ్రి జైలులో నాలుగు మాసాల జైలుశిక్షను అనుభవించారు.

**ముహమ్మద్ పెంటు సాహెబ్** : కృష్ణా జిల్లా నివాసి. 1932 శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా పోలీసుల లాఠీచార్జీకి గురయ్యారు.

**మొహిద్దీన్ బేగ్** : నూజివీడు నివాసి. సహాయనిరాకరణ ఉద్యమంలో భాగస్వామి. 1921 ఆగస్టు 20 నుండి నాలుగు మాసాలు రాజమండ్రిలో జైలు శిక్షను అనుభవించారు.

**షేక్ బిఖారి సాహెబ్** : నందిగామ తాలూకా కొనకంచి గ్రామం నివాసి. గ్రామాధికారి. క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా 1942 ఆగస్టు 21న గ్రామాధికారి ఉద్యోగానికి రాజీనామా చేశారు.

**షేక్ ఫకీర్ అహమ్మద్** : నందిగామ తాలూకా కొనకంచి నివాసి. గ్రామాధికారి.

క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా 1942 ఆగస్టు 21న గ్రామాధికారి ఉద్యోగానికి రాజీనామా చేశారు.

**షేక్ మహబూబ్** : గుడివాడ తాలూకా నందివాడ నివాసి. తండ్రి ఖాజా మియా. వ్యాపారి. 1932లో సాగిన శాసనోల్లంఘన ఉద్యమంలో భాగస్వామి. ఉద్యమ ప్రచార కార్యక్రమాలలో గ్రామాలు తిరిగి చురుకైన పాత్ర నిర్వహించారు. 1933 జనవరి 16న ఏడాది కఠిన కారాగావాసం, రెండు వేల రూపాయల జరిమానా విధింపు. జరిమానా చెల్లించనట్టయితే మరో మూడు మాసాల నిర్బంధం. ఆ తీర్పు మేరకు రాజమండ్రి కేంద్ర కారాగారంలో నిర్బంధానికి గురయ్యారు. 1933 ఆగస్టు 31న విడుదలయ్యారు.

**షేక్ నూరుల్లా సాహెబ్** : నూజివీడు నివాసి. 1942లో క్విట్ఇండియా ఉద్యమంలో క్రియాశీలక పాత్ర నిర్వహించారు.

**షేక్ సర్దార్ సాహెబ్** : నందిగామ తాలూకా కొనకంచి నివాసి. 1941 జూలై 17న గ్రామంలో జరిగిన వ్యక్తి సత్యాగ్రహోద్యమంలో భాగస్వామి. కోర్టు ముగిసేంత వరకు నిర్బంధ శిక్ష విధింపు. ఆ తరువాత 1941 ఆగస్టు ఐదున పోచంపల్లి గ్రామంలో సాగిన వ్యక్తి సత్యాగ్రహోద్యమంలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. అరెస్టు చేయబడలేదు. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

**సయ్యద్ హబీబుల్లా సాహెబ్** : విజయవాడ నివాసి. తండ్రి ముహమ్మద్ అజీజుల్లా. శాసనోల్లంఘన ఉద్యమంలో భాగస్వామ్యం. 1932 ఆగస్టు 10న ఒక సంవత్సరం జైలు, పాతిక రూపాయల జరిమాన విధింపు. రాజమండ్రి కేంద్రకారాగారంలో నిర్బంధం. 1932 అక్టోబరు 22న విడుదల.

**షేక్ మౌలా సాహెబ్** : ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం-1) లో షేక్ మౌలా సాహెబ్ వివరాలు ఉన్నాయి.

**షేక్ మెహబూబ్ అలీ ఖాన్** : 1916లో విజయవాడలో జననం. 1936లో భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించారు. ఆంధ్ర జాతీయ ముస్లిం మహాసభ ఆర్గనైజర్. విజయవాడ నుండి వెలువడిన స్వతంత్ర పత్రిక **ది ఆజాద్** పత్రిక సంపాదకులు. మంచి రచయిత, వక్త. రాష్ట్రమంతా పర్యటించి ప్రసంగాలు చేశారు. పండిత నెహ్రూ ఆరంభించిన 'ముస్లిం మాస్ కాంటాక్టు స్కీమ్' కార్యనిర్వాహకుడిగా బాధ్యతలు, జాతీయ కాంగ్రెస్ యువజనోద్యమాన్ని విజయవంతంగా నిర్వహించారు. 1940లో ముస్లిం లీగ్ మూలంగా పలు కష్టనష్టాలను చవిచూశారు. 1954-55 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్

అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ విస్తృతంగా పర్యటనలు జరిపారు. ఆంధ్రప్రదేశ్, చరిత్రను భవిష్యత్తును వివరిస్తూ పలుగ్రంథాలను ప్రచురించారు. ఆయన ప్రధాన వృత్తి ప్రజావైద్యం.

## మహబూబ్ నగర్ జిల్లా

**షేక్ ఫక్రుద్దీన్** : మక్తాల్ తాలూకా అప్పిరెడ్డిపల్లి నివాసి. తండ్రి షేక్ బందగి. పట్వారి. పన్ను వ్యతిరేక ఉద్యమం సందర్భంగా గ్రామంలో ప్రజల నుండి పన్ను వసూలును వ్యతిరేకించారు. ఆ కారణంగా మహబూబ్‌నగర్, ఔరంగాబాద్, హైదరాబాదు జైళ్ళల్లో 1948 మార్చి 10 నుండి అక్టోబరు 10 వరకు శిక్షను అనుభవించారు.

**షేక్ కమాలుద్దీన్** : మక్తాల్ తాలూకా అప్పిరెడ్డిపల్లి నివాసి. తండ్రి షేక్ బందగి. రైతు. పన్ను వ్యతిరేక ఉద్యమం సందర్భంగా పన్ను చెల్లించ నిరాకరణ. ఆ కారణంగా మహబూబ్‌నగర్ జైలులో నిర్బంధం. ఆ తరువాత 1948 ఏప్రిల్ మూడు నుండి ఏప్రిల్ పదకొండు వరకు హైదరాబాదు జైలులో నిర్బంధం.

## మెదక్ జిల్లా

**అబూ సయాద్ ముహమ్మద్ మగ్దూం మెహిద్దీన్** : ఆయన పూర్తి పేరు అబూ సయీద్ ముహమ్మద్ మగ్దూం మొహిద్దీన్ అయినప్పటికి ఆయన మగ్దూం మొహిద్దీన్ పేరుతో ప్రసిద్ధులు. ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం –1) లో మగ్దూం మొహిద్దీన్ వివరాలు ఉన్నాయి.

**మియా సాహెబ్ ఖుర్దు** : నారాయణఖేడ్ గ్రామం నివాసి. రోహిల్లా నాయకుడు. 1860లో బ్రిటీషర్లకు వ్యతిరేకంగా అదిలాబాద్ జిల్లా నిర్మల్‌కు చెందిన రాంజీ గౌడ్ అను యోధుడు ఆరంభించిన తిరుగుబాటులో ఆయన క్రియాశీలక భాగస్వామ్యం వహించారు. 1860 ఏప్రిల్ తొమ్మిదిన నిర్మల్ సమీపంలో తిరుగుబాటు యోధుడు రాంజీ పక్షాన బ్రిటీషు సైనిక బలగాలతో పోరాడుతూ మరణించారు.

## నల్గొండ జిల్లా

**జమాలుద్దీన్** : సూర్యాపేట తాలూకా బాలేం గ్రామనివాసి. తండ్రి అబ్దుల్ నబి. 1946 నవంబరులో తెలంగాణ కమ్యూనిస్టుల నేతృత్వంలో సాగిన భూస్వామ్య వ్యతిరేక రైతాంగ పోరాటంలో భాగస్వామి. పలుసార్లు నిర్బంధానికి గురయ్యారు. నిజాం పోలీసులతో పోరాడుతుండగా తుపాకి గుండ్లు తగిలి గాయాలయ్యాయి.

## శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు  జిల్లా

**ముహ్మద్ అక్బర్ సాహెబ్** ః  కోవూరు తాలూకా అల్లూరు నివాసి. తండ్రి ఖాశిం సాహెబ్. సహాయనిరాకరణ ఉద్యమంలో భాగస్వామి. 1922 ఫిబ్రవరి నాలుగు నుండి ఏడాది పాటు వెల్లూరు, కడలూరు జైళ్ళలో నిర్బంధం.

**ముహమ్మద్ గౌస్ సాహెబ్** ః నెల్లూరు నివాసి. తండ్రి నన్నే సాహెబ్. వ్యాపారం. సహాయనిరాకరణ ఉద్యమంలో భాగస్వామి. 1922 జనవరి 25 నుండి ఆరు మాసాలు వెల్లూరు, కడలూరు జైళ్ళలో కఠిన కారాగారవాస శిక్షను అనుభవించారు.

**ముహమ్మద్ ఖాజా మొహిద్దీన్** ః నెల్లూరు నివాసి. తండ్రి జహీరుద్దీన్. సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగస్వామి. 1922 ఫిబ్రవరి 13 నుండి ఏడాది పాటు వెల్లూరు, కడలూరు జైళ్ళలో నిర్బంధం.

**షేక్ నబీ సాహెబ్** ః  వెంకటగిరి నివాసి. 1941లో జరిగిన సత్యాగ్రహోద్యమంలో భాగంగా  సత్యాగ్రహానికి సన్నద్ధం. యుద్ధ వ్యతిరేక నినాదాలు చేశారు. ఆ రోజున న్యాయస్థానం ముగిసేంతవరకు నిర్బంధ శిక్ష, రెండు అణాలు జరిమానా విధింపు.

**షేక్ మహబూబ్ హసన్** ః  గూడూరు నివాసి. తండ్రి మదార్ సాహెబ్. కార్మికుడు. శాసనోల్లంఘన ఉద్యమంలో కల్లుదుకాణాల వద్ద జరిగిన పికిటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**షేక్ మొహిద్దీన్ సాహెబ్** ః  కావలి తాలూకా. 1942 క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా కావలిలో కల్లు దుకాణాలు, విదేశీ వస్త్రాల విక్రయశాలల ఎదుట జరిగిన పికిటింగ్ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

**షేక్ మురాన్ సాహెబ్** ః ఆత్మకూరు తాలూకా నవూరు నివాసి. తండ్రి ఖాజా సాహెబ్. శాసనోల్లంఘన ఉద్యమంలో భాగస్వామి. 1930 జూలై ఐదు నుండి 1930 అక్టోబరు పదకొండు వరకు అలిపురం జైలులో నిర్బంధం.

**సయ్యద్ నాగూరు** ః కావలి తాలూకా. 1942 క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా కల్లు దుకాణాలు, విదేశీ వస్త్రాల విక్రయశాలల వద్ద జరిగిన పికిటింగ్‌లో పాల్గొన్నారు.

**సయ్యద్ ఖాశిం సాహెబ్**  ః కావలి తాలూకా. 1942 క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా కావలిలో కల్లు దుకాణాలు, విదేశీ వస్త్రాల విక్రయశాలల ఎదుట జరిగిన పికిటింగ్ కార్యక్రమాలలో ప్రధాన భాగస్వామ్యం.

## ప్రకాశం జిల్లా

**ముహమ్మద్ గౌస్ బేగ్** : బాపట్ల నివాసి. ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమర యోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం -1)లో ముహమ్మద్ గౌస్ బేగ్ వివరాలున్నాయి.

**ముహమ్మద్ గౌస్ ఖాతూన్** : బాపట్ల నివాసి. ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమర యోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం - 1) లో వివరాలున్నాయి.

**మీర్జా మహబూబ్ బేగ్** : మార్కాపురం నివాసి. ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమర యోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం - 1) లో వివరాలున్నాయి.

**నన్నె సాహెబ్, దూదేకుల** : గిద్దలూరు తాలూకా బెస్తవారి పేట. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో భాగస్వామి. 1942 అక్టోబరు 17 నుండి 1943 ఫిబ్రవరి ఒకటి వరకు అలీపురం జైలులో నిర్బంధం.

**నూర్‌బాషా షేక్ రహమతుల్లా** : చీరాల తాలూకా దగ్గుబాడు నివాసి. తండ్రి మీరా సాహెబ్. వ్యాపారం. క్విట్ ఇండియా ఉద్యమంలో బాగస్వామి. డిఫెన్స్ ఇండియా రూల్స్ క్రింద అరెస్టయ్యారు. 1943 మే 27న ఆరు మాసాలు అలీపురం జైలులో నిర్బంధం.

**షేక్ బడే సాహెబ్** : చీరాల తాలూకా ఉప్పుటూరు నివాసి. 1921-22 నాటి సహాయ నిరాకరణ ఉద్యమం సందర్భంగా గ్రామాధికారి ఉద్యోగానికి రాజీనామా.

**షేక్ బుడా షా** : దర్శి తాలూకా రామభద్రపురం నివాసి. తండ్రి షేక్ నన్నే సాహెబ్. మెట్రిక్యులేషన్ చదువు. గ్రామాభివృద్ధి అధికారి. 1937లో బ్రిటీషు సైన్యంలో భర్తీ. మలయా వద్ద జపాను సైన్యాలచే నిర్బంధం. 1942 సెప్టెంబరులో ఇండియన్ నేషనల్ ఆర్మీలో చేశారు. బ్రిటీషు సైన్యాలచే అరెస్టు చేయబడి బర్మాలోని మాండలే జైలులో నిర్బంధం. చివరకు 1945లో బ్రిటీషు సైన్యం నుండి విడుదల.

**షేక్ చంగీ షా** : ఒంగోలు తాలూకా అమ్మనబ్రోలు నివాసి. తండ్రి ముహమ్మద్ ఉస్మాన్. టాంగా డ్రైవర్. వ్యక్తి సత్యాగ్రహంలో భాగస్వామి. 1941 జనవరి 21 నుండి మూడు మాసాల పాటు రాజమండ్రి కేంద్రకారాగారంలో నిర్బంధం. 1942 ఆగస్టులో కనుపర్తి ఉప్పు కొటారాల మీద జరిగిన దాడిలో పాల్గొన్నారు. అరెస్టు చేసి 20 రోజులపాటు నిర్బంధించారు. 1945లో 60 సంవత్సరాల వయస్సులో కన్నుమూత.

**షేక్ చిన అదం సాహెబ్** : చీరాల తాలూకా ఉప్పుగుందూరు నివాసి. 1921-22 సహాయనిరాకరణ ఉద్యమం సందర్భంగా గ్రామాధికారి ఉద్యోగానికి రాజీనామా చేశారు.

**షేక్ రహమతుల్లా** : 1912 మే 9న ఒంగోలులో జననం. తండ్రి షేక్ ఇమాం సాహెబ్. యస్.యస్.యల్.సి వరకు చదువు. బస్సు యజమాని. 1934-35 ప్రాంతంలో విద్యార్థిగా ఢాకా విప్లవోద్యమం పట్ల ఆకర్షణ. 1936లో యువజన కాంగ్రెస్‌లో సభ్యత్వం స్వీకరణ. 1938లో కొత్తపట్నం నిషేధిత రాజకీయ తరగతుల శిబిరంలో పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా 1943లో జరిగిన ఒంగోలు బాబు కేసులో భాగస్వామి. ఇండియా డిఫెన్సు రూల్స్ క్రింద నిర్బంధం. 1943 మార్చి ఒకటి నుండి 1944 మార్చి 13వరకు వెల్లూరు, తంజావూరు జైళ్ళలో నిర్బంధం. 1938 నుండి ఇరవైఏండ్ల పాటు ఒంగోలు పురపాలక సంఘం సభ్యులు. 1936 నుండి ఆరు సంవత్సరాలు గుంటూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు. 1938-41 సంవత్సరాలలో గుంటూరు జిల్లా బోర్డు సభ్యులుగా బాధ్యతల నిర్వహణ. 1938 నుండి ఐదు సంవత్సరాల పాటు ఒంగోలు పట్టణ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు. జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులుగా పదహారు సంవత్సరాలు, సహకార అర్బన్ బ్యాంకు సంచాలకులుగా 14 సంవత్సరాలు బాధ్యతల నిర్వహణ. గుంటూరు జిల్లా రోడ్డు రవాణా అథారిటీ సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల సంఘం వర్కింగ్ కమిటి సభ్యులుగా చాలా కాలం బాధ్యతల నిర్వహణ.

## శ్రీకాకుళం జిల్లా

**అబ్దుల్ రజాఖ్ ఖాన్** : టెక్కలి తాలూకా కాశీబుగ్గ నివాసి. తండ్రి ఇనాయత్ ఖాన్. వ్యవసాయదారుడు. 1920 నాటి సహాయనిరాకరణ, 1930 నాటి శాసనోల్లంఘన ఉద్యమంలో భాగస్వామి. పలుమార్లు జైలుశిక్షకు గురయ్యారు. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1942 అక్టోబరు రెండు నుండి అలీపురం క్యాంపు జైలులో రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్షను అనుభవించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, జిల్లా స్థాయి కమిటీలలో పలు బాధ్యతల స్వీకరణ. ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా ఎంపికయ్యారు.

## విశాఖపట్నం జిల్లా

**అబ్దుల్ రహిమాన్ ఖాన్** : విశాఖపట్నం సమీప గ్రామనివాసి. సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్షకు గురయ్యారు.

**ముహమ్మద్ అబ్దుల్ రజాఖ్** : విశాఖపట్నం నివాసి. తండ్రి ముహమ్మద్ ఇషాఖ్. సహాయనిరాకరణ ఉద్యమంలో భాగస్వామి. 1922 ఫిబ్రవరి 10న నాలుగు మాసాల జైలు శిక్షకు గురయ్యారు. రాజమండ్రి కేంద్రకారాగారంలో నిర్బంధం.

**ఫరీదుజ్జమాన్ అలియాస్ విశాఖ గాంధీ** : ఆయన విశాఖ గాంధిగా సుప్రసిద్ధులు. ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమర యోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం -1) లో ఫరీదుజ్జమాన్ వివరాలు ఉన్నాయి.

## విజయనగరం జిల్లా

**షేక్ ఖాదర్ మొహియుద్దీన్** : విజయనగరం జిల్లా వేపాడ నివాసి. ఈ పుస్తకంలోని స్వాతంత్ర్య సమర యోధుల జీవిత రేఖాచిత్రాలు (అనుబంధం -1) లో షేక్ ఖాదర్ మొహియుద్దీన్ వివరాలు ఉన్నాయి.

## వరంగల్ జిల్లా

**అబ్బాస్ అలీ** : 1912లో జననం. జనగాం తాలూకా కడవెండి నివాసి. కార్మికుడు. ఇండియన్ యూనియన్‌లో నిజాం సంస్థానం విలీనం కోరుతూ సాగిన ఉద్యమంలో పాల్గొని 1947 డిసెంబరు 21 నుండి 1948 మార్చి 11వరకు హైదారాబాదు జైలులో నిర్బంధం.

**ముహమ్మద్ పాషు మియా** : మహబూబాబాద్ తాలూకా కొత్తపల్లి నివాసి. తండ్రి బందగీ సాహెబ్. కమ్యూనిస్టు. తెలంగాణలో సాగిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాలో భాగస్వామి. 1946 డిసెంబరు 10 నుండి 1948 డిసెంబరు మూడు వరకు హైదరాబాదు, నిజామాబాదు, ఔరంగాబాదు కారాగారాల్లో నిర్బంధం. 1973 ఆగస్టు 15న భారత ప్రభుత్వం ద్వారా తామ్రపత్రం బహూకరణ.

**నాసిర్ అహమ్మద్** : నరసంపేట తాలూకా రంగాపూరు నివాసి. తండ్రి సాహెబ్ అలీ. నిజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కోరుతూ సాగిన ఉద్యమంలో భాగస్వామి. వరంగల్ కేంద్రకారాగారంలో 1948 ఏప్రిల్ 22న నిర్బంధం. హైదరాబాదు లో పోలీసు చర్య ముగిశాక 1948 అక్టోబరు 22న విడుదల.

**నాసిర్ ముహమ్మద్** : వరంగల్ తాలూకా గన్నవరం నివాసి. తండ్రి షేక్ హుసైన్. నిజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కోరుతూ సాగిన ఉద్యమంలో భాగస్వామి. వరంగల్ కేంద్రకారాగారంలో 1948 మార్చి 13న నిర్బంధం. హైదరాబాదులో పోలీసు చర్య ముగిశాక 1948 అక్టోబరు 22న విడుదల.

## పశ్చిమ గోదావరి జిల్లా

**అబ్దుల్ మజీద్ ఖాన్** : 1919 సంవత్సరం కొవ్వూరు తాలూకా నిడదవోలులో

జననం. తండ్రి కరీం ఖాన్. మెట్రిక్యులేట్. వ్యవసాయదారుడు. క్విట్ ఇండియా ఉద్యమంలో భాగస్వామి. 1943 జనవరి 16న ఇండియన్ డిఫెన్స్ రూల్స్ క్రింద విచారణ జరిపి ఏడాదిన్నర కఠిన కారాగారం, వంద రూపాయల జరిమాన విధింపు. అలీపురం క్యాంపు జైలు, వెల్లస్లీ శానిటోరియం జైలు, బళ్ళారి జైళ్ళల్లో నిర్బంధం. చిన్నవయస్సులో జిల్లా బోర్డు సభ్యునిగా ఎంపిక. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు. కొవ్వూరు తాలూకా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి. జిల్లా కాంగ్రెస్ కమిటీ సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహణ.

**ముహమ్మద్ గౌస్ మొహిద్దీన్** : భీమవరం తాలూకా ఆకివీడు నివాసి. తండ్రి నూరుద్దీన్. మిల్లు కార్మికుడు. క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా 1942 ఆగస్టు 17న జరిగిన ఉద్యమ కార్యకలాపాలలో భాగస్వామి. 1943 సెప్టెంబరు 25న మూడు మాసాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు. ఆలీపూరం కేంద్రకారాగారంలో నిర్బంధం. 1945 నవంబరు 14న అడ్వైజరీ బోర్డు పథకం క్రింద విడుదల.

**ముహమ్మద్ హుసైన్** : 1914లో జననం. భీమవరం తాలూకా అకివీడు నివాసి. తండ్రి ముహమ్మద్ హమీద్. జట్కా డ్రైవర్. క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా 1942 ఆగస్టు 17న జరిగిన ఉద్యమ కార్యకలాపాలలో భాగస్వామి. 1944 ఫిబ్రవరి 17న మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, పది కొరడా దెబ్బలు విధిస్తూ న్యాయస్థానం తీర్పు. ఆలీపూరం కేంద్ర కారాగారంలో నిర్బంధం. 1844 ఆగస్టు ఎనిమిదిన కొరడా దెబ్బల శిక్ష అలీపురం జైలులో అమలు. 1945 మార్చి 30న విడుదల.

**నాసిర్ అహమ్మద్ షేక్** : తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటలో 1878 ఏప్రిల్ 27న జననం. తాడేపల్లిగూడెం నివాసి. తండ్రి షేక్ మౌలా సాహెబ్. కతకత్తాలోని నేషనల్ కాలేజీ ఆఫ్ ఫిజిషియన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా నుండి 1910లో వైద్యశాస్త్రంలో అర్హత సంపాదన. 1912-16లలో టర్కీ-బల్కాన్ యుద్ధంలో ఇండియన్ రెడ్‌క్రాస్ పక్షాన వైద్యసేవలు అందజేత. యూరప్‌లోని పలు దేశాలలో వివిధ గౌరవ పదవుల్లో నియామకం. బాధ్యతల నిర్వహణ. పలు ప్రసంశా పత్రాలు, అవార్డులు రివార్డుల సాధన. 1913లో టర్కీ సుల్తాన్‌చే బంగారు పతకం బహూకరణ ప్రకటన. ఆ పతకం స్వీకరించ వీలులేదని బ్రిటీష్ ప్రభుత్వం ఆక్షేపణ. ఆ కారణంగా 1918లో ప్రభుత్వ ఉద్యోగం నుండి రాజీనామా. స్వంతంగా ప్రాక్టీస్ ప్రారంభం. 1928లో పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా బాధ్యతల నిర్వహణ. ఉప్పు సత్యాగ్రహంలో భాగస్వామి. 1930 జూలై ఏడున ఆరుమాసాల కఠిన కారాగారవాస శిక్ష విధింపు. రాజమండ్రి కేంద్ర కారాగారంలో నిర్బంధం. మద్యపాన నిషేధం కోరుతూ, విదేశీ వస్తువుల విక్రయశాలల వద్ద సాగిన పికిటింగ్ కార్యకలాపాలలో

చురుకైన పాత్ర. అరెస్టులు నిర్బంధం. 1931లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యత్వం. 1936లో జిల్లా బోర్డు సభ్యత్వం. 1937లో కన్నుమూత.

**షేక్ అలీ సాహెబ్** ః 1915లో జననం. భీమవరం నివాసి. మహమ్మద్ యూనుస్. వ్యాపారం. వ్యక్తి సత్యాగ్రహంలో భాగస్వామి. లాఠీచార్జికి ఎరయ్యారు. 1941 జనవరి ఏడన నాలుగు మాసాల జైలుశిక్షకు గురయ్యారు. రాజమండ్రి కేంద్రకారాగారంలో నిర్బంధం. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. పోలీసుల దమనకాండలో గాయపడ్డారు. 1943 మే1న అలీపురం క్యాంపు జైలులో రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్షకు గురయ్యారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా 1946లో పలు బాధ్యతల నిర్వహణ.

**షేక్ ఫకీర్ మొహిద్దీన్** ః భీమవరం తాలూకా ఆకివీడు నివాసి. తండ్రి షేక్ శిలార్ సాహెబ్. క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా 1942 ఆగస్టు 17న భీమవరంలో జరిగిన ఉద్యమ కార్యక్రమాలలో చురుకైన పాత్ర. ఆ కారణంగా 1943 మే 24న ఏడాదిన్నర కఠిన కారాగార శిక్ష, ఎనిమిది కొరడా దెబ్బల శిక్ష విధింపు. 1943 డిసెంబరు తొమ్మిదిన అలీపురం క్యాంపు జైలులో కొరడా దెబ్బల శిక్ష అమలు. అలీపురం జైలులో శిక్ష అనుభవించారు.

**షేక్ మీరా సాహెబ్** ః 1918 జూన్ 15న తూర్పుగోదావరి జిల్లా అమలాపురం తాలూకా కొత్తలంకలో జననం. తాడేపల్లి గూడెం నివాసి. మెట్రిక్యులేట్. ఉపాధ్యాయ శిక్షణ ఉత్తీర్ణత. ఉపాధ్యాయుడు. కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. క్విట్ ఇండియా ఉద్యమంలో భాగస్వామి. 1944 సెప్టెంబరు 30న ఆరు మాసాల జైలుశిక్ష విధింపు. అలీపురం జైలులోశిక్ష అనుభవించారు. 1944 అక్టోబరు 27న అప్పీలులో కేసు కొట్టివేత. విడుదల. 1947 నుండి 1973 వరకు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలలో ఉపాధ్యాయునిగా పనిచేశారు.

**షేక్ పెద మస్తాన్** ః తాడేపల్లిగూడెం తాలూకా నవాబుపాలెం నివాసి. తండ్రి షేక్ ఖాశిం సాహెబ్. రైల్వేగేట్‌మన్‌గా ఉద్యోగం. క్విట్ ఇండియా ఉద్యమంలో భాగస్వామి. 1943 నవంబరు ఆరున రెండు సంవత్సరాల జైలు శిక్షకు గురయ్యారు. అలీపురం క్యాంపు జైలులో కఠిన కారాగార శిక్షను అనుభవించారు.

**షేక్ రహీం ఖాన్** ః తాడేపల్లి గూడెం తాలూకా నివాసి. క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా 1942 ఆగస్టు 18న పెంటపాడు పోస్టాఫీసు తగులబెట్టిన సంఘటనలో భాగస్వామి. పర్యవసానంగా పన్నెండు కొరడా దెబ్బల శిక్షకు గురయ్యారు.

**సయ్యద్ బషీర్ అహమ్మద్** : కొవ్వూరు తాలూకా నిడదవోలు నివాసి. తండ్రి సయ్యద్ హజ్రత్ షా. క్విట్ ఇండియా ఉద్యమంలో భాగస్వామి. 1942 ఆగస్టు 31న ఏడాది కఠిన కారాగార శిక్షకు గురయ్యారు. అలీపురం, సేలం జైళ్ళల్లో శిక్షను అనుభవించారు.

**సయ్యద్ దాదా సాహెబ్** : కొవ్వూరు తాలూకా కోరుమామిడి నివాసి. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1922 జనవరి 10న ఏడాది కఠిన కారాగారవాస శిక్ష విధింపు. రాజమండ్రి జైలు నుండి శిక్షాకాలానికి ముందుగా విడుదలయ్యారు.

◆◆◆

హిందూ-ముస్లింలకు ధర్మం, ఆత్మగౌరవం, ప్రాణం, ధనం అను నాలుగు అంశాలు ప్రధానం. ఈ అంశాలను కేవలం స్వదేశీ పాలనలో, స్వదేశీ పాలకులు మాత్రమే ప్రసాదించగలరు. కంపెనీ సైనికులు ప్రజలను దోచుకుంటున్నారు. ఆత్మగౌరవాన్ని మంట కలుపుతున్నారు. స్త్రీల మీద అఘాయిత్యాలు, అత్యాచారాలు జరుపుతున్నారు ... హిందూ-ముస్లిం పౌరులను హెచ్చరిస్తున్నాం. ఆత్మగౌరవంతో, ధర్మబద్ధంగా ప్రశాంత జీవితం సాగించాలంటే స్వదేశీ పాలన కోసం శతృవులకు వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టండి. స్వదేశీ సైన్యంలో భర్తీకండి ... మాతృదేశం కోసం సాగుతున్న పోరాటంలో భాగస్వాములు కండి. శతృవుకు సహకరించకండి, ఆశ్రయం ఇవ్వకండి.

**- బేగం హజరత్ మహల్**

# చివర్లో మీతో ఓ మాట !

**భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు** పుస్తకం కోసం సాగించిన సమాచార సేకరణలో నేను చవిచూసిన తీపి-చేదు అనుభవాలను పాఠకులతో పంచుకోవాలని 'చివర్లో మీతో ఓ మాట!' రాస్తున్నా. ఈ విషయాలను ఎవరి తప్పుల్ని ఎన్నడానికి గాని, మరెవరినో నిందించడానికి ఏమాత్రం కానేకాదని ముందుగా విన్నవించుకుంటున్నా.

చరిత్ర రచన చేయాలనుకున్న వ్యక్తులు ఎంతో ప్రయాసపడాల్సి వస్తుందన్న వాస్తవం ఇప్పటికే నాకు అనుభవంలో ఉన్నా, ఆ విషయాలను నా పుస్తకాలలో ఎక్కడా ఇంతవరకు ప్రస్తావించ లేదు. ఈ గ్రంథ రచన సమయంలో మాత్రం వ్యయంతో సంబంధం లేకుండా, నేను పడిన ప్రయాసను పాఠకులతో తప్పనిసరిగా పంచుకోవాలనుకున్నాను. ఆర్థికత వ్యక్తుల సంబంధ-బాంధవ్యాల కంటె మనిషి జీవితాన్ని ఎంతగా పెనవేసుకపోయి ఉంటుందో, ఆ బలిష్ట ఆర్థిక సంబంధాలు మానవ సంబంధాలను ఏవిధంగా ప్రభావితం చేస్తాయో ఈ సందర్భంగా నాకు అనుభవంలోకి వచ్చిన విషయాలను ఇక్కడ పేర్కొనదలిచాను.

ఈ గ్రంథలో నేను అందించిన జీవిత రేఖాచిత్రాలలోని స్వాతంత్ర్య సమరయోధుల వారసులలో కొందరి నుండి సమాచార సహకారం ఏమాత్రం లభించలేదు. స్వాతంత్ర్య సమర యోధులైన తమ తల్లితండ్రుల వివరాలు, ఫోటోలు అందించమని ఎన్నిసార్లు అర్థించినా, లేఖలు రాసినా, మరెన్నిసార్లు ఫోన్‌ల ద్వారా వేడుకున్నా సానుకూల ప్రతిస్పందన రాబట్ట లేకపోయాను. ఏదోఒక నెపం చెబుతూ తమ పెద్దల సమాచారం, చిత్రాలు, ఫోటోలు ఇవ్వకపోవడమే కాదు ఆ యోధులకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్నీ ఇవ్వలేదు.

ఈ విధంగా సహాయ నిరాకరణ చేసిన వారు వివిధ రకాలుగా ప్రవర్తించారు. ఒకరు తమ వద్ద చాలా సమాచారం ఉందని ఫోన్స్ చేసినప్పుడల్లా చెబుతూ, అదిగో పంపిస్తున్నాం ... ఇదిగో పంపిస్తున్నాం అంటూ చివరకు సమాచారం అందివ్వలేదు. మరికొందరు తమ పెద్దలు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారని తెలిసినా కూడా అదేమంత ఘనకార్యం కాదంటూ మిన్నకుండి పోయారు. సమాచారం ఉన్నా కూడా '**మీరు అంతకు ముందు రాసింది చాలు. ఆయనగారి గురించి ఇంకా రాయాల్సిన అవసరం లేదు**' అని వ్యాఖ్యానిస్తూ ఇంకొందరు సరిపెట్టారు.

ఈ మేరకు విముఖత వ్యక్తం చేసినవారిలో ఏమీ చదువుకోని, పేదవర్గాల వ్యక్తులతోపాటు బాగా స్థితిమంతులు, మంచి చదువులు చదువుకున్నవారు, ఉన్నత

ఉద్యోగాలు, మంచి పదవులలో ఉన్నవారు, తల్లితండ్రులు సమకూర్చిపెట్టిన సంపదను అనుభవిస్తున్న వారు కూడా సహాయనిరాకరణ చేసినవారిలో ఉండడం విశేషం.

ఈ క్రమంలో విజయవాడకు చెందిన ఒక ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వదలి వెళ్ళిన కోట్లాది రూపాయల విలువగల ఆస్తిని అనుభవిస్తున్న కుమారుడొకరు తన తండ్రి గురించి ఎటువంటి సమాచారం తనవద్ద లేదన్నారు. తండ్రి మరణించిన సంవత్సరం చెప్పమన్నా తెలియదని పెద్దగా నవ్వి, ఆయన వద్దకు నన్ను తీసుకవెళ్ళిన నా సన్మిత్రులు విజయవాడ నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ముహమ్మద్ అబ్దుల్ రహమాన్‌న్నూ, నన్నూ ఇక వెళ్ళమన్నటు దారి చూపారు. ఆయన తండ్రి సమాచారం కోరుతూ గతంలో ఉత్తరాలు రాసి...రాసి, ఫోన్లు చేసి...చేసి అలసిపోయి ఉన్న నాకు డాక్టర్ ఎం.ఎ. రహమాన్ ద్వారా ఆయనను కలుసుకునే అవకాశం లభించింది. ఆ అవకాశాన్ని వినియోగించుకుని స్వాతంత్ర్యసమరయోధులైన ఆయన తండ్రి వివరాలు రాబట్టవచ్చన్న ఆశతో నేను నివాసం ఉంటున్న వినుకొండ నుండి విజయవాడకు రానూపోనూ ఏడు గంటల సమయం వ్యయం చేసి మరీ ఆయన దర్శనం చేసుకున్నాను. స్వాతంత్ర్య సమరయోధులైన ఆయన తండ్రి జన్మించిన, మరణించిన సంవత్సరాలు, ఆయన తాతయ్య నానమ్మల పేర్లుగాని, ఇతర వివరాలను కూడా ఆయన నుండి రాబట్టడంలో విఫలమయ్యాను.

ఆ తరువాత ఆ స్వాతంత్ర్యసమరయోధుని జనన-మరణ వివరాలు విజయవాడ లోని ఆయన సమాధి వద్ద ఏర్పరచిన శిలాఫలకం మీద రాసి ఉన్నాయని మరో పెద్దాయన చెప్పగా నా మిత్రులు, సీనియర్ జర్నలిస్టు మహమ్మద్ షఫీ అహమ్మద్ (విజయవాడ), నేనూ కలసి విజయవాడ భవానిపురంలోని గాలిబ్‌షా వలి దర్గా వద్దకు వెళ్ళాము. ఆ దర్గా ప్రాంతాన్ని అదనపు నిర్మాణాల కోసం సాగిన పనులలో ఆ సమరయోధుని సమాధిని కూలద్రోయడం జరిగిందని దర్గా నిర్వాహకులు చెప్పారు. ఆ రాళ్ళల్లో కించిత్తు సమాచారమైనా అందుతుందేమోన్న ఆశతో వెతికినా మాకు నిరాశ మిగిలింది. ఆ కారణంగా అక్కడ కూడా సమాచారం కోసం సాగిన నా ప్రయత్నం ఏమాత్రం ఫలించలేదు.

ఈ క్రమంలో మరొక స్వాతంత్ర్య సమరయోధుని వివరాల కోసం విశాఖపట్నం వెళ్ళాను. అతి కష్టం మీద స్వాతంత్ర్యసమరయోధుల కుటుంబీకులు ఉంటున్న గృహాన్ని వెతుక్కుంటూ నేను నా మిత్రుడు ముహమ్మద్ ఫశీయుద్దీన్ (విశాఖపట్నం) వెళ్ళాం. ఆ ఇంటికి వెళ్ళి నేను ఎందుకు వచ్చానో వారికి వివరిస్తుండగానే స్వాతంత్ర్య సమర యోధుడైన తమ పూర్వీకుడ్ని ఆయన కుటుంబీకులు శాపనార్థాలు పెట్టడం ఆరంభించారు. ఆయన సంపాదించిన ఆస్తిని ఆయన స్వాతంత్ర్యోద్యమంలో ఖర్చుచేసేశారట! ఆ పెద్దాయన తమకు కావాల్సినంత మిగిల్చి వెళ్ళలేదట! ఆ పెద్దాయన వలన దేశానికి ఏమైనా మేలు జరిగిందేమో

కాని ఆయన కుటుంబీకులకు ఎటువంటి ఉపయోగం గానీ మరెటువంటి ప్రయోజనం గాని కలుగలేదట!! అది ఆయన పట్ల వారి అసహనానికి, ఆగ్రహానికి కారణం.

ఆ స్వాతంత్ర్య సమరయోధుని పేరుప్రతిష్టలు తమకు ఉద్యోగాలు, ఉపాధి సంపాదించడానికి ఏమాత్రం ఉపయోగపడకున్నప్పుడు ఆయన ఘన చరిత్ర రాయడం వలన మాకేంటి ప్రయోజనం అంటూ మరికొందరు తమ పెద్దాయన వివరాలు తెలపడానికి తిరస్కరించారు. ఆ కారణంగా తమ పెద్దల మీద ఉన్న ఆగ్రహాన్ని తిరస్కార బాణాలుగా మార్చి నా మీద నేరుగా ప్రయోగించారు. నేను ఓపికతో ఎంతగా నచ్చచెప్పే ప్రయత్నం చేసినా ఆ యోధుని గురించి రాయాల్సినంతగా ఏమీ లేదని సలహాలిచ్చి, ఇక వెళ్ళమంటూ దారి చూపారు. అప్పటికి మిన్నకుండిపోయిన నేను రెండవరోజున మళ్ళీ వారి గడప తొక్కాను. ఈసారి ఏమనుకున్నారో ఏమోగాని నా మొర ఆలకించారు. నాతో సానుకూలంగా మాట్లాడుతూనే ఆ యోధుని పట్ల నిరసన వ్యక్తం చేస్తూనే వచ్చారు. చివరకు ఆయన వివరాలు, ఫోటోలు, సమాచారం అందించి సహకరించి ఆనందింపచేశారు.

స్వాతంత్ర్యసమరయోధుల కుటుంబీకుల గృహాలకు వెళ్ళి వారి పూర్వీకులైన స్వాతంత్ర్య సమరయోధుని పేర్లు ప్రస్తావించగానే, నా నుండి ఏదో ప్రయోజనాన్ని ఆశించిన కుటుంబీకులు తొలుత నా పట్ల గౌరవ-మర్యాదలు చూపడం, ఆ తరువాత వారి ఆలోచనలకు, అంచనాలకు భిన్నంగా, ఆ యోధుని కుటుంబీకులకు ఉద్యోగాలు, ఉపాధి, ఇండ్ల స్థలాలు లాంటివి ఇప్పించడానికి నేను రాలేదని, అది నాకు సాధ్యమయ్యే పని కూడా కాదని స్పష్టం చేయగానే, **మా కష్టసుఖాలకు పరిష్కారం చూపలేని మీరు మా వద్దకు ఎందుకు వచ్చినట్టూ?** అంటూ ముఖం మీదనే అడగడం లాంటి చేదు అనుభవాలు ఉన్నాయి. స్వాతంత్ర్య సమరయోధులైన వారి పూర్వీకుల చరిత్రను రాయడానికి కావాల్సిన సమాచారం సేకరించుకోడానికి మాత్రమే నేను వచ్చానని, వారి ప్రశ్నల వర్షానికి ఎంతో శాంతంగా, ఓపిగ్గా సమాధానమివ్వగానే నా అభ్యర్థన పట్ల తీవ్ర అనాసక్తి చూపుతూ, మూతి విరుపులతో తమ వద్ద ఎటువంటి వివరాలు లేవంటూ నాచుట్టూ చేరిన వారంతా క్షణాల్లో నిష్క్రమించిన బాధాకర సంఘటనలు నా అనుభవంలోకి వచ్చాయి.

ఈలాంటి చేదు అనుభవాలు ఎలా ఉన్నా, ఎన్ని ఉన్నా నా ప్రయత్నాలకు చాలా మంది ఎంతో సంతోషంగా సహకరించారు. ఈ ప్రయత్నం ఎన్నడో జరగాల్సిందన్నారు. ఈ నాటికైనా ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నందుకు నన్ను అభినందిస్తూ మరింతగా ప్రోత్సహించారు. నేను కోరిన సమాచారాన్ని, చిత్రాలను, పాత ఫోటోలను, అలనాటి పత్రికలలో వచ్చిన ఆర్టికల్స్ గురించి గుర్తుకు తెచ్చుకుని వెతికి, వెతికి మరీ తీసిచ్చారు. స్వాతంత్ర్యసమర యోధుల మీద పలువురు రచయితలు రాసిన పుస్తకాలను, వారి మీద ప్రచురితమైన

సావనీర్లను, వారి ఉత్తర ప్రత్యుత్తరాల దొంతరను, పూర్వీకులకు సంబంధించి తమకు తెలిసినంత సమాచారాన్ని నాకు అందుబాటులో ఉంచారు.

స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాల సేకరణలో నాకు ఆ యోధుల కుటుంబీకులు ఎంతో సహకారం అందించారు. ఎక్కడో పడేసి ఉన్న చిత్రాలను, ఫోటోలను వెతికి వెతికి మరీ తీసిచ్చారు. అస్పష్టంగా ఉన్న ఆ ఫోటోల ఆధారం చేసుకుని వినుకొండకు చెందిన ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ చేత పెన్సిల్ స్కెచ్స్‌ను గీయించాను. ఆ విధంగా గీయించిన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను వారి సంబంధీకులకు పంపాను. ఆ చిత్రాలను నిశితంగా పరిశీలించి అవన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో నాకు తెలుపుతూ, మార్పులు చేర్పులు సూచిస్తూ మరి కొందరు బాగా సహాయపడ్డారు.

ఈ సమాచార సేకరణ ప్రయత్నంలో నాకు చేదు అనుభవాలు మాత్రమే కాదు చాలా మంచి అనుభవాలు ఎదురయ్యాయి. నేను ఎటువంటి వ్యయప్రయాలకు గురికాకుండా, నాకు ఎటువంటి కష్టం కలుగుకుండా అత్యంత సునాయాసంగా, చాలా మంచి సమాచారాన్ని రాబట్టిన సంఘటనలూ ఉన్నాయి. ఈ విషయంలో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు సయ్యద్ అబ్దుల్ అజీం వివరాల కోసం ఆయనకు ఉత్తరం రాయగా పూర్తి వివరాలతో ఆనాడు నేను నివాసం ఉంటున్న పోలకంపాడులోని నా గృహానికి మండుటెండలో ఆయన స్వయంగా వచ్చి సమాచారం అందించారు.

ఆ సమాచారంతో 2001లో నేను తెచ్చిన **'భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు'** (ప్రథమ ముద్రణ)లో ఆయన గురించి పేర్కొన్నాను. ఆ తరువాత ఆ పుస్తకాన్ని నేను స్వయంగా తీసుకెళ్ళి అబ్దుల్ అజీంగారికి అందచేశాను. ఆ పుస్తకం, దాని కవర్ పేజి మీద ఇతరులతో పాటు ఉన్న ఆయన చిత్రం, లోపల ఆయన గురించి రాసిన వ్యాసం చూసుకుని, దాన్ని పూర్తిగా చదివి కన్నీళ్ళ పర్యంతమయ్యారు. అనారోగ్యంతో మంచం పట్టి, మృత్యువుకు చేరువవుతున్న ఆయన ఆ పుస్తకాన్ని తనను పరామర్శించడానికి వచ్చిన ప్రతివారికి చూపెట్టుకుని సంతోషిస్తూ, మరో వారం రోజుల్లో కన్నుమూశారు. ఆ విధంగా ఒక స్వాతంత్ర్య సమరయోధులు తన చివరి రోజులను ఎంతో గర్వంగా, సంతోషంగా గడపడానికి నా పుస్తకం ఉపయోగపడినందుకు నాకు బాధతో కూడిన ఆనందం కల్గింది.

నేను అమితాశ్చర్యానికి గురైన మరో సంఘటన గురించి మీకు చెప్పాలి. ఆజాద్ హింద్ ఫౌజ్‌లో పనిచేసిన షేక్ ఖాదర్ మొహియుద్దీన్ (వేపాడు, విజయనగరం జిల్లా) గురించి నాకు అందుబాటులోకి వచ్చిన సమాచారం మేరకు ఆర్టికల్ తయారుచేశా. ఆ వివరాలు సమగ్రంగా లేనందున, ఆ తరువాత మరిన్ని వివరాలు దొరుకుతాయేమోనని Whom so ever it may concern అన్నట్టుగా ఖాదర్ గారి పేరిట ఆయన స్వగ్రామానికి ఒక

పోస్టుకార్డు రాశాను. ఆ కార్డుతోపాటుగా రిప్లయికార్డు కూడా జోడించాను. ఆ కార్డును చూసి స్పందించిన ఖాదర్ గారి కుమారుడు అబ్దుల్ రహిమాన్ (వేపాడు, విజయనగరం జిల్లా) 2009 నవంబరు 11న నాకు ఫోన్ చేశారు. మీ నాన్న గురించి మరిన్ని వివరాలు కావాలని అడగ్గానే **మా నాన్నగారు ఇక్కడే ఉన్నారు మాట్లాడండి** అంటూ షేక్ ఖాదర్ గారికి ఫోన్ ఇచ్చారు. ఆజాద్ హింద్ ఫౌజ్ యోధులు ఖాదర్ మొహియుద్దీన్ గారు **హలో** లైన్‌లోకి వచ్చి నేరుగా నాతో మాట్లాడడం ఆరంభించేసరికి అమితానందభరితుడనయ్యాను. నా కోర్కెను వెల్లడించగానే నా ప్రయత్నాన్ని అభినందిస్తూ తన వివరాలు ఫోన్‌లో తెలపడం మాత్రమే కాకుండా తన పూర్తి జీవిత వివరాలను తన బిడ్డచేత రాయించి, ఆనాటి, ఈనాటి ఫోటోలను, తగిన డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలను కూడా నాకు పంపించారు. ఆ తరువాత చాలాసార్లు నాతో మాట్లాడుతూ చాలా వివరాలు తెలిపారు. ఆ విధంగా లభించిన అదనపు సమాచారంతో తొలుత ఆయన గురించి నేను రాసుకున్న ఆర్టికల్‌ను పూర్తిగా తిరగరాశాను.

ఈ క్రమంలో అజాద్ హింద్ ఫౌజ్‌లో ప్రధాన పాత్ర వహించిన అబిద్ హసన్ సఫ్రాని వివరాలు కూడా ఆయన సోదరులు, స్వాతంత్ర్యసమరయోధులు బద్రుల్ హసన్ కుమార్తె సురయ్యా హసన్ (హైదరాబాద్) అందచేశారు. ఆమె సహకారం వలన మహాత్మా గాంధికి అత్యంత సన్నిహితులైన ఆమె తండ్రి బద్రుల్ హసన్ గురించి, ఆయన తల్లి ప్రముఖ జాతీయోద్యమకారిణి ఫక్రుల్ హాజియా హసన్ సమాచారం కూడా లభించడం మాత్రమే కాకుండా బద్రుల్ హసన్ ఫోటో నాకు లభించింది.

అబిద్ హసన్ సఫ్రాని మేనల్లుడు, హైదరాబాద్ విద్యార్థి ఉద్యమ నాయకుడి స్థాయి నుండి కమ్యూనిస్టు పార్టీ (సింధ్-పాకిస్తాన్) ప్రధానకార్యదర్శి స్థాయికి ఎదిగి, పాకిస్థాన్ మిలటరీ పాలకుల కుట్రకు బలైన సయ్యద్ నాసిర్ హసన్ వివరాలు ప్రముఖ కవి, రచయిత దివికుమార్ (విజయవాడ) ద్వారా తెలిశాయి. ఈ విద్యార్థి ఉద్యమనేత వివరాలను దివికుమార్ తన పాకిస్తాన్ పర్యటన సందర్భంగా సేకరించారు. ఆ సమాచారాన్ని ఆయన నాతో పంచుకుని సయ్యద్ నాసిర్ హసన్ చిత్రాన్ని కూడా అందించి సహాయపడ్డారు.

ఈ విధంగా '**భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు**' సుమారు నాలుగు వందల పేజీలతో రూపు దిద్దుకోవడంలో నాకు ఎంతగానో సహకరించిన, అలాగే సహాయ నిరాకరణ చేసి నా పట్టుదలను మరింతగా పెంచిన ప్రతి ఒక్కరికి, ప్రధానంగా స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులకు, ఈ కార్యక్రమంలో నాకు ఎంతగానో సహకరించిన, సహాయమందించిన సన్మిత్రులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు.

**- సయ్యద్ నశీర్ అహమ్మద్.**

# ధన్యవాదాలు

**భా**రత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్రను వివరిస్తూ రూపొందిస్తున్న గ్రంథాల కోసం గత రెండు దశాబ్దాలుగా సాగుతున్న సమాచార సేకరణలో నాకు తగిన సలహాలిచ్చి, శ్రమ అనుకోకుండా సమాచారం అందచేసి, అవసరమగు చిత్రాలు, ఫోటోల సేకరణలో సహకరించి నా ఇతర గ్రంథాలతోపాటుగా ప్రస్తుత **భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు** గ్రంథ రచనలో ప్రత్యక్షంగానూ, పరోక్షం గాను తోడ్పడిన ...

**స్వాతంత్ర్యసమరయోధులు :**

వావిలాల గోపాలకృష్ణయ్య (గుంటూరు), జి. సంపత్‌కుమారాచార్య (గుంటూరు), కోదాటి నారాయణరావు (హైదరాబాదు), సయ్యద్ అబ్దుల్ అజీం (తెనాలి), మున్షీ ముహమ్మద్ మస్తాన్ (తెనాలి), గుత్తా రాధాకృష్ణ (మద్రాసు), హీరాలాల్ మోరియా (ఖమ్మం) యం.యస్ రాజలింగం (హైదరాబాద్), దరువూరి వీరయ్య (గుంటూరు), పరకాల పట్టాభిరామారావు (విజయవాడ), మద్దూరి విశ్వనాధం (నరసరావుపేట), ఏటుకూరి కృష్ణమూర్తి (హైదరాబాద్), కాటం లక్ష్మీనారాయణ (హైదరాబాద్), వూరే కోటేశ్వరరావు (మంగళగిరి), మేళ్ళచెర్వు ఆంజనేయశాస్త్రి అలియాస్ కరాచి (నరస రావుపేట), అవుతు సుబ్బారెడ్డి (తెనాలి), సయ్యద్ ఇబ్రహీం ఫిక్రి (న్యూఢిల్లీ), యం. యల్.నరసింహరావు (హైదరాబాద్), షేక్ ఖాదర్ మొహియుద్దీన్ (వేపాడ, విజయ నగరం జిల్లా), షేక్ మౌలా సాహెబ్ (పరిటాల, కృష్ణా జిల్లా)

**స్వాతంత్ర్యసమరయోధుల కుటుంబీకులు :**

సురయ్యా హసన్ (బద్రుల్ హసన్ కుమార్తె, హైదరాబాదు), యం.డి నఫీజుద్దీన్ (ఖద్దర్ ఇస్మాయిల్ కుమారులు, తెనాలి), డాక్టర్ ఉమర్ అలీషా (ఉమర్ అలీషా మనుమలు, పిఠాపురం), ఉమర్ అలీషా, మొహిద్దీన్ బాషా (ఉమర్ అలీషా మనుమలు, విశాఖపట్నం), కుమారి షెహనాజ్ బేగం (విశాఖగాంధీ మనుమరాలు, విశాఖపట్నం), నసీమా బేగం (మొహిద్దీన్ సాహెబ్ కుమార్తె, నరసరావుపేట), ఇంతియాజ్ అహమ్మద్ (గులాం మొహిద్దీన్ కుమారుడు, హైదరాబాద్), మీర్జా సఫ్దర్ బేగ్ (మీర్జా మహబూబ్ బేగ్ మునిమనుమడు, మార్కాపురం), షేక్ మహబూబ్ ఆజం (షేక్ మహబూబ్ ఆదం కుమారులు, విజయవాడ)

**చరిత్రోపన్యాసకులు :**

ప్రొఫెసర్ షంషుల్ ఇస్లాం (ఢిల్లీ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ), ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ (సెంట్రల్ యూనివర్శిటీ, హైదరాబాద్), ప్రొఫెసర్ ఇంతియాజ్ అహమ్మద్

(జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ), ప్రొఫెసర్ ముషిరుల్ హసన్ (జామియా మిలియా ఇస్లామియా, న్యూఢిల్లీ) ప్రొఫెసర్ గంగాధర్, ప్రొఫెసర్ కె.సూర్య నారాయణ, ప్రొఫెసర్ సయ్యద్ మహమ్మద్ ఇక్బాల్ (ఆంధ్ర విశ్వవిద్యాలయం), డాక్టర్ జి. గోపాలస్వామి (అత్తిలి), మహబూబ్ బాషా (అంబేద్కర్ విశ్వవిద్యాలయం, లక్నో), ప్రొఫెసర్ షాన్ ముహమ్మద్, ప్రొఫెసర్ ఇక్బాల్. ఎ.అన్సారి, ప్రొఫెసర్ జఫ్రుల్ ఇస్లాం (అలీఘర్ విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ యం.ఎ.మక్కి (జంషడ్‌పూర్ విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ పి.రామలక్ష్మి (ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ జి.సాంబశివా రెడ్డి (వేమన విశ్వవిద్యాలయం), డాక్టర్ ఇనుకొండ తిరుమలి (ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ), ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ (ఉస్మానియా విశ్వవిద్యాలయం)

**ప్రముఖ రచయితలు :**

డాక్టర్ రఫీక్ జకారియా, డాక్టర్ అస్గర్ అలీ ఇంజనీర్ (ముంబాయి), అనిల్ నౌరియా (న్యూఢిల్లీ), కెప్టన్ యస్.యస్.యాదవ్ (న్యూఢిల్లీ), డాక్టర్ అబెదా సమీయుద్దీన్ (అలీఘర్), డాక్టర్ వెలగా వెంకటప్పయ్య (తెనాలి), దివికుమార్ (విజయవాడ), ఇంగువ మల్లికార్జున శర్మ (హైదరాబాద్), మాదిరాజు గోవర్ధనరావు (మంగళగిరి), సయ్యద్ ఖుర్షీద్ (మహబూబాబాద్), డాక్టర్ జరీనా పర్వీన్ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్కివ్స్, హైదరా బాద్), కత్తి పద్మారావు (పొన్నూరు), డి. నటరాజ్ (విశాఖపట్నం), సయ్యద్ షాబుద్దీన్ (ముస్లిం ఇండియా, న్యూఢిల్లీ), ప్రొఫెసర్ యస్.దివాన్ (తమిళనాడు)

**పాత్రికేయ మిత్రులు :**

అబ్దుల్ వాహెద్ (హైదరాబాద్), మహమ్మద్ షఫీ అహమ్మద్, లంకా వెంకట రమణ, హబీబుర్ రెహమాన్ (విజయవాడ), అల్లా బక్ష్ (బాపట్ల), ఈదర గోపీచంద్ (నరసరావు పేట), యఫ్.యం.సలీం (హైదరాబాద్)

**సన్మిత్రులు :**

డాక్టర్ యం.ఎ. రెహమాన్ (విజయవాడ), ముహమ్మద్ ఫశీవుద్దీన్ (విశాఖపట్నం), షేక్ మదార్ సాహెబ్ (కుర్నవల్లి, ఖమ్మం జిల్లా), టి.థామస్ రెడ్డి (ముంబాయి), యస్.యం. బాషా (అనంతపురం), షేక్ బాషా మొహిద్దీన్ (హైదరాబాద్), షేక్ లతీఫ్ కుట్టీ (నెల్లూరు), ఎం.ఏ సాలార్ (వినుకొండ) ఇంకా ఎందరో ... అందరికీ

**నా హృదయపూర్వక ధన్యవాదాలు.**

**- సయ్యద్ నశీర్ అహమ్మద్.**



# ఆధార గ్రంథాలు - పత్రికలు

## ఆంగ్ల గ్రంథాలు :


01. Muslims In India, Volumes I and II, Naresh Kumar Jain, Manohar, New Delhi, 1979.
02. Freedom Movement and Indian Muslims, Santimoy Ray, PPH,NewDelhi, 1983.
03. Who is who Indian Martyrs, Volumes I, II, and III, Dr. PN Chopra, Govt. of India Publications
04. Souvenir, Indian Institute of Objective Studies, New Delhi, 1978.
05. Freedom Movement In India, Volumes I, II, and III, Dr. Tara Chand,Govt. of India Publications, New Delhi, 1992.
06. Bharatha Swathantrodyamam: Muslimlu, Syed Naseer Ahamed, Azad House of Publications, Hyderabad, 1999.
07. Encyclopedia of Muslim Biography, Volumes I, II, III, IV and V, Nagendra Kumar Singh APHPC, New Delhi, 2001.
08. Muslims and India's Freedom Movement, Dr. Shan Muhammad, IOS, New Delhi, 2002
09. Struggle for Freedom, RC Majumdar, BVB, Bombay, 1969.
10. Who is who of Freedom Struggle in Andhra Pradesh, Volumes I, II,and III, Ed.by Prof. Sarojini Regani, Govt. of AP Publications, Hyderabd.1978
11. Brief History of Andhra Pradesh, Ed. by Mohd.Abdul Waheed Khan, State Ar chives, Govt. of AP, Hyderabd, 1972.
12. The Freedom Struggle in Hyderabad, Volumes I,II, III, and IV, Govt.of AP, Hyderabad, 1956.
13. The Freedom Struggle in Andhra Pradesh (Andhra), Volumes I, II, III, IV, Govt. of AP, Hyderabad, 1997.
14. Highlights of the Freedom Movement in Andhra Pradesh, Dr. Sarojini Regani, The Ministry of Cultural Affairs, Govt. of AP, Hyderabd,1972.
15. Forgotten Warriors of Indian War of Independence 1941-1946, Indian National Army, (3 Vol.), Edited by Capt. SS Yadav, Hope India Publications, Gurgaom, 2005.
16. The History of the Indian National Congress, Bogharaju Pattabhi Seetharamaiah, Madras, 1935.
17. History of The Deccan ( Two Volumes), J D E Gribble, Mittal Publications, New Delhi, 1990.
18. From Plassey to Partition, Sekhar Bandyopadhyay, Orient Longman,New Delhi, 2004.
19. Heroic Telangana, Ravi Narayana Reddy, Communist Party Publication, New Delhi, 1973.

20. History of Modern Andhra, PR Rao, Sterling Publishers, Bangalore, 1984.
21. Secluded Scholars, Gail Minault,OUP, New Delhi,1999.
22. Women Pioneers, Ed. By Sushila Nayar & Kamala Mankekar, NBT,India, 2002.
23. The Legend Makers : Some Eminent Muslim Women of India, Gouri Srivastava, Concept Publishing Company, New Delhi, 2003.
24. Eighteen Fifty Seven, Dr.Surendranath Sen, Govt. of India Publications, New Delhi, 1957.
25. Telangana Peoples Struggle and its Lessons, P.Sundaraiah, Foundations Books, New Delhi.
26. In Retrospect, 5 Volumes, Inguva Mallikarjuna Sarma, Ravi Sasi Enterprises, Hyderabd, 2000-2003.
27. My Adventures with the I.N.A, K.R.Palta, Lion Press, Lahore, 1946.
28. Freedom Movement in Hyderabad, Veldurthi Manik Rao, Govt. of India Publications, New Delhi, 1989.
29. A Study of the History and Culture of the Andhras, Volume I and II, K.Sathyanarayana, PPH, New Delhi, 1982
30. India's Struggle for Freedom, PN Chopra, Govt. of India Publications, New Delhi, 2004
31. Dr. Zakir Husain, M.Mujeeb, National Book Trust, India, 1991
32. India Wins Freedom - Maulana Abul Kalam Azad, Orient Longman 1995, Delhi.
33. Muslims and India's Freedom Movement, Dr. Shan Muhammad, IOS, New Delhi, 2002.
34. Collected Works of Mahathama Gandhi, (Different Volumes) Publication Division, Govt. of India, New Delhi.
35. Encyclopedia of Women Biography, 3 Volumes, Edited By Nagendra.K.Singh, APH Publishing Corporation, New Delhi 2001.
36. Zakir Husain (Life and Thoughts), KRP Singh, National Council of Educational Research and Training, New Delhi, 1990.
37. Freedom Struggle, Bipin Chandra, NBT, New Delhi,1994.
38. Understanding The Muslim Mind, Rajmohan Gandhi, Penguin Books, New Delhi, 1987.
39. Towards Freedom 1937-47, (Volumes) Ed. by Dr. PN Chopra, Indian Council of Historical Research, New Delhi, 1985
40. Freedom's Battle, Mahathma Gandhi, Ganesh & Co. Madras,1921
41. The Saga of Hyderabad Liberation Struggle in India's Freedom Movement, VH Desai&Sudrdar Shan, Swami Ramanada Tirtha Memorial Trust, Hyderabad, 2002
42. Indian National Congress Delegates Directory, 1956

## ఆంగ్ల పత్రికలు :

01. The llustrated Weekly of Pakisthan, 11 My, 1969
02. Aman, Ed. by Dr. Asghar Ali Engineer, Aug. 1994
03. Indian Express, Daily, Vijayawada,13-8-1995.
04. Radiance, Views Weekly, 31Aug.- 6.Sept, 2003 Special, Delhi
05. Deccan Chronicle, Daily, Vijayawada, 01-10-2006.
06. Vishaka Times, Volume :2, Issue No: 1, 1972
07. The Hindu, 14-10-2002
08. Outlook, July 3, 2006
09. Ithhas, (The Journal of AP State Archives and Research Institute, Hyderabad)
10. Andhra Pradesh History Congress Proceedings (Volumes 1 to 30), Andhra Pradesh History Congress, Andhra Pradesh.

## వెబ్‌సైట్స్ ః

01. http://.hinduonett
02. http://.en.wikipedia.org
03. http://jmi.nic.in

## తెలుగు గ్రంథాలు ః

01. ఆంధ్రప్రదేశ్ అవతరణ సంచిక, సంపాదకులు ఈదర వేంకట్రావు, ఈదర వేంకట్రామయ్య, వేంకట్రామ అండ్ కో, విజయవాడ, 1956.
02. ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్యోద్యమం చరిత్ర, కాటం రమేష్, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 1992
03. హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, వెల్దుర్తి మాణిక్యరావు, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్,1984
04. రాయలసీమ స్వాతంత్ర్య సమర చరిత్ర, సి.హెచ్. ఆచార్య, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 2005
05. ఉత్తరాంధ్ర స్వాతంత్ర్య సమర చరిత్ర, సి.హెచ్. ఆచార్య, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 2005
06. హైదరాబాద్ అజ్ఞాత చరిత్ర పుటలు, అనువాదం ః నిఖిలేశ్వర్, నవభారతి, విజయవాడ, 1979.
07. మన్యంలో విప్లవం (అల్లూరి సీతారామరాజు) పొన్నలూరి రాధాకృష్టమూర్తి, ప్రజా ప్రచురణలు, ఏలూరు, 1975.
08. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర, కృష్ణాజిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం, విజయవాడ, 1984
09. విజయవాడ వీధుల కథలు, లంకా వెంకట రమణ, విజయవాడ, 2000
10. తెలంగాణా పోరాటంలో స్త్రీల వీరోచిత పాత్ర, పుచ్చలపల్లి సుందరయ్య, ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాదు, 1999.
11. స్వతంత్ర భారత స్వర్ణోత్సవ సావనీర్–రాయలసీమలో స్వాతంత్ర్యోద్యమం, స్వతంత్ర భారత స్వర్ణోత్సవ సావనీరు కమిటి, అనంతపురం, 1998.
12. పశ్చిమగోదావరి జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, మంగళంపల్లి చంద్రశేఖర్, 1992.
13. ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ, సంః కొడాలి ఆంజనేయులు, తెలుగు అకాడమీ, హైదరాబాదు, 1978.
14. భారత స్వాతంత్ర్యోద్యమం ః ముస్లింలు, సయ్యద్ నశీర్ అహమ్మద్, ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, 1999.

15. భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం మహిళలు, సయ్యద్ నశీర్ అహమ్మద్, ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, 2003.
16. నాజీవిత కథ (నవ్యాంధ్రము), అయ్యదేవర కాళేశ్వరరావు, ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ, 1959.
17. కృష్ణా జిల్లా స్వాతంత్ర్య పోరాట చరిత్ర, సంః కలపాల సూర్యప్రకాశరావు, కృష్ణా జిల్లా కాంగ్రెసు సంఘం, మచిలీపట్నం, 1976.
18. ఆంధ్ర కాంగ్రెసు సంగ్రహ చరిత్ర, గుడివాడ జయరాం, గుంటూరు, 1987.
19. 1857 తెలుగునాట తిరుగుబాటు, డాక్టర్ కె.మహాంకాళి, నవయుగభారతి ప్రచురణలు, భాగ్యనగర్, 2001.
20. స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టు దేశభక్తులు, సంపాదకులు : పరకాల పట్టాభి రామారావు, విశాలాంధ్ర, విజయవాడ, 2000.
21. స్వాతంత్ర్య సమర చరిత్ర, ముక్కామల నాగభూషణం, విజయవాడ, 1990
22. ఆంధ్రోద్యమ చరిత్ర, మాదల వీరభద్రరావు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్, హైదరాబాదు, 2005.
23. ఆంధ్రలో స్వాతంత్ర్యసమరము, ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య, సాంస్కృతిక వ్యవహారిక శాఖ, ఆం.ప్ర, హైదరాబాదు,1972
24. స్వాతంత్ర్య సమర నిర్మాతలు, జి.వెంకట రామారావు, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాదు,1994
25. ఆంధ్రరాష్ట్రావతరణం పూర్వాపరాలు, దేవరపల్లి మస్తాన్‌రావు, పురోగామి ప్రచురణలు, పొన్నూరు, 1999.
26. స్వాతంత్ర యోధుల సమరగాథలు, సీతారాం ఏచూరి, ప్రజాశక్తి ప్రచురణలు, హైదరాబాద్, 2003
27. హైదరాబాదు సంస్థానంలో స్వాతంత్ర్యోద్యమం, వెల్దుర్తి మాణిక్యరావు, భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ, 1992.
28. స్వాతంత్ర్యోద్యమం దేశంనాయకులు, వి.యల్.సుందరరావు, తిరుపతి, 1989.
29. భారత స్వాతంత్ర్యోద్యమంలో మాఊరు, గుంటూరు జిల్లా స్వాతంత్ర్య సమర యోధుల సంస్థ, గుంటూరు, 2001.
30. ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల సంస్థ చరిత్ర, గుంటూరు జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంస్థ, గుంటూరు, 1992.
31. ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల సంస్థ 14వ మహాసభ ప్రత్యేక సంచిక, గుంటూరు జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంస్థ, గుంటూరు, 1995.
32. బాపట్ల తాలూకా సమరయోధుల సంగ్రహ పరిచయం, గుంటూరు జిల్లా స్వాతంత్ర్య

చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 1998
33. 1937 కొత్తపట్నం రాజకీయ పాఠశాల వజ్రోత్సవ సంచిక, గుంటూరు జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంస్థ, గుంటూరు, 1995.
34. హైదరాబాద్ సంస్థానంలో రాజకీయ చైతన్యం, (1938-1956), యస్.యం. జవాద్ రజ్వీ, విశాలాంధ్ర, విజయవాడ, 1985.
35. తెలుగు తీర్పు, కె.శ్రీనివాసరావు, ప్రజాశక్తి ప్రచురణలు, హైదరాబాద్, 2003.
36. ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గాలు, యం. సత్యనారాయణ.
37. మనకు తెలియని మన చరిత్ర (తెలంగాణా రైతాంగ పోరాటంలో స్త్రీలు), స్త్రీశక్తి సంఘటన, హైదరాబాద్, 1986.
38. తెలంగాణా పోరాట స్మృతులు, ఆరుట్ల రామచంద్రారెడ్డి, డాక్టర్ ఆరుట్ల కమలాదేవి - రామచంద్రారెడ్డి ట్రస్టు, హైదరాబాద్, 2005.
39. తెలంగాణా వైతాళికులు, యం.యల్. నరసింహరావు, కాకతీయ విజ్ఞాన సమితి, హైదరాబాద్, 1976.
40. తెలుగువెలుగులు, మోనికా బుక్స్, హైదారాబాద్, 2002
41. తెలంగాణ సాయుధ పోరాటం అనుభవాలు-జ్ఞాపకాలు, దొడ్డా నరసయ్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1997.
42. నేతాజి ఐ.ఎన్.ఎ, సి.హెచ్ ఆచార్య, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 2001
43. రాలిన రత్నాలు, కె.ప్రతాప్ రెడ్డి.హైదరాబాద్, 2000.
44. స్వాతంత్ర్య సమరయోధుల పోరాట చరిత్ర (మహబూబాబాద్ ప్రాంతం), మాసాబత్తిని వెంకటమల్లు, మహబూబాబాద్, ఆగస్టు 2004.
45. తెలంగాణా ప్రజల సాయుధపోరాట చరిత్ర (1946-57), దేవులపల్లి వెంకటేశ్వ రావు, వాల్యూం -1, ప్రోలటేరియన్ లైన్ ప్రచురణలు, హైదరాబాద్, 1988.
46. మహబూబ్‌నగర్ జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, ఏ.పండరీనాథ్, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 1999
47. నిజామాబాద్ జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, ఏ.పండరీనాథ్, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్,1997
48. అదిలాబాద్ జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, యస్. రఘువీర్, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 2000
49. మెదక్ జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, ఏ.పండరీనాథ్, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్,1999
50. రంగారెడ్డి జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, ఏ.పండరీనాథ్, స్వాతంత్ర్యోద్యమ

చరిత్రపరిశోధనా సంస్థ, హైదరాబాద్, 1998.

51. ఖమ్మం జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, ఏ.పండరీనాథ్, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 1999
52. కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, సి.హెచ్. ఆచార్య, కాటం రమేష్, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 2000
53. నల్గొండ జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, సి.హెచ్. ఆచార్య, కాటం రమేష్, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 2000
54. చరిత్రకెక్కని చరితార్థులు, ఎ.పండరినాథ్, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ, హైదరాబాద్, 1987
55. భారత స్వాతంత్ర్య సాయుధ సమర చరిత్ర 1757-1947, పడాల రామారావు, విశాలాంధ్ర, హైదరాబాద్, 1990.
56. తెలంగాణా సాయుధ పోరాట సేనాని ఆరుట్ల రామచంద్రా రెడ్డి, కె. ప్రతాపరెడ్డి, హైదరాబాద్, 2005.
57. విశాఖ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర, ప్రచురణ ః విశాఖ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం, విశాఖపట్నం, సెప్టెంబరు,1992
58. భారత స్వాతంత్ర్య సమరంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి, ఎన్.టి.ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, హైదరాబాద్, 2002.
59. వీర తెలంగాణ మాది, సంపాదకుడు॥ తెలకపల్లి రవి, ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్, 2006
60. ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమం చరిత్ర, ఆచార్య సరోజిని రెగాని, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2000.
64 గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం (1920-30) ఉజ్వలఘట్టాలు, మాదాల వీరభద్రరావు, బెంగుళూరు, 1974.
65. భారత దేశ స్వాతంత్ర్యోద్యమం చరిత్ర, నాలుగు సంపుటాలు, ఆంగ్లమూలం ః డాక్టర్ తారాచంద్, తెలుగు సేత ః ఆచార్య భూపతి లక్ష్మీనారాయణ, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2000-2005.
66. భారత జాతీయ కాంగ్రెస్ చరిత్ర (1935-1942) అంగ్లమూలం ః డాక్టర్ బోగరాజు పట్టాభి సీతారామయ్య, తెలుగుసేత ః కొడాలి ఆంజనేయులు, ప్రభాత ప్రచురణలు, విజయవాడ, 1948.
67. వీర తెలంగాణా సాయుధసమరం, కందిమళ్ళ ప్రతాపరెడ్డి, హైదరాబాద్,1998.
68. స్వాతంత్ర్యానికై ప్రజాపోరాటాలు, అంగ్ల మూలం ః రఘనాధ్‌రావ్ ఘట్, అంతర్జాతీయ తెలుగు సంస్థ, హైదరాబాద్, 1984

69 1857, రచయిత, ప్రచురణకర్త, ప్రచురణ సంవత్సరం తెలియదు. ప్రచురణ మాత్రం మద్రాసులో జరిగింది.
70. తెలంగాణా ఆంధ్రోద్యమము, సంపుటాలు 1 మరియు 2, మాడపాటి హనుమంత రావు, 1949.
71. నూరేళ్ళక్రితం, మహీధర రామమోహనరావు, అవంతి ప్రచురణలు, విజయవాడ, 1957.
72. తెలుగు దేశంలో స్వాతంత్ర్యోద్యమం, పి.యస్ మూర్తి, హైదరాబాద్, 1980.
73. 1857 పూర్వ రంగములు, దిగవల్లి వెంకటశివరావు, విశాలాంధ్ర, విజయవాడ, 1957.
74. మహానాయకులు, తుర్లపాటి కుటుంబరావు, రామానుజ పబ్లికేషన్స్, విజయవాడ, 1957.
75. ఆంధ్రప్రదేశ్ స్వాతంత్రోద్యమం చరిత్ర, పి.జగన్నాధరావు, అరుణా పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1991.
76. 1857 విప్లవ వీరులు, తుర్లపాటి కుటుంబరావు, శ్రీమానస పబ్లికేషన్స్, విజయవాడ, 1990.
77. తెలంగాణా సాయుధపోరాటం - నా అనుభవాలు, నల్లా నరిసింహలు, విశాలాంధ్ర, హైదరాబాద్, 1989.
78. శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జీవిత చరిత్రము, చీరాల, 1976.
79. పల్నాట స్వాతంత్ర్య సమరయోధులు, నాళం మట్టుపల్లి, సత్తెనపల్లి, 1977.
80. గుంటూరు జిల్లా ముస్లింలీగ్ ప్రథమ వార్షిక నివేదిక, 1945-46, సమర్పణ ః యస్ మహబూబ్, గుంటూరు.
81. వీర తెలంగాణా, నా అనుభవాలు-జ్ఞాపకాలు..., రావి నారాయణ రెడ్డి, విశాలాంధ్ర, హైదరాబాద్, 1997.
83. ఆంధ్ర సాహిత్యంలో ఉమర్ అలీషా, ప్రసంగ వ్యాసం, ఉమర్ అలీషా, ఆకాశవాణి విశాఖపట్నంచే ప్రసారం, 22 మార్చి 1977.
84. భారత స్వాతంత్ర్యోద్యమం ః ముస్లింలు, సయ్యద్ నశీర్ అహమ్మద్, తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2006
85. భారత స్వాతంత్ర్యోద్యమం ః ముస్లిం మహిళలు, సయ్యద్ నశీర్ అహమ్మద్, తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2006
86. మనకు తెలియని మన చరిత్ర (తెలంగాణా రైతాంగ పోరాటంలో స్త్రీలు), స్త్రీశక్తి సంఘటన, హైదరాబాద్, 1986.
87. మున్నూరు గడప, 3 సంపుటాలు, మైత్రేయ, విజయవాడ, 1996.

88. తెలుగు సాహిత్యం : ముస్లింల సేవ (సిద్ధాంత గ్రంథం), డాక్టర్ షేక్ మస్తాన్, కరీమా పబ్లికేషన్స్, అలీఘర్, ఉత్తరప్రదేశ్.
89 పలనాడు వెలలేని మాగాణిరా, పులుపుల వెంకట శివయ్య స్మృతి సంచిక, అరసం గుంటూరు జిల్లా శాఖ, 1978.
90. వందేమాతరం నుంచి జనగణమన వరకు (హైదరాబాద్ సంస్థానం విమోచనోద్యమం చరిత్ర), ఆంగ్లమూలం : వి.హెచ్ దేశాయ్, తెలుగు సేత : ఏ.ఎస్. మూర్తి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1999.
91. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ప్రారంభం (ఆమీర్ హైదర్ ఖాన్ ఆత్మ కథ) అనువాదం : వి. శ్రీహరి, ప్రజాశక్తి, విజయవాడ, 1884.
92. 20వ శతాబ్ది తెలుగు వెలుగులు, (రెండు భాగాలు) సం॥ డాక్టర్ వెలగా వెంకటప్పయ్య, డాక్టర్ యం.యల్.నరసింహారావు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2005
93. నిజాం రాజు అధికారం అంతమైన రోజు, నదనం కృపాకర్, శ్రీలేఖ సాహితి, వరంగల్, 2001
94. స్వాతంత్ర్య సమరంలో ఆంధ్ర మహిళలు, డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, అచ్యుతుని గిరిజ, ఆంధ్రరాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాలల శాఖ, హైదరాబాదు, 1987
95. ఆంధ్రుల చరిత్ర, డాక్టర్ బి.యస్.యల్. హనుమంతరావు, విశాలాంధ్ర, హైదరాబాదు, 2003.
96. భారత స్వాతంత్ర్యపోరాటంలో...గుంటూరు జిల్లా వేసవి రాజకీయ పాఠశాలల ఉజ్వల పాత్ర, సం॥ ఏటుకూరి కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య సమర యోధుల సంస్థ,హైదరాబాద్, 1999.
97. ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల 14వ వార్షిక మహాసభల ప్రత్యేక సంచిక, సంపాదకులు॥ ఏటుకూరి కృష్ణమూర్తి, గుంటూరు, ఏప్రియల్ 30,1995.
98. కడప వైభవం, 204 కడపోత్సవాల ప్రత్యేక సంచిక, ప్రచురణ కర్త : కడప జిల్లా కలక్టర్, కడప, 2004
99. పశ్చిమగోదావరి జిల్లాలో మహాత్ముని సంచారము, డాక్టర్ గాదం గోపాలస్వామి, శ్రీ సత్య పబ్లికేషన్స్, అత్తిలి, 2005.
100. వరంగల్ జిల్లా వీరగాధలు, జి.రఘుపాల్, సిపిఐ వరంగల్ జిల్లా కమిటి,2006
101. కర్నూలు మండల చరిత్ర, ధరిణి రామచంద్రరావు (1936) కర్నూలు, 2001

**తెలుగు పత్రికలు :**

01. గీటురాయి వారపత్రిక, పలు సంచికలు, హైదరాబాద్
02. ఆంధ్రపత్రిక, దినపత్రిక, మద్రాసు, 1917 నుంచి 1945 వరకు సంచికలు.

మరియు 1983 సెప్టెంబరు 16 నాటి వజ్రోత్సవ ప్రత్యేక సంచిక
03. జయశ్రీ, మాసపత్రిక, 08-11-1972
04. వార్త, దినపత్రిక, హైదరాబాద్.
05. ఆంధ్రప్రభ దినపత్రిక, 03-10-1998
06. ఆంధ్రభూమి దినపత్రిక, విజయవాడ, 30-08-2000.
07. వాఙ్మయి, అక్టోబరు-డిసెంబరు 2005, హైదరాబాద్.
08. ఆంధ్రజ్యోతి దినపత్రిక, 21-09-2004, 28-11-2004, 04-02-2006
09. ప్రజాసాహితి, మాసపత్రిక, అక్టోబరు 2003, నవంబరు, 2006, విజయవాడ.
10. విశాలాంధ్ర, దినపత్రిక, 17-09-2006, విజయవాడ.
11. శుభోదయ, జాతీయ సాంస్కృతిక వారపత్రిక, సంపుటి-2, సంచిక-6, విశాఖపట్నం, 1972.
12. విశాఖ ఉత్సవ్, విశాఖపట్నం, 2001, 2006 నాటి సంచికలు
13. విశాఖ జిల్లా దర్శిని, విశాలాంధ్ర స్వర్ణోత్సవ కానుక, విశాఖపట్నం 2002.
14. తెలుగు జగతి, ప్రథమ తెలుగు సమాఖ్య చతుర్థి మహాసభల సంచిక, విశాఖపట్నం, 2000.
15. డిస్కవరి, ఆగస్టు, అక్టోబరు 2005,
16. భారతి మాసపత్రిక ఏప్రిల్, 1943.

**ఇతర భాషా గ్రంథాలు :**

01. హిందూస్థానీ ముసల్మానోంకా జంగ్-యే-ఆజాది మే హిస్సా, (హిందీ) - సయ్యద్ ఇబ్రహీం ఫిక్రీ, భారత ప్రభుత్వం ఆర్థిక సహాయంతో ప్రచురణ, న్యూఢిల్లీ, 1999.
02. భారత్‌కి స్వాతంత్ర సంగ్రామం మేఁ ముస్లిం మహిళావోంకా యోగ్‌దాన్ (హిందీ), డాక్టర్ ఆబెదా సమీయుద్దీన్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆబ్జెక్టివ్ స్టడీస్, న్యూఢిల్లీ, 1997.
03. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ (హిందీ) కె.సి. యాదవ్, హోప్ ఇండియా పబ్లికేషన్స్, గుర్‌గావ్ఁ, హర్యానా, 2004.
04. భారత స్వాతంత్ర్య సంగ్రామదల్లి ముస్లిమర పాత్ర, (కన్నడ) ఖుద్దం పబ్లికేషన్స్, కర్నాటక, 1999.

**ఫోటోలు-చిత్రాలు.**

01. India's Struggle for Freedom Album, Govt. of West Bengal, 1987.
02. Indian Express, Dated 13-08-1995
03. Hyderabad Swathntrodyma Charitra Swathntrodyama, Veldurthi Manikya Rao, Charitra Parisodhana Samstha, Hyd,1984 (Telugu)
04. Swathantrodyamam Desa Nayakulu,VL Sundara Rao,1989 (Telugu)

05. Hyderabad Agnaana Charitra Putalu, Telugusetha - Nikhileswar, Navabharathi, Hyd, 1979 (Telugu)

06. ManakuTheliyani ManaCharitra,Shthree Sakthi Sanghatana,Hyd,1986(Telugu)

07. Andhrodyma Charitra, AP State Archive, Hyderabad (Telugu)

08. Nethaji INA, Ch.Acharya, Swathntrodyama Charitra Parisodhana Samstha, Hyd, 1984, (Telugu)

11. Andhra Joythi Daily, Dated 15-06-2006

12. Raalinarathnaalu, K Pratap Reddy, 2000 (Telugu)

13. Andhra Bhoomi, Daily, Vijayawada, 30-08-2006

14. In Retrospect, Inguva Mallikarjuna Sarma, Ravi Sasi Enterprises, Hyderabd, 2000-2003.

15. 1857 Telugunata Thirugubatu, Dr. Mahankali Rao, NavayugaPrachuranalu, Hyderabad, 2001 (Telugu)

16. Hyderabads Samsthanamli Rajakeeya Chythnyam, SM Jawad Rajvi, Visalandha, Vijayawada, 1985 (Telugu)

17. 1857 A Pictorial Presentation, Govt of India Publications, New Delhi, 2000

18. Freedom Struggle, Bipin Chandra, NBT, New Delhi, 2004.

19. Prajasaahithi, Telugu Monthly, October 2003 and November 2006, Vijayawada

20. Telugu Velugulu, Monika Publications, Hyderabad, 2002 (Telugu)

21. Communist Desha Bhkthullu, Parakala Pattabhi Ramarao, VPH, Hyd, 2000. (Telugu)

22. History of India, E.Marsden, Macmillan, London,1944,

23. Dr. Zakir Husain, M.Mujeeb, NBT, New Delhi, 1991.

24. Sardar Patel and Indian Muslims, Rafiq Zakaria, BVB, Mumbai, 1996 (Telugu)

25. Story of the INA, SA Ayer, NBT, New Delhi 1997

26. Zakir Husain (Life and Thoughts), KRP Singh, National Council of Educational Research and Training, New Delhi, 1990.

27. Gunturu Zilla Swarajya Udyamam (1920-30) Ujwala Ghattalu, Maadala Veerabhradra Rao, Bangalore, 1974. (Telugu)

28. Andhra Pradesh Swathntrodyama Charitra, Katam Ramesh, Swathntrodyama Charitra Parisodhana Samstha, Hyd,1992 , (Telugu)

29. Charitrkekkani Charithardhulu, A.Pandarinath, Swathntrodyama Charitra Parisodhana Samstha, Hyd,1987 (Telugu)

◆◆◆



భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల మహత్తర పాత్రను వివరిస్తున్న

# సయ్యద్ నశీర్ అహమ్మద్


**చరిత్ర గ్రంథాలు**




## భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లింలు

భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం జనసముదాయాల త్యాగాల చరిత్రను సంక్షిప్తంగా వివరిస్తుంది. 1757 నుండి 1947 వరకు బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలలో భాగంగా సాగిన ప్రధాన ఘట్టాలలో ముస్లింల పాత్రకు సంబంధించిన విలువైన సమాచారాన్ని క్లుప్తంగా అందిస్తుంది.

**(తృతీయ ప్రచురణ, 1/8 డెమ్మి సైజు, పేజీలు : 72, మల్టికలర్ టైటిల్, వెల : రు. 25)**




## మైసూరు పులి : టిపూ సుల్తాన్

బ్రిటీష్ పాలకుల సామ్రాజ్యవిస్తరణ కాంక్షను ఆదిలోనే గ్రహించి స్వదేశీ పాలకులను హెచ్చరించడమే కాకుండా, జీవిత చరమాంకం వరకు పరాయిపాలకులతో పోరాడిన తొలితరం జాతీయవాది, మైసూరు పులిగా ఖ్యాతిగాంచిన టిపూ సుల్తాన్ జీవిత చరిత్రను విలువైన చిత్రాలు, ఫోటోలతో ఆవిష్కరిస్తుంది.

**(తృతీయ ప్రచురణ,1/8 డెమ్మి సైజు, పేజీలు : 69, మల్టికలర్ టైటిల్, వెల : రు. 25)**




## షహీద్-యే-ఆజం అష్ఫాఖుల్లా ఖాన్

సర్దార్ భగత్‌సింగ్‌కు స్ఫూర్తిగా నిలచిన విప్లవకారుడు, స్వాతంత్ర్యోద్యమంలో సంచలనం సృష్టించిన 'కాకోరి రైలు' సంఘటనలో ప్రధాన పాత్ర పోషించి, 27 ఏండ్ల వయస్సులో ఉరిశిక్షను ఆనందంగా స్వీకరించిన యోధుడు అష్ఫాఖుల్లా ఖాన్ ఫోటోలతో కూడిన పోరాట చరిత్రను తెలుపుతుంది.

**(ద్వితీయ ప్రచురణ,1/8 డెమ్మి సైజు, పేజీలు : 72, మల్టికలర్ టైటిల్, వెల : రు. 25)**




## భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం ప్రజాపోరాటాలు

బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా 1765 ప్రాంతం నుండి సాగిన ప్రజా పోరాటాలలో ప్రధానమైన బెంగాల్ సన్యాసులు–ఫకీర్ల ఉద్యమం, వహాబీయోధుల తిరుగుబాట్లు, ఫరాజీవీరుల విజృంభణ, మలబారు మోప్లాల వీరోచిత పోరాటం, ఖుదా–యే–ఖిద్మత్‌గార్ల అహింసోద్యమ చరిత్రలను వెల్లడిస్తుంది.

**(ప్రథమ ప్రచురణ. 1/8 డెమ్మి సైజు, పేజీలు :168, మల్టికలర్ టైటిల్, వెల : రు.50)**

## భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం మహిళలు



స్వాతంత్రోద్యమంలో విశిష్ట త్యాగాలతో, అపూర్వ ధైర్య సాహసాలతో ఆంగ్లేయుల మీద ఉద్యమించిన ముస్లిం మహిళల జీవితగాధలను దృశ్యీకరిస్తుంది. 1857 నుండి 1947 వరకు సాగిన వివిధ పోరాటాలలో భాగస్వాములైన 61మంది మహిళా యోధుల విశేషాలను అందజేస్తుంది.

**(తృతీయ ప్రచురణ,1/8 డెమ్మీ సైజు, పేజీలు :286, మల్టికలర్ టైటిల్, వెల: రు.160)**

## భారత స్వాతంత్ర్య సంగ్రామం : ముస్లిం యోధులు -1



1757లో బ్రిటీషర్ల పెత్తనానికి వ్యతిరేకం ఆరంభించిన పోరాటం నుంచి, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం, జాతీయోద్యమంలో పాల్గొని ఆంగ్లేయాధికారులతో, ప్రభుత్వంతో తమదైన మార్గంలో పోరాటాలు, ఉద్యమాలు సాగించిన 35 మంది పోరాటాల యోధుల వివరాలతోపాటు, చిత్రపటాలూ ఈ గ్రంథంలో ఉన్నాయి.

**(ప్రథమ ప్రచురణ, 1/8 డెమ్మీ సైజు, పేజీలు : 316, మల్టికలర్ టైటిల్, వెల : రు. 100)**

## చిరస్మరణీయులు (బిటీష్ వ్యతిరేక పోరాటాల్లో పాల్గొన్న ముస్లిం యోధులు)



1757 నుండి 1947 వరకు సాగిన బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్న ముస్లిం పోరాట యోధులలో వంద మంది జీవిత రేఖాచిత్రాలు, వారి అమూల్యమైన ఫోటోలు, చిత్రాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. అలనాటి యోధుల త్యాగపూరిత చరిత్రను క్లుప్తంగా తెలుపుతుంది ఈ గ్రంథం.

**(ద్వితీయ ప్రచురణ,1/8 డెమ్మీ సైజు, పేజీలు : 224, మల్టికలర్ టైటిల్, వెల : రు. 100)**

## 1857 : ముస్లింలు



ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లింల భాగస్వామ్యాన్ని, ఆనాడు వ్యక్తమైన హిందూ-ముస్లింల ఐక్యతను, ఆంగ్లేయుల హింసాకాండ, విస్మరణకు గురైన ముస్లింల త్యాగాలు, త్యాగాలు ఒకరు చేస్తే భోగాలు మరొకరు అనుభవిస్తున్న తీరుతెన్నులను సరికొత్త కోణంలో చర్చకు పెడుతూ పలు ఆసక్తికర అంశాలను వివరంగా ప్రస్తావించిన విమర్శనాత్మక గ్రంథమిది.

**(ప్రథమ ప్రచురణ,1/8 డెమ్మీ సైజు, పేజీలు : 304, మల్టికలర్ టైటిల్, వెల : రు. 130)**




**అక్షరశిల్పులు** (ముస్లిం కవులు-రచయితల సంక్షిప్త పరిచయం)

తెలుగులో రాసిన, రాస్తున్న మూడువందల ముప్ఫై మూడు (333) మంది ముస్లిం కవులు, రచయితలు, అనువాదకుల వ్యక్తిగత, సాహిత్య వివరాలు, అందులో సుమారు 257 మంది ఫోటోలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్లు, ఈ-మెయిల్ ఐడిలతో కూడిన సమాచారం ఇందులో లభ్యం. తెలుగు వాఙ్మయ చరిత్రకారులచే నభూతో-నభవిష్యతి' అని ప్రస్తుతించబడి, అరుదైన సమాచారం అందించే పుస్తకమిది.

(ప్రథమ ప్రచురణ, 1/8 డెమ్మీ సైజు, పేజీలు : 184, మల్టికలర్ టైటిల్, వెల : రు. 150)

వివరాలకు


**ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్**

**శివప్రసాద్ వీధి, కొత్తపేట,**

**వినుకొండ-522647, గుంటూరు జిల్లా**

**సంచారవాణి : 9440241727, 9396429722**

naseerahamed@yahoo.com

aazadhouseofpublications@gmail.com


## త్వరలో వెలువడనున్న సయ్యద్ నశీర్ అహమ్మద్ గ్రంథాలు

01. చిరస్మరణీయులు - 2
02. భారత స్వాతంత్ర్యసంగ్రామం : ముస్లిం యోధులు - 2, 3, 4
03. భారత జాతీయ సైన్యం (ఆజాద్ హింద్ ఫౌజ్) : ముస్లిం యోధులు
04. భారతీయ ముస్లిం సమాజం : అపోహలు-వాస్తవాలు
05. చరిత్ర సృష్టించిన ముస్లిం మహిళలు
06. భారతీయ ముస్లింలు - స్థితిగతులు
07. మాతృభూమి సేవలో చరితార్థులైన ముస్లిం ముద్దు బిడ్డలు
08. చరితార్థులు (ఆల్బం)



(1757 నుండి 1947 వరకు బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్న ముస్లిం యోధుల, స్వాతంత్ర్యోద్యమంలోని ప్రధాన సంఘటనలు-ఘట్టాలకు సంబంధించిన సుమారు 180 చిత్రాలు, ఫోటోలతో కూడిన అల్బం)